## సమాజశాస్త్రం

# సమాజశాస్త్ర సిద్ధాంతాలు, దృక్పథాలు

డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్
2003

## రచయితల బృందం

115074
27-4-05

**సంపాదకులు**

ప్రొ. కె. రంగారావు

డా. ఘంటా చక్రపాణి

**సమన్వయకర్త**

డా. ఘంటా చక్రపాణి

**రచయితలు**

డా. ఘంటా చక్రపాణి

ప్రొ. ఉమామోహన్

ప్రొ. సూసన్ వర్గీస్

ప్రొ. ఇందిరాదేవి

ఎన్. వేణుగోపాల్‌రావు

డా. ఎ. సురేంద్రరాజు

ఎ. ఉష

వి. వేణు

**ముఖచిత్రం**

'చంద్ర'

Dr. B R.A.O.U. LIBRARY
Acc. No.: 115074
Date: 27-4-2005
Call No.: ......
BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,
హైదరాబాద్.
ప్రథమ ముద్రణ 2003

ⓒ డా॥బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2003.

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏభాగం అయినా ఉపయోగించదలచుకొంటే డా.బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠ్యాంశాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో భాగం.

ఇతర వివరాలకు:
డైరెక్టర్, అకాడమిక్
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,
జూబిలీహిల్స్, హైదరాబాద్-500 033.

LR No. 617 / Dr. BRAOU / DMP / PTG / F.No. 45 / J.O. : 06 (2004) Date : 28-04-04, Copies : 500

**Printed by : Graphica Art Printers, Shivam Road, Hyderabad.**

# పాఠ్యాంశ పరిచయం

మనం నివసిస్తోన్న సమాజం గురించి విశ్లేషించే శాస్త్రమే సమాజశాస్త్రం. మనం, మనల్ని మలిచే సమూహాలు, సముదాయాలు, సాంఘికనియమాలు, కట్టుబాట్లు, నియంత్రించి దిశా నిర్దేశం చేసే సంస్థలు వ్యవస్థల గురించి సమాజశాస్త్రం వివరిస్తుంది. అందుకే సమాజ శాస్త్రాన్ని పెద్దలు సామాజిక శాస్త్రాలన్నింటికీ 'మాతృక'గా పేర్కొన్నారు. ప్రపంచంలో అనేక దేశాల్లో సమాజశాస్త్రం ఒక అగ్రశ్రేణి శాస్త్రంగా ఎంతో ఆదరణను పొందింది. మన దేశంలో కూడా ఇటీవలి కాలంలో సమాజశాస్త్రం ఒక ప్రధాన అధ్యయనాంశంగా ముందుకు వస్తోంది. దేశంలోని ప్రధాన విశ్వవిద్యాలయాలన్నీ సోషియాలజీని స్నాతకోత్తర స్థాయిలో అందిస్తున్నాయి.

సమాజశాస్త్రానికి ఉన్న ఈ ప్రాధాన్యతను అభివృద్ధి వికాస క్రమంలో విస్తృతమవుతున్న ప్రాముఖ్యతను ఇటీవలి కాలంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాల కార్యకలాపాల్లో సమాజశాస్త్ర నిపుణుల పెరుగుతోన్న అవకాశాలను దృష్టిలో వుంచుకుని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం స్నాతకోత్తర విద్యాకార్యక్రమాల్లో ఎం.ఎ సోషియాలజీని కూడా చేర్చడం జరిగింది.

ఎం.ఎ సోషియాలజీ విద్యార్థుల కోసం విశ్వవిద్యాలయం అందిస్తోన్న కోర్సుల్లో సమాజశాస్త్రం-సిద్ధాంతాలు, దృక్పథాలు ఒకటి. ఈ కోర్సులో సమాజశాస్త్ర సిద్ధాంత వికాసక్రమాన్ని పరిచయం చేయడం జరిగింది. సమాజశాస్త్రం సిద్ధాంతం అంటే ఏమిటి? అందలి అధ్యయనాంశాలు ఏమిటి, ఏయే ఏయే సిద్ధాంతాలు, దృక్పథాలు ఎలా ఏర్పడ్డాయి అనే అంశాలు ఈ కోర్సులో వున్నాయి.

అధ్యయన అంశాలను బట్టి ఈ కోర్సులోని 24 భాగాలను ఏడు ప్రధాన ఖండాలుగా విభజించడం జరిగింది. మొదటి ఖండంలో సమాజశాస్త్ర సిద్ధాంత దృక్పథాల స్వభావం, పరిధితోపాటు సమాజశాస్త్ర సిద్ధాంత పరిధులను చర్చించడం జరిగింది. రెండవ ఖండంలో సమాజశాస్త్ర సిద్ధాంతంలో ప్రధానమైన నిర్మితి ప్రకార్యవాదాన్ని, మూడవ ఖండంలో సంఘర్షణ దృక్పథాన్ని వివరించడం జరిగింది. సామాజిక వినిమయ సిద్ధాంతం గురించి నాలుగవ ఖండంలో, ప్రతీకాత్మక పరస్పర చర్యల దృక్పథాన్ని ఐదవ ఖండంలో వుంటుంది. ఆరవ ఖండంలో ఎత్నోమెథడాలజీని, ఏడవ ఖండం సమాజశాస్త్ర సిద్ధాంతంలో వచ్చిన ఇటీవలి మార్పులు, దృక్పథాలను విశ్లేషిస్తుంది.

విశ్వవిద్యాలయం ఈ పాఠ్యాంశాలన్నింటినీ సమాజశాస్త్ర బోధనలో అనుభవం వున్న అధ్యాపకులు, సామాజిక కార్యరంగంలో ఉన్న పరిశోధకులతో రూపొందించింది. కోర్సు సమగ్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని భాగాలను వివరంగా ఇచ్చే ప్రయత్నం జరిగింది. సమాజశాస్త్ర సిద్ధాంత దృక్పథాల ఆవిర్భావం, అభివృద్ధిపట్ల సమగ్ర అవగాహన కలిగించేందుకు ఈ కోర్సు దోహదపడుతుందని విశ్వవిద్యాలయం ఆశిస్తోంది. సమాజశాస్త్ర సిద్ధాంత దృక్పథాలను మొదటిసారిగా తెలుగులోకి తెచ్చిన విశ్వవిద్యాలయ కృషి మా విద్యార్థులకు ఉపయోగపడుతుందని భావిస్తున్నాం.

BRAOU

BRAOU

# సమాజశాస్త్రం (ఎం.ఎ)

## కోర్సు - II : సమాజశాస్త్ర సిద్ధాంతాలు, దృక్పథాలు

## విషయసూచిక


| | | పుటసంఖ్య |
|---|---|---|
| **ఖండం - I** | **సమాజశాస్త్ర సిద్ధాంతం దృష్టికోణాలు** | **1-23** |
| భాగం-1: | సమాజశాస్త్ర సిద్ధాంతం, ఆవిర్భావం-అభివృద్ధి | |
| భాగం-2: | సమాజికశాస్త్ర అధ్యయన పద్ధతి | |
| **ఖండం - II** | **నిర్మితి ప్రకార్యవాదం** | **24-83** |
| భాగం-3 | ఎమిలిదుర్ఖైమ్ | |
| భాగం-4 | రాడ్క్లిఫ్‌బ్రౌన్ | |
| భాగం-5 | బ్రానిస్లావ్ మలినోవ్స్కీ | |
| భాగం-6 | టోల్‌కాట్‌పార్సన్స్ | |
| భాగం-7 | రాబార్ట్ కింగ్ మెర్టన్ | |
| భాగం-8 | నిక్లస్ లూహ్మన్ | |
| **ఖండం - III** | **సంఘర్షణావాదం** | **84-117** |
| భాగం-9 | కార్ల్ మార్క్స్ | |
| భాగం-10 | జార్జ్ సిమ్మెల్ | |
| భాగం-11 | రాల్ఫ్ డహ్రెన్‌డార్ఫ్ | |
| భాగం-12 | లూయిస్ ఆల్‌ఫ్రెడ్ కోసర్ | |
| **ఖండం - IV** | **సామాజిక వినిమయ సిద్ధాంతం** | **118-140** |
| భాగం-13 | జార్జ్ సి. హోమన్స్ | |
| భాగం-14 | పీటర్ బ్లా | |
| భాగం-15 | రీచర్డ్ ఎమర్సన్ | |
| **ఖండం - V** | **ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం** | **141-171** |
| భాగం-16 | చార్లెస్ హోర్టన్ కూలే | |
| భాగం-17 | జార్జ్ హెర్బర్ట్ మీడ్ | |
| భాగం-18 | హెర్బర్ట్ బ్లూమర్ | |


BRAOU

| | | |
|---|---|---|
| **ఖండం - VI** | **ఎథ్నోమెథడాలజీ** | **172-215** |
| భాగం-19 | హెరాల్డ్ గార్ఫెంకెల్ | |
| భాగం-20 | ఎడ్మండ్ హుజర్ల్ | |
| భాగం-21 | ఆల్‌ఫ్రెడ్ షుడ్జ్ | |
| భాగం-22 | మతం-సామాజిక పరివర్తన: మాక్స్ వెబర్ | |
| భాగం-23 | సంప్రదాయ సిద్ధాంతం-సామాజిక మార్పు | |
| **ఖండం - VII** | **ఇటీవలి ధోరణులు** | **216-232** |
| భాగం-24 | సమాజశాస్త్ర సిద్ధాంతంలో ఇటీవలి ధోరణులు | |

**మాదిరి పరీక్షా పత్రం** **233**

**రచయితల వివరాలు** **234**


BRAOU

# ఖండం- I

## సమాజశాస్త్ర సిద్ధాంతం, దృష్టికోణాలు

సిద్ధాంతాలను అర్థం చేసుకోవడం ద్వారా సమాజావిర్భావం, వికాసం, పరిణామాలను అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. మనకంటూ ఒక దృక్పథం ఏర్పడడానికి అవకాశం ఏర్పడుతుంది. అసలు సిద్ధాంతం అంటే ఏమిటి, సిద్ధాంతాలు ఎందుకు చేస్తారు, సిద్ధాంతాలు సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఎలా దోహదపడతాయి సమాజశాస్త్ర సిద్ధాంతం ఎలా ఎదిగింది అనే మౌలిక ప్రశ్నలకు ఈ ఖండంలో సమాధానాలు దొరుకుతాయి.

ఈ ఖండంలో ఇచ్చిన రెండు భాగాల్లో సమాజశాస్త్ర సిద్ధాంత వికాస క్రమాన్ని వివరించడంతోపాటు సమాజశాస్త్ర అధ్యయన పద్ధతినీ విశ్లేషించడం జరిగింది. అవి:

- సమాజశాస్త్ర సిద్ధాంతం, ఆవిర్భావం-అభివృద్ధి
- సమాజికశాస్త్ర అధ్యయన పద్ధతి

BRAOU

BRAOU

# భాగం-1: సమాజశాస్త్ర సిద్ధాంతం: ఆవిర్భావం-అభివృద్ధి

విషయక్రమం

1.0 ఉద్దేశాలు

1.1 పరిచయం

1.2 సమాజశాస్త్ర సిద్ధాంతం

1.3 సమాజశాస్త్ర సిద్ధాంత స్వభావం

1.4 సమాజశాస్త్ర నేపథ్యం

1.5 సమాజశాస్త్ర సిద్ధాంత వికాస క్రమం

1.5.1 తొలిదశ

1.5.2 ఆధునికదశ

1.6 సారాంశం

1.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

1.8 చదువదగిన పుస్తకాలు

BRAOU

## 1.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సిద్ధాంతం అంటే ఏమిటో తెలుసుకుంటారు.
- సమాజశాస్త్ర సిద్ధాంత లక్షణాలను గుర్తిస్తారు.
- సమాజశాస్త్ర సిద్ధాంత స్వభావం నేపథ్యం అర్థం చేసుకుంటారు.
- సమాజశాస్త్ర సిద్ధాంత వికాస క్రమాన్ని తెలుసుకుంటారు.

## 1.1 పరిచయం

'సిద్ధాంతం' అనే మాటను మనం తరచూ వింటుంటాం. అలాగే వాడుతుంటాం కూడా. మనకు తెలిసిన అనేక విషయాల గురించి సిద్ధాంతాలున్నాయి. కాంతి ఎలా ప్రసరిస్తుంది, భూమికి ఆకర్షణశక్తి ఎందుకుంటుంది, చెట్లు పచ్చగా ఎందుకుంటాయి. కొండలు, రాళ్లు, ఎడారులు ఎలా ఏర్పడతాయి. మబ్బులు ఎలా వస్తాయి, వర్షం ఎప్పుడు కురుస్తుంది. ఇలా ఈ సృష్టిలో మనకు కనిపించే అనేక అంశాలపట్ల సిద్ధాంతాలు చేసిపెట్టారు. ఆ సిద్ధాంతాల ఆధారంగా మనం ఆయా అంశాలను అర్థం చేసుకుంటూ, అన్వయించుకుంటూ వెళుతున్నాం. అయితే ఈ సిద్ధాంతాలు, సిద్ధాంతీకరణలు కేవలం మానవేతర ప్రపంచ పరిస్థితులకు, వ్యవస్థలకే కాదు. మానవ ప్రవర్తనలకు, సంబంధాలకు, వ్యవస్థలకు కూడా ఉన్నాయి. మనుషుల చర్యలు, ప్రతిచర్యలు, ఈచర్యల వల్ల కలుగుతున్న మార్పులు, ఆ మార్పుల వల్ల వ్యవస్థలో సంభవిస్తున్న పరిణామాలు పరిశీలించిన అనేక మంది శాస్త్ర వేత్తలు ఈ సామాజిక వ్యవస్థ గమనం పట్ల, గమ్యం పట్ల పలు సిద్ధాంతాలు చేశారు. వాటినే మనం సామాజిక సిద్ధాంతాలు (Sociological Theories) అంటున్నాం.

సమాజశాస్త్ర సిద్ధాంతాలు సమాజ ఆవిర్భావం, దశలు, మార్పులు, కారణాలను వివరిస్తాయి. ఈ పాఠ్యాంశంలో సమాజసిద్ధాంత వికాస క్రమాన్ని, వివిధ సిద్ధాంత దృక్పథాలను వివరించడం జరిగింది. ఈపాఠంలో వాటి చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని వివరించే ప్రయత్నం జరిగింది.

## 1.2 సమాజశాస్త్ర సిద్ధాంతం

సిద్ధాంతం అనే మాటకు అనేక అర్థాలున్నాయి. ఏవిషయాన్నయినా సరే విడమరిచి, విశ్లేషించే పద్ధతినే సిద్ధాంతం అంటుంటాం. అయితే ఎలా వివరించాలి, ఎలా విశ్లేషించాలి, ఏది సరైన విశ్లేషణ, ఏది సమంజసమైన వివరణ అన్నది సమస్య. ఏ విషయాన్నయినా చాకచక్యంగా ప్రకటించడమే సిద్ధాంతం అని చాలామంది అనుకుంటారు. మనిషికి సంబంధించిన వరకు ఆలోచనలు, ఆసక్తులు, వైఫల్యాలు, విజయాలు, వ్యూహాలు, లోపాలు ఇలా ఏవిషయాన్నయినా సిద్ధాంతీకరించవచ్చు. సిద్ధాంతాలు కొన్ని సార్లు ఆధారాలతో వుంటే ఇంకొన్ని సార్లు ఊహల్లోనుంచి కూడా వచ్చినవై వుండొచ్చు. పుట్టుకకు సంబంధించి జన్యుపరమైన ఆధారాలతో సిద్ధాంతీకరించి క్లోనింగ్ వంటి ప్రక్రియల ద్వారా నిరూపిస్తున్నవాళ్లు ఉన్నట్టే మరణం గురించి, మరణానంతర జీవితం గురించి ఏ ఆధారమూ చూపకపోయినా సిద్ధాంతీకరించిన వాళ్లూ ఉన్నారు. కొన్ని సిద్ధాంతాలు సాక్ష్యాలు చూపితే మరికొన్ని సిద్ధాంతాలు ఏ సాక్ష్యం లేకున్నా వితండవాదంతోనే ముగిసిపోతుంటాయి. కాల్విన్ లార్సన్ అనే సామాజిక శాస్త్రవేత్త చెప్పినట్లు 'పరిధిరీత్యా సిద్ధాంతం అనేది అన్ని ఆలోచనలంత విశాలంగా వుండొచ్చు. అలాగే ఒకే ఆలోచనంత సంకుచితంగానూ ఉండొచ్చు'. ఏ సిద్ధాంతమైనా దానికి హేతుబద్ధత, శాస్త్రీయత ఉన్నప్పుడే ప్రామాణికత వుంటుంది. సమాజశాస్త్ర సిద్ధాంతాల్లో కూడా మనకు ఈ ధోరణి కనిపిస్తుంది. లార్సన్ ప్రకారం ఈ క్రింది లక్షణాలు అన్నీ లేదా కొన్నయినా వున్నప్పుడే దాన్ని సమాజశాస్త్ర సిద్ధాంతంగా గుర్తించాలి. అవి:

1. భావననుంచి ఒక రూపనిర్మాణానికి తీసుకువెళ్లగలగాలి.
2. ఒక ప్రత్యేక సందర్భంనుంచి ఒక పద్ధతి ప్రకారం భావనలను వివరిస్తూ ఒక దృక్పథం ఏర్పరచగలగాలి.
3. ఒక తెలివైన ఆలోచనకు పరికల్పన జోడించి ఒక పద్ధతి ప్రకారం ఆధారాలతో ఒక ఊహనయినా అందించగలగాలి.
4. ఒక ప్రతిపాదనను సూత్రీకరించి సాధారణీకరించగలగాలి.
5. ఒక నమూనాను తర్క బద్ధంగా, గణిత శాస్త్ర పద్ధతిలో అన్వయించగలగాలి.
6. ఒక ఆదర్శ నమూనాను వర్గీకరించి కొనసాగించాలి.

BRAOU

ఒక ప్రతిపాదన సిద్ధాంతం అనిపించుకోవాలంటే దానికి ఆధారాలుండాలి. అది నిరూపణకు నిలబడగలగాలి. విశ్లేషణకు అందే విధంగా వుండాలి. అంటే ప్రతిపాదన ఏదైనా శాస్త్రబద్ధంగా వున్నప్పుడే సిద్ధాంతం అనిపించుకుంటుంది.

రాబర్ట్ మెర్టన్ అనే సమాజశాస్త్రవేత్త సమాజశాస్త్ర సిద్ధాంతంలో ఆరు అంశాలుంటాయని పేర్కొన్నాడు. అవి:

1. పరిశోధనా పద్ధతి.
2. సాధారణ సామాజిక అవగాహన.
3. సామాజిక భావనల విశ్లేషణ.
4. సామాజిక విశ్లేషణల పునర్విమర్శ.
5. అనుభవపూర్వకంగా సాధారణీకరణ

6. సామాజిక సిద్ధాంతం.

మెర్టన్ దృష్టిలో ప్రతిపాదనలను తార్కికంగా అనుసంధానం చేసి అనుభవ పూర్వ సాధారణీకరణలను తీసుకురాగలగడమే సామాజిక సిద్ధాంతం పరమావధి అవుతుంది.

సంపూర్ణమైన సిద్ధాంతానికి ఉండే లక్షణాలు ఏమిటన్న ప్రశ్నపై సామాజిక శాస్త్రవేత్తల్లో ఏకాభిప్రాయం లేకపోయినప్పటికీ ఇప్పటివరకు సమాజశాస్త్ర వేత్తల్లో స్థూలంగా కొన్ని అంశాలపట్ల ఏకాభిప్రాయం కనిపిస్తుంది. సమాజశాస్త్ర సిద్ధాంతం ఒక క్రమపద్ధతిలో వ్యవస్థీకృతమై, తార్కికంగా అన్వయపరచిన ఏవైనా రెండు చరాంశాల మధ్య గల సామాజిక దృగ్విషయాన్ని వివరించగలగాలి. సాక్ష్యంతో ఆచరణలో నిర్ధారింపబడే సూత్రం అంత ఖచ్చితంగా కాకపోయినా ఊహకు, పరికల్పనకంటే వివరమైనదిగా వుండాలి. అంటే సిద్ధాంతం అనేది అనుభవానికి, సూత్రానికి, వాస్తవానికి భిన్నమైనటువంటిది. వాస్తవాన్ని మనం అనుభవపూర్వకంగా నిర్ణయించుకోవచ్చు. ఈ సిద్ధాంతాన్ని అలా చేయలేం. కానీ సిద్ధాంతం వాస్తవాలను ఒక క్రమంలో వివరించే పద్ధతి. సిద్ధాంతం అనేక ఉదాహరణల ద్వారా, ఆగమన పద్ధతుల ద్వారా సాధారణీకరించి చెప్పే పద్ధతే తప్ప దానికదే ఒక అనుభవేద్యమైన వాస్తవం కాదు. సిద్ధాంతం ఒక ప్రతీకాత్మక నిర్మాణం. సిద్ధాంతీకరించడం అంటే ఒక ఆలోచనను సృజనాత్మకంగా, కళాత్మకంగా చెప్పడం. అంటే సిద్ధాంతం అనేది ఒక కఠోర సత్యం కాదు. అందుకు భిన్నంగా అదొక అనుభవానికి సంబంధించిన ప్రతీకాత్మక ప్రమాణం.

## 1.3 సమాజశాస్త్ర సిద్ధాంత స్వభావం

సమాజశాస్త్ర సిద్ధాంతాలపై వచ్చిన వివరణలు, విశ్లేషణలు, నిర్వచనాలు పరిశీలిస్తూపోతే చర్యకు అంతూ పొంతు వుండదు. ఫ్రాన్సిస్ అబ్రహం అన్నట్టు సిద్ధాంతం ఒక్కొక్కరికి ఒక్కోరకంగా కనిపిస్తుంది. ఇటీవలి కాలంలో కొందరు ప్రతీదాన్ని సిద్ధాంతీకరించి చెప్పడం, చెప్పిన ప్రతీదాన్ని సిద్ధాంతీకరించే ప్రయత్నం చేయడం జరుగుతోంది. ఈ అస్పష్టతను తొలగించే ఉద్దేశంతో థామస్ వార్డ్ అనే సమాజశాస్త్రవేత్త 1950లో సిద్ధాంత లక్షణాలపై విషయ విశ్లేషణ చేశాడు. ఆయన తన విశ్లేషణలో గమనించిందేమంటే ఇప్పటివరకు (1950) వచ్చిన ప్రధాన నిర్వచనాల ప్రకారం 89 శాతం మంది సిద్ధాంతం ఒక క్రమ నిర్మితి కలిగి వుండాలని పేర్కొన్నారు. 74 శాతం సిద్ధాంతం కాకపోయినా ఆ సిద్ధాంతం కల్పించిన ఊహ లేదా సిద్ధాంత పరికల్పన అయినా అనుభవ పూర్వకంగా నిర్ధారణకు నిలబడగలగాలి. అలాగే 70 శాతం నిర్వచనాల ప్రకారం సిద్ధాంత నిర్మితి తర్కసంబంధమైనదిగా వుండాలి. ఇలా వార్డ్ తాను పరిశీలించిన నిర్వచనాలను బట్టి సమాజశాస్త్ర సిద్ధాంతానికి ఎలాంటి లక్షణాలుండాలో వివరించాడు.

BRAOU

సమాజశాస్త్ర సిద్ధాంత స్వభావం ఎలా వుండాలి. శాస్త్రీయ సూత్రాలు లేకుండా, సాధరణీకరణ లేకుండా పరీక్షలకు, నిర్ధారణలకు నిలబడకుండా సమాజశాస్త్ర సిద్ధాంతాలను రూపొందించడం, కేవలం నిర్మితి, తార్కిక క్రమం వుంటే సిద్ధాంతం అనుకోవడం సరైందేనా అన్న చర్చ కొనసాగుతోంది. కొందరు శాస్త్రవేత్తలు సమాజశాస్త్ర తార్కిక సిద్ధాంతాలను, పరిపూర్ణ విజ్ఞానశాస్త్రాలైన భౌతిక, జీవశాస్త్ర సూత్రాలతో సరిపోల్చుతున్నారు. సమాజశాస్త్ర సిద్ధాంతం ఊహ ఆధారంగా నిర్మితమైందే తప్ప గణితశాస్త్ర నమూనాలతో భౌతిక శాస్త్రం మాదిరిగా సూత్రీకరించలేమని కొందరి వాదన. ఉదాహరణకు భూమ్యాకర్షణ శక్తి ఒక సార్వత్రిక సత్యం. అంటే ప్రపంచం అంతటా భూమ్యాకర్షణ శక్తి నిరూపించి చూపవచ్చు. కాకులు నల్లగా, కొంగలు తెల్లగా వుంటాయని చెప్పొచ్చు. కానీ, మనుషులు, జాతులు, వర్గాలు, ప్రవర్తనలు, రాజకీయాలు ప్రపంచమంతటా ఫలానా రకంగానే వుంటాయని చెప్పలేం. సాక్ష్యాలు, ఆధారాలు చూపి పునర్ నిరూపణకు నిలబెట్టలేం. కాబట్టే ఒకే విషయం మీద సమాజశాస్త్రంలో భిన్న అభిప్రాయాలుంటాయి. వర్గపోరాటాలు, పెట్టుబడి, శ్రమ విభజన వంటి విషయాల్లో సంఘర్షణవాదుల్లో భిన్న అభిప్రాయాలుండడానికి ఈ వైరుధ్య అవగాహనే కారణం. వీటినే మనం దృక్పథాలు అంటున్నాం. సిద్ధాంతీకరణకు అలాగే సిద్ధాంత కర్తలకు దృక్పథమే పునాది.

ఈ వైరుధ్యాలు, వైవిధ్య భరిత స్వభావాన్ని దృష్టిలో ఉంచుకొని శాస్త్రవేత్తలు సమాజశాస్త్ర సిద్ధాంతానికి ఈ క్రింది లక్షణాలుంటాయని పేర్కొన్నారు. అవి:

## 1.5.1 తొలిదశ

సమాజశాస్త్ర సిద్ధాంతీకరణ 19వ శతాబ్దంలోనే మొదలయ్యిందని తెలుసుకున్నాం. ఒక్క సమాజశాస్త్రానికే కాదు మొత్తం సామాజిక విజ్ఞాన వికాసానికి ఈ శతాబ్దం ఎంతో దోహదపడింది. 1789 నాటి ఫ్రెంచ్ విప్లవంతో మొదలైన రాజకీయ మార్పులు, విప్లవాలు యావత్ ఐరోపా సమాజంలో అనేక మార్పులకు దారితీసాయి. ఈ మార్పులు అనేక రకాలుగా మంచి పరిణామాలకు దోహదం చేసినప్పటికీ కొన్ని చెడు ఫలితాలనూ తెచ్చాయి. ఈ విప్లవాలు, పర్యవసానాల దుష్ఫలితాలపై సమాజశాస్త్రవేత్తలు తమ దృష్టి సారించడంతో సామాజిక సిద్ధాంతానికి అంకురార్పణ జరిగింది. విప్లవాల అనంతరం సమాజంలో వచ్చిన మార్పుల మూలంగా ఫ్రెంచ్ విప్లవం తరువాత తలెత్తిన సంక్షోభాలు అనేక మంది రచయితలను కలవరపెట్టాయి. మళ్లీ సమాజం తిరిగి ఒక క్రమబద్ధమైన స్థితికి చేరితే బాగుండునని అనేకమంది కోరుకున్నారు. ఈ పరిస్థితుల ప్రభావం తొలి సిద్ధాంతకర్తలైన ఆగస్ట్‌కోమ్ట్, ఎమిలీ దుర్‌ఖైమ్ రచనల్లో కనిపిస్తుంది. ఫ్రెంచ్ విప్లవానికి కొద్దిగా ముందుగా యూరప్‌లో వచ్చిన పారిశ్రామిక విప్లవం కూడా రాజకీయ విప్లవాలలాగే సమాజశాస్త్ర ఆలోచనా ధోరణిపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. 19వ శతాబ్ది చివరన, 20వ శతాబ్దపు తొలి పాదంలో సంభవించిన పారిశ్రామిక విప్లవం వల్ల వచ్చిన మార్పులు, ముఖ్యంగా ఉత్పత్తి వ్యవస్థలో ఆర్థిక రంగంలో చోటుచేసుకున్న మార్పులు సామాజిక సంబంధాలను కుదిపివేసాయి. పాశ్చాత్య దేశాలలోని అనేక ఆర్థిక వ్యవస్థలు ఉన్నట్టుండి పారిశ్రామికదేశాలై పోయాయి. వ్యవసాయం అంతరించింది. జనం పొలాలు, పంటభూములు వదిలి ఫ్యాక్టరీల్లో పనులు వెతుక్కున్నారు. శాస్త్ర సాంకేతిక మార్పులు అనేక మార్పులకు దోహదం చేశాయి. ఈ విప్లవం ఫలితంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భవించింది. తక్కువ జీతాలిచ్చి కార్మికునిచే పనులు చేయించుకుని ఎక్కువ లాభాలు ఆర్జించే కంపెనీలుపెరిగాయి. ఈ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల తిరుగుబాట్లు, ఉద్యమాలు మొదలయ్యాయి. ఇవన్నీ సమాజశాస్త్ర సిద్ధాంతాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. సమాజశాస్త్ర విశ్లేషణ చరిత్రలో ఈ సంఘర్షణను, మార్పులను అర్థం చేసుకోవడం ఒక ప్రధాన అంశం అయింది. కారల్ మార్క్స్, సిమ్మెల్, దుర్‌ఖైమ్, మాక్స్‌వెబర్ వంటి మేధావుల రచనలను ఈ పరిణామాలు తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఐతే ఈ రచయితల ఆలోచనల్లో, సిద్ధాంతీకరణల్లో ఏకాభిప్రాయం లేదు. కారల్ మార్క్స్ స్పష్టంగా సోషలిజం కావాలని కోరుకున్నాడు. పారిశ్రామికవ్యవస్థలో తలెత్తుతున్న సమస్యలకు అదొక్కటే పరిష్కారమార్గమని మార్క్స్ గట్టిగా భావించాడు. అయితే దుర్‌ఖైమ్, వెబర్ మాత్రం సంస్కరణలు వస్తే చాలని, ఇప్పుడున్న పెట్టుబడిదారీ వ్యవస్థలోపాలు తొలిగిపోతే చాలుననుకున్నారు. పారిశ్రామికీకరణ పర్యవసానంగా వచ్చిన 'నగరీకరణ' 'మత సంస్కరణలు', కూడా సమాజశాస్త్ర గతిని ప్రభావితం చేశాయి. పారిశ్రామికీకరణ మూలంగా వేలాది గ్రామాలు ఖాళీ అయిపోయాయి. కొత్త నగరాలు వెలిశాయి. వలసలు పెరిగాయి. అలాగే మత వ్యవస్థలో క్రైస్తవ మతంలో వచ్చిన మార్పులు అనేక మంది సమాజశాస్త్రవేత్తలను ఆలోచనల్లో పడవేసాయి. అందుకే తొలి సమాజశాస్త్రవేత్తలయిన మార్క్స్, దుర్‌ఖైమ్, వెబర్ వంటి వారి రచనల్లో మత ప్రసక్తికి విశేష ప్రాధాన్యత వుంది. ఇలా సామాజిక రాజకీయ వ్యవస్థలో వచ్చిన మార్పులు సమాజశాస్త్రవేత్తల ఆలోచనా ధోరణులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఆ ఆలోచనలకు ఒక దిశను సూచించాయి. ఒక దృక్పథాన్ని ఏర్పరచడంలో దోహదపడ్డాయి.

ఫ్రెంచ్ విప్లవం, పారిశ్రామిక విప్లవం వల్ల సామాజిక వ్యవస్థలో తలెత్తిన గందరగోళం అనేక మంది మేధావులను, మతగురువులను, బుద్ధి జీవులను ఆలోచనల్లో పడవేసింది. అలాగే పాశ్చాత్య దేశాల్లో వచ్చిన హేతువాదం, ప్రభోదాత్మక దశతో పాటు ఫ్రెంచ్ సమాజశాస్త్రం కొత్త దృక్పథాలను ఏర్పరచడంలో కీలకపాత్ర పోషించాయి.

తత్వవిచారానికి సంబంధించినంతవరకు ప్రభోదాత్మక దశ అనేక మౌలిక మార్పులను ప్రవేశపెట్టింది. సామాజిక విలువల్లో, విశ్వాసాల్లో సామాజిక జీవనానికి సంబంధించిన భావనల్లో కొత్తవి వచ్చి చేరాయి. చార్లెస్ మాంటెస్క్యూ (1689-1785) వంటి తత్వవేత్తలు 17వ శతాబ్దంలో వచ్చిన తాత్విక చింతనకు, అలాగే శాస్త్ర విజ్ఞానం ఆవిష్కరణలకు ప్రభావితులైనట్టు తెలుస్తోంది. సమాజశాస్త్రానికి అనుభవాత్మక పరిశోధనా పద్ధతిని అన్వయించే ప్రయత్నం జరిగింది ఈ దశలోనే. అప్పుడప్పుడే ఆవిష్కృతమైన సైన్స్ పద్ధతులు ముఖ్యంగా భౌతికశాస్త్ర పరిశోధనా పద్ధతులు ఈ ఆలోచనలకు ప్రేరణనిచ్చాయి. ప్రజల భావాలు తెలుసుకోవడం ద్వారా, హేతుబద్ధంగా వాటిని విశ్లేషించడం జరుగుతుందని, సైన్స్‌లోలాగే కార్యకారణ సంబంధాలను, అనుభవాత్మక పరిశీలనను సమాజశాస్త్ర పరిశోధనల్లో కూడా ప్రయోగించవచ్చునని వీరు భావించారు. అయితే ఫ్రెంచ్ సమాజశాస్త్రం ఇందుకు భిన్నమైన భావనలను,

BRAOU

పద్ధతులను ప్రచారం చేసింది. లూయిస్ డిబోనాల్డ్, జోసెఫ్ మేస్త్రే వంటి ఫ్రెంచ్ తత్వవేత్తలు ప్రబోధాత్మకవాదాన్ని వ్యతిరేకించడమే కాకుండా ఫ్రెంచ్ విప్లవంతో కూడా విభేదించారు. వారి దృష్టిలో సమాజం అనేది దేవుడు సృష్టించిన వ్యవస్థ కాబట్టి హేతువు, శోధన పనికిమాలినవే కాకుండా అనవసరమైనవి. దేవుడు సృష్టించిన ఈ లోకాన్ని ప్రజలు నాశనం చేయకుండా కాపాడుకోవాలన్న ప్రచారాన్ని వీరు చేశారు. బోనాల్డ్ వంటి వారయితే పితృస్వామ్యం, ఏకవివాహ కుటుంబం, ఏకపాలన, కేథలిక్ చర్చి ఆధిపత్యాన్ని తగ్గించే అన్ని రకాల కొత్త ఆలోచనలను వ్యతిరేకించారు. ఈ రెండు వాదాలు ఫ్రెంచ్ సమాజశాస్త్రానికి ప్రదాన భూమికను ఏర్పరచుకోవడానికి ఎంతగానో దోహదపడ్డాయి.

సమాజశాస్త్ర సిద్ధాంతానికి ఫ్రెంచ్ సమాజశాస్త్ర వేత్తలు ముఖ్యంగా తొలిదశలో సెయింట్ సైమన్ (1760-1825), ఆగస్ట్‌కోమ్ట్ (1798-1857), ఎమిలి దుర్‌ఖైమ్ (1858-1917)లు ఎనలేని కృషి చేశారు. సమాజశాస్త్రం అనే పదాన్ని తొలిసారిగా ఉపయోగించిన ఆగస్ట్‌కోమ్ట్ అతనికంటే పెద్దవాడైన సైమన్‌వద్ద పనిచేసి ఆయన ఆలోచనలకు ప్రభావితుడైనాడు. అయితే సెయింట్ సైమన్‌లో సనాతన వాదంతోపాటు ఆధునిక భావాలు కూడా వుండేవి. అందుకు భిన్నంగా కోమ్ట్ సాంప్రదాయవాది. సైమన్ ఆలోచనల్లో మార్క్సిస్టు తరహా సమసమాజ భావన కనిపిస్తుంది. కోమ్ట్ సమాజశాస్త్రాన్ని ఇతర శాస్త్రాలలో వాడే పద్ధతులతోనే అధ్యయనం చేయవచ్చని నిరూపించి సమాజశాస్త్ర పితామహుడిగా పేరుపొందాడు. అతని ఆలోచనల్లో సాంప్రదాయవాదం, ఫ్రెంచ్ విప్లవం పట్ల వ్యతిరేకత, సామాజిక పద్ధతుల పట్ల మమకారం కనిపిస్తాయి. దుర్‌ఖైమ్ కోమ్ట్‌లాగే సాంప్రదాయ వాది అయినప్పటికీ రాజకీయంగా ఉదారవాదం పట్ల మొగ్గుచూపారు. అయితే సమాజశాస్త్రాన్ని బోధనాంశంగా అభివృద్ధిచేశాడు. అప్పటి సామాజిక పరిణామాలు సమాజ మనుగడకు ముప్పుతెచ్చేవిగా వున్నాయని భయపడ్డారు. కేవలం సమాజశాస్త్రాన్ని నిర్వచించడమే కాకుండా సామాజిక పద్ధతుల్లోపరిశోధనలు (ఆత్మహత్యలపై) చేసి దాన్నొక శాస్త్రీయ పద్ధతిగా నిలబెట్టే ప్రయత్నం చేశాడు. సమాజం, శాస్త్రాన్ని పద్ధతీకరించి, సమాజశాస్త్ర పరిశోధనకు నియమాలను రూపొందించాడు. మొత్తంగా తొలిదశ ఫ్రెంచ్ సమాజశాస్త్రాన్ని, ఫ్రెంచ్ విప్లవానికి వ్యతిరేక స్పందనగా, సమాజశాస్త్ర సిద్ధాంతానికి పునాదిగా పేర్కొనవచ్చు. ఫ్రెంచ్ సమాజశాస్త్ర సిద్ధాంతం అనేక మందిని ప్రభావితం చేసింది. ముఖ్యంగా పొరుగు దేశమైన జర్మన్లను సామాజిక విశ్లేషణకు పురికొల్పింది. కారల్‌మార్క్స్, మాక్స్ వెబర్, జార్జ్‌సిమ్మెల్ వంటి జర్మన్ సామాజిక తత్వవేత్తల కృషితో సమాజశాస్త్ర సిద్ధాంతం కొత్త పుంతలు తొక్కి కొత్త సామాజిక దృక్పథాలను ఆవిష్కరించింది. ఇదే కాలంలో ఇంగ్లాండ్ కూడా బ్రిటిష్ సోషియాలజీ ఎదిగింది. ఫ్రెంచ్, జర్మన్ సమాజశాస్త్ర వేత్తల భావాలు, ప్రయోగాలు బ్రిటిష్ సమాజశాస్త్ర వేత్తలను ఎంతగానో ప్రభావితం చేశాయి. వాటితోపాటు స్థానిక (బ్రిటిష్) సమాజంలోని పరిస్థితులు కొత్త సామాజిక దృక్పథాలకు కారణమయ్యాయి. సామాజిక ఆర్థిక శాస్త్రం, సామాజిక పరిణామ సిద్ధాంతాల ప్రాతిపదికన బ్రిటిష్ సమాజశాస్త్రం ఎదిగింది. ఆడం స్మిత్, హెర్బర్ట్ స్పెన్సర్ వంటి శాస్త్రవేత్తలు బ్రిటిష్ సమాజశాస్త్ర అభివృద్ధికి దోహదం చేశారు.

ఇలా తొలిదశలో సమాజశాస్త్రం ఆకాలపు యురోపియన్ సమాజంలో సంభవించిన విప్లవాలు, మార్పులు, రాజకీయ పరిణామాలు, తాత్విక ప్రబోధాలకు ప్రతిస్పందనగా అభివృద్ధి చెంది సమాజశాస్త్ర సిద్ధాంతాన్ని పటిష్టపరిచింది.

### 1.5.2 ఆధునిక దశ

యూరోపియన్ తొలి సిద్ధాంత కర్తల ప్రతిపాదనలను ప్రాతిపదికగా చేసుకొని సామాజికశాస్త్ర సిద్ధాంతం వికాసంలో రెండోదశ సాగుతుంది. అయితే తొలి దశలోని సిద్ధాంత దృక్పథాలకు, మలిదశ సిద్ధాంత కర్తల ఆలోచనలకు స్పష్టమైన తేడా కనిపిస్తుంది. ప్రపంచ యుద్ధాలు వాటి పర్యవసానాలు, రాజ్యవ్యవస్థల ఆవిర్భావం అనంతర పరిణామాలు, శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ప్రభావం రెండవ దశలో కనిపిస్తాయి. ఈ దశ అమెరికన్ సమాజశాస్త్రం ఆవిర్భావంతో మొదలయినట్టు జార్జ్ రిట్జర్ పేర్కొన్నాడు. దీన్నే సమాజశాస్త్రంలో ఆధునిక దశగా ఈ సిద్ధాంతాలను 'ఆధునిక సమాజశాస్త్ర సిద్ధాంతాలుగా' పిలుస్తున్నారు. వీటిలో అమెరిక్ సమాజశాస్త్ర సిద్ధాంతాలతోపాటు నిర్మితి ప్రకార్యవాద దృక్పథాలు, వినిమయ వాదం, ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం మార్క్స్ అనంతర కాలంలో దాని కొనసాగింపుగా వచ్చిన సంఘర్షణ వాదం దృగ్విషయవాదం ఎథ్నోమెథడాలజీ, స్త్రీవాద దృక్పథం, ఆధునికానంతర దృక్పథాలు ప్రధానమైనవి.

BRAOU

సమాజశాస్త్ర సిద్ధాంత వికాసంలో తొలిదశలో కృషిచేసిన యూరోపియన్ సమాజశాస్త్రవేత్తలకు (సాంప్రదాయవాదులు) భిన్నంగా ఆధునిక సమాజశాస్త్ర వేత్తలు ఉదారవాద దృక్పథంతో ప్రభావితులైనవారు. వీరిపై అమెరికన్ సామాజిక, రాజకీయ విలువల ప్రభావం వల్ల వీరి ఆలోచనా ధోరణిలో వ్యక్తి స్వేచ్ఛ, సంక్షేమం కనిపిస్తుంది. కోమ్టే ప్రతిపాదించిన పరిణామ దృక్పథానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. వీరి దృష్టిలో సామాజిక వ్యవస్థ దానంతట అదే పనిచేస్తుంది. అలా చేయకపోతే పనిచేసే విధంగా సంస్కరించవచ్చు. సంస్కరణ ద్వారా, ప్రభుత్వ విధానాల ద్వారా సమాజాన్ని తీర్చిదిద్దవచ్చు. సాంప్రదాయవాదులు, తొలిదశ సమాజశాస్త్ర వేత్తల మాదిరిగా ఘర్షణలు, వర్గపోరాటాలు సమాజాన్ని రూపాంతరం చెందిస్తాయని కాకుండా భవిష్యత్‌లో వర్గ సమన్వయం, వర్గాల మధ్య సహకారంతో సమాజం రూపుదిద్దుకొంటుందని అమెరికన్ సమాజశాస్త్రం వాదిస్తోంది. ష్వెండింగర్ పేర్కొన్నట్టు అమెరికన్ సమాజశాస్త్రవేత్తల ఆధిపత్యంలో ఎదిగిన ఆధునిక సమాజశాస్త్ర సిద్ధాంతంలో దోపిడీని, సామ్రాజ్యవాద ధోరణిని (అంతర్గతంగా, అంతర్లీనంగా) సామాజిక అసమానతల్ని సమర్థించే లక్షణాలు కనిపిస్తాయి. రాజకీయ ఉదారవాద ప్రభావంతో ఎదిగిన తొలి అమెరికన్ సిద్ధాంతవేత్తల ఆలోచనలు అనేక సనాతన పర్యవసానాలకు దోహదం చేస్తాయి.

తొలి యూరోపియన్ సమాజశాస్త్ర సిద్ధాంతం పారిశ్రామిక విప్లవ పర్యవసానాలపట్ల, పెట్టుబడిదారీ వ్యవస్థపట్ల వ్యక్తమైన ఆందోళనకు భిన్నంగా ఆధునిక సమాజశాస్త్ర పారిశ్రామికీకరణను సమర్థిస్తుంది. సమాజశాస్త్రం వ్యవస్థల అధ్యయనానికి, సమస్యల పరిష్కారానికి దోహదపడాలన్నది అమెరికా సమాజశాస్త్ర ఆకాంక్ష. ఆ ఆకాంక్షకు అనుగుణమైన రీతిలోనే ఆధునిక సమాజశాస్త్ర సిద్ధాంతాలు వస్తున్నాయి. పారిశ్రామికీకరణతో పాటు ప్రొటెస్టెంట్ మతవిలువలను, శాస్త్రవిజ్ఞాన ఆవిష్కరణలను సమర్థిస్తాయి. దీర్ఘకాలిక పర్యవసానాల విశ్లేషణల జోలికి వెళ్లకుండా తాత్కాలిక, తక్షణ సమస్యల పరిష్కారానికి సమాజశాస్త్రాన్ని ఒక సాధనంగా వాడడం కనిపిస్తుంది.

## తొలి అమెరికన్లు

ఆధునిక సమాజశాస్త్ర సిద్ధాంత వ్యాప్తికి కృషిచేసిన వారిలో విలియం గ్రాహం సమ్నర్ (1840-1910), లెస్టర్ వార్డ్ (1841-1913)లు ముఖ్యులు. సమ్నర్ యేల్ విశ్వవిద్యాలయంలో (1873) సమాజశాస్త్ర బోధకుడిగా పనిచేస్తూ సమాజశాస్త్రానికి అమెరికాలో విస్తృత ప్రాతినిధ్యం కల్పించాడు.

సమ్నర్‌పై యూరోపియన్ సమాజశాస్త్ర ప్రభావం ఎక్కువగా వున్నా ఆయన స్పెన్సర్ ప్రతిపాదించిన డార్వినిజం పట్ల ఆసక్తి కనబరిచాడు. అనంతరం వచ్చిన సమాజశాస్త్రవేత్తలు కూలే, రాసే, రాబర్ట్ పార్క్ కూడా స్పెన్సర్ పరిణామ వాదాన్నే ప్రాతిపదికగా చేసుకున్నారు. వ్యక్తి స్వేచ్ఛకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చిన సమ్నర్ మనిషిలో పోటీతత్వం, దూకుడు వుండాలంటాడు. అలా పోటీలో 'నిలబడేవాడే మనగలుగుతాడు' అని తన డార్వినిజం ధోరణులను స్పష్టం చేసినాడు. 'మనం సమర్థుడే మనగలగడనుకోకపోతే ఇక మిగిలిన ప్రత్యామ్నాయం చేతగానివాళ్లు మనుగడ పొందాలనుకోవడమే' అని ఆయన వ్యంగంగా వ్యాఖ్యానించారు. ఇది సమాజాల మధ్య కూడా 'పెట్టుబడిపోటీ' ఉండాలని అనేదాకా వెళ్లింది.

లెస్టర్‌వార్డ్ కూడా పరిణామాన్నే నమ్ముతాడు. ఆదిమ సమాజాలు సరళంగా, నీతి నియమాలు లేమితో వుండేవని, అందుకు బిన్నంగా ఆధునికసమాజాల్లో స్వేచ్ఛగా మనగలుగుతున్నామని పేర్కొన్నాడు. సామాజిక జీవన అధ్యయనం కంటే ముఖ్యంగా సామాజిక నిర్మితిని, సామాజిక మార్పులను సమాజశాస్త్ర అధ్యయనం చేయాలని సూచించాడు. సమాజశాస్త్రానికి అనుప్రయుక్త ధర్మం వుండాలని హెర్డ్ వాదించాడు. అయితే సామాజికశాస్త్ర సిద్ధాంత చర్చలో ఈ ఇద్దరూ ఎక్కువ కాలం నిలబడలేదు.

## చికాగో సంప్రదాయం

ఆధునిక సమాజశాస్త్ర సిద్ధాంత వికాసానికి తోడ్పడ్డ దృక్పథాల్లో చికాగో సంప్రదాయం ప్రధానమైందిగా చెప్పుకోవచ్చు. సమాజశాస్త్ర సిద్ధాంతానికి విశేష సేవలందించిన చార్లెస్ హర్టన్ కూలీ, జార్జ్ హెర్బర్ట్ మీడ్ ఈ విచారధారకు చెందినవారే. చికాగో విశ్వవిద్యాలయంలో సమాజశాస్త్రం బోధనాంశంగా ప్రారంభమైప్పటినుంచి



BRAOU

(1892) సమాజశాస్త్ర సిద్ధాంత విశ్లేషణలో ఆ విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన సిద్ధాంతాలను చికాగో సాంప్రదాయం (Chicago School) అంటున్నారు. ఈ విశ్వవిద్యాలయంలో జరిగిన పరిశోధనలు, వచ్చిన ప్రచురణలు సమాజశాస్త్రానికి కొత్త పరిశోధనా పద్ధతులను ప్రామాణికం చేశాయి. సూక్ష్మమైన అంశాలు (మనుషుల ఆలోచనలు, చర్యలను ప్రభావితం చేసే అంశాల) అధ్యయనం ద్వారా సామాజిక దృగ్విషయాన్ని విశ్లేషించే సాంప్రదాయం ఇక్కడినుంచే ప్రారంభమైంది. డబ్ల్యు.ఐ.థామస్ (The Polish Peasant). రాబర్ట్ పార్క్, డబ్ల్యు. బర్గర్ (An Introducion to the Science of Society) రచనలు ఇందుకు ఎంతగానో కృషి చేశాయి. మనుషుల ఆలోచనల ప్రాతిపదికన మనో వైజ్ఞానిక ఆసక్తులను, సామాజిక చర్యలను అధ్యయనం చేయడం (చార్లెస్ కూలే) సమాజశాస్త్ర పరిశోధనను కొత్త మలుపు తిప్పింది. కూలే ఈ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నప్పుడే తన బింబ వ్యక్తిత్వ సిద్ధాంతాన్ని ప్రకటించాడు. ప్రాథమిక సమూహాల అధ్యయనం ద్వారా వివిధ సమాజాలను అధ్యయనం చేయవచ్చన్న ప్రతిపాదనతోపాటు హెర్బర్ట్ మీడ్ వ్యక్తులు, పాత్రలు, ప్రవర్తనల విశ్లేషణ ఆధునిక సమాజశాస్త్ర వేత్తలలో ప్రధాన పాత్ర పోషిస్తోందని కూడా చెప్పారు.

## నిర్మితి ప్రకార్యవాదం

చికాగో సాంప్రదాయం ప్రాభవం తగ్గుతున్న దశలో హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి పాటిరిమ్‌సోరోకిన్ (1889-1968), టాల్‌కాట్ పార్సన్స్ వంటి సమాజశాస్త్ర వేత్తలు కొత్త ప్రతిపాదనలతో ముందుకు వచ్చారు. సోరోకిన్ సామజిక సాంస్కృతిక మార్పుల అధ్యయనాన్ని సిద్ధాంతీకరించాడు. ఆయన చక్రీయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఆ తరువాత (1950)లో పార్సన్స్ ప్రతిపాదించిన నిర్మితి విధుల సిద్ధాంతం ఆధునిక సమాజశాస్త్ర సిద్ధాంతంలో ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు. సమాజశాస్త్ర సమతుల్య సాధనకు నిర్మితులు దోహదపడుతాయని నిర్మితుల పరస్పర సహకారంతో సామాజిక వ్యవస్థ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నాడు. పార్సన్స్ సిద్ధాంత ప్రభావం అనంతరకాలంలో హోమన్స్ తదితరులపై కూడా కనిపిస్తుంది.

నిర్మితి ప్రకార్యవాద దృక్పథానికి మార్క్సిస్టులనుంచి మరోసారి సంఘర్షణ సిద్ధాంతం రూపంలో ప్రత్యామ్నాయం ముందుకు వచ్చింది. లూయిస్ కోసర్, రాల్ఫ్ డెహ్రెన్ డార్ఫ్ వంటి శాస్త్రవేత్తలు ఘర్షణలేని సమతుల్య వ్యవస్థ అసాధ్యమని తేల్చారు. ఇలా రెండో దశ సిద్ధాంతం వ్యవస్థలను ప్రాతిపదికగా చేసుకొని వాద ప్రతివాద దృక్పథాలతో నిండిపోయింది.

ఈ సిద్ధాంత చర్చలో కొత్తగా స్త్రీవాద దృక్పథం (1970), ఆధునికానంతరవాదం (1990) బలమైన ప్రతిపాదనలతో ముందుకు వచ్చాయి. స్త్రీవాదుల రచనల ద్వారా మొదలైన ఫెమినిజం సామాజిక జీవననంలో మహిళలపట్ల ఉన్న చిన్న చూపును ఎండగడుతూ ఒక ఉద్యమంగా, సామాజిక వ్యవస్థ విశ్లేషణలో ప్రధాన దృక్పథంగా ముందుకు వచ్చింది. సమాజశాస్త్ర సిద్ధాంతంలో నిర్మితి దృక్పధాన్ని పునాదిగా చేసుకుని మిచెల్ ఫూకో తదితరులు ఆధునికానంతర వాదాన్ని సమాజశాస్త్ర సిద్ధాంత చర్చల్లోకి తెచ్చారు. ఇవన్నీ సమాజశాస్త్ర సిద్ధాంత దృక్పథానికి కొత్త వాదాలను చేరుస్తున్నాయి.

ఈ చర్యలు ఎలావున్నా సమాజాన్ని, వ్యక్తును, సంస్థలను, సంబంధాలను అధ్యయనం చేయడంలో ఈ దృక్పధాలు కొత్త విశ్లేషణ పద్ధతులను ఆవిష్కరించాయనడంలో సందేహం లేదు.

ముందుగానే పేర్కొన్నట్టు సిద్ధాంతానికి ఒక స్థిరమైన అభిప్రాయం వుండదు. నిరంతర చలన శీలత సమాజశాస్త్ర సిద్ధాంత ప్రాథమిక లక్షణం. అలాగే సమాజశాస్త్ర సిద్ధాంతాన్ని ఆలోచనలు, దృక్పథాల వారిగా విడివిడిగా చూడలేం. సామాజిక చైతన్యం, మేధావుల ఆలోచనల్లో మార్పులు ఆయా సామాజిక, సాంస్కృతిక, స్థల, కాల పరిస్థితులను బట్టి వుంటాయి. అందరి ఆలోచనల సమ్మిళితంగానే సిద్ధాంతాలు ఎదుగుతాయి. మరోరకంగా చెప్పాలంటే సిద్ధాంత మహాసౌధానికి ఈ ఆలోచనలు, దృక్పథాలే మూలస్తంభాలు. వీటిని సమగ్రంగా అద్యయనం చేసినప్పుడే సమాజశాస్త్ర సిద్ధాంత వికాస చర్య సమగ్రంగా బోధపడుతుంది.

BRAOU

## 1.6 ముగింపు

సమాజశాస్త్ర నిర్మాణ పరిణామాలకు సమాజశాస్త్ర సిద్ధాంతాలు అద్ధం పడుతాయి. సమాజశాస్త్ర సిద్ధాంతాలు ఆయా సామాజిక శక్తుల ప్రేరణలనుంచి సామాజిక వ్యవస్థలో సంభవించిన పరిణామాల క్రమాన్ని అర్థం చేసుకున్న దృక్పథాల నుంచి ఆవిష్కృతమయ్యాయి. ఊహనుంచి, పరికల్పననుంచి మొదలైన తార్కికతతో, క్రమపద్ధతిలో సాగే విశ్లేషణనే సిద్ధాంతం అంటున్నాం.

సమాజశాస్త్ర సిద్ధాంతానికి సుదీర్ఘ చరిత్రవున్నప్పటికీ అది ఫ్రెంచ్ విప్లవానంతర కాలంలో సంభవించిన పరిణామాలనుంచే ఒక ప్రత్యేక అధ్యయన అవసరంగా ముందుకువచ్చింది. పారిశ్రామిక విప్లవం, ఫ్రెంచ్ విప్లవం తరువాత యూరోపియన్ వ్యవస్థలో వచ్చిన మార్పులకు ఒక మేధో పరమైన ప్రతిస్పందనగా సమాజశాస్త్రం, సమాజశాస్త్ర సిద్ధాంతం ముందుకు వచ్చాయి. ఫ్రెంచ్ తత్వవేత్త 'ఆగస్టీకోమ్టే'తో మొదలైన సమాజశాస్త్ర సిద్ధాంతధార అమెరికన్ సమాజశాస్త్ర ఆవిర్భావంతో కొత్త మలుపు తిరిగింది. అనేక దృక్పథాలు, ఆలోచనా ధోరణుల్లో ఎదిగింది. అభిప్రాయాలు, భిన్న ఆలోచనా ధోరణులు, పరస్పర విమర్శలు ఎన్నో వచ్చినా ఇవన్నీ సమాజశాస్త్ర అవగాహనకు, పరిపుష్టికే దోహదపడ్డాయి. తొలి సాంప్రదాయ వాదులనుంచి, నేటి ఆధునిక అనతంతర వాదుల దాకా సాగిన సిద్ధాంత ప్రస్థానం సమాజాన్ని మరింత సమగ్రంగా అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది.

## 1.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సిద్ధాంతం అంటే ఏమిటి? సమాజశాస్త్ర సిద్ధాంత వికాసాన్ని వివరించండి.

2. సమాజశాస్త్ర సిద్ధాంత అభివృద్ధికి దారితీసిన సామాజిక పరిస్థితులను విశ్లేషించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సమాజశాస్త్ర సిద్ధాంత నేపథ్యాన్ని వివరించండి.

2. సమాజశాస్త్ర సిద్ధాంతంలో ఆధునిక యుగాన్ని గురించి చర్చించండి.

## 1.8 చదువదగిన పుస్తకాలు

George Ritzer : Sociological Theory.
Francis Abraham : Modern Sociological Thought.
Francis Abraham& Morgah, J.H : Sociological Thought.

BRAOU

# భాగం-2: సామాజిక శాస్త్ర అధ్యయన పద్ధతి

విషయక్రమం


2.0 ఉద్దేశాలు

2.1 పరిచయం

2.2 సకారాత్మక వాదం

2.3 సామాజిక వాస్తవం

2.4 ఆదర్శనమూనాలు

2.5 సామాజిక చర్య

2.5.1 మాక్స్ వెబర్

2.5.2 డబ్ల్యూ.వి.థామస్

2.5.3 ఫ్లోరియన్ నానెకి

2.5.4 ఆర్.ఎమ్.మెకైవర్

2.5.5 ఆల్‌ఫ్రెడ్ షుట్జ్

2.6 సారాంశం

2.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

2.8 పారిభాషిక పదాలు

2.9 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 2.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- సమాజశాస్త్ర అధ్యయనంలో అంతస్తత్వ పరిశోధనా పద్ధతికి సంబంధించి దృక్కోణాలను తెలుసుకుంటారు.
- సామాజిక చర్య గురించి ఒక అవగాహనకువస్తారు.
- సామాజికశాస్త్రాల అధ్యయనంలో వివిధ తత్వవేత్తలు అనుసరించిన విధానాలను తెలుసుకుంటారు.

## 2.1 పరిచయం

సమాజశాస్త్రం ఒక శాస్త్రమేనా? అది శాస్త్రంగా చెలామణి కావడానికి అర్హమైనదా అనే విషయంలో భేదాలున్నాయి. అంతేకాక ఈ శాస్త్ర అధ్యయనంలో అనుసరించే పద్ధతి సక్రమ పద్ధతిలో శాస్త్ర విషయాలను అర్థం చేసుకోవడానికా, లేక నియంత్రిత ప్రయోగాలు చేయడానికా, లేక కేవలం సిద్ధాంతాన్ని రూపొందించడం, దత్తాంశసేకరణ చేయడమే దీని ధ్యేయమా? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. ఈ శాస్త్రం అనుసరించే పద్ధతి ఏరకమైన విలువలతో ప్రమేయం లేనిదై ఉండాలా లేదా విలువలే ప్రధానంగా ఉండాలా అనే ప్రశ్నలు లేవనెత్తడం జరిగింది. ఈ సమస్యల గురించి సమాజశాస్త్రవేత్తలు తీసుకునే నిర్ణయాలు వారు నిర్వహించే సామాజిక అంశాల పరిశోధనలపై తీవ్ర ప్రభావాన్నిచూపుతాయి.

ఇంకల్స్ "సమాజశాస్త్రానికి శాస్త్ర స్థాయి ఉందా అన్న విషయాన్ని గురించే సమాజశాస్త్రవేత్తలలో ఉన్న మౌలిక వైరుధ్యం" అన్నాడు. అతడు లేవనెత్తిన ప్రశ్న- సమాజశాస్త్రం శాస్త్రంగా గుర్తింపు పొందడానికి ప్రయత్నించాల్సిన అవసరం ఉందా? అలా శాస్త్రంగానే దీన్నిగుర్తించాలనిభావిస్తే సమాజశాస్త్రం శాస్త్ర ప్రమాణాలకు తగినట్లుగా ఉందా అనే ప్రశ్న ఎదురవుతుంది.

సమాజశాస్త్రం మూలం సామాజిక తత్వ చింతనలో ఉన్నట్టు కనిపిస్తుంది కానీ సమకాలిక శాస్త్ర ప్రమాణాల దృష్ట్యా చూస్తే ఈ శాస్త్రానికి నిఖార్సయిన శాస్త్రం హోదా ఇవ్వడానికి వీలు లేదు. ఈ సందర్భంగా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి: సమాజశాస్త్రం ఆవిర్భవిస్తున్న దశలో శాస్త్రం అనే భావం చాలా శక్తిమంతంగా ఉండేది. సమాజశాస్త్ర వేత్తలో ఆద్యుడైన కోమ్ట్ ఈ శాస్త్రం స్వచ్ఛమైన శాస్త్రంగా రూపొందాలని కోరుకున్నాడు. శాస్త్రం అనే ఆదర్శం అనేకుల ఆదరణ పొందడం వల్ల వివిధ అంశాలను శాస్త్రీయమైన పద్ధతిలోనే తీర్చిదిద్దాలన్న ప్రయత్నం మొదలైంది.

సమాజశాస్త్రవేత్తలలో కొందరు ఈ శాస్త్రం అధ్యయనం మానవతా దృక్పథంతో సాగే శాస్త్రంగానే పరిగణించారు. వీరి దృష్టిలో సమాజశాస్త్ర అధ్యయనాంశాలు, మూల్యాంకనం, విమర్శ, క్రమపద్ధతిలో అవగాహన అనేవే ఉంటాయి. కానీ మామూలుగా శాస్త్రాలు పరిశీలనకు, పరిశోధనకు స్వీకరించే అంశాలు కావు. మామూలు శాస్త్రంగా కాక మానవతా దృష్టితో సాగే శాస్త్రంగానే సమాజశాస్త్రం ఉండాలని భావించేవారు. కేవలం వ్యక్తిగత అభిరుచితో మాత్రమే అన్నది కాదు. సామాజిక దృగ్విషయాల అధ్యయనానికి కొన్ని పరిమితులున్నాయి. ఈ పరిమితులే సమాజశాస్త్రానికి సిసలైన శాస్త్ర హోదా లభించకుండా అడ్డుపడుతుంటాయి. సమాజశాస్త్రాల అధ్యయన విషయాలు ప్రకృతి శాస్త్రాల అధ్యయన విషయాలకు భిన్నంగా ఉంటాయి. మానవులు తమ చుట్టూ ఉన్న సామాజిక ప్రపంచాన్ని పరిశీలించి, వ్యాఖ్యానించగల శక్తి ఉండడం వల్లనే వీరు మిగతా ప్రకృతి కంటే భిన్నమైనవారుగా కనిపిస్తారు.

పైన పేర్కొన్న రెండు రకాల దృక్కోణాల వల్లనే శాస్త్ర అధ్యయన పద్ధతిలో శాస్త్రవేత్తలు భిన్న మార్గాలను అనుసరించినట్లు కనిపిస్తుంది. సకారాత్మక వాదులు పరిమాణాత్మక సాంకేతిక పద్ధతుల అభివృద్ధి పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ పద్ధతుల సహాయంతోనే సామాజిక దృగ్విషయాలను ఖచ్చితంగా, నిర్దిష్టంగా కొలవడానికి వీలవుతుంది. మానవతావాదులు ఈ వాదాన్ని వ్యతిరేకిస్తారు, విమర్శిస్తారు. వీరు ఎక్కువగా గుణాత్మక పద్ధతులనే అనుసరించాలని వాదిస్తారు.

పాలోమా అనే శాస్త్రవేత్త(1979) పై రెండు అధ్యయన, పరిశోధనా పద్ధతులను గురించి చర్చిస్తాడు. మొదటిది వస్తునిష్ఠమైంది రెండోది వ్యక్తి నిష్ఠమైంది అయి ఉంటుంది. ఈరెండు రకాల నమూనాల మధ్య భేదం అవి అనుసరించే పద్ధతిలోనే ఉంటుంది. వస్తునిష్ఠమైన లేక సహజమైన నమూనాల ప్రముఖలక్షణం అనుభవిక వాస్తవాలపై ఆధారపడటం, నిరూపణీయ దత్తాంశాన్ని సేకరించడం. వ్యక్తి నిష్ఠమైన లేదా వివరణాత్మకమైన నమూనా మానవ ప్రవర్తన ధర్మాలకు (లక్షణాలకు) ప్రాధాన్యమిస్తుంది. ఈ ధర్మాలే స్త్రీ, పురుషులను అసమానమైనవారిగానూ, మానవ చర్యల అర్థాన్ని, వివరణను అధ్యయనం చేయడానికి తగిన వస్తు సామగ్రిగా చేస్తుంది. అయితే ఈ నమూనాలను వాస్తవాంశాల అధ్యయనంలో అనుసరించేప్పుడు వీటిని ఉపయోగించడంలో కొంత మేరకు తేడా ఉంటుంది. ఈ అంశాన్ని సామాజిక పద్ధతులను గురించిన చర్చ సందర్భంలో మరికొంత వివరించడం జరుగుతుంది. వస్తునిష్ఠమైన పద్ధతి, వ్యక్తినిష్ఠమైన పద్ధతులు రెండూ భిన్న ధృవాలుగా కనిపిస్తాయి. అయితే వీటిమధ్య ఉన్న తేడా అమూర్తమైనదే అవుతుంది. ఎందుకంటే ముందు తెలిపిన నాలుగు రకాల పద్ధతులు ఇదివరకు పేర్కొన్న రెండు నమూనాలలో దేనిలోనూ ఖచ్చితంగా కనిపించవు. అంతేకాక ఈ నాలుగు పద్ధతులు ఏదోఒక నమూనావైపే కొద్దో, గొప్పో మొగ్గుచూపుతుంటాయి. ఆదర్శప్రాయమైన నమూనాలో రెండు నమూనాల సమన్వయ రూపం కనిపిస్తుంది. ఎందుకంటే వెబర్ అన్నట్లు కార్యకారణ వివరణ, వ్యాఖ్యానించడం అనేవి వేరు వేరైనా సమాజానికి సంబంధించి, శాస్త్రీయ వివరణకు సంబంధించి స్వయం ప్రతిపత్తిగల నమూనాలు కాదు. దీనికి భిన్నంగా సమాజశాస్త్రం రూపొందడానికి ప్రతి ఒక్కదాని సహకారం మరొకదానికి అవసరమవుతుంది. రెండూ కలిసే సమాజశాస్త్రాన్ని శాస్త్రీయము, శాస్త్రవిషయాలకు అర్థంపట్టేదిగాను చేస్తాయి.

BRAOU

## 2.2 సకారాత్మకవాదం

17వ శతాబ్దంలో మానవపరిజ్ఞానం, ప్రపంచాల మధ్య సంబంధాన్ని గురించి చర్చ జరిగింది. వస్తునిష్ఠమైన, వ్యక్తినిష్ఠమైన పరిశోధనా పద్ధతుల మూలం ఈ చర్చల్లోనే ఉన్నట్లు బెన్‌సన్, హ్యూగ్స్‌లు పేర్కొన్నారు. మానవుని జ్ఞానేంద్రియాలు గ్రహించగలిగిందే వాస్తవమని, జ్ఞానమంతా జ్ఞానేంద్రియాల అనుభవం ఆధారంగానే కలుగుతుందనే అభిప్రాయాల మూలంగానే సకారాత్మకవాదం (Positivism) ప్రారంభమైందని బెన్‌సన్, హ్యూగ్స్ అభిప్రాయపడ్డారు. ఈరకమైన అనుభవిక (empiricist theory) సిద్ధాంతం బయటి ప్రపంచం తాలూకు జ్ఞానం మన జ్ఞానేంద్రియాల ద్వారా తెలుస్తుంది. ఇలాంటి జ్ఞానం పొందినవారు ఈ అనుభవానికి ఒక రూపం ఇవ్వడానికి ఏవిధంగానూ ప్రయత్నించలేదు. బయటి ప్రపంచానికికూడా ఏమాత్రం తెలియజేయలేదు.

సమాజ శాస్త్రాలకు సంబంధించినంతవరకు జ్ఞానశాస్త్రం(epistemology), ప్రకృతిశాస్త్రాల మధ్య తార్కికము, ఒక క్రమబద్ధము అయిన సంబంధం ఉంటుందని తెలియజేస్తుంది. ఈ రెండు శాస్త్ర విభాగాలు ఒకే సాంకేతిక పరిశీలనా పద్ధతిని అనుసరిస్తాయని కాదు. వాస్తవానికి ఆరెండింటి అధ్యయన విషయం వేరువేరుగా ఉంటుంది. అందుకే దాన్ని పరిశీలించే పద్ధతులు కూడా వేరువేరుగా ఉండాల్సి వస్తుంది. కానీ ఈ రెండూ కూడా పరిశీలన అనే తర్కాన్ని, ఒకే రకమైన శాస్త్రీయ పద్ధతిని అనుసరిస్తాయి. ఈ విధమైన ఆలోచనలకు ఆధారం ప్రకృతి, సమాజం మధ్య చెప్పుకోదగ్గ తేడాలు లేకపోవడమేనని చెప్పాలి. ఈ రెండు శాస్త్రాలు కూడా మానవ వ్యక్తినిష్ఠతకు ఆలోచితము, స్వతంత్రమూ అయిన బహిర్ ప్రపంచాన్ని, వ్యక్తిగతం కాని నియమాలకు (impersonal principles) తలవంచే వ్యక్తి నిష్ఠమైన ప్రపంచాన్ని ఊహించారు. ఈ విధమైన ప్రపంచాల స్వరూపాన్ని, స్వభావాన్ని శాస్త్రీయ పరిశోధనా పద్ధతుల సహాయంతో వివరించవచ్చు. పరిశీలనాంశంగా తీసుకున్న మానవులు, వారు తయారు చేసిన వస్తువులకు జడమైన ప్రకృతి పదార్థాలతో తార్కిక సంబంధం ఉంటుంది. అయితే జడపదార్థాలకు లేని లక్షణాలు మానవులకూ ఉన్నాయి. కానీ మానవులకున్న ఈ ప్రత్యేక గుణాలు జ్ఞానశాస్త్ర పరిశీలనకు అంతముఖ్యమైనవి కావు. జడపదార్థాలను అధ్యయనం చేసేవిధంగానే విలువలు, విశ్వాసాలు, దృక్పథాలను కూడా అధ్యయనం చేయవచ్చు. నిజానికి సకారాత్మకవాదం ఇలాంటి అవకాశాన్ని గురించి ప్రస్తావిస్తుంది. ఇదే సమాజశాస్త్రాలు నిలదొక్కుకోవడానికి తోడ్పడుతుంది.

ప్రకృతి శాస్త్రాల మాదిరిగానే సమాజశాస్త్రం కూడా ఒక శాస్త్రమేననే భావానికే సకారాత్మక వాదులు కట్టుబడి ఉన్నారు. సకారాత్మకవాదాన్ని అనుసరించే సమాజశాస్త్రవేత్తలు వారి పరిశోధనా నమూనాలకు భౌతిక, జీవశాస్త్రాలను ఉపయోగిస్తారు. మరికొందరు అన్ని శాస్త్రాలలో సమైక్యతా లక్షణాలు కనిపిస్తాయని విశ్వసిస్తారు. ప్రకృతి శాస్త్రాలను ఏర్పరచడంలో ఆధారపడిన సూత్రాలు, పద్ధతుల ఆధారంతోనే సమాజశాస్త్రాన్ని అభివృద్ధి చేయవచ్చునని సమాజశాస్త్ర స్థాపకులు నమ్ముతారు. ప్రకృతిశాస్త్రాలలో ఉపయోగించే పద్ధతులు, చేసే ప్రమేయాలు ఉపయోగించడం ద్వారా "సకారాత్మక సమాజశాస్త్రాన్ని" సృష్టించడం జరుగుతుందని సమాజశాస్త్ర పితామహుడైన అగస్ట్‌కోమ్ట్ అభిప్రాయపడ్డాడు. అంతేకాక సమాజక్రమ పరిణామం ఏవిధమైన "మార్పులులేని సూత్రాల"ను అనుసరించే విధంగానే సాగిందని కోమ్ట్ విశ్వాసం. పదార్థ ప్రవర్తన మాదిరిగానే మానవప్రవర్తన కూడా కారణకార్యసూత్రాలను అనుసరించే ఉంటుందని కోమ్ట్ అభిప్రాయం. మానవప్రవర్తన కారణ-కార్యసూత్రాన్ని అనుసరించే ఉంటుంది కాబట్టి అది భవిష్యత్తులో ఎట్లా ఉంటుందో ముందుగానే ఊహించవచ్చు.

సకారాత్మకవాదులు అవలోకనావాస్తవాలను గురించి నొక్కిచెబుతారు. పదార్థ ప్రవర్తన మాదిరిగానే మానవ ప్రవర్తనను కూడా వివరించవచ్చుననే విశ్వాసమే దీనికి ఆధారం. బయటి ఉద్దీపనలకు అణువు, పరమాణువులు ప్రతిస్పందిస్తాయి. అంటే ఒక వస్తువుకు వేడి తగిలేట్లు చేస్తే అది బహిరమైన ప్రేరణ - పదార్థంతో ప్రతిక్రియ ఏర్పడుతుంది. ఈ ప్రతిక్రియను పరిశీలించడం, అంచనావేయడం, వివరించడం ప్రకృతి శాస్త్రజ్ఞుడు చేయాల్సిన పని. సకారాత్మక వాదులు కూడా మానవ ప్రవర్తన విషయంలో ఈవిధానాన్నే అనుసరిస్తారు. మనుషులు కూడా బయటి ప్రేరణలకు స్పందించి ప్రవర్తిస్తారు. వారి ప్రవర్తనను కూడా ప్రతిక్రియను బట్టి వివరించవచ్చు. ఉదాహరణకు, సమాజం అవసరాన్ని బట్టి స్త్రీ, పురుషులు వైవాహిక సంబంధాలు ఏర్పరచుకొని సంతానాన్ని కంటారు. ఈ ప్రవర్తనకు వారు



Dr. BRAOU LIBRARY
115074
301
S.N.M

ఆపాదించే అర్థం, ప్రయోజనాలు ఏవిధమైన పరిణామపూర్వకమైనవి కావు.

సకారాత్మకవాదులు అనుభవాలపై ఆధారపడిన పరిశోధనాపద్ధతిని ప్రోత్సహించారు. ఈ విధమైన పద్ధతి ప్రకృతి శాస్త్రాలలో సాధించిన విజయాలతో సమానమైన విజయాలు సాధించడానికి చేసిన అనుకరణే. ఈ విధానాన్ని అనుసరించడంలోని ప్రధానోద్దేశం నిర్దిష్టము, ఖచ్చితం, వస్తునిష్ఠము, ఆగామిసూచకము అయిన ఒక సమాజం తాలూకు శాస్త్రాన్ని రూపొందించడమే. అంతేకాక ఇలాంటి సమాజశాస్త్రం కారణకార్య సంబంధ సూత్రాన్ని రూపొందించగలుగుతుంది. పరిశోధనా విధానం క్రమంగా కట్టుదిట్టమైన పద్ధతిగా రూపొందింది. ఈ పరిణామం జీవశాస్త్రాలలో ప్రయోగాత్మక నమూనా ప్రభావం వల్ల ఏర్పడింది. అనుభవం ఆధారంగా సాగే పరిశోధనలో ప్రశ్నావళి, సర్వేలు ప్రముఖస్థానం సంపాదించుకొన్నాయి. వీటి సహాయంతో విస్తృతమైన అంశాలను గురించిన అధ్యయనాలు చేయడం మొదలైంది. మాపననమూనాలను రూపొందించడం, గణాంకమాపనం సర్వసాధారణమైంది. సామాజిక జీవితానికి సంబంధించిన పరిజ్ఞానం శాస్త్రీయ పరిజ్ఞానం ప్రమాణాలకు దీటుగా ఉండాల్సి వచ్చింది. అంటే వస్తునిష్ఠత ప్రధాన లక్షణంగా ఉండాల్సి వచ్చింది. సామాజిక దృగ్విషయాల పరిశీలనకు శాస్త్రీయపరిశోధనా పద్ధతులను అనుసరించడం తప్పనిసరి అయింది. సామాజిక పరిశోధన తాలూకు భాష అంతా కూడా చలాంకాల రూపంలో ఉండడం మొదలైంది. సామాజిక దృగ్విషయాలను గురించి ప్రస్తావించేప్పుడు వాటి ధర్మాలు, లక్షణాలను గురించి ప్రస్తావించాల్సిరావడం, వ్యక్తులలోను, వ్యక్తుల మధ్య ఆ లక్షణాలు, ధర్మాలు ఎలా వేరువేరుగా ఉంటాయో గమనించడం వంటివి అనివార్యమయ్యాయి. సామాజికకుడు విచ్ఛిన్న, మాపన సాధ్యమైన అంశాల రాశిగా తయారయ్యాడు. సమాజం మొత్తం నదిశగల వివిధ శక్తులుగల వ్యవస్థ.

సమాజశాస్త్రజ్ఞులలో అనేకులు సకారాత్మక దృక్పథం సామాజిక జీవితాన్ని వక్రీంచిందని వాదించారు. మానవుడిని తన సమాజాన్ని స్వయంగా సృష్టించుకోగల స్రష్టగా కాక బయటి ప్రేరణలకు యాంత్రికంగా ప్రతిస్పందించే ఒక జడపదార్థంగా సకారాత్మకవాదులు భావిస్తారు అనే విమర్శ ఉంది.

## 2.3 సామాజిక వాస్తవం

దుర్ఖైమ్ ప్రతిపాదించిన విధానం తాలూకు సలహాలను"The rules of sociological method" లో పొందుపరిచాడు. ఇవి సామాజిక వాస్తవాలను "వస్తువులు"(things)గా పరిగణించాలని నిర్దేశిస్తాయి. ఈ ప్రతిపాదన దుర్ఖైమ్ సామాజిక వాస్తవాన్ని (social realism) స్పష్టం చేస్తుంది. సామాజిక వాస్తవాలు భౌతిక వాస్తవాలంతటి వాస్తవాలని దుర్క్‌హైమ్ వాదం. అవి మానవునికి బయట ఉండేవి, అతన్ని నియంత్రించేవి. అంటే మానవుడు రెండు భిన్న ప్రపంచాలలో బతకాల్సి ఉంటుంది. భౌతిక ప్రపంచం, సామాజిక ప్రపంచం. భౌతిక ప్రపంచంపట్ల ప్రవర్తించిన మాదిరిగానే సామాజిక జగత్తు విషయంలో కూడా అలాగే ప్రవర్తిస్తాడని దుర్క్‌హైమ్ విశ్వసిస్తాడు. భౌతిక ప్రపంచం కూడా వెలుపల ఉంటూ మానవుణ్ణి ఎట్లా అదుపు చేస్తుందో అట్లాగే సామాజిక జగత్తుకూడా వెలుపల ఉండి అతని ప్రవర్తనకు పగ్గాలు వేస్తుంది.

శాస్త్రీయ పరిశోధనాపద్ధతిని రూపొందించి అభివృద్ధి చేస్తున్నప్పుడు సామాజిక వాస్తవాలను అధ్యయనం చేయడంలో ఆత్మనిరీక్షణ (అంతర్దృష్టి-introspection)పై ఆధారపడకూడదని గట్టిగా చెబుతారు. ఎందుకంటే సామాజిక జీవితంలోని కొన్ని వాస్తవాలను భౌతిక, మానసిక విశ్లేషణ ద్వారా నిరూపించడం, వివరించడం సాధ్యంకాదు. ఆలోచించడం, ప్రవర్తించడం, భావోద్వేగానికి లోనుకావడం వంటి వాటికి సంబంధించినవి అనేక తరహాలుగా ఉంటాయి. ఇవి అతనికి వెలుపలవుండే ప్రభావాలు. వాటికి మానవ ప్రవర్తనను నియంత్రించే శక్తి ఉంటుంది. ఉదాహరణకు సాధారణ జనసామాన్యం తాలూకు నైతికత, కుటుంబం, మతపరమైన నిష్ఠలు, ఆచారాలు, వృత్తి పరమైన ప్రవర్తనా నియమాలు మానవుడి ప్రవర్తనను అదుపులో ఉంచుతాయి. ఇవన్నీ సామాజిక వాస్తవాలు, సామాజిక అధ్యయన విషయాలు. సమాజానికి ఒక ఉమ్మడి చేతనత్వం(collective conciousness) ఉంటుంది. అది సామాజిక విలువలను సృష్టించి వాటిని ప్రతివ్యక్తి విధిగా పాటించాల్సిన ఆదర్శాలుగా నిర్దేశిస్తుంది. సామాజిక వాస్తవాలు వైయుక్తిక వాస్తవాలుగా కుదించడానికి వీలులేనటువంటివని దుర్ఖైమ్ అభిప్రాయం. సామాజిక వాస్తవాలు

బలవంతంగా మనిషిపై రుద్దబడతాయి. అతనిని అదుపుచేస్తాయి. కాబట్టి స్వభావరీత్యా అవి వైయుక్తిక వాస్తవాలకు భిన్నంగా ఉంటాయి. మన ప్రవృత్తికి (impulse), ఉద్వేగాని(emotion)కి అవి అవకేంద్రాలు(centrifugal). కాబట్టి వాటిని మనం అదుపుచేయవచ్చు. ఇవి వ్యక్తి చేతనత్వం ద్వారా ప్రకటితమవుతాయి. సామాజిక వాస్తవాలు వెలుపలవుండే వ్యక్తి ప్రవర్తనను ప్రభావితం చేస్తుంటాయి.

సామాజిక వాస్తవాలను రెండు విధాలుగా కనుక్కోవచ్చు. అవి: 1) వ్యక్తిపై అవి బలవంతంగా అదుపు సాధిస్తాయి. ఈరకమైన అదుపు వ్యక్తి ప్రవర్తనకు సంబంధించి వివిధ తరహాల ఆంక్షల రూపంలో ఉంటుంది. 2) ఇవి ఒక సమూహంలో వ్యాపించి ఉంటాయి. ఒక సమూహం విశ్వాసాలు, ప్రవర్తనారీతులను ఏర్పరచడమనే దృష్టితో సంస్థలను అర్థం చేసుకుంటే అవే వెలుపల ఉన్న సామాజిక వాస్తవాలుగా పేర్కొనవచ్చు. ఇవి వెలుపల ఉంటూనే వ్యక్తి నడవడిని నిర్దేశిస్తాయి, నియంత్రిస్తాయి.

ఈకారణంగానే సమాజశాస్త్రాన్ని సంస్థల పుట్టుక, విధులను వివరించే శాస్త్రమని వివరించవచ్చు. సామాజిక వాస్తవాలతో ఏర్పరచిన సంస్థలను"వస్తువులుగా"ను, అనుభవంలో కనిపించే దృగ్విషయాలుగా పరిగణించాలేగానీ కానీ కేవలం భావనలుగా మాత్రమే కాదు. దుర్‌ఖైమ్ దృష్టిలో "వస్తువులు" అంటే అన్ని రకాల వస్తువులు. కేవలం ఆలోచన ద్వారానే వాటి రూపదర్శనం సాధ్యం అయ్యేటటువంటివి కావు. వాటికి రూపురేఖలు కల్పించడానికి మనస్సుకు, బుద్ధికి బయటి విషయాలు అవసరమవుతాయి. వీటిని పరిశీలన, ప్రయోగాల ద్వారానే సాధించడం సాధ్యమవుతుంది.

పైన పేర్కొన్న కారణంగానే సామాజిక వాస్తవాల అధ్యయనం సందేహాస్పదమైన అంతర్ దృష్టితోనే సాధించడం వీలు కాదని దుర్‌ఖైమ్ పునరుద్ఘాటిస్తాడు. వస్తువులకు సంబంధించిన భావాలు, ఊహలకు వస్తువుల యధార్థ రూపానికి ఎలాంటి పోలికా, పొంతనా ఉండవని ఎవరు ఖచ్చితంగా చెప్పలేరు. సమాజ శాస్త్రవేత్తలు వస్తు నిష్ఠత సాధించాలి. సమాజాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు ప్రకృతి శాస్త్రవేత్తల మాదిరిగానే తనకు ఇదివరకు తెలియని, అనన్వేషిత ప్రాంతంలో ప్రవేశిస్తున్నానని ఊహించుకోవాలి. తన పరిశోధన ప్రారంభదశలో తనకు కనిపిస్తున్న, వెలుపల ఉన్న దృగ్విషయాలను పరిశీలించడం ద్వారా-మతానుబంధం,ఆత్మహత్యల రేటు, ఆర్థిక వ్యాసంగం మొదలైనటువంటి విషయాలు-వాస్తవాలను చేరుకోవచ్చు. అయితే ఇవన్నీ సులభంగా కనిపించే దృగ్విషయాలేనని, సామాజిక పరిస్థితుల ప్రతిబింబాలేనని దుర్‌ఖైమ్ పేర్కొంటాడు. ఉదాహరణకు, ఆత్మహత్యలనేవి సమాజంలోని వివిధ సమూహాల సామాజిక దృఢతకు అద్దంపడతాయి. అందువల్ల సామాజిక వాస్తవాలను యధార్థంగా చూడలేనప్పటికి నిష్పక్షపాతమైన సూచికల సహాయంతో సూచించవచ్చు.

BRAOU

## 2.4 ఆదర్శనమూనాలు

మానవతా సంప్రదాయం (humanistic tradition) ప్రాకృతిక, మానవదృగ్విషయాల మధ్య ఉన్న స్పష్టమైన వైరుధ్యాన్ని గురించి ప్రస్తావిస్తుంది. అంతేకాక వివిధ అధ్యయనాంశాలకు భిన్నమైన పద్ధతులు అవసరమవుతాయని స్పష్టంగా పేర్కొంటుంది.

మానవతావాద సంప్రదాయానికి సంబంధించిన ప్రముఖులలో మాక్స్ వెబర్ గణనీయుడు. ఇతడు జర్మనీ దేశపు సామాజిక ఆలోచనా సంప్రదాయానికి చెందిన ప్రముఖుడు. సమాజం, ప్రకృతుల మధ్య తారతమ్యాన్ని పరిశీలించడం వల్ల తలెత్తిన సైద్ధాంతిక వివాదాన్ని ఈ సంప్రదాయానికి చెందిన సిద్ధాంత ప్రతిపాదకులు ఎదుర్కొనవలసి వచ్చింది. ఈ చారిత్రక పరిశీలనభావనకు ఎదురైన ఇబ్బంది పరిశీలనా ఫలితాల యధార్థతకు ప్రాతిపదికలుగా ఎన్నుకొనే ంశాలకు సంబంధించినవి-ఒక శాస్త్రీయ ప్రతిపాదన వాస్తవాంశాల్లతో సరిపోల్చ దగ్గదైనపుడే అది వాస్తవం అవుతుంది. అయితే వ్యాఖ్యాన ప్రధానమైన అవగాహన ఫలితాలు అస్పష్టమైనవి, అనిశ్చితమైనవి అని భావించే అవకాశముంది. వ్యక్తిగత అభిమాన, దురభిమానాలను అనుసరించినది, జ్ఞానం తాలూకు ఒకానొక రూపమని, ఇది సామాజికంగా నిర్ణయమైంది కాబట్టి సాపేక్షమైంది అయి ఉంటుంది. ఈ రకమైన సమస్యలకు పరిష్కారం

కనుగొనడంలో వెబర్ పూర్వపు శాస్త్రవేత్తలైన డిల్‌తీ (Dilthey), రికెర్ట్ (Rickert)ల కాలం వృధా అయింది. వీరు భావనలకు, జ్ఞానానికి సంబంధించిన ఒక తాత్విక ప్రాతిపదికపైనే దృష్టి కేంద్రీకరించారు. ఈ విషయంలో జ్ఞానేంద్రియాల అనుభవంపైననే సకారాత్మక వాదులు ఆధారపడినట్లు వీరు ఆధారపడలేదు. యాదృచ్ఛిక వివరణ, వ్యాఖ్యానాలు రెండూ వేరువేరని, సామాజిక శాస్త్ర వివరణ పద్ధతులకు సంబంధించి స్వతంత్రమైనవని వెబర్ భావించలేదు.

దీనికి భిన్నంగా అవి రెండూ పరస్పరం ఆధారపడినటువంటివని, సమాజశాస్త్రావతరణకు రెండూ సహకరించుకొని సమన్వయంతో పనిచేయడం అవసరమని వెబర్ భావించాడు. వెబర్ ప్రతిపాదించిన ఆదర్శనమూనా అనేది ప్రకృతి శాస్త్రాలు అందించే సామాన్యీకరణాల సాధారణ వర్ణనలకు సమాజశాస్త్రవేత్తల ప్రతిపాదనలు అతి చేరువగా ఉండేట్లు చేయడానికి ఒక సాధనంగా ఉపకరిస్తుంది.

ప్రకృతిశాస్త్రాలు అధ్యయనం చేసే వివిధ మూలకాల మధ్య యాదృచ్ఛిక సంబంధం అనే భావనకు ఆ మూలకాలకు సంబంధించినంత వరకు ఏ అర్థం ఉండదు. ప్రకృతి శాస్త్రాలు అనుసరించే పరిశోధనా పద్ధతులను యధాతథంగా, సంపూర్ణంగా సామాజిక జీవితాన్ని విశ్లేషించడానికి వీలులేదు. వ్యక్తి తన వ్యక్తిగత చర్యలకు ఒక నిర్దిష్ట అర్థాన్ని ఆపాదించినపుడే సామాజిక చర్య ఏర్పడుతుందని, దీని ద్వారానే ఇతరుల చర్యలను చూడడం జరుగుతుందని వెబర్ ప్రతిపాదించాడు. దీన్నిబట్టి చూస్తే చర్యలనేవి ప్రతిస్పందన స్వభావం గలవే కానీ కేవలం యాంత్రికంగా కలిగేవి కాదని స్పష్టం అవుతుంది. అంటే అవి కేవలం ప్రేరణ, ప్రతిస్పందనల మాదిరిగా కాక వ్యాఖ్యాన ప్రక్రియ ద్వారా ఏర్పడతాయని గుర్తించాలి. అందువల్ల ఒక సామాజిక దృగ్విషయం అర్థాన్ని, ప్రాధాన్యాన్ని అవగాహన చేసుకోవాలంటే దానికి సంబంధించిన వ్యాఖ్యాన ప్రక్రియను, లక్ష్యాలను తెలుసుకోవాలి. ఒక వ్యక్తి ఒక రకంగా ప్రవర్తించడానికి వెనక ఉన్న కారణాలు, ఆ ప్రవర్తన లక్ష్యాలను తెలుసుకోవడం ఎంతైనా అవసరం. వ్యాఖ్యానించడం కేవలం ఒక లక్ష్యం మాత్రమే కాదు. సామాజిక శాస్త్రాలలో ఇది ఒక అవసరమైన ప్రక్రియ. అయితే ఇది సర్వ సంపూర్ణము, సంతృప్తికరమైంది కాదు. అందువల్లనే అవగాహన, వ్యాఖ్యానాల ఫలితంగా బయల్పడే వాస్తవాలను శాస్త్రీయ పద్ధతి సహాయంతో పరీక్షించి నిగ్గుతేల్చడం అవసరం. సామాజిక శాస్త్ర జ్ఞానం అనేది వ్యాఖ్యాయుతమైన, కట్టుదిట్టమైన శాస్త్రీయ నమూనాల ఆధారంతో విశ్లేషించవచ్చునని వెబర్ విశ్వసించాడు. ఈ విశ్వాసమే సామాజిక దృగ్విషయాలను వర్గీకరించి, నిష్కర్షగా నిర్వచించి వివిధ అంశాల మధ్య సంగతత్వం ఉండేట్లు చూసి వాస్తవ పరిస్థితులను నమూనాలతో సరిపోల్చవచ్చు అనే ప్రతిపాదనలకు ఆధారమైంది. ఈ నమూనానే వెబర్ ఆదర్శనమూనా అని అంటాడు. అంటే సామాజిక చర్యలు చేసేవారు అనుసరించే వ్యాఖ్యానాలు, ఇచ్చే అర్థాలు ప్రథమశ్రేణి నమూనాలని, ఆదర్శ నమూనా ద్వితీయ శ్రేణి నిర్మితి అని, అవి శాస్త్రీయ వర్గీకరణలు అవుతాయని, వెబర్ పేర్కొన్నాడు.

సామాజిక చర్య అధ్యయనానికి ఆదర్శనమూనా పద్ధతిని అనుసరించాలి. ఆదర్శ నమూనా అనేది ఒక ఊహానిర్మితి(mental construct). ఒకటిగానీ అంతకన్నా ఎక్కువగానీ దృష్టికోణాల తీవ్రత వల్ల ఏర్పడేది ఆదర్శనమూనా. అంతేకాక అనేక విక్షిప్త, వివక్తమైన వైయుక్తిక దృగ్విషయాల సంశ్లేషణ(synthesis). ఈ విధమైన దృష్టికోణాలను సంఘటిత వైశ్లేషిక నిర్మితిగా రూపొందిస్తారు. అయితే భావనా పరమైన స్పష్టతతో ఈ నిర్మితి వాస్తవానుభవంతో ఎక్కడా కనిపించదు. దీన్ని కేవలం ఒక కొలమానంగా, వాస్తవాల సమూహంతో ఒక క్రమాన్ని ఏర్పరచడానికి అనువైన సాధనంగా మాత్రమే ఉపయోగించాలి.

పైనతెలిపిన ఆదర్శనమూనాను నిర్మించడంలోను, ఉపయోగించడంలోనూ ఎంతో జాగ్రత్తవహించడం అవసరమని వెబర్ హెచ్చరించాడు. ఇది ఒక పరికల్పన(hypothesis) కాదు. ఒక సగటుకానీ, వాస్తవం తాలుకు యధార్థ వర్ణన కాదు. అంతేకాక "ఇలా ఉండాలి" అని తెలిపే నమూనాకాదు. అధ్యయనం చేస్తున్న పరిశోధకుడు దృగ్విషయాల ఆవశ్యక లక్షణాలుగా భావించేవి కావు. మూర్త వాస్తవాన్ని ఈవిధంగా అధ్యయనం చేసినప్పుడు దాని మూలకాంశాల మధ్య కార్యకారణ సంబంధం ఏర్పరచడానికి వీలవుతుందని వెబర్ అభిప్రాయపడ్డాడు.



వెబర్ ప్రతిపాదించిన ఆదర్శనమూనాకు అత్యంత ప్రసిద్ధమైన ఉదాహరణ అతడు సూచించిన త్రివిధ చట్టబద్ధ

BRAOU

అధికారం (legitimate authority). అవి: 1. హేతువు ఆధారంగా ఏర్పడిన హేతుబద్ధ అధికారం(rational authority). 2.సంప్రదాయాల పవిత్రత ఆధారంగా ఏర్పడే సాంప్రదాయక అధికారం(traditional authority), 3. ఒక వ్యక్తి అద్వితీయ స్వభావం, గుణగణాలపై ఆధారపడి సమ్మోహనాత్మక అధికారం(charismatic authority). అయితే ఈ మూడు రకాల చట్టబద్ధ అధికారాలే కాక మరెన్నో తరహాల అధికారాలుండవచ్చునని వెబర్ పేర్కొన్నాడు. అధికారాలకు ఒక భావనాత్మక రూపం ఇచ్చే ఉద్దేశంతోనే అధికారాన్ని కేవలం మూడు తరహాలుగా వెబర్ ఊహించాడని గుర్తుంచుకోవాలి. సామాజికంగా ప్రధానమైన నమూనాలుగా వీటిని పరిగణించవచ్చు.

వెబర్ సూచించిన ఈ పద్ధతిని అనుసరించడం వల్ల తలెత్తే ఇబ్బందులను, సమస్యలను కింది విధంగా పేర్కొనవచ్చు. అవి: 1. ఊహించిన నిర్మితినే వాస్తవికతగా భావించే ప్రమాదముంది. 2. ఈ ఊహానిర్మితిని ఒక చట్రంగా భావించి అన్ని వాస్తవాలను ఇందులోనే జొప్పించాలని భావించవచ్చు. ఈ ప్రమాదాలను నివారిస్తే ఆదర్శనమూనా వాస్తవాలను ఎదుర్కోవడానికి, విశ్లేషించడానికి ఎంతో ఉపయోగకరమైన సాధనంగా ఉంటుంది.

## 2.5 సామాజిక చర్య

సమాజశాస్త్రంలోని దృగ్విషయదృష్టికోణం(phenominological approach) సకారాత్మకవాదం చేసే అనేక ప్రమేయాలను తోసిపుచ్చుతుంది. మానవుడి ప్రవర్తనకు వెనుకున్న ఉద్దేశాలను విస్మరించడం అంటే సమాజశాస్త్రాల వద్ద ఉన్న అనేక అమూల్య సాధనాలను తోసిపుచ్చినట్లే అవుతుంది. పదార్థం మాదిరిగాకాక మనిషికి చేతనత్వం అనేది ఉంటుంది - (ప్రభావాలు, ఉద్వేగాలు, అర్థాలు, ఆకాంక్షలు). ఇలా సచేతనులైన మానవుల చర్యలు అర్థవంతాలై ఉంటాయి. మానవుడు పరిస్థితులను నిర్దుష్టంగా నిర్వచించగలడు. తన చర్యలకు, ఇతరుల చర్యలకు అర్థాన్ని వివరించగలడు. ఈ కారణంగానే అతడు ప్రేరణలకు కేవలం ప్రతిస్పందించడం, ప్రవర్తించడమేకాక చర్యలకు ఉపక్రమిస్తాడు.

మానవతా వాదులు సమాజశాస్త్రం, ప్రకృతిశాస్త్రాలకు భిన్నమైందని, శాస్త్రీయ పరిశోధనాపద్ధతులకు అధిక ప్రాధాన్యమివ్వడం పట్ల మొగ్గుచూపడం వల్ల మానవతా దృష్టి దెబ్బతింటున్నదని భావిస్తారు. అందువల్లనే మానవతావాదులు, సకారాత్మక వాదుల మధ్య తలెత్తిన వివాదం వారు అనుసరించే పరిశీలనా పద్ధతికి సంబంధించినదిగానే ఉన్నట్లు గుర్తించవచ్చు. శాస్త్రీయ దృక్పథంతో పనిచేసే పాజిటివిస్టులు ఖచ్చితత్వానికి, నిశ్చితత్వానికి తమ పరిశోధనలలో పెద్దపీట వేస్తారు. ఇలాంటి శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఖచ్చితత్వాన్ని సాధించడానికి గణిత, గణాంక శాస్త్రాలను ఆశ్రయిస్తారు. దీనికి భిన్నంగా మానవతా వాదులు సృష్టిలో స్త్రీ, పురుషుల విశిష్టతకు కారణమైన వారి ప్రవర్తన లక్షణాలను పరిశీలించడానికి ప్రాధాన్యమిస్తారు. మనుషులకు ఎదురయ్యే సంఘటనల అర్థాన్ని తెలుసుకోవడానికే మానవతావాదులు ప్రయత్నిస్తారు. ఇలాంటి ప్రయత్నాలను వాటి స్వభావాన్ని దృష్టిలో ఉంచుకొనే అధ్యయనం చేయాల్సి ఉంటుంది. కేవలం సకారాత్మక, నిర్ణాయక సమాజశాస్త్ర దృష్టితో పరిశీలించడంవల్ల ఈ సృష్టిలోని విలక్షణ రూపాన్ని, భిన్నత్వాన్ని విస్మరించినట్లవుతుంది.

### 2.5.1 మాక్స్‌వెబర్

ఈ పద్ధతిని వివరించిన సమాజశాస్త్రవేత్తలలో వెబర్ ప్రథముడు. కేవలం మానవుడి ప్రవర్తనను గురించి నివేదించడానికే సమాజశాస్త్రం పరిమితంకాక, అతన్ని అర్థం చేసుకోవడంపై దృష్టి కేంద్రీకరిస్తుందని, మానవుడి చర్యలకు అతని ఆత్మాశ్రయ వ్యాఖ్యానాలు, అర్థాలు అతి ముఖ్యమైన అంశాలని వెబర్ వివరించాడు. చర్యలకు సంబంధించిన సామాజిక వివరణ అనేది పరిశీలన, చర్యలు చేస్తున్న వ్యక్తుల "మానసిక స్థితుల తాలూకు(states of mind of actors) సైద్ధాంతిక వ్యాఖ్యానాలు, వివరణలతోనే ప్రారంభం కావాలని" వెబర్ పేర్కొన్నాడు. ప్రతిస్పందన ప్రక్రియకు ప్రాధాన్యమిస్తూ ప్రతిస్పందనవాదం కూడా ఈ పద్ధతినే అనుసరిస్తుంది.

ఆత్మాశ్రయ అవగాహన (subjective understanding) అనేది సామాజిక చర్యను మానవ ప్రవర్తనగా నిర్వచించడానికి తోడ్పడుతుంది. మానవ ప్రవర్తనకు వ్యక్తంకాని, అవ్యక్తంకానీ చర్యచేసేవారు వారి వారి ఆత్మాశ్రయ



BRAOU

అర్థాన్ని ఇవ్వడం జరుగుతూ ఉంటుందని వెబర్ ప్రతిపాదించాడు.

వెబర్ దృష్టిలో సమాజశాస్త్రం అంటే సామాజిక చర్య విషయంలో వ్యాఖ్యాన పూర్వక అవగాహన(interpretative understanding) లక్ష్యంగా గల శాస్త్రం. ఇలా నిర్వచించడం ద్వారా చర్యలకున్న కారణాలను, వాటి గమనాన్ని, వాటి ప్రభావాల వివరణను సాధించడానికి వీలవుతుంది. చర్యకుఉపక్రమించిన వ్యక్తి దానికి తనకు నచ్చిన అర్థాన్ని ఆపాదించడం, ఇతరుల ప్రవర్తనను పరిగణనలోకి తీసుకోవడం జరిగినప్పుడు మానవ చర్య సామాజిక చర్య అవుతుంది. ఈ విధమైన దృక్పథం అమెరికన్ ప్రవర్తనా వాదం వ్యక్త్యాశ్రయమైన వ్యాఖ్యానాలకు తావు ఇవ్వదు. ఇవి పరిశీలించడానికి వీలులేనివి, ఇతరులకు తెలియజెప్పలేనివి అయి ఉండడమే కారణం. వెబర్ అభిప్రాయానుసారం చర్యను అర్థం చేసుకోవాలంటే ఆ చర్యల వెనక ఉన్న అర్థాలు, ఉద్దేశాలను గురించిన అవగాహన ముఖ్యం. ఉద్దేశాలను నాలుగురకాలుగా వెబర్ వర్గీకరించాడు. అవి:

1. అలవాటుకు సంప్రదాయక అనురూపమైనవిగా ఉండేవి(traditional conformity to habit).

2. భావోద్వేగ పూరితమైనవి(emotional).

3. అంతిమ విలువ ప్రధానమైన హేతుబద్ధ ప్రవర్తన(rational behaviour).

4. హేతుబద్ధ ప్రధానమైన లక్ష్యం కోసం హేతుబద్ధ ప్రవర్తన.

ఒక నిర్దిష్ట సమయంలోని భావావేశ స్థాయిని బట్టి వ్యక్తి చర్యలంటూ ఉంటాయి. నిగ్రహం కోల్పోయినప్పుడు దూషించడం, శారీరక బాధ కలిగించడం జరుగుతూ ఉంటుంది. ఇలాంటి చర్యలనే భావావేశ పూరిత చర్యలు(emotional actors) అంటారు. సాంప్రదాయ చర్య అనేది సుస్థాపితమై, అనాదిగా ఆచరిస్తూ వస్తున్న ఆచారంపై ఆధారపడి ఉంటుంది. గతంలో కూడా ఎందరో ఈ మార్గంలోనే నడిచారు. కాబట్టి అబాటలోనే నడవాలనుకోవడం సహజంగా కనిపించే లక్షణం. ఒక విలువకు సంబంధించిన హేతుబద్ధ చర్య అనేది ఆ ప్రత్యేక విలువ దృష్ట్యా జరిగే చర్య అయి ఉంటుంది. ఇలాంటిసందర్భంలో అంతిమ విలువను సందేహించడంకానీ, ప్రశ్నించడం కానీ జరుగక స్వీకరించడం జరుగుతుంది. ఉదాహరణకు, ఆత్మవిముక్తి (salvation of soul) అనేది అంతిమ విలువ. అలాంటి దాన్ని సాధించడానికి అనుసరించే చర్య ఈ కోవకు చెందింది. చివరగా, ఒక నిర్దిష్ట లక్ష్య సాధన కోసం చేపట్టే చర్య హేతుబద్ధ చర్య అవుతుంది. ఉదాహరణకు, ఉత్పాదకతను పెంచే లక్ష్యంతో పరిశ్రమ యజమాని తీసుకొనే చర్యలు హేతుబద్ధ చర్యలే అవుతాయి.

వెబర్ అభిప్రాయంలో "అర్థస్థాయిలో అవగాహన"(understanding of the level of meaning) అనేది రెండు విధాలుగా జరుగుతుంటుంది. అవి: 1. ఇతరుల చర్యలకు సంబంధించి అతను ఆ చర్యలకిచ్చే అర్థం, అవగాహనల దృష్ట్యా పరిశీలించడం. ఉదాహరణకు, ఒక జంతువుకు తుపాకి గురిపెట్టడం అర్థం మనకు అవగతమవుతుంది. 2. ఉద్దేశాన్ని అర్థం చేసుకోవడం. ఒక వ్యక్తి చర్యల వెనక ఉన్న హేతువును అర్థం చేసుకొని అదే చర్యలు మనం కూడా చేయడం లేదా ఆ వ్యక్తి చర్య హేతుబద్ధమైనది కానప్పుడు ఏ భావావేశంలో ఆచర్యకు పూనుకున్నాడో సానుభూతితో అర్థం చేసుకోవడం. ఇలాంటి సందర్భంలో పరిశీలకుడు చర్య చేసిన వ్యక్తి అంతిమ విలువను అంగీకరించకుండా ఎలాంటి పరిస్థితిలో అలా ప్రవర్తించాడో మనో నేత్రంతో తిలకిస్తాడు. అంటే ఆ చర్యను ఉద్దేశాల అనుక్రమంలో ఉంచి చూడడం జరుగుతుందన్నమాట. పై వివరణ దృష్ట్యా చూస్తే సమాజశాస్త్రాలలో వ్యాఖ్యాపూర్వక పద్ధతిని(interpretative method) అనుసరించడాన్ని వెబర్ సమర్థించినట్లు స్పష్టమవుతుంది.

## 2.5.2 డబ్ల్యూ.ఐ.థామస్

అమెరికన్ సమాజశాస్త్ర పితామహుడైన థామస్ (1863-1947) మానవుని గురించి అధ్యయనం చేస్తున్నప్పుడు పరిస్థితులను అతడు ఎలా నిర్వచించాడు అన్న అంశాలు చాలా ముఖ్యమని ప్రతిపాదించాడు. పరిస్థితికి వ్యక్తి ఇచ్చే నిర్వచనం బట్టి మూర్తచర్యలు ఉంటాయి. అంతేకాక ఆ వ్యక్తి జీవిత విధానం, మూర్తిమత్వం అనేవి పరిస్థితుల



BRAOU

తాలూకు నిర్వచనాల పరంపరను బట్టి కూడా ఉంటాయి. పరిస్థితులకు సామాజికులందరూ ఉమ్మడిగా ఇచ్చిన నిర్వచనాలను వారికి అందివ్వడమే సాంస్కృతిక ప్రమాణాల ప్రధాన ప్రకార్యమని థామస్ పేర్కొన్నాడు. ఈ రకమైన నిర్వచనాలు లేకుంటే మానవ జీవితం దుర్లభమవుతుంది. ఒకానొక సమూహం లేదా సమాజంలోని ఈ రకమైన సామూహిక నిర్వచనాలను లోతుగా పరిశీలించిన భవిష్యత్ పరిణామాలను, సామాజికుల ప్రతిస్పందనను గురించి జోస్యం చెప్పడమే శాస్త్ర పరిశోధకుడు నిర్వహించాల్సిన ముఖ్యమైన విధి అంటాడు థామస్.

### 2.5.3 ఫ్లోరియన్ జెనిన్‌కీ

"పోలిష్‌రైతు"లను అధ్యయనం చేయడంలో ఇతను థామస్‌తో కలిసి పనిచేశాడు. ఈ అధ్యయనం సందర్భంలోనే "పరిస్థితుల నిర్వచనం" (definition of the situation) మొట్టమొదటిగా ప్రతిపాదించడం జరిగింది. అప్పటినుంచి ఇతడు ఆరంభ పద్ధతుల విస్తరణకు - ముఖ్యంగా అధ్యయనంలోని తార్కిక దృక్కోణానికి సంబంధించి - విశేషంగా కృషి చేశాడు. ఇతను అనుసరించిన పరిశోధనా పద్ధతిని, సామాజిక క్రమానికి సంబంధించిన ఇతని భావనలను "Human Conflict" అనే భావనలతో సమన్వయపరచినట్లు కనిపిస్తుంది. దీనివల్ల సామాజిక సంబంధాల విషయంలో వ్యక్తి, సమాజాలకు సంబంధించిన మానవ చైతన్య ప్రాముఖ్యాన్ని తెలియజెప్పడం జరిగింది. ఈ విధమైన విశ్వాసం ఉండడం వల్లే వ్యక్తుల ఆత్మకథలకు, ఇతర పత్రాల పరిశీలనకు ప్రాధాన్యం అధికమైనట్లు గుర్తించవచ్చు. అంతేకాక పరిశోధన, అధ్యయనాలలో పరిమాణాత్మ(quantitative method) పద్ధతులను విచక్షణారహితంగా వాడటాన్ని నిరసిస్తున్నట్లు కనిపిస్తుంది.

### 2.5.4 ఆర్.ఎమ్.మెకైవర్

జెనినెకి అభివృద్ధి చేసిన సమాజశాస్త్రానికి, అతని స్నేహితుడు, సహోద్యోగి అయిన రాబర్ట్ మెకైవర్ రూపొందించిన సమాజశాస్త్రానికి ఎంతో పోలిక ఉంది. మానవ చర్యలను అవగాహన చేసుకోవడానికి ఆత్మాశ్రయ వ్యాఖ్యానాలు, గతిశీల నిర్ధారణలు (dynamic assessments) ముఖ్యమైనవిగా నొక్కి చెప్పాడు. "Community, Society, Social Causation" అన్న సంపుటాలు అతని రచనల్లో ముఖ్యమైనవి. అతని రచనలు సకారాత్మక వాదాన్ని అతిగా వాడడం, అపరిష్కృతమైన సమాజశాస్త్రం, అనుభవవాదం ఎక్కువగా ఆధారపడడం వంటి ధోరణులకు అడ్డుకట్ట వేసాయని చెప్పవచ్చు.

BRAOU

### 2.5.5 ఆల్‌ఫ్రెడ్ షుడ్జ్

దృగ్విషయవాదం, సామాజిక అంతర్ దృష్టులను షుడ్జ్ చక్కగా మేళవించాడు. "ఆత్మాశ్రయ అర్థం" లేదా "పరిస్థితి నిర్వచనం" అనేవి సమాజశాస్త్రం ప్రముఖ లక్షణాలుగా ఉండాలని ఇతడు గట్టిగా వాదించాడు.

సామాజిక వాస్తవం (social reality) ఎలా ఏర్పడుతుంది. అది ఎలా ఆత్మాశ్రయ దృగ్విషయంగా చెలామణి అవుతుంది అనే విషయాలను సకారాత్మక సమాజశాస్త్రం (దీన్ని అతడు Naturalism అన్నాడు.) వివరించలేదు. అంతేకాక అది వ్యక్తుల మధ్య ఆత్మాశ్రయ వివరణగా ఎలా రూపొందుతుంది, వ్యక్తులు తమ చర్యలను, ఇతరుల చర్యలను ఎలా వ్యాఖ్యానిస్తారు అన్న విషయాలను వివరించదు. సానుభూతితో కూడిన ఆత్మ పరిశీలన లేదా అంతఃర్ దృష్టి (sympathetic introspection) భావనను ప్రవేశపెట్టిన వెబర్ వాదాన్ని ఇతడు సమర్థించాడు. అయితే వెబర్ సూచించిన Verstehen పద్ధతి వ్యక్తుల చర్యలకు సంబంధించిన అర్థాన్ని నలుగురితో పంచుకోవడం అనేది ఎలా జరుగుతుందో వెబర్ వివరించేలేదని విమర్శించాడు.

## 2.6 సారాంశం

సమాజశాస్త్రాన్ని ఒక శాస్త్రంగా పరిగణించవచ్చా అనే ప్రశ్న తలెత్తింది. ఈ విషయంలో శాస్త్రవేత్తలలో రెండు స్పష్టమైన ఆలోచనలు ఉన్నట్టు కనిపిస్తాయి. మానవతా దృష్టితో సాగే శాస్త్రంగానే సమాజశాస్త్రాన్ని పరిగణించాలని చెబుతూ అధ్యయనాంశాలు మూల్యాంకనం, విమర్శ, క్రమపద్ధతిలో అవగాహన అనేవి ప్రధానంగా ఉంటాయని

వివరించారు. ఈ అధ్యయనాంశాలు ప్రకృతి శాస్త్ర అధ్యయనాంశాలకు భిన్నంగా ఉంటయి. సామాజిక దృగ్విషయాల అధ్యయనానికి కొన్ని పరిమితులు ఉంటాయి. ఈ పరిమితులే సమాజశాస్త్రానికి సిసలైన శాస్త్ర హోదా లభించకుండా అడ్డుపడుతుంటాయని శాస్త్రవేత్తల అభిప్రాయం.

పైన తెలిపిన రెండు రకాల శాస్త్రాలు మానవతా దృష్టితో సాగే శాస్త్ర పరిశీలన, ప్రకృతిలో విషయాల అధ్యయనానికి సంబంధించిన శాస్త్ర పరిశీలనలకు సంబంధించి రెండు భిన్నమైన పద్ధతులు ఏర్పడ్డాయి. సకారాత్మక వాదులు పరిమాణాత్మక సాంకేతిక పద్ధతుల సహాయంతోనే సామాజిక దృగ్విషయాలను ఖచ్చితంగా నిర్దిష్టంగా కొలవడానికి వీలవుతుందని భావిస్తే మానవతావాదులు ఈ వాదాన్ని వ్యతిరేకిస్తారు, విమర్శిస్తారు. వీరు ఎక్కువగా గుణాత్మక పద్ధతులనే అనుసరించాలని వాదిస్తారు. ఈ రకంగా పరిశోధనా పద్ధతి విషయంలో తలెత్తిన వివాదం రెండు భిన్న వాదాలకు దారితీసింది. అవి: 1) సకారాత్మక వాదం, 2) గుణాత్మక వాదం.

శాస్త్రీయ పరిశోధనా పద్ధతిని రూపొందించి అభివృద్ధి చేస్తున్నప్పుడు సామాజిక వాస్తవాలను అధ్యయనం చేయడంలో అంతర్ దృష్టిపై ఆధారపడకూడదని గట్టిగా విశ్వసించాడు. దుర్ఖైమ్. సామాజిక వాస్తవాలు వైయుక్తిక వాస్తవాలుగా కుదించడానికి వీలు లేనటువంటివని దుర్ఖైమ్ అభిప్రాయం. సామాజిక వాస్తవాలు బలవంతంగా మనిషిపై రుద్దబడతాయి. అతనిని నియంత్రిస్తాయి. కాబట్టి స్వభావరీత్యా అవి వైయక్తిక వాస్తవాలకు భిన్నంగా ఉంటాయి. మన ఆవేగానికి, ఉద్వేగానికి అవి అపకేంద్రాలు. కాబట్టి వాటిని అదుపు చేయవచ్చు. ఇవి వ్యక్తి చేతనత్వం ద్వారా ప్రకటితమవుతాయి. సామాజిక వాస్తవాలు వెలుపల ఉండి వ్యక్తి ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి.

ప్రాకృతిక, మానవదృగ్విషయాల మధ్య ఉన్న స్పష్టమైన వైరుధ్యాన్ని గురించిన మానవతా సంప్రదాయం ప్రస్తావిస్తుంది. అంతేకాక వివిధ అధ్యయనాంశాలకు భిన్నమైన పద్ధతులు అవసరమవుతాయని స్పష్టంగా పేర్కొంటుంది. మానవతా వాద సంప్రదాయానికి చెందిన ప్రముఖుల్లో మాక్స్‌వెబర్ ఒకడు. ఇతడు ఆదర్శ నమూనాను ప్రతిపాదించాడు. అతడు సూచించిన త్రివిధ చట్టబద్ధ అధికారం 1. హేతువు ఆధారంగా ఏర్పడిన హేతుబద్ధ అధికారం, 2. సంప్రదాయాల పవిత్రత ఆధారంగా ఏర్పడే సంప్రదాయిక అధికారం, 3. ఒక వ్యక్తి అద్వితీయ స్వభావం, గుణగణాలపై ఆధారపడిన సమ్మోహనాత్మక అధికారం.

BRAOU

మానవతా వాదులు సమాజశాస్త్రం ప్రకృతి శాస్త్రాలకు భిన్నమైనదని, శాస్త్రీయ పరిశోధనా పద్ధతులకు అధిక ప్రాధాన్యమివ్వడం పట్ల మొగ్గు చూపడం వల్ల మానవతా దృష్టి దెబ్బతింటున్నదని భావిస్తారు. అందువల్ల మానవతావాదులు, సకారాత్మక వాదుల మధ్య తలెత్తిన వాదం వారుఅనుసరించే పరిశీలనా పద్ధతికి సంబంధించిందిగానే ఉన్నట్లు గుర్తించవచ్చు.

మానవున్ని అధ్యయనాంశంగా స్వీకరించి పరిశీలించి, విశ్లేషించిన వారిలో ముఖ్యంగా పేర్కొనదగ్గ సమాజశాస్త్ర వేత్తలు మాక్స్‌వెబర్, డబ్ల్యూ.ఐ.థామస్, ఫ్లోరియన్ జెనిన్‌కీలను చెప్పుకోవచ్చు. వీరి వాదాన్ని ప్రతిపాదనలను గురించి వివరంగా తెలుసుకున్నారు. ఈ అంశాలను వివరంగా చదివాక సమాజశాస్త్ర సిద్ధాంతానికి సంబంధించిన భిన్న దృక్కోణాలను సామాజిక శాస్త్ర అధ్యయన పద్ధతులను- సకారాత్మవాదం, ఆదర్శ నమూనాలు, సామాజిక వాస్తవం, సామాజిక చర్యలను గురించి మంచి అవగాహన ఏర్పడుతుంది.

## 2.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సమాజశాస్త్రంలో వస్తునిష్ఠ, వ్యక్తినిష్ఠ దృక్పథాల మధ్య ఉన్న విభేదమేమిటి?
2. అర్థానికి సంబంధించిన వ్యాఖ్యానం, వ్యాఖ్యానయుత అవగాహన పద్ధతుల కలయిక ద్వారా సామాజిక ప్రవర్తనను విశ్లేషించవచ్చు అన్న వాదాన్ని వెబర్ ఎలా వివరించాడు.

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.

1. సకారాత్మకవాద సంప్రదాయ పద్ధతి.

2. సామాజిక ప్రవర్తన తాలూకు వ్యాఖ్యానయుత అవగాహనకు ప్రాముఖ్యతనిచ్చే అంశం ఏది.

## 2.8 పారిభాషిక పదాలు

Naturalism : సకారాత్మక సామాజిక శాస్త్రం.

Humanism : స్త్రీ, పురుషులను విశిష్టమైనవారిగా చేసే వారి ప్రవర్తన ధర్మాలను ప్రముఖంగా పేర్కొనడం.

Verstehen : ఇతరులు అనుభవిస్తున్న దాని దృష్ట్యా ప్రపంచాన్ని చూడడం.

Definition of situation: పరిస్థితి నిర్వచనం.

## 2.9 చదవదగిన రచనలు

Benson Douglas and John A. Huges (1983) : The Perspectives of Ethno methodology, London.

Harlmbes,M. (1980) : Sociology; Themes and Perspectives, Oxford University Press, New Delhi.

Inkeles, Alex (1987) : What is sociology. Prentice Hall of India Pvt Ltd., New Delhi.

Poloma, Margaret, M. : Contemporary Sociologycal Theory, MacMillan Publishing Co. Inc, New York.

BRAOU

BRAOU

# ఖండం- II

## నిర్మితి ప్రకార్యవాదం

సమాజశాస్త్ర సిద్ధాంత దృక్పథాలకు ఒక రూపునిచ్చింది నిర్మితి ప్రకార్యవాదం. ప్రకార్యవాదుల కృషి వల్లే సమాజశాస్త్రాన్ని అర్థం చేసుకోవడానికి, సామాజిక సంబంధాల విశ్లేషణకు శాస్త్రబద్ధత ఏర్పడింది. నిర్మితి-ప్రకార్యాల విశ్లేషణతో అల్లిన సామాజిక సిద్ధాంత చర్చను ఈ ఖండంలో ఇవ్వడం జరిగింది. సాంప్రదాయవాదిగా పేరుగాంచిన దుర్ఖైమ్ మొదలుకొని ఇటీవలి సమాజశాస్త్రవేత్తల వరకూ సమాజశాస్త్ర విశ్లేషణలో నిర్మితి ప్రకార్యాలను ప్రధానవనరులుగా చేసుకున్నవారి సిద్ధాంతాలను ఈ ఖండంలో వివరించడం జరిగింది.

ఇందులో ఆరు భాగాలున్నాయి. అవి:

- ఎమిలిదుర్ఖైమ్
- రాడ్క్లిఫ్బ్రౌన్
- బ్రానిస్లావ్ మలినోవ్స్కీ
- టోల్కాట్పార్సన్స్
- రాబార్ట్ కింగ్ మెర్టిన్
- నిక్లస్ లూహ్మన్

BRAOU

BRAOU

## భాగం-3: ఎమిల్ దుర్‌ఖైమ్

విషయక్రమం


3.0 ఉద్దేశాలు

3.1 పరిచయం

3.2 జీవిత విశేషాలు

3.3 సామాజిక వాస్తవాంశాలు

3.3.1 సామాజిక వాస్తవాంశాల లక్షణాలు

3.3.2 సామాజిక వాస్తవాంశాలలో రకాలు

3.4 దుర్‌ఖైమ్ ఉపయోగించిన అనువర్తన విధానం

3.4.1 సామాజిక వాస్తవాంశాలను పరిశీలించడంలో నియమాలు

3.4.2 సాధారణ, సమస్యాపూరిత వాస్తవాంశాలను వేరుచేయడంలో నియమాలు

3.4.3 సామాజిక వాస్తవాంశాల సవివరణ నియమాలు

3.4.4 సమాజాల వర్గీకరణలో నియమాలు

3.5 సమాజంలో శ్రమవిభజన

3.5.1 సమష్టి వివేకం

3.5.2 రెండు రకాల సంఘీభావం

3.6 ఆత్మహత్య

3.6.1 ఆత్మహత్యలలో రకాలు

3.7 మతసంబంధమైన సమాజశాస్త్రం

3.7.1 పవిత్రం, అపవిత్రం

3.7.2 మతం-నిర్వచనం

3.7.3 టోటెమిజం

3.8 దుర్‌ఖైమ్‌పై విమర్శ

3.9 సారాంశం

3.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

3.11 చదువదగిన పుస్తకాలు


## 3.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- సామాజిక వాస్తవాంశాలను నిర్వచించగలుగుతారు.

BRAOU

- సామాజిక వాస్తవాంశాలను వివిధ రకాలుగా వర్గీకరించగలుగుతారు.
- దుర్‌ఖైమ్ ప్రతిపాదించిన సంఘీభావ భావనను అర్థం చేసుకుంటారు.
- ఆత్మహత్యలలోని రకాలను వివరించగలుగుతారు.
- మతము, సామాజిక సంఘీభావాల మధ్యనున్న సంబంధాన్ని తెలుసుకుంటారు.

## 3.1 పరిచయం

సామాజిక శాస్త్రంలో ప్రకార్యవాదానికి ఆద్యుడు ఎమిలీ దుర్‌ఖైమ్. సామాజిక దృగ్విషయాలను వాటి ప్రకార్యాల దృష్ట్యా ఇతడు అనేక సందర్భాలలో అనేక పర్యాయాలు వివరించాడు. సామాజిక వాస్తవాంశాలకు సంబంధించిన కారణాలను, పర్యవసానాలను ఒక క్రమపద్ధతిలో వివరించడం ద్వారా ఈ ప్రకార్యవాద మూలతత్వాన్ని సవివరంగా వివరించి, సామాజిక విశ్లేషణకు ప్రకార్యవాదం ఒక శక్తిమంతమైన విశ్లేషణ సాధనమని నిరూపించాడు. వ్యవస్థే వ్యవస్థలోని వివిధ అంశాలకంటే ప్రముఖమైనదని, సామాజిక వాస్తవాంశాలే సమాజశాస్త్ర విశ్లేషణలో ప్రధానమైనవని భావించాడు. అంతేకాక వ్యక్తి ఇచ్ఛ(individual will) కంటే సామాజిక ఇచ్ఛే(social will) ముఖ్యమని, వ్యక్తిపైన దాని ప్రభావం ప్రగాఢంగా ఉంటుందని కూడా ఇతడు ప్రతిపాదించాడు. సామాజిక దృగ్విషయాలకు సంబంధించి పర్యవసానాలు, కారణాల విషయంలో సందిగ్ధత ఏర్పడకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించాడు. 'ఒక వాస్తవాంశం ఎలా ఉపయోగకారిగా ఉంటుందో తెలియజేయడానికి దాని మూలమేమిటో, అది ఎందుకు సంభవించిందో, అసలు అది ఏమిటో వివరించవలసిన అవసరం లేదు. దాని వల్ల కలిగే ప్రయోజనాలు దాని ప్రత్యేక లక్షణాలను స్పష్టంగా తెలియజేస్తాయేకాని దానిని సృష్టించలేవు' అని దుర్‌ఖైమ్ అంటాడు.

దుర్‌ఖైమ్ ప్రతిపాదనలను బ్రిటిష్ మానవ శాస్త్రజ్ఞులైన మలినోవ్‌స్కీ, రాడ్‌క్లిఫ్ బ్రౌన్‌లు మరింత మెరుగుపరిచారు.

BRAOU

## 3.2 జీవిత విశేషాలు

దుర్‌ఖైమ్ 1858, ఏప్రిల్ 15న ఫ్రాన్స్‌లోని ఎపినాల్(Epinal) పట్టణంలో జన్మించాడు. ఇతని పాఠశాల విద్యాభ్యాసం ఫ్రాన్స్‌నైరుతి ప్రావిన్స్‌లో జరిగింది. ఇతడు 1879లో ఎకోల్ నర్మెల్ సుపీరియర్ (Ecol Normale Superieure) అనే శిక్షణా సంస్థలో ప్రవేశంపొందాడు. ఈ సంస్థలో దేశమంతటి నుంచీ కేవలం 40 మంది విద్యార్థులకే ప్రవేశం లభిస్తుంది. 1881-1887 మధ్య కాలంలో ఇతడు సెంకడరీ స్కూల్‌లో తత్వశాస్త్రం బోధించాడు. పరిశోధనకోసం ఇతడు 1885-86 మధ్య విధ్యాభ్యాసం కోసం సెలవుతీసుకొని జర్మనీ వెళ్లాడు. అక్కడ ఉన్న కాలంలో విల్హైమ్ వుంట్ట్(Wilhelm wundt)తో సాన్నిహిత్యం ఏర్పడి ప్రత్యేక అభిమానం పెంచుకున్నాడు.

డాక్టరేట్ పట్టాకోసం పరిశోధించే విద్యార్థులు రెండు రకాల పరిశోధనావ్యాసాలను సమర్పించవలసి ఉంటుంది- ఒకటి, సంక్షిప్తంగాను, మరొకటి విస్తృతంగాను రాయవలసి ఉంటుంది. సంక్షిప్త పరిశోధనా వ్యాసంలో అప్పటి ఫ్రెంచ్ రాజనీతి శాస్త్రజ్ఞుడైన మాంటెస్క్యూ వివిధ రకాల రాజ్యాలను గురించి సిద్ధాంత ప్రతిపాదనలు చేశాడు. దుర్‌ఖైమ్ సమర్పించిన ప్రధాన పరిశోధనా వ్యాసం "The Division Labour in Society". 1776నాటికే ఇంగ్లాండుకు చెందిన ఆడం స్మిత్ అనే ఆర్థిక శాస్త్రవేత్త "The Wealth of Nations" అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులో శ్రమ విభజన తాలూకు సిద్ధాంత ప్రతిపాదన జరిగింది. అయితే దుర్‌ఖైమ్ శ్రమవిభజన ప్రకార్యాలు, కారణాలు, శ్రమ విభజనలోని విపరీత రూపాలను గురించి చర్చించి శ్రమవిభజన తాలూకు ఒక సామాజిక అర్థాన్ని కల్పించాడు. ఈ గ్రంథాన్ని 1893లో అతని 35 వ ఏట ప్రచురించాడు. ఇతడు 1895లో "The Rules of Sociological Method" అనే గ్రంథాన్ని వెలువరించాడు. ఈ గ్రంథంలో సామాజిక వాస్తవాంశాల స్వభావాలను నిర్వచించడమే కాక పరిశీలనా నియమాలను, సాధారణ, సమస్యాపూరిత(pathological) అంశాల గుర్తింపు, సామాజిక వాస్తవాంశాల వివరణ తాలూకు నియమాలను గురించి కూడా వివరించాడు. 1897లో ఆత్మహత్యలకు సంబంధించిన ఒక గ్రంథాన్ని రచించాడు. ఇందులో ఆత్మహత్యలకు సంబంధించిన సామాజికాంశాలను చూపడమేకాక వివిధ సామాజిక

పరిస్థితులలో ఆత్మహత్యల రేటు పెరగడాన్ని వివరించడానికి ప్రయత్నించాడు. ఇతడు మూడు రకాల ఆత్మహత్యలను గుర్తించి వాటికి కారణాలు భిన్నంగా ఉంటాయని పేర్కొన్నాడు.

1887లో బోర్డ్యూ విశ్వవిద్యాలయంలో ఉపన్యాసకుడిగా ప్రవేశించి అతి తక్కువ కాలంలోనే ఆచార్యపీఠాన్ని అధిష్ఠించాడు. ఈ విశ్వవిద్యాలయంలో విద్య, సామాజిక తత్వాలను బోధించాడు. 1902లో ఇతడు పారిస్ నగరానికి మారి, అక్కడి ప్రముఖ విద్యాసంస్థ అయిన సార్‌బాన్(sorbonne)లో చేరాడు. మతం, విజ్ఞానశాస్త్రాలపట్ల అతనికున్న ఆసక్తి ఆదిమ సమాజంలోని అత్యంత స్వచ్ఛమైన మతరూపాన్ని పరిశీలించడానికి ప్రేరేపించింది. ఆనాడు లభ్యమైన సాహిత్యం ఆధారంగా అనేక తెగల గురించి ముఖ్యంగా ఆస్ట్రేలియాకు చెందిన అరుంట తెగ గురించి చదవడమేగాక ఆ తెగలో కనిపించే టొటెమ్ సమూహాలను అధ్యయనం చేసి మతంలోని మూల తత్వాన్ని గురించి తెలుసుకొన్నాడు. మతం గురించి చేసిన ఈ అధ్యయనం ఆధారంగానే 'సమష్టి వివేకం'(collective conscience) అనే భావనకు శ్రీకారం చుట్టాడు. మతం, విజ్ఞాన శాస్త్రాల గురించిన ఈ చర్చను 1912లో ప్రచురితమైన "The Elementary forms of Religious Life" గ్రంథంలో -A study in Religious Sociology అనే ఉపశీర్షికలో కొనసాగించాడు.

1914లో మొదటి ప్రపంచ యుద్ధం మొదలై, ఎకోల్‌నార్మేల్ సుపీరియర్‌లోని సగం మంది విద్యార్థులు మృతిచెందడం జరిగింది. ఈ సమయంలోనే(1916) దుర్ఖైమ్ ఏకైక కుమారుడు చనిపోవడం, ఆతర్వాత సంవత్సరంలోనే -15 నవంబర్, 1917లో తన 59వ ఏట దుర్ఖైమ్ హృద్రోగంతో కన్నుమూయడం జరిగింది.

## 3.3 సామాజికాంశాలు

BRAOU

విజ్ఞానశాస్త్రానికి ఒక ప్రత్యేక శాస్త్ర ప్రతిపత్తి కలగడానికి ప్రత్యేక అధ్యయనాంశం ఒకటి ఉండడం అవసరమని దుర్ఖైమ్ భావించాడు. ఒక నిర్దిష్ట అధ్యయనాంశం ఉండడమే కాక అది అనుభవైకంగా(empirical) అధ్యయనం చేయడానికి, జ్ఞానేంద్రియాలతో పరిశీలించడానికి అనువుగా ఉండాలి. అంతేకాక ఈ శాస్త్రం దృగ్విషయాలలోని మార్పులను సకారణంగా వివరించగలగాలి. అందుకే సమాజాన్ని ఇతడు ఒక వాస్తవంగా భావించాడు. ఇటువంటి సమాజస్వభావం దాని సభ్యుల స్వభావానికి భిన్నంగా ఉంటుంది. ఇటువంటి సమాజాన్ని అధ్యయనం చేసే శాస్త్రమే సమాజశాస్త్రం. సామాజిక జీవితం తాలూకు ఈ లక్షణాలను ప్రత్యేక వైయుక్తిక లక్షణాలుగా భావించడానికి వీలులేనివని, సామాజిక వాస్తవాంశాలుగా దుర్ఖైమ్ పేర్కొన్నాడు.

'నడుచుకోవడం, ఆలోచించడం, ఉద్వేగం అనేవి వ్యక్తిని బహిరంగంగా ప్రభావితం చేసే శక్తులు. ఇవి సమాజమంతా వ్యాపించి ఉంటాయి. వైయుక్తిక విభేదాలతో సంబంధం లేకుండా జీవిత పర్యంతం స్వతంత్రంగానే ఉంటాం' అని దుర్ఖైమ్ సామాజిక వాస్తవాంశాలను నిర్వచించాడు. భాష, న్యాయసూత్రాలు, సమాజ సభ్యులందరిలో కనిపించే విశ్వాసాలు మొదలైన వాటిని సామాజిక వాస్తవాంశాలకు ఉదాహరణలుగా చూపవచ్చు.

### 3.3.1 సామాజిక వాస్తవాంశాల లక్షణాలు

సామాజిక వాస్తవాంశాలు ప్రధానంగా మూడు లక్షణాలను కలిగి ఉంటాయి. అవి: 1) బహిరత(exteriority), 2) సాధారణత(generality), 3) పరిమిత లేదా నియంత్రణ(constraint). ఈ మూడు లక్షణాలను సంక్షిప్తంగా ఈ క్రింద వివరించడం జరిగింది.

సామాజిక వాస్తవాంశలు సామాజికులకు బాహిరమైనవి, స్వతంత్రమైనవి. ఈ అంశాలు ఉమ్మడిగా జీవించడం వల్ల ఏర్పడతాయే కానీ వాటి మూలాలను వైయుక్తిక చైతన్యం(individual conciousness)లోని జైవిక(organismic), మానసిక(psychic), లక్షణాలలో వెదకకూడదు. ఉదాహరణకు ఏ ఇంగ్లీషు వ్యక్తి జన్మించక ముందునుంచే ఇంగ్లీషు భాష అనేది వాడుకలో ఉండేది. ఆంగ్లేయ సమాజం బతికున్నంతవరకూ, ఆంగ్లేయులనేకమంది గతించినా ఆభాష కొనసాగుతూనే ఉంటుంది. ఆంగ్లేయ సమాజంలో బతకాలనుకునే ప్రతీవ్యక్తీ ఆంగ్లభాష నేర్చుకొని తీరాలి. అలాగే మత విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు వ్యక్తి పుట్టుకకు పూర్వంనుంచే ఉంటాయి. వ్యక్తులు జన్మించవచ్చు.

గతించవచ్చు కానీ సామాజిక వాస్తవాంశాలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటాయి.

సాధారణతకు సంబంధించినంతవరకు సామాజిక వాస్తవాంశాలు సమూహమంతటా వ్యాపించి ఉంటాయి. సమాజంలోని అధిక సంఖ్యాకుల ఆమోదం పొంది ఉంటాయి. ఇవి ఏ ఒక్క వ్యక్తి సొంతం కాదు. అంటే ఇవి వైయుక్తికమైనవికావు. సామాజిక ఆలోచనా విధానం, ఉద్వేగం, నడవడులను సూచిస్తాయి. అయితే వ్యక్తుల ప్రత్యేక లక్షణాలతో నిమిత్తం లేనటువంటివి ఈ సామాజికాంశాలు.

సామాజికులపై నియంత్రణాధికారమున్న అంశాలే సామాజిక వాస్తవాంశాలు. వీటినే దుర్‌ఖైమ్ పరిమితులు లేదా, నియంత్రణలు అన్నాడు. సమూహంలోని వ్యక్తులకు తమ ఇష్ట ప్రకారం ప్రవర్తించే స్వేచ్ఛ ఉండదు. సమూహం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించే వ్యక్తులు ప్రవర్తించడం జరుగుతుంది. అంతేకాక సమాజం నిర్ణయించిన ప్రమాణాలను అనుసరించే వ్యక్తులు ప్రవర్తించేటట్లు ఒత్తిడి తెస్తుంది. ఉదాహరణకు న్యాయసూత్రాలు లేదా చట్టాలు సామాజిక వాస్తవాంశాలే. సమాజంలోని ఒక వ్యక్తి న్యాయసూత్రాలను ఉల్లంఘించి ప్రవర్తించినప్పుడు సమాజం అతడిని దండిస్తుంది.

### 3.3.2 సామాజిక వాస్తవాంశాలలో రకాలు

1. సామాజిక వాస్తవాంశాలు అఖండంగా(continuous) ఉంటాయని దుర్‌ఖైమ్ అభిప్రాయం. కొన్ని వాస్తవాంశాలు నిర్మితీయమైనవి(sturctural) లేదా స్వరూప సంబంధమైన(morphological) దృగ్విషయాలు. వాస్తవాంశాలు సామూహిక జీవితంలో అంతర్భాంగా ఉంటాయి. అంటే సమాజంలోని వివిధ భాగాలు, ఆ భాగాల స్వభావం, స్వరూప సంబంధమైన అంశాలు, వాటి అమరిక, వి ఎలా ఒకదానితో ఒకటి కలిసి ఉన్నాయో తెలియజేసేవే సామాజిక వాస్తవాంశాలు. ఈ రకమైన సామాజిక వాస్తవాంశాలలో జనాభా పంపిణీ, నివాస స్వరూపం, కమ్యూనికేషన్ వ్యవస్థ స్వభావం మొదలైనవి చేరి ఉంటాయి.

2. సంస్థాగత రూపంలో సామాజిక వాస్తవాంశాలు అనేవి మరొక రకం. ఇవి సాధారణంగా సామాజికులందరికీ వర్తించేవి, సమాజమంతటా వ్యాపించి ఉండేవి. సమాజం తాలూకు సామూహిక లక్షణాన్ని ఇవి తెలియజేస్తాయి. ఈ కోవకు చెందిన వాస్తవాంశాలు, చట్టపరమైన, నైతిక నియమాలు, మతవిశ్వాసాలు, నిర్ధారితమైన విశ్వాసాలు, సమాజంలో అమలులోఉన్న ఆచార వ్యవహారాలు.

3. సంస్థాపరంకాని సామాజిక వాస్తవాంశాలు మరో రకమైన వాస్తవాంశాలు. నిర్దిష్టరూపం దాల్చని సామాజిక వాస్తవాంశాలు. ఇవి సంస్థాపరమైన సామాజిక ప్రమాణాలకు అతీతమైనవి. ఇలాంటి వాటిని సామాజిక ధోరణులు అని దుర్‌ఖైమ్ అంటాడు. ఇలాంటి వాటికి ఉదాహరణలు ఒక ప్రత్యేక పరిస్థితులలో ప్రజలకు కలిగే అభిప్రాయాలు, జనసమూహంలో ఏర్పడే ఉత్సాహం, జనసమూహంలో పెల్లుబికే ఉద్వేగం, కొన్ని సంఘటనల వల్ల కలిగే అవమానం, దయ లాంటి భావాలు. ఈ రకమైన సామాజిక వాస్తవాంశాలకు అఖండత ప్రధాన లక్షణంగా ఉంటుంది. ఇవి ఒక సమాజంలో ఉండే సాంఘిక వాతావరణాన్ని సూచిస్తాయి.

పైన పేర్కొన్న మూడు రకాల సామాజిక వాస్తవాంశాలతోపాటు దుర్‌ఖైమ్ సామాన్య, సామరస్యపూరిత వాస్తవాంశాలను గురించి కూడా ప్రస్తావించాడు. ఒక సమాజం పరిణామంలోని వివిధ దశలలో ఏర్పడే కొన్ని నిర్దిష్ట సామాజిక వాస్తవాంశాలనే సాధారణ సామాజిక వాస్తవాంశాలుగా దుర్‌ఖైమ్ గుర్తించాడు. వాటికి భిన్నమైనవన్నీ సమస్యాపూరిత వాస్తవాంశాలేనని దుర్‌ఖైమ్ అభిప్రాయం. ఉదాహరణకు ఎంతోకొంత నేరం అనేది ప్రతి సమాజంలోనూ కనిపిస్తుంది. కాబట్టి నేరం అనేది ఒక సాధారణ సామాజిక వాస్తవాంశం. అయితే నేరాల రేటు విపరీతంగా పెరిగినప్పుడు అదే సమస్యగా మారుతుంది.

## 3.4 దుర్‌ఖైమ్ ఉపయోగించిన పరిశోధనాపద్ధతి

 సామాజిక వాస్తవాంశాలను పాజిటివ్ సైన్స్ పద్ధతులద్వారా అధ్యయనం చేయవచ్చునని దుర్‌ఖైమ్ భావిస్తాడు. ఈ

BRAOU

పరిశోధనా పద్ధతులలోని మూడు దశలను కింది విధంగా పేర్కొన్నాడు. అవి: 1) పరిశీలన(observation), 2) సరిపోల్చడం(classification), 3. సాధరణీకరణ(comparision). ఈ మూడింటికి తోడు సమాజశాస్త్ర అధ్యయనానికి అనువైన అదనపు నియమాలను కూడా ఇతడు సూచించాడు.

### 3.4.1 సామాజిక వాస్తవాంశాలను పరిశీలించడంలో నియమాలు

సామాజిక వాస్తవాంశాలను యధార్థవిషయాలుగా పరిగణించాలి. ఇవి వాస్తవాలే. అయితే సామాజిక వాస్తవాంశాలను యధార్థాలుగా పరిగణించక వాటిపై ప్రత్యక్ష దృష్టిని నిలుపక, ప్రత్యేకంగా అధ్యయనం చేయక కొందరు రచయితలు వాటి భావనల దృష్టితోనే పరిశీలించారు. సామాజిక వాస్తవాంశాలను వస్తునిష్ఠంగా పరిశీలించడానికి వీలవుతుంది. కారణం అవి: 1. నిర్దిష్ట లక్షణాలున్న, మానవ పరిశీలనకు అనువైనవి కావడం, 2. వ్యక్తుల ప్రమేయం లేకుండానే అవి మనగలుగుతాయి, 3. బయటి నుంచి పరిశీలించడానికి వీలయ్యేవే కానీ అంతర్దృష్టికి గోచరించేవికావు. అవి యధార్థాంశాలు కాబట్టి వాటిని ప్రత్యక్షంగా, అంతర్బుద్ధితో కాక అనుభవైక పద్ధతితో అధ్యయనం చేయవలసి ఉంటుంది. అంతేకాక వాటిని కేవలం వ్యక్తి ఇచ్ఛ ద్వారా మార్చడానికి వీలులేదు. మిగతా అన్ని నియమాలు ఉపనియమాలే(corollories).

ఎ) అన్ని పూర్వ భావాలను తొలగించాలి. సామాన్యుడి అభిప్రాయాల ప్రభావం నుంచి సమాజశాస్త్రజ్ఞులు బయటపడి పరిశీలనాంశాలపట్ల తటస్థవైఖరిని అనుసరించాలి.

బి) సామాజిక వాస్తవాంశాలకు సంబంధించి ముందుగానే వాటి స్వచ్ఛంద స్వభావాన్ని ఊహించకూడదు. ఈ సందర్భంలోనే సామాజిక వాస్తవాంశాలు వ్యక్తి ప్రయోజనాల దృష్ట్యానే తెలుసుకోవడం సాధ్యం కాదని పేర్కొన్నాడు. ఈ విధంగా అన్నంత మాత్రాన సామాజిక వాస్తవాంశాలు స్వచ్ఛందమైనవి కావని, లేదా వాటిలో ఈ లక్షణం ఉండదని కాదు. అంశాల పరిశీలన సమగ్రంగా, ఖచ్చితంగా ఉండటానికి వాటి స్వచ్ఛంద స్వభావాన్ని ముందుగానే ఊహించకూడదని దుర్ఖైమ్ అంటాడు.

సి) సామాజిక వాస్తవాంశాలను పరిశీలిస్తున్నప్పుడు సమాజశాస్త్రవేత్త ఆ అంశాల వివిధ రూపాలను కాక సమగ్ర అంశాలుగా పరిగణించి, పరిశీలించాలి. ఇలా చేసినప్పుడే సామాజిక వాస్తవాంశాల వస్తు నిష్ఠత సాధ్యమవుతుంది. ఈ నియమాలే సమాజంలో అందరు సభ్యులకు ప్రమాణాలుగా ఉపకరిస్తాయి. అవి న్యాయసూత్రాలు, నైతిక నియమాలు, సామెతలు, సామాజిక సంప్రదాయాల రూపంలో ఉంటాయి. సామాజిక జీవితాన్ని అవగాహన చేసుకోవడానికి శాస్త్రవేత్తకు తోడ్పడేవి ఇవే.

డి) సామాజిక వాస్తవాంశాల పరిశీలన, అధ్యయనాలు వీలైనంత నిర్దిష్టంగా ఉండాలి. అందుకే దుర్ఖైమ్ పరిశీలన పరిధిని, క్షేత్రాన్ని నిర్దిష్టంగా నిర్వచించవసిన అవసరాన్ని నొక్కి చెప్పాడు. ఇలా జరిగినప్పుడే వాస్తవాంశాలకు సంబంధించిన పరిజ్ఞానం పురోగామిగానూ, నిక్కచ్చిగానూ ఉంటుందని దుర్ఖైమ్ అంటాడు.

### 3.4.2 సాధారణ, సామాన్యపూరిత వాస్తవాంశాలను వేరుచేయడంలో నియమాలు

సామాజిక వాస్తవాంశాలను ఎలా పరిశీలించాలో, ఎలా వివరించాలో తెలుసుకున్న తరువాత నిర్దిష్ట సమాజాలలో వాటి సాధారణ లేదా, సామాన్య పూరిత లక్షణాలను నిర్ధారించడానికి ప్రయత్నించాలి. సామాజిక వాస్తవాంశాల వర్గీకరణకొన్ని నిష్పాక్షిక లక్షణాలపై ఆధారపడి ఉండాలి. సమాజం తీరు, దాని అభివృద్ధి దశ, సగటు సమాజంలో ఉన్న వాస్తవాల దృష్ట్యానే ఒక అంశాన్ని సాధారణ వాస్తవాంశంగా గుర్తించవచ్చు. సామాజిక దృగ్విషయాల సామాన్య లక్షణం ఎన్నుకొన్న సమాజం సామూహిక జీవన పరిస్థితులను బట్టి ఉంటుంది. అంటే సాధారణ సామాజిక వాస్తవాంశం ఆ సమాజంలో ఒక విధి నిర్వహిస్తుంది. అదే సమాజంలో అసాధారణ లేదా సమస్యాత్మకమైన సామాజిక వాస్తవాంశం ఆ సమాజానికి హానికరంగా ఉంటుంది.

ఒకానొక సమాజంలో దానికి ప్రయోజనకరంగా ఉండే సాధారణ అంశమే సామాజిక వాస్తవాంశం. దీనికి ఉదాహరణగా దుర్ఖైమ్ 'నేరం అనే వాస్తవాంశాన్ని పేర్కొన్నాడు. సాధారణంగా నేరాన్ని ఒక సమస్యగా పరిగణించడం



BRAOU

జరుగుతుంది. నేరాన్ని అనైతిక చర్యగా పరిగణించినప్పటికీ సామాజిక నియమాలకు వ్యతిరేకమైన ప్రవర్తన కావడం వల్ల శాస్త్రం దృష్ట్యా చూసినప్పుడు దానిని అసాధారణ అంశంగా పరిగణించడానికి వీలులేదు. దీనికి దుర్‌ఖైమ్ రెండు ప్రధానకారణాలను చూపాడు. అవి: 1) నేరమేనది ఒక నిర్దిష్టమైన సమాజంలోనే కాక అనేక సమాజాలలో కనిపించే సాధారణ లక్షణం, 2)సామాజిక ప్రమాణాలను అప్పుడప్పుడు అతిక్రమించి ప్రవర్తించకపోతే మానవ ప్రవర్తనలో ఏ మార్పు ఉండదు. అంతేకాక ఇలా జరగకపోతే ఆచరణలో ఉన్న ప్రమాణాలను మరింత బలపరచడానికి కానీ, వాటిని మార్చడానికి కానీ అవకాశాలుండవు.

### 3.4.3 సామాజిక వాస్తవాంశాల వివరణ: నియమాలు

సామాజిక వాస్తవాంశాలను వివరించడానికి రెండు పద్ధతులున్నాయని దుర్‌ఖైమ్ అంటాడు. అవి: 1. కారణభూతమైనవి, 2. ప్రకార్య సంబంధమైనవి. మొదటి పద్ధతి ఒక సామాజిక దృగ్విషయానికి సంబంధించిన 'ఎందుకు' అనే ప్రశ్న తాలూకుది. ప్రకార్య సంబంధమైన పద్ధతి సామాజికుల సాధారణ అవసరాలకు, ఒకానొక సామాజిక వాస్తవాంశానికి మధ్య ఉన్న సంబంధాన్ని తెలియజేస్తుంది. ఈ సందర్భంలో దుర్‌ఖైమ్ ఇంకా ఇలా అంటాడు.

ఎ) ఒక సామాజిక దృగ్విషయాన్ని వివరించేటప్పుడు మనం ఆ సామాజిక దృగ్విషయానికిగల బలమైన కారణాన్ని, అది నిర్వహించే విధిని గురించి విడివిడిగా అధ్యయనం చేయాలి.

బి) ఒక సామాజిక వాస్తవానికి గల కారణాన్ని వెదకడంలో ఇంతకుముందు జరిగిన సామాజిక వాస్తవాంశాలను పరిగణనలోకి తీసుకోవాలేకానీ వ్యక్తుల చైతన్య స్థితిని కాదు.

సి) సామాజిక ప్రయోజనం దృష్ట్యానే సామాజిక వాస్తవాంశాల ప్రకార్యాలను అర్థం చేసుకోవలసి ఉంటుంది.

డి) సామాజిక సమూహం లేదా సంఘటనలలోనే అన్ని ముఖ్యమైన సామాజిక ప్రక్రియల మూలాన్ని వెదకాలి.

3.4.4 సమాజాల వర్గీకరణలో నియమాలు

19వ శతాబ్దంలో ప్రముఖ సమాజశాస్త్రవేత్తలైన స్పెన్సర్, హాబ్‌హౌస్‌లు ప్రారంభించిన సంప్రదాయమార్గాన్ని అనుసరించే దుర్‌ఖైమ్ కూడా సమాజాల వర్గీకరణకు తులనాత్మక పద్ధతిని అనుసరించాడు. ఇతడు స్వయంగా సంఘీభావం ఆధారంగా సమాజాల వర్గీకరణ పద్ధతిని ప్రతిపాదించాడు. ఆ పద్ధతే యాంత్రిక సంఘీభావం, జైవిక సంఘీభావం.

## 3.5 సమాజంలో శ్రమవిభజన

1893లో దుర్‌ఖైమ్ ప్రచురించిన "The Study on Division of Labour in Society" అనే గ్రంథం అతడి డాక్టరేట్ పట్టాకోసం సమర్పించిన బృహత్ వ్యాసం. ఇదే అతని తొలి రచన కూడా. అయితే సమాజంలో శ్రమ విభజన పర్యవసానాలను గురించి ప్రస్తావించిన మొట్టమొదటి వ్యక్తి దుర్‌ఖైమ్ కాదు. సంప్రదాయ అర్థశాస్త్రవేత్తలైన ఆడమ్ స్మిత్, అతని అనుచరులు ఆర్థిక రంగంలో శ్రమ విభజన భావన ప్రాధాన్యాన్ని మొట్టమొదటిసారి వివరించడానికి ప్రయత్నించారు. సంక్లిష్టమైన కార్యకలాపాలను ప్రత్యేకీకరించిన చిన్న చిన్న కార్యక్రమాలుగా విభజించి ప్రక్రియలో పాల్గొనే వారందరికీ ఒక్కొక్క విధిని కేటాయించడం వల్ల సామర్థ్యం, ఉత్పాదకత పెరుగుతాయని సంప్రదాయ ఆర్థిక వేత్తలు సోదాహరణంగా వివరించారు.

అయితే దుర్‌ఖైమ్ సంప్రదాయ ఆర్థిక వేత్తలు ప్రతిపాదించిన శ్రమ విభజన తాలూకు వివరణను మరీ సంకుచితమైందిగానూ, కేవలం అర్థిక దృష్ట్యా చేసిందిగాను భావించి తిరస్కరించాడు. అతడి దృష్టిలో శ్రమ విభజన సమాజానికంతటికీ వర్తించే ఒక మౌలికమైన, సమగ్రమైన అంశమని, యావత్ సమాజం దాని ప్రభావానికి

BRAOU

లోనవుతుందని నొక్కి చెప్పాడు. నిజానికి ఆర్థిక వ్యవస్థలోని ప్రత్యేకీకరణకూడా సమాజంలోని సాధరణ విభేదీకరణ ఫలితమేనని దుర్ఖైమ్ వాదించాడు. సమాజంలో సాధారణ విభేదీకరణలేకుంటే శ్రామికులు ప్రత్యేక నైపుణ్యాలను అలవరుచుకొనే వీలుండేదికాదు అనేది దుర్ఖైమ్ ముఖ్యమైన ప్రతిపాదన.

సమాజంలోని వివిధ సభ్యుల మధ్య సంఘీభావమే సమాజ సమైక్యతను చేకూరుస్తుంది. ఒకటిగా ఉంచగలుగుతుంది. దుర్ఖైమ్ సమాజంలోని శ్రమ విభజనకు సంఘీభావం ఏర్పడటానికి ఉన్న సంబంధాన్ని పరిశోధించడానికి ప్రయత్నించాడు.

సమాజంలోని శ్రమ విభజనను విపులంగా చర్చించేముందు దుర్ఖైమ్ ప్రతిపాదించిన 'సమష్టి వివేకం' అనే భావనను అర్థం చేసుకోవడం ముఖ్యం.

### 3.5.1 సమష్టి వివేకం

దుర్ఖైమ్ తన "The Study of Division of Labour in Society" అనే గ్రంథంలో సమష్టి వివేకభావనను ఈ విధంగా నిర్వచించాడు. 'ఒకానొక సమాజంలోని సగటు సభ్యుల విశ్వాసాలు, మానసిక భావనల సమగ్ర రూపమే సమష్టి వివేకం. వీటి వల్లనే ఒక నిర్దిష్ట వ్యవస్థ ఏర్పడుతుంది.

విశ్వాసాలు, మానసిక భావనలు అనేవి నైతికమైనవి, సంజ్ఞానాత్మకమైనవి అయి ఉంటాయి. ఇవి సామాజికుల ప్రవర్తనను క్రమబద్ధం చేయడంలోను, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలోనూ తోడ్పడుతాయి. సమష్టి వివేకం అనేది సమాజమంతటా వ్యాపించి ఉంటుంది. దీనికి కొన్ని విశిష్ట లక్షణాలుండడం వల్ల అది స్పష్టమైన యధార్థంగా భాసిస్తుంది. ఇది సమాజం మొత్తం చిన్న, పెద్ద సముదాయాలలో వ్యాపించి ఉంటుంది. అంతేకాక అది అన్ని వృత్తులకు సమానంగా వర్తిస్తుంది., తరతరాలను అనుసంధానం చేస్తుంది. సమాజంలోని సభ్యుల రాకపోకలతో నిమిత్తం లేకుండా అనంతంగా సాగుతుంది. సమష్టి వివేకాన్ని వ్యక్తుల ద్వారానే సాధించడానికి వీలైనప్పటికీ ఏ ఒక్క వ్యక్తిపైనా ఇది ఆధారపడక, వ్యక్తులకు అతీతంగా పనిచేస్తుంది.

BRAOU

### 3.5.2 రెండు రకాల సంఘీభావం

దుర్ఖైమ్ సమాజాలను రెండు ప్రధాన తరగతులుగా విభజించాడు. అవి: 1. వయస్సు, లింగం అనే ఆపాదిత గుణాల ఆధారంగా ఏర్పడిన చిన్న, సాధారణ సమాజాలు. ఇలాంటి సమాజాలలో అన్ని పనులను అందరు వ్యక్తులు ఏవిధమైన ప్రత్యేకీకరణ లేకుండానే నిర్వహించగలుగుతారు. వ్యక్తులందరూ అన్ని పనులను సమానంగా చేస్తుండడం వల్ల వారి మధ్య సాన్నిహిత్యం, ఏకతాభావం నెలకొని ఉంటాయి. ఈ విధమైన ఏకతాభావం వల్ల ఇలాంటి సమాజాలలో సంఘీభావం సాధ్యమవుతుంది. ఈ రకమైన సంఘీభావాన్నే దుర్ఖైమ్ యాంత్రిక సంఘీభావమన్నాడు. కారణం, సదృశ్యమైన భాగాలు కలసి మెలసి ఉండడం వల్లనే ఈ రకమైన సంఘీభావం సాధ్యమవుతుంది. ఇలాంటి సమాజాలలో శ్రమ విభజన స్వల్పాతిస్వల్పంగా ఉంటుంది. 2. భారీ పారిశ్రామిక సమాజాలు. ఈ సమాజాలలో వ్యక్తులు నిర్వహించే బాధ్యతలు భిన్న రీతులలో ఉంటాయి. అందువల్లనే సమాజంలోని అన్ని భాగాలు స్పష్టంగా పరస్పరం భిన్నంగా కనిపిస్తాయి. ప్రతి భాగం ప్రత్యేకమైన, పాక్షిక స్వభావంతో ఉండడం వల్ల అవి పరస్పరం స్వతంత్రంగా ఉంటాయి. ఇలాంటి సమాజాలలోని సంఘీభావాన్ని దుర్ఖైమ్ జైవిక సంఘీభావం అన్నాడు. అసదృశ్యభాగాల మధ్య పరస్పర జైవిక ఆధారత ఉండడం వల్లనే ఈ విధమైన సంఘీభావం జైవిక సంఘీభావం అని దుర్ఖైమ్ అన్నాడు. ఇలాంటి సమాజాలలో (పారిశ్రామిక సమాజాలలో)ని శ్రమవిభజన అత్యున్నతస్థాయిలో ఉంటుంది.

యాంత్రిక సంఘీభావం ఆధారంగా ఏర్పడిన సమాజాలు అంశిక స్వభావం కలవి. ఈ సమాజాలలో వివిధ అంశాల మధ్య పరస్పర ఆధారిత కనిపించదు. ఇలాంటి సమాజాలలో అల్పజనాభా ఉండటం, భౌతిక, నైతిక సాంద్రత అల్పస్థాయిలో ఉండటం కనిపిస్తుంది. ఇటువంటి సమాజాలలో సమష్టి వివేకం సర్వవ్యాప్తమై ఉంటూ అందరు సభ్యుల వ్యక్తిగత వివేకాన్ని కూడా మరుగుపరిచేంత శక్తిమంతంగా ఉంటుంది. అంతేకాక ఏదివైయుక్తికమో,

ఏది సమష్టి వివేకమో స్పష్టంగా తెలుసుకోలేనంతగా రెండు మిళితమై ఉంటాయి. సమష్టి వివేకంలోని ప్రధానాంశం మతపరమైంది. దానికి కారణం మతం అనేది సామాజిక జీవితమంతటా వ్యాపించి ఉండే ఒక శక్తిమంతమైన ప్రభావం. సమష్టి వివేకం నిర్దిష్ట రూపంలో ఉంటూ స్థానిక పరిస్థితులు, నరవర్గం, వాతావరణ ప్రత్యేక లక్షణాలతో ముడిపడి ఉంటుంది. ఉదాహరణకు ఒక మృగం, ఒక వృక్షం, లేదా ఒక ప్రకృతి శక్తి మొదలైన వాటితో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండేదే సమష్టి వివేకం.

యాంత్రిక సంఘీభావం గల వ్యవస్థలో న్యాయసూత్రాలు, చట్టాలు అణచివేత, శిక్షా ప్రధాన లక్షణాలు కలిగి ఉంటాయి. నేరస్తులను బాధించడం, నేరం మరో మారు జరగకుండా అణచివేయడమే ప్రదాన లక్ష్యంగా ఉంటుంది. సమష్టి వివేకానికి విఘాతం కలిగించే ప్రవర్తనను నేరంగా దుర్‌ఖైమ్ భావించాడు. అంటే సమష్టి వివేకాన్ని ఎదిరించే ఏ చర్య అయినా నేరమే. అందువల్ల దానిని అణిచివేయడానికి ప్రయత్నించడం జరుగుతుంది. 'ఒక చర్య సమష్టి వివేకానికి విఘాతం కలిగించడం వల్ల నేరంగా పరిగణించబడుతుందేకానీ, నేరం జరిగినందువల్ల సమష్టి వివేకానికి విఘాతం కలగదు. ఒక చర్య నేరమైనందువల్ల నిందార్హం కాదు. అచర్య నిందార్హం కావడం వల్ల దానిని నేరంగా పరిగణించడం జరుగుతుందని' దుర్‌ఖైమ్ వివరించాడు.

జనాభా పరిమాణం పెరిగిన కొద్దీ భౌతిక, నైతిక సాంద్రతలు పెరుగుతాయి. అయితే జనాభా పరిమాణం, సాంద్రత పెరిగినందువల్ల ఉత్పన్నమయ్యే అవసరాలను శ్రమవిభజన ద్వారా శాంతియుత మార్గంలో తీర్చుకోవచ్చునని దుర్‌ఖైమ్ భావించాడు. ఇట్లా అధికమైన శ్రమ విభజన జైవిక సంఘీభావానికి దారితీస్తుంది. అయితే జైవిక సంఘీభావం పెరుగుదలతో సమష్టి వివేకం అనేది తగ్గుముఖం పడుతుంది. సమాజంలో శ్రమ విభజన ప్రత్యేకీకరణగా మారిన కొద్దీ సమష్టి వివేకం పాత్ర తగ్గుతూ వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో వ్యక్తులు స్వతంత్రులుగా మారడం, వారి పరస్పర ఆధారతను గుర్తించడం చేస్తారు. ఇలా తాము ఒకరిపై ఒకరు ఆధారపడడం అనే భావనే సమాజంలో సంఘీభావానికి తోడ్పడుతుందని దుర్‌ఖైమ్ అంటాడు. న్యాయసూత్రాలు, చట్టాలు కూడా శిక్షా ప్రధానంగా కాకుండా ప్రత్యర్పణ ప్రధానంగా మారుతాయి. అణచివేత నియమాల మాదిరిగా నేరానికి శిక్ష విధించడం, బాధ కలిగించడం కాక నష్టపరిహార నియమాలు యథాస్థితిని ఏర్పరచడానికి ప్రయత్నిస్తాయి. అంతేకాక ఈవిధమైన నియమాల పాలనకు వివిధ రకాల సంస్థలు, ట్రిబ్యునల్లు, కౌన్సిళ్లు, అధికారులు వంటివి అనేకం ఉంటాయి.

శ్రమ విభజనకు సంబంధించి దుర్‌ఖైమ్ రచనలు చూపిన బాటలోనే -Sociology of Occupations and Professions ఎల్టన్ మేయో, హెరాల్డ్ విలెన్స్కీ, ఎవరెట్ హ్యూగ్‌లు కూడా రచనలు సాగించారు.

## 3.6 ఆత్మహత్య

1897లో దుర్‌ఖైమ్ ప్రచురించిన మూడవ గ్రంథం"Suicide" సమష్టి వివేకం తాలూకు సామాజిక పరిమితులకు సంబంధించిన సైద్ధాంతిక గ్రంథం. ఈ గ్రంథం భావనాపరమైన అతంశాలను, అనుభవైక పరిశోధనా పద్ధతులను మేళవించి రూపొందించిన గ్రంథంగా పేరొందింది. ఇది ఈ దిశలోని ఒకానొక ప్రముఖ మైలురాయి. దుర్‌ఖైమ్ ఆత్మహత్యను విశ్లేషించడంలో గణాంక వివరాలను విస్తృతంగా ఉపయోగించాడు. గణాంక విశ్లేషణను ప్రధానంగా రెండు కారణాలవల్ల ఉపయోగించడం జరిగింది. అవి: 1. మనోవిజ్ఞానం, జీవశాస్త్రం, జన్యుశాస్త్రం, వాతావరణ భౌగోళిక శాస్త్రాంశాలపై ఆధారపడిన సిద్ధాంతాలను తిరస్కరించడం, 2. ఆత్మహత్యకు సామాజిక వివరణ ఇచ్చే క్రమంలో అనుభవిక సాక్ష్యాధారాలకు మద్దతు ఇవ్వడం.

ఆత్మహత్యలను సమాజేతర అంశాల ఆధారంగా వివరించే సిద్ధాంతాలను తిరస్కరించడానికి కూడా గణాంక విశ్లేషణను విస్తృతంగా ఉపయోగించాడు. సేకరించిన గణాంక వివరాల విశ్లేషణల ఆధారంగా సమాజేతర అంశాలకు, ఆత్మహత్యలకు ఏదైనా సహసంబంధం ఉందేమో తెలుసుకోవడానికి దుర్‌ఖైమ్ గణాంకవిశ్లేషణను వాడుకొన్నాడు. ఉదాహరణకు ఉన్మాదం ఆత్మహత్యల రేటుకు, వాతావరణంలోని మార్పులకు ఆత్మహత్యల రేటుకు అనుకరణకు ఆత్మహత్యల రేటుకు ఉన్న సంబంధాన్ని పరీక్షించడానికి దత్తాంశ విశ్లేషణ చేశాడు. దుర్‌ఖైమ్ పరిశీలించిన పై అంశాల



BRAOU

మధ్య ఏ విధమైన సానుకూల సహసంబంధం(possitive co relation) లేదని, రుజువైనందువల్ల సమాజేతర కారణాల ఆధారంగా ఏర్పడిన సిద్ధాంతాలను తిరస్కరించాడు.

ఆత్మహత్యలకు మానసిక అంశాలను కారణంగా దుర్‌ఖైమ్ తిరస్కరించకపోయినా మానసిక పూర్వాభిమానాలు, సామాజిక నిర్ధారణ వంటి వాటి మధ్య విభేదాన్ని స్పష్టంగా వివరించాడు. జాతి, జాతీయతలతో నిమిత్తం లేకుండా కాథలిక్ మతం వారిలో, ప్రొటెస్టెంట్ మతం వారికంటే ఆత్మహత్యల నిష్పత్తి బేధం చాలా స్వల్పమని దుర్‌ఖైమ్ వివరించాడు. ఈ రెండు మతాలు ఆత్మహత్యలను గర్హించినా కాథలిక్ మతం తన సభ్యులను మరింత సమైక్య పరచింది కాబట్టే ఆమత అనుయాయులలో ఆత్మహత్యల రేటు చాలా తక్కువ. ఇందుకు భిన్నంగా ప్రొటెస్టెంట్ శాఖ స్వేచ్ఛాపరిశీలనను వ్యక్తిస్వేచ్ఛను ప్రోత్సహిస్తుంది. ఆ వ్యవస్థలో క్రమానుగతశ్రేణిఉండకపోవడం, అందరికీ సమానమైన నమ్మకాలు, ఆచారాలు లోపించడం వల్లనే ఆత్మహత్యల రేటు అధికంగా ఉంటుందని దుర్‌ఖైమ్ ప్రతిపాదించాడు. కాథలిజమ్ దీనికి భిన్నమైన మత వ్యవస్థ. ఇది ఒక ఆదర్శప్రాయమైన మతం అని, నిరభ్యంతరంగా అందరి ఆమోదం పొందటమే కాక ఈ వ్యవస్థలో క్రమానుగత శ్రేణి ఉంటుంది. ఆచార వ్యవహారాలలో ఏవిధమైనభిన్నత్వానికి తావుండదు. అంటే సుసంఘటితమైన వ్యవస్థ కాదు కాబట్టి ప్రొటెస్టెంట్లలో ఆత్మహత్యల రేటు కేథలిక్కులలోకంటే అధికంగా ఉంటుందన్నమాట. మతం మాదిరిగానే కుటుంబ వ్యవస్థకూడా ఆత్మహత్యలను వ్యతిరేకించే ఒక శక్తిమంతమైన సాధనం. అవివాహస్థితి ఆత్మహత్యల రేటు పెరగడానికి దోహదం చేస్తే వివాహ వ్యవస్థ వల్ల ఆత్మహత్యల రేటు సగానికి సగం పడిపోతుందని దుర్‌ఖైమ్ భావించాడు. ఇలా ఆత్మహత్యల రేటును తగ్గించే మరో అంశం కుటుంబ పరిమాణం. కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగిన కొద్దీ ఆత్మహత్యల రేటు తగ్గుతుంది.

దుర్‌ఖైమ్ అనువంశికత, శీతోష్ణస్థితి, జాతి లక్షణాలు అనుకరణ వంటి సమాజానికి అతీతమైన వాటిని ఆత్మహత్య కారకాలుగా తిరస్కరించాడు. నిజానికి వైయక్తిక దృగ్విషయం మాదిరికనిపించే ఆత్మహత్యకు సమాజపరమైన వివరణ ఇచ్చే వీలుందంటాడు. సమాజ నిర్మితి, అది నిర్వహించే వివిధ ప్రకార్యాల కారణంగా ఆత్మహత్యలు సంభవించడమేకాక వాటికి అనువైన పరిస్థితులను కల్పించడం, ఆత్మహత్యల రేటు పెచ్చుపెరగడానికి కూడా కారణమవుతుందని దుర్‌ఖైమ్ వివరించాడు. ఆత్మహత్య అనేది ఒక సంఘటితమైన, ఖచ్చితమైన యధార్థమనే విషయంపైనే దుర్‌ఖైమ్ చర్చంతా ఆధారపడి ఉంటుంది. అతని అభిప్రాయంలో ప్రతీ సమాజంలోనూ దాని అస్థిత్వానికి అనువైన మౌలిక పరిస్థితులున్నంతవరకు ఆత్మహత్యలపట్ల ఉమ్మడి అభిప్రాయం ఒకటి ఉంటుంది. ఆ సమాజంలో ఆత్మహత్యల రేటు కూడా స్థిరంగా ఉంటుంది.

BRAOU

### 3.6.1 ఆత్మహత్యలలో రకాలు

అనేక సమాజాలు, సంస్కృతుల నుంచి సేకరించిన దత్తాంశ విశ్లేషణల ఆధారంగా దుర్‌ఖైమ్ ఆత్మహత్యలను మూడు రకాలుగా గుర్తించాడు. అవి: 1. అహంభావంతో కూడిన ఆత్మహత్యలు(egoistic suicide), 2. పరుల క్షేమేచ్ఛతో కూడిన ఆత్మహత్యలు(altruistic suicide), 3. అనియతికారణంగా ఆత్మహత్యలు(anomic suicide), ఈ మూడు రకాల ఆత్మహత్యలను గురించి క్లుప్తంగా ఇక్కడ చర్చించడం జరిగింది.

### 1.అహంభావంతో కూడిన ఆత్మహత్యలు

ఒక వ్యక్తి తన సామాజిక సమూహంతో సమైక్యం కానప్పుడు ఇటువంటి ఆత్మహత్య సంభవిస్తుంది. వ్యక్తులు సమాజంలో సమైక్యం కావడంలో ముఖ్యంగా మతం, కుటుంబం, రాజకీయ, జాతీయ సముదాయాలలో తరతమ బేధాలుంటాయని, వ్యక్తులకు బతుకు భారం తగ్గించుకోవడానికి ఆత్మహత్యే మార్గాంతరమని అభిప్రాయం కలగడానికి సమైక్యతాస్థాయే కారణమని దుర్‌ఖైమ్ అభిప్రాయం. పైన పేర్కొన్న వాటితో సమైక్యత అధికమైన కొద్దీ ఆత్మహత్యల రేటు తగ్గుతుందని ఇతని వాదం. కుటుంబం పరిమాణం పెద్దదైన కొద్దీ సమైక్యత అధికంగా ఉంటుంది. అదే ఆత్మహత్యల విషయంలో రక్షణ కవచంగా పనిచేస్తుంది. రాజకీయ ఉత్పాతాలు అనేక ఆత్మహత్యలకు దారితీస్తాయనే సామాన్య అభిప్రాయాన్ని దుర్‌ఖైమ్ అంగీకరించకపోగా సామాజిక అలజడులు, యుద్ధాల వంటివి సమష్టి భావనను ప్రేరేపించడమేకాక దేశభక్తిని, జాతీయతాభావాన్ని కలిగిస్తాయి, ప్రజలు తమ మధ్య ఉన్నతరతమ భేదాలను విస్మరించి ప్రమాదాలు అడ్డుకొనేట్లు చేస్తాయి. ఇలా చేయడమే కాక పైన పేర్కొన్న విపరీత పరిస్థితులు

వ్యక్తులు సమాజాల మధ్య సమైక్యత నెలకొల్పడానికి, ఆత్మహత్యల రేటును గణనీయంగా తగ్గించడానికి తోడ్పడతాయి.

### 2. పరులక్షేమేచ్ఛతో కూడిన ఆత్మహత్య

ఒక వ్యక్తి తన సామాజిక సమూహంతో సమైక్యత చెందడంలో మోతాదు మించినప్పుడు ఇటువంటి ఆత్మహత్యలు సంభవిస్తాయి. వ్యక్తి జీవితం పూర్తిగా అచార వ్యవహారాలు, అలవాట్ల ఆధీనంలో ఉన్నప్పుడు, ఉన్నత ఆదేశాలకోసం తన ప్రాణాన్నే తీసుకుంటాడు. ఇందుకు ఉదాహరణలుగా భారతదేశంలో కనిపించే 'సతి' ఆచారం, వృద్ధాప్యంలో డేనిష్ యోధులు తమ ప్రాణాలను త్యజించడం. సహజమరణాన్ని తప్పించుకోవడానికి ఎత్తైన ప్రదేశాలనుంచి దూకి ప్రాణాలు కోల్పోయే గోత్‌ల(goths)ను చెప్పవచ్చు. ఇలాంటివేకాక కన్ని ఐచ్ఛికమైన ఆత్మహత్యల రకాలు కూడా ఉన్నాయి. అలాంటి వాటిలో ఆత్మార్పణ(self sacrifice) లేదా ఆత్మ పరిత్యాగం(self remensiation) వంటివి ఉదాత్తమైన, హర్షించదగ్గ చర్యలుగా దుర్‌ఖైమ్ పేర్కొంటాడు. ఇలాంటి వాటికి ఉదాహరణలుగా జపాన్ దేశస్థులలో కనిపించే హరాకిరి, భిక్షువులలో కనిపించే ఆత్మాహుతి, ఆత్మాహుతి దళాలు, ఇవన్నింటిని చెప్పవచ్చు.

దుర్‌ఖైమ్ తన నిర్ధారణను సైనికులలో కనిపించే ఆత్మహత్యల విశ్లేషణ బలపరిచిందని భావించాడు. సైన్యం ఎదుర్కొనే కఠినమైన జీవితం, క్రమశిక్షణ, స్వేచ్ఛారాహిత్యం వంటివి వారిలో ఆత్మహత్యలకు దారితీస్తాయన్న సాధారణ అభిప్రాయాన్ని తిరస్కరించాడు. ఒక మామూలు సిపాయితో పోలిస్తే అధికార వర్గాల వారికి సైన్యంలో జీవితం అంత కఠినంగా ఉండదు. అయితే అధికారులలోనే సిపాయిలలో కంటే ఆత్మహత్యలు అధికంగా కనిపిస్తాయి. అలాగే బలవంతంగా సైన్యంలో చేరినవారికంటే స్వచ్ఛందంగా సైన్యంలో చేరినవారు, సైన్యంలోకి పునః ప్రవేశించిన వారిలోనే ఆత్మహత్యల రేటు అధికంగా ఉంటుందంటాడు దుర్‌ఖైమ్. అంటే పరుల క్షేమేచ్ఛతో కూడి ఆత్మహత్యలకు ఆమోదం ఉన్న సమూహంలో వ్యక్తి ఒక గొప్ప ఆశయం కోసం ఆదర్శం కోసం విలువ కోసం తన ప్రాణాన్నైనా తీసుకుంటాడన్నమాట.

### 3. అనియతి కారణంగా ఆత్మహత్య

సమాజంలో ప్రమాణాలు, కట్టుబాట్లు లేని పక్షంలో ఇటువంటి ఆత్మహత్యలు కనిపిస్తాయి. పారిశ్రామిక, ఆర్థిక సంక్షోభాలు నెలకొన్న సమయంలో అనియతి కారణంగా ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఇవి దారిద్ర్యానికి కారణాలు అయినందువల్ల ఇలా జరుగదు. ఎందుకంటే దారిద్ర్యం ఎన్ని సమస్యలు సృష్టించగలదో సౌభాగ్యం కూడా అన్నింటినే సృష్టించగలదు. హఠాత్ సౌభాగ్యంవల్ల కానీ, దౌర్భాగ్యంవల్లకానీ ఏర్పడిన సామాజిక అలజడి నియమరాహిత్యానికి దారితీయడమేకాక స్వచ్ఛంద మరణానికి వ్యక్తులను ప్రేరేపిస్తాయి.

ఇలాంటి అనియతికారణంగా సంభవించే ఆత్మహత్యలు పరిమితమైన ఆంక్షలు, నియంత్రణ శక్తులు విఫలం కావడంవల్ల ఏర్పడతాయి.చరిత్ర ఆదినుంచీ మానవుడి ఆకాంక్షలు పెరుగుతూనే వస్తున్నాయి. మానవుడి జైవిక నిర్మితిలోకానీ, మానసిక వ్యవస్థలోగానీ పెరుగుతున్న ఆకాంక్షలకు పగ్గం వేసే ఏ యంత్రాంగమూ లేదు. సామజిక కోరికలను నైతిక శక్తిద్వారానే అదుపుచేయవచ్చు. అందుకే సంఘటితశక్తి ఒక్కటే సామాజికుల సామాజిక, నైతిక అవసరాలను సమర్థవంతంగా అదుపుచేయగలదు. అయితే అప్పుడప్పుడు ఈ నియంత్రణా యంత్రాంగం పనిచేయనప్పుడు ప్రమాణాలు నశించి అనియతి నెలకొంటుంది.

## 3.7 మతసంబంధమైన సమాజశాస్త్రం

1912లో దుర్‌ఖైమ్ తన చివరి రచన "The Elementary Forms of Religious Life"ను వెలువరించాడు. ఈ గ్రంథంలో గోత్రవ్యవస్థను(clan system), ఆస్ట్రేలియాకు చెందిన అరుంటా ఆదిమతెగలోని టొటెమ్ మతాన్ని గురించి వివరించాడు. ఈ అధ్యయనం ఆధారంగానే దుర్‌ఖైమ్ మతానికి సంబంధించి ఒక సాధారణ సిద్ధాంతాన్ని రూపొందించాడు.



BRAOU

మతాన్ని అతీతశక్తుల మాయజాలంగా నిర్వచించకూడదని దుర్ఖైమ్ పేర్కొన్నాడు. అంతేగాక పారలౌకికదైవం(transcendental god) పట్ల విశ్వాసముకాదు. ఎందుకంటే బౌద్ధము, కన్ఫ్యూషియనిజమ్(confucianism) వంటి మతాల్లో అసలు దైవమనే భావనే లేదు. అంతేకాక ఆత్మలు, అతీతశక్తులపై ఆధారపడితే మతం ఒక భ్రమగానే మిగిలిపోతుంది. చరిత్ర మొత్తం మానవులు విశ్వాసంపై ఆధారపడి రూపుదిద్దుకొన్న ఉమ్మడి సామాజికయధార్థతనే ఆరాధించారని దుర్ఖైమ్ తన సిద్ధాంతంలో పేర్కొన్నాడు. ఆ విషయంపైనే అతని సిద్ధాంతం ప్రధానంగా ఆధారపడి ఉంది.

### 3.7.1 పవిత్రం, అపవిత్రం

అసలు ప్రపంచమంతటినీ మతం రెండు దృగ్విషయాలుగా విభజిస్తుందని, ఇలా విభజించడమే మత సారాంశమని దుర్ఖైమ్ భావించాడు. అవి: 1. పవిత్రం(sacred), 2. అపవితత్రం(profane). సమాజంలో ప్రత్యేకంగా మతపరమైన గౌరవాన్ని పొందే వస్తువులు, వ్యక్తులు, విశ్వాసాలు, కర్మకాండ, దేవతాశక్తులను పవిత్రమైనవిగా పరిగణించడం జరుగుతుంది. మతపరమైన కర్మకాండలలో పాల్గొనడం ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఇస్తుంది. ఇదే మతానికి సంబంధించిన పవిత్ర కర్మకాండ, ఒకానొక సామాజిక ప్రకార్యం కూడా పవిత్రమైనది అత్యంత ఉత్కృష్టమైనది. దీనిని పవిత్రమైనదిగా స్పృశించడానికి కూడా వీలులేదు. అలా జరిగితే అది దండనార్హం అవుతుంది. అపవిత్రమైనది దీనికి భిన్నంగా ఉంటుంది.

పవిత్రం, అపవిత్రం అనే ద్వివిధత(duality) జీవితానుభవంలోని వైవిధ్యం వల్ల ఉత్పన్నమైనదే. చరాచరాల పట్ల ప్రజలకున్న దృక్పథం కారణంగానే పవిత్ర, అపవిత్ర భావాలు ఏర్పడతాయి. సమాజమే కొన్నింటిపై పవిత్రతా ముద్ర వేస్తుంది. వాటిపట్ల సామాజికులందరూ గౌరవ ప్రపత్తులను ప్రదర్శించవలసి ఉంటుందని ఆదేశిస్తుంది. ఉదాహరణకు గంగానదీజలాలను కోట్లాది హిందువులు పవిత్రంగా భావిస్తారు. కానీ వాస్తవానికి గంగానదీ జలాలు అపరిశుభ్రానికి మారుపేరు. అవి క్లోరిన్ వల్ల బాగా కలుషితమైనా భారతీయులలో ఈ పవిత్రతా భావం పెరుగుతోందేతప్ప తరగలేదు. అట్లాగే ఆయేతుల్లాఖొమైనీ అంగవస్త్రాన్ని అతి పవిత్రమైందిగా అతని అనుయాయులు భావిస్తారు. దీనికి కారణం ఆ వస్త్రంఅతనికి సంబంధించినది కాబట్టి. అంటే పవిత్రతా భావం అనేది సమాజం మొత్తం నిర్ధారించినదేనని స్పష్టమవుతోంది.

BRAOU

అలాగే దుర్ఖైమ్ పవిత్ర, అపవిత్రాల మధ్య తీవ్రమైన బేధమున్నదని పేర్కొన్నాడు. అపవిత్రమైనదానికి విరుద్ధంగా పవిత్రమైనది ఉపయోగితా యుక్తమైంది కాదని, అనుభవికమైంది కాదని, ఇందులో విజ్ఞానానికి కాక అధికారానికి మాత్రమే అవకాశమున్నదని దుర్ఖైమ్ భావించాడు. పవిత్రంగా భావించేది ఏదైనా అపారమైన శక్తిని ఇవ్వడమేకాక దానిని విశ్వసించేవారి గౌరవ ప్రవృత్తులను కోరుతుందికూడా.

### 3.7.2 మతం - నిర్వచనం

పవిత్రమైనవాటికి సంబంధించిన విశ్వాసాలు, ఆచరణల సంయుక్త వ్యవస్థే మతం. పవిత్రమైనవి అంటే ప్రత్యేకమైనవి, నిషిద్ధమైనవి. విశ్వాసాలు, ఆచరణల సంయుక్త వ్యవస్థ చర్చ్ అనే నైతిక సముదాయంగా రూపుదాలుస్తుంది. అని మతాన్ని దుర్ఖైమ్ నిర్వచించాడు. విశ్వాసాలు, ఆచరణలు ప్రజలందరినీ ఒక సామాజిక సముదాయంగా సంఘటితపరుస్తాయి. ఈ విధంగా ఈ రెండు అంశాలు సంఘటితం కావడం మత పురోగతికి అత్యావశ్యకం. మత విశ్వాసాల, ఆచరణల ప్రతీకలు. బాహ్య ప్రపంచానికి, వ్యక్తుల స్వభావానికి సంబంధించినవి కాక సమాజం అంతటికీ అన్వయించదగ్గ నైతిక వాస్తవాలు.

ఇంత వరకూ వివరించిన దానిని బట్టి దుర్ఖైమ్ మతానికిచ్చినది ప్రకార్యపర వివరణే అని అర్థం చేసుకోవాలి. మతం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాల గురించి తెలియజేయడానికి దుర్ఖైమ్ ప్రయత్నించాడు. మత విశ్వాసాలు, ఆచారాల పట్ల భక్తి ప్రపత్తులు నిజానికి పరోక్షంగా సమాజం పట్ల చూపే ఆరాధనే. మత పరమైన ఆరాధనలు, సేవలలో పాలుపంచుకోవడం వల్ల సమాజవిలువలు, ప్రమాణాల పట్ల గౌరవం పెరగుతుంది. దీని ఫలితంగా సమాజం సామాజిక నియంత్రణా శక్తిని పొందుతుంది. సార్వజనీనమైన విశ్వాసాలు కలిగి ఉండడం, ఆచరణలలో

## 3.11 చదవదగిన పుస్తకాలు


Aron, Raymand : Main Currents of Sociological Thought

Bierstedt, Robert : Emile Durkheim

Durkheir,E. : The Rules of Sociological Method

Durkheir,E. :The Division of Labour in Sociology

Durkheir,E. :Suicide

Durkheir,E. : The Elementory Forms of Religious Life

Lukes, Steven : Emile Durkheim: His Life and Work

Nisbert, R.A : The Sociology of Emile Durkheim


BRAOU

# భాగం-4: రాడ్క్లిఫ్ బ్రౌన్

విషయక్రమం

4.0 ఉద్దేశాలు

4.1 పరిచయం

4.2 జీవితవిశేషాలు

4.3 సామాజిక నిర్మాణం

4.3.1 సామాజిక నిర్మాణం- సామాజిక వ్యవస్థ

4.3.2 సామాజిక నిర్మాణం - నిర్మాణ రూపం

4.3.3 నిర్మాణం-నిర్మాణ నిర్వహణ

4.4 రాడిక్లిఫ్‌బ్రౌన్ విశ్లేషనణ

4.4.1 పరిహాసపూర్వక సంబంధాలు

4.4.2 టోటెమిజం

4.5 రాడిక్లిఫ్ బ్రౌన్ విమర్శ

4.6 సారాంశం

4.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

4.8 చదువదగిన పుస్తకాలు

BRAOU

## 4.0 ఉద్దేశాలు

ఈ పాఠ్యాంశం చదివిన తర్వాత మీరు

- రాడ్క్లిఫ్ బ్రౌన్ సామాజిక నిర్మాణానికి సంబంధించి భావనను వివరించగలుగుతారు.
- సామాజిక నిర్మాణం, సామాజిక వ్యవస్థల మధ్య సంబధాన్ని తెలుసుకుంటారు.
- సామాజిక నిర్మాణం, నిర్మాణ రూపం మధ్య బేధాలు వెల్లడించగలుగుతారు.
- రాడ్క్లిఫ్ బ్రౌన్ నిర్మాణ ప్రక్రియను విశ్లేషించగలుగుతారు.

## 4.1 పరిచయం

మానవ పరిణామశాస్త్రం, సామాజిక శాస్త్ర రంగాల్లో క్షేత్ర పరిశోధనను సైద్ధాంతికరీత్యా తీవ్రంగా ప్రభావితం చేసిన పరిశోధకుడు రాడ్క్లిఫ్ బ్రౌన్. ఈ విషయంలో అయనను మలినోవ్స్కీ సరసన చేర్చవచ్చు. సాధారణ సమాజాల గురించి పలు కొత్త విషయాలు వెలికి తీయడమే కాకుండా అధ్యయనానికి సంబంధించి పలు కొత్త పద్ధతులను ఆయన అందించారు. సమకాలీన బ్రిటిష్ సామాజిక మానవ (Social Anthropology) శాస్త్రంలో రాడ్క్లిఫ్ బ్రౌన్, మలినోవ్స్కీ ఇద్దరి ప్రభావమే అధికంగా ఉంది. ఆడమ్ కూపర్ మాటల్లో చెప్పాలంటే, మాలినోవ్స్కీ భిన్న సమాజాలలోని ఆచారాల వెనుక ఉన్న అసలు సిసలైన ప్రయోజనాల బాగా తెలిసినవాడు కావడంతో మానవ

### 4.3.3 నిర్మాణం-ప్రకార్యం

జీవశాస్త్రంలో ప్రకార్యమనే భావన చాలా ముఖ్యమైనది. ఒక జీవి ఆరోగ్యంగా ఉంటాలంటే ఆజీవి నిర్మాణంలో భాగమైన అవయవాలు, అంగాలు, నిర్దిష్టమైన విధుల్ని క్రమం తప్పకుండా నిర్వహించాలి. మొదటిసారిగా యిమామ్ డర్‌కిమ్ ఈ భావనను సామాజిక వ్యవస్థల అధ్యయనంలో ఉపయోగించారు. ప్రకార్యాన్ని వ్యక్తుల అవసరాల, ప్రాతిపదిక రీత్యా ఆయన వివరించాడు. రెడ్‌క్లిఫ్‌బ్రౌన్ 'అవసరాల'స్థానే 'మనుగడకు అవసరమైన షరతులు' అనే కొత్త భావాన్ని ప్రవేశపెట్టారు. మానవ సమాజాలు మనుగడ సాగించాలంటే కొన్ని మౌలిక పరిస్థితులకు లోబడి కొన్ని నిబంధనలను పూరించాల్సి ఉంటుంది. 'ఈ మౌలిక నిబంధనలనే ఆయన సమాజ ప్రకార్యాలుగా వర్ణించాడు. మామూలుగా గుర్తించలేనప్పటికీ శాస్త్రీయంగా పరిశీలిస్తే ప్రకార్యాలను కనిపెట్టవచ్చుననేది రాడ్‌క్లిఫ్‌బ్రౌన్ అభిప్రాయం. జీవశాస్త్రాన్ని సమాజానికి అన్వయింపజేసినవాడు రాడ్‌క్లిఫ్ బ్రౌన్. మనిషి శరీరంలోని వేరువేరు భాగాలు, నిర్వహించే ప్రకార్యమే మనిషి జీవించి ఉన్న విషయాన్ని వెల్లడిస్తాయి. ఒక జీవి నిర్మాణ ప్రకార్యమే దాని జీవితం ప్రకార్యం కొనసాగేవరకు ఆజీవి బతికి ఉన్నట్టు లెక్క. అవిధంగా అవిచ్ఛిన్నంగా సాగే సామాజిక ప్రకార్యమే సమాజ నిర్మాణానికి ఆలంభనగా నిలుస్తుంది. ఉదాహరణకు వివాహమనేది ఎప్పుడూ కొనసాగుతూ ఉండే సామాజిక కార్యక్రమం. వివాహం ద్వారా స్త్రీ, పురుషులు ఒకటైతారు. వారి మధ్య లైంగిక సంబంధానికి, సామాజిక ఆమోదం, చట్టబద్ధత లభిస్తాయి. పిల్లలు పుట్టడం వలన సమాజంలో కొత్త సభ్యుల సంఖ్య పెరుగుతుంది. సామాజిక ఆమోదం ఉన్న వివాహ పద్ధతి వలన, స్త్రీ, పురుష లైంగిక సంబంధాలు ఆరోగ్యకరంగా, చట్టబద్ధంగా ఉండడంతో పాటు సమాజానికి ఒకకొత్త సభ్యులు లభించుటకు ఒక మార్గము ఏర్పాటైనది. ఈ విధంగా సామాజిక నిర్మాణం కొనసాగడంలో వివాహం ఒక నిర్దిష్ట ప్రకార్యాన్ని నిర్వర్తిస్తున్నది. రాడ్‌క్లిఫ్ బ్రౌన్ దృష్టిలో ప్రకార్యమనే భావన నిర్మాణ భావనలో ఇమిడి ఉంది. నిర్మాణం అంటే సమాజంలోని వ్యక్తులు, వ్యవస్థాపనలు, తరగతుల మధ్యన వుండే సంబంధాల సమితి. నిర్మాణంలో భాగంగా ఉండే యూనిట్లు కార్యకలాపాలే నిర్మాణాన్ని సజీవంగా నిలుపుతాయి. జంతువుల విషయానికి వస్తే నిర్మాణం ప్రకార్యానికి కొంచెం భేదం ఉంటుంది. ఉదాహరణకు అస్థిపంజరాన్ని ఎముకల నిర్మాణం వాటి ఆకృతి, సైజు, వాటి అమరిక బట్టి అధ్యయనం చేయవచ్చు. ఇక్కడ ప్రకార్యాల అవసరమే లేదు. మానవ సమాజం విషయం అలా కాదు. నిర్మాణాన్ని, ప్రకార్యాన్ని వేరువేరుగా చూడలేము. సామాజిక వ్యవస్థలో నిర్మాణానికి, ప్రకార్యానికి విడదీయరాని సంబంధం ఉంది.

## 4.4 రాడ్‌క్లిఫ్ బ్రౌన్ నిర్మాణ, ప్రకార్యవాద విశ్లేషణ

BRAOU

రాడ్‌క్లిఫ్‌బ్రౌన్ కేవలం ప్రకార్యవాది మాత్రమే కాదు. ఆయన నిర్మాణ ప్రకార్యవాది. ఆచార వ్యవహారాలు, సామాజిక వ్యవహారాలకు సంబంధించిన వ్యవస్థలు, సమాజం మనుగడకు అవసరమైన అవసరాలను ఎలా తీరుస్తున్నాయన్న విషయానికి ఆయన పరిమితం కాలేదు. భిన్న రకాల సామాజిక సంబంధాల మధ్య బాంధవ్యాన్ని కూడా పరిగణలోకి తీసుకున్నాడు. రాడ్‌క్లిఫ్ బ్రౌన్ దృష్టిలో మొత్తం సామాజిక వ్యవస్థ నిర్వాహణకు ఏవిధంగా దోహదం చేస్తున్నది అన్న దృష్టితోనే వివిధ సామాజిక కార్యకలాపాలను చూడాలి.

అండమాన్ ఐలాండర్స్ అనే పుస్తకంలో 'ప్రతీ మనిషి అవయవం, సాధారణ జీవితంలో కూడా ఏదో ఒక పాత్ర పోషించినట్టుగానే ఈ అండామన్ సమూహాల్లో కూడా ప్రతీ ఆచారం, విశ్వాసం సామాజిక జీవితంలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషిస్తాయి. అని బ్రౌన్ పేర్కొన్నాడు. అంటే ప్రతీ సామాజిక వ్యవస్థలో ఒకరకమైన ఐక్యత ఉంటుంది. దీన్ని రాడ్‌క్లిఫ్ బ్రౌన్ ప్రకార్యఐక్యతగా పేర్కొన్నాడు. ఈ స్థితిలో సామాజిక వ్యవస్థకు సంబంధించిన అన్ని అంగాలు ఏపేచీ లేకుండా, సమైక్యంగా కలిసికట్టుగా పనిచేస్తుంటాయి. తన నిర్మాణ ప్రకార్యవిశ్లేషన సిద్ధాంతాన్ని సోదాహరణగా వివరించడానికి రాడ్‌క్లిఫ్ బ్రౌన్ పరిహాస సంబంధాన్ని ఎంచుకున్నాడు.

### 4.4.1 పరిహాస పూర్వక సంబంధం

వ్యక్తుల మధ్య పరిహాస పూర్వక సంబంధం ఆఫ్రికాలోనే కాకుండా ఆసియా, ఉత్తర అమెరికాల్లో కూడా విస్తృతంగా వ్యాప్తిలో ఉంది. పరిహాసపూర్వకమైన సంబంధాలు ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే సంబంధాలు. ఇందులో

ఒకరు మరొకరిని పరిహాసం చేయడానికి హాస్యోక్తులు విసరడానికి ఆటపట్టించడానికి సంప్రదాయమే అనుమతిస్తుంది. రెండవ వ్యక్తి కిమ్మనకుండా భరించాల్సిందే. ఇందులో రెండు రకాలు ఉన్నాయి. ఒకటి సమసంబంధం, మరొకటి అసమ సంబంధం. సమసంబంధంలో పరిహాస పూర్వక సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులు పరస్పరం ఆటపట్టించుకుంటారు. ఎగతాలి చేసుకుంటారు. హెచ్చుతగ్గులకు తావులేదు. రెండో సంబంధంలో మాత్రం ఆటపట్టించే అవకాశం, పరిహాసం చేసే సౌకర్యం ఒక్కరికి మాత్రమే ఉంటుంది. అవతలి వ్యక్తి దీనిని నవ్వుతూ స్వీకరించాల్సిందే. ఎదురు చెప్పడానికి లేదు. ఒకవేళ ఎదురుచెప్పినా గట్టిగా మాత్రం చెప్పరాదు. ఆటపట్టించడం ఎగతాళి చేయడం కొన్ని సార్లు మాటలకు మాత్రమే పరిమితమైతే మరికొన్ని సార్లు అరుపులు, కేకలవరకు కూడా వెళ్లుతుంది. కొన్ని సందర్భాలలో అశ్లీలం కూడా చోటు చేసుకుంటుంది.

పరిహాసపూర్వక సంబంధం చాలా చిత్రమైనది. ఇందులో ఆప్యాయత, ప్రేమ అదే సమయంలో కొంత కడుపుమంట, వ్యతిరేకత కూడా కనిపిస్తాయి. ఒక వ్యక్తి మరో వ్యక్తిపట్ల శృతిమించిన చొరవతో ప్రవర్తించడానికి సామాజిక ఆమోదం ఉన్న సంబంధం ఇది. సామాజిక శాస్త్ర పరంగా దానికి చాలా ప్రాధాన్యత ఉంది. ఒక వివాహం జరిగితే సామాజిక నిర్మాణ పరంగా భార్య, భర్త కుటుంబంతో సర్దుబాటు కావాల్సి ఉంటుంది. ఒక వ్యక్తికి భార్య చెల్లెళ్లతో అంటే మరదళ్లతో, కొన్ని సందర్భాల్లో భార్య సోదరులతో అంటే బావమరదులతో పరిహాసపూర్వక సంబంధం ఉంటుంది. అదే సమయంలో ఒక మహిళకు భర్త సోదరులతోను, భర్త చెల్లెళ్లతో అంటే ఆడపడచులతో ఈ సంబంధం ఉంటుంది. వ్యక్తుల మధ్య సున్నితమైన సంబంధాలను పదిలంగా కాపాడడంలో పరిహాసపూర్వక సంబంధాలలో ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని రాడ్‌క్లిఫ్ బ్రౌన్ అంటాడు. భిన్న నేపథ్యాల నుంచి వచ్చిన వారు పెళ్లి వంటి బంధాల కారణంగా ఒక్కటిగా వుండాల్సి వస్తుంది. సామాజికంగా వేరువేరు నేపథ్యాలకు చెందినవారు వివాహం కారణంగా ఒక్కటిగా మారుతారు. ఇలాంటి సందర్భాల్లో తలెత్తే కొన్ని రకాల ఉద్రిక్తతలు, ఘర్షణల నివారణకు, సున్నితమైన కొత్త సంబంధాలు సవ్యంగా కొనసాగడానికి పరిహాస సంబంధాలు దోహదం చేస్తాయి. సామాజిక సంబంధాల్లో టొటేమిజం నిర్వహించే పాత్ర గురించి కూడా బ్రౌన్ చర్చించారు.

BRAOU

### 4.4.2 టొటేమిజం

కొన్ని గిరిజన తెగలు ఏదో ఒక సహజ వస్తువును లేదా జీవిని తమ వంశానికి మూలంగా ఎంచి ఆరాధించే సంప్రదాయం ఉంది. 'కొన్ని సమాజాల్లో కొందరు వ్యక్తుల సమూహం, బృందం, సహజమైన వస్తువును లేదా పక్షులను, జంతువులను తమ వంశానికి మూల అంకురంగా ఎంచి దానినే ఆరాధిస్తుంటాయి' అని ఆడమ్ కూపర్ పేర్కొన్నాడు. ఆస్ట్రేలియాలోని స్థానిక జాతుల్లో టొటేమిజంపై ఎమిలీ దుర్ఖైమ్ అధ్యయనం చేశారు. ఆ సమాజంలోని వ్యక్తుల ఉమ్మడి మనోభావాలను వ్యక్తం చేయడానికి, వాటిని ఒక చిహ్నం ద్వారా రూపంలోకి మార్చడానికి టొటేమిజం ఒక మార్గమని దుర్ఖైమ్ వాదన. ఒక రకంగా ఇది ఆ గిరిజన ఆచారంలో ఐక్యతను, సంఘటితత్వానికి సహాయపడుతుంది. ఇవన్నీ వివరించిన దుర్ఖైమ్ ఈ గిరిజన తెగలు ప్రకృతి సహజంగా మనకు కనిపించే వస్తువును లేదా పక్షిని, జంతువును మాత్రమే తమ వంశమూలంగా ఎందుకు ఎంచుకున్నారో మాత్రం వివరించలేదు.

రాడ్‌క్లిఫ్ బ్రౌన్ ఒకరకంగా ఆబాధ్యతను స్వీకరించాడు. ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్‌వేల్స్‌లో నివసించే కొన్ని గిరిజన జాతుల్లో ఆయన అధ్యయనం జరిపారు. న్యూసౌత్ వేల్స్‌లోని కొన్ని తెగలు రెండు బహిర్వివాహ బృందాలుగా విడిపోయి ఉన్నాయి. అటువంటి ఒక తెగలోని రెండు బృందాలు రెండు పక్షుల పేర్లతో వ్యవహారంలో ఉన్నాయి. ఒకటి డేగ, మరొకటి కాకి. డేక బృందానికి చెందిన పురుషులు కాకి బృందానికి చెందిన మహిళలను వివాహం చేసుకుంటారు. అలాగే కాకి బృందం పురుషులు డేగ బృందం స్త్రీలను పెళ్లి చేసుకుంటారు. పక్షుల జత, జంతువులు జత పేర్లతో రెండుగా చీలి ఉన్న మరికొన్ని తెగలు కూడా ఆస్ట్రేలియాలో ఉన్నాయి. ఈ తెగల పురాణాలు, ఇతిహాసాల ప్రకారం ఆయా పక్షులు, జంతువులు ఏదో ఒక ఘర్షణల్లో విరోధులుగా ఉంటాయి. వైరం ఉన్నప్పటికీ వాటి మధ్య ఏదో ఒక సామీప్యం కూడా ఉంటుంది. పైన చెప్పిన ఉదాహరణలో డేగ, కాకి రెండూ మాంసాహార పక్షులే. అలాగే వాటి పేర్ల మీదుగా ఉన్న బృందాల మధ్య కూడా కయ్యం, వియ్యం రెండూ ఉంటాయి. అందువల్ల టొటేమిజం కేవలం తెగలను ప్రకార్య రీత్యా ఏకతాటిపై నడిపే సాధనం మాత్రమే కాదని, బృందాల మధ్య వైరాన్ని లేదా

అభిప్రాయ భేధాలను వ్యక్తం చేసే సాధనంగా కూడా చూడాలని రాడ్‌క్లిఫ్ బ్రౌన్ అంటాడు. టొటేమిజంను కేవలం ప్రకార్యవాదం దృష్టిలో దుర్‌ఖైమ్ విశ్లేషిస్తే దానినే బ్రౌన్ నిర్మాణ ప్రకార్యవాదం దృష్ట్యా విశ్లేషించాడు.

## 4.5 రాడ్‌క్లిఫ్ బ్రౌన్: ఒక విమర్శ

ప్రకార్యాల రీత్యా సమాజంలో ఐక్యతను ప్రతిపాదిస్తూ బ్రౌన్ చేసిన సిద్ధాంతాన్ని రాబర్ట్ కె.మోర్టన్ తీవ్రంగా విమర్శించాడు. బ్రౌన్ ప్రకారం వ్యవస్థలో పూర్తి సమన్వయం వుంది. సమాజంలోని మౌలిక విభాగాలన్నీ సమాజం సవ్యంగా సాగేందుకు, సమాజ సమగ్రతకు దోహదం చేస్తున్నాయి. ఒక ప్రత్యేక సమాజ ప్రకార్యం కూడా యావత్ సామాజిక వ్యవస్థ తాలూకు ప్రకార్యంగానే సమాజ జీవిత సమగ్రతకు దోహదం చేస్తున్నవని బ్రౌన్ అభిప్రాయం. అంటే సామాజిక సంస్థలు, ఉమ్మడి విశ్వాసాలు, ఉమ్మడి సంప్రదాయాలు అన్ని సమాజానికి అందరు వ్యక్తులకు సమానంగానే కనిపిస్తాయని ఏకరీతిగా ప్రకార్య నిర్వహణకు దోహదం చేస్తాయని బ్రౌన్ భావించాడు. మోర్టన్ ఇక్కడ విభేదించాడు. సంస్కృతికి సంబంధించిన అంశాలు ప్రకార్య రీత్యా సమాజానికి, సమాజంలోని సభ్యులందరికీ ఒకే రీతిలో వర్తించవని మోర్టన్ అభిప్రాయపడ్డాడు. సామాజిక సమన్వయం అ మాటకు వస్తే సమాజం అనేది యధాతథంగా వుండేదే కాదని అవి శోధించాల్సిన సమస్యలని పేర్కొన్నాడు. అందువల్ల ప్రకార్యవాద విశ్లేషణ ప్రతికూల అనుకూల పర్యవసానాలను వెలికి తేవాలని ఏ అంశం ఉనికికి దోహదం చేస్తుందో వివరంగా తెల్పి చెప్పాలని అన్నాడు. రాడ్‌క్లిఫ్ బ్రౌన్ విశ్వప్రకార్యవాద సిద్ధాంతాన్ని కూడా మోర్టన్ విమర్శించాడు. ప్రమాణీకరించిన అన్ని సామాజిక, సాంస్కృతుల రూపాలు ధనాత్మక ప్రకార్యాలనే నిర్వహిస్తాయని బ్రౌన్ ప్రతిపాదించాడు. సమాజంలో చలామనిలో ఉన్న సంప్రదాయాలు, సామాజిక విధానాలు, వ్యవస్థ సవ్యమైన మనుగడకు దోహదం చేసేవిధంగా సానుకూల ప్రకార్యాలనే నిర్వహిస్తాయన్నది బ్రౌన్ అభిప్రాయం. అయితే వ్యక్తికి మంచి అయిందల్లా సమాజానికి కూడా మంచి కావాల్సిన అవసరం లేదని మోర్టన్ వాదన. సమాజంలోని శిష్టవర్గాలకు సానుకూలమైన ఒకసామాజిక సంప్రదాయం అట్టడుగువర్గాలకు వ్యతిరేక పర్యవసానాలను కలిగించే అవకాశం ఉంది. యావత్ సమాజం ప్రయోజనాల దృష్ట్యా పనిగట్టుకొని నిర్మించిన వ్యవస్థలు కూడా కొన్ని సందర్భాలలో అదే సమాజంలోని కొన్ని వర్గాలకు కీడుగా పరిణమించే అవకాశం ఉంది. సామాజిక మార్పుపై కూడా దృష్టి సారించలేదన్నది బ్రౌన్‌పై మరో విమర్శ. బ్రౌన్ ప్రకారం సమాజం అవిచ్ఛిన్నంగా కొనసాగడానికి దోహదం చేసే నియమాలు, సూత్రాలు, వ్యవహారాలకుమించే సామాజిక మార్పు కూడా సంభవిస్తుంది. సామాజిక రూపాలకు సంబంధించి బ్రౌన్ ప్రతిపాదించిన మౌలిక సూత్రాలు ఈ విధంగా ఉన్నాయి. 1. ఏ సమాజంలోనైనా సభ్యుల ఆలోచనాధోరణులు, అభిప్రాయాలకు సంబంధించి ఉమ్మడి పద్ధతులు ఉంటాయి. 2. సమాజంలోని తరగతులు, వర్గాల మధ్య ఏదో ఒక స్థాయిలో ప్రకార్య ఐక్యత, సమన్వయం ఉంటుంది. ఎప్పుడైనా పొరపొచ్చలు ఏర్పడితే సర్దుబాటు చేయడానికి వ్యవస్థతానే కొన్ని మార్పులు చేసుకొంటుంది. ఏ సమాజ నిర్మాణంలో కూడా నిర్మాణ పరమైన సమస్యల పరిష్కారానికి అంతర్గతమైన ఏర్పాట్లు ఉండవని, అలాంటి యంత్రాంగాలు సమాజనిర్మాణంలో భాగంగానే వుంటాయనడం తప్పేనని మార్క్సిస్ట్ సిద్ధాంతికులు విమర్శించారు. ఆరకంగా చూస్తే రాడ్‌క్లిఫ్ బ్రౌన్ నిర్మాణ ప్రకార్యవాదం, సామాజిక మార్పును, సమాజ వ్యవస్థను దానిలో ఉత్పన్నమైన సమస్యలను చర్చించడంలో విఫలమైంది.

## 4.6 సారాంశం

వ్యక్తుల జైవిక అవసరాల నుంచి రూపొందిన మలినోవ్‌స్కీ సంస్కృతి సిద్ధాంతంతో పోలిస్తే రాడ్‌క్లిఫ్ బ్రౌన్ ప్రతిపాదించిన నిర్మాణ ప్రకార్య వాదం భిన్నమైంది. బ్రౌన్ మౌలిక భావన ప్రకారం ప్రతి సమాజం ఒక నిర్దిష్ట కాల వ్యవధితోపాటు స్థిరంగా ఉంటుంది. ఈ సుస్థిర కాలంలోనే సమాజంలోని సభ్యుల మధ్య సంబంధాల్లో సంఘీభావం, సామరస్యత వర్ధిల్లుతాయి. ఆయన అభిప్రాయం ప్రకారం ప్రతీ సమాజం ఒక రకమైన సమైక్యత, సామరస్యతను ప్రదర్శిస్తాయి. ఒక నిర్దిష్టసమయంలో సమాజంలోని భిన్న వ్యక్తులందరి మధ్య ఉండే సామాజిక సంబంధాల సమాహారమే సామాజిక నిర్మాణంలో భాగంగా ఉంటుంది.



రాడ్‌క్లిఫ్ బ్రౌన్ దృష్టిలో సామాజిక వ్యవస్థాపన అంటే ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది కార్యకలాపాలకు

BRAOU

అచారాలు సమైక్య రూపు ఇచ్చే విధంగా సర్దుబాటు చేయడం. సామాజిక వ్యవస్థలో విస్తృతంగా ఉపయోగించే సామాజిక నియమాలు, నిర్మాణ రూపంలో ఉంటాయి. వ్యక్తులు వస్తూ, పోతూ ఉంటారు. నిర్మాణ రూపం ఒక అమూర్తమైన అస్తిత్వం. దాని స్థిరత్వం, దాని వివిధ భాగాలు ఎంత బాగా సమన్వయంతో పనిచేస్తున్నాయన్నదానిపై ఆదారపడి ఉంటుంది.

రాడ్క్లిఫ్ బ్రౌన్ అభిప్రాయంలో మనుగడ కోసం మానవ సమాజాలు కొన్ని మౌలిక షరతులను పూర్తిచేస్తాయి. ఈ మౌలిక షరతులనే ఆయన సమాజ ప్రకార్యాలుగా పేర్కొన్నారు. శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయడం వల్ల ఈ ప్రకార్యాలను కనిపెట్టవచ్చు. ప్రతీ సామాజిక వ్యవస్థలో ఒకరకమైన ఐక్యత ఉంటుంది. దానినే బ్రౌన్ ప్రకార్య ఐక్యత అన్నాడు. ఇది సామాజిక వ్యవస్థ అన్ని భాగాలు, సామరస్యంగా సమన్వయంతో పనిచేసే స్థితి.

## 4.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. రాడ్క్లిఫ్ బ్రౌన్ సమాజ నిర్మాణ భావనను చర్చించండి.
2. పరిహాస సంబంధమైన బంధుత్వాలు టోటెమిజం ద్వారా రాడ్క్లిఫ్ బ్రౌన్ నిర్మాణ ప్రకార్యవాద విశ్లేషనను ఏవిధంగా వివరించాడు.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి.**

1. సమాజనిర్మాణం, ప్రకార్యవాదానికి మధ్యగల సంబంధం.
2. టోటెమిజం అంటే ఏమిటి?

BRAOU

## 4.8 చదవదగిన పుస్తకాలు


Ivans Freechard : Social Anthropology.

Rien, R.K. : A.R. Radcliff Brown and Dhurkheim School of French Sociology, Methodological reflection.

Cooper, Adams : Anthropologist and Anthropology.

Radcliff Brown : The Andaman Ilanders.

Radcliff Brown : Structure and Function in Premitive Society.

# భాగం-5: బ్రానిస్లావ్ మలినోవ్‌స్కీ

విషయ క్రమం

5.0 ఉద్దేశాలు

5.1 పరిచయం

5.2 జీవిత విశేషాలు

5.3 సంస్కృతి ప్రకార్యసిద్ధాంతం

5.3.1 సంస్కృతి నిర్వచనం

5.4 మలినోవ్‌స్కీ ప్రతిపాదించిన అవసరాల సిద్ధాంతం

5.4.1 జీవసంబంధ ప్రేరణలు

5.4.2 మౌలిక అవసరాలు, ప్రతిస్పందనలు

5.4.3 అనుషంగిక అవసరాలు ప్రతిపాదనలు

5.5 మలినోవ్‌స్కీ ప్రతిపాదించిన ప్రకార్యవాదం

5.6 మలినోవ్‌స్కీపై విమర్శ

5.7 సారాంశం

5.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

5.9 చదవదగిన పుస్తకాలు

BRAOU

## 5.0 ఉద్దేశాలు

ఈభాగం చదివిన తర్వాత మీరు క్రింది విషయాలు గ్రహించగలుగుతారు.

- మలినోవ్‌స్కీ దృష్టిలో సంస్కృతి-భావన.
- మలినోవ్‌స్కీ వివరించిన అవసరాలు, అవసరాల్లోని రకాలు.
- మలినోవ్‌స్కీ ప్రతిపాదించిన 'సాంస్కృతిక ప్రకార్యవాదం'.

## 5.1 పరిచయం

సామాజిక మానవశాస్త్రవేత్తగా 1930వ దశకంలో మలినోవ్‌స్కీకి అత్యంత ప్రాముఖ్యత లభించింది. ఆయన తర్వాత వచ్చిన బ్రిటిష్ మానవ శాస్త్రవేత్తల్లో ఎక్కువ మంది పాక్షికంగానో పూర్తిగానో ఆయన శిక్షణలో ఎదిగివచ్చిన వారే. మలినోవ్‌స్కీ తన అనుచరులను, విమర్శకులను సమానంగా ప్రభావితం చేశాడు.

ప్రకార్యసిద్ధాంతానికి తానే ఆద్యుడినని మలినోవ్‌స్కీ ప్రకటించుకున్నారు. 'ప్రకార్యవాద'మనే మాటను తొలుత ఆయనే ఉపయోగించాడు. పాతబడిన పరిణామవాదానికి పూర్తి విరుద్ధమైన సిద్ధాంతంగా ప్రకార్యవాదాన్ని ఆయన బలంగా ముందుకు తెచ్చాడు. న్యూగినీ దగ్గర్లోని ట్రోబ్రియాండ్ ద్వీపవాసులపై తాను చేసిన అధ్యయనాలు మలినోవ్‌స్కీ వాదాలకు ప్రతిపాదికగా నిలిచాయి. ఈ ప్రజల గురించి ఆయన ఎంతో లోతుగా అధ్యయనం చేశారు. ఇందుకోసం రెండేళ్లు పైబడి వారితో కలిసి జీవించాడు. వారి బాష మాట్లాడాడు. ప్రేక్షక పరిశీలకునిగా కాకుండా

'స్వానుభవ పరిశీకుని'గా ఆయన వ్యవహరించారు. ప్రతి ఆచారాన్ని విశ్వాసాన్ని, కళాకృతిని సమాజ వ్యవస్థలో వాటికి గల సంబంధాన్ని పరిశీలించడంలో మలినోవ్‌స్కీ చాలా ఆసక్తి కనబరిచాడు. ప్రజల మౌలిక సామాజిక కార్యకలాపాలను చార్టులు, భూయజమాన్యానికి సంబంధించిన నక్షాలు, రుతువుల వారీ కేలండర్లతోడ్పాటుతో అయన ప్రమాణబద్ధం చేశారు. ఆయన అందులోని ప్రతి విషయాన్ని ప్రత్యక్ష సాక్షి చెబుతున్నట్టుగా వివరించాడు.

సామాజిక శాస్త్రాన్ని సమాజాల అధ్యయనానికి ఉపయోగపడే బలమైన సాధనంగా మలినోవ్‌స్కీ అభివృద్ధి చేశాడు. 'అక్షరాస్యతపూర్వ' సమాజాలను ఈ పద్ధతిలో అంతకుముందెవరూ అధ్యయనం చేయలేదు. ఈ సమాజాలకు సంబంధించిన విస్తార జ్ఞానసంపద ఆయన కృషి, ప్రభావాల ఫలితంగానే రూపొందిచింది.

## 5.2 జీవితవిశేషాలు

బ్రానిస్లావ్ కాస్పర్ మలినోవ్‌స్కీ 1884 ఏప్రిల్ 7న పోలండ్‌లోని క్రాకో పట్టణంలో జన్మించాడు. అతడి ప్రాథమిక విద్యాభ్యాసం క్రాకోలోనే గడిచింది. ఆయన తండ్రి ప్రఖ్యాత భాషా శాస్త్రవేత్త. జాగెలోనియన్ విశ్వవిద్యాలయంలోని స్లావోనిక్ భాషాశాస్త్ర విభాగంలో ఆయన ప్రొఫెసర్‌గా పనిచేసేవారు. చిన్నతనంలోనే మేధావులు, విద్యావేత్తల సాంగత్యం మలినోవ్‌స్కీకి లభించింది. ఉన్నతవిద్యాభ్యాసానికి సైన్సెస్‌ను ఎంచుకున్న మలినోవ్‌స్కీ 1908లో భౌతిక, గణిత శాస్త్రాలలో జగెలోనియన్ విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డి పట్టా తీసుకున్నారు. ఈ రెండు శాస్త్రాల అధ్యయనాన్ని ఆతర్వాత అనారోగ్య కారణంగా కొనసాగించలేకపోయాడు. ఆరోగ్యం బాగుపడ్డాక లీప్‌జిగ్ యూనివర్శిటీలో చేరి భౌతిక, రసాయన శాస్త్రాల అధ్యయనం చేపట్టారు. అనంతరం కార్ల్ బుషర్ వద్ద ఆర్థిక చరిత్రను, విల్ హెల్మ్ ఉంట్ వద్ద ప్రయోగిక మనస్తత్వ శాస్త్రాన్ని ఆయన అధ్యయనం చేశారు. ఉంట్ ఆలోచనల ప్రభావానికి లోనైన మలినోవ్‌స్కీ ఆ సమయంలో ఆస్ట్రేలియా కుటుంబ వ్యవస్థాపన గురించి అధ్యయనం మొదలుపెట్టారు. 1913లో 'ఆస్ట్రేలియా ఆదిమ వాసుల్లో కుటుంబవిధానం' అనే పుస్తకాన్ని ఆయన ప్రచురించారు. ఆస్ట్రేలియా ఆదివాసులపై ప్రచురించిన అధ్యయన పత్రాలకుగాను లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌వారు 1916లో ఆయనకు డి.ఎస్.సి డిగ్రీ ప్రదానం చేశారు.

BRAOU

మలినోవ్‌స్కీ లండన్‌లో అప్పటికే అధ్యాపక వృత్తిని చేపట్టారు. ప్రాచీన మతం, సామాజిక విభేదీకరణం, సామాజిక మనస్తత్వ శాస్త్రాలను ఆయన బోధించేవారు. అక్కడే ఆయనకు న్యూగినాలో ఫీల్డ్‌వర్క్‌కోసం ప్రమాణ స్కాలర్‌షిప్ లభించింది. దాంతో ఆయన 1914-1916 మధ్య అక్కడ గడిపారు. ఆసమయంలోనే మలినోవ్‌స్కీ తన చిరస్మరణీయమైన ఫీల్డ్‌వర్క్ నిర్వహించి 'ఆర్గోనాట్స్ ఆఫ్ ది వెస్టర్న్ పసిఫిక్' అన్న రచనను వెలువరించాడు. ఆదిమ సాంస్కృతుల అధ్యయనానికి ఒక సరికొత్త మార్గాన్ని ఈ రచన అందించింది. కాగా తన అధ్యాపక వృత్తిని కొనసాగించేందుకు 1924లో మలినోవ్‌స్కీ లండన్ తిరిగి వచ్చారు. 1927లో లండన్ యునివర్శిటీ మానవశాస్త్ర విభాగం ప్రథమ పీఠాన్ని ఆయన అధిష్టించారు.

1934లో మలినోవ్‌స్కీకి దక్షిణాఫ్రికా పర్యటించే అవకాశం వచ్చింది. ఆ అవకాశాన్ని వినియోగించుకొని అనేకమైన దక్షిణాఫ్రికా జనజాతులపై ఆయన మానవశాస్త్ర సర్వేలు నిర్వహించాడు. 1938లో అమెరికా సందర్శించాడు. అమెరికాలోని ఏల్ యునివర్శిటీలో అధ్యాపకుడిగా ఉన్నాడు. 1942లో తన 58వ ఏట అమెరికాలోని న్యూహెవెన్‌లో మలినోవ్‌స్కీ కన్నుమూశాడు.

## 5.3 సంస్కృతి ప్రకార్య సిద్ధాంతం

సంస్కృతికి సంబంధించిన ప్రకార్య సిద్ధాంతానికి మలినోవ్‌స్కీ పునాదివేశాడు. ప్రతీ నాగరికత, ప్రతీ ఆచారం, వస్తువు, ఆలోచన, విశ్వాసం అన్నీ మౌలిక మానవ సంస్కృతిక అవసరాలను తీర్చుతాయని ఆయన గమనించాడు. అందువల్ల సమాజంలో సంస్కృతి ఒక అవశ్యక భాగంగా ఉండి కీలక సామాజిక కార్యాలను నిర్వర్తిస్తూ వుంటుంది. మనుషులను ఇతర జంతువులనుంచి వేరుచేసేది సాంస్కృతిక సంప్రదాయాలు, సాంస్కృతిక వ్యవస్థ, సృజనాత్మక కార్యకలాపాల సంచిత సృష్టేనని ఆయన నొక్కి చెప్పాడు.

### 5.3.1 సంస్కృతి నిర్వచనం

సంస్కృతికి మలినోవ్‌స్కీ ఇచ్చిన నిర్వచనాన్ని 1931లో సామాజిక శాస్త్రాల విజ్ఞాన సారస్వంలో పొందుపరిచారు. "వారసత్వంగా సంక్రమించిన కళాకృతులు, వస్తువులు, సాంకేతిక ప్రక్రియలు, ఆలోచనలు, అలవాట్లు, విలువల సమ్మేళనమే సంస్కృతి" అని అయన చెప్పారు. ఆవిధంగా సంస్కృతిని ఆయన విజ్ఞాన సారస్వం తరహాలో వాడుతూ ఉపకరణాలను, వినియోగదారు వస్తువులను వివిద సామాజిక సమూహాలకు దాఖలు పడిన రాజ్యాంగ అధికారాలను, మానవ అలోచనలను వృత్తులను, విశ్వాసాలను, ఆచారాలను సమస్తం అందులో చేర్చారు. సంస్కృతి అది సరళమైనా, ఆదిమమైనా, సంక్లిష్టమైనా, ఆధునికమైనా ఒకటే అంటాడాయన. 'మనిషి తనకెదురయ్యే నిర్ధిష్టసమస్యలను తట్టుకోగలగడానికి ఉపకరించే విశాల సామాగ్రి సంస్కృతి. ఆ సామాగ్రి కొంత పాదార్థికం, కొంత మానుషం, కొంత ఆధ్యాత్మికం. ఈ అభిప్రాయాల ప్రకారం సంస్కృతి గురించిన మలినోవ్‌స్కీ భావనలో ఇమిడి ఉన్న విషయాలు: ఎ) పాదార్థిక సాంస్కృతి, బి) మానవకార్యకలాపంలోని నిర్ధిష్ట తరగతులు, సి) వివిధ సామాజిక సమూహాలకు, విశ్వాసాలకు ఉన్న రాజ్యాంగ అధికారాలు (Constitutional Charter).

పాదార్థిక సాంస్కృతిలో పనిముట్లు, వినియోగదారీ వస్తువులు చేరి ఉంటాయి. అవి కళాకృతులు కావచ్చు. కేవలం వస్తువుల్లూ కావచ్చు. అవన్నీ మానవ చర్యల ఫలితంగా పుట్టి మనిషి అవసరాలు తీర్చడానికి దోహదపడే ఉత్పత్తులే. మానవ కార్యకలాపంలోని నిర్థిష్ట తరగతులన్నీ ఆచారం అనే వ్యవహారణ కిందికి వస్తాయి. సామాజిక వ్యవస్థాపనకు ఆధారభూతమైన మౌలికాంశాలు అమాటలో ఇమిడి ఉన్నాయి. సామాజిక సమూహాలకు, విశ్వాసాలకు ఉన్న రాజ్యాంగాధికారాల్లో సాంస్కృతిక వస్తువులు, సామాజిక వ్యవస్థాపనకు సంబంధించిన కొన్ని అంశాలు చేరి ఉన్నాయి.

మానవజీవితానికి, మనిషి చర్యకు సంబంధించిన ప్రతి విషయాన్ని ఆయన సంస్కృతిగానే చూశారు. ఒక శరీర వ్యవస్థగా మానవ జీవిలో అదొక భాగం అయి ఉండకూడదంతే. ఒకరినుంచి నేర్చుకొని అందరూ ఒకే విధంగా కలిసి ఉండి, ఇతరులకు బదలాయించే ప్రవర్తనా రూపమే మలినోవ్‌స్కీ దృష్టిలో సంస్కృతి. ఇలా నేర్చుకున్న ప్రవర్తనా క్రమాలతో ముడివడి ఉన్న పాదార్థిక సంస్కృతి కూడా అందులో భాగమే. పాదార్థిక వస్తు సముదాయానికి, ఆచారాలకు, విశ్వాసాలకు సామాజిక సమమూహాలకు మధ్య మలినోవ్‌స్కీ అవిధంగా ఒక విభజన రేఖను ఏర్పరిచారు. పాదార్థిక వస్తు సముదాయం పనిముట్లుగా వినియోగ వస్తువులుగా ప్రకార్యం నిర్వహిస్తే మిగిలినవి సదరు సామాజిక-సాంస్కృతిక ప్రవర్తనలో నిమగ్నమైన వ్యక్తుల గుణవిశేషాలు అవుతాయి.

ప్రకృతి అనే పదార్థాన్ని ఒక ప్రకార్య సమస్తంగా మలినోవ్‌స్కీ ఉపయోగించాడు. పరస్పరం కలిసి సంస్కృతి సమస్తాన్ని ఏర్పరచే విశ్వాసాలు, అలవాట్లు, ఆచారాలు సంస్థల విడివిడి ఉపయోగం లేదా ప్రకార్యాన్ని అధ్యయనం చేసే పద్ధతిని అయన అవిధంగా అభివృద్ధి పరిచాడు. సంస్కృతికి సంబంధించిన వివిధ అంశాల పరిశీలనకు నిలువగల అనుభవాత్మక పరిశోధనకు పనికొచ్చే సరుకుగా ఆయన పరిగణించాడు. తన 'అర్గోనాట్స్ ఆఫ్ వెస్టర్న్ పసిఫిక్' రచనలో సంస్కృతిని అనేక విడి భాగాలతో కూడిన సమతౌల్య వ్యవస్థగా చూశారు. ఒక ఆచారం లేదా సంస్థకువున్న ప్రకార్యాన్ని, సంస్కృతిని మొత్తంగా నిలిపి ఉంచడంలో దాని తోడ్పాటును బట్టి అర్థం చేసుకోవాలని మలినోవ్‌స్కీ చెప్పారు. సంస్కృతిని ఒక స్వయం పరిపూర్ణ వాస్తవికతగా అధ్యయనం చేయాలన్నది ఆయన అభిప్రాయం.

## 5.4 మలినోవ్‌స్కీ ప్రతిపాదించిన అవసరాల సిద్ధాంతం

అవసరాల సిద్ధాంతాన్ని ' ఎసైంటిఫిక్ థియరీ ఆఫ్ కల్చర్' అనే తన రచనలో మలినోవ్‌స్కీ ప్రతిపాదించాడు. ఆయన అభిప్రాయంలో అవసరాలనేవి వ్యక్తుల అవసరాలుగా, సమాజ అవసరాలుగా రెట్టింపుస్థాయిలో ఉంటాయి. "అవసరాన్ని మానవజీవితంలోని పరిస్థితుల వ్యవస్థగా నేను అర్థం చేసుకుంటాను. ఈ పరిస్థితుల వ్యవస్థకు ఒక సాంస్కృతిక వాతావరణం ఉంటుంది. ఒకో సమూహం అస్థిత్వంలో ఉండటానికి అవసరమైన, సహజ పరిసరాలతో సదరు జీవితో ఆ పరిస్థితుల వ్యవస్థకు సంబంధం ఉంటుంది. పరిమితం చేసిన వాస్తవాలు, అలవాట్లు వాటి ప్రేరేపణల సమాహారమే అవసరం. నేర్చిన ప్రతిస్పందనలూ వ్యవస్థాపన పునాదుల అమరిక మౌలిక అవసరాలు తీరటానికి అనువుగా వుండాలి" అని మలినోవ్‌స్కీ నిర్వచించాడు.



BRAOU

ఈ నిర్వచనంలోని మొదటి భాగం మానవ జీవిలోని పరిస్థితుల వ్యవస్థ గురించి చెబుతుంది. మొదటగా సంతృప్తి పర్చవలసిన జీవిసంబంధ ప్రేరణలను గురించి అది ప్రస్తావిస్తుంది. ఈ జీవిసంబంధ ప్రేరణలను ఒక పట్టిక రూపంలో ఇవ్వడం జరిగింది.

### 5.4.1 జీవసంబంధ ప్రేరణలు

| ప్రేరణ | చర్య | సంతృప్తి |
|---|---|---|
| శ్వాసించాలనే తపన | ఆక్సీజన్‌ను గ్రహించుట | కణజాలాల్లోని కార్బన్-డై-ఆక్సైడ్‌ను విసర్జించుట |
| ఆకలి | ఆహారం భుజించుట | ఆకలి చల్లారడం |
| దాహం | ద్రవాలు తీసుకోవడం | దాహం తీరడం |
| అలసట | విశ్రాంతి | కండరాల, నరాల శక్తి పునరుద్ధరణ |
| నిద్ర | కార్యకలాపం | అలసట తీరుతుంది |
| నిద్రమత్తు | నిద్ర | పునరుద్ధరించబడిన శక్తితో మేల్కొనడం |
| మూత్రాశయంలో వత్తిడి | మూత్రవిసర్జన | తన్యత తొలగిపోవడం |
| పెద్దపేగులో వత్తిడి | మలవిసర్జన | కడుపు సడలింపు |
| భయం | ప్రమాదాన్ని తప్పించుకొనుట | సమాధానం |
| నొప్పి | తగుచర్యతో దూరంచేసుకోవడం | సాధారణస్థితికి చేరుకోవడం |

BRAOU

### 5.4.2 మలినోవ్‌స్కీ అవసరాలు ప్రతిస్పందనలు

జీవసంబంధ అవసరాలను తీర్చుకునేందుకు చేపట్టే కార్యకలాపాలనుంచే సంస్కృతి సృజన ప్రాథమికంగా జరుగుతుందని మలినోవ్‌స్కీ వాదిస్తారు. మనుషులు జీవించి ఉండాలంటే తినాలి, తాగాలి, తలదాచుకునే చోటు వెతుక్కోవాలి. తమను తాము రక్షించుకోవాలి. పునరుత్పత్తి నిర్వహించుకోవాలి. మౌలిక జీవసంబంధ అవసరాలు మనుషులను చర్యకు పురికొల్పుతాయి. ఈ మౌలిక విధి విహితాలను పరిపూర్తి చేయడానికి సంస్కృతి రూపొందింది. ఈ వ్యక్తి, సమూహాల మౌలిక అవసరాలను వాటి సాంస్కృతిక ప్రక్రియలను మలినోవ్‌స్కీ ఒక పట్టిక రూపంలో ఇచ్చాడు.

ఆహారం తీసుకోవడం, సమానాంతర గ్రంథి స్రావాలు (collateral glandular secretiants), ఆహారం జీర్ణమండలం, పౌష్టికాహార పదార్థాలు పీల్చుకోబడడం, చెత్తను విసర్జించటం వంటి వివిధ ఘట్టాలతో కూడిన ప్రక్రియలన్నీ పర్యావరణ కారకాలతో వివిధ పద్ధతులతో సంబంధం కలిగి ఉంటాయి. ఆ సంబంధం లేదా పరస్పర క్రియకు ఉండే స్వభావాన్ని సంస్కృతి తీర్చిదిద్దుతుంది.

పునరుత్పత్తి విషయం వచ్చినప్పుడు సంస్థాగత, వ్యక్తిగత ఉత్సుకతలు లేదా లైంగిక ప్రేరణ గురించి ఎవరూ పట్టించుకోరు. ఆ సమాజం లేదా సముదాయం తన పునరుత్పత్తి అవసరాన్ని ఏ సాంస్కృతిక చట్టం ద్వారా తీర్చుకుంటుందన్నదే ఇక్కడ ముఖ్యమవుతుంది.

| మౌలికావసరం | సాంస్కృతిక ప్రతిస్పందన |
|---|---|
| జీవక్రియ | సరఫరాశాఖ |
| పునరుత్పత్తి | రక్తసంబంధం |
| శరీరసౌఖ్యం | నీడ |
| భద్రత | రక్షణ |
| చలనం | కార్యకలాపాలు |
| ఎదుగుదల | శిక్షణ |
| ఆరోగ్యం | శుచి |

సాధారణ ప్రక్రియలు నిరాటంకంగా కొనసాగడానికి శారీరక సౌఖ్యాలు అవసరమవుతాయి. శారీరక సౌఖ్యాల విషయంలో పర్యావరణ ఉష్ణోగ్రత, తేమ హానికారక పదార్థాలనుంచి అననుకూల వాతావరణ పరిస్థితులనుంచి రక్షణ వంటి వివిధ కారకాల ప్రభావం ఉంటుంది. ఇవన్నీ సజావుగా సమకూర్చడానికి ఒక సాంస్కృతిక చట్రం ఉంటుంది. భద్రత అన్నది శరీరం గాయ పడకుండా నిరోధించడాన్ని సూచిస్తుంది. సాంస్కృతిక సాధనాల ద్వారా అది సాధించబడుతుంది. గాయాలను విధిగా నిరోధించకుండా సంస్కృతి కాని, దాని సమూహం కానీ బతికి బట్టకట్టవు.

BRAOU

చలనం అనేది మానవజీవితానికి, సంస్కృతి సజీవంగా ఉండటానికి అవసరమైన కార్యకలాపాల గురించి సూచిస్తుంది. ఒక సమూహం ఏ భౌతిక సాంస్కృతిక పరిస్థితుల్లో తన సభ్యుల సహకారంపై ఆధారపడి నివసించేదో అది సూచిస్తుంది.

ఎదుగుదల అనేది సమాజంలోని పయోజన సభ్యులపై కొత్తగా పుట్టిన శిశువులు, పిల్లలు ఆధారపడటాన్ని సూచిస్తుంది. పరిపక్వదశ అనేది ఎంతో నెమ్మదిగా జరిగే క్రమానుగత ప్రక్రియ కనుక బాల్యావస్థలో మనుషులంతా తల్లిదండ్రులపైనా, రక్తసంబధీకులపైనా ఆధారపడవలసి వస్తుంది. అదేవిధంగా ముసలితనం ప్రాప్తించిన వారు సమాజంలోని యువసభ్యుల సహాయంపై ఆధారపడక తప్పదు. అందువల్ల ఎదుగుదల, వృద్ధాప్యాలనేని సంస్కృతిపై కొన్ని పరిమితులు విధిస్తాయి.

ఆరోగ్యం అనేది అనారోగ్యం లేదా రోగకారక పరిస్థితుల నివారణను సూచిస్తుంది. ఇది ప్రతి జీవికీ సామాన్య జీవసంబంధ అవసరం. అవసరమనే భావనను అర్థం చేసుకోవడమంటే దానికి సంస్కృతి నుంచి వచ్చే ప్రతిస్పందనతో ఉన్న ప్రత్యక్ష సహ సంబంధాన్ని అర్థం చేసుకోవడమేనని మలినోవ్‌స్కీ తేల్చిచెప్పాడు. అన్ని సంస్కృతులలోనూ మౌలిక అవసరాలు సాంస్కృతిక ప్రతిపాదనలు పరస్పర ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటాయి.

### 5.4.3 అనుషంగిక అవసరాలు-ప్రతిస్పందనలు

సాంస్కృతిక అవసరాలు తమ సొంత అనుషంగిక అవసరాలను పుట్టిస్తాయి. సహకారాత్మక, విరుద్ధ కార్యకలాపాలు పెరిగేకొద్దీ క్రమబద్ధీకరణ, సర్వామోద విలువలు, నియమాలు, కట్టుబాట్ల అవసరాన్ని మనుషులు గ్రహించారు.అధికారం నియంత్రణ స్థాపించేవారి అవసరాన్ని కూడా అదేరీతిలో గుర్తించారు. నాలుగు ముఖ్యమైన అనుషంగిక అవసరాలను వాటి పర్యవసానంగా పుట్టుకొచ్చిన ప్రతిస్పందనలను మలినోవ్‌స్కీ ఈ కింది విధంగా గుర్తించారు.

| అనుషంగిక అవసరం | ప్రతిస్పందన |
|---|---|
| ఉత్పత్తి | ఆర్థిక వ్యవస్థ |
| ఉమ్మడి కార్యకలాపాల వ్యవస్థాపన | రాజకీయ వ్యవస్థాపన |
| మానవ ప్రవర్తనను క్రమబద్ధీకరించడం | సామాజిక నియంత్రణ వ్యవస్థ |
| సాంస్కృతిక వారసత్వ ప్రసారం | విద్యావ్యవస్థ |

ఆవిధంగా సంస్కృతి సామాజిక వ్యవస్థను వివిధ స్థాయిల్లోని అవసరాలు, ప్రకార్యవిధి విహితాల పరంగా అయన వివరించి చెప్పారు. ప్రకార్య విశ్లేషణ ఇచ్చే ప్రణాళికతో క్రమానుగుణమైన అనుభవాత్మక పరిశోధన చేపట్టవచ్చుననీ, ఆ పరిశోధనలో నిర్దిష్ట సిద్ధాంతాలను ప్రకటించడం, అధ్యయనం చేయడం, పరిరక్షించడం, కుదురుతుందని మలినోవ్‌స్కీ పేర్కొన్నాడు.

## 5.5 మలినోవ్‌స్కీ ప్రతిపాదించిన ప్రకార్యవాదం

ప్రకార్యవాదమనే మాటను ఉపయోగించని మొదటివ్యక్తి మలినోవ్‌స్కీ అయినప్పటికీ దాన్నొక విధాన పూర్వక భావనగా అభివృద్ధి చేసింది ఆయన కాదు. ఇవాన్-ప్రిచర్డ్ మాటల్లో చెప్పాలంటే మలినోవ్‌స్కీ ప్రకార్య పద్ధతి "ఆయన అభిప్రాయాలకు వివరణావసరాల కోసం జోడించేందుకు పనికొచ్చిన ఒక సాహిత్యోపకరణం" మాత్రమే. నిజానికి మలినోవ్‌స్కీ సమకాలికుడైన రాడ్‌క్లిఫ్ బ్రౌన్ సమాజ ప్రకార్యవాద లేదా జీవాత్మక సిద్ధాంతాన్ని తర్వాతి కాలంలో అభివృద్ధి చేశాడు. సంస్కృతిని ప్రకార్య పాత్రలో పోషించే పనిముట్టుగా నిరూపించడానికే మలినోవ్‌స్కీ తనను తాను పరిమితం చేసుకున్నాడు. ప్రకృతికి ఉన్న ప్రకార్య పాత్రను వివరించడం ద్వారా వ్యక్తి అవసరాలు పరిపూర్తి కావటం గురించి అయన నొక్కి చెప్పారు. ఆయన ప్రకార్యవాదం అంతకు మించి ముందుకు పోలేదు.

BRAOU

మలినోవ్‌స్కీ ప్రకార్యవాదాన్ని 'సాంస్కృతిక ప్రకార్యవాద'మనికూడా పిలుస్తారు. ప్రతి విషయాన్ని సంస్కృతి కోణం నుంచి వివరించే ప్రయత్నం చేసినందువల్ల దానికి ఆముద్ర వచ్చింది. సాంస్కృతిక ప్రకార్యవాదాన్ని ఈ క్రింది సాధారణ సూత్రాలతో అర్థం చేసుకోవచ్చు.

1) తన అవసరాలు తీర్చుకునే క్రమంలో తన వాతావరణంలో ఎదురయ్యే నిర్దిష్ట సమస్యలనుంచి సమర్థంగా నిలదొక్కుకోగలిగే స్థితి మనిషికి కల్పించేది సంస్కృతి. సంస్కృతి అనేది ఒక ఉపకరణ సామాగ్రి.

2) సంస్కృతి అనేది లక్ష్యాలు, కార్యకలాపాలు, స్వభావాల వ్యవస్థ. అందులోని ప్రతి భాగం ఒక లక్ష్యాన్ని చేరుకునే సాధనంగా నిలిచి ఉంటుంది.

3) సంస్కృతి అనేది పూర్ణ సమస్తం. అందులోని వివిధ మౌలికాంశాలన్నీ పరస్పర ఆధారితాలు.

4) కార్యకలాపాలు స్వభావాలు, లక్ష్యాలన్నీ ముఖ్యమైన కీలకమైన కార్యభావాల చుట్టూ కుటుంబం, వంశం, స్థానిక సముదాయాలు, తెగల వంటి సంస్థల్లోకి సమీకృతమవుతాయి. అలాగే ఆర్థిక సహకారంపై ఆధారపడ్డ వ్యవస్థీకృత బృందాలు రాజకీయ, న్యాయ, విద్యాపరమైన కార్యలాపాలలోకి సమీకృతమవుతాయి.

5) అది ఏరకం కార్యకలాపమనేదాన్ని బట్టి సంస్కృతిని విద్య, సామాజిక నియంత్రణ, ఆర్థిక వ్యవస్థ, జ్ఞాన సముపార్జనా వ్యవస్థలు, విశ్వాసం నైతికత వంటి అనేక అంశాల కింద విశ్లేషించవచ్చు. నిర్దుష్టమైన కళాత్మక వ్యక్తీకరణ రీతులుగానూ విశ్లేషించవచ్చు.

6) పరస్పరం నిర్ణీత సంబంధాలు కలిగి ఉన్న మనుషుల ప్రమేయం సాంస్కృతిక ప్రక్రియలకు అవసరం. అంటే వారు సంఘటితమై, కళాకృతులను సృష్టిస్తూ ఒకరికొకరు భాష ద్వారా లేదా ఇతర పత్రికల ద్వారా సంభాషించుకుంటారు.

## 5.6 మలినోవ్‌స్కీ పై విమర్శ

సంస్కృతిలోని ఆయా అంశాల నడుమ వుండే అంతస్సంబంధాల ప్రాముఖ్యాన్ని మలినోవ్‌స్కీ సరిగానే గుర్తించినా తాను అధ్యయనం చేసిన ట్రోబ్రియాండ్ సంస్కృతి గురించి పొందికయిన చిత్రణ చేయలేకపోయాడని ఆడం కూపర్ అంటాడు. వ్యవస్థను అనుభూతం చేసుకునే మనోతత్వరణ(lacking sence of system) అతడికి లేకపోవడమే ఇందుకు కారణం అన్నది కూపర్ అభిప్రాయం. సంస్కృతిలోని ప్రతీ భాగాన్ని వివరిస్తూ ప్రతి భాగానికి మరో భాగంతో ఉన్న సంబంధాన్ని చూపించడానికి ప్రయత్నమైతే చేశారుగానీ సంస్కృతి అంతస్సారాన్ని మట్టుకు అయన గ్రహించలేకపోయారని దాని భావం. చేతులు భుజాలకు అతుక్కొని ఉన్నాయని, భుజాలు మెడతో కలిసి ఉన్నాయనే తరహాలో వర్ణించుకుంటూపోతే మానవ శరీర నిర్మాణాన్ని వివరించే నియమాలు ఏనాడూ ఆవిష్కృతం కావు. సంస్కృతిని గురించి వివరించే ప్రయత్నంలో మలినోవ్‌స్కీ కూడా ఇదే పొరపాటు చేశారు.

సమాజానికి ప్రకార్య ఐక్యత ఉన్నదని మలినోవ్‌స్కీ చేసిన సూత్రీకరణను రాబర్ట్ మెర్టన్ విమర్శించాడు. సమాజం పక్కాగా తీర్చిదిద్దిన స్థిర సమస్తమని, అందులోని మౌలిక అంశాలన్నీ ఆ సమాజవ్యవస్థను నిలబెట్టడానికే దోహదం చేస్తాయని పైసూత్రీకరణ చెబుతుంది. మలినోవ్‌స్కీవ ఇలా రాస్తాడు. "సంస్కృతి సమస్తానికి ఉపయోగపడే ప్రకార్యమే. పరోక్షంగా సమాజంలోని ప్రతీ సభ్యుడికి జైవిక, మేథో సంక్షేమానికి దోహదపడే ప్రతిఉపయోగమూ ప్రకార్యమే". మెర్టన్ ఈ సూత్రీకరణతో విభేదిస్తూ సాంస్కృతిక విషయాలు సమాజానికి, సమాజంలోని సభ్యులందరికీ ఒకే రీతిలో పనిచేయవని అంటాడు. సామాజిక ఐక్యత సమాజం అనేవి అధ్యయనం చేయవలసిన సమస్యలే తప్ప స్థిర నిశ్చితాలు కావు. అందువల్ల సానుకూల, ప్రతికూల పర్యవసానాలు రెండింటినీ ప్రకార్య విశ్లేషణ వెలికితీసి ఏ అంశాలు, ఏవిధమైన పర్యవసానానికి దారితీస్తున్నాయో, ఎలా దారితీస్తున్నాయో తేల్చిచెప్పాలి.

మలినోవ్‌స్కీ ప్రతిపాదించిన సార్వత్రిక ప్రకార్యవాదాన్ని కూడా మెర్టన్ విమర్శించాడు. 'ప్రమాణీకరించబడిన అన్ని సామాజిక, సాంస్కృతిక రూపాలకు సానుకూల విధులున్నాయని ఈ వాదన పేర్కొంటుంది. "ప్రతీ ఆచారం, వస్తువు, ఆలోచన, విశ్వాసం, ఏదో ఒక కీలక ప్రకార్యాన్ని నిర్వర్తిస్తుంది". అనే మలినోవ్‌స్కీ భావనతో ఆయన విభేదిస్తూ వ్యక్తికి మేలుచేసే ప్రతీదీ సమాజానికి మంచిచేయనక్కరలేదని అంటాడు. శిష్యులు విషయంలో సానుకూల పర్యవసానాలు కలగలిసే ఒక సామాజిక ఆచారం సాధారణ ప్రజల విషయంలో ప్రతికూల పర్యవసానాలకు దారితీయవచ్చునంటారాయన. సమాజ శ్రేయస్సు కోసమని ఏర్పాటు చేసిన సామాజిక సంస్థలు కూడా ఒక్కోసారి ఒక్కో సందర్భంలో కొన్ని సామాజిక విభాగాలకు వినాశకరంగా పరిణమించవచ్చు.

BRAOU

## 5.7 సారాంశం

'ప్రకార్యవాదమనే' మాటను వాడిన మొదటి మానవశాస్త్ర వేత్త మలినోవ్‌స్కీ. ఆయన రూపొందించిన కార్యక్షేత్ర పద్ధతులను నేటికీ అనుసరిస్తున్నారు. మలినోవ్‌స్కీ ప్రఖ్యాత రచన ' ఆర్గొనాట్స్ ఆఫ్ వెస్టర్న్ పసిఫిక్' ఆదిమ సంస్కృతి అధ్యయనానికి సరికొత్త మార్గాన్ని ఆవిష్కరించింది.

ఉపకరణాలు వినియోగదారి వస్తువులు వివిధ సామాజిక సమూహాల రాజ్యాంగాధికారాలు, మనిషి ఆలోచనలు, వృత్తులు విశ్వాసాలు ఆచారాలన్నీ అంతర్భాగమయ్యేలా సంస్కృతి అనే భావనను విజ్ఞాన సర్వస్వరీతిలో ఆయన ఉపయోగించాడు. సాంస్కృతిక అంశాలను అనుభవాత్మక పరిశోధనకు పనికొచ్చే ప్రణాళికగా మలినోవ్‌స్కీ చూశాడు.

అవసరాల సిద్ధాంతాన్ని ఆయన ప్రతిపాదించాడు. మనిషిలోని ప్రతీజీవ ప్రేరణ ఏదోఒక శరీరధర్మ కార్యకలాపాన్ని సంతుష్టపరిచే చర్యకు దారితీస్తుంది. మౌలిక జీవావసరాలు మనిషిని చర్యకు పురికొల్పుతాయి. ఈ మౌలిక విధి విహితాలను పరిపూర్తి చేయడానికి సంస్కృతి ఆవిర్భవించింది. నాలుగు ముఖ్యమైన అనుషంగిక అవసరాలను, వాటి పర్యవసానంగా పుట్టుకొచ్చిన ప్రతిస్పందనలను మలినోవ్‌స్కీ సూచించాడు.

ప్రకార్యవాదాన్ని మలినోవ్‌స్కీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేదని, ఆయన ప్రకార్యవాద సిద్ధాంతాలను పరిశీలిస్తే అర్థమవుతుంది.

## 5.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I.ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. మలినోవ్‌స్కీ ప్రతిపాదించిన సాంస్కృతిక ప్రకార్యవాద సిద్ధాంతాన్ని వివరించండి.

2. మౌలిక అవసరాలు అనగానేమి? ఆ అవసరాలకు సంస్కృతి ఏవిధంగా ప్రతిస్పందిస్తుంది?

**II.ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. అవసరాల సిద్ధాంతం.

2. ప్రకార్యవాద లక్షణాలను తెలుపండి.

## 5.9 చదువదగిన పుస్తకాలు


Ivan-Prichart : Social Anthropology

Adam Cooper : Anthropologist and Anthropology

Iarleach : Teh Epistemological backgroung to Malinovski's Empiricim

Malinovski : Argonauter of the Western Pacific

Malinovski : The sexual life of savager in North-West Melertia

Malinovski : Coral Gardent and their Magier

Malinovski : A Scientific Theory of Culture


BRAOU

# భాగం-6: టోల్‌కాట్ పార్సన్స్

విషయక్రమం


6.0 ఉద్దేశాలు

6.1 పరిచయం

6.2 పార్సన్స్ జీవిత విశేషాలు

6.3 సామాజిక వ్యవస్థ

6.3.1 సామాజిక చర్య

6.4 నమూనా చరాంశాలు

6.4.1 విశ్వజనీనవాదం-ప్రత్యేకవాదం

6.4.2 గుణం-ఆచరణ

6.4.3 ప్రభావం-ప్రభావ తటస్థత

6.4.4 నిర్దిష్టత- వ్యాప్తిత్వం

6.4.5 స్వీయాత్మ అవగాహన-ఉమ్మడి అవగాహన

6.5 ప్రకార్యవాద పూర్వావసరాలు

6.5.1 అనువర్తితం

6.5.2 లక్ష్యసాధన

6.5.3 సమగ్రత

6.5.4 సముద్ధరణ

6.6 సామాజిక మార్పు

6.6.1 సామాజిక వ్యవస్థలో అంతర్గత మార్పులు

6.6.2 పరిణామ సార్వత్రికాల ద్వారా సామాజిక వ్యవస్థల మార్పులు

6.7 విమర్శ

6.8 సారాంశం

6.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

6.10 చదవదగిన పుస్తకాలు


## 6.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- సామాజిక వ్యవస్థలపై పార్సన్స్‌కు ముందు జరిగిన అధ్యయనాల రీతులను అర్థం చేసుకుంటారు.
- సామాజిక వ్యవస్థ అర్థాన్ని, పార్సన్స్ ప్రతిపాదించిన చర్యారీతిని వివరించగలుగుతారు.



BRAOU

- పార్సన్స్ చెప్పిన నమూనా చరాంశాల భావనను వివరించగలుగుతారు.
- ప్రకార్యవాదానికి సామాజిక మార్పులకు మధ్యగల సంబంధాన్ని చర్చించగలుగుతారు.
- సామాజిక వ్యవస్థలోని అంతర్గత మార్పులను వివరించగలుగుతారు.

## 6.1 పరిచయం

టోల్‌కాట్ పార్సన్‌ను మించిన సిద్ధాంతవేత్త ఆకాలంలో బహుశా మరొకరు లేరనే చెప్పవచ్చు. 1950 నుంచి 1970 వ దశకం మలినాళ్లదాకా, పార్సన్స్ ప్రకార్యవాదమే కేంద్ర స్థానంగా ఉంటూ సైద్ధాంతిక వివరాలకు పుట్టిల్లయింది. ఆయన ప్రకార్యరీతిని వ్యతిరేకించలేదు. దానిగురించి పట్టించుకోలేకుండా ఉండలేక పోయారు. ఆయన సిద్ధాంతం ఇప్పటికీ వివాదం సృష్టిస్తూనే ఉంది.

పార్సన్స్ ప్రతిపాదనలు మౌలికంగా సిద్ధాంతపరమైనవి. ఆనాటి సంప్రదాయక అనుభవాత్మక పరిశోధనలకు అవి అనుగుణం కావు. సమాజశాస్త్ర సమస్తానికి ఒక భవనాత్మక నిర్మితిని సమకూర్చాలన్నది పార్సన్స్ లక్ష్యం. అది అన్ని సామాజిక శాస్త్రాలను సమైక్యపరిచేదిగా కూడా ఉండాలి.

## 6.2 జీవిత విశేషాలు

టోల్‌కాట్ పార్సన్స్ కొలరాడా (అమెరికా)లోని ఒక ప్రొటెస్టెంట్ ఆధ్యాత్మిక కుటుంబంలో 1902లో జన్మించాడు. ఆయన తండ్రి రెవరెండ్ ఎడ్వర్డ్ పార్సన్స్ కొలరడాలో క్రైస్తవ మతాధికారిగా ఉండేవారు. తొలుత జీవశాస్త్రంలో శిక్షణ పొందిన పార్సన్స్ 1923లో సమాజ శాస్త్రాలపట్ల ఆకర్శితుడయ్యాడు. 1924లో అమ్‌హోర్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకొని అనంతరం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో తదుపరి చదువులు కొనసాగించేందుకు ఇంగ్లాండు చేరుకున్నారు. అక్కడ ఎల్.టి.హచ్‌సేన్, మోరిస్ గిన్‌బెర్గ్, బ్రానిస్లావ్ మలినోవ్‌స్కీలతో కలిసి అధ్యయనం సాగించాడు. సమాజశాస్త్రంలో ఆయన నిపుణుడయ్యింది ఇక్కడే.

B R A O U

విద్యార్థుల మార్పిడి కార్యక్రమం కింద 1925లో ఆయన హెడెల్‌బర్గ్ వెళ్లారు. దాంతో అతనికి జర్మన్ సమాజ శాస్త్రం సాహిత్యంలో పెట్టుబడిదారీ విధానం గురించిన భావనలపై ఆయన పరిశోధనా పత్రం రచించారు. కారల్ మార్క్స్, వెబర్, సోంబార్టెన్‌ల రచనలను ఆయన తన పరిశోధనలకు ప్రత్యేక పరిశీలనాంశాలుగా ఎంచుకున్నాడు. అనంతరం 1927లో హార్వర్డ్ యూనివర్శిటీ అర్థశాస్త్ర విభాగంలో శిక్షకుడిగా నియమితులయ్యారు. ఆతర్వాత అదే యూనివర్శిటీలో సామాజిక సంబంధాల విభాగాన్ని స్థాపించి దాని తొలి ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

మనోవిశ్లేషణా పద్ధతిపై ఆసక్తి పెంచుకొని ఫ్రాయిడ్ రచనలు, ఆయన అనుయాయుల రచనలను పార్సన్స్ అధ్యయనం చేశాడు. వారి ఆలోచనలు, ప్రతిపాదనల నుంచి ప్రమాణమైన ఏకసిద్ధాంతాన్ని రూపొందించారు. వెబర్ రచన 'ది ప్రొటెస్టెంట్ ఎథిక్ అండ్ ది స్పిరిట్ ఆఫ్ క్యాపిటలిజం'ను ఇంగ్లీషులోకి అనువదించడం ద్వారా అమెరికన్ సమాజశాస్త్రానికి వెబర్‌ను పరిచయం చేసిన వాడయ్యాడు. పార్సన్స్ చేసిన రచనల్లో The Structure of Social Action (1937), The Social System and the Evolution of the Action Theory (1977), Essays in Sociological Theory (1949), Social System(1957), Social Structure and personality (1964), The System of Modern societies (1971), Action Theory and The Human Condition (1978)లు ముఖ్యమైనవి.

సమాజశాస్త్రానికి సంబంధించిన స్థూల సిద్ధాంతాభివృద్ధికి పార్సన్స్ ఎంతగానో దోహదపడ్డాడు. పలు దశాబ్దాలపాటు అమెరికన్ సమాజ శాస్త్రానికి మకుటం లేని మహారాజుగా ఆయన వెలుగొందాడు. 1979 మే 8వ తేదీన హెడెల్‌బర్గ్ (జర్మనీ)లో ఆయన కన్నుమూశారు.

## 6.3 సామాజిక వ్యవస్థ

పార్సన్స్ తన బృహత్ రచన The Structure of Scoial Actionలో సామాజిక సమస్య గురించి తన అభిప్రాయాలను, చర్యా సిద్ధాంతాన్ని పార్సన్స్ ప్రకటించాడు. సామాజిక చర్య, సామాజిక వ్యవస్థలపై తనకంటే ముందున్న సామాజిక శాస్త్రవేత్తలు చేసిన కృషిని సమీక్షించిన పిదప తన ఆలోచనలను పాఠకుల ముందు ఉంచారు. తనకంటే ముందు జరిగిన కృషిని స్థూలంగా మూడు ఆలోచనా విధానాలకింద ఆయన విభజించాడు. అవి ప్రయోగిత వాదం, శుద్ధవాదం, భావ వాదం,

బాధకన్నా సుఖం మెరుగైనదనే వాస్తవాన్ని ప్రయోగితా వాదం విశ్వసిస్తుంది. అత్యధిక సంఖ్యాకుల అత్యధిక ఆనందదాయకతే ఉపయోగమని ఈ వాదం చెబుతుంది. ఉపయోగాన్ని విస్తరించుకోవడమే మేధావుల లక్ష్యం కావాలని అంటుంది. మొదట్లో బ్రిటిషు సమాజశాస్త్రం ఈ తాత్వికవాద ప్రభావంలో ఉండేది ఈ తాత్వికవాద దృక్పథం చేత చాలా ముందుగా ప్రభావితుడైన సమాజశాస్త్రవేత్త హెర్బెర్ట్ స్పెన్సర్. ఉపయోగం ఏమిటి, ఎంత అనేది వ్యక్తి స్థాయిలో ప్రేరణ వుంటుందని అంటాడు. హేతుబద్ధ ప్రేరణలనుంచే సామాజిక వ్యవస్థలు పుట్టుకొచ్చాయన్నది వారి అభిప్రాయం. ఐతే ఉపయోగితావాదులు క్రమబద్ధ వ్యవస్థల గురించి చేసే విశ్లేషణ విలువల పాత్రను విస్మరిస్తోందని పార్సన్స్ చెబుతాడు.

కాగా, సామాజిక పాత్రధారులందరికీ తామున్న సామాజిక పరిస్థితుల గురించి పూర్తి అవగాహన ఉంటుందని అగస్ట్ కోమ్ట్ తదితర శుద్ధవాదులు నమ్ముతారు. పరిస్థితి పూర్తి సమాచారం నుంచి చర్య పుట్టినప్పుడు వారి ప్రణాళికలో మార్పు చేర్పులకు తావుండదని పార్సన్స్ పేర్కొన్నాడు. ఆ సమయంలో విలువలు, పొరపాట్లు, తేడాలు వుండవు.

జగత్తు నిర్మాణంలో మానవ చింతన కీలకపాత్ర వహిస్తుందని భావ వాదులు నమ్ముతారు. ఒక గొప్ప మేథో పథకాన్ని పరిపూర్తి చేయడం కోసం మానవులు పనిచేస్తారని వారు భావిస్తారు. ఇమ్మాన్యుయేల్ కంటే హెగెల్, వెబర్‌లు ఈ దృక్పథాన్ని ముందుగా ప్రకటించారు. వీరి ఆలోచనా విధానాన్ని పార్సన్స్ తోసిపుచ్చలేదు. విలువలు, ఆలోచనల ప్రాధాన్యతను అతిగా నొక్కి చెబుతూ సామాజిక వ్యవహారాలలో భావవాదం తగినంతగా పట్టించుకోలేదని ఆయన అంటాడు.

ఉపయోగితావాదులు వ్యక్తి వివేకానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి, సామాజిక ఇష్టాల గురించి పట్టించుకోలేదని, రూఢివాదులు పరిస్థితుల పరిపూర్ణ జ్ఞానానికి ప్రాధాన్యమిచ్చి విలువల పాత్రలో పొరపాట్లు, తేడాలను విస్మరిస్తారని, భావవాదులేమో విలువల గురించి మాట్లాడుతూ ఆ విలువలపై అనుభవైక వాస్తవికత తీసుకువచ్చే వత్తిళ్లను మరచిపోతారని పార్సన్స్ తేల్చి చెప్పాడు. సామాజిక వ్యవస్థల అధ్యయనానికి 'చర్యారీతి' అనబడే తన మార్గాన్ని ఇక ఎప్పుడూ ఆయన వివరిస్తారు.

### 6.3.1 సామాజిక చర్య

'మానవుల బాహ్య శక్తులకు ప్రతిక్రియ చూపడానికి ముందు వాటిని గ్రహించి, అర్థం చేసుకొని వివరించవచ్చుననుకొంటారు. ఈ మానవ ప్రవృత్తియే సామాజిక చర్య' అని పార్సన్స్ నిర్వచించాడు. ఈ అర్థం ప్రకారం ప్రతీ చర్యా ప్రవృత్తికిందకు వస్తుంది. ఐతే అన్ని ప్రవృత్తులూ చర్యాతరగతికి చెందకపోవచ్చు. ఎందుకంటే ప్రవృత్తి చర్యగా పరిణమించడానికి నాలుగు స్థితులను అది కలిగి ఉండాలి. అవి: 1. ఉద్దేశాలు, లక్ష్యాలు లేదా ఆపేక్షించిన ఇతర వ్యవహారాలను సాధించేందుకు పూర్తిగా కలిసి ఉండాలి. 2. కొన్ని పరిస్థితుల్లో అది సంభవించాలి. 3. సామాజిక విలువలు, నియమాల చేత అది నియంత్రితమై ఉండాలి. 4. శక్తి లేదా ప్రేరణ లేదా కృషి మదింపు ఉండాలి.

ఈ అంశాలన్నీ కలిసి ఉన్నప్పుడు ప్రవృత్తి చర్యగా మారుతుంది. ఉదాహరణకు ఒక మనిషి గుడికి బయలుదేరాడనుకుందాం. దేవుడికి మొక్కుకోవడం అనే ఉద్దేశానికి అతడు నిర్దేశితుడై ఉన్నాడు. కారులో కూర్చుని రోడ్డు మీద తన వాహనం నడుపుకుంటూ వెళ్తుండడం అతడి పరిస్థితి. అతడి ప్రవృత్తిని సామాజిక నియమాలు,

BRAOU

విలువలు, నియంత్రిస్తున్నాయి. దైవ ప్రార్థన అభిలషణీయతను అవి గుర్తిస్తాయి. అందుకు తోడు డ్రైవింగ్ అనే నియంత్రణకు తన తెలివితేటలను ఉపయోగిస్తున్నాడు. ఆ నియంత్రణను అతడు సమాజం నుంచి నేర్చుకొన్నాడు. అంతేకాకుండా, కారు నడపడం అంటే శక్తిని వెచ్చించడమే అవుతుంది. ఇలాంటి విశ్లేషణా పూర్వక సందర్భాలలో కనిపించే ప్రవృత్తిని చర్యగా నిర్వచించవచ్చు.

ఒక స్వచ్ఛంద చర్యకు ఈ క్రింది అంశాలు అవసరం. అవి: 1. పాత్రదారులు వ్యక్తులై ఉండాలి. 2. పాత్రధారులు లక్ష్యసాధకులై వుండాలి. 3. లక్ష్యాలు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ సాధనాలను కూడా పాత్రధారులు కలిగి ఉండాలి. 4. లక్ష్యాలు, వాటిని చేరుకునేందుకు ఉపకరించే సాధనాల ఎంపికను ప్రభావితం చేసే విభిన్న పరిస్థితులు పాత్రదారులకు ఎదురవుతాయి. అవి సొంత శరీర పరిస్థితి కావచ్చు, వంశపారంపర్యంగా సంక్రమించినదే అయి వుండవచ్చు. వాటితోపాటు వివిధ బాహ్యపర్యావరణ పరమైన ప్రతిబంధకాలు వుంటాయి. 5. పాత్రధారులు విలువలు, నియమాలు, ఇతర భావనలతో నడుస్తారు. లక్ష్యాన్ని చేరేందుకు ఎంచుకొనే సాధనాల్ని అవి ప్రభావితం చేస్తాయి. 6. లక్ష్యాల సాధనకు అవసరమైన మార్గాలను గుర్తించి పాత్రధారులు చేసే నిర్ణయాలు చర్యతో కూడి ఉంటాయి. ఆ నిర్ణయాలు భావాలకు, పరిస్థితులకు లోబడి వుంటాయి.

వివిధ రకాలుగా ప్రేరేపితులైన పాత్రధారులు పరస్పరం కలుసుకున్నపుడు నమ్మకాలు ఏర్పరుచుకుంటారు. ఆయా తరహాల పరస్పర ప్రతిక్రియను నిలుపుకుంటారు. క్లుణ్ణంగా అవి 'వ్యవస్థీకృతమైనవై' వుంటాయి. ఈ వ్యవస్థీకృత నమూనాలనే సామాజిక వ్యవస్థగా భావించవచ్చునని పార్సన్స్ చెబుతాడు. అందువల్ల పార్సన్స్ దృష్టిలో స్వచ్ఛందచర్య అనే పునాదిపై సామాజిక వ్యవస్థ నిర్మితమవుతుంది. పార్సన్స్ ఇలా రాస్తారు. "సూక్ష్మంగా చెప్పాలంటే, ఒకానొక పరిస్థితిలో పరస్పర ప్రతిక్రియ నెరుపుతున్న విడివిడి పాత్రదారుల బహుళత్వంలో సామాజిక వ్యవస్థ రూపుదిద్దుకొంటుంది. కనీసం ఒక భౌతిక లేదా పర్యావరణ పరమైన అంశం సదరు పరిస్థితిలో చేరి ఉంటుంది. సుఖాన్ని విస్తరించుకోవడమనే ధోరణి పరంగా పాత్రదారులు ప్రేరణ పొంది ఉంటారు. పరిస్థితిలో పాత్రధారులకూ, పాత్రధారులకు మధ్య పరస్పరం ఉండే సంబంధాలు మొత్తం సాంస్కృతికంగా నిర్మితమైన ఉమ్మడి ప్రతీకల వ్యవస్థ పరంగా నిర్వచించవచ్చు'.

పార్సన్స్ భావన ప్రకారం ఒక సామాజిక వ్యవస్థ ఈ క్రింది లక్షణాలు కలిగి ఉంటుంది.

1. సామాజిక వ్యవస్థలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పాత్రధారుల మధ్య పరస్పర ప్రతిక్రియ నెలకొంటుంది. ఈ పరస్పర ప్రతిక్రియపైనే సామాజిక వ్యవస్థ చూపు ప్రధానంగా నిలిచి ఉంటుంది.

2. ప్రతిక్రియ చోటుచేసుకుందంటే సదరు పరిస్థితిలో ఇతర పాత్రదారులు లేదా ప్రత్యమ్నాయాలు(alternatives) ఉండరని అర్థం. భావావేశాన్ని, విలువల వివేచనకు వీరు కలిగి ఉంటారు. లక్ష్యాలు వాటిద్వారానే సాధిస్తారు.

3. సమాజానికి ఉమ్మడి లక్ష్యం, ఉమ్మడి విలువలు, అకాంక్షలపై ఏకీభావం ఉంటాయి.

సామాజిక చర్య అనే నిర్దిష్ట వ్యవస్థలో మూడు అంశాలు కలిసి ఉంటాయి. అందులో సామాజిక వ్యవస్థ ఒకటి. మిగతా రెండు మూర్తిమత్వ వ్యవస్థ, సాంస్కృతిక వ్యవస్థ. సాంస్కృతిక వ్యవస్థ చివరి రెండు అంశాలు విశ్లేషణ పరంగా స్వతంత్రను కలిగి ఉన్నప్పటికీ సామాజిక చర్యలో సన్నిహిత సంబంధం కలిగి ఉంటాయి. వ్యక్తిగత పాత్రధారులు శిష్ట అవసరాలు, డిమాండ్లను, చర్యల ఎంపికను మూర్తిమత్వ వ్యవస్థ నిర్వహిస్తుంది. సంఘటిత చర్యకు అవసరమైన నైతిక సూక్తులను, ఉపదేశాలను, ప్రవర్తనా నియమావళిని సాంస్కృతిక వ్యవస్థ సమకూర్చుకుంటుంది. సదరు నియమాలు, విలువలు, సూత్రాలు ఎందుకు పాటించవలసి ఉంటుందో వివరించే విలువ ప్రమాణాలను అది నిర్దేశిస్తుంది.

ఈ చర్యా వ్యవస్థలు దేనికదిగా విడదీయడం, విశ్లేషణా పరంగా సాధ్యమే. ఐతే వాస్తవంలో అవి పరస్పరం పెనవేసుకుని ఉంటాయి. అంటే ఒక వ్యవస్థలోని కొన్ని కీలకాంశాలకు సంబంధించిన సమపూరకాలు (counter parts) మరో వ్యవస్థలో ఉంటాయి.



BRAOU

## 6.4 నమూనా చరాంశాలు

సామాజిక వ్యవస్థలో 'పాత్ర' అనే ప్రవర్తనావ్యవస్థ ఇమిడి వుంటుంది. సమాజంలోని వ్యక్తులకు సామాజిక వ్యవస్థ ఈ పాత్రలను ఆయా పాత్రలకు సరిపోయే ప్రవర్తనా రీతులను ఆపాదిస్తుంది. వ్యక్తి కూడా సాంఘికీకరణం ద్వారా వ్యవస్థ ఆపాదించిన పాత్రలను స్వీకరిస్తాడు. ప్రవర్తనా ధోరణులను అనుసరిస్తాడు. ప్రమాణాలను అంతరంగీకరణం చేసుకుంటాడు. పాత్ర స్వీకరణ, పాత్ర పోషణ సమాజంలో ఒక ఒకకొత్త ఒత్తిడికి దోహదం చేస్తుంది. ఈ పాత్రల పోషణలో, స్వీకరణలో ఒత్తిడివల్ల వ్యక్తులు (పాత్రదారులు) సందిగ్ధంలో పడతారు. వ్యక్తి ఇష్టాయిష్టాలు లేదా ప్రాధాన్యతలు అలాగే అవసరాలు, విలువల్లోంచి ఈ సందిగ్ధత, ఉద్రిక్తతలుపుట్టుకొస్తాయి. పరిస్థితికి అనుగుణంగా అడుగువేసేముందు పాత్రధారి తన ముందున్న అవకాశాలలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవలసి వస్తుంది. అప్పుడు సందిగ్ధత, ఒత్తిడి తప్పదు. పాత్రపోషణలో పాత్రధారి (వ్యక్తి) ఎదుర్కొనే ఈ సందిగ్ధావస్థనే పార్సన్స్ నమూనా చరాంశాలు (pattern variable) అన్నాడు.

పార్సన్స్ ఐదు రకాల చరాంశాలను పేర్కొంటూ ప్రతీ చరాంశానికి దాన్ని తీవ్రంగా విభేధించే భిన్న ధృవం వుంటుందని పేర్కొన్నాడు. వ్యక్తి సామాజిక ఆపాదితాల ద్వారా, సాంఘికీకరణ ప్రక్రియ ద్వారా, ప్రమాణికతలను అంతర్లీనం చేసుకోవడం ద్వారా సమాజం ఆమోదించే 'నమూనా చరాంశాన్ని' గుర్తిస్తాడు, అనుసరిస్తాడు. అవి:

1. విశ్వజనీనవాదం-ప్రత్యేకవాదం (Universalism Versus Perticularism)
2. గుణం-ఆచరణ (కార్యాచరణ) (Quantity Versus Performance)
3. ప్రభావం-ప్రభావ తటస్థత (Affectivity Verses Affective neutrality)
4. నిర్దిష్టత-వ్యాపకత (Specificity Versus Diffuseness)
5. స్వీయాత్మ అవగాహన- ఉమ్మడి అవగాహన (Self Orientation Versus Collectivity Orientation)

ఈ నమూనా చరాంశాలు పాత్రధారి(మనిషి)లో కలిగించే ఒత్తిడి ఎలా వుంటుందో పార్సన్స్ వివరించాడు. ఆ వివరాలు తెలుసుకుందాం.

BRAOU

### 6.4.1 విశ్వజనీనవాదం-ప్రత్యేకవాదం

అనుభవిక (congitive), భావోద్వేగ మూల్యాంకనల మధ్య ఏర్పడే పాత్ర పరిస్థితికి అలాగే పాత్ర ధారిలో కలిగే సందిగ్ధ స్థితికి ఈ నమూనా చరాంశం అద్దం పడుతుంది. ఇది ఒక పాత్ర ధారి తన పాత్రను ఏ ప్రమాణాలకు అనుగుణంగా పోషించాలో అంటే ఏ ప్రామాణిక పరిస్థితులకు అనుగుణంగా ప్రవర్తించాలో తెలియజేసే విషయాన్ని సూచిస్తుంది. అంటే పాత్ర పరిధిని (సార్వాత్రికమా- స్థానీయమా) బట్టి పాత్రధారిత సామాజిక విలువ ఆపాదించబడుతుంది.

ఉదాహరణకు ఒక మంచి వైద్యుడు, మంచి న్యాయవాది లేదా అందమైన యువతిని గుర్తించాల్సి వచ్చినప్పుడు సార్వత్రిక ప్రమాణాలను బట్టి నిర్ణయించాల్సి వుంటుంది. అంటే ఇప్పటివరకు మొత్తం ప్రపంచంలో మనం చూసిన, విన్న, గుర్తించిన అనుభవాలను బట్టి ఈ అంచనాకు రావాల్సి ఉంటుంది. అయితే మరోవైపు డాక్టర్‌ను ఎంచుకోవలసి వచ్చినప్పుడు సమర్థతను బట్టి కాకుండా పాత్రధారి తనకున్న స్నేహానికి విలువనిచ్చి ఎంపిక చేసుకుంటాడు. ఇక్కడ పాత్రధారి సార్వత్రిక గీటురాయిని కాదని, ప్రత్యేక సంబంధానికి ప్రాధాన్యతనిచ్చాడు.

నియత వ్యవస్థలు(formal organisations), ఆధునిక సంస్థల ఉద్యోగి సామ్యం పాత్ర విస్తృతమవుతున్న సమాజాల్లో పాత్రదారుల్లో ఇటువంటి సందిగ్ధ పరిస్థితి ఎదురవుతుందని పార్సన్స్ పేర్కొన్నాడు. ఈ సమాజాల వ్యక్తుల దైనందిన జీవితంలో సార్వత్రిక, ప్రత్యేక ప్రాధాన్యతల మధ్య సందిగ్ధత నిరంతరం కొనసాగుతుంటుందన్నది ఆయన

భావన.

### 6.4.2 గుణం-ఆచరణ

వస్తువును ఉన్నది ఉన్నట్టుగా చూడడమో (గుణాన్ని బట్టి) లేక ఆ వస్తువు ఆచరణను బట్టి అంటే చేసే పనినిబట్టి చూడడమో అన్నది సందిగ్ధావస్థ. ఈ నమూనా చరాంశాన్నే ఆపాదిత ఆర్జిత విలువల చరాంశంగా కూడా పార్సన్స్ పేర్కొన్నాడు. పాత్రధారి తన పాత్రకు సంబంధించిన వస్తువుల, చర్యలను వాటి ఆపాదింపు(ascription)ను బట్టి చూడాలా లేక సాధించడాన్ని (achievement)ను బట్టి చూడాలా అన్నది సందిగ్ధత అంశం. ఇంకా చెప్పాలంటే సామాజిక సంబంధాల్లో ఒక వ్యక్తి వయస్సు, లింగస్థితి, హోదా వంటి ఇంద్రియగ్రాహ్యమైన వాస్తవిక గుణాలు ముఖ్యమా లేక ఆ వ్యక్తి పని తీరు, కార్యాచరణ సామర్థ్యం, అర్హతలు ముఖ్యమా అన్న సంశయం వుంటుందన్నది పార్సన్స్ వాదన. ఉదాహరణకు పెద్దలను గౌరవించడం అనే సాంప్రదాయాన్నే తీసుకుందాం. ఈ గౌరవం పెద్దలకు వారి వయస్సు (ఆపాదిత అంశం) ప్రాతిపదికన ఇస్తుంటాం. అలాగే ఒక ఉత్తమ విద్యార్థికి వయస్సుతో ప్రమేయం లేకుండా అతను సాదించిన ఫలితాన్ని బట్టి విలువ, గౌరవం దక్కుతాయి. ఇందులో ఆపాదిత విలువకంటే సాధించిన విలువే ఆచరణ పరంగా ప్రాముఖ్యత కలిగి ఉంటుందని, అదే ముఖ్యమైందని పార్సన్స్ వాదించాడు.

### 6.4.3 ప్రభావం-ప్రభావ తటస్థత

పరిస్థితులపై పాత్రకలుగజేసే ప్రభావశీలతను, అలాగే ప్రభావ తటస్థతల మధ్యన వుండే సందిగ్ధతలను సూచించే పరిస్థితుల్లో వ్యక్తి తన భావోద్వేగాలను వ్యక్తం చేయాలి. వాటిని ఏస్థాయిలో వెల్లడించాలి అనే అంశాలు సందిగ్ధతకు దారితీస్తాయి. అనుభూతుల వ్యక్తీకరణలో అంతిమంగా పాత్రధారికి ఉన్న అవకాశాలు, పరిస్థితులు అలాగే వ్యక్తీకరణ స్థాయి సందిగ్ధస్థితికి కారణమవుతాయి. ఒక రోగి విషయంలో తల్లి చూపించే ప్రేమాభిమానాలు, భావోద్వేగాలు ప్రభావతీవ్రతను చాటుతాయి. కాగా, అదేరోగి విషయంలో డాక్టర్ చూపించే ఆప్యాయత, ఆదరణ ప్రభావత తటస్థతకు ఉదాహరణగా నిలుస్తాయి.

BRAOU

### 6.4.4 నిర్దిష్టత-వ్యాప్తిత్వం

పాత్రపోషణకు ఉన్న పరిధిని ఈ నమూనా చరాంశం సూచిస్తుంది. ఇది ఇద్దరు వ్యక్తులు లేదా రెండు పాత్రదారుల మధ్య గల పరస్పర చర్యల స్వభావాన్ని సూచిస్తుంది. కొన్ని సామాజిక పరస్పరచర్యలు నిర్దిష్టంగా వుంటే మరికొన్ని విస్తృతంగా వుంటాయి. ఉదాహరణకు ఒక సూపర్ మార్కెట్‌లో వస్తువులు కొనడానికి వెళ్లిన వ్యక్తికి అక్కడ వున్న సేల్స్‌మన్‌కూ మధ్య ఆ పాత్రను బట్టి నిర్దిష్టమైన సంబంధాలు ఉంటాయి. కొనుగోలు దారుకు, సేల్స్‌మన్ గురించి, సేల్స్‌మన్‌కు కొనుగోలుదారు గురించి పెద్దగా పరిచయం ఉండాల్సిన అవసరం లేదు. అలాగే వారి కులమతాలు, ఆర్థిక స్థితిగతులలో అంత సంబంధం కూడా వుండనవసరం లేదు. అక్కడి వ్యక్తులు ఒక నిర్దిష్ట అవసరం కోసం ఆయా పాత్రలు నిర్వహిస్తున్నారు. కానీ భార్య, భర్తలు, స్నేహితుల మధ్య వుండే పరస్పర చర్యలు అలా వుండవు. స్నేహంగానీ, బంధంగానీ ఏర్పడాలంటే అంతకు ముందే ఇద్దరికీ ఒకరి గురించి ఒకరికి సంపూర్ణ అవగాహన ఉండాలి.

### 6.4.5 స్వీయాత్మ అవగాహన-ఉమ్మడి అవగాహన

పద్ధతుల మూల్యాంకనం నైతికత ప్రమాణాలను ఈ నమూనా చరాంశం సూచిస్తుంది. పాత్రధారి తనగురించి తానే మూల్యాంకనం చేస్తున్నాడా? లేక ఉమ్మడి మూల్యాంకన పద్ధతులకు ప్రాధాన్యతనిస్తున్నాడా అన్నది ఇక్కడ సందిగ్ధతకు మూలమవుతుంది. పాత్రధారి తనకు తాను స్వయంగా అవగాహన చేసుకునేటప్పుడు ఎక్కువ విలువను ఆపాదించుకోవడం జరుగుతుంది. అదే ఉమ్మడి మూల్యాంకన పద్ధతిలో అవగాహన చేసుకునేటప్పుడు ఆ పాత్ర ప్రాధాన్యత తగ్గే అవకాశం వుంది. ఉదాహరణకు సైనికపాలనలో ప్రభువు తనను తాను ఎక్కువ చేసుకునే అవకాశం వుంటుంది. అదే సోషలిస్టు తరహా సమాజంలోనైతే ఉమ్మడి అవగాహన ఆధారంగా మూల్యాంకనం జరుగుతుంది. పార్సన్స్ నమూనా చరాంశాలను చూసినప్పుడు పార్సన్ ప్రతిపాదనలు పాత్రల పరస్పర చర్యల స్వభావాన్ని, పాత్రల పట్ల సమాజం ఆశించే విలువల్ని వివరిస్తాయి. అంతటితో ఆగకుండా సామాజిక వ్యవస్థలో వ్యక్తులు ఎంచుకునే పాత్రల దిశను కూడా ఈ సిద్ధాంతం అంచనా వేసే ప్రయత్నం చేసింది. సామాజిక సంబంధాలను, వ్యక్తుల మధ్య

(పాత్రలమధ్య) పరస్పర చర్యలను అభివర్ణించేందుకు ఈ నమూనా చరాంశాలు ఎంతగానో తోడ్పడతాయని పార్సన్స్ విశ్వసించాడు. ముఖ్యంగా కుటుంబ కార్యకలాపాలు, ఉద్యోగ వ్యాపారాల్లో ఉన్న సంబంధాల స్థాయిని ఉదాహరణగా పరిశీలిస్తే ఈ రెండు భిన్న ధృవాలుగా కనిపిస్తాయి. ఒకటి కొకటి తీవ్రంగా విబేధించే చరాంశాలతో కూడుకున్నవిగా ఉంటాయి. కుటుంబ సంబంధాలు అత్యంత ప్రభావితంగా, విస్తృతంగా, ప్రత్యేకంగా, గుణాత్మకంగా అలాగే సమష్టి అవగాహనలకు అనుగుణంగా వుంటాయి. కాగా, వ్యాపార, ఉద్యోగ వ్యవహారాలు ప్రభావ తటస్థత కలిగి, నిర్దుష్టంగా, సార్వజనీనంగా వుంటాయి. పనితీరును బట్టి స్వీయ అవగాహనను అనుసరించి వుంటాయి. ఈరకంగా పార్సన్స్ సామాజిక సంబంధాలను అభివర్ణించడానికి, నిర్వచించడానికి వర్గీకరించడానికి తన సిద్ధాంతాన్ని ఒక బలమైన ఆయుధం చేసుకున్నాడు. ఇవి టోనిస్ ప్రతిపాదించిన జెమిన్‌షాఫ్ట్, జెసెల్ షాఫ్ట్ కంటే మెరుగైన ప్రాతిపదికలుగా నిలిచాయి.

## 6.5 ప్రకార్యవాద పూర్వావసరాలు

సమాజంలో కుటుంబం, ఆర్థిక వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ వంటి అన్ని వ్యవస్థలు నిరంతరాయంగా కొనసాగే ఏర్పాటు సమాజంలోనే వుందని పార్సన్స్ పేర్కొన్నాడు. సమాజంలో సభ్యులుగా వుండే వ్యక్తులు ఆ సామాజిక విలువలు, ప్రామాణికతలకు అనుగుణంగా సాంఘికీకరణం చెందుతూ వుండడం వల్ల ఈ వ్యవస్థలో అలా నిరంతరాయంగా వర్ధిల్లుతున్నాయని, సామాజిక విలువలకు అనుగుణంగా వ్యక్తుల ప్రవర్తన, ఉద్దీపన, విలువలు రూపొందుతుంటాయని పార్సన్స్ భావించాడు.

BRAOU

వాతావరణ పరిస్థితులను బట్టి మనిషి శరీరంలో ఎలాగైతే మార్పులు జరుగుతాయో సామాజిక వ్యవస్థ అప్రతిహతంగా కొనసాగడానికి కూడా బయటి వాతావరణాన్ని బట్టి వ్యవస్థలో అంతర్గతంగా కొన్ని సర్దుబాట్లు జరుగుతుంటాయని పార్సన్స్ పేర్కొన్నాడు. సామాజిక వ్యవస్థ ఎప్పటికప్పుడు బయటినుంచి వచ్చే మార్పులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకుంటుంది. సామాజిక వ్యవస్థలో ఇలాంటి స్వయం నియంత్రణ, స్వయం నిర్వహణ గుణాలు పుష్కలంగా వున్నాయి. ఈ రకంగా సర్దుబాట్లు చేసుకొంటూ ఇటు అంతర్గతంగానూ, అలాగే విధుల ద్వారా బాహ్యంగానూ వ్యవస్థ కొనసాగుతూ వుంటుంది.

ఇలా సామాజిక వ్యవస్థ కొనసాగడానికి కొన్ని దోహదపడే వ్యవస్థలలోని ప్రకార్యాలను పార్సన్స్ ప్రకార్య పూర్వాపరాలు అన్నాడు. అవి:

1. అనువర్తితం (adaptation)

2. లక్ష్యసాధన (goal attainment)

3. సమగ్రత (integration)

4. సముద్ధరణ (latency)

ఈ నాలుగు ప్రకార్య పూర్వావసరాల పరిధి అంతర్గతంగా అలాగే బాహ్యంగా అవి నిర్వహించే ప్రక్రియలను బట్టి వుంటుంది. అది పరస్పర చర్యలు, సర్దుబాట్లను బట్టి వుంటుంది. వాటి గురించి మరికొంత వివరంగా తెలుసుకుందాం.

### 6.5.1 అనువర్తితం

వ్యవస్థ బయటినుంచి వనరులను స్వీకరించి అంతర్గత అవసరాలకు అనుగుణంగా మలిచి పంపిణీ చేసే విధినే అనువర్తితంగా పార్సన్స్ అభివర్ణించాడు. బాహ్య వనరులను సమీకరించడంలో అంతర్గత అవసరాలకు అనుగుణంగా వాటిని పంపిణీ చేయడంలో ఈ గుణం దోహదపడుతుంది. ఆర్థిక వ్యవస్థను గమనించినట్టయితే వనరుల సమీకరణ,

ఉత్పత్తుల తయారీ, పంపిణీ, వినిమయం వంటి సామాజిక అవసరాలు తీర్చి వ్యవస్థ నిరాటంకంగా కొనసాగడానికి తోడ్పడుతుంది. అనువర్తితం ద్వారా సామాజిక వ్యవస్థ వనుల లోటును అధిగమిస్తుంది.

### 6.5.2 లక్ష్యసాధన

కేవలం ఆర్థిక వ్యవస్థే మనుగడను స్థిరపరచదు. వస్తువుల ఉత్పత్తి, వనరుల సమీకరణ మాత్రమే సామాజిక వ్యవస్థ వర్ధిల్లడానికి సరిపోదు. అందుకు వ్యూహాలు, లక్ష్యాలు, అవసరాలను, నిల్వలను అంచనా వేసుకోవాలి. లక్ష్యం నిర్ణయించుకొని, అవసరాలను అంచనావేసుకుని అందుకు అనుగుణంగా సమాజంలోని సభ్యులను సమీకరించి వారి శక్తియుక్తులను వెలికితీసే వ్యవస్థీకృత ఏర్పాటు కూడా కావాలి. అంటే లక్ష్య సాధన సామాజిక వ్యవస్థ ప్రకార్య సిద్ధికి ఒక ప్రధాన పూర్వ అవసరం అన్నమాట. ఇలా అవసరాల అంచనాకు ఒక యంత్రాంగం, వ్యవస్థీకృత నిర్మాణం కూడా అవసరం. వ్యవస్థలో రాజకీయ, అధికార యంత్రాంగం ఈ విధిని నిర్వహిస్తుంది. బాహ్య వనరులను, అంతరంగిక అవసరాలను అంచనా వేసి, లక్ష్యాలు నిర్ణయించుకొని చట్టాలు, శాసనాల అమలు ద్వారా పూర్తిచేసే పనిని ఈ వ్యవస్థలో నిర్వహిస్తారు. ఇలా ముందుగానే అవసరాలు అంచనావేసి, లక్ష్యాలు నిర్ణయించుకొని పూర్తి చేయడం వల్ల వ్యవస్థ అవిచ్ఛిన్నంగా కొనసాగుతుంది.

### 6.5.3 సమగ్రత

సమాజంలో వ్యక్తుల మధ్య అవాంతరాలు లేకుండా చూస్తూ, సమైక్యతను నిరంతరాయంగా సమన్వయ పరిచే వ్యవస్థ కూడా ఒకటుంటుంది. వ్యక్తుల సాంస్కృతిక జీవనం, పండుగలు, ఉత్సవాలను దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇవి ఐక్యభావనను పెంపొందించడానికి, సామాజిక సంబంధాలను బలోపేతం చేయడానికి దోహదపడతాయి. ఇవి వ్యక్తులకు విధులను, బాధ్యతలను, గుర్తుచేస్తూ ఐక్యతకు తోడ్పడుతాయి.

### 6.5.4 సముద్ధరణ

సామాజిక వ్యవస్థ ప్రకార్యపూర్వ అవసరాల్లో సముద్ధరణ ప్రధానమైంది. సామాజిక వ్యవస్థలో ఉద్దీపశక్తులను సమీకరించి, సముపర్జించి, సమపరిచి అందించే కార్యకలాపాల నిర్వహణలో తోడ్పడే అంశాలన్నీ సముద్ధరణ కిందికే వస్తాయి. నమూనాను కొనసాగించడం, వ్యవస్థలో తలెత్తే ఉద్రిక్తతలను తగ్గించడానికి వ్యవస్థలో కొన్ని యంత్రాంగాలుంటాయి. సాంఘికీకరణ ప్రక్రియ కూడా ఇటువంటి సముద్ధరణకు దోహదం చేస్తుంది. సాంఘికీకరణ సామాజిక వ్యవస్థలోని విలువలు, ఆచారాలు, సాంప్రదాయాలు, అభిరుచులు, ఆసక్తులు, అలవాట్లు, ఇలా అనేక సంస్కృతిక అంశాలను వ్యక్తిలో అంతర్లీనం చేస్తుంది. ఇది సామాజిక వ్యవస్థ కొనసాగడానికి సాధనంగా ఉపయోగపడుతుంది.

ఇలా సామాజిక వ్యవస్థలో వివిధ సమస్యలు వాటికి కావాల్సిన ప్రకార్య అవసరాలు బహిర్గత, అంతర్గత అవసరాల సిద్ధికి సాధనాలుగా ఉపకరిస్తాయి.

## 6.6 సామాజిక మార్పు

పార్సన్స్ తొలిరోజుల్లో (1951) ప్రచురించిన గ్రంథం 'ది సోషల్ సిస్టం'లో ఆయనకు సామాజిక మార్పు పట్ల ఉన్న అభిప్రాయాలు తేటతెల్లం చేశారు. ఆతర్వాత ఆయన రచించిన Societies: Evolutionary and co-operative perspective (1966), The Sociological Theory and Modern Sociology (1967), The System of Modern Societies (1971), The Evolution of Societies (1977) రచనలతో ఆయన సామాజిక మార్పులో అతి [illegible]కమైన పరివర్తనావాద దృక్పథాన్ని పటిష్టపరిచారు. పార్సన్స్ సామాజిక మార్పును రెండు రకాలుగా విశ్లేషించాడు. ఒకటి సామాజిక వ్యవస్థలో అంతర్గతంగా జరిగే మార్పులను అభివర్ణిస్తే రెండోది వ్యవస్థ సంపూర్ణంగా మారే పరిస్థితులను వివరిస్తుంది.

BRAOU

### 6.6.1 సామాజిక వ్యవస్థలో అంతర్గత మార్పులు

జనాభాను ముఖ్యంగా జనసాంద్రత, జనసంఖ్యలో పెరుగుదలను సామాజిక వ్యవస్థలో అంతర్గతంగా జరిగే మార్పులకు ప్రాథమిక ప్రాతిపదికగా తీసుకొని పార్సన్స్ తన సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశాడు. చారిత్రకంగా పరిశీలించినట్టయితే ప్రాచీన సమాజాలన్నీ నదీతీరాల్లో అధికోత్పత్తికి అనువైన సారవంతమైన తీరమైదానాల్లోనే వెలిసాయి. ఇక్కడినేలల్లో పంటలు విస్తారంగా పండేవి. ఆహారోత్పత్తిలో పెరుగుదల జనాభా పెరుగుదలకు అలాగే శ్రమ విభజనకు, నగరాల పుట్టుకకు, తద్వార సంక్లిష్ట, సామాజిక వ్యవస్థలకు కారణమైంది. ఇది అంతర్గతంగా సామాజిక మార్పుకు దోహదపడిందని పార్సన్స్ పేర్కొన్నాడు. పార్సన్స్ ప్రకారం ఈ మార్పులన్నీ ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా జరిగిపోలేదు. వ్యవస్థలో సమతుల్యం పునఃస్థాపితం చేసేందుకు అవసరమయ్యాయి.

గతం, వర్తమానాల మధ్య సంబంధాల్లో, విలువల్లో, ప్రయోజనాల్లో ఏర్పడ్డ ఒడిదొడుకులను సరిదిద్దేందుకు వ్యవస్థను కొనసాగించేందుకు ఈ సమతుల్యత అవసరమయ్యింది. 'మార్పు కేవలం ఇప్పటిదాకా ఉన్న నమూనాను సరిదిద్దేది మాత్రమే కాదు. ప్రతిఘటనను అధిగమించేందుకు అవసరమైన ప్రక్రియ' అని పార్సన్స్ భావించాడు. ప్రతిఘటనను అధిగమించడం అంటే పార్సన్స్ దృష్టిలో ఒత్తిడులు, ఒడిదొడుకులు లేదా సమాజంలో తలెత్తే సంఘర్షణలను ఎదుర్కోవడం అన్న మాట.

సమాజాన్ని ఒడిదొడుకుల్లోకి నెట్టి కొత్త సమతాస్థితి స్థాపనకు అవసరమైన పరిస్థితులు కల్పించే అనేక కారకాలను పార్సన్స్ గుర్తించాడు. వాటిలో కొన్ని:

1. జనాభా లక్షణాల్లో మార్పులవల్ల, అంటే వలసలు పెరగడం వల్ల, జననాలు మరణాల రేట్లలో మార్పుల వల్ల, వివిధ జాతులు అంతర్గతీకరణ చెందడంవల్ల సమాజం ఒత్తిడికి లోనవుతుంది.

2. భౌతిక పర్యావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పుల వల్ల కూడా అసమతుల్యత ఏర్పడుతుంది. ప్రకృతి వనరులను అడ్డూ అదుపు లేకుండా వాడడం వల్ల అవి అంతరించినప్పుడు ఈ పరిస్థితి వస్తుంది.

3. సామాజిక వ్యవస్థలో ఆహారం, ఇతర వనరులు సమృద్ధిగా లభ్యమైనప్పుడు కూడా జనాభా పెరిగే అవకాశం వుంది.

4. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి, కొత్త ఆవిష్కరణలు.

5. కొత్త సాంస్కృతిక విలువల ఆవిష్కరణ కూడా ఇందుకు దోహదం చేస్తుంది. కొత్త మత భావనలు ఏర్పడడం, మతవిలువలు, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం సమ్మిళితం కావడం వంటివి కొత్త సాంస్కృతులవుతాయి.

వీటితోపాటు సామాజిక వ్యవస్థలో నిరంతరాయంగా కొనసాగే 'హేతుబద్ధీకరణ', 'సాంప్రదాయీకరణ' వంటి వాటివల్ల విలువల్లో విశ్వాసాల్లో మార్పులు వస్తుంటాయి. ఇది కూడా అంతర్గత సామాజిక మార్పునకు ఒక కారణంగా పార్సన్స్ పేర్కొన్నాడు. ఇక్కడ హేతుబద్ధీకరణ అంటే విచక్షణతో కూడుకున్న ప్రగతిశీల ఆలోచన.

సాంప్రదాయ ఆచార వ్యవహారాల స్థానంలో వ్యక్తిగతమైన, వినూత్నమైన వైఖరులు, ధోరణులు, శాస్త్రీయ విలువలు, న్యాయ పద్ధతులు, నియత విధానాలు పెంపొందే ప్రక్రియ. ఒకవైపు ఈ హేతుబద్ధీకరణం పెరుగుతున్నప్పటికీ సమాజంలో ఉన్న విలువలను స్థిరపరిచి కొంత కాలం తరువాత వ్యవస్థీకృతం చేసే ధోరణి కూడా వ్యవస్థలో కనిపిస్తుంటుంది. ఈ ధోరణి స్వార్థ ప్రయోజనాలకు మూలమవుతుంది. ఈ స్వార్థ ప్రయోజనాలే మారుతున్న పరిస్థితులు ఎలావున్నా పాత విలువలను యథాతథంగా కొనసాగేలా చేస్తాయి. దీంతో హేతుబద్ధమైన విలువలు కూడా సంప్రదాయాలుగా మారిపోతాయి. సమాజంలో ఇలా పాతకొత్త సంప్రదాయ హేతుబద్ధ విలువలు పునరావృతమవుతూ చక్రీయ ప్రక్రియగా కొనసాగుతుంటాయి.

 కుటుంబ వ్యవస్థలో వస్తోన్న మార్పులను ఉటంకిస్తూ పార్సన్స్ ఈ సామాజిక మార్పు ప్రక్రియను విశ్లేషించాడు.

BRAOU

కుటుంబ వ్యవస్థ అందలి సభ్యులజీవన గతిననుసరించి మార్పుచెందుతూ వుంటుంది. కుటుంబంలో ఒక శిశువు సాంఘికీకరణకు ఉపకరించే యంత్రాంగమే ఇక్కడ ఈ మార్పులకు, కొనసాగింపునకు కీలకమవుతుంది. శిశువులో తొలుత మూర్తిమత్వ రూపకల్పనకు దోహదం చేసిన విలువలు క్రమక్రమంగా కనుమరుగై శిశువు పెరుగుతున్న కొద్దీ కొత్త విలువల స్వీకరణ జరుగుతుంది. పాత విలువల స్థానంలో కొత్త విలువలను వ్యక్తి అవసరాలకు అనుగుణంగా సమాజమే అందిస్తుంది. వ్యక్తి కొత్త పాత్రలు, అవసరాలు, అంచనాలు పూర్తిగా పాతవాటిని పోలి అంటే బాల్య దశలో ఉన్నట్టుగానే ఉండకపోవచ్చు. కుటుంబ వ్యవస్థలో వ్యక్తి వయస్సు పెరుగుతున్న కొద్దీ పాత్రలు, అవసరాలు, అంచనాలు మారుతుంటాయి. కుటుంబమే మారుతున్న పాత్రలకు అనుగుణంగా వ్యక్తికి అన్ని సమకూరుస్తుంది.

అలాగే సామాజిక మార్పు సామాజిక ఉద్యమాల ద్వారా కూడా సాధ్యమేనని పార్సన్స్ విశ్వసించాడు. అయితే సామాజికోద్యమాలు వ్యవస్థపై పట్టుసాధించడానికి పరిస్థితులు అనుకూలించాలని ఆయన అభిప్రాయం. అందుకు పార్సన్స్ నాలుగు రకాల పరిస్థితులు అవసరమని భావించాడు. ప్రజల్లో తీవ్ర పరాయీకరణ భావం నెలకొని వుండడం, అప్పటిదాకా నెలకొని వున్న సైద్ధాంతిక విలువలకు పూర్తిగా భిన్నమైన రాజకీయ సైద్ధాంతిక పునాది వుండడం, ఇప్పటిదాకా వున్న సామాజిక వ్యవస్థలు, విశ్వాసాలు, ప్రతీకలకు భిన్నంగా, ప్రతిగా వ్యవస్థలను, విలువలను నిర్మించే శక్తి, ఆసిద్ధాంతానికి ఉందని చూపగలిగే సామర్థ్యం, కొత్త ఉద్యమ సిద్ధాంతాన్ని బలపరిచే లేదా న్యాయబద్ధమైందని భావించి దానికి పనిచేయగలిగే రూపాన్ని ఇచ్చే అధికార వ్యవస్థ కలిగి వుండడం వంటి లక్షణాలు ఉన్నప్పుడు ఆ ఉద్యమం వల్ల సామాజిక మార్పు సాధ్యపడుతుందని పార్సన్స్ అభిప్రాయం. అయితే కాలం గడుస్తున్నకొద్దీ విప్లవ లక్ష్యంతో పుట్టిన ఉద్యమాలు కూడా క్రమక్రమంగా సనాతన-సాంప్రదాయవాదం వైపు మొగ్గే అవకాశం వుందని పార్సన్స్ పేర్కొన్నాడు. వ్యవస్థ సుస్థిరత పేరుతో సభ్యులను సాంఘికీకరిస్తూ సమాజం తనవైపుకు తిప్పుకుంటుంది. ఈ ప్రయత్నంలో సంపూర్ణ విప్లవం కోసం పుట్టిన రాడికల్ ఉద్యమాలు కూడా సామాజిక వ్యవస్థ ప్రతిపాదించే మార్పు ప్రక్రియలను అన్వయించుకొని అవి వ్యవస్థకు అనుగుణంగా మారే ప్రమాదం వుంది.

BRAOU

## 6.6.2 పరిణామ సార్వత్రికాల ద్వారా సామాజిక వ్యవస్థల మార్పు

ప్రతి సామాజిక వ్యవస్థకు ప్రత్యేక చారిత్రక సందర్భాలున్నప్పటికీ, ఆయా వ్యవస్థల దీర్ఘకాల పరివర్తనను పరిశీలించినట్టయితే అన్నీ ఒకేరకమైన పద్ధతుల్లో మారుతున్నట్టు అర్థమవుతుంది. అన్నిటి మార్పుదిశ ఒకే రీతిలో కనిపిస్తుంది. ఈ సామాజిక పరివర్తన దిశలు స్వభావాన్ని పార్సన్స్ 'పరిణామ సార్వత్రికాలు' అన్నాడు. మొత్తం సామాజిక మార్పు ఏ సమాజంలోనైనా 'సార్వత్రికంగా'నే కొన్ని నిర్ధారితాల్లోనే జరుగుతుందని అయన అభిప్రాయం.

**ఆదిమ సమాజాలు**

ఆదిమ సమాజాలు సామాజిక వ్యవస్థల పరంగా అత్యంత ప్రాథమికమైనవి. అవి ఈ క్రింది లక్షణాలు కలిగి వుంటాయి.

1. ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక దశలో వుంటుంధి. కేవలం బతకడానికి అవసరమైన ఆహారాన్ని సేకరించుకొని మనుషులు జీవిస్తారు.

2. తొలి సాంకేతిక పరిజ్ఞానం కేవలం ఆహార సేకరణకు, నివాసాల ఏర్పాటుకూ, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుంచి, ఇతర ప్రమాదాల నుంచి కాపాడేందుకు మాత్రమే ఉపయోగపడేంత సరళంగా వుంటుంది.

3. రాజకీయ వ్యవస్థ పెద్దగా అభివృద్ధి చెంది వుండదు.

4. జీవాత్మవాదం, సర్వాత్మవాదం, మంత్ర తంత్రాల వంటి సాంస్కృతిక భావనలు, వ్యక్తీకరణలతో ప్రజలు ఉమ్మడి సామాజిక జీవనం కలిగి ఉంటారు. ఈ ప్రాథమిక లక్షణాల్లో సమగ్ర మార్పు రావడం వల్ల లేదా ఏఒక్క లక్షణంలోనైనా తీవ్ర మార్పులు చోటు చేసుకోవడం వల్ల లేదా వ్యవస్థలు విస్తృతం కావడం వల్ల సామాజిక వ్యవస్థ ముందుకు వెళుతుంది. మార్పునకు దోహదపడుతుంది.

**మాధ్యమిక సమాజాలు**

ప్రాథమిక సమాజాల్లో ఏర్పడే సామాజిక విభేదీకరణ ఒత్తిడి వల్ల మాధ్యమిక సమాజాలు ఏర్పడుతాయి. పార్సన్స్ జనాభా పెరుగుదలను దీనికొక ఉదాహరణ కారణంగా పేర్కొంటాడు. జనాభా పెరుగుదల వల్ల సమాజం రూపురేఖలు మారుతాయి. వ్యక్తుల వృత్తులలో మార్పు వస్తుంది. కొత్తగా వ్యవసాయేతర వృత్తులు పెరుగుతాయి. వృత్తులను బట్టి సామాజిక విభేదీకరణ చెందుతుంది. వర్గ, కుల (భారతీయ) వ్యవస్థలు ఏర్పడతాయి. అప్పుడు సమాజంలో కూడా సామాజిక వ్యవస్థ నిర్వహణకు అవసరమైన కొత్త నియమాలు ఏర్పడతాయి. పరిపాలనకు అవసరమైన న్యాయ ప్రమాణాలు సాధారణ నియమాలు లిఖిత రూపంలో ఏర్పడతాయి. ఈ దశలో రాజకీయ వ్యవస్థ భూస్వామ్య వ్యవస్థలోవలె బలపడుతుంది.

**ఆధునిక సమాజాలు**

మాధ్యమిక సమాజాల్లో వ్యవస్థలు మరింత విస్తృతమై ఆధునిక సమాజాలు ఏర్పడతాయి. ఈ ప్రక్రియలో శాస్త్ర విజ్ఞానం ప్రముఖ పాత్ర పోషిస్తుంది. యూరప్‌లో వచ్చిన విప్లవాలు ముఖ్యంగా పారిశ్రామిక విప్లవం, ప్రజాస్వామ్య విప్లవం, ఫ్రెంచ్ విప్లవం, విద్యావిప్లవం వల్ల పాశ్చాత్య సమాజం తొలుత ఈ దశలోకి చేరింది. పారిశ్రామిక విప్లవం వల్ల యూరప్‌లో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా రవాణా, సముద్ర మార్గాన్వేషణ, వాణిజ్య వ్యాపారాలు విస్తరించాయి. ఉత్పత్తులు, మార్కెట్లు పెరిగాయి.

ఫ్రెంచ్ విప్లవం సమానత్వం, సౌభ్రాతృత్వం స్వేచ్ఛ తదితర విలువలకు ఊపిరులూదింది. ఇదే రాచరికానికి చరమగీతం పాడి ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రభుత్వాలను ఎన్నుకొనే పద్ధతిని తెచ్చింది. విద్యావిప్లవం, సమాచార, విభిన్న రంగాల్లో పెను మార్పులకు కారణమైంది. జ్ఞానం సామాన్యుడి సొత్తుగా మారిపోయింది.

చారిత్రాత్మకంగా అక్కడక్కడ అంతరాయాలు, అంతరాలున్నా సామాజిక పరివర్తన ఇదే నమూనాలో జరిగిందని పార్సన్స్‌కు గట్టి విశ్వాసం. ఈ క్రమంలోనే కొంచెం వెనుకాముందు అన్ని సమాజాలూ ఆధునిక సామాజిక వ్యవస్థలుగా రూపొందుతాయని వీటి వ్యవస్థీకరణ వల్ల 'పరిణామ సార్వత్రికత' ఏర్పడుతుందని ఆయన భావించాడు. పార్సన్స్ ప్రకారం సమాజాలు అలా అభివృద్ధి చెంది కాలక్రమేణా సార్వత్రిక న్యాయప్రమాణాలు, డబ్బు, బ్యాంకి... హేతుబద్ధ, ఉద్యోగ స్వామ్యం చివరగా ప్రజాస్వామ్యం నెలకొంటుంది.

BRAOU

## 6.7 విమర్శ

పార్సన్స్ సిద్ధాంతాలు, ప్రతిపాదనలు అమెరికన్ సమాజశాస్త్రంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు ఓ వెలుగు వెలిగాయి. అయితే పార్సన్స్ సిద్ధాంతంపై విమర్శలు పరంపరకూడా అంతే స్థాయిలో వెల్లువెత్తింది. చాలాకాలంపాటు పార్సన్స్ ప్రతిపాదనల్లో ప్రతీ ఒక్క అంశాన్ని చీల్చి చెండాడిన విమర్శకులు 1970 నాటికి ఆయన సిద్ధాంతానికి ప్రాధాన్యత నివ్వడం తగ్గించేశారు.

రాల్ఫ్ డెహ్రెన్ డార్ఫ్ పార్సన్స్ ఆలోచనలు ఊహాజనితమైనవని తిప్పికొట్టాడు. పార్సన్స్ ప్రపంచ భావన ఏరకమైన అభివృద్ధి చరిత్రను ఆవిష్కరించకపోగా, విలువలు, ప్రమాణాల పర్యవసానాలను మాత్రమే వివరిస్తుందని, సామాజిక శక్తుల మధ్య ఎంతో అన్యోన్యత ఉన్నట్టుగా చూపి, యథాస్థితిని కొనసాగించే యంత్రాంగాలను వివరిస్తూ పోతుందని ఆయన విమర్శించారు. పార్సన్స్ ప్రకారం సామాజిక విచలనం, ఘర్షణ వంటివి ఎప్పుడో తప్ప జరుగవనుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నమాట.

పార్సన్స్ సామాజిక చర్యాభావనను ప్రాతిపదిక చేసుకొని తన సిద్ధాంతాన్ని రూపొందించినా పార్సన్స్ సామాజిక వ్యవస్థ మాత్రం ముమ్మాటికీ స్థిరమైందిగానే కనిపిస్తుందని విమర్శకులు పేర్కొన్నారు. పార్సన్స్ పేర్కొన్న పాత్రధారి ఎప్పుడూ నటించడు, స్పందించడు. ఎప్పుడూ కదలడు. అతడు కోరుకున్న స్థితికి ఎన్నడూ చేరుకోడు అంటూ

లూయిస్ ఫ్యూయర్ పార్సన్స్ వ్యవస్థ చర్య అంటే కార్యహీనత అని అనుకునే స్థితికి అలవాటు పడింది అని ఎద్దేవా చేశాడు. విలియం ఫూటేవైట్ మరో అడుగు ముందుకేసి 'టాల్కాట్ పార్సన్స్ ప్రపంచంలో పాత్రదారులంతా ఎంతసేపూ పర్ధితులకు అనుగుణంగా సర్దుకుపోతూ కనిపిస్తారు. వారు చాలా అరుదుగా తప్ప నటించరు (తమ పాత్రల్ని పోషించరు). పార్సన్స్ 'షో' ఎల్లప్పుడూ రిహార్సల్స్‌లోనే వుంటుంది. 'తెర ఎన్నటికీ పైకి లేవదు' అని విమర్శించాడు.

పార్సన్స్ ప్రతిపాదించిన నమూనా సారాంశ సిద్ధాంతం కూడా పెద్ద ఎత్తున విమర్శలను ఎదుర్కొంది. పార్సన్స్ ఐదు రకాల చరాంశాలే వుంటాయని చెప్పడం, పాత్రధారి వాటిలోంచే అవకాశాలు వెతుక్కొని తన పాత్ర నిర్వహిస్తాడని అనడం అసంబద్ధంగా వుంటుందని మాక్స్‌బ్లాక్స్ విమర్శించాడు. అయినా ఐదురకాల చరాంశాలే ఎందుకుండాలి, అంతకంటే ఎక్కువ కూడా ఉండొచ్చుగదా అని బ్లాక్ ప్రశ్నించాడు. అంతేకాకుండా సంబంధాలు ఎప్పుడూ ఒకే మూసలో ఉండవని కొన్ని నియత సంబంధాలు కూడా క్రమక్రమంగా అనియత సంబంధాలుగా మారే అవకాశం వుందని బ్లాక్‌పేర్కొన్నాడు.

పార్సన్స్ 'ప్రకార్యవాదం' సమాజంలో తలెత్తే అసంతృప్తి, సంఘర్షణలను విస్మరించిందన్న విమర్శకూడా పెద్ద ఎత్తున వుంది. సమాజంలో అన్ని వ్యవస్థలు సభ్యులకు అనుకూలమైన విలువలు, లక్ష్యాలు కలిగి వుంటాయని, సభ్యులకు ఆమోద యోగ్యమైన రీతిలోనే సాంఘికీకరణ నియమాలు వుంటాయని చెప్పడం విమర్శకు కారణమైంది. పార్సన్స్ వర్గ సంఘర్షణను, సమాజంలో వుండే పరస్పర వ్యతిరేకతలను పూర్తిగా నిర్లక్ష్యం చేసాడని మార్క్సిస్టు సమాజ శాస్త్రవేత్తలు విమర్శించారు.

## 6.8 సారాంశం

ఆధునిక సమాజశాస్త్రవేత్తల్లో టాల్కాట్ పార్సన్స్ అగ్రశ్రేణి శాస్త్రవేత్తగా ముందుకొచ్చారు. అన్ని సామాజిక శాస్త్రాలను సమన్వయ పరుస్తూ సమాజశాస్త్రానికి పరిపూర్ణత నిచ్చే భావనాత్మక నిర్మితిని సిద్ధాంతీకరించేందుకు ఆయన ప్రయత్నించాడు. వ్యక్తి చర్యలను, విశాలమైన సామాజిక వ్యవస్థను విశ్లేషించడం ద్వారా ఆయన తన సిద్ధాంతాన్ని పటిష్ట పరిచాడు.

BRAOU

పార్సన్స్ సిద్ధాంతాలలో సామాజిక చర్యల నిర్మితి సిద్ధాంతం ముఖ్యమైంది. సమాజంలో పాత్రధారికి సామాజిక, సహజ వాతావరణానికి మధ్యనున్న సంబంధాలను అధ్యయనం చేసి అర్థవంతంగా వివరించడం ఈ సిద్ధాంత లక్ష్యం. సామాజిక వ్యవస్థలో 'పాత్ర' అనేది అత్యంత కీలకమైన అంశంగా పార్సన్స్ పేర్కొన్నాడు. ఆయా పాత్రల పోషణలో వ్యక్తులు అనేక సంఘర్షణలకు లోనవుతారని, పాత్రలకు, సమాజం అందించే అవకాశాలకు మధ్య సందిగ్ధం మొదలవుతుందని ఆయన అంటారు.

పార్సన్స్ ప్రకారం ఐదు రకాల నమూనా చరాంశాలుంటాయి. వాటి నమూనాలోనే పాత్రధారులు పాత్ర పోషణ చేసి ప్రవర్తిస్తారు. అయితే సామాజిక వ్యవస్థ యధావిధిగా కొనసాగడానికి అనువర్తన లక్ష్య సాధన, సమగ్రత, కొనసాగింపు వంటి ప్రకార్యపూర్వ ఆవశ్యకతలు అవసరమవుతాయి. పార్సన్స్ సామాజిక మార్పును కూడా విశ్లేషించే ప్రయత్నం చేస్తూ మార్పు రెండు రకాలుగా జరుతుందని పేర్కొన్నాడు. మొదటిది సామాజిక వ్యవస్థలో మార్పుల వల్ల సాధ్యపడితే రెండోది సామాజిక వ్యవస్థ మారడం వల్ల జరుగుతుందని పేర్కొన్నాడు.

## 6.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. పార్సన్స్ ప్రతిపాదించిన నమూనా చరాంశాలను వివరించండి.

2. పార్సన్స్ సామాజిక మార్పును ఎలా వివరించాడో తెలుపండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.

1. ప్రకార్య పూర్వ అవసరాలను వివరించండి.

2. సామాజిక చర్య అంటే ఏమిటి.

## 6.10 చదువదగిన పుస్తకాలు


Black, Max : The Social Theories of Talkott Parsons: A critical Examination, (Ed.,).

Cohn, Percy : Modern Social Theory.

Himilton, Peter : Talkott Parsons

Parsons, Talkott : The Social Structure

Parsons, Talkott : The Structure of Social Actions

Parsons, Talkott : The Evolutions of Societies


BRAOU

# భాగం-7: రాబార్ట్ కింగ్ మెర్టన్

విషయక్రమం


7.0 ఉద్దేశాలు

7.1 పరిచయం

7.2 జీవిత చరిత్ర

7.3 ప్రకార్యం

7.3.1 ప్రకార్యం-వికార్యం

7.3.2 అభివ్యక్త ప్రకార్యాలు-అంతర్లీన ప్రకార్యాలు

7.3.3 అభివ్యక్త- అంతర్లీన ప్రకార్యాల విభేదీకరణ వల్ల ప్రయోజనాలు

7.4 ప్రకార్య విశ్లేషణ సిద్ధాంతానికి మెర్టన్ క్రోఢీకరణ

7.4.1 ప్రకార్య ఐక్యత

7.4.2 సార్వాత్రిక ప్రకార్యవాదం

7.4.3 ప్రకార్య అనివార్యత

7.5 ప్రకార్య విశ్లేషణకు మోర్టన్ అవగాహన చట్రం

7.6 సామాజిక నిర్మితి-అనియతి

7.7 మెర్టన్‌పై విమర్శ

7.8 సారాంశం

7.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

7.10 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 7.0 ఉద్దేశాలు

ఈ పాఠ్యాంశం చదివిన తర్వాత మీరు

- మెర్టన్‌కు పూర్వం ప్రకార్యవాద విశ్లేషణలోని భావాలను అర్థం చేసుకోగలుగుతారు.
- ప్రకార్యవాద విశ్లేషణకు మెర్టన్ ఉపయోగించిన అవగాహన చట్రాన్ని వివరించగలుగుతారు.
- ప్రకార్యం-వికార్యం మధ్య భేదాన్ని వివరించగలుగుతారు.
- ప్రకార్యాలు-అంతర్లీన ప్రకార్యాల మధ్య మెర్టన్ విభజనను అవగాహన చేసుకుంటారు.
- మెర్టన్ ప్రతిపాదించిన అనియతి సిద్ధాంతాన్ని అర్థం చేసుకుంటారు.

## 7.1 పరిచయం

సామాజిక శాస్త్ర ఆలోచన విధానం అభివృద్ధిలో మెర్టన్‌ది కీలక పాత్ర. ద్వితీయ ప్రపంచ సంగ్రామం ముగిసేవరకు

కూడా యూరోపియన్ సామాజిక శాస్త్ర వేత్తల దృష్టి అంతాకూడా సమాజంలోని నైతిక క్రమాన్ని వెతికిపట్టుకోవడంపైనే ఉంది. అమెరికాలో సామాజిక శాస్త్రవేత్తల చర్చ కుటుంబం, అమెరికన్ కమ్యూనిటీల పరిధిని దాటలేదు. ఈ ధోరణి మార్చాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే మెర్టన్ ప్రముఖంగా కనిపిస్తారు. 1949లో సామాజిక సిద్ధాంతం మరియు సామాజిక నిర్మాణం అన్న పుస్తకం ప్రచురించడంలో నిర్మాణ, ప్రకార్యవాద క్షేత్రంలో మెర్టన్ పేరు మారుమోగిపోయింది. తనకన్నా పూర్వీకులైన నిర్మాణ ప్రకార్యవాద శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత కొన్ని సవరణలను ప్రతిపాదించారు. పాతతరం సిద్ధాంతాల్లోని అసంబద్ధతలను తొలగించడంపైనే మెర్టన్ కృషి ప్రధానంగా కేంద్రీకృతమైంది. ప్రకార్యవిశ్లేషణకు ఉత్తమ విధానాన్ని అందిచాలని మెర్టన్ కాంక్షించారు.

## 7.2 జీవితవిశేషాలు

అమెరికాలోని ఫిలడెల్ఫియాలో 1910 జూలై5న రాబర్ట్ కింగ్ మెర్టన్ జన్మించాడు. తూర్పుయూరప్‌నుంచి అమెరికాకు వలసవచ్చిన మెర్టన్ తండ్రి ట్రక్ డ్రైవర్‌గా, వడ్రంగిగా పనిచేసేవాడు. మెర్టన్ బాల్యమంతా దక్షిణ ఫిలడెల్ఫియాలోని మురికివాడల్లో గడిచింది. చిన్నవయస్సులోనే మార్టిన్‌కు పుస్తకాలు చదవడంపై మక్కువ ఏర్పడింది. ఎనిమిదేళ్ల వచ్చేసరికి భిన్న అంశాలకు సంబంధించిన అనేక పుస్తకాలను విస్తృతంగా చదివాడు. జీవిత చరిత్రలంటే ఆసక్తి చూపేవాడు. మెర్టన్‌కు 1931లో టెంపుల్టన్ విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ పట్టా లభించింది. హార్వార్డ్‌నుంచి ఫెలోషిప్ పొందాడు. హార్వార్డ్‌లో ఉండగానే టాల్కోట్ పార్సన్స్, పెటిరిమ్ సోరాకిన్, ఎల్.జె.అండర్సన్ వంటి ప్రొఫెసర్ల వద్ద చదువుకునే అవకాశం లభించింది. మెర్టన్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువులో అద్భుతంగా రాణించాడు.

హార్వార్డ్ నంచి మెర్టన్‌కు పిహెచ్‌డి లభించింది. హార్వార్డ్‌లో ఉండగానే భిన్న రకాల సామాజిక అనుకరణల ఆధారంగా ప్రవర్తనల వైచిత్రి సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశాడు. సామాజిక శాస్త్రవేత్తగా ఆయన అధ్యయన క్షేత్రాలపై ఆసక్తి చూపాడు. సైన్స్, వృత్తులకు సంబంధించిన సామాజిక శాస్త్రం, సిద్ధాంతం, మాస్ కమ్యూనికేషన్స్ వంటి అంశాలపై ఆసక్తి కనబరిచాడు. న్యూ ఆర్లిన్స్ లోని టులేన్ విశ్వవిద్యాలయంలో 1939-41 ల మధ్య అధ్యాపకునిగా పనిచేశాడు. ఆతర్వాత 1941లో కొలంబియా విశ్వవిద్యాలయానికి వెళ్లాడు. 1947లో పూర్తిస్థాయి ప్రొఫెసర్ అయ్యాడు. 1942-71 మధ్య కాలంలో కొలంబియా విశ్వవిద్యాలయం అనువర్తిత సామాజిక శాస్త్ర పరిశోధనలో అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. ఈకాలంలోనే ఆయన మరో సామాజిక శాస్త్రవేత్త పాల్ లాసర్స్ సెల్ట్‌తో కలిసి పనిచేశాడు. చారిత్రక అంశా అధ్యయనంలో మెర్టన్ ఆలోచనా పద్ధతిని లాసర్స్ ఫెల్డ్ ప్రతిపాదించిన భావన విశదీకరణ తర్కం, పరిమాణాత్మక గుణాత్మక, పరిశోధన పద్ధతులు తీవ్రంగా ప్రభావితం చేసాయి. సామాజిక శాస్త్రంలో మెర్టన్ రచించిన 'సోషల్ థియరీ అండ్ సోషల్ స్ట్రక్చర్' గ్రంథం చిరస్మరణీయంగా మిగిలిపోయింది. ఈ పుస్తకంలోనే సామాజిక సిద్ధాంతం, అనుభవైక పరిశోధన మధ్య పరస్పర సంబంధాన్ని మెర్టన్ వివరించాడు. సమాజ అధ్యయనానికి నిర్మాణ ప్రకార్య వాద దృక్కోణానికి మరింత పదును పెట్టారు. ఈ క్రమంలోనే అభివ్యక్త, అంతర్లీన ప్రకార్యాలు అనే భావనతోపాటు వికార్యభావనను ప్రవేశపెట్టాడు. ప్రకార్య విశ్లేషనతోపాటు అవ్యవస్థ భావనను, గ్రూప్ రెఫరెన్స్ సిద్ధాంతాన్ని చర్చించాడు. Science and Technology and Society Seventeenth Century; England (1938), Theoritical Sociology (1967), Social Theory and Functional Analysis (1969), Sociology of Science (1973) లాంటి పలు రచనలు చేశాడు.

## 7.3 ప్రకార్యవాదం

మెర్టన్ తన నిర్మాణ ప్రకార్యవాద విశ్లేషణను, ప్రకార్యం (ఫంక్షన్) అనే పదానికి ఉన్న వేరు, వేరు అర్థాలతో ప్రారంభించాడు. తరచుగా వేరువేరు భావనలను వివరించడానికి ఒకే పదాన్ని ఉపయోగించడం, ఒకే భావాన్ని వివరించడానికి వేరువేరు పదాల్ని వాడడం జరుగుతుందని మెర్టన్ అంటాడు. ఫంక్షన్ అనే పదానికి ఆయన అయితే



BRAOU

వేరు వేరు అర్థాలను చర్చించాడు.

మొదట వేడుక, పది మంది కలిసి చేసుకునే ఉత్సవాన్ని ఫంక్షన్ (ప్రకార్యం) అనే పదంతో వ్యవహరిస్తారు. ఈ సందర్భంలో ఉపయోగించే 'ఫంక్షన్'కు సామాజిక శాస్త్రంలో ప్రకార్య విశ్లేషణలో ప్రయోగించే 'ఫంక్షన్'కు ఎలాంటి సంబంధం లేదు. రెండు, ఒక వ్యక్తి చేసే వృత్తిని కూడా ఈపదంతో సూచిస్తారు. ఒక బృందంలోని వ్యక్తుల వృతుల పంపిణిని విశ్లేషించేటప్పుడు ఆర్థిక వేత్తలు తరచూ ఇదే అర్థంతో వాడుతుంటారు. మూడవది, సామాజిక హోదా ఉన్న వ్యక్తికి, ముఖ్యంగా రాజకీయంగా పదవిలో ఉన్న వ్యక్తికి అప్పగించిన బాధ్యతలను కూడా ఫంక్షన్ అని వ్యవహరిస్తారు. నాలుగవది, ఫంక్షన్‌కు గణిత శాస్త్ర రీత్యాకూడా అర్థం ఉంది. లెబనీస్ గణితంలో దీన్ని ప్రవేశపెట్టారు. ఒక చలనాంకాన్ని, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ చలనాంకాల పరంగా వివరించేప్పుడు తొలి చలనాంకాన్ని ఫంక్షన్‌తో సూచిస్తారు. ఈ ఫంక్షన్ సొంత విలువ దాన్ని వివరించేందుకు ఎన్నుకున్న చలనాంకాలపై ఆధారపడి ఉంటుంది. ఇక అయిదవది, ప్రకార్య విశ్లేషణకు ఇదే కీలక మైనదని మెర్టన్ అంటాడు. ఈ రకమైన ప్రయోగానికి స్ఫూర్తి, జీవశాస్త్రం. ఒక ప్రాణి జీవించడానికి దోహదం చేసే జీవ క్రియలను ఫంక్షన్ అనే పదం సూచిస్తుంది. ఈ అర్థంతోనే రాడ్‌క్లిఫ్ బ్రౌన్ ప్రకార్యం పదాన్ని సామాజిక శాస్త్రంలో ప్రయోగించాడు. "ఒక ప్రక్రియ యొక్క ప్రకార్యం యావత్ సమాజ జీవితంలో ఆప్రక్రియ నిర్వహించే విస్తృత పాత్రలో ఒక భాగమే. అందువల్ల ఆ సమాజ నిర్మాణ నిర్వహణకు ఆ ప్రకార్యం కూడా దోహదం చేస్తున్నట్టే". అని బ్రౌన్ అన్నాడు. మాలినోవ్‌స్కీ ప్రకారం సామాజిక, సాస్కృతిక అంశాల ప్రకార్యం కూడా సాంస్కృతిక వ్యవస్థలో ఆ అంశాలు పోషించే పాత్రలో ఒక భాగమే.

## 7.3.1 ప్రకార్యం-వికార్యం

ఒక వ్యవస్థలో సర్దుబాట్లు అనుసరణలకు ఆస్కారమిచ్చే పర్యవసానాలనే మెర్టన్ ప్రకార్యాలుగా అభివర్ణించాడు. అయితే ప్రకార్యాలతోనే మెర్టన్ సంతృప్తి పడలేదు. వ్యవస్థలోని ప్రతీ ప్రకార్యం వ్యవస్థ అనుసరణకు వెలుసుబాటు కల్పించదు. అందువల్ల మెర్టన్ వికార్యమనే కొత్త భావనను కనిపెట్టాడు. వ్యవస్థయొక్క సర్దుబాటు అనుసరణలను జాప్యం చేసే, గమనించతగ్గ పర్యవసానాలనే మెర్టన్ వికార్యాలుగా వర్ణించాడు. ఆధునిక భారతదేశంలో ఉదాహరణకు కులవ్యవస్థ ఒక వికార్యంగా చెప్పవచ్చు. ప్రజాస్వామిక ఆదర్శాన్ని విస్తృతం చేయడానికి బదులుగా కుల వ్యవస్థ, గతిశీలతను ప్రజాస్వామీకరణను ఒక మేర తగ్గిస్తుంది. కులానికి సంబంధించి వికార్యాలుగా వీటిని చెప్పవచ్చు.

BRAOU

## 7.3.2 అభివ్యక్త ప్రకార్యాలు, అంతర్లీన ప్రకార్యాలు

మెర్టన్ కొత్తగా అంతర్లీన ప్రకార్యం అనే భావనను అభివృద్ధి చేశాడు. అంతర్లీన ప్రకార్యానికి అభివ్యక్త ప్రకార్యానికి మధ్య బేధాన్ని చూపాడు. ఇదే ఆయన ప్రకార్య విశ్లేషణకు అర్థాన్నిచ్చింది. ఒక వ్యవస్థ సర్దుబాటుకు, అనుసరణకు దోహదం చేయగల వస్తుగత పర్యవసానాలు అభివ్యక్త ప్రకార్యాలుగా మెర్టన్ పేర్కొన్నాడు. ఆ వ్యవస్థలో భాగస్వాములుగా ఉండే ప్రజలు, వాటిని ఉద్దేశించడంతో పాటు వాటిని గుర్తిస్తారు. అంతర్లీన ప్రకార్యాలు కూడా వస్తుగత పర్యవసానాలే. అయితే వీటిని వ్యవస్థలోని ప్రజలు ఉద్దేశించడంగానీ, గుర్తించడంగానీ జరగదు. ఒక క్రియకు సంబంధించిన అనుద్దేశ పర్యవసానాలు మూడు రకాలుగా ఉంటాయని మెర్టన్ అన్నాడు. అవి:

1) నిర్దేశ వ్యవస్థకు ఉద్దేశించిన ప్రకార్యాలు, వీటిలో అంతర్లీన ప్రకార్యాలు కూడా ఉంటాయి.

2) నిర్దేషిత వ్యవస్థకు నిర్దేశించిన వికార్యాలు. వీటిలో అంతర్లీన వికార్యాలు కూడా ఉంటాయి.

3) వ్యవస్థతో సంబంధంలేని అంటే ప్రకార్యరీత్యాగానీ, వికార్య రీత్యాగానీ ఏమాత్రం ప్రభావం చూపలేనివి.

7.3.3 అభివ్యక్త-అంతర్లీన ప్రకార్యాల బేధం వల్ల ప్రయోజనాలు

అభివ్యక్త-అంతర్లీన బేధాన్ని ఎత్తి చూపడం వల్ల ప్రపంచాన్ని సాధారణ దృష్టికంటే మించి పరిశీలించడానిని ఉపకరిస్తుందని మెర్టన్ అభిప్రాయపడ్డాడు. ఉదాహరణకు- అంతర్లీన ప్రకార్యం వంటి భావన వల్ల సమాజంలో

చలామణిలో ఉన్న పలు సామాజిక సంప్రదాయాలు, సాంస్కృతిక విశ్వాసాలను లోతుగా పరిశీలించడానికి, వాటిలో దాగి ఉన్న అంతరార్థాన్ని కనిపెట్టడానికి అవకాశం ఉంటుంది. ఈ విధంగా చూస్తే 'సహేతుకత', 'అసంబద్ధత', 'నైతికత', 'అనైతికత' వంటి భావనలపై మన అభిప్రాయాలను బలవంతంగా మార్చుకోవలసి వస్తుంది. ఎందుకంటే 'అసంబద్ధత', 'అనైతికత' చర్యల్లో కూడా అంతర్లీనంగా ఏదైనా అవసరమైన సామాజిక ప్రకార్యం దాగి ఉండవచ్చు. తత్ఫలితంగా పరిశీలన పరిధి, విస్తృతం కావడం ప్రారంభమైంది అభివ్యక్త ప్రకార్యాలు, అంతర్లీన ప్రకార్యాల మధ్య బేధాన్ని ఎత్తిచూపడం వల్ల గల ప్రయోజనాన్ని మెర్టన్ ఈ క్రింది విధంగా చూపించాడు.

అభివ్యక్త అంతర్లీన ప్రకార్యాల మధ్య బేధాన్ని పట్టుకోవడం వల్ల పైకి నిర్హేతుకంగా కనిపించే సామాజిక ధోరణుల విశ్లేషణకు ఆస్కారం లభిస్తుంది.

అభివ్యక్త ప్రకార్యాలు, అంతర్లీన ప్రకార్యాల మధ్య బేధాన్ని వివరించడం వల్ల విమర్శనాత్మక విశ్లేషకునిగా సామాజిక శాస్త్రవేత్త తన ఉనికిని చాటుకునే అవకాశం ఉంటుంది. అంతర్లీన ప్రకార్యం గురించిన అవగాహన ముందే ఉంటే సామాజిక శాస్త్రవేత్త తొందరపడి, అభివ్యక్తం కాని ప్రకార్యాలున్న ప్రతీదానిని 'నిర్హేతుక'మని తోసిపుచ్చే అవకాశం ఉండదు. అనగా 'నిర్హేతుకంగా'పైకి కనిపిస్తున్నది సమాజంలో ఎందుకు చలామణిలో ఉందని తనను తానే ప్రశ్నించుకునే అవకాశం ఉంది. అప్పుడు ఆ నిర్హేతుక ప్రక్రియ లేదా విశ్వాసంలోని అంతరార్థాన్ని వెతికి పట్టుకునే ప్రయత్నం చేస్తాడు.

ఈ అంశాన్ని మరింత స్పష్టం చేయడానికి సెంట్రల్ ఆఫ్రికాలో ఆచరించే హోపి నృత్యం గురించి మెర్టన్ ప్రస్తావించాడు. మామూలుగా హోపి నృత్యం ఉత్సవాలు సెంట్రల్ ఆఫ్రికా గిరిజన తెగలు వర్షాలకోసం నిర్వహిస్తారు. ఈ ఉత్సవం వల్ల వరుణదేవుడు కరుణించి వర్షాలు కురిపించే అవకాశమే లేదు. వేడుకలు, ఉత్సవాలతో వర్షాలు పడవు. అందువల్ల సామాజిక శాస్త్రవేత్తలు హోపి వేడుకలను ఉత్త అంధ విశ్వాసంగా, ఆదిమ తెగల నిర్హేతుక ఆచారంగా కొట్టిపారేసే అవకాశం ఉంది. అయితే ఇలాంటి ఉత్సవాల్లోని ఉంతర్గత అర్థం కోసం చూడాలని మెర్టన్ అంటాడు. ఇటువంటి వేడుకల వల్ల దూరంగా చెదిరిపోయి ఉన్న హంపి తెగ సభ్యులంతా ఒకచోటికి చేరుతారు. ఉమ్మడి వేడుకలలో పాల్గొనడం ద్వారా తమ ఆచారాన్ని, అస్థిత్వాన్ని, సంఘీభావాన్ని చాటుకుంటారు. ఇది సాధారణ విషయం కాదు. హోపి నృత్యంలోని అంతర్లీన ప్రకార్యం ఇదే. సామాజికశాస్త్ర జ్ఞాన పరిధిని విస్తరించడానికి ఇది ఉపకరిస్తుంది.

BRAOU

ఈ అంతర్లీన ప్రకార్యం గురించి అవగాహన ఉన్న సామాజిక శాస్త్రవేత్త, సామాజిక శాస్త్ర జ్ఞాన అభివృద్ధికి దోహదం చేస్తాడు. అభివ్యక్త ప్రకార్యం గురించి మాత్రమే పట్టించుకుంటే సదరు శాస్త్రవేత్త కొత్తగా చెప్పేందుకు ఏమీ ఉండదు. అందువల్లనే అభివ్యక్త ప్రకార్యాలు, అంతర్లీన ప్రకార్యాల మధ్య బేధము గుర్తెరుగితే సామాజిక శాస్త్ర పరిజ్ఞానం విస్తరించడానికి, సామాజిక శాస్త్రవేత్తకు అవకాశం లభిస్తుంది. థోర్‌స్టిన్ వెబ్‌లెన్ రచన 'థియరీ ఆఫ్ లీజర్ క్లాస్' నుంచి మెర్టన్ కొన్ని ఉదాహరణలు ఇచ్చాడు. మనకు కన్పించే వస్తువినియోగానికి సంబంధించే అంతర్లీన ప్రకార్యం గురించి ఈ పుస్తకంలో చర్చించారు.

కొందరు వ్యక్తులు ఎప్పుడూ ఖరీదైన, ఆకర్షణీయమైన వస్తువులనే కొనాలనుకుంటారు. మార్కెట్‌లోకి వచ్చిన కొత్త మోడల్ కారు, టెలివిజన్, వాషింగ్ మెషిన్ ఆమాటకొస్తే డిటర్జెంట్ పౌడర్‌కు వాళ్లు ఎంతో ప్రాధాన్యతను ఇస్తారు. ఎవరైనా కారు కొనేది రవాణా సౌకర్యం కోసం. టెలివిజన్ సెట్ కొనేది వివిధ కార్యక్రమాల వల్ల బయటి ప్రపంచం గురించి తెలుసుకోవడం కోసం. వినోదం కోసం. ఇవన్నీ కూడా వినియోగ వస్తువుల అభివ్యక్త ప్రకార్యాలు. వినియోగదారులకు ఇవి బాగా తెలిసిన ప్రకార్యాలే. అయితే, ప్రత్యేకంగా, కొత్త మోడల్ కారు, లేదా టి.వి. కొనేవారు మాత్రం రవాణాకోసం కారు, కార్యక్రమాల కోసం టి.వి కాకుండా, తమ సామాజిక అంతస్తును చాటుకోవడానికి అది ఉపకరిస్తుందని భావిస్తారని మెర్టన్ అభిప్రాయం. మరో రకంగా చెప్పాలంటే ఖరీదైన, ఆకర్షణీయమైన వస్తువులను కొనడం, సామాజిక అంతస్తును చాటుకోవడానికే. అంతర్లీన ప్రకార్యం గురించిన భావన వల్ల ప్రపంచం గురించిన జ్ఞానం పెరగడంతోపాటు, మన విశ్వాసాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, అలవాట్లు, జీవిత విధానాల పర్యవసానాల గురించి కూడా అర్థం చేసుకోగలుగుతాము.

## 7.4 ప్రకార్యవిశ్లేషణ-క్రోడీకరణ

ఇతర సామాజిక శాస్త్రవేత్తలతో పోలిస్తే, ప్రకార్య విశ్లేషణను క్రోడీకరించి, క్రమబద్ధీకరించడంలో మెర్టన్ పాత్ర ఎంతో ఉంది. తనకంటే పూర్వీకులైన దుర్‌ఖైమ్, మలినోవ్‌స్కీ, రాడ్‌క్లిఫ్ బ్రౌన్ వంటి ప్రకార్యవాదులు ఈ సిద్ధాంత వృద్ధికి దోహదం చేసినప్పటికీ సమాజంలోని భిన్న భాగాలు నిర్వహించే ప్రకార్యాల గురించిన వారి అంచనాల్లో కొన్ని అభాసలున్నాయని మెర్టన్ అంటాడు. ప్రకార్యవాద విశ్లేషణకు సంబంధించిన మౌలిక సిద్ధాంతాలను సమీక్షించి, విమర్శించి వాటిని ఈ క్రింది విధంగా మెర్టన్ సవరించాడు.

### 7.4.1 ప్రకార్య ఐక్యతా సిద్ధాంతం

సమాజాన్ని జీవశాస్త్రరీత్యా ఈ సిద్ధాంతం వ్యాఖ్యానిస్తుంది. జీవిలోని అవయవాలు, అంగాలు ఏ విధంగానైతే ఆజీవి అస్థిత్వాన్ని నిలుపుతాయో అదే విధంగా సమాజంలోని భిన్న భాగాలు సమాజం సవ్యంగా సాగేందుకు దోహదం చేస్తాయని ఈ సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది. "యావత్ సామాజిక వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి వీలుగా యావత్ సామాజిక జీవితానికి ఒక నిర్దిష్ట సామాజిక సంప్రదాయం చూసే దోహదమే దాని ప్రకార్యం". అని రాడ్‌క్లిఫ్ బ్రౌన్ అన్నాడు. మలినోవ్‌స్కీ కూడా సంప్రదాయాలు, నియమాలు, సమాజంలోని యావత్ సాంస్కృతిక వ్యవస్థలో ప్రకార్యాలుగా పేర్కొన్నాడు. అందువల్ల సమాజంలోని ప్రతీవ్యక్తి భౌద్ధిక, జైవిక సంక్షేమానికి కూడా పరోక్షంగా అవి దోహదం చేస్తాయి. ఈ సిద్ధాంతంలో ప్రధానంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే 'సమాజ ప్రకార్యంలో ఒక రకమైన ఐక్యత ఉంటుంది. సమాజ వ్యవస్థలోని అన్ని విభాగాలు ఏదో ఒక స్థాయిలో సామరస్యంతో నిలకడగా కలసికట్టుగా పనిచేస్తాయి అని చెప్పడం. మెర్టన్ ఈ అభిప్రాయాన్ని తోసిపుచ్చాడు. సాంస్కృతిక అంశాలు యావత్ సమాజానికి, సమాజంలోని అందరు వ్యక్తులకు ఒకే రకమైన తీరులో ప్రకార్యాలను నిర్వహించకపోవచ్చునని మెర్టన్ అన్నాడు. ఆదిమ సమాజంలో సామాజిక సంఘీభావం, సమన్వయం, స్వజాతి భావనను మానవశాస్త్రవేత్తలు అతిగా చూపించారు. ఒకవేళ, ఈ భావన, మార్పులేని ఆదిమ చిన్న, చిన్న సమాజాల్లో, క్షేత్ర అధ్యయనానికి ఉప పత్తిగా, మానవశాస్త్ర వేత్తలకు ఉపయోగపడ్డా దానినే, ఆధునిక, సంక్లిష్ట సమాజాలలో ప్రయోగించడం సమంజసంకాదు. ఆధునిక సమాజాల్లో ప్రకార్య ప్రత్యేకీకరణ, నిర్మాణ విభేదీకరణ, సహేతుక అధికార యంత్రాంగం వంటి లక్షణాలు ఉంటాయి. అసలు అన్ని సమాజాలు పకడ్బందీగా సమన్వయమై ఉంటాయి. అందువల్ల సాంస్కృతికంగా ప్రమాణీకరించిన ఆచరణ, విశ్వాసము యావత్ సమాజానికి వర్తించే ప్రకార్యం అనే వాదనపై మెర్టన్ సందేహం వ్యక్తం చేశాడు. సామాజిక సంప్రదాయాలు ఒకే సమాజంలోని కొందరి ప్రకార్యంగా, అదే సమాజంలోని మరికొందరి వికార్యంగా ఉండొచ్చని అయన ఇతర సామాజిక శాస్త్రవేత్తలకు గుర్తుచేస్తాడు. ఉదాహరణకు ఛాందసవాదులు ప్రచారం చేసే మతం ఎలాంటి ప్రకార్యాన్ని పూర్తి చేస్తుంది? దుర్‌ఖైమ్ చూపినట్టుగా నిరక్షరాస్య నాగరిక సమాజంలో మతం, సమన్వయ ప్రకార్యాలను నిర్వహించడం నిజమే. భిన్న జాతులు, భిన్న మతాలు ఉన్న సమాజంలో మత ఛాందసవాదులు ప్రచారం చేసే మతం మైనారిటీలకు సంబంధించి ప్రమాదకరమైన పర్యవసానాలను తెచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల ఛాందసవాదులు అవసరమనుకున్నది మొత్తం సమాజానికి అవసరమైన ప్రకార్యం కాకపోవచ్చు. అందువల్ల ప్రకార్యవాదులు ఒక సామాజిక లేదా సాంస్కృతిక అంశం సమాజంలోని ఏ ప్రత్యేక విభాగానికి సంబంధించిన ప్రకార్యాన్ని నిర్వహిస్తుందో వివరించి చెప్పాలి. అంతే కాకుండాఒక అంశం భిన్న పర్యవసానాలు చూపే అవకాశం అంటే సమాజంలోని వ్యక్తులకు, ఉప బృందాలకు ప్రకార్యంగా అదే సమయంలో వికార్యంగా కూడా ఉండే అవకాశం ఉంది.

### 7.4.2 సార్వాత్రిక ప్రకార్యవాద సిద్ధాంతం

ఈసిద్ధాంతం ప్రకారం ప్రమాణీకరించిన అన్ని సామాజిక, సాంస్కృతిక రూపాలు అనుకూల ప్రకార్యాలనే కలిగి ఉంటాయి 19వ శతాబ్దపు మానవ శాస్త్రవేత్తలు, సమాజంలో కొనసాగుతున్న ప్రతీ నియమం, ఆచారం కూడా సమాజ మనుగడకు దోహదం చేసే సానుకూల ప్రకార్యాలనే నిర్వహిస్తున్నాయని భావించారు. వెంటనే తాము గుర్తించలేని ప్రకార్యాలున్న సామాజిక నియమాలు, సంప్రదాయాలను 'చలామణి'లో ఉన్న వాటిగా ముద్రించి వదిలిపెట్టారు. ఏ రకమైన నాగరికతలోనైనా ప్రతీ ఆచారం భౌతిక వస్తువు, ఆలోచన, విశ్వాసము ఏదో ఒక కీలక ప్రకార్యాన్ని

BRAOU

నిర్వహిస్తోందని మలినోవ్‌స్కీ చెప్పడం ఈ కోవలోనిదే.

వ్యక్తికి మంచి అయిన ప్రతీది సమాజానికి మంచి కానక్కరలేదని మెర్టన్ అంటాడు. ఒక సమాజంలోని శిష్ట వర్గానికి సానుకూలమైన పర్యవసానాలుండే ఒక సామాజిక అవసరం అదే సమాజంలోని సాధారణ ప్రజలకు ప్రతికూల పర్యవసానాలను చూపవచ్చు. యావత్ సమాజం ఉన్నతి కోసం ఏర్పాటు చేసిన సామాజిక వ్యవస్థలు కొన్ని సమయాల్లో, కొన్ని పరిస్థితుల్లో, సమాజంలోని కొన్ని విభాగాలకు అత్యంత చేటుగా పరిణమించవచ్చు. ఉదాహరణకు అభివృద్ధి చెందుతున్న దేశాలలో విశ్వవిద్యాలయాలు, సాంకేతిక విద్య పాఠశాలలు, విద్యావంతులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. అయితే అవకాశాలు లేని పక్షంలో ఆ సంస్థలే యువకుల్లో నిస్పృహను పాదుకొలిపే కేంద్రాలుగా మారవచ్చు. ఇది హింసకు రాజకీయ అస్థిరతకు దారితీయవచ్చు. మరో ఉదాహరణ క్రికెట్ క్రీడ. ఆటలోని సౌందర్యాన్ని, కళాత్మకతను ఆస్వాదించడానికి దోహదం చేస్తుంది. ఇది క్రికెట్ నిర్వహించే సానుకూల ప్రకార్యం. కొన్ని సార్లు జాతీయ భావనను, దేశభక్తిని కూడా ప్రేరేపిస్తుంది. అదే సమయంలో ఈ సానుకూల అంశాలను మాత్రమే సామాజిక పరిశోధకులు చూస్తే సరిపోదు. దాని వికార్యాలను కూడా గ్రహించాలి. క్రికెట్ కారణంగా పుట్‌బాల్, హాకీ వంటి క్రీడలు మీడియా నిర్లక్ష్యానికి గురి అయ్యాయి. క్రికెటర్లను ఒక తారగా, విదేశీయాత్రలు చేసే భాగ్యశాలిగా మీడియా ఆకాశానికి ఎత్తుతుంది. ఈ ధోరణి అసలైన క్రీడా సంస్కృతి నెలకొనకుండా వికార్యంగా పనిచేస్తుంది. అందువల్ల పర్యవసానాలను బేరీజువేసిన తర్వాతే ఒక వ్యవస్థ ప్రకార్యరీత్యా సానుకూలమా, ప్రతికూలమా అన్న నిర్ధారణకు రావలసి ఉంటుంది. ప్రకార్య విశ్లేషకుడు, ప్రకార్య పర్యవసానాలను, సమతౌల్యతను సరిచూసిన తర్వాత నిర్ధారణకు రావాలని మెర్టన్ అంటాడు.

### 7.4.3 ప్రకార్య అనివార్య సిద్ధాంతం

ఈ సిద్ధాంతం ప్రకారం ఒక సామాజిక సంప్రదాయం లేదా నియమం స్థిరపడిందంటే అది సమాజంలోని కొన్ని మౌలిక అవసరాలను తీరుస్తున్నట్టు లెక్క. అందువల్ల అది అనివార్యంగా ఉంటుంది. ఇది రెండు వైపుల పదును ఉన్న సూత్రీకరణ. సామాజిక వ్యవస్థ మనుగడకు కొన్ని రకాల ప్రకార్యాలు అనివార్యం. ఈ ప్రకార్యాలను పూర్తి చేయడానికి కొన్ని రకాల సామాజిక లేదా సాంస్కృతిక రూపాలు అనివార్యం. మెర్టన్ ఒకే సాంస్కృతిక అంశము బహు ముఖ విధుల్ని నిర్వహించవచ్చు. ప్రత్యామ్నాయ అంశాలు అనేకం ఒకే ప్రకార్యాన్ని నిర్వహించవచ్చు అని అన్నాడు. ప్రభుత్వ అవశ్యకతను కర్కశుడైన నియంత, ఉదార ప్రజాస్వామిక వాది, లేదా సంప్రదాయ రాజు కూడా తీర్చవచ్చు. మతం నిర్వహించే విధి సామాజిక సమన్వయమే అయితే ఈ విధిని బలమైన కేంద్రీకృత ప్రభుత్వం కూడా పూర్తి చేస్తుంది. ఒకవేళ విముక్తి మతం నిర్వహించే విధి అయితే సాధారణ విశ్వాస వ్యవస్థ కూడా సరిపోతుంది. అనేక మతరూపాల సంక్లిష్టతను వివరించడం నిజంగా కష్టం. అందువల్ల ప్రకార్య ఆవశ్యకత సూత్రాన్ని ఎదుర్కొనేందుకు మెర్టన్ 'ప్రకార్య ప్రత్యమ్నాయాలు', 'ప్రకార్య సమానార్థకాలు', 'ప్రకార్య పూరకాలు' అనే వేరువేరు అనుబంధ భావనలను ప్రవేశపెట్టాడు.

## 7.5 ప్రకార్య విశ్లేషణకు మెర్టన్ అవగాహన చట్రం

ప్రకార్య విశ్లేషణకు అవగాహన చట్రం అత్యవసరమని మెర్టన్ తలిచాడు. అవగాహన చట్రంలో కొన్ని భావనలతో కూడిన కనీస సమితి ఉంటుంది. అది లేకుండా సామాజిక శాస్త్రవేత్తలు ప్రకార్యవిశ్లేషణ నిర్వహించడం కష్టం. అంతేకాకుండా అవగాహన చట్రం వల్ల నేరుగా సూత్రీకరణకే వెళ్లవచ్చు. లేదా ప్రకార్య విశ్లేషణలో అంతర్లీనంగా ఉన్న పరికల్పనలను పట్టుకోవచ్చు. అవగాహన చట్రం వల్ల ప్రకార్యవిశ్లేషణ తేలికయి రాజకీయ, సామాజిక, సైద్ధాంతిక ప్రభావాలను తట్టుకోవడం కూడా సామాజిక శాస్త్రవేత్తలకు సులభమవుతుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే అవగాహన చట్రం లేకుండా సిద్ధాంతాన్ని క్రోఢీకరించడం కష్టం. సామాజిక విశ్లేషణలో ఉపయోగించే విస్మృత భావనలు, పరికల్పనలు, మౌలిక ప్రతిపాదనలను అగాహన చట్రం వెలికి తెస్తుంది. సామాజిక శాస్త్ర పరిశోధనలో తొందరపాటు సూత్రీకరణలు, ఏకపక్ష నిర్ణయాలకు ఆస్కారాన్ని తగ్గిస్తుంది. అందువల్ల ప్రకార్య విశ్లేషణను అవగాహన చట్రం ఏర్పాటు వల్ల విశ్లేషణ ఏవిధంగా జరపాలి, దేనిని అధ్యయనం చేయాలి, దేనిపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలి

BRAOU

వంటి అంశాలు సులభసాధ్యంగా మారుతాయి. మెర్టన్ ప్రకారం అవగాహనా చట్రాన్ని పాయింట్ల వారీగా ఈ విధంగా వివరించవచ్చు.

1. ఏప్రకార్యాలను అధ్యయనం చేయదలుచుకున్నామో దానికి సంబంధించిన ప్రమాణీకరించిన సామాజిక లేదా నైష్పత్తిక నియమం, సంప్రదాయాన్ని ఎంపిక చేయడంలో ప్రకార్యవిశ్లేషణ ఆధారం అవుతుంది.

2. కొన్ని సందర్భాలలో ప్రకార్య విశ్లేషణ సందర్భంగా సమాజంలోని వ్యక్తుల ఆత్మాశ్రయ అశలు వారి ఉద్దేశాలు, లక్షణాలు, ప్రస్తావనలోకి వస్తాయి. అయితే వాటిని వ్యక్తుల ధోరణి, విశ్వాసాలు ప్రవర్తనల ఫలితమైన వస్త్వాశ్రయాలుగా చూడరాదు.

3. యావత్ సమాజానికి వర్తించే ప్రకార్యలను గుర్తించే ప్రయత్నం వల్ల విశ్లేషణ తప్పుదారి పడుతుంది. ఎందుకంటే సమాజంలోని కొన్ని తరగతులు, కొందరు వ్యక్తులకు ప్రకార్యాలుగా వున్న అంశాలు ఇతర తరగతుల వ్యక్తుల వికార్యాలుగా చూడవచ్చు.

4. 'మనుగడ షరతులు' జైవిక అవసరాలతో కూడిన ప్రకార్య విశ్లేషణ ప్రాతిపదికలను పునఃపరిశీలించడం మంచిది. ప్రాతిపదికల ఔచిత్యాన్ని దృవీకరించడానికి వీలుగా వివిధ రకాల ప్రకార్య ప్రాతిపదికలను విధానాలను ముందుగా సిద్ధరపరచడం అవసరం.

5. ప్రకార్యాలను పూర్తి చేయడానికి ఉపయోగపడే సామాజిక యంత్రాంగాన్ని గుర్తించడానికి ప్రకార్య విశ్లేషణ ప్రయత్నించాలి.

6. ఒక నిర్దిష్ట సాంస్కృతిక అంశం నుంచి అనివార్యంగా ప్రకార్యం ఉంటుందనే వాదనను పూర్వపక్షం చేసినందువల్ల ఆ సాంస్కృతిక అంశంలోని ఇతర కోణాలను కూడా పరిశీలించాలి. అది ప్రకార్య ప్రత్యామ్నాయంగా, సమానకారిగా, పూరకంగా పనిచేస్తున్నదో లేదో పరిశీలించాలి.

7. సమాజవ్యవస్థలోని వివిధ భాగాల పరస్పర ఆధారతను ప్రకార్య విశ్లేషణ గుర్తించాలి. 'వ్యవస్థలో నిర్దిష్ట ప్రకార్యాలు నిర్వహించే భిన్న అంశాల్లో పరిమిత స్థాయిలో జరిగే అనియతిపై కూడా దృష్టి సారించాలి. ప్రతీది ప్రతీదానికి సంబంధించినదే అనడం నిష్ప్రయోజనం. అదే సమయంలో సమాజంలోని ఇతర విభాగలకు భంగం లేకుండా కొన్ని విభాగాలను తొలగించడం కూడా అసాధ్యం.

8. వివిధ ప్రకార్యాల పరికల్పనలు, సూత్రీకరణలను నిగ్గుతేల్చే విషయంలో చాలా జాగ్రత్త అవసరమని మెర్టన్ అంటాడు.

9. ప్రకార్య విశ్లేషణ దానికది ఏ సిద్ధాంతంతోనూ ముడిపడింది కాదు. అయితే ఒక సామాజిక శాస్త్రవేత్త చూపిన ప్రకార్య సూత్రీకరణలు ఏదైనా సిద్ధాంతానికి దగ్గరగా ఉండే అవకాశం లేకపోలేదు. అయితే ఈ రెండు ఒకటే అనుకునే అయోమయం ఉండకూడదు.

## 7.6 సామాజిక నిర్మాణం- అనియతి

కట్టుబాటు మాత్రమే కాకుండా ఉల్లంఘన కూడా సామాజిక నిర్మితి ప్రతిఫలమేనని మెర్టన్ భావన. ప్రకార్యవాది విశ్లేషణ కేవలం సామాజిక క్రమం సామాజిక వార్పు వగైరాలకే పరిమితమైనది. అనియతి సిద్ధాంతం ద్వారా ప్రకార్య విశ్లేషణ సిద్ధాంతాన్ని మెర్టన్ బలపరిచాడు. అసలు అనియతి భావనను తొలుత దుర్ఖైమ్ ప్రవేశపెట్టాడు. అనియతి అంటే యే నియమాలు, క్రమము లేని సమాజం అని అర్థం. పొంతనలేని పరస్పరం సంఘర్షణపడే విలువలు, నియమాలు ఉన్న సమాజం అనియత సమాజంలోని ప్రజలకు నేర్చుకోవడానికి ఎలాంటి మార్గదర్శకాలు ఉండవు.

ఒక సమాజంలో సాంస్కృతిక లక్ష్యాలను ఆ లక్ష్యాల సాధనకు ఏర్పాటు చేసుకున్న వ్యవస్థీకృత మార్గాలకు మధ్య ఎలాంటి సామరస్యం లేని స్థితిలో అనియతి పరిస్థితి క్రమంగా వృద్ధి చెందుతుందని మెర్టన్ సిద్ధాంతీకరించాడు. బాగా



BRAOU

డబ్బు సంపాదించుకోవడానికి సమాజికంగా అంతస్తును సాధించడానికి సమాజంలోని వ్యక్తులందరికీ ఒక రకమైన ప్రోత్సాహాన్ని సమాజం అందిస్తుంది. అయితే ఈ లక్ష్యాలను చేరుకోవడానికి ఆమోదించిన మార్గాలు మాత్రం కొందరిని మాత్రమే విజయపథంలోకి చేరుస్తాయని మెర్టన్ అంటాడు. ఉదాహరణకు అసాధారణ పరీక్షల వల్ల ఒక నిరుపేదబాలుడు లేదా బాలిక అనుకోకుండా డబ్బును, కీర్తిని సంపాదించవచ్చు. నూటికో, కోటికో ఒకటిగా ఉండే ఇలాంటి సంఘటనలు సమాన అవకాశాల భ్రమను చెదరకుండా కాపాడుతాయి. ప్రత్యేకమైన అవకాశాలంటూ లేని పక్షంలో సగటు ప్రతిభాపాటవాలున్న యువకులు డబ్బును, కీర్తిని సామాజిక అంతస్తును సాధించడం దుర్లభం. సమాజ ఆమోదం పొంది చలామణిలో ఉన్న నియమాలు, మార్గాల వల్ల ఉన్నత స్థాయికి ఎగబాకడం అసాధ్యమని గ్రహించిన వారిలో కొందరు సదరు నియమాలను, మార్గాలను ఉల్లంఘించే అవకాశం ఉంది. మెర్టన్ ఈ విధంగా అంటాడు, "ఏదేని సమాజంలో ప్రజలు విజయలక్ష్యాలను చేరుకోవడానికి కొన్ని ఉమ్మడి మార్గాలను సాంస్కృతిక విలువలతో కూడిన వ్యవస్థ ద్వంద్వాతీతంగా హర్షిస్తుంటే మరో వైపు సమాజ నిర్మితి మాత్రం అదే సమాజంలోని చెప్పుకోదగిన వర్గం ప్రజలు సదరు విజయలక్ష్యాలను అందుకునే మార్గాలను మూసివేసి లేదా తృణీకరించినప్పుడూ సమాజంలో అనియతి ప్రభలే అవకాశం ఉంది. విజయలక్ష్యాలను నైతికామోదంతోపాటు అవకాశం లేకుంటే రాజమార్గంలో లేదంటే అడ్డదారిలోనైనా విజయలక్ష్యాలను సాధించడానికి ఒత్తిడి పెరుగుతుంది".

విజయం కోసం ప్రజలు సమాజ ఆమోదిత మార్గాలనుంచి అనామోదిత మార్గాలకు మళ్లినప్పుడు అనియతి పెరుగుతుంది. ఏ సమాజంలోనైనా లక్ష్యాలు- వాటిని చేరే మార్గాలకు సంబంధించి అయిదురకాల ప్రతిస్పందన వుంటుందని మెర్టన్ పేర్కొన్నాడు. అవి:

| అనుసరణ విధానం | ప్రకార్య లక్ష్యాలు | వ్యవస్థీకరించిన మార్గాలు |
|---|---|---|
| ఔదలదాల్చడం | + | + |
| కొత్తపోకడలు | + | - |
| తంతుగా మార్చడం | - | + |
| పలాయనం | - | - |
| తిరుగుబాటు | +- | +- |

BRAOU

1. ఔదల దాల్చడం అంటే ఉప సంప్రదాయ లక్షణాలను, వాటిని చేరుకోవడానికి వ్యవస్థీకృతం చేసిన మార్గాలను రెండింటినీ అంగీకరించడం.

2. కొత్త పోకడలు: అంటే సంప్రదాయక లక్ష్యాలను అందుకోవడానికి అక్రమ, నేర మార్గాలతో సహా సంప్రదాయ విరుద్ధ మార్గాలను తొక్కడం.

3. తంతుగా మార్చడం: లక్ష్యాలను అటకెక్కించి, సంప్రదాయక మార్గాలను పూజనీయ స్థానంలోకి చేర్చడం. అసలు అర్థాల్ని, ప్రకార్యాల్ని విస్మరించి తంతులు, నిత్యకృత్యాలతో వ్యవస్థీకృత మార్గాలకు మరే ఇతర పరమార్థం లేకుండా మార్చడం. అంటే దానికదే పరమార్థంగా ఉంటుంది.

4. పలాయన ధోరణి: అంటే సామాజిక లక్ష్యాలను, వ్యవస్థ చూపిన మార్గాలను రెండింటినీ వదిలిపెట్టి మరో బాట పట్టడం. తాగుబోతులు, మత్తుపదార్థాల బానిసలు తదితర వక్రమార్గాల జాబితాలో చేరుతారు.

5. ధిక్కారం లేదా తిరుగుబాటు: అంటే సంప్రదాయక లక్ష్యాలను ప్రకటించి అందరు అనుగుణంగా కొత్త మార్గాలను వ్యవస్థీకరించేందుకు జరిగే ప్రయత్నం. విప్లవకారులు ఇందుకు ఉదాహరణ. పట్టిక రూపంలో వ్యక్తులు,

ప్రతిస్పందనలను ఈ త్రివిధంగా సూచించారు. ఒక వ్యవస్థలోని లక్ష్యాలు వాటిని చేరుకునేందుకు ప్రమాణీకరించిన మార్గాల పట్ల ప్రజల ప్రతిస్పందనను సూచించే అయిదు మార్గాలను ఈ పట్టికలో మెర్టన్ చూపించాడు. ఈ పట్టికలో '+' ఆమోదానికి గుర్తు. '-' తిరస్కారానికి చిహ్నం కాగా '+-' మాత్రం చాలా వాటిలో ఉన్న విలువలను తృణీకరించి కొత్త విలువలను ప్రతిపాదిస్తున్నట్టుగా తెలియజేస్తుంది.

## 7.7 మెర్టన్‌పై విమర్శ

అభివ్యక్త ప్రకార్యాలు, అంతర్లీన ప్రకార్యాల మధ్యన మెర్టన్ జరిపిన విభేదీకరణను టర్నర్ తీవ్రంగా విమర్శించాడు. తన అభివ్యక్త, అంతర్లీన ప్రకార్య సిద్ధాంతం ప్రకారం ఏదైనా ఒక అంశం లేదా క్రియ అభివ్యక్త ప్రకార్యాన్ని పూర్తి చేస్తుందని మెర్టన్ చెప్పకనే చెప్పాడని టర్నర్ ఆక్షేపించాడు. "సమాజంలోని ప్రతీ సంప్రదాయం, భౌతిక, వస్తువు, ఆలోచన, విశ్వాసం ఏవో కొన్ని కీలక ప్రకార్యాలను నిర్వహిస్తుంటాయి. వాటన్నింటికీ పూర్తిచేయాల్సిన కర్తవ్యం ఏదో ఒకటి వుంటుంది" అని మలినోవ్‌స్కీ చేసి ప్రకార్య సార్వాత్రిక వాదాన్ని మెర్టన్ తీవ్రంగా విమర్శించాడు. అదే సమయంలో "సమాజం ఏదైనా అక అంశం అభివ్యక్త ప్రకార్యాన్ని పూర్తి చేయని పక్షంలో ఖచ్చితంగా ఉంచదగిన ప్రకార్యాన్ని నిర్వహిస్తుంది. సమాజంలోని ఒక వర్గానికి వికార్యంగా వుండే అవకాశం ఉంది"అని సూత్రీకరించాడు. మలినోవ్‌స్కీని తప్పుపట్టిన మెర్టన్ తానూ అదే అభాసకు పాల్పడ్డాడు. అందువల్ల ప్రకార్యవాద విశ్లేషణకు అదనంగా మెర్టన్ ఒరగబెట్టిందేమీ లేదని టర్నర్ వ్యాఖ్య.

కార్యాన్ని కారణాన్ని వేరుచేసి చూడడంలో తనకంటే పూర్వికులైన ప్రకార్యవాదులు ఎదుర్కొన్న ఇబ్బందులు మెర్టన్‌కు బాగా తెలుసు. ఈ ఇబ్బందులను అధిగమించడానికి ప్రకార్య విశ్లేషణకు మెర్టన్ అవగాహన చట్రాన్ని ప్రవేశపెట్టినాడు. అయినప్పటికీ కార్యాన్ని, కారణాన్ని వేరుగా చూపే మౌలిక ప్రాతిపదికను తన పూర్వికులలోగానే మెర్టన్ కూడా నిర్లక్ష్యం చేశాడు. అవసరాలకు అనుగుణంగా రాజకీయ యంత్రాంగాలు సాధనాలు పుట్టుకువస్తాయని మెర్టన్ సూచించాడు. అయితే అవసరాలు ఏవిధంగా ఒక ఘటనను సృష్టిస్తాయే మాత్రం వివరంగా చెప్పలేదు.

సాంస్కృతిక లక్ష్యాలకు వాటిని చేరుకోవడానికి ఏర్పడిన వ్యవస్థీకృత మార్గాలకు మధ్య సామరస్యం ఏర్పడినప్పుడు విజయాన్ని ఆశించేవారు పక్కమార్గాలను తొక్కుతారని మెర్టన్ తన విచలన సిద్ధాంతంలో ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతం లేదా సూత్రీకరణ పక్కదారులు పట్టిన వారిని ముఖ్యంగా పేదలు, బడుగువర్గాలకు బాగానే వర్తిస్తుంది. అయితే సంపన్నులు, విజయశిఖరాలను అధిరోహించిన వారిలో కూడా ఈ పక్కదారులు పట్టే నైజం వుంటుంది. కాలేజీ విద్యార్థుల్లో కనిపించే విప్లవ క్రియాశీలతను "సంప్రదాయలక్ష్యాలను చేరుకునే మార్గాలు లేని కారణంగా వచ్చిందని " చెప్పడం సబబుకాదు.

"ఒక సమాజంలో విచలన ధోరణులు విస్తృతంగా అమల్లో వుంటాయో ఆ సమాజంలోని వ్యక్తులు విచలనానికి లోనయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి". అని మాలేర్‌లాండ్ తన విచలనసిద్ధాంతలో పేర్కొన్నాడు. సమాజంలో అందరికీ ఆమోదయోగ్యమైన పద్ధతుల, లక్ష్యాలను చేరాలనే మార్గాలను అనుసరించేవారు తమ ప్రవర్తనను ఏ విధంగా మలుచుకుంటారో విలువలకు లోనయినవారు సైతం అదే పద్ధతిలో సమాజంనుంచే నేర్చుకుంటారనే విషయం గుర్తుంచుకోవాలి.

## 7.8 సారాంశం

1949లో 'సోషల్ థియరీ అండ్ సోషల్ స్ట్రక్చర్' పుస్తకం ప్రచురించిన తర్వాత నిర్మాణ ప్రకార్యవాద క్షేత్రంలో మెర్టన్ పేరు మోగిపోయింది. తనకంటే ముందు వచ్చిన ప్రకార్య విశ్లేషణలోని కొన్ని అసంబద్ధతలను తొలగించడానికి మెర్టన్ ప్రయత్నించాడు. ప్రకార్య విశ్లేషణకు సమగ్ర పద్ధతిని ప్రవేశపెట్టాలనే ఆయన తపించాడు. సమాజంలో అనుసరణ లేదా సర్దుబాటుకు ఆస్కారం ఇచ్చే ఒక క్రియ యొక్క గమనించగదిన ప్రర్యవసానాలే ప్రకార్యాలని మెర్టన్ వర్ణించాడు. సర్దుబాటు, అనుసరణలకు అవరోధం కల్పించే వాటిని వికార్యాలుగా పేర్కొన్నాడు.



BRAOU
Dr. BRAOU LIBRARY

సమాజంలోని సమభాగులు గుర్తించదగిన వస్తుగత పర్యవసానాలను అభివ్యక్త ప్రకార్యాలని పేర్కొన్నాడు. ఈ పర్యవసానాలను ఉద్దేశపూర్వకంగానే సమాజంలోని ప్రజలు కాంక్షిసాతరు. అలా కాంక్షించని వస్తుగత పర్యవసానాలను వీరు గుర్తించలేరు కూడా. అలాటి వాటిని అంతర్లీన ప్రకార్యల మధ్య భేదాన్ని విడమర్చడం వల్ల ప్రపంచాన్ని స్థూల దృష్టికి అతీతంగా పరిశీలించడానికి వీలు కలుగుతుంది. సమాజంలో అమల్లో వున్న అనేక విశ్వాసాలు, ఆచారాలు, సాంస్కృతిక సంప్రదాయాల అంతరార్థాన్ని గ్రహించడానికి అంతర్లీన ప్రకార్యం ఉపకరిస్తుంది.

అవగాహన చట్రం అత్యంత ఆవశ్యకమని మెర్టన్ అభిప్రాయం. అవగాహన చట్రం కొన్ని నిర్దిష్ట భావనల సమితులతో కూడి ఉంటుంది. ఇది లేకుండా సామాజిక శాస్త్రవేత్త ప్రకార్య విశ్లేషణ జరపడం సాధ్యం కాదు. సామాజిక విశ్లేషణలో ఉపయోగించే ఊహలు, భావనలు, మౌలిక ప్రతిపాదనలను అవగాహన చట్రం వెలికి తీస్తుంది. దీనివల్ల సామాజిక పరిశోధనలో ఏకపక్ష నిర్ణయాలకు, తొందరపాటు ప్రతిపాదనలకు అవకాశం తగ్గుతుంది. సాంస్కృతిక లక్ష్యాలకు వాటిని అందుకోవడానికి ఉద్దేశించిన వ్యవస్థాపరమైన మార్గాలకు మధ్యన పొంతన లేనప్పుడు అనియతి ఏర్పడుతుందని మెర్టన్ సిద్ధాంతీకరించాడు.

## 7.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. అభివ్యక్త ప్రకార్యాలు, అంతర్లీన ప్రకార్యాల మధ్య తేడాలను మెర్టన్ ఏవిధంగా వివరించాడు.

2. ప్రకార్యవిశ్లేషనకు మెర్టన్ ప్రతిపాదించిన అవగాహన చట్రం గురించి తెలుపండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. ప్రకార్యం, వికార్యం మధ్య బేధాన్ని వివరించండి.

2. మెర్టన్ అనియత సమాజం గురించి తెలుపండి.

BRAOU

## 7.10 చదవదగిన పుస్తకాలు


| | |
|---|---|
| Cohen Persy | : Modern Social Theory |
| Merten, R.K. | : Social Theory and Social Structure |
| Merten, R.K. | : Construction Social Theories |
| Merten, R.K. | : Contemparary Social Problems |
| Merten, R.K. | : Leader in Bureaucracy |
| Turner, J.H. | : Structure of Sociological Theory |
| Weblan, T. | : Theory of Leasure Class |

# భాగం-8: నిక్లస్ లూహ్‌మన్

విషయక్రమం


8.0 ఉద్దేశాలు

8.1 పరిచయం

8.2 సాధారణ వ్యవస్థల దృక్పథం

8.2.1 వ్యవస్థ-పర్యావరణం

8.2.2 పర్యావరణ కారకాలు

8.2.3 సామాజిక వ్యవస్థలో రకాలు

8.3 లూహ్‌మన్-సామాజిక పరిణామం

8.4 లూహ్‌మన్ విమర్శ

8.5 సారాంశం

8.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

8.7 చదవదగిన పుస్తకాలు


## 8.0 ఉద్దేశాలు

ఈ పాఠ్యాంశం చదివిన తర్వాత మీరు

- సమాజ విశ్లేషణకు లూహ్‌మన్ ప్రతిపాదించిన సాధారణ వ్యవస్థల దృక్పథాన్ని అవగాహన చేసుకుంటారు.
- అన్ని సామజిక వ్యక్తుల మధ్య భేదం బోధపడుతుంది.
- లూహ్‌మన్ సమాజ పరిణామ సిద్ధాంతాన్ని వివరించగలుగుతారు.

## 8.1 పరిచయం

అమెరికాలోని సైద్ధాంతిక వాదులంతా అటు పార్సన్ ఇటు మెర్టన్ సిద్ధాంతాలతో సహా అన్ని రకాల ప్రకార్య విశ్లేషణలను మరిచిపోతున్న తరుణంలో యరప్‌లో మరీ ముఖ్యంగా జర్మనీలో మళ్లీ ప్రకార్యవాదం తెరమీదికి వచ్చింది. నిక్లస్ లెహ్‌మన్ యూరప్‌లోని సామాజిక శాస్త్రవేత్తల దృష్టిని మళ్లీ ప్రకార్యవాదంపైకి మళ్లింపజేసినాడు.

పార్సన్స్ రూపొందించిన ప్రక్రియ సిద్ధాంతం తన సొంత అమరికల గురించే పట్టించుకోవడాన్ని లెహ్‌మన్ లెహ్‌మన్ తప్పుపట్టాడు. నిర్మాణంలో భాగమైన భిన్న తరగతులను విస్తరిస్తూ పోయి, సిద్ధాంతాన్ని జటిలంగా మార్చడంతోపాటు కళ్లెదుట కనిపించే వాస్తవానికి పార్సన్స్ పూర్తిగామరచి ముందుకు సాగాడు. దీనిని సవరించడానికి లెహ్‌మన్ ఒక అమూర్త భావనావిధానాన్ని ఆశ్రయించాడు. లూహ్‌మన్ రూపొందించిన ప్రకార్య విశ్లేషణ వాదాన్నే 'సాధారణ వ్యవస్థల' దృక్పథం అని కూడా అంటారు.

## 8.2 సాధారణ వ్యవస్థల దృక్పథం

సమాజంలోని మనుషుల చర్యలు, ప్రతిచర్యలు, సంఘటితమై వేరువేరు వ్యవస్థలుగా నిర్మితమవుతాయని



BRAOU

లెహ్‌మన్ సాధారణ వ్యవస్థల దృక్పథం ప్రతిపాదిస్తుంది. అనేక మంది వ్యక్తుల చర్యలు, వారి క్రియల మధ్య పరస్పర సంబంధం ఏర్పడినప్పుడు విశాల సామాజిక వ్యవస్థ ఉనికిలోకి వస్తుంది.

### 8.2.1 వ్యవస్థ-పర్యావరణం

సామాజిక వ్యవస్థ ఉనికికి ఆధారం భిన్న వ్యక్తుల క్రియలు, చర్యల మధ్యన పరస్పర సంబంధం ఏర్పడడం అనే విషయాన్ని పైన చదువుకున్నాము. ఇలాంటి సంబంధాలు ఏర్పడాలంటే అందుకు సాధనం ఉండాలి. అలాంటి మౌలిక సాధనమే కమ్యూనికేషన్. పదాల వంటి సంకేతాలు ఇతర మాధ్యమాల ద్వారా కమ్యూనికేషన్ అనే సాధనం వ్యక్తుల క్రియలని అనుసంధానం చేస్తుంది. అన్ని సామాజిక వ్యవస్థలు అనంతమైన అతిక్లిష్టమైన పర్యావరణంలో మనుగడ సాగించాల్సి వుంటుంది. ఈ పర్యావరణానికి అనేక ముఖాలు, పార్శ్వాలు ఉంటాయి. పర్యావరణ సంక్లిష్టతను తగ్గించుకుని మనుగడను సాధ్యమైనంతలో సునాయసంగా తయారు చేసుకునేందుకు వీలుగా ప్రతీ సమాజం కూడా దీన్ని సొంత సాధనాలను అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. సంక్లిష్టతన తగ్గించే మార్గాలను ఎంపిక చేసుకునేందుకు ఈ సాధనాలే ఉపకరిస్తాయి. సంక్లిష్టతను తగ్గించే మార్గాల వల్ల సమాజానికి పర్యావరణానికి మధ్యన ఒక రేఖ ఏర్పడుతుంది. ఈ రేఖ కారణంగా సమాజంలో పరస్పర సంబంధం ఉన్న క్రియలు నిరవధికంగా, నిర్నిరోధంగా సాగిపోతాయి. పరస్పర సంబంధం ఉన్న భిన్న వ్యక్తుల క్రియలకు, పర్యావరణ సంక్లిష్టతను తగ్గించాల్సిన అవసరానికి లెహ్‌మన్ సిద్ధాంతం నడుంకట్టింది. పర్యావరణ సంక్లిష్టతలను తగ్గించేందుకు ఏ మార్గాలు దోహదం చేస్తున్నాయనే అంశం ఆధారంగానే అన్ని రకాల సామాజిక ప్రక్రియలను విశ్లేషించాల్సి వుంటుంది.

### 8.2.2 పర్యావరణ (కోణాలు) పరిమాణాలు

పర్యావరణ సంక్లిష్టతను తగ్గించి, పర్యావరణానికి, వ్యవస్థకు మధ్యన సరిహద్దురేఖలా వుండే సాధనాలను ప్రతీ సమాజం సొంతంగా అభివృద్ధి చేసుకుంటుందని తొలుత చెప్పుకున్నాము. అలాంటి సాధనాలు లేదా యంత్రాంగం మూడు ముఖ్యమైన పర్యావరణ (కోణాలు) పరిమాణాలపై ఆధారపడి పనిచేస్తుంది. అవి: 1. కాలం, 2. పదార్థం, 3. సంకేతాలు. ఈ పరిమాణాలు ఏమిటో ఇక్కడ చూద్దాం.

సమాజ సమస్తానికి కాలం అనేది ముఖ్యమైన పరిమాణమని లెహ్‌మన్ భావించాడు. కాలం అనేది సమాజానికి తీవ్రమైన సంక్లిష్టతను కల్పిస్తుంది. అంతుతెలియని గతం, కళ్లెదుటే జరిగే వర్తమాన ఘటనలు, అనంతమైన భవిష్యత్... అందువల్ల కాలం కారణంగా ఏర్పడిన సంక్లిష్టతను తగ్గించుకోవడానికి ప్రతీ సమాజం కూడా సొంత వ్యవస్థను, విధానాలను ఏర్పాటు చేసుకోవాలి. ఇక పదార్థ పరిమాణం అంటే పరిమితులు లేని భౌతిక స్థలంలో చోటు చేసుకునే క్రియల మధ్య అవకాశం వున్న అన్ని రకాల సంబంధాలు, భౌతిక స్థలంలో జరిగే క్రియల మధ్యన పరస్పర సంబంధం ఉన్న క్రియల ఉత్పన్నానికి ఎలాంటి వ్యవస్థను లేదా విధానాన్ని రూపొందించారన్నది చాలా ముఖ్యం అంటాడు లెహ్‌మన్. ఇక సంకేత పరిమాణం అనేది మనుషులు ఉపయోగించే సంకేతాలు, వాటి సంయుక్తతలకు సంబంధించినది. ఏ సంకేతాలను ఎప్పుడు ఉపయోగించాలి, వేటి స్థానే వాటిని ఉపయోగించాలి, వేటికి బదులుగా వేటిని ఉపయోగించాలనేది తేల్చుకోవడానికి ఉపయోగించే విధం కూడా ఈ పరిమాణంలో భాగమే.

### 8.2.3 సామాజిక వ్యవస్థల రకాలు

వ్యక్తుల చేతలు, క్రియల మధ్యన అర్థవంతమైన సంబంధాన్ని కల్పించినప్పుడు, అర్థవంతంగా వాటిని ముడిపెట్టగలిగినప్పుడు ఒక సామాజిక వ్యవస్థ ఉనికిలోకి వస్తుంది. ఈ ప్రక్రియలో మూడు రకాల మౌలిక సామాజిక వశీయవస్థలు ఏర్పడుతాయి. అవి: 1. పరస్పర సంబంధ వ్యవస్థ, 2. వశీయవస్థాపన వ్యవస్థ, 3. సమాజం సంబంధ వ్యవస్థ.

అనేక మంది వ్యక్తులు ఒకే చోట వుండి ఒకరినొకరు ఎరిగినప్పుడు పరస్పర సంబంధ వ్యవస్థ ఏర్పడుతుంది. ముఖాముఖి కమ్యూనికేషన్‌లో భాషను ఉపయోగించడం వల్ల ఇలాంటి వ్యవస్థలు విస్తృతమవుతాయి. పరస్పర సంబంధ వ్యవస్థలు సరళమైనవి. ఒకచోట వుండి, పరస్పరం ఎరిగి, మాట్లాడుకునే వారు మాత్రమే ఈ వ్యవస్థ ఉనికికి అవసరం. ఇందులో కాలవ్యయం మాత్రం ఎక్కువగా ఉంటుంది.



BRAOU

నిర్దిష్ట షరతులకు లోబడి వ్యక్తుల చరక్రియలను లేదా వారి క్రియలను సమన్వయం చేసేది వ్యవస్థాప వ్యవస్థ. ఉదాహరణకు కొంత మొత్తం డబ్బుకు బదులుగా కొంత పని చూసిపెట్టడం వంటిది. వీటిలో రాక, పోకలు (అగమ, నిష్క్రమణ)కు సంబంధించిన నిబంధనలు ఉంటాయి. (ఉదాహరణకు ఇంతకాలంపాటు పనికి రావాలి, ఇంత మొత్తం డబ్బు తీసుకో... లాంటివి) ప్రజలను సమీకృతపరచడం ద్వారా వ్యవస్థాప వ్యవస్థలు పర్యావరణ సంక్లిష్టతను తగ్గిస్తాయి.

1. ఆగమన, నిష్క్రమణ నియమాలు, వర్తమాన, భవిష్యత్ కాలాల్లో కార్యకలాపాలకు ఆదేశాలు ఇవ్వడం ద్వారా కాలానికి సంబంధించిన జటిలత్వాన్ని తగ్గిస్తాయి. 2. శ్రమ విభజన అంటే ఎవరు ఏ పని చేయాలో నిర్దేశించడం వల్ల స్థలానికి సంబంధించిన సంక్లిష్టత తగ్గుతుంది. 3. ఏది అవసరం, ఏనియమాలు వర్తిస్తాయి, పనులు చేయించడానికి డబ్బులేదా మరో ప్రతిఫలం ఏది ఇవ్వాలి అనే అంశాలను నిర్ణయించడం సంకేత పరమైన సంక్లిష్టతను రేకెత్తిస్తుంది.

ఇక సమాజసంబంధ వ్యవస్థలో పరస్పర సంబంధాల వ్యవస్థ, వ్యవస్థాపన వ్యవస్థ రెండూ కలిసి వుంటాయి. ఇది విస్తృతమైంది. "పరస్పర సంభాషణకు అవకాశం వున్న కమ్యూనికేషన్ క్రియల సమగ్ర వ్యవస్థగా" దీన్ని చెప్పవచ్చు. చారిత్రకంగా ఈ వ్యవస్థలకు భౌగోళిక రాజకీయాల వల్ల పరిమితులు వుండేవి. అయితే ఆధునిక కాలంలో ఏక ప్రపంచ వ్యవస్థ ధోరణి కనిపిస్తున్నదని లెహ్మాన్ అభిప్రాయం. పర్యావరణ సంక్లిష్టతను తగ్గించడానికి ఈ వ్యవస్థలు డబ్బు, అధికారం వంటి అత్యంత సాధారణీకరించిన కమ్యూనికేషన్ సంకేతాలను వుపయోగిస్తాయి.

నిజానికి అన్ని రకాల సామాజిక ప్రక్రియలకు వేదిక సమాజమే. పైగా ఈ క్రియలన్నీ కూడా పరస్పర సంబంధాల రూపంగానే కొనసాగాలి. అందువల్ల పైన చెప్పిన మూడు రకాల వ్యవస్థలను దేనికది విడిగా ఉండదు. సాధారణ సమాజాల్లో ఈ మూడు కలిసిపోయే వుంటాయి. సామజం విస్తరించి సంక్లిష్టంగా మారిన కొద్దీ ఈ వ్యవస్థలను దేనికది విడిగా చూపడానికి ఆస్కారం వుంటుంది. ఆర్గనైజేషన్‌ను 1. వాటి ప్రకార్య నిర్వహణ వేదికలు (ప్రభుత్వం, చట్టం, విద్య, ఆర్థిక వ్యవస్థ, మతం, విజ్ఞానశాస్త్రం ఆధారంగా). 2. ఆగమన, నిష్క్రమణ నియమాలను బట్టి, 3. డబ్బు, సత్యం, ప్రేమ, అధికారం, వంటి వేరువేరు కమ్యూనికేషన్ మాధ్యమాలపై అవి ఆధారపడటాన్ని బట్టి విడిగా గుర్తించవచ్చు.

ప్రజల కార్యకలాపాలను భిన్న కార్యక్షేత్రాలలోని భిన్న సంఘాలు, సంస్థలకు మళ్లించడం ద్వారా సంక్లిష్ట సమాజాల్లో సమగ్రతను సాధించడానికి ఆస్కారం ఉంటుందని లెహ్మాన్ అంటాడు. ఒక సమాజంలో అనేక సంస్థలు, వ్యవస్థాపనలు వున్నపుడు వ్యక్తుల అస్తిత్వాన్ని నేను అనే భావన కబళించే అవకాశం ఏ ఒక్క వ్యవస్థాపనకూ వుండదకూడదు. ఎందుకంటే వారి శక్తియుక్తులు, సమర్థత అన్నీ ఆశిస్తున్న వ్యవస్థాపనలలో విస్తరించి ఉంటాయి. ఇలాంటి ఏర్పాటువల్ల 'ఉద్వేగాలతో కూడిన సంఘర్షణకు ఆస్కారం ఏమాత్రం వుండకూడదు. వ్యక్తులను ఉద్వేగాలతో కూడిన సఘర్షణల్లోకి లాగే అవకాశాలు తగ్గడం వల్ల సామాజిక అలజడి విచ్ఛిన్నాలకు అవకాశం కూడా తగ్గుతుంది. సంక్లిష్ట సమాజాల్లో ఘర్షణలను నివారించే మరో విభాగం వ్యవస్థాపనలు అమలు చేసే ఆగమన, నిష్క్రమణ నిబంధనలు. భిన్న హోదాలు, అంతస్తులు, కార్యాలయాలు, విధి విషయాలు, జీతభత్యాలకు సంబంధించిన స్కేల్స్‌వల్ల తెలుసు. వ్యవస్థాపనకు మతం వగైరా విలువల ఘర్షణ పడే పరిస్థితి దానిలోని సభ్యులకు తక్కువగా ఉంటుంది. చివరగా ఏదైనా ఘర్షణలు తలెత్తితే వాటిని నివారించేందుకు చట్టం, పోలీసు యంత్రాంగం, న్యాయస్థానాలు వంటి సాంఘిక నియంత్రణ వ్యవస్థలు ఎలాగూ వుంటాయి.

సంక్లిష్ట సమాజాల్లో నైతిక విలువలపై ఏకాభిప్రాయం గురించి టాల్కోట్ పార్సన్స్ అతిగా నొక్కి చెబితే, లూహ్మన్ మాత్రం సామాజిక సమగ్రతకు వ్యక్తులు నైతిక, భావోద్వేగాల పరంగా సమాజంతో అతుక్కుని ఉండాల్సిన అవసరం లేదని ప్రకటించాడు. సంక్లిష్ట సమాజాల్లో వ్యక్తులకు సమాజంలో భావోద్వేగాలతో సంబంధం లేకుండానే వారికి అనేక స్వేచ్ఛ, వెసులుబాటు అవకాశాలు వుంటాయని లూహ్మన్ అభిప్రాయం.

క్లుప్తంగా చెప్పాలంటే లుహ్మన్ సాధారణ వ్యవస్థల దృక్పథం వ్యవస్థ పర్యావరణ శిబిరం చుట్టూ పరిభ్రమిస్తుంది. ప్రతీ వ్యవస్థకూడా కాలం, స్థలం, సంకేతాల ప్రయోగం దృష్ట్యా తన పర్యావరణ సంక్లిష్టతను తగ్గించుకోవాల్సి



BRAOU

వుంటుంది. సంక్లిష్టతలను తగ్గించే ప్రక్రియలను ప్రకార్యవిభాగాలుగా గుర్తించారు. లూహ్‌మన్ ప్రకారం మూడురకాల వ్యవస్థలు వున్నాయి. అవి పరస్పర సంబంధ వ్యవస్థలు, వ్యవస్థాపన (ఆర్గనైజేషన్), సమాజహిత వ్యవస్థలు. ఈ వ్యవస్థల ప్రక్రియలన్నీ కూడా కమ్యూనికేషన్ మాధ్యమం ద్వారా జరుగుతాయి.

భిన్న సమాజాల మధ్య బేధాలను చర్చించడానికి సమాజాల పరిమాణాన్ని వివరించడానికి లూహ్‌మన్ తన వ్యవస్థల దృక్పథ సిద్ధాంతాన్ని ఉపయోగించాడు.

## 8.3 లూహ్‌మన్ సమాజ పరిణామం

సామాజిక విభేదీకణ సమాజ పరిణామ క్రమాన్ని విశ్లేషిస్తూ వచ్చిన సంప్రదాయాల సిద్ధాంతాలను **లూహ్‌మన్** తీవ్రంగా విమర్శించాడు. మార్క్స్, దుర్ఖైమ్ నుంచి పార్సన్స్ వరకు సంప్రదాయ సిద్ధాంతాలన్నీ పరిణామ క్రమంగా ముగింపును సంభావించాయి. లూహ్‌మన్ విధానాన్ని ఆదర్శవాదంగా పేర్కొన్నాడు. సిద్ధాంతంపట్ల వ్యతిరేకతకు ఇది మొదటి కారణం. విభేదీకరణ వ్యవస్థల్లో విలువల పట్ల ఏకాభిప్రాయమే వ్యవస్థ సమగ్రతలో కీలకమైన ఉపకణంగా పనిచేస్తుందని కూడా సంప్రదాయ సిద్ధాంతాలు ప్రవచించినాయి. దీనితోకూడా లెహ్‌మన్ విబేధించాడు. ఈ రెండూ కాకుండా మరోది. సంప్రదాయ సిద్ధాంతాల్లో విలువలకంటే నేరం, ఘర్షణ, ఏకాభిప్రాయం లేకపోవడం వంటి సాంఘిక ప్రక్రియలకే పెద్దపీట వేశారు. పైగా కర్తృత్వం లేకపోవడాన్ని ఒక అవ్యవస్థగా భావించాడు. ఏది ఏమైనప్పటికీ విభేదీకరణ వ్యవస్థలో అవి అనివార్యంగా వుంటాయి. నాలుగోది, సామాజిక స్తరీకరణను వివరించడంలో పాత సిద్ధాంతాలు చాలా కష్టపడ్డాయి. దీనిని చెడుకు కారణంగా, ఘర్షణల దృష్టికి హేతువుగా భావించాడు. ఈ సమాజ పరిణామాల సిద్ధాంతాలు లేదా నమూనాలకు ప్రత్యమ్నాయంగా లెహ్‌మన్ తన వ్యవస్థల సిద్ధాంతాన్ని ఉపయోగించి **సామాజిక** విభేదీకరణను విశ్లేషించి చూసే ప్రయత్నం చేశాడు.

లూహ్‌మన్ దృష్టిలో సామాజిక పరిణామం వేరువేరుగా సాగే విభేదీకరణ ప్రక్రియలపై ఆధారపడి వుంటుంది. అవి: ఎ) వ్యవస్థకు దాని పర్యావరణానికి మధ్య పెరుగుతూ పోయే విభేదీకరణనే సమాజ పరిణామం. బి) అన్యోన్య వ్యవస్థ, వ్యవస్థాపనల వ్యవస్థ, సమాజవ్యవస్థల మధ్య పరస్పరం హెచ్చుతూ పోయే విభేదీకరణ కూడా సమాజ పరిణామమే. అంటే అన్యోన్య సంబంధాల వ్యవస్థ, వ్యవస్థాపనల వ్యవస్థ పరస్పరం విడివడి దేనికదేగా సాక్షాత్కరిస్తుంటాయి. అదే సమయంలో సమాజ వ్యవస్థకూడా ఈ రెండు వ్యవస్థలనుంచి విడివడి కనిపిస్తుంది. సి) ఈ మూడు వ్యవస్థల అంతర్గత విభేదీకరణ కూడా పరిణామంలో భాగమే. అన్యోన్య సంబంధాల వ్యవస్థల్లో ఈ సంబంధాలు విస్తరిస్తుపోయి దేనికదే ప్రత్యేకంగా వుంటాయి. (ఉదాహరణకు కార్యాలయాల్లో సంభాషణలు, విందులు, వినోదాల్లో సంభాషణలు, ఇంట్లో సంభాషణలు, ఎవరైనా మరణించినప్పుడు స్మశానంలో సంభాషణలు దేనికదిగానే వుంటాయి). వ్యవస్థాపన వ్యవస్థలకు కూడా విస్తరిస్తూ దేనికదే ప్రత్యేకంగా వుంటాయి. (ఉదాహరణకు ఆర్థిక వ్యవస్థలు, రాజకీయ వ్యవస్థలు). తనతో కలిసి ఉన్న పైరెండు వ్యవస్థల నుంచి సమాజ వ్యవస్థకూడా విడివడి నిలుస్తుంది. డి) సామాజిక వ్యవస్థల విభేదీకరణ, ఆర్థిక రంగం, రాజకీయరంగం, న్యాయం, మతం, కుటుంబం, విజ్ఞానశాస్త్రం, విద్య వంటి ప్రకార్య క్షేత్రాలకు మారడం కూడా పరిణామమే. ఈ ప్రకార్య క్షేత్రాలలోని ఉప వ్యవస్థలు పరిమితమైన పర్యావరణ సంక్లిష్టతను ఎదుర్కొవడంలో ప్రత్యేకతను పొంది వుంటాయి. మొత్తానికి సామాజిక వ్యవస్థ తన పర్యావరణానికి తదనుగుణంగా మారడమే పరిణామ క్రమం పర్యవసానం. ఇ) వేరువేరు కమ్యూనికేషన్ మాధ్యమాలను ఉపయోగించే ధోరణి పెగడం కూడా ప్రకార్య విభేదీకరణకు ఒక కారణం. అదే సమయంలో ప్రకార్య విభేదీకరణను అంటుపెట్టుకునే ఈ ధోరణికూడా వుంటుంది. ఉదాహరణకు ఆర్థిక రంగంలో వ్యవస్థాపనలో వున్నవారు డబ్బును, రాజకీయంగా లేదా ప్రభుత్వంలో ఉన్న వారు అధికారాన్ని, విజ్ఞానశాస్త్రంలో వున్నవారు సత్యాన్ని, కుటుంబంలో వున్నవారు ప్రేమను కమ్యూనికేషన్ మాధ్యమంగా ఉపయోగిస్తారు.

క్లుప్తంగా చెప్పాలంటే లెహ్‌మన్ దృష్టిలో ఒక్క వ్యవస్థకు దాని పర్యావరణానికి మధ్య పెరుగుతూపోయే విభేదీకరణనే. ఈ విభేధీకరణ ప్రక్రియ వల్ల వీలయినంతమేర పర్యావరణానికి అనుకూలమైన సంబంధాలను వ్యవస్థ అభివృద్ధి పరచుకుంటుంది. వ్యవస్థల మధ్యన విబేధీకరణ కారణంగా వైవిధ్యం వున్న భిన్న ఉపవ్యవస్థల మధ్య

BRAOU

సంయోజనం-సమన్వయం కూడా సమస్యాత్మకంగా మారుతాయి. ఈ స్థితిని అధిగమించడానికి వ్యవస్థ స్థూల సమగ్రతను కాపాడేందుకు కొత్త తరహా యంత్రాంగాలు ఆవిర్భవిస్తాయి.

## 8.4 లూహ్‌మన్‌పై విమర్శ

ప్రకార్య విశ్లేషణలోని సమస్యలను లెహ్‌మన్ ఏమాత్రం పట్టించుకోలేదని టర్నర్ ఆక్షేపించాడు. సంక్లిష్టతను తగ్గించడానికి, పర్యావరణానికి తదనుగుణంగా వ్యవస్థ సంబంధాలు సర్దుబాటుకావడానికి, ప్రకార్య అవసరాలు, అజ్ఞార్థకాలను లూహ్‌మన్ సంభాలించాడు. ఆ తర్వాత తదనుగుణంగా కొత్త యంత్రాంగాలు పుట్టుకువస్తాయని ఒక్క ముక్కలో తేల్చాడు. ఆయన లెక్క ప్రకారం, ఈ అవసరాలను తీర్చడానికి వీలుగా అవసరమైన నిర్మాణాలను వ్యవస్థ స్వయంగా ఒక అద్భుతాన్ని సృష్టించుకునేట్టుగా సృష్టించుకోవాలి. మరో మాటలో చెప్పాలంటే కార్యాలే కారణాలను సృష్టిస్తాయి. ఇది పూర్తిగా కార్యవాదం. ప్రకార్య సిద్ధాంతాలతో ఇదే చిక్కు. భిన్న తరగతులతో కూడిన ఒక భావనాత్మక స్కీమ్‌ను లూహ్‌మన్ అభివృద్ధి చూశారు. సామాజిక ఘటనలను వర్ణించడానికి ఈ తరగతులను శ్రయించాడు. చివరకు ఈ ఘటనలు ఎలా జరిగాయి, ఎందుకు జరిగాయి అన్న విషయం సమగ్రంగా వివరించకుండానే చారిత్రకంగా ఏం జరిగిందో కొత్త పదజాలంతో వర్ణించడంలో లూహ్‌మన్ ఆగిపోయారు. ఉదాహరణకు సంక్లిష్ట సమాజాల్లో పాత్రలకు, కార్యక్రమాలకు విలువలను, ఆపాదించే భారాన్ని సిద్ధాంతాలు నిర్వహిస్తుంటాయి. దీనిని ఎందుకు, ఎలా అని వివరించకుండానే సంక్లిష్ట సమాజాల్లో సైద్ధాంతిక -చాలా ప్రదానమైందని లూహ్‌మన్ అంటాడు.

లూహ్‌మన్ వ్యవస్థల ప్రకార్యవాదానికి ఇతర ప్రకార్యవాదులకు మధ్యన తేడా పెద్దగా లేదని టర్నర్ చివరకు తేల్చిచెప్పాడు. ఘటనలను తరగతులుగా విభించడం ద్వారా వాటిని స్కీమ్‌లో ఏదోఒక్క అంశానికి సంబంధించిన దృష్టాంతాలుగా మాత్రమే లూహ్‌మన్ చూపాడు. అయితే ఈ స్కీమ్‌ను ఎప్పుడు అనుభవైక ప్రపంచంలోని వాస్తవిక ఘటనల గీటురాయితో పరీక్షించడమే లేదు. అందువల్ల లూహ్‌మన్ సిద్ధాంతం ఆసక్తి కలిగించే అది భౌతిక శాస్త్రమే తప్ప సిద్ధాంతంగా మాత్రం దుర్బలమైంది.

BRAOU

## 8.5 సారాంశం

యూరప్‌లో ముఖ్యంగా జర్మనీలో ప్రకార్యవాదం పునరుజ్జీవనంలో లూహ్‌మన్ ముఖ్య భూమిక పోషించాడు. ఆయన ఒక అమూర్త భావనాత్మకమైన స్కీమ్‌ను సంభవించాడు. సాపేక్షంగా చూస్తే ఈ స్కీమ్ సరళమైనదే. అదే సమయంలో అనుభవైకవేధ్యమైన భిన్న వైవిధ్యాల ఘటనల విశ్లేషణకు ఈ స్కీమ్ దిక్సూచిగా వుంటుంది. లూహ్‌మన్ ప్రతిపాదించిన ప్రకార్యవిశ్లేషణను 'సాధారణ వ్యవస్థల దృక్పథం'గా వ్యవహరిస్తారు.

మానవుల క్రియలన్నీ సంఘటితమై వ్యవస్థలుగా నిర్మాణరూపం దాలుస్తాయన్నది లూహ్‌మన్ సిద్ధాంత భావన. అనేక మంది వ్యక్తుల క్రియల మధ్య పరస్పర సంబంధం ఏర్పడినప్పుడు సామాజిక వ్యవస్థ ఉనికిలోకి వస్తుంది. అన్ని సామాజిక వ్యవస్థలు కూడా బహుముఖాలుగా వున్న పర్యావరణంలో మనుగడ సాధిస్తుంటాయి. ఈ బాహ్యాముఖాలైన పర్యావరణం కారణంగా ఏర్పడే సంక్లిష్టతలను సమాజం ఎదుర్కోవలసి వుంటుంది. సంక్లిష్ట పర్యావరణంలో అస్థిత్వాన్ని నిలుపుకోవడానికి ప్రతీ వ్యవస్థ సొంత యంత్రాంగాలను అభివృద్ధిని చూసుకొని సంక్లిష్టతలను తగ్గించుకోవాలి.

సంక్లిష్టతలను తగ్గించి వ్యవస్థను పర్యావరణానికి మధ్య సరిహద్దును ఏర్పాటు చేసే సమాజ యంత్రాంగాలు మూడు పరిణామాల ఆధారంగా పనిచేస్తాయి. అవి: 1. కులం, 2. పదార్థం, 3. సంకేతాలు. వ్యక్తుల క్రియలు అర్థవంతంగా పరస్పర సంబంధం కలిగివుండి, వాటి మధ్యన సంబంధం ఏర్పడినప్పుడే సామాజిక వ్యవస్థ ఉనికిలోకి వస్తుంది. ఈ క్రియల నుంచి మూడు రకాల మౌలిక సామాజిక వ&యవస్థలు పుట్టుకువచ్చాయి. అవి: 1. అన్యోన్య సంబంధాల వ్యవస్థ, 2. వ్యవస్థాపనల వ్యవస్థ, 3. సమాజ వ్యవస్థ.

సమాజ సమగ్రతకు వ్యక్తులు సమాజ చట్రంలో నైతికంగా, భావోద్వేగపరంగా అనుబంధం పెంచుకొని ఉండాల్సిన అవసరం లేదని లూహ్మన్ అభిప్రాయపడ్డారు. లూహ్మన్ తన సిద్ధాంతాన్ని సమాజ పరిణామం, సమాజ విభేదీకరణ ప్రక్రియలను వివరించడానికి కూడా ప్రయోగించారు. సమాజవ వ్యవస్థకు దాని పర్యావరణానికి మధ్య పెరుగుతూ పోయే విభేదీకరణనే సమాజ పరిణామం అని వ్యాఖ్యానించాడు.

## 8.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. సమాజ ప్రకార్య విశ్లేషణకు నిక్లస్ లూహ్మన్ ప్రతిపాదించిన సాధారణ వ్యవస్థల దృక్పథాన్ని వివరించండి.

2. 'వ్యవస్థ దాని పర్యావరణం మధ్య పెరుగుతూపోయే విభేదీకరణే సమాజ పరిణామం' వివరించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. వ్యవస్థ-పర్యావరణం మధ్య సంబంధం.

2. లూహ్మన్ పేర్కొన్న సామాజిక వ్యవస్థల రకాలు ఏవి.

## 8.8 చదువదగిన పుస్తకాలు


Cohen Persi : Modern Social Theory.

Luhman, N. : The Deferentiation.

Turner, J.H. : Structure of Social Theory.


BRAOU

# ఖండం- III

## సంఘర్షణవాదం

సమాజశాస్త్ర చర్చను, సమాజ చరిత్రను మలుపు తిప్పిన సిద్ధాంతం సంఘర్షణవాదం. సంఘర్షణే సామాజిక వికాసానికి ఇందనం అన్న సూత్రం ఆధారంగా ఏర్పడ్డ ఈ సిద్ధాంతం మానవ సంబంధాల విశ్లేషణలో ఒక సువర్ణాధ్యాయంగా చెప్పుకుంటారు. సంఘర్షణవాదం ప్రధానంగా కార్ల్‌మార్క్స్ ప్రతిపాదనల చుట్టూ తిరిగినట్టు అనిపించినా అనేకమంది శాస్త్రవేత్తలు ఈ దృక్పథవికాసానికి దోహదం చేశారు. ఇప్పటికే సమాజశాస్త్ర చర్చలో వాదోపవాదాలను సంఘర్షణవాదం ప్రభావితం చేస్తూనే వుంది.

ఇందులో నాలుగు భాగాలున్నాయి. అవి:

- కార్ల్ హెన్రిచ్ మార్క్స్
- జార్జ్ సిమ్మెల్
- రాల్ఫ్ డెహ్రెన్‌డార్ఫ్
- లూయిస్ ఆల్‌ఫ్రెడ్ కోసర్

BRAOU

BRAOU

# భాగం-9: కార్ల్ మార్క్స్

విషయక్రమం

9.0 ఉద్దేశాలు

9.1 పరిచయం

9.2 జీవితవిశేషాలు

9.3 గతితార్కిక భౌతికవాదం

9.4 చారిత్రక భౌతికవాదం

9.5 పరాయీకరణ భావన

9.6 దోపిడీ భావన

9.7 లాభాలరేటు తరుగుదల సూత్రం

9.8 వర్గపోరాటం-విప్లవం-సామాజిక పరివర్తన

9.9 సిద్ధాంతం-ఆచరణల ఐక్యత

9.10 సమసమాజం-శాస్త్రీయ సామ్యవాదం

9.11 కమ్యూనిజం

9.12 రాజ్యాంగయంత్రం

9.13 సారాంశం

9.14 మాదిరి పరీక్షా ప్రశ్నలు

9.15 చదవదగిన పుస్తకాలు

BRAOU

## 9.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- సామాజిక పరిణామ క్రమం గురించి మార్క్సిస్టు దృక్పథాన్ని అర్థం చేసుకుంటారు.
- మార్క్సిస్టు పరిశీలనా పద్ధతిలోని ముఖ్యమైన పరికరాలను గుర్తిస్తారు.
- సామాజిక చరిత్రను మార్క్సిస్టు పరికరాల సహాయంతో అధ్యయనం చేయగలుగుతారు.

## 9.1 పరిచయం

అప్పటివరకు తత్వవేత్తలు చేసిన పని ప్రపంచాన్ని వ్యాఖ్యానించడమేనని, కానీ చేయవలసిన పని ప్రపంచాన్ని మార్చడం అని విశ్లేషించి సిద్ధాంతానికి, ఆచరణకు, భావాలకూ భౌతిక కార్యాచరణకు మధ్య సంబంధాన్ని ఎత్తిచూపిన మేధావి కార్ల్‌మార్క్స్. నాలుగు దశాబ్దాలపాటు నిత్యం కార్మికవర్గ కార్యాచరణతో సంబంధంలో వుంటూనే మరోవైపు ఆనాటి యూరోపియన్ సైద్ధాంతిక, భావజాల రంగంలో అవిశ్రాంతమైన కృషి సలిపి, వేలాది పేజీల ఆలోచనలు, వాదనలు, విశ్లేషణలు, వివరణలు, నూతన సైద్ధాంతిక ఆవిష్కరణలు వెలువరించిన మార్క్స్ మానవ మేధో చరిత్రలో

అసాధారణమైన ప్రభావం చూపారు. చూపుతున్నారు.

కార్ల్‌మార్క్స్ సహచరుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్ మాటల్లో చెప్పాలంటే ' సేంద్రీయ ప్రకృతి అభివృద్ధి సూత్రాన్ని డార్విన్ కనిపెట్టినట్టుగానే, మానవ చరిత్ర అభివృద్ధి సూత్రాన్ని మార్క్స్ కనిపెట్టాడు'. మానవ సమాజ పురోగతి ఏ చలన సూత్రాల మీద ఆధారపడి సాగుతున్నదో మార్క్స్ విశ్లేషించాడు. గత సమాజగతి సూత్రాలను విశ్లేషించిన తర్వాత అవే గతి సూత్రాల ఆధారంతో భవిష్యత్ మానవ సమాజం ఏ దిశగా పయనిస్తున్నదో మార్క్స్ పరికల్పన చేశారు. ఆ సామాజిక చలన సూత్రాలు ప్రకృతి చలన సూత్రాల వలెనే అనివార్యమైనవని అయన ఊహించారు.

మర్క్స్ సామాజిక, తాత్విక, ఆర్థిక, రాజకీయ, తదితర రంగాలలో చేసిన ఆలోచనలను-మొత్తంగా అయన ప్రతిపాదించిన సామాజిక సిద్ధాంతాన్ని మార్క్సిజం అని పిలుస్తున్నాం. అన్యోన్యమైన సాహచర్యం వల్ల భావాలలో, ఆచరణలో అపూర్వమైత్రి వల్ల ఎంగెల్స్ స్వతంత్రంగా చేసిన రచనలను కూడా మార్క్సిజంలో భాగంగానే పరిగణించడం జరుగుతోంది.

ఇప్పటి యురోపియన్, ప్రధానంగా బ్రిటిష్, జర్మన్ పెట్టుబడి దారీ సమాజాల నేపథ్యంలో 1840ల నుంచి 1890లదాకా (మార్క్స్ మరణం 1883, ఎంగెల్స్ మరణం 1895) వెలువడిన మార్క్స్, ఎంగెల్స్‌ల రచనలు ఆ తర్వాత ఒకటిన్నర శతాబ్దాలు గడిచిన తర్వాత కూడా ఆలోచనల మీద ప్రభావం చూపుతున్నాయి. ఆచరణకు ప్రేరేపిస్తున్నాయి. భావాలు భౌతిక శక్తిగా మారుతాయి. అని వారు చేసిన సూత్రీకరణ ఆతర్వాత గడిచిన శతాబ్దానికి పైబడిన కాలంలో ఎన్నోసార్లు రుజువైంది. మనిషిని మనిషి దోపిడీ చేయడానికి వీలులేని సమాజాన్ని మనుషులే రూపొందించుకోగలరని వాళ్లు కన్న స్వప్నం ఇవాల్టికీ ఎందరినో ఉత్తేజితులను చేస్తోంది. దోపిడీ, పీడన, దౌర్జన్యం, అసమానత కొనసాగినంతకాలంవాటి రద్దును కలగన్న మార్క్సిజానికి సంబంద్ధత వుంటుంది.

ఈ సంబద్ధత సాధించడానికి మార్క్సిజంలోని మూలాధారమైన అంశాలేమిటి? మార్క్సిజం ఎంత విస్తృతమైన ప్రభావం కలిగి ఉన్నదో అంత విస్తృతమైన అపార్థానికీ లోనయింది. అపోహలను తొలగించి హేతుబద్ధమైన, వాస్తవికమైన వివరణ ఇవ్వడం ఈ పాఠ్యాంశం ప్రధాన లక్ష్యం.

BRAOU

## 9.2 జీవిత విశేషాలు

సమకాలీన సమాజాన్ని విశేషంగా ప్రభావితం చేసిన సమాజశాస్త్రవేత్తల్లో కార్ల్‌మార్క్స్ (1818-1883) అగ్రగణ్యులు. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంత, దృక్పథాలు సామాజిక సంబంధాలకు కొత్త నిర్వచనం ఇచ్చాయి. కార్ల్‌మార్క్స్ 1818వ సంవత్సరం మే 5వ తేదీన జర్మనీలోని ప్రష్యాలో జన్మించాడు. ఆయన తండ్రి హిర్చెల్ మార్క్స్ లెవీ ఒక నిరుపేద న్యాయవాది. మార్క్స్ బాల్యం చాలా కాలం పేదరికంలోనే గడిచింది. స్థానిక పాఠశాలో ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం మార్క్స్ తన పదిహేడవ ఏట న్యాయశాస్త్ర అధ్యయనం కోసం బాన్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు. ఐతే అక్కడ మార్క్స్ చదువుపట్ల శ్రద్ధచూపకపోవడంతో అతన్ని అక్కడినుంచి అతని తల్లిదండ్రులు బెర్లిన్ తరలించారు. బెర్లిన్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రం చదివిన కార్ల్‌మార్క్స్ అనంతరం అదే విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి కూడా పూర్తిచేశారు. గ్రీకుతత్వశాస్త్రంలో పి.హెచ్.డి చేసిన మార్క్స్ బెర్లిన్ విశ్వవిద్యాలయంలో లెక్చరర్ కావాలని కలలుగన్నాడు. ఐతే అతనిలోని విప్లవభావాలు, రాడికల్ ధోరణులను గమనించిన విద్యాశాఖ అతనికి ఉద్యోగం రాకుండా చేయడంతో మార్క్స్ 'జర్నలిజం'లోకి ప్రవేశించాడు. కార్ల్‌మార్క్స్ 1842 నాటికి 'రెనిష్ గెజిట్' (Rheinische Zeitung) పత్రికకు సంపాదకుడిగా బాధ్యతలు చేపట్టాడు. జర్మన్ రైతుల కష్టాలను, ప్రష్యన్ పాలకుల దోపిడీని వివరిస్తూనే అనేక వ్యాసాలు ప్రచురించిన ఈ పత్రిక ఎంతో కాలం నిలబడలేదు. మార్క్స్ సంపాదకీయాలు పాలకులకు కంటగింపుగా మారాయి. దీంతో ఏడాది తిరక్కుండానే అ పత్రిక మూతపడింది. ఐతే ఈ పత్రికారచన పుణ్యమాఅని మార్క్స్‌కు 1842లో ఎంగెల్స్‌తో పరిచయం ఏర్పడింది. ఫ్రెడ్రిచ్ ఎంగెల్స్ ఒక సంపన్న కుటుంబానికి చెందినవాడు. అనేక ఫ్యాక్టరీలకు యజమాని. మార్క్స్ ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు, అయన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లేందుకు ఎంతగానో తోడ్పడ్డవ్యక్తి. 1844 నాటికి పారిస్‌కు మారిన మార్క్స్ అక్కడ మరో పత్రిక

ప్రారంభించాడు. మార్క్స్ రాతల్లోని రాడికల్ ధోరణులు ప్రష్యన్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాయి. పారిస్ మాన్యుస్క్రిప్ట్స్‌గా ప్రాచుర్యం పొందిన ఈ రచనలపై సెన్సార్‌షిప్ విధించడమే కాక ప్రభుత్వం మార్క్స్‌ను అరెస్టుకు ఆదేశించింది. అనంతరం మార్క్స్‌ను పారిస్ నుంచి బహిష్కరించింది.

మార్క్స్ మూడేళ్లపాటు బ్రస్సెల్‌లో ప్రవాసంలో వుండాల్సివచ్చింది. అక్కడినుంచి 1847 ప్రాంతంలో యూరప్‌లో వస్తోన్న కమ్యూనిస్టు ఉద్యమానికి ఆకర్శితుడైన మార్క్స్, ఎంగెల్స్ లండన్ వెళ్లి కమ్యూనిస్టు లీగ్ రెండో మహాసభకు హాజరయ్యారు. ఆ మహాసభల్లోనే 'కమ్యూనిస్టు మేనిఫెస్టో' రచన బాధ్యత మార్క్స్-ఎంగెల్స్‌లకు అప్పగించారు. 1848లో వారు కమ్యూనిస్టుమేనిఫెస్టోను ప్రచురించారు. జెర్మన్ విప్లవంలో పాల్గొనేందుకు మార్క్స్ 1948లో ఎంగెల్స్‌తో కలిసి జర్మనీలోని కొలోన్ వెళ్లి కొంతకాలం అక్కడే 'న్యూరెనిష్‌గెజిట్' అనే పత్రికకు సంపాదకత్వం వహించారు. పూర్తిగా కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడినడిచిన ఈ పత్రికను కొనసాగనివ్వకుండా అధికారులు అడ్డుకున్నారు. ఏడాది తిరిగేలోగా ఆ పత్రికకూడా మూతపడింది. ఇలా ఇటు జర్మనీలో, అటు ఫ్రాన్స్, బ్రస్సెల్స్‌లో ఒకవైపు పత్రికలు నడిపిస్తూనే మరోవైపు మార్క్స్ ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచారు. స్థానిక తిరుగుబాట్లకు మద్దతు తెలుపడం ఉద్యమకారులకు ఆయుధాలు కొనివ్వడం వంటి వాటికి ఆయన తన తండ్రి ఆస్థిలో తన వాటాను అమ్మేసుకోవలసి వచ్చింది. అంతేకాక అప్పుల్లో మునిగిపోవలసి వచ్చింది.

మార్క్స్‌పై కత్తిగట్టిన కొలోన్ పాలకులు ఆయన తన పత్రికల్లో రాసిన రాతలు రాజ్యవ్యవస్థను, పాలకులను కించపరిచేవిధంగా వున్నాయని ఆయనపై కేసు నమోదు చేశారు. అప్పటికే ఫ్రాన్స్, బెల్జియం (బ్రస్సెల్స్)ల ఆగ్రహానికి గురయిన మార్క్స్ జర్మనీలో కూడా తనకు చోటు లేదని గ్రహించి శరణార్థిగా లండన్ చేరుకున్నాడు.

లండన్‌లో కార్ల్ మార్క్స్, ఆయన సతీమణి జెన్నీ అనేక కష్టాలు ఎదర్కొన్నారు. పూర్తిగా వలసకార్మికులతో, శరణార్థులతో నిండివుండే సోహో (సెంట్రల్ లండన్)లో ఒక చిన్న ఇంట్లో అద్దెకున్న మార్క్స్ దంపతులకు ఆ అద్దె చెల్లించడం కూడా కష్టమై పోయింది. ఇంటి యజమాని మార్క్స్ కుటుంబాన్ని బయటకు గెంటివేశాడు. రోడ్డునపడ్డ మార్క్స్ కుటుంబం తిండిలేక అల్లాడిపోయింది. కటికపేదరికం, రోగాల బారినపడి మార్క్స్ ముగ్గురు పిల్లలు బాల్యంలోనే మరణించారు. పరిస్థితి తట్టుకోలేక జెన్నీ తన మిగతా పిల్లల్ని తీసుకొని కొంతకాలం జర్మనీ వెళ్లిపోయింది. అయినా మార్క్స్ ఇవేవీ పట్టించుకోలేదు. తన రచనావ్యాసంగం ఆపలేదు. రోజుల తరబడి అలా రాస్తూనే వుండిపోయేవాడు. చదువడం, రాయడం తప్ప మార్క్స్‌కు వేరే వ్యాపకం వుండేదికాదు. ఈ కాలంలో మార్క్స్ రాజకీయ అర్థశాస్త్రంపై దృష్టి సారించాడు.

లండన్ జీవితం మార్క్స్‌ను మరోవైపు విప్లవ రాజకీయాలలో మమేకం చేసింది. 1864 నుంచి 1872వరకు మార్క్స్ పూర్తిగా కార్మికోద్యమాలలో పనిచేశాడు. ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్ అసోసియేషన్‌కు పూర్తికాలం వెచ్చించారు. కార్మికుల హక్కులకోసం పనిచేసిన ఈ సంస్థ ప్రపంచ కార్మికులను కూడగట్టే ప్రయత్నం చేసింది ఇలా ఉద్యమాల రూపకల్పనతో పాటు మార్క్స్ తన రచనలను ప్రచురించే పనిని కూడా వేగిరం చేశాడు. సమాజగతిని పూర్తిగా మార్చివేసిన పెట్టుబడి (Capital) మొదటి సంపుటాన్ని 1867లో తొలిసారిగా ప్రచురించారు. ఇది జర్మనీలో ప్రచురితమైంది. తరువాత 1872లో రష్యన్ భాషలోకి అనువదించారు. పెట్టుబడి ఇంగ్లీషులో అనువాదం కావడానికి ఇరవయ్యేళ్లు పట్టింది. ఈ పుస్తకం కోసం మార్క్స్ రెండు దశాబ్దాలు కష్టపడ్డా అది పూర్తికాలేదు. తరువాత ఏంగెల్స్ 'పెట్టుబడి' రెండు, మూడు సంపుటాలను వరుసగా 1885, 1894లో ప్రచురించాడు. ఈ రెండు సంపుటాలు మార్క్స్ మరణానంతరమే వెలుగులోకి వచ్చాయి.

1883 మార్చి 14వ తేదీన తన చదువుకొనే గదిలోనే మార్క్స్ కన్నుమూశాడు. అప్పటికే భార్య జెన్నీ, కూతురు చనిపోవడంతో బాధలో ఒంటరితనంతో కుంగిపోయిన మార్క్స్ పుస్తకం చదువుకుంటూనే చనిపోయారు. మార్క్స్ జీవితంలో రచనల్లో, కష్టసుఖాల్లో ఎంగెల్స్ ఒక విడదీయరాని భాగంగా వున్నారు. మార్క్స్ కృషిని విశ్లేషిస్తూ ఆయన 'మానవజాతి వికాస క్రమాన్ని అర్థం చేసుకునే మౌలిక సూత్రాన్ని ఆవిష్కరించిన మహామేధావి' అని ఏంగెల్స్ కొనియాడారు. ఇది సత్యం కూడా. మార్క్స్ చనిపోయి శతాబ్ధాలు గడుస్తున్నా ఇప్పటికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ అంతా ఆయన సిద్ధాంత చట్రంలోనే తిరుగుతుండడమే అందుకు తిరుగులేని సాక్ష్యం.



BRAOU

## 9.3 గతి తార్కిక భౌతిక వాదం

యూరోపియన్ తాత్విక ధారలో భిన్నంగా ఉంటూవచ్చిన భౌతికవాద దృక్పథాన్ని, గతితార్కిక సంవిధానాన్ని ఏకం చేసి గతితార్కిక భౌతికవాద ఆలోచనా ధోరణిని సుసంపన్నం చేసిన ఘనత కార్ల్‌మార్క్స్‌కు దక్కుతుంది. క్రీస్తుపూర్వం నుంచి కూడా యూరోపియన్ తాత్విక చర్చలలో గతితార్కిక పద్ధతి అమలులో ఉన్నది. భౌతికవాద దృక్పథపు బీజాలు కూడా క్రీస్తుపూర్వపు యూరోపియన్ తాత్విక దృక్పథంలో మాత్రమే కాక భారతీయ తాత్విక చింతనతో సహా అనేక ప్రాచీన సంప్రదాయాలలో ఉంటూవచ్చింది.

గతితర్కం (dialectics) అనే ఒక తార్కిక పద్ధతి. ఒక విషయాన్ని చర్చించడానికి, వాద ప్రతివాదాలతో ప్రశ్న జవాబులతో నిర్ధారణలకు రావడానికి ఉపయోగించే తార్కిక పద్ధతిని సోక్రటీస్, ప్లేటో అరిస్టాటిల్‌లతో సహా గ్రీకు తత్వవేత్తలు గతితర్కంగా అభివర్ణించారు. కాల క్రమంలో ప్రకృతిలో సమాజంలో, మానవమేధలోని దృగ్గోచరాంశాల అభివృద్ధిని, విధ్వంసాన్ని విశ్లేషించడానికి- అంటే ఒక క్రమాన్ని విశ్లేషించడానికి కూడా గతితార్కిక పద్ధతి ఉపయోగపడుతుందని యురోపియన్ తత్వవేత్తలు భావించారు. ఈ పద్ధతిని అత్యున్నత స్థాయిలో ఉపయోగించి చైతన్యం నుంచి గతితార్కిక సూత్రాలను కనిపెట్టిన ఘనత పందొమ్మిదో శతాబ్దపు జర్మన్ తత్వవేత్త హెగెల్‌కు దక్కుతుంది.

అయితే హెగెల్ ప్రధానంగా భావవాది. తత్వశాస్త్ర దృక్పథాలన్నింటినీ స్థూలంగా రెండు శిభిరాలుగా విభజిస్తే భావవాద, భౌతికవాద దృక్పథాలుగా విడగొట్టవచ్చు. భావవాదం ప్రకృతి, ప్రపంచం, మానవ సమాజం ఒక సంకల్పంనుంచి, భావం నుంచి, పరమాత్మనుంచి, ఉద్భవించాయని భావిస్తుంది. భౌతికవాదం ప్రకృతి, సమాజం ప్రాథమికమైనవని, భౌతిక జగత్తునుంచే భావాలు, చైతన్యం ఉద్భవిస్తాయని భావిస్తుంది. పదార్థం, చైతన్యం ఈ రెండింటిలో పదార్థం ప్రాథమికమని భౌతికవాదం ప్రతిపాదించగా, చైతన్యం ప్రాథమికమని భావవాదం ప్రతిపాదిస్తుంది.

BRAOU

గతితర్కం ప్రదానంగా ప్రకృతికీ, పదార్థానికీ చలన నియమమని, దాన్ని భావవాదంతో జోడించడం అసమంజసమని మార్క్స్, ఎంగెల్స్ వాడిన గతితార్కిక పద్ధతిని పూర్తిగా తలక్రిందులు చేయడం ద్వారా, అంటే భావవాద దృక్పథాన్ని వదిలి, భౌతికవాద దృక్పథానికి అనుసంధానం చేయడం ద్వారా మాత్రమే ప్రకృతికీ, సమాజానికీ, మానవమేధకూ గల చలన సూత్రాలను వాస్తవికంగా అర్థం చేసుకోవచ్చునని మార్క్స్, ఎంగెల్స్‌లు భావించారు. హెగెల్‌ను, యువహెగెలియన్ల నాయకుడైన ఫ్యూయర్‌బాను విమర్శించి, వారి సిద్ధాంతానికి ప్రత్యామ్నాయంగా మార్క్స్, ఎంగెల్స్‌లు ప్రతిస్పందించిన సిద్ధాంతాన్నే గతితార్కిక భౌతికవాదం అని పిలుస్తారు.

గతితార్కిక భౌతికవాదం ప్రాకృతిక, సామాజిక పరిణామానికి గల సూత్రాలను సాధారణ, అమూర్తస్థాయిలో ప్రకృతిలో సమాజంలో ప్రతివస్తువూ, ప్రతి దృగ్గోచరాంశమూ ఒకదానితో ఒకటి కలిసి ఉన్నాయని, ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్నాయని, ఒదాన్ని మరొకటి నిర్ణయిస్తున్నాయని గతి తార్కిక భౌతికవాదం విశ్లేషిస్తుంది. నిరంతరాయంగా మార్పుచెందుతూ ఉండడమే వాస్తవికత సూత్రమని గతి తార్కికభౌతిక వాదం అంటుంది. నిరింద్రియ ప్రకృతిలోనూ, మానవ ప్రపంచంలోనూ కూడా ఏ ఒక్కటీ జఢాత్మకంగా ఉండజాలదని, పరివర్తన కూడా క్రమానుగతంగా మాత్రమే కాక, హింసాత్మకంగా, విప్లవాత్మకంగా, గంతుల రూపంలో ఉంటుందని గతితార్కిక భౌతికవాదం అంటుంది.

ప్రకృతినీ, సమాజాన్ని, మానవ మేధనూ విశ్లేషించడానికి సమర్థవంతమైన పరికరంగా గతితార్కిక భౌతికవాదాన్ని మార్క్స్, ఎంగెల్స్‌లు తమ రచనలన్నింటిలోనూ వాడుకున్నారు. ఎంగెల్స్ గతితార్కిక భౌతికవాదానికి మూడు మూలసూత్రాలున్నాయని వివరించాడు.

వస్తువులో మార్పుకు మూలం అంతర్గతంగా ఉంటుందని, ప్రతీ వస్తువులోనూ రెండు విరుద్ధాంశాలు ఉంటాయని, ఆరెండూ విరుద్ధాంశాల మధ్య ఐక్యత, ఘర్షణ కొనసాగుతుండడమే గతితార్కిక భౌతికవాదపు మొదటి సూత్రమని ఎంగెల్స్ వివరించాడు. రెండు పరస్పర విరుద్ధాంశాలుగా విభజించడానికి వీలులేని వస్తువేదీ ప్రకృతిలో

లేదు. పదార్థం ఒక విశిష్ట వస్తువుగా ఉనికిలో ఉండడానికి అవిరుద్ధాంశాల ఐక్యత వీలు కల్పిస్తుండగా, అవస్తువు అభివృద్ధి చెందడానికి ఘర్షణ వీలు కల్పిస్తుంది. రెండు విరుద్ధాంశాలలో ఒకటి యధాతథ స్థితిని నిలిపి ఉంచడానికి ప్రయత్నిస్తుండగా, మరొకటి పూర్తిగా భిన్నమైన స్థితిని సాధించడానికి ప్రయత్నిస్తుంది. అందువల్ల ఏర్పడే ఘర్షణ ఫలితంగా వస్తువు గుణాత్మకంగా కొత్త స్థితిని పొందుతుంది. మళ్లీ కొత్త వైరుధ్యాలు ఆస్థితిని కూడా మార్చడానికి ఘర్షణ పడుతాయి.

గతితార్కిక భౌతికవాదపు రెండో సూత్రంగా ఎంగెల్స్ 'వ్యతిరేకించినది వ్యతిరిక్తమవుతుంది' అనే సూత్రాన్ని నిర్వచించారు. మొదటి సూత్రం ప్రకారం ఒక స్థితిని రద్దుచేసి మరొక స్థితి ఉనికిలోకి రావడం ప్రకృతిచలన సూత్రం కాగా, కొత్త స్థితిని కూడా రద్దుచేసే మరొక వైరుధ్యం దాని గర్భంలోనే పుట్టి పెరగడం అనివార్యమైన నియమం. వ్యతిరేకించడమనేది వాస్తవికత అభివృద్ధిలో అనివార్యమైన అంతర్భాగమని మార్క్స్ అన్నాడు. 'ఏరంగంలోనైనా సరే, ఇతఃపూర్వ మనుగడ స్థితిని వ్యతిరేకించకుండా, రద్దుచేయకుండా, అభివృద్ధి సాధ్యం కాదు'' అని మార్క్స్ అన్నారు.

వ్యతిరేకించినది వ్యతిరిక్తం కావడం రద్దు చేసినది తాను కూడా రద్దయిపోవడం అనే గతితార్కిక భౌతికవాద సూత్రానికి ప్రకృతిలోనూ, సమాజాలలోనూ మానవ మేధలోనూ ఎన్నో ఉదాహరణలున్నాయి. ఈ రద్దు చేయడమనేది కూడా ఒక వస్తువు మీద బయటి నుంచి పడే ప్రభావ ఫలితం కాదు. అంతర్గత కారణాల వల్లనే ఈ మార్పు జరుగుతుంది. అంతేకాక, రద్దయిన తర్వాత ఏర్పడే కొత్త వస్తువులో పాత వస్తువు నుంచి ఎంతో కొంత కొనసాగింపు కూడా ఉంటుంది.

గతితార్కిక భౌతికవాదంలో మూడో సూత్రం పరిమాణం గుణంగా, గుణం పరిమాణంగా పరివర్తన చెందుతాయనేది. ప్రకృతిలోనూ, సమాజంలోనూ మానవమేధలోనూ అనివార్యమైన పరివర్తనా నియమాల వల్ల, అంతర్గత వైరుధ్యాల వల్ల, వ్యతిరిక్తమవుతుందనే నియమం వల్ల కొత్త పదార్థాలు, కొత్త వస్తువులు, కొత్త నిర్మాణాలు, కొత్త ఆలోచనలు నిరంతరం తలెత్తుతుంటాయి. వీటి పరిణామానికి ఏమయినా చలన సూత్రాలు ఉన్నాయా అని ప్రశ్నించినప్పుడు ఏ పరిణామమయినా రెండు విధాలుగా ఉంటుందని అర్థమవుతుంది. మొదటిది సంఖ్యాత్మకమైన పరిమాణాత్మయ మార్పు, రెండోది గుణాత్మమైన, పూర్తిగా కొత్త లక్షణాలతో కూడిన మార్పు.

మార్పు క్రమం అనేది సాధారణంగా ఉండదని, సంక్లిష్టంగా ఉంటుందని, ప్రతీ మార్పులోనూ మొదటి పరిమాణాత్మక మార్పును, ఆపరిమాణం ఒక దశకు చేరినప్పుడు విప్లవాత్మకంగా గుణం మారిపోయి, కొత్త వస్తువు ఏర్పడే మార్పును గుర్తించవచ్చునని గతితార్కిక భౌతికవాదం అంటోంది.

BRAOU

## 9.4 చారిత్రక భౌతికవాదం

చరిత్రపట్ల భౌతికవాద దృక్పథం అనుసరించి చేసే విశ్లేషణను చారిత్రక భౌతికవాదం అంటారు. చరిత్రను రాజవంశాల చరిత్రగానో, తారీఖులు, దస్తావేజులుగానో, ఆయాకాలాల పాలకుల, ప్రజల మంచి చెడ్డల ఫలితంగానో చూడకూడదని, చరిత్రకు భౌతిక పునాది ఉన్నదని మార్క్స్ నిరూపించాడు. భౌతిక జీవితావసరాల ఉత్పత్తి క్రమంలోనే మానవ సమాజం పురోగమిస్తున్నదని, ఉత్పత్తి సాధనాలను ఉపయోగిస్తూ, మారుస్తూ అభివృద్ధి చేస్తూ ప్రజలు తమ సామాజికాచరణలద్వారా కొన్ని సంబంధాలలోకి వస్తారని, ఈ ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల సమాహారాన్నే సమాజం అంటున్నామని మార్క్స్ అన్నారు. సామాజిక పరిణామక్రమంలో ఉత్పత్తి శక్తులలో ప్రధాన భాగమైన ప్రజల చైతన్యం పెరుగుతుండగా, ఉత్పత్తి సాధనాలలో శాస్త్ర ప్రయోగాల వల్ల మార్పులు వస్తుండగా, ఉత్పత్తి సంబంధాలలో మాత్రం మార్పులను అడ్డుకునే శక్తులు ఉంటాయని మార్క్స్ అన్నారు. కొనసాగే ఉత్పత్తి సంబంధాలవల్ల లాభపడుతున్న వర్గం యధాస్థితిని నిలిపి ఉంచడానికి ప్రయత్నిస్తుందని తత్ఫలితంగా ఉత్పత్తి శక్తులకూ ఉత్పత్తి సంబంధాలకూ మధ్య ఘర్షణ ఏర్పడుతుందని మార్క్స్ అన్నాడు. ఆ క్రమంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఉత్పత్తి సంబంధాలే ఆటంకంగా నిలిచినప్పుడు ఒక గుణాత్మకమైన గంతు ద్వారా, విప్లవాత్మకమైన మార్పు ద్వారా ఉత్పత్తి శక్తులు పాత ఉత్పత్తి సంబంధాలను రద్దుచేసి కొత్త ఉత్పత్తి సంబంధాలను నెలకొల్పుతాయి.

మార్క్స్ 1859లో ప్రచురించిన 'ఎ కాంట్రిబ్యూషన్ టు ద క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' గ్రంథం ఉపోద్ఘాతంలో ఈ చారిత్రక భౌతికవాద అవగాహనను స్పష్టంగా వివరించాడు.

చారిత్రక భౌతికవాదం ప్రకారం సామాజిక చరిత్ర ఇప్పటికి నాలుగు దశలు గడించి ఐదో దశకు ప్రవేశించడానికి సిద్ధంగా ఉంది. మొట్టమొదటిదశ ఆదిమ కమ్యూనిస్టు సమాజం. అప్పుడు ఉత్పత్తి సాధనాలు అతి ప్రాథమికమైనవి. ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందలేదు. అందువల్ల ఏర్పడిన ఉత్పత్తి సంబంధాలలో కూడా సహకారం, పరస్పర సహకారం, సమానత్వం ఉంటూ ఉండేవి. ఉత్పత్తి సాధనాల మీద వ్యక్తిగత యాజమాన్యం ఉండేదికాదు. ఆదిమ తెగల మానవులు అటు ఆహారసేకరణ దశలోగానీ, పశు పోషణ దశలోగానీ, ఆదిమ వ్యవసాయ దశలోగానీ ఉత్పత్తి సాధనాలను ఉమ్మడిగా, సమష్టిగా వాడుకునేవారు. ఉత్పత్తి సాధనాలలో రాతి, కర్ర సాధనాల నుంచి లోహసాధనాలు రావడం ఈ సమాజంలో ఒక ముఖ్యమైన ముందడుగు. కొత్త ఉత్పత్తి సాధనాల వల్ల ఉత్పాదకత పెరిగింది. కుటుంబం, సొంత ఆస్తి అనే భావనలు తలెత్తి మిగులును అనుభవించడం, శ్రమలో పాల్గొనకుండా ఇతరుల శ్రమను అనుభవించడం అనే పద్ధతులు ఉనికిలోకి వచ్చాయి. సమాజంలో ఉమ్మడి తత్వం, సహకారం రద్దు కావడం మొదలయింది. ఉమ్మడి, సామూహిక ఉత్పత్తి సంబంధాలకు, ఉత్పత్తి సాధనాల మీద, మిగులుమీద వ్యక్తిగత ఆధిపత్యానికి మధ్య ఘర్షణ పెరిగింది. ఈ ఘర్షణ తీవ్రతరమై ఆదిమ కమ్యూనిస్టు సమాజం రద్దయిపోయింది.

ఆదిమ కమ్యూనిస్టు సమాజంలోని సమాన సంబంధాల స్థానంలో అసమ సంబంధాలతో మొట్టమొదటి వర్గ సమాజమైన బానిస సమాజం ఏర్పడింది. ఉత్పత్తి సాధనాల మీద, ఆధిపత్యం ఉన్న బానిస యజమానులు, ఉత్పత్తి సంబంధాల మీద ఆధిపత్యం లేని బానిసలను కూడా తమ సొంత ఆస్తిగా భావించారు. మనుషులు, శ్రమజీవులు కూడా ఆస్తిగా, సంపదగా భావించబడిన ఈ సమాజంలో ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందుతున్న కొద్దీ కొనసాగుతున్న అమానవీయ సంబంధాలతో ఘర్షణ పెరిగింది. ఎన్నో బానిస తిరుగుబాట్లు జరిగాయి. ఉత్పత్తి శక్తులలో ప్రధానభాగమయిన బానిసలు తమ జీవితాలకు, భద్రతకు, అభివృద్ధికి ఆటంకంగా మారిపోయిన బానిసత్వ సంబంధాలను బద్దలు కొట్టడానికి ఎన్నో పోరాటాలు చేశారు.

ఆపోరాటాల ఫలితంగా, ఉత్పత్తి శక్తుల వికాస ఆకాంక్షలు పెల్లుబికి కాలం చెల్లిన ఉత్పత్తి సంబంధాలను రద్దుచేసిన ఫలితంగా, మూడో సామాజిక దశ అయిన భూస్వామ్యదశలోకి మానవ సమాజం అడుగు పెట్టింది. భూస్వామ్య దశలో ఉత్పత్తిశక్తులు గణనీయంగా అభివృద్ధిచెందాయి. వ్యవసాయంలో నీటిపారుదల, వాయుశక్తి వంటి కొత్త ఉత్పత్తి సాధనాలను వాడడం ద్వారా ఉత్పాదకత పెరిగింది. మిగులు పెరిగింది. భూక్షేత్రాలే ప్రధాన ఉత్పత్తి సాధనాలు కాగా వాటిమీద సంపూర్ణ ఆధిపత్యం ఉండిన భూస్వాముల వ్యవసాయ భూములలో తగిన ఫలితం లేకుండా కట్టుబడి శ్రమ చేయవలసిన రైతుకూలీలు భూస్వామ్య సమాజంలో ప్రధాన వర్గాలు.

కానీ, భూస్వామ్య సమాజంలో ఉత్పాదకత, మిగులు పెరిగిన కొద్దీ పట్టణాలు, అదనపు వృత్తులు, వర్తక వాణిజ్యాలు పెరిగిపోయాయి. ఆవిధంగా భూస్వామ్య సమాజగర్భం నుంచే పాత ఉత్పత్తి సంబంధాలను రద్దుచేయదలచిన కొత్త వర్గాలు పుట్టుకురావడం మొదలైంది. భూస్వాముల దగ్గర అర్ధబానిసలుగా బతుకుతున్న రైతుకూలీలు కొన్ని చోట్ల పట్టణాలకు పారిపోవడం, కొన్ని చోట్ల భూస్వాముల మీద తిరుగుబాటుచేయడం మొదలయింది.

ఈ ఘర్షణ పరిమాణాత్మకంగా పెరిగి పెరిగి ఒక దశకు చేరేసరికి గుణాత్మక మార్పుగా మారి భూస్వామ్య సమాజాన్ని కూలదోసి పెట్టుబడిదారి సమాజం ఉనికిలోకి వచ్చింది.

కార్ల్‌మార్క్స్‌కు ప్రధానమైన విశ్లేషణావస్తువు పెట్టుబడిదారీ సమాజమే. పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి కనీవిని ఎరుగనంత విస్తారంగా, వేగంగా జరిగింది. కానీ ఉత్పత్తి సంబంధాలలో పెట్టుబడిదారుకూ, వేతన శ్రామికుడికి మధ్య అసమసంబంధాలు ఇంకా తీవ్రతరమయ్యాయి. పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి ప్రక్రియ అంతకు ముందెన్నటికంటె ఎక్కువగా సామాజికమవుతుంది. లక్షలాది మంది, కోట్లాది మంది వేతన కార్మికులు భారీ కర్మాగారాలలో సంఘటితంగా పనిచేస్తుంటారు. కానీ అదే సమయంలో శ్రమ ఫలితాన్ని అనుభవించడం, ఉత్పత్తి



BRAOU

సాధనాల మీద యాజమాన్యం అనేది అంతకంతకూ ఎక్కువగా వ్యక్తిగతమవుతూ గుత్తాధిపత్యంగా మారుతుంటుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ప్రధానమైన వైరుధ్యం సామాజిక ఉత్పత్తి ప్రక్రియకు, వ్యక్తిగత యాజమాన్యానికీ మధ్య ఉండేదే. ఈ వైరుధ్యం ఘర్షణకు, ఆర్థిక సంక్షోభాలకూ, నిరుద్యోగానికీ దారి తీస్తుంది. కార్మికవర్గం సంఘటితమయ్యే అవకాశం పెరగడంతో వారిలో వర్గ చైతన్యం పెరిగి, క్రమ శిక్షణాయుతమైన, సమీకృత పోరాటాలు పెరుగుతాయి. అంటే కార్మికవర్గం అనే ఒక వర్గాన్ని సృష్టించడం ద్వారా పెట్టుబడిదారీ వర్గంతన సమాధి తవ్వే వాళ్లను తన గర్భంలోంచే సృష్టించుకొంటోందని మార్క్స్ అన్నారు. ఈ ఘర్షణలు, పోరాటాలు పరిమాణాత్మక మార్పులకు దారితీస్తూ, చివరికి ఒక గుణాత్మక గంతుగా కార్మికవర్గం పెట్టుబడిదారీ వర్గాన్ని కూలదోసి పెట్టుబడిదారీ సమాజానికి చరమగీతం పాడుతుంది.

పెట్టుబడిదారీ సమాజం తర్వాత కొత్త సమానత్వ సమాజం - ఆర్థిక సామాజిక వ్యవస్థ- ఏర్పడుతుందని, అందులో మొదటి దశలో పాతవర్గ సమాజ అవశేషాలు కొనసాగుతాయని మార్క్స్ అన్నారు. ఈ మొదటిదశను సామ్యవాద సమాజం అని పిలుస్తారు. పాత యాజమాన్య శక్తులు తిరిగి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తారు. కనుక ఆ ప్రయత్నాలను అడ్డుకోవడానికి ఈ దశలో శ్రామికవర్గ నియంతృత్వ పాలన అవసరమవుతుంది. కానీ ఈ పాలన అన్ని ఉత్పత్తి సాధనాలను ప్రజలపరం చేసి, వ్యక్తిగత యాజమాన్యాన్ని రద్దుచేసి, ఉత్పత్తి ఫలితాన్ని ప్రజల అవసరాల మేరకు పంపిణీ చేస్తుంది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధిపై ఆటంకాల్ని తొలగించడం, ఉత్పత్తి సంబంధాల్ని సమానత్వంతో నింపడం ఈ దశలో సాగుతాయి. ఈ మార్పులు పరిమాణాత్మకంగా సాగుతూ, గుణాత్మక మార్పు అవసరమయ్యే నాటికి వర్గాలే లేని వ్యవస్థ రూపొందుతుంది. అంటే రాజ్యాంగయంత్రంగానీ, శ్రామికవర్గ నియంతృత్వంగానీ అవసరంలేని స్థితి వస్తుంది. ఈ దశను కమ్యూనిస్టు సమాజం అంటారు.

## 9.5 పరాయీకరణ భావన

మార్క్స్ ఆలోచనలలో సామాజిక పరిణామానికి, సామాజిక ఘర్షణకు కీలకమైన పరాయీకరణ భావన ముఖ్యమైనది. మార్క్స్ తొలి రచనలలో ఒకటయిన 'ఎకనామిక్ అండ్ ఫిలాసఫికల్ మాన్యుస్క్రిప్ట్ ఆఫ్ 1844' లో ప్రధానంగా హెగెల్ ప్రభావంతో వ్యక్తమయిన ఈ భావన ఆతర్వాతి రచనలలో ఇంకా విస్తరించబడింది. పెట్టుబడిదారీ సమాజంలో కార్మికుడు పరాయీకరణకు గురవుతాడని, నిత్యజీవితాచరణలో ఈ పరాయీకరణను గుర్తించినందువల్లే ఆ పరాయీకరణనుంచి బయటపడడానికి పోరాడతాడని మార్క్స్ తాత్విక స్థాయిలో వివరించాడు. ఈ తాత్విక విశ్లేషణ ఆ తర్వాతి రచనలలో రాజకీయార్థిక ఉదాహరణలతో సమన్వయంతో సాగింది.

పెట్టుబడిదారీ సమాజంలో నాలుగురకాల పరాయీకరణలను కార్మికులు, అనుభవిస్తారని మార్క్స్ విశ్లేషించాడు. ఉత్పత్తి విధానంలోనే ఈ పరాయీకరణ మూలాలు ఉండడం వల్ల అది సమాజమంతా వ్యాపిస్తుంది. ఈనాలుగు పరాయీకరణలు క్రింది విధంగా చెప్పుకోవచ్చు.

1. కార్మికుడు ఉత్పత్తి ప్రక్రియనుంచి పరాయి కావడం.

2. కార్మికుడు తన శ్రమ ఫలితం నుంచి పరాయికావడం.

3. కార్మికుడు తన తోటి కార్మికులనుంచి పరాయికావడం.

4. కార్మికుడు తనేనుంచి తానే, తన మానవసారం నుంచి తానే పరాయికావడం.

పెట్టుబడిదారీ పూర్వ సమాజాలలో ఉత్పత్తిలో పాల్గొనే ఏ మనిషికయినా తాను చేయబోయే ఉత్పత్తి ఏమిటో, ఆ ప్రక్రియ ఎక్కడ మొదలయి ఎక్కడ అంతమవుతుందో తెలుసు. అప్పుడు మనిషి ఆ ఉత్పత్తితోనూ, ఉత్పత్తి ప్రక్రియతోనూ తనను తాను అనుసంధానించుకోగలిగేవాడు. 'ఇది నా ఉత్పత్తి' అని గర్వపడగలిగేవాడు. ఆ శ్రమ ఫలితం తనకు దక్కకపోయినా, తన శ్రమ ఏమి సాధించిందో ఆ ఉత్పత్తిదారుకు స్పష్టంగా తెలిసి ఉండేది.



BRAOU

పెట్టుబడిదారీ సమాజం ఈ స్థితిని మార్చివేసింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ప్రధానమైన శ్రమ విభజన ప్రక్రియ ఒక ఉత్పత్తి క్రియను అనేక ముక్కలుగా విడగొట్టి ఒక్కొక్క ముక్కను ఒక్కొక్క విభాగానికి అప్పజెప్పడం వల్ల ఉత్పత్తి ప్రక్రియ ఆద్యంతాలు తెలియకుండా పోయాయి. తాను తయారు చేస్తున్న విడిభాగం ఎందుకు ఉపయోగపడుతుందో కూడా తెలియకుండా అంటే ఉత్పత్తి క్రియలో ఎలాంటి సృజనాత్మకత లేకుండా, ఆలోచన లేకుండా కేవలం యాంత్రికంగా తనకు ఇచ్చిన పని చేయడం కార్మికుడి కర్తవ్యం అయిపోయింది. అంటే ఉత్పత్తి ప్రక్రియ కార్మికుడికి అపరిచితమైనదిగా, తెలుసుకోవడానికి వీలులేనిదిగా, పరాయిదిగా మారిపోయింది. ఇది మొదటి పరాయీకరణ.

పెట్టుబడిదారీ సమాజానికన్నా ముందు కూడా కార్మికుడికి శ్రమ ఫలితం దక్కేదికాదు గానీ తన శ్రమ సాధించిన ఉత్పత్తి కార్మికుడికి తెలిసినదిగా, అందుబాటులో ఉండేది. పెట్టుబడిదారీ సమాజంలో ఒక పక్క ఉత్పత్తి ప్రక్రియ దూరమైపోవడం వల్ల, మరోపక్క ఉత్పత్తి సరుకు స్వభావాన్ని సంతరించుకొని మారకపు విలువే ప్రధానమై పోవడం వల్ల కార్మికుడికి తన సొంత ఉత్పత్తి కూడా తనకు తెలియనిదిగా మారిపోయింది. తన శ్రమతోనే తయారైన వస్తువు సరుకుగా మారి దుకాణంలో గాజుబీరువాలో కూచుని సొంత అస్తిత్వం పొంది తనను కొనగల శక్తి ఉంటే తప్ప తనను ముట్టుకోగూడదని శాసించడం మొదలుపెట్టింది. ఆమేరకు కార్మికుడికి శ్రమ ఫలితమైన ఉత్పత్తి కూడా పరాయిదయి పోయింది. ఇది రెండో పరాయీకరణ.

ఉత్పత్తి ప్రక్రియ శ్రమ విభజనకు గురయి ముక్కలయిపోవడం వల్ల ఉత్పత్తి మారకపు విలువగా, సరుకుగా మారి గాజుబీరువాలోకి ఎక్కి కూచోవడం వల్ల ఒక కార్మికుడికి, ఆ ప్రక్రియలోనూ, ఆ సరుకులోనూ ఉన్న మౌలిక మానవ శ్రమ మానవసారం లాగా కనబడకుండా పోతుంది. అది కేవలం సరుకులాగా కనబడుతుంది. అంటే మనుషుల మధ్య మనుషులుగా ఉండవలసిన సంబంధాలు సరుకుల మధ్య సంబంధాలుగా మారిపోతాయి. మనిషి తోటి మనుషులతో సంబంధాన్ని గుర్తించలేకపోతాడు. సరుకులతో సంబంధాన్ని మాత్రమే గుర్తించగలుగుతాడు. అంటే మనిషి తోటి మనుషులనుంచి పరాయి అయిపోతాడు. ఇది మూడో పరాయీకరణ.

మనిషి తోటి మనుషులనుంచి పరాయి అయిపోవడం అంటే, ఆతోటి మనుషులలోని మానవసారం నుంచి దూరమై పోవడమే. మానవ సారమంటే మానవ సంబంధాల సమాహారమే. ఇతర మనుషులలోని మానవసారం నుంచి దూరం కావడమంటే మానవ సంబంధాలనుంచి దూరం కావడమే. అంటే తనలోని మానవసారం నుంచి కూడా దూరం కావడమే. అట్లా పెట్టుబడిదారీ సమాజంలో విశ్వవ్యాప్తమయిన పరాయీకరణ వల్ల మనిషి తననుంచి తానే పరాయి అయిపోతాడు. ఇది నాలుగో పరాయీకరణ.

BRAOU

## 9.6 దోపిడీ భావన- అదనపు విలువ

శ్రమ క్రమంలో పరాయీకరణ అనే తాత్విక, సామాజిక భావనను రాజకీయార్థిక పదజాలంలో విశ్లేషిస్తే దోపిడీ భావన, దోపిడీకి పారిభాషిక రూపమైన అదనపు విలువ భావన వస్తాయి.

మార్క్స్‌కన్నా ముందు రాజకీయార్థిక శాస్త్రం వినిమయంలో, వ్యాపారంలో మాత్రమే మిగులు వస్తుందని భావించేది. అందువల్ల ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం ఎవరిదనే సమస్య ముఖ్యం కాలేదు. వర్గాలను గుర్తించినప్పటికీ వర్గపోరాటం ఎందుకు అనివార్యమవుతుందనే అవగాహన రాలేదు. మార్క్స్ తన విశ్లేషణను శ్రమ క్రమం దగ్గర, ఉత్పత్తి దగ్గర, కార్మికుడి దగ్గర ప్రారంభించాడు. కనుక మిగులు, అదనపు విలువ ఉత్పత్తి క్రమంలోనే వెలువడతాయని, అక్కడే దోపిడీ భావన అదనపు విలువ గురించి అవగాహన కీలకమైనవి.

పెట్టుబడిదారులు కార్మికుల శ్రమను దోపిడీ చేయడం ద్వారా లాభాలు సంపాదిస్తారు. ఏ సరుకు విలువైనా ఆసరుకును ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమ పరిమాణంతో నిర్ణయమవుతుంది. 'కార్మికుడు ఒక సరుకును ఉత్పత్తి చేయడానికి ఎంత శ్రమ కాలాన్ని వెచ్చిస్తాడో, అందుకు అతను వేతనంగా పొందే ప్రతిఫలం ఆశ్రమ కాలం కన్నా తక్కువకు మాత్రమే సరిపోతుంది. ఉదాహరణకు ఒక శ్రామికుడు తన వేతనానికి సరిపోయిన ఉత్పత్తిని ఐదు గంటల

శ్రమకాలంలోనే తయారు చేస్తాడనుకుందాం. కానీ ఆ శ్రామికుడు రోజుకు పదిగంటలు పనిచేస్తాడు. అంటే ఆ కార్మికుడు రోజుకు ఐదు గంటలు మాత్రమే తన కోసం పనిచేస్తూ, మిగిలిన ఐదు గంటలు యజమాన్యానికి లాభాలు సమకూర్చి పెట్టడానికి పనిచేస్తున్నాడన్నమాట. అవసరమైన శ్రమ కాలం కన్నా ఎక్కువగా కార్మికుడు పనిచేసిసృష్టిస్తున్న విలువను నిర్వచించడానికి 'అదనపు విలువ' అనే మాట వాడుదాం. అవసరమైన శ్రమ కాలం అనేది కార్మికుడు పొందిన వేతనానికి తగిన విలువను సృష్టించడానికి అవసరమైన శ్రమకాలం అన్న మాట' అని మార్క్స్ ఈ భావనను విశ్లేషించాడు.

ఉత్పత్తి సాధనాల మీద యజమానులకే గుత్తాధిపత్యం ఉంటుంది గనుక వాళ్లు కార్మికులను ఎక్కువ గంటలు పనిచేసేలా, ఎక్కువ అదనపు విలువ సృష్టించేలా ఒత్తిడి చేస్తారు. కార్మికులను ఎంత ఎక్కువగా దోపిడీ చేస్తే యజమానుల లాభాలు అంతగా పెరుగుతాయి.

## 9.7 లాభాలరేటు తరుగుదల సూత్రం

మార్క్స్ రాజకీయార్థిక శాస్త్రంలో కనిపెట్టిన ముఖ్యమైన అదనపు విలువ సూత్రంతో పాటే, దానికి కొనసాగింపుగా చెప్పవలసినది లాభాలరేటు తరుగుదల సూత్రం. ప్రధానంగా ఈ రెండు సూత్రాలకు సామాజిక పరిణామంలో ఫలితాలు ఉండడం వల్ల సామాజికశాస్త్ర అధ్యయనంలో వీటికి ప్రాధాన్యత ఉంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అంతర్గత కారణాల వల్లనే విచ్ఛిన్నమైపోతుందని మార్క్స్ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో కూడా నిర్ధారించాడు. పెట్టుబడిదారీ విధానం రద్దయిపోతుందని మార్క్స్ చెప్పింది జోతిష్యమో, ఆయన కోరికో కాదు. పూర్తిగా ఆర్థిక కారణాల మీద ఆధారపడి, పెట్టుబడిదారీ విధాన చరిత్ర సమాచారాన్ని విశ్లేషించి ఆయన ఈ నిర్ధారణకు వచ్చారు.

BRAOU

పెట్టుబడిదారు తన కర్మాగారంలో ఉత్పత్తి కొనసాగించడానికి పెట్టే పెట్టుబడిలో రెండు భాగాలు ఉంటాయి. అవి: స్థిర పెట్టుబడి, చర పెట్టుబడి. స్థిర పెట్టుబడి అంటే యంత్ర సామాగ్రికి దాన్ని మార్చడానికి పెట్టే ఖర్చు. ముడిసరుకులు, ఇంధనాలు కొనడానికి పెట్టే ఖర్చు. స్థిర పెట్టుబడిని C అని సూచిస్తారు. చరపెట్టుబడి అంటే కార్మికులకు ఇచ్చే వేతనం. దాన్ని V అని సూచిస్తారు. ఒక పెట్టుబడిదారు మొత్తంగా ఈ రెండు ఖర్చులు మాత్రమే పెట్టి ఉత్పత్తి సాగించినప్పటికీ అతని ఆదాయంలో మాత్రం S అనే అదనపు విలువ నిరంతరాయంగా చేరుతూనే ఉంటుంది.

పెట్టుబడిదారు ఎప్పుడైనా మొత్తంగా లాభం ఎంత వస్తుందనే కన్నా ఎక్కువగా లాభం రేటు ఎంత అన్నదానిమీద కేంద్రీకరిస్తాడు. అంటే తాను ఉత్పాదకాల మీద ఖర్చుపెట్టిన ప్రతీపైసా ఎంత అదనపు విలువలను సంపాదిస్తున్నదని ఆలోచిస్తాడు. లాభాల రేటును లెక్కగట్టడానికి ఈ క్రింది సూత్రాన్ని వాడతారు.

లాభాల రేటు $(P) = S/C+V$

ఈ సూత్రంలో C కి నానాటికీ పెరిగిపోయే లక్షణం ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ స్థిర పెట్టుబడి ఎక్కువ వెచ్చించవలసి వస్తుంది. యంత్ర సామాగ్రికీ, ముడిసరుకులకూ ధరలు పెరిగిపోతాయి. ఎక్కువ ఖరీదయిన యంత్రసామాగ్రినీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనకుండా ఒక పరిశ్రమ పోటీని తట్టుకోవడం కష్టమవుతుంది. ఆస్థాయిలో చరపెట్టుబడి పెరగడం సాధ్యం కాదు. అదనపు విలువ కేవలం చరపెట్టుబడిలో భాగంగా మాత్రమే వచ్చేది గనుక ఈ సూత్రంలో అంతకంతకూ లవం తగ్గిపోతూ హారం పెరుగతూ ఉంటుంది. అంటే ఒక సంవత్సరపు లాభాల రేటు కన్నా, మరుసటి సంవత్సరం లాభాలరేటు మరింత తగ్గుతుంది.

లాభాలరేటు తగ్గడమనేది పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో పడడానికి దారితీస్తుంది. అందువల్ల అధికోత్పత్తి - మాంద్యం - నిరుద్యోగం అనే వ్యాపార వలయాలు క్రమం తప్పకుండా వస్తుంటాయి. ఈ పరిమాణాత్మక మార్పులు కార్మికవర్గ చైతన్యంతో కలిసినప్పుడు ఉత్పత్తి విధానాన్నే రద్దుచేసే గుణాత్మక మార్పుగా పర్యవసిస్తాయి.

## 9.8 వర్గపోరాటం-విప్లవం-సామాజిక పరివర్తన

పెట్టుబడిదారీ విధానం ఉత్పత్తిని సామాజికం చేసినందువల్ల, సంఘటితం చేసినందువల్ల కార్మిక వర్గానికి చైతన్యం పంచుకునే, పెంచుకునే అవకాశం కలుగుతుంది. తాము ఒక వర్గం అన్న స్పృహ, తమ ప్రయోజనాల పరిరక్షణకు పోరాడాలన్న స్పృహ పెరుగుతాయి.

బానిస సమాజం నాటినుంచీ సమాజంలో వర్గాలు ఉన్నప్పటికీ, ఏదో ఒక స్థాయిలో వర్గాల మధ్య ఘర్షణ ఉన్నప్పటికీ పెట్టుబడిదారీ సమాజంలో వర్గపోరాటానికి స్పష్టత, అనివార్యత వస్తాయి. పెట్టుబడిదారీ సమాజంలో వర్గవిభజన నిశితంగా జరుతుంది.

కేవలం ఉత్పత్తిని సంఘటితం చేసినంత మాత్రానే సామాజిక వర్గాల అభివృద్ధి పూర్తి కాదని, ప్రజా బాహుళ్యంభౌతికంగా విభజన జరగవలసి ఉంటుందని, ఆర్థిక ఫలితాల పంపిణీ విషయంలో పదేపదే ఘర్షణలు జరగవలసి ఉంటుందని, తద్వార వర్గచైతన్యం పెంపొందవలసి ఉంటుందని మార్క్స్ అన్నాడు. పెట్టుబడిదారీ సమాజంలో ఈ అన్ని పరిస్థితులూ సాధ్యం అవుతాయి.

ఆవిధంగా వర్గ విభజన జరిగేటప్పుడు అది కేవలం ఉత్పత్తి సాధనాలతో సంబంధం మీద మాత్రమే నిర్ణయమవుతుంది. మరి ఇతర లక్షణాలతో వర్గాన్ని గుర్తించడం సాధ్యం కాదు. మార్క్స్ వర్గ భావనను బెండిక్స్, బిప్సెట్‌లు వివరిస్తూ వర్గాన్ని నిర్ధారించడానికి ఐదు ప్రమాణాలను వివరించారు. అవి:

1. ఆర్థిక ఫలితాల పంపిణీ గురించి వర్గాల మధ్య ఘర్షణ ఉంటోంది.

2. ఒక వర్గం ప్రజల మధ్య సమాచార వినిమయం సులభంగా సాధ్యమవుతుంది. అందువల్ల భావాలను, ఆచరణ ప్రణాళికలను సులభంగా ప్రచారం చేయడం వీలవుతుంది.

3. ఒక వర్గానికి చెందిన ప్రజలు తమ మధ్య సంఘీభావాన్ని, తమ చారిత్రక బాధ్యతలను గుర్తించగలుగుతారు. అంటే వారిలో వర్గచైతన్యం పెంపొందుతుంది.

4. ఆర్థిక వ్యవస్థను తాము అదుపు చేయలేకపోతున్నామని, అందువల్ల దోపిడీకి గురవుతున్నామని ఒక వర్గం ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి పెరిగిపోతుంది.

5. ఆర్థిక వ్యవస్థను బట్టి ఒక రాజకీయ నిర్మాణాన్ని ఏర్పరచుకోవం, అది చారిత్రక స్థితికి, వర్గ చైతన్య పరిణతికి తగినట్టుగా ఉండడం జరుగుతుంది.

ఈ విధంగా వర్గవిభజన స్పష్టంగానూ, లోతుగానూ జరిగిన తర్వాత, ఆ మేరకు వర్గపోరాటం కూడా నిశితమవుతుంది. సమాజంలో వర్గపోరాటాన్ని మార్క్స్ ప్రవేశపెట్టలేదు. మార్క్స్ కోరుకోలేదు. చరిత్రలో, సమాజంలో అది నిరంతరాయంగా వేరు, వేరు రూపాల్లో జరుగుతున్నదని మార్క్స్ నిర్ధారించి చూపాడు. పెట్టుబడిదారీ సమాజంలో ఆవర్గపోటం మరింత తీవ్రతరమయ్యే అవకాశం ఉందని ఆయన వివరించారు. అధికారంలో ఉన్న వర్గాలు తమ అధికారాన్ని అంత సులువుగా వదుకోవని, అందువల్ల ఆవర్గాలు హింసకు, అణచివేతకు పాల్పడతాయని, అధికారంలోకి రాదలచుకున్న వర్గం దాన్ని ఎదిరిస్తుందని ఆయన అన్నాడు. అందువల్ల 'హింస విప్లవానికి మంత్రసాని'గా పనిచేస్తుందని ఆయన చారిత్రక సూత్రాన్ని వెల్లడించాడు.

ఈ ఘర్షణ, వర్గపోరాటం ఫలితంగా సమాజం మరొక మెట్టు పైకి ఎదిగి సామాజిక పరివర్తన సాగుత ంది. చరిత్ర క్రమం మొత్తం సామాజిక పరివర్తనలన్నీ ఇట్లా వర్గపోరాట ఫలితంగానే జరిగాయి.

BRAOU

## 9.9 సిద్ధాంతం-ఆచరణల ఐక్యత

మార్క్స్ సామాజిక సిద్ధాంతంలో అతి ముఖ్యమైన అంశం సిద్ధాంతానికి ఆచరణకు అవినాభావమైన ఐక్యత. తత్వవేత్తలు సమాజాన్ని వ్యాఖానించారనీ, కానీ, సమాజాన్ని మార్చడం ముఖ్యం అని అన్నప్పటినుంచీ కూడా మార్క్స్ ఆచరణకు ఎంతో ప్రాధాన్యతనిచ్చారు. ఆచరణనుంచే సిద్ధాంతం రూపొందుతుందనేది మార్క్స్ చెప్పిన భౌతికవాద అవగాహనకు అనుగుణమైనదే. అయితే యాంత్రిక భౌతికవాదం ఈ ఏకముఖ చర్యను ప్రతిపాదించగా మార్క్స్ గతితార్కిక భౌతికవాదం సిద్ధాంతానికీ, ఆచరణకు మధ్య పర్పర చర్య- ప్రతిచర్యలను ప్రతిపాదించారు. అందుకే మార్క్స్ భావాలు భౌతిక శక్తిగా మారతాయి అనికూడా అన్నారు. ఆచరణ-సిద్ధాంతం-ఆచరణ అనే నిరంతర చక్రంలో ఆచరణ సిద్ధాంతాన్ని సృష్టిస్తుందని, సిద్ధాంతం ఆచరణకు దారిచూపుతుందని, ఆయన వర్తులాకార అభివృద్ధిని ఊహించారు.

ఈ తాత్విక అవగాహనను సామాజిక చరిత్రకు అన్వయించినప్పుడు వర్గ విభజనే, వర్గ పోరాటమే ఒక సైద్ధాంతిక అవగాహనను కల్పిస్తుందనీ, ఆ సైద్ధాంతిక అవగాహన మళ్లీ వర్గపోరాటాన్ని ఉన్నత స్థాయికి తీసుకుపోవడానికి ప్రణాళిక సిద్ధం చేస్తుందనీ అర్థం చేసుకోవలసి ఉంటుంది.

పెట్టుబడిదారీ సమాజంలో కార్మికవర్గం నిరంతర పోరాటాల క్రమంలో తనదైన సిద్ధాంతాన్ని ఆవిష్కరించుకుంది. ఆసిద్ధాంతం వెలుగులో మరింత నిశితమైన కార్యాచరణకు పూనుకుంది. ఈ సిద్ధాంతం - ఆచరణ ఐక్యత, పరస్పర ప్రభావం నిరంతరం సాగుతూ సామాజిక అవగాహనకు, పురోగతికి తోడ్పడతాయి.

## 9.10 సమసమాజం-శాస్త్రీయ సామ్యవాదం

పెట్టుబడిదారీ సమాజంలో నిశితమయ్యే వర్గపోరాట ఆచరణను, దాని నుంచి అభివృద్ధి అయ్యే వర్గపోరాట సిద్ధాంతాన్ని, అరెండింటి మధ్య గతితార్కిక ఐక్యతతో పరిశీలించినప్పుడు అవి మరింత ఉన్నతీకరించబడిన ఆచరణగా, సిద్ధాంతంగా - అంటే సమసమాజంగా, శాస్త్రీయ సామ్యవాద భావనగా-పరిణమిస్తాయి.

BRAOU

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని కూలదోసిన తర్వాత వచ్చే సమాజం సోషలిస్టు సమాజం. దీన్ని తెలుగులో సమసమాజం అని పిలుస్తున్నాం. కానీ ఇది నిజానికి పూర్తిస్థాయిలో సమానత్వం కొనసాగే సమాజం కాదు. ఎందువల్లనంటే సోషలిస్టు ఉత్పత్తి విధానంలో కూడా వర్గాలు కొనసాగుతూనే ఉంటాయి. సోషలిస్టు ఉత్పత్తి విధానంలో సామాజికంగా ఉత్పత్తి అయ్యే సంపదను ఏ కొందరి సొంత ఆస్తిగానో ఉంచక సామాజికంగా పంపిణీ చేసే వ్యవస్థ అమలవుతుంది. అక్కడక్కడ ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం సమష్టిగా ఉంటుంది తప్ప వ్యక్తిగతంగా ఉండదు. ఉత్పత్తి అనేది సామాజిక అవసరాల కోసం జరుతుంది తప్ప వ్యక్తిగత లాభాపేక్షతో జరుగదు. కొంతవరకు కార్మికులు అదనపు శ్రమ చేయవలసిన అవసరం ఉంటుందిగానీ ఆ అదనపు శ్రమ ఫలితాన్ని సామాజిక శ్రేయస్సుకోసం వినియోగిస్తారేగానీ వ్యక్తిగత భోగానికి, సంపద కూడబెట్టుకోవడానికి వినియోగించరు. అందువల్ల సోషలిస్టు ఉత్పత్తి విధానంలో అనవసరమైన సరుకులను ఉత్పత్తి చేయడం రద్దయిపోయి, అంతకు ముందు వ్యర్థమైపోయిన వనరులెన్నో ప్రజా ఉపయోగానికి సమకూరుతాయి. అట్లాగే మానవ శ్రమను మానవ అవసరాలను సంతృప్తి పరచడానికి ఇంకా ఎక్కువగా వినియోగించే వీలు కలుగుతుంది. సోషలిస్టు సమాజం ఆరోగ్యం, విద్య, ఆహారం, ఆశ్రయం వంటి నిత్య జీవితావసరాలను తీర్చడం మాత్రమే గాక సిద్ధాంత స్థాయిలోనే ఈ అవసరాలను సరుకులుగా గుర్తించడానికి నిరాకరిస్తుంది. ఇవన్నీ మానవ అవసరాలని భావిస్తుంది.

ఈ సమసమాజ ఆచరణ భావనను సైద్ధాంతీకరించిన ఫలితంగా శాస్త్రీయ సోషలిజం అవగాహన రూపొంది, సమానత్వాన్ని, సమసమాజాన్ని ఆదర్శంగా ఊహగా, స్వప్నంగాభావించిన ఎంతో మంది ఊహాజనిత సోషలిస్టు ఆలోచనా పరులను ఎదుర్కొంటూ మార్క్స్, ఏంగెల్స్‌లు ఈ శాస్త్రీయ సోషలిజం భావనను నిర్మించారు. సమానత్వమనేది, సమసమాజమనేది ధార్మి, నైతిక భావన కాజాలదని, దానికి సామాజిక, రాజకీయార్థిక

మూలాలున్నాయని, అది చారిత్రక అనివార్యత అని రుజువు చేసిన సిద్ధాంతమే శాస్త్రీయ సోషలిజం.

మార్క్స్, ఎంగెల్స్‌ల తర్వాత శాస్త్రీయ సోషలిజం భావనను ఆచరణలోను, సైద్ధాంతికంగాను పరిపుష్టం చేసిన వాళ్లు, అభివృద్ధి చేసినవాళ్లు వి.ఐ.లెనిన్, జె.వి.స్టాలిన్, మావోసేటుంగ్ తదితరులు.

## 9.11 కమ్యూనిజం

పెట్టుబడిదారీ విధానం నుంచి సోషలిజానికి పరివర్తన గురించి ఎంత స్పష్టంగా, ఎంత నిర్ధారణగా విశ్లేషించారో, అంత స్పష్టంగా సోషలిజం నుంచి కమ్యూనిజానికి పరివర్తన గురించి మార్క్స్, ఎంగెల్స్‌లు విశ్లేషించలేకపోయారు. సోషలిస్టు సమాజంలో పరిమాణాత్మక మార్పులు జరిగిన తర్వాత, ఉత్పత్తి విధానంలో ఆచరణతోపాటే, ప్రజల భావజాలంలో మార్పులు తెచ్చే సైద్ధాంతిక కృషికూడా జరిగిన తర్వాత 'ప్రజలందరూ ఒకేసారి, మూకుమ్మడిగా కార్యాచరణలోకి దిగినప్పుడు మాత్రమే కమ్యూనిజం సాధ్యమవుతుంది'అని మార్క్స్ రాశారు.

పెట్టుబడిదారీ విధానం కింద ఉత్పత్తిశక్తుల విప్లవాత్మక పరివర్తన అనివార్యంగా సోషలిజానికి ఎట్లా దారితీస్తుందో కాపిటల్‌లో రుజువు చేసినంత కచ్చితంగా, సోషలిజంలోని ఉత్పత్తి శక్తులు కమ్యూనిజంలోకి ప్రయాణాన్ని ఎందుకు కోరుకుంటాయని ఆయన వివరించలేకపోయారు. ప్రజలు సహజంగానే మరింత ఉన్నతమైన సమానత్వాన్ని కోరుకుంటారని, దోపిడీ పీడనలను రద్దుచేసినట్టుగానే, అసమానత్వాన్ని కూడా రద్దుచేయదలచుకుంటారని నమ్మకంతో సోషలిజం క్రమంగా కమ్యూనిజంగా మారిపోతుందని ఆయన ఊహించారు.

కమ్యూనిస్టు సమాజం, మార్క్స్ దృష్టిలో నిజంగా ఒక ఊహా స్వర్గం. వర్గ సమాజం మానవచరిత్రకు చేసిన అన్యాయాలన్నిటినీ అది కడిగేస్తుంది. మనిషిని మనిషి దోపిడీ చేయడానికి, పీడించడానికి, అణచివేయడానికి ఉన్న మూలాధారాలన్నిటినీ అది రద్దుచేస్తుంది. ఉత్పత్తి సాధనాలమీద యాజమాన్యాన్ని సమాజపరం చేయడంతో వర్గాల అస్తిత్వమే రద్దయిపోయి కమ్యూనిస్టు సమాజం వర్గరహిత సమాజంగా ఆవిర్భవిస్తుంది. మార్క్స్ సమాజ పురోగతి వర్తులాకార ఊర్ధ్వ చలనంగా ఉంటుందని ఊహించారు గనుక ఆదిమ కమ్యూనిస్టు సమాజంలోని సమానత్వమే విపరీతంగా అభివృద్ధి చెందిన ఉత్పత్తి శక్తులతో తిరిగి ఉనికిలోకి రావడం సాధ్యమేనని, అనివార్యమని ఆయన భావించారు.

కమ్యూనిస్టు సమాజంలో వర్గాలు రద్దుకావడం మాత్రమేకాక ఉత్పత్తి విధానంలో నియమిత శ్రమ విభజన పద్ధతికూడా రద్దయిపోతుంది. కమ్యూనిస్టు సమాజంలో ఏ ఒక్క మనిషికీ నిర్ణీతమైన కార్యాచరణ రంగం ఉండదని, కానీ సమాజం మొత్తంగా సామాజిక ఉత్పత్తిని నియంత్రిస్తుందని మార్క్స్ అన్నారు. కమ్యూనిస్టు సమాజంలో శ్రామికులు ఒక రంగం నుంచి మరో రంగానికి పర్యవేక్షణకోసం వెళ్తారని, ఏపనీ ప్రత్యేకమైన నైపుణ్యం అవసరమై ఉండదని, ఏ వృత్తీ ఏ ఒక్కరి గుత్తాధిపత్యంలో ఉండదని మార్క్స్ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అత్యున్నతంగా అభివృద్ధి చెందినందువల్ల శ్రమవిభజన అవసరం లేని స్థితి వస్తుందని ఆయన అన్నారు.

అటువంటి స్థితిలో రాజ్యాంగ యంత్రాంగం అవసరమే ఉండదు. కాబట్టి రాజ్యాంగ యంత్రం కృశించి, తనంతట తానే అదృశ్యమైపోతుందని మార్క్స్ ఊహించారు.

## 9.12 రాజ్యాంగ యంత్రం

మార్క్స్ ఆలోచనలలో రాజ్యాంగయంత్రానికి చాలా ప్రాధాన్యత ఉంది. సమాజంలో దోపిడీ పీడనలు కొనసాగడానికి వర్గ విభజన, శ్రమ విభజన, పరాయీకరణ, సొంత ఆస్తి వంటి కారణాలు మాత్రమేకాక అవన్నీ బలపడడానికి రాజ్యాంగయంత్రం మద్దతు కారణమవుతుంది.



రాజ్యాంగ యంత్రం గురించి మార్క్స్, ఎంగెల్స్‌ల అవగాహన నిర్దిష్టంగా, క్లుప్తంగా కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలో

BRAOU

వ్యక్తమయింది. "ఆధునిక రాజ్యపు కార్యనిర్వాహక వర్గం మొత్తంగా బూర్జువా వర్గపు ఉమ్మడి వ్యవహారాలను నిర్వహించే సమితి మాత్రమే" 1848లో చేసిన ఈ విశ్లేషణ తర్వాత ఎన్నో రచనలలో మార్క్స్, ఎంగెల్స్‌లు రాజ్యం పట్ల తమ భావనను విస్తరించి ప్రకటించారు. ఎంగెల్స్ 'కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యం పుట్టుక' లోనూ, లెనిన్ 'రాజ్యం-విప్లవం' లోనూ రాజ్యం పట్ల మార్క్సిస్టు అవగాహనను సమగ్రంగా వివరించారు.

రాజ్యం అనేది పాలకవర్గాల చేతిలోని ఒక సాధనం అని, ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం అదుపు ఉండే వర్గం రాజ్యాంగ యంత్రాన్ని తన చేతిలో ఉంచుకుంటుందని మార్క్స్, ఎంగెల్స్‌లు భావించారు. ఆర్థికంగా బలసంపన్నమైన వర్గాల ప్రయోజనాన్ని కాపాడే రాజ్యం వర్గ ఘర్షణను నియంత్రించి, అణచివేసి సాంఘిక వ్యవస్థ భద్రతను కాపాడుతుంది. అంటే యథాస్థితికి రక్షణగా నిలుస్తుంది. రాజ్యం అనుమతితో, రక్షణలో సాగే వర్గపాలన ఎన్నెన్నో రూపాలలో వ్యక్తమవుతుంది. 'ప్రజాస్వామిక గణతంత్ర' పాలన నుంచి నియంతృత్వం దాకా ఏరూపంలోని పాలనలోనయినా రాజ్యం పాత్ర, దాని వెనుకనున్న యాజమాన్యవర్గాల పాత్ర ఒకే రకంగా ఉంటాయి. రాజ్యాంగ యంత్రానికి అణచివేత సాధనంగా ఉండే పాత్రే ప్రధానమైనది.

కమ్యూనిస్టు సమాజం వర్గరహిత సమాజంగా ఉంటోంది గనుక రాజ్యం అవసరం ఉండదని మార్క్స్, ఎంగెల్స్‌లు భావించారు. కానీ పెటుబ్టడిదారీ విధానం తర్వాత వెనువెంటనే వచ్చే సోషలిస్టు సమాజంలో రాజ్యం పాత్ర ఏవిధంగా ఉంటుందని మార్క్సిస్టు ఆలోచనాధారలో చాలా చర్చ జరిగింది. 1871లో పారిస్‌లో శ్రామిక వర్గం తిరుగుబాటు చేసి పారిస్ కమ్యూన్ ఏర్పరచుకున్నప్పుడు చుట్టూ 14 పెట్టుబడిదారీ రాజ్యాలు దానిమీద దాడిచేసి 70 రోజుల తర్వాత దాన్ని కూలదోశాయి. ఈ అనుభవం తర్వాత సోషలిస్టు రాజ్యం ఇంటా బయటా శత్రువుల్ని -అంటే పెట్టుబడిదారీ సమాజాన్ని పునరుద్ధరించదలుచుకున్న వారిని- అడ్డుకోవాలంటే దృఢమైన రాజ్యంగా ఉండాలని, తొలి దశలో శ్రామికవర్గ నియంతృత్వ రాజ్యంగా వుండాలని మార్క్స్, ఎంగెల్స్ భావించారు.

BRAOU

## 9.13 సారాంశం

మార్క్స్, ఎంగెల్స్‌ల రచనలు యాభై సంపుటాలలో వలభైవేల పేజీలలో విస్తరిచినవి. రాజకీయార్థిక శాస్త్రం, చరిత్ర, కళలు, సాహిత్యం, శాస్త్రీయ సోషలిజం, కార్మికవర్గ పోరాట నిర్మాణ పద్ధతులు, సామాజిక శాస్త్రం, భౌతికశాస్త్రాలు, సామాజిక సమస్యలు, సమకాలీన సంఘటనలు, సంస్కృతి, మతం-వంటి అనేక విషయాలలో మార్క్స్, ఎంగెల్స్‌లు లోతయిన, సునిశితమైన, విలువైన విశ్లేషణలెన్నో చేశారు. పైన వివరించిన అంశాలు మార్క్స్, ఎంగెల్స్‌ల సామాజిక అవగాహనలలో ప్రధానమైనవి మాత్రమే.

మార్క్సిజంలో నాలుగు ప్రధాన అంశాలున్నాయి. అవి: 1. రాజకీయార్థిక విశ్లేషణ, 2. భవిష్యత్ సామాజిక దృష్టి, 3. సంవిధానం, 4. ఆచరణకు మార్గదర్శి.

మార్క్సిజంలో విడివిడిగా కొన్ని అంశాలు సంపూర్ణం కావనిపించినా, సామాజిక మార్పుల వల్ల కొన్ని అంశాలు ఇంకా అభివృద్ధి చేయవలసి ఉన్నట్టు కనబడ్డినా, మార్క్సిస్టు ఆచరణలో కొన్ని వైఫల్యాలు ఉన్నా ఈ నాలుగు ప్రధానాంశాలు మార్క్సిజాన్ని ఒక శాస్త్రంగా సజీవంగా ఉంచుతున్నాయి. శాస్త్రం అన్నప్పుడే ఒక రోజుతో దాని సైద్ధాంతిక ప్రవచనాలు పూర్తయిపోవని, కాలక్రమంలో దానిలో ఎన్నో మార్పులు, చేర్పులు జరుగుతుంటాయని అర్థం. ఆవిధంగా మార్క్స్, ఎంగెల్స్‌లతో ప్రారంభమైన మార్క్సిజం అనే శాస్త్రానికి లెనిన్, స్టాలిన్, మావో వంటి ఎందరో మార్క్సిస్టులు ఎన్నో కొత్త అంశాల్ని చేర్చారు. పాత అంశాల్ని అభివృద్ధి చేశారు. పరిపుష్టం చేశారు.

ముఖ్యంగా మావో సేటుంగ్ చైనా సమాజం వంటి ఒక వెనుకబడిన వ్యవసాయ సమాజంలో సోషలిజం పరివర్తన, సోషలిస్టు నిర్మాణం ఎట్లా జరుగుతుందో సైద్ధాంతిక స్థాయిలోనూ, ఆచరణస్థాయిలోనూ ఎన్నో ప్రయోగాలు చేశారు. అవగాహనలను ప్రకటించారు. సామాజిక అనుభవాన్ని పెంపొందించారు.

## 9.14 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. కారల్ మార్క్స్ ప్రతిపాదించిన గతితార్కిక భౌతికవాదం గురించి తెలుపండి.

2. వర్గపోరాటం, విప్లవం, సామాజిక పరివర్తనల గురించి రాయండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. దోపిడీ భావన గురించి తెలుపండి

2. కమ్యూనిజం గురించి వివరించండి.

## 9.15 చదవదగిన పుస్తకాలు


కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ : కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక
వి.ఐ.లెనిన్ : రాజ్యం, విప్లవం
మావో సేటుంగ్ : ఆచరణ, వైరుధ్యాలు
స్టాలిన్ : గతితార్కిక, చారిత్రక భౌతికవాదం
Remond Aron : Main Currents in Sociological Thought
Shlowmo Avineri : The Social and Political Thought of Carl Marx
Tom Batamore : Marxist Sociology
Tom Batamore : A Dictionary of Marxist Thought
Henri Lefebewer : The Sociology of Marx
Francis Abraham, M. : Modern Sociology Theory - on introduction
Fransis Abraham, John Henry Morgan: Sociological Thought


BRAOU

# భాగం-10: జార్జ్ సిమ్మెల్

విషయ క్రమం


10.0 ఉద్దేశాలు

10.1 పరిచయం

10.2 జీవిత విశేషాలు

10.3 సామాజికీకరణ భావన

10.4 సామాజిక శాస్త్ర విభజన

10.5 సామాజిక నమూనా

10.6 సామాజిక జీవితంలో సంఖ్యాపాత్ర

10.7 సంస్కృతి

10.8 సారాంశం

10.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

10.10 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 10.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ఘర్షణ సిద్ధాంతాన్ని వివరించడంలో జార్జ్ సిమ్మెల్ చేసిన కృషిని తెలుసుకుంటారు.
- సామాజికీకరణ భావన, నమూనాల భావన, సంఖ్యాపాత్ర, మొదలయిన వాటిని అర్థం చేసుకుంటారు.
- సామాజిక శాస్త్ర విభజన సామాజికశాస్త్ర అభివృద్ధికి దోహదపడ్డ తీరును అర్థం చేసుకుంటారు.

## 10.1 పరిచయం

జార్జ్ సిమ్మెల్ రూపొందించిన సామాజిక శాస్త్ర అవగాహన అప్పటికి ఉనికిలో ఉండిన రెండు ప్రధాన తాత్విక ధోరణులను సవాలు చేస్తూ అభివృద్ధి చెందింది. ఆ ధోరణులు మోమ్టె, స్పెన్సర్‌లు ప్రతిపాదించిన సజీవ ఐక్యతావాదం, జర్మనీలో ప్రచలితంగా ఉండిన చారిత్రక వివరణావాదం. వీటిలో సజీవ ఐక్యతా వాదం ప్రకృతికీ, సమాజానికి మధ్య మౌలిక కొనసాగింపు ఉన్నదని భావిస్తుంది. సామాజిక క్రమాలు సంక్లిష్టమైనవయినప్పటికీ గుణాత్మకంగా జీవశాస్త్ర క్రమాల వంటివేనని ఈ వాదం భావిస్తుంది. జీవశాస్త్రాలు ప్రకృతి చలనసూత్రాలను కనిపెట్టినట్టుగానే, సామాజిక శాస్త్రం సామాజిక పరిణామాన్ని నిర్ధారించే నియమాలను కనిపట్టే మహాశాస్త్రమని ఈ సజీవ ఐక్యతావాదం భావించింది.

ఇందుకు భిన్నంగా జర్మన్ భావవాద తాత్వికులు జీవశాస్త్రాలను, మానవ శాస్త్రాలను గుణాత్మకంగా భిన్నమైనవిగా భావించారు. ప్రకృతి చలననియమాలకు, మానవ సంస్కృతి అధ్యయనానికి ఏమీ సంబంధం లేదని వాళ్లు అన్నారు. సాధారణ సూత్రాలను సంగ్రహించే సంవిధానం సమాజానికి పనికిరాదని, ప్రతీ మానవ దృగ్గోచరాంశాన్ని ఒక ప్రత్యేక, విశిష్ట ఘటనగా చూడవలసి ఉంటోందని వాళ్లు అన్నారు. అందువల్ల మానవ వ్యవహారాలను అధ్యయనం చేసే

విద్యార్థి మానవ చరిత్రలోని విశిష్ట ఘటనలను వివరించి, నమోదు చేయడం తప్ప మరేమీ చేయలేడని వాళ్లు అన్నారు. అందువల్ల సామాజిక శాస్త్రం అనబడే శాస్త్రానికి అధ్యయనాంశమే ఏదీ లేదని వాళ్లు వాదించారు.

ఈరెండు దృక్పథాలను తిరస్కరిస్తూ జార్జ్ సిమ్మెల్ తన సామాజిక అవగాహనలను ప్రకటించారు. సమాజమంటే అటు సజీవ ఐక్యతావాదులు భావించినట్టు ఒక సజీవశరీరం కాదని సిమ్మెల్ వాదించారు. "పరస్పర సంబంధాలతో అనుసంధానించబడిన వ్యక్తుల సమూహానికే పేరు సమాజం" అని ఆయన నిర్వచించారు. రాజ్యం, వంశం, కుటుంబం, నగరం, కార్మిక సంఘం వంటివి విశాల అభివ్యక్తి నిర్మాణాలన్నీ పరస్పర సంబంధాల సంఘటిత రూపాలేనని ఆయన వివరించాడు. ఈ నిర్మాణాలు స్వతంత్ర అస్తిత్వాన్ని, శాశ్వతత్వాన్ని సంతరించుకుని, పరాయిశక్తుల లాగా వ్యక్తితో సంఘర్షించవచ్చునని ఆయన విశ్లేషించారు.

సమాజం గురించిన ఈ మౌలిక అవగాహన పునాది మీదనే జార్జిసిమ్మెల్ సామాజిక శాస్త్ర భావనలన్నీ అభివృద్ధి చెందాయి.

## 10.2 జీవిత విశేషాలు

జార్జ్ సిమ్మెల్ 1858లో జర్మనీలోని బెర్లిన్‌లో ఒక సంపన్న యూదు వ్యాపార కుటుంబంలో జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి మరణించగా కుటుంబ స్నేహితుడయిన ఒక ప్రచురణకర్త ఆదరణలో విద్యభ్యాసం జరిగింది. బెర్లిన్ విశ్వవిద్యాలయంలో చరిత్ర, తత్వశాస్త్రం, మనస్తత్వశాస్త్రం చదువుకున్నారు. 1885లో బెర్లిన్ విశ్వవిద్యాలయంలో తాత్కాలిక అధ్యాపకుడిగా చేరి మంచి అధ్యాపకుడిగా పేరు తెచ్చుకున్నారు. విద్యార్థులలో, సహాధ్యాపకులలో ఎంత పేరు ప్రతిష్టలు వచ్చినప్పటికీ ఆయన భావాల వలన, యూదు కావడం వలన ఆయనకు పూర్తిస్థాయి అధ్యాపకుడిగా ఉద్యోగం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధపడలేదు. అంతేకాక అభివాద పద్ధతులు, ప్రేమ, వాసన, రహస్యం, హావభావాలు వంటి అతి మామూలు అంశాలపైన, చివరికి వేరు వేరు కుర్చీల పొందికపైన సామాజిక శాస్త్ర రీత్యా విశ్లేషణ చేయడంతో ఆయన గౌరవనీయమైన సామాజిక శాస్త్ర సిద్ధాంతకర్త కాడని, ఆయనమీద చిన్న చూపు కొనసాగింది. సిమ్మెల్ ఒకవైపు విద్యార్థులను ఆకర్షించే పాఠాలు చెప్తూనే మరోవైపు విస్తృతంగా రచనలు చేశాడు. ఆయన జీవితకాలం 31 పుస్తకాలు, 256 వ్యాసాలు రాశారు. చివరికి 1914లో స్ట్రాస్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో ఆయనకు పూర్తిస్థాయి ప్రొఫెసర్ ఉద్యోగం వచ్చింది. కానీ సరిగా అదే సమయంలో మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమై విశ్వవిద్యాలయం మూతబడడంతో ఆయనకు అక్కడ పని ఏమీ లేకపోయింది. జీవితకాలమంతా నిరీక్షించినా ఉద్యోగం చేతికందినప్పటికీ నిష్ప్రయోజనమే అయింది. ఆ నిరాశతోనూ, కాలేయానికి సోకిన క్యాన్సర్‌తోనూ జార్జ్ సిమ్మెల్ 1918లో మరణించాడు.

## 10.3 సామాజికీకరణ భావన

సమాజాన్ని అధ్యయనం చేయదలచిన విద్యార్థి ఎవరయినా ప్రధానంగా అధ్యయనం చేయవలసిన రంగం సామాజికీకరణ అని జార్జ్ సిమ్మెల్ ఒక కొత్త భావనను ప్రవేశపెట్టాడు. మనుషులు ఒకరితో ఒకరు సంధానించుకునే, పరస్పర సంబంధం పెట్టుకునే ప్రత్యేక విధానాలను, రూపాలను జార్జ్ సిమ్మెల్ సామాజికీకరణ అని నిర్వచించారు.

జీవిత ప్రవాహంలో మంచి మనుషులు అర్థాన్ని, స్థిరత్వాన్ని గ్రహించడానికి వివిధ రకాల సామాజికీకరణ రూపాలను ఎంచుకుంటారనీ, ఆ రూపాలను అధ్యయనం చేయడమే సామాజిక శాస్త్రమని సిమ్మెల్ భావించాడు. మనుషులు సాధారణంగా అనుద్దేశ్యపూర్వంగానే "బృందాలను ఏర్పరచుకుని, పరస్పర సంబంధాల వల్ల తమ సామాజిక అస్తిత్వం ద్వారానే నిర్ధారించబడి" ప్రవర్తించే తీరులను సామాజిక శాస్త్రం అధ్యయనం చేస్తుందని ఆయన అన్నారు. సిమ్మెల్ భావన ప్రకారం సామాజిక శాస్త్రానికి విశిష్ట అన్వేషణా విషయమేమీలేదు. రాజనీతిశాస్త్రం,చరిత్ర, తదితర శాస్త్రాలు అధ్యయనం చేసే సామాజిక జీవితాన్నే సామాజిక శాస్త్రం కూడా అధ్యయనం చేస్తుంది. సామాజిక శాస్త్రాన్ని ఇతర శాస్త్రాల నుంచి వేరు చేసేది దాని అన్వేషణా పద్ధతేనని సిమ్మెల్ భావించారు. "సమాజం" అనేది గాని,



BRAOU

సమాజంలోని భాగాలుగానీ, అంటే బృందాలు, వ్యక్తులుగానీ, స్వతంత్ర అస్తిత్వంతో లేవని, జీవిత సమస్తం పరస్పర సంబంధాల ఫలితంగానే ఉన్నదని సిమ్మెల్ భావించారు. అందువల్ల సామాజిక శాస్త్రపు పరిశీలనా క్షేత్రం ఈ పరస్పర సంబంధమేనని, అంటే 'సామాజికీకరణ రూపాన్ని, రూపాలను' అధ్యయనం చేయడమే సామాజిక శాస్త్రం పని అని ఆయన భావించారు.

రూపాల అధ్యయనం మీదనే శ్రద్ధ పెట్టినందువల్ల సిమ్మెల్‌ను రూపవాద సామాజిక శాస్త్ర ప్రారంభకుడిగా, 'శుద్ధ సామాజికశాస్త్ర' ప్రారంభకుడిగా గుర్తించడం జరుగుతున్నది. ఈ సామాజికీకరణ రూపాలు నిర్దిష్ట వస్తువుల, సారాంశాల రూపాలుగానే ఉనికిలోకి వచ్చినప్పటికీ, ఆ సారాంశాలతో సంబంధంలేకుండా సామజికీకరణ రూపాలను అధ్యయనం చేయడమే 'రూపవాద సామాజికశాస్త్ర' కర్తవ్యమని ఆయన నిర్ధారించాడు. విభిన్న సంస్కృతుల లోనూ, చారిత్రకంగానూ సామాజికీకరణ రూపాలు ఒకే రకంగా ఉండవచ్చునని, వాటిలోని అనుభవ సారాంశం నాటకీయంగా భిన్నంగా ఉండవచ్చునని సిమ్మెల్ భావించారు.

సామాజిక శాస్త్రవేత్త సామాజికరణ వెనుక ఉన్న తర్కాన్ని కూడా అధ్యయనం చేయాలని, తద్వారా నిర్దిష్ట సమాజాలను అధ్యయనం చేయడం, సాధారణంగా సమాజాన్ని అర్థం చేసుకోవడం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. అంటే ఒక సమాజంలోని ప్రత్యేకతలు ఏమిటో, అన్ని సమాజాలలోని సాధారణ అంశాలు ఏమిటో అధ్యయనం చేయాలని ఆయన సూచించారు.

'శుద్ధ సామాజికీకరణ' మానవ అనుభవాన్ని ఎట్లా రూపొందిస్తుందో, ఎట్లా పరిమితం చేస్తుందో వివరించడానికి అమూర్తస్థాయిలో ప్రయత్నించడం సామాజిక వాస్తవికతను విశ్లేషించడంలో మొదటిమెట్టని సిమ్మెల్ భావించారు. సామాజిక ప్రపంచపు ఉనికికి మౌలికమయిన మూడు ప్రాతిపదికలున్నాయని అవి వైరుధ్య భరితమైన ఆవేశాలతో నిండి ఉంటాయని, మనుషులు, మతం గురించి, ఇతరుల గురించీ ఈ ప్రాతిపదికలతో ప్రారంభిచకపోతే సామాజిక జీవితమే సాధ్యం కాదని ఆయన వివరించారు. ఆ ప్రాతిపదికలు:

1. వ్యక్తులు సమాజం లోపలా, బయటా కూడా ఉంటారు. సమాజమంటే ఏకకాలంలో దాని లోపలా, బయటా కూడా ఉండే వ్యక్తులతో కూడిన నిర్మాణం అని సామాజిక వ్యక్తులు గుర్తించాలని సిమ్మెల్ అన్నారు.

2. పరస్పరాధారిత సంబంధాల చట్రంలో వ్యక్తులు కర్తలుగానూ, కర్మలుగానూ కూడా ఉంటారు.

3. వ్యక్తులకు తమను తాము స్వయం సంపూర్ణంగా, స్వయం సంతృప్తికరంగా మార్చుకోవాలనే ఆకాంక్ష ఉంటుంది. అంటే వాళ్లు సమీకృత స్వీయ మానసిక భావనను కోరుకుంటారు. అదే విధంగా, సమాజం కూడా తన సొంత సమగ్రతవైపు ప్రయాణిస్తూ ఉంటోంది. అయితే వ్యక్తి సమగ్రత, సమాజ సమగ్రత చాలా తరచుగా వ్యతిరేకించుకుంటూ ఉంటాయి.

## 10.4 సామాజికశాస్త్ర విభజన

సామాజికశాస్త్ర ప్రాతిపదికల గురించి అత్యున్నతస్థాయి అమూర్త విశ్లేషణలు చేసిన సిమ్మెల్ మొత్తంగా సాధారణీకరించిన సామాజిక శాస్త్రం ఒకవైపునా, ఒకరకమైనజీవి విధానాన్నీ, దాని ప్రత్యేక లక్షణాలను అధ్యయనం చేసే సామాజికశాస్త్రం మరొకవైపున ఉండే వీలు ఉంటుందని, రెండుకూడా సంబంధమైన దృక్పథాలే అవుతాయని, వాదించారు.

అయితే, సిమ్మెల్ రచనలలో మొట్టమొదట అత్యున్నతస్థాయిలో అమూర్తంగా వాదించిన , పూర్తి రూపపరమైన సామాజిక శాస్త్రం వైపు మొగ్గు కనబడుతుంది. ఆతర్వాత క్రమక్రమంగా ఆయన 'రూపవాద' సామాజిక శాస్త్రానికి, 'సాధారణ' సామాజిక శాస్త్రానికీ మధ్య తేడా చూపడం ప్రారంభించారు. ఆతర్వాత కాలంలో ఆయన మూడో సంవిధానాన్ని కూడా ప్రకటించి, దాన్ని 'తాత్విక సామాజిక శాస్త్రం' అని పిలిచారు.



BRAOU

'సామాజికీకరణ రూపాల అధ్యయనమే' రూపవాద సామాజిక శాస్త్రం అని సిమ్మెల్ నిర్వచించారు. ఇటువంటి సామాజిక శాస్త్రం అన్వేషణను ఆయన 'శుద్ధ సామాజిక శాస్త్రం' అని పిలిచారు. అది 'సామాజికీకరణకు సంబంధించిన కేవలమైన అంశాలను మాత్రమే' గ్రహించి, అధ్యయనం చేస్తుందని ఆయన అన్నారు. ఆయా సామాజికీకరణ రూపాల వెనుక ఉన్న వస్తువుల, సారాంశాల ప్రస్తావన లేకుండారూపాల అధ్యయనం చేయవచ్చునని సిమ్మెల్ చాలా ఉదాహరణలతో వివరించారు.

సామాజికశాస్త్రాన్ని కేవలం రూపాల అధ్యయనానికే పరిమితం చేయడం సంకుచితమైపోతుందని గుర్తించినందువల్ల, ఆతర్వాత కాలంలో సిమ్మెల్ సాధారణ సామాజిక శాస్త్రాన్ని అభివృద్ధి చేశారు. అయితే సాధారణ సామాజిక శాస్త్రం గురించి సిమ్మెల్ అవగాహన, రూపవాద సామాజిక శాస్త్రం గురించి ఉన్నంత స్పష్టంగా, సరళంగా ఉండదు. సాధారణ సామాజిక శాస్త్రం వివిధ వ్యవస్థల-అంటే సామాజికీకరణ నిర్మాణాల- ఏకత్వంపైన కేంద్రీకరిస్తుంది. 'రాజకీయాలకు, మతానికి, అర్థశాస్త్రానికి, చట్టానికి, సంస్కృతీ శైలులకు, భాషకు, తదితరమైన ఎన్నో అంశాలకు సంబంధించిన వాస్తవాలను విశ్లేషించాలంటే వాటిని వైయక్తిక విజయాలుగానో, సొంత వస్తుగత ప్రాముఖ్యత రీత్యానో కాక, సమాజ పరిణామ ఫలితాలుగానే అర్థం చేసుకోవలసి ఉంటుందని సిమ్మెల్ అన్నారు.

సాధారణ సామాజిక శాస్త్రం గురించి సిమ్మెల్ చేసిన విశ్లేషణ నిర్దిష్టంగా లేకపోవడం వలన సమకాలీన సామాజిక శాస్త్రవేత్తలు ఎవరూ దానిని గుర్తించజాలదు. సిమ్మెల్ కూడా చారిత్రక పరిణామాన్ని వివరించడానికి సమాజాన్ని మొత్తంగా ఒక వ్యవస్థగా అధ్యయనం చేయడానికి మాత్రమే ఈ భావనను ప్రవేశపెట్టారు.

సిమ్మెల్ ప్రవేశపెట్టిన మూడో భావన తాత్విక సామాజిక శాస్త్రం. సామాజిక శాస్త్రానికి, జ్ఞాన సిద్ధాంతానికీ సన్నిహిత మయిన సంబధం ఉన్నదనే అవగాహన వలన సిమ్మెల్ ఈ సామాజిక శాస్త్ర శాఖను కనిపెట్టారు. సామాజిక జ్ఞానాన్ని రూపొందించే ముందస్తు ఊహలు, ప్రాతిపదికలు మొదలైన వాటిని తాత్విక సామాజిక శాస్త్రం విశ్లేషిస్తుందని ఆయన అన్నారు. వ్యక్తికి సమాజానికి ఉండే సంబంధం గురించి విభిన్న చారిత్రక దశలలో విభిన్న భావనలు, నమూనాలు రూపొందాయని సిమ్మెల్ గుర్తుచేస్తారు. ఉదాహరణకు వ్యక్తి సమాజం నుంచి సాపేక్షికంగా వేరుపడి ఉండడమే అవసరం. వాంఛనీయము అని 18వ శతాబ్ది మేధావులు భావించేవారు. 19వ శతాబ్ది చివరికల్లా ఎందరో విద్యావంతులు తమను తాము స్వతంత్ర వ్యక్తులుగా చూసుకోవడం మాత్రమేకాక, ఇతర వ్యక్తులతో భిన్నమైన వారిగా చూసుకోవడం మొదలుపెట్టారు. ఇటువంటి సంబంధ విశ్లేషణ, సైద్ధాంతీకరణ సామాజిక శాస్త్ర అధ్యయనంలో భాగమైనప్పుడు అవి అనుభవ వాద అన్వేషణలకన్నా హెచ్చుగా తాత్విక అన్వేషణ నుంచి వెలువడుతాయని సిమ్మెల్ భావించారు. తాత్విక విశ్లేషణకు, అనుభవవాద అన్వేషణకు వైరుధ్యం ఉండనక్కరలేదని, తాత్విక అన్వేషణ కూడా అనుభవ సంపదకు దారితీయవచ్చునని సిమ్మెల్ భావించారు. ఇటువంటి విశ్లేషణనంతా తాత్విక సామాజిక శాస్త్రం అనే ప్రత్యేక శాఖగా ఆయన నిర్ధారించారు.

BRAOU

## 10.5 సామాజిక నమూనాలు

సిమ్మెల్ రూపొందించిన సైద్ధాంతిక సామాజిక శాస్త్రంలో ఆసక్తికరమైన అంశం ఆయన వివరించిన సామాజిక నమూనాల అవగాహన. ఈ సామాజిక నమూనాలు పైన వివరించిన సామాజిక ప్రాతిపదికలనుంచి. సామాజిక రూపాలనుంచి తార్కికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఒకర్ని విశిష్ట, ప్రత్యేక, వ్యక్తిగత లక్షణాలను మనం సాధారణంగా ఆయా వ్యక్తుల స్వీయ మానసికతగా, మనఃప్రవృత్తిగా భావిస్తుంటాము. కానీ సిమ్మెల్ వాదనలో ఇటువంటి సామాజిక నమూనాలన్నీ ప్రత్యేక సామాజికరణ రూపాల ఉత్పత్తులే. అపరిచితుడు, పిసినారి, వ్యర్థపరుడు, మందబుద్ధి, కులుకులాడి లాంటి సామాజిక నమూనాలను తీసుకుని సిమ్మెల్ ఆయా వ్యక్తుల సామాజిక సంసర్గం ఆ వ్యక్తుల అభివృద్ధికి గల అవకాశాలను ఎట్లా పెంపొదిస్తుందో, ఎట్లా పరిమితం చేస్తుందో, దిశానిర్దేశనం చేస్తుందో వివరించాడు.

ఏ సామాజిక వాతావరణంలో అయినా అపరిచితులు లేదా కొత్త మనిషి అనే నమూనాలు సాధారణ నమూనాలని సిమ్మెల్ వివరించారు. బయటినుంచి వచ్చిన వ్యక్తిని, తమ సమాజంలో ఇమడని వ్యక్తిని ఈ నమూనాతో గుర్తించడం

అన్ని సమాజాలలో ఉన్న అలవాటే. ఈనమూనాను సిమ్మెల్ ప్రతిపాదించిన మూడు సామాజిక ప్రాతిపదికల నుంచి కూడా అర్థం చేసుకోవచ్చు. వ్యక్తులందరూ ఏకకాలంలో సమాజంలోపల, బయట కూడా ఉంటారని అన్నట్టుగానే ఈ కొత్త మనిషికూడా భౌతికంగా ఒక బృందంలో ఉన్నప్పటికీ, మానసికంగా ఆ బృందానికి బయట ఉంటాడు. వ్యక్తులు సామాజిక సంబంధాల చక్రానికి కర్తలుగానూ, కర్మలుగానూ ఉంటారని అన్నట్టుగానే ఆ బృందంలోని వ్యక్తులు కొత్త మనిషి తమలాంటి లక్షణాలు ఉన్నవాడిగానూ చూస్తారు. భిన్న మయినవాడిగానూ చూస్తారు. అతనిలో తమకు తెలిసినదీ ఉంటుంది. నిగూఢమైనదీ ఉంటుంది. మొత్తంగా బృందం ఒక కొత్త మనిషిని కర్తగా కన్న ఎక్కువగా కర్మగా చూస్తుంది. మరోవైపు నుంచి ఆ కొత్త మనిషి ఈ బృందాన్ని బయటినుంచి, దూరం నుంచి, వస్తుగతంగా చూడడం వలన, నిష్పాక్షికంగా ఉండటం వలన ఈ బృందంలోని వ్యక్తులందరూ అతనితో తమ రహస్యాలు పంచుకోదలుచుకుంటారు. ఆరకంగా కొత్త మనిషి కర్త కూడా అవుతాడు.

ఈ అధ్యయనాన్ని ఏ సామాజిక నమూనాకైనా విస్తరించవచ్చునని, సామాజికీకరణ గురించి, సామాజిక ప్రాతిపదికల గురించి తన విశ్లేషణలను అనువర్తింపచేయవచ్చునని సిమ్మెల్ వివరించారు. ఒకే సామాజికీకరణ రూపానికి రెండు ముఖాలుగా పరస్పర విరుద్ధమైన సామాజిక నమూనాలు రూపొందే అవకాశం ఉందని కూడా సిమ్మెల్ భావించారు.

## 10.6 సామాజిక జీవితంలో సంఖ్యాపాత్ర

సిమ్మెల్ విశ్లేషణల్లో మరొక ఆసక్తికరమైన, చర్చనీయాంశమైనది సామాజిక సంబంధాల్లో సంఖ్యకు, పరిమాణానికి ఉన్న పాత్ర గురించి ఆయన చేసిన అన్వేషణ. 'సమూహం గురించిన పరిమాణాత్మక అంశాలు' అనే వ్యాసంలో ఆయన తన లక్ష్యంగా ఎంచుకున్న సామాజిక జీవితపు వ్యాకరణం రాయడం అనేదానికి చాలా దగ్గరగా వచ్చారు. సామాజిక సంబంధాల మీద అందులో భాగస్వాముల సంఖ్య ఎటువంటి ప్రభావం వేస్తుందనే విషయం ఈ వ్యాసంలో ఆయన వివరించారు. సామాజిక సంబంధాలను ఆయన ఇద్దరు సభ్యుల సంబంధంగానూ, ముగ్గురు సభ్యుల సంబంధంగానూ విశ్లేషించి ఆ విశ్లేషణను చిన్న సమూహాల, పెద్ద సమూహాల అవగాహనకు ప్రాతిపదికగా మార్చారు.

ఇద్దరు సభ్యుల సంబంధం మిగిలిన అన్ని బృంద రూపాలకన్నా, గుణాత్మకంగా విభిన్నమైనదని సిమ్మెల్ అన్నారు. ఇటువంటి సంబంధంలో ఒక భాగస్వామి మరొక భాగస్వామిని ఎదుర్కొంటాడు. సమూహాన్ని కాదు. ఈ బృందం పూర్తిగా ఇద్దరు భాగస్వాముల మీదనే ఆధారపడుతుంది. కనుక ఒక్కరు విరమించుకున్నా బృందం అంతమయిపోతుంది. ఈ బృందం సజీవంగాఉండాలంటే ఇద్దరు కావాలి. అంతరించిపోవాలంటే మాత్రం ఒక్కరి నిర్ణయం చాలు. అని సిమ్మెల్ వ్యాఖ్యానించారు.

అందువల్ల ఇద్దరు సభ్యుల బృందానికి వ్యక్తిని మించిన జీవితం ఉండజాలదు. ఇతర అన్ని బృందాలలోనూ అవతలి వ్యక్తి ఎటువంటి నిర్ణయం తీసుకున్నా బృందం జీవితానికి ప్రమాదం లేదనే సంతృప్తి, భరోసా ప్రతీ సభ్యుడికీ ఉంటుంది. ఇద్దరు సభ్యుల బృందంలో ఇటువంటి భరోసా లేకపోవడం అనే ప్రతికూల అంశమే ఆ బృందం ఇంకా ఎక్కువ ఉద్వేగపూరితం కావడానికి, బాధ్యతాయుతం కావడానికి అంటే అనుకూల అంశాలవైపు దారితీస్తుంది.

ఇద్దరు సభ్యుల బృందం అలా ముగ్గురు సభ్యుల బృందం అయ్యేసరికి ఒక కొత్త మనిషి చేరాడనే ప్రధాన అంశమే ఆ బృందాన్ని గుణాత్మకమైన మార్పుకు గురిచేస్తుంది. ముగ్గురు సభ్యుల బృందలో ప్రతీ భాగస్వామి తన మాటను అవతలి వాళ్లు ఏకమై ఓడించే అవకాశం ఉందని అనుమానంతో ఉంటాడు. అంటే బృందం వ్యక్తిమీద ఆధిపత్యం చెలాయిస్తుంది. సామూహిక అవసరాల కోసం వ్యక్తి తన ఇష్టాయిష్టాలను పక్కనపెట్టవలసి వస్తుంది. ఇద్దరు సభ్యుల బృందంలోనైతే ఇద్దరూ పరస్పరం బాధ్యతలు పంచుకుని, ఇచ్చిపుచ్చుకోవడం మీద ఆధారపడతారు. కానీ ముగ్గురు సభ్యుల బృందంలో ఏ ఇద్దరైనా ఏకమై మూడో భాగస్వామిమీద బాధ్యతలు మోపుతారనే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. ముగ్గురు సభ్యుల బృందంలో అమలయ్యే వాతావరణాన్ని మొత్తంగా సామాజిక జీవితానికి అన్వయించవచ్చునని సిమ్మెల్ భావించారు. ముగ్గురు సభ్యుల బృందంలో జరిగే వ్యవహారం సామాజిక నాటకానికి సరళీకృత రూపమని, స్వేచ్ఛకు, నిర్బంధానికి, స్వయంప్రతిపత్తికి, సామూహికతకు మధ్య ఉండే ఐక్యతా ఘర్షణలకు



BRAOU

అది నిదర్శనమని ఆయన అన్నారు.

ముగ్గురు సభ్యుల బృందంలో సామాజిక సంబంధాలలో వచ్చే మార్పులు కూడా విస్తృత మైనవని సిమ్మెల్ వివరించారు. మూడు ముఖ్యమైన పరిణామాల గురించి ఆయన చర్చించారు. మూడో వ్యక్తి ప్రవేశించగానే అతను మిగిలిన ఇద్దరికీ మధ్య మధ్యవర్తిగా ప్రవర్తించే అవకాశం ఉంది. బృందాన్ని చీల్చే అవకాశం ఉన్న ఆ ఇద్దరు సభ్యుల ఆవేశాలను అదుపులో పెట్టడం ద్వారా బృందం జీవితానికి హామీ పడే అవకాశం ఉంది. రెండో పరిణామంగా ఆ మూడో వ్యక్తి మిగిలిన ఇద్దరి మధ్య ఉన్న ఘర్షణలను తన ప్రయోజనాలకోసం వాడుకునే అవకాశం ఉంది. మూడో పరిణామంగా ఆ మూడో వ్యక్తి ఆ ఇద్దరి మధ్య విభజించి పాలించే ఎత్తుగడ అమలు చేసి తానే ఆధిపత్యం వహించే అవకాశం ఉంది.

సిమ్మెల్ తన మౌలిక చర్చను ఇద్దరు సభ్యుల బృందం, ముగ్గురు సభ్యుల బృందం అని విశ్లేషించినప్పటికీ దానిని విస్తరించి చిన్న బృందానికి, పెద్ద బృందానికి కూడా అన్వయించారు. చిన్న బృందంలో వ్యక్తుల భాగస్వామ్యం హెచ్చుస్థాయిలో ఉండటానికి, పెద్ద బృందంలో సభ్యుల మధ్య దూరం, ఒంటరితనం, విభజన పెరగడానికి కారణాలను కూడా ఆయన విశ్లేషణలో చర్చించారు.

## 10.7 సంస్కృతి

సిమ్మెల్ ఆలోచనా ధారలో ఒక ముఖ్యమైన భాగం ఆయన సంస్కృతి గురించి ప్రకటించిన అభిప్రాయాలు. ద్రవ్య ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న ఫలితంగా ఏర్పడిన ఆధునిక పరాయీకరణ పరిస్థితులు, సాంస్కృతిక అభివృద్ధికి సంబంధించిన వృత్తులు, ప్రత్యేక నైపుణ్యాలు సంస్కృతిలో మార్పులకు కారణం అవుతున్నాయని ఆయన భావించారు. సంస్కృతికి సంబంధించిన ప్రతీ అంశమూ తనదైన సొంత అస్తిత్వాన్ని, అభివృద్ధిని సాధిస్తుందని తద్వారా అది ఒకదానితో ఒకటి సంబంధంలేని పరస్పర భిన్నమయిన ప్రత్యేక అంశాలను సృష్టిస్తుందని, సిమ్మెల్ అన్నారు. ఆధునిక సమాజంలో వ్యక్తులు తమ చుట్టూ బహు సంఖ్యాకమయిన సాంస్కృతిక వస్తువులను చూస్తూ ఉంటారని, కానీ వాటిని తమ జీవితాలకు అర్థవంతంగా అనుసంధానించుకోలేకపోతారని, అదే సమయంలో వారు వాటిని విస్మరించటం కూడా సాధ్యం కాదని ఆయన అన్నారు. అందువలన వ్యక్తులు తప్పనిసరిగా సాంస్కృతిక పరాయీకరణకు గురవుతారని, తమ వ్యక్తిత్వాలను సృజనాత్మకమయిన, అర్థవంతమయిన సంపూర్ణ వ్యక్తిత్వాలుగా తీర్చిదిద్దుకోలేని సాంస్కృతిక దారిద్ర్యంలో పడతారని సిమ్మెల్ భావించారు. ఈ సాంస్కృతిక పరాయీకరణకు బాధ్యత వహించవలసినది పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, శ్రమ విభజన అని సిమ్మెల్ వివరించారు.

సిమ్మెల్ సంస్కృతిక పరాయీకరణ గురించి వివరించిన అంశాలు మార్క్స్ పరాయీకరణ సిద్ధాంతంతో దాదాపుగా సరిపోతాయి. కానీ కీలకమయిన భేదం ఏమంటే పరాయీకరణను అధిగమించడం సాధ్యమని మార్క్స్ భావించగా, పరాయీకరణ శాశ్వతమని, సమసిపోదనీ సిమ్మెల్ భావించారు.

ఆధునిక సమాజంలో నగరజీవితం, మానసిక జీవితం క్లిష్టమైన సంస్కృతికి దారితీస్తాయని సిమ్మెల్ అనేక ఉదాహరణలతో వివరించారు. వేలాది విభిన్న వ్యక్తులలో విభిన్నంగా కనబడే నగరజీవి తోటి మనుషులతో, పరిసరాలతో ప్రవర్తించే తీరు ఒక ప్రత్యేక వైఖరికి చిహ్నమని సిమ్మెల్ అన్నారు. నిర్లక్ష్యం, అసహనం, నిర్దాక్షిణ్యం, తనగురించి తాను మాత్రమే పట్టించుకునే అత్యున్నత వైయక్తికత నగర సంస్కృతిగా మారిపోతుంది. ఈ సంస్కృతిలో మనిషి తోటిమనుషులతో సంపూర్ణంగా ఉద్వేగభరితంగా దయాళువుగా ఉండే స్థితినుంచి దిగజారిపోతాడు.

ఈ సాంస్కృతిక పరిణామాలకు మూలకారణం ద్రవ్య ఆర్థిక వ్యవస్థలో ఉందని సిమ్మెల్ భావించారు. ద్రవ్యతత్వ శాస్త్రం అనే గ్రంథంలో ఆర్థిక నియమం కూడా సామాజిక సంసర్గానికి ఒక వ్యక్తీకరణ రూపమేనని సిమ్మెల్ వాదించారు. వస్తుమార్పిడి పద్ధతిని రద్దుచేసి ద్రవ్య లావాదేవీలు ఉనికిలోకి వచ్చిన తరువాత సామాజిక జీవుల మధ్య సంబంధాలలో గణనీయమైన మార్పులు వచ్చాయి. మనుషుల మధ్య సంబంధాలను నిర్ణయించే పాత్రను డబ్బు చేపట్టినప్పుడు అంతకు ముందువరకు మనుషుల మధ్య ప్రత్యేక లక్ష్యాలకోసం ఉన్న సన్నిహిత సంబంధాలు శిథిలమై



BRAOU

పోతాయి. కుటుంబ బంధాలు గానీ, సౌందర్యారాధన వంటి గుణాత్మకమయిన బంధాలు గానీ రద్దయిపోయి సామాజిక జీవితాన్ని లాభనష్టాల లెక్కలు ఆక్రమిస్తాయి. ఆధునిక సమాజంలో డబ్బుకు విలువ ప్రమాణంగా, వినిమయ సాధనంగా ఆర్థిక విధులు మాత్రమే కాక సామాజిక విధులు వచ్చి చేరుతాయి. ఉద్వేగము, ఊహల స్థానంలో హేతుబద్ధత, అపరిచితతత్వము వచ్చినిలుస్తాయి.

## 10.8 సారాంశం

సిమ్మెల్ సామాజిక శాస్త్ర ఆలోచనల్లో క్రమబద్ధత లేదని, పరస్పర విరుద్ధమయిన భావనలు ఉన్నాయని విమర్శలు వచ్చినప్పటికీ మొత్తంగా సామాజిక శాస్త్రానికి సిమ్మెల్ అందించిన సేవలు గణనీయమైనవి. కొందరు సామాజిక శాస్త్రవేత్తల దృష్టిలో సిమ్మెల్ అవగాహనలకు, దుర్ఖైమ్ సామాజిక నిర్మాణం గురించి, పెద్ద సంస్థల గురించి, మతం గురించి, విద్యా వ్యవస్థ గురించి, సమాజాన్ని, మనుషులను కలిపి ఉంచే విలువల గురించి అధ్యయనం చేయగా, సిమ్మెల్ సూక్ష్మ సామాజిక వ్యవస్థల మీద దృష్టి పెట్టారు. సామాజిక పరిణామ క్రమాల గురించి ఆయన కేంద్రీకరించారు. విడి విడి వ్యక్తులు ఏ సంబంధాల క్రమాలలోకి, ఏ ప్రవర్తనల్లోకి ఎందుకు వస్తారో ఆలోచించడం ద్వారా సామాజిక ప్రపంచపు నిర్మాణం గురించి, పునర్నిర్మాణం గురించి ఆయన ఆలోచించారు. ఆయన ప్రతిపాదించిన రూపవాద సామాజిక శాస్త్రం, సామాజిక శాస్త్రంలో గణితశాస్త్రపు పాత్ర ఆ తరువాతి పరిశోధకులకు విలువైన ప్రేరణలను అందించాయి.

ప్రత్యక్షంగా తన రచనల ద్వారాగానీ, పరోక్షంగా రాబర్ట్ పార్క్, లూయిస్ విర్త్, ఎవరెట్ సీ హ్యూస్, థియోడర్ మిల్స్, రాబర్ట్ కె. మెర్టన్ వంటి సామాజిక శాస్త్రవేత్తల రచనల్లోను సిమ్మెల్ ఆలోచనలు ఇప్పటికీ ప్రభావం చూపుతున్నాయి.

BRAOU

## 10.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. ఘర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించడంలో జార్జ్ సిమ్మెల్ చేసిన కృషిని తెలుపండి.

2. సామాజిక శాస్త్ర విభజన ఆశాస్త్ర అభివృద్ధికి ఏవిధంగా దోహదపడిందో వివరించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సామాజికీకరణ భావన గురించి తెలుపండి.

2. సిమ్మెల్ ఆలోచనాధోరణిలో సంస్కృతిని తెలుపండి.

## 10.10 చదవదగిన పుస్తకాలు


Francis, M. Abraham, : Modern Sociological Theory

Francis, M. Abraham, & John Morgan : Sociological Thought

# భాగం-11: రాల్ఫ్ డహ్రెన్ డార్ఫ్

**విషయక్రమం**


11.0 ఉద్దేశాలు

11.1 పరిచయం

11.2 జీవితవిశేషాలు

11.3 వ్యవస్థాత్మక మార్పులు

11.4 సమన్వయ సంబంధాలు

11.5 అధిపత్యం

11.6 సారాంశం

11.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

11.8 చదవదగిన పుస్తకాలు


## 11.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివినతర్వాత మీరు

- పారిశ్రామిక సమాజంలో ఘర్షణ సిద్ధాంత వివరణకు రాల్ఫ్ డాహ్రెన్ డార్ఫ్ చేసిన కృషిని తెలుసుకుంటారు.
- రాల్ఫ్ ప్రవేశపెట్టిన సమన్వయ సిద్ధాంతాన్ని తెలుసుకుంటారు.
- సామాజిక మార్పులను, ఘర్షణలను, హింసను విశ్లేషించడంలో రాల్ఫ్ చేసిన సూత్రీకరణలు పరిశీలిస్తారు.

BRAOU

## 11.1 పరిచయం

సమాజానికి ఎల్లప్పుడూ రెండు ముఖాలుంటాయని ఒకటి ఘర్షణ రూపంలో మరొకటి సమ్మతి రూపంలో వ్యక్తీకరణ పొందుతాయని సూత్రీకరించడం ద్వారా డాహ్రెన్ డార్ఫ్ ప్రధానమైన సామాజిక శాస్త్ర సిద్ధాంత వేత్తగా ముందుకు వచ్చారు. సామాజిక శాస్త్ర సిద్ధాంతం ఘర్షణ సిద్ధాంతంగానూ, సమ్మతి సిద్ధాంతంగానూ రెండు రకాలుగా ఉండక తప్పదని ఆయన వాదించారు. ఘర్షణ-సమ్మతి రెండూ ఒకదానికొకటి ముందు షరతులని, అవి రెండూ లేకుండా సమాజం ఉనికిలో ఉండదని ఆయన అన్నారు. ముందు సమ్మతి లేకుండా, ఐక్యత లేకుండా ఘర్షణే తలెత్తదని వాదిస్తూ ఫ్రెంచ్ గృహిణులకు, షిలియన్ చదరంగ క్రీడాకారులకూ మధ్య ఘర్షణ తలెత్తే అవకాశమే లేదని, ఎందుకంటే అంతకుముందు వారి మధ్య ఎటువంటి ఐక్యతా, సమ్మతీ, సమన్వయం లేవని ఆయన అన్నారు. అదే విధంగా ఘర్షణ నుంచి ఏకీభావం, సమన్వయం కూడా తలెత్తవచ్చునని ఆయన అన్నారు.

ఏకీభావానికి, ఘర్షణకూ మధ్య పరస్పరం సంబంధం ఉన్నప్పటికీ రెండు క్రమాలను, కలగలిపి చూసే ఒకే సామాజిక శాస్త్ర సిద్ధాంతాన్ని తయారుచేయడం సాధ్యం కాదని డాహ్రెన్ డార్ఫ్ భావించారు. అందువల్ల ఆయన ప్రధానంగా సామాజిక ఘర్షణ సిద్ధాంతాన్ని రూపొందించడానికి పూనుకున్నారు.

డాహ్రెన్ డార్ఫ్ ప్రతిపాదించిన సామాజిక ఘర్షణ సిద్ధాంతంలో మూడు అంశాలు ప్రధానమైనవి. అవి:

1. మార్క్స్ చెప్పిన ఘర్షణ సిద్ధాంతానికి భిన్నంగా, వ్యతిరేకంగా, మార్క్స్ అనంతర కాలపు వ్యవస్థాపక మార్పుల

గురించి డాహ్రెన్ డార్ఫ్ చేసిన విశ్లేషణలు.

2. ప్రధానంగా సామాజిక ఘర్షణను అధ్యయనం చేసినప్పటికీ సమన్వయం మీద హెచ్చు శ్రద్ధతో ఆయన చేసిన నిర్ధారణలు.

3. సమాజంలో ఆధిపత్యం పాత్ర గురించి, ఆధిపత్యం వ్యక్తమయ్యే వివిధ రూపాల గురించి ఆయన చేసిన సూత్రీకరణలు.

## 11.2 జీవిత విశేషాలు

రాల్ఫ్ గుస్తావ్ డాహ్రెన్ డార్ఫ్ జర్మనీలోని హంబర్గ్‌లో 1929లో జన్మించారు. హంబర్గ్ విశ్వవిద్యాలయంలోను, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లోనూ విద్యనభ్యసించారు. 1950, 60 దశాబ్దాలకాలంలో జర్మనీ, అమెరికాలలో ఎన్నో అధ్యాపక స్థానాలు చేపట్టారు. 1970 నుంచి 74 వరకు యురోపియన్ కమ్యూనిటీ కమిషన్ సభ్యులుగా ఉన్నారు. 1974లో బ్రిటన్ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్ డైరెక్టర్ పదవిని చేపట్టి 1984 వరకు ఆ పదవిలో కొనసాగారు. 1987లో ఆక్స్‌ఫర్డ్‌లోని సెయింట్ ఆంటోనీస్ కాలేజ వార్డెన్‌గా నియమితులయ్యారు. 1982లో 'నైట్' బిరుదును స్వీకరించారు. 1993లో డాహ్రెన్ డార్ఫ్ 'లైఫ్ పీర్'గా నియమితులయ్యారు.

## 11.3 వ్యవస్థాపక మార్పులు

వర్గ సంఘర్షణ ప్రాధాన్యత గురించి దాని విప్లవాత్మక స్వభావం గురించి మార్క్స్ అతిగా ఊహించాడని డాహ్రెన్ డార్ఫ్ మార్క్స్ సిద్ధాంతాన్ని తిరస్కరించాడు. వర్గ 'వైరుధ్యం', హింసాత్మక, ఆకస్మిక మార్పులకు దారితీస్తుందనే మార్క్స్ భావనను విమర్శిస్తూ సమాజానికి క్రమానుగతంగా శాంతియుతంగా మార్పుచెందే అవకాశాలున్నాయని డాహ్రెన్ డార్ఫ్ భావించారు.

BRAOU

మార్క్స్ ప్రతిపాదించిన వర్గ విభజనకు మూలాలు 19వ శతాబ్దపు సామాజిక పరిస్థితులలో ఉన్నాయని అందువల్ల ఆ విభజన 20వ శతాబ్దపు పరిస్థితులకు సరిపోదని డాహ్రెన్ డార్ఫ్ భావించారు. మార్క్స్ భావనలో ఆస్తిని సంకుచితంగా, చట్టపరంగా మాత్రమే వ్యాఖ్యానించడం జరిగిందని, ఆస్తి యాజమాన్యం ఎవరిదనే ప్రశ్నకన్నా, ఉత్పత్తి మీద ఆధిపత్యం ఎవరిదనే ప్రశ్న ముఖ్యమైనదని డాహ్రెన్ డార్ఫ్ వాదించారు.

ఈ ప్రాతిపదికతో డాహ్రెన్ డార్ఫ్ పెట్టుబడిదారీ అనంతర సమాజాలలో ఎన్నో వ్యవస్థాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని వాదించారు. ఆ మార్పులలో యాజమాన్యానికీ, అదుపునకూ మధ్య విభజన పెట్టుబడి విశీర్ణమైపోవడం, శ్రమ కూడా విశీర్ణమై పోవడం, కొత్త మధ్య తరగతి పుట్టుకురావడం సామాజిక చలనం, సమానత్వం, సామాజిక ఘర్షణ వ్యవస్థీకృతం కావడం వంటి మార్పులను డాహ్రెన్ డార్ఫ్ ప్రస్తావించారు.

పాత కుటుంబ యాజమాన్య పరిశ్రమ అంతరించిపోయి సంయుక్త భాగస్వామ్యపు పారిశ్రామిక సంస్థలు రూపొందడం ఒక ముఖ్యమైన మార్పు అని అది పెట్టుబడి విశీర్ణమై పోయిందనడానికి గుర్తు అని డాహ్రెన్ డార్ఫ్ భావించారు.

ఆధిపత్యానికి మూలంగా ఆస్తి ఉండటం అనే అంశాన్ని అంగీకరిస్తూనే డాహ్రెన్ డార్ఫ్ ఆస్తి యాజమాన్యానికి, ఆధిపత్యానికి మధ్య తేడాను గుర్తించారు. 'ఆర్థిక రంగంలో పెట్టుబడి అంటే పెట్టుబడిదారీ విధానం అదృశ్యమైపోయి దాని స్థానంలో పాక్షికంగా భిన్నమైన బృందాలు ఎన్నో తలెత్తాయి'అని డాహ్రెన్ డార్ఫ్ వ్యాఖ్యానించారు.

ఇటువంటి పెట్టుబడి విశీర్ణంతోపాటే శ్రమకూడా విశీర్ణమైపోయిందని కార్మికవర్గం ఎన్నో విభజనలను గుర్తించింది [illegible] కార్మిక వర్గం అని నిర్వచించగలిగినదేదీ లేదని డాహ్రెన్ డార్ఫ్ అన్నారు. ఆ ధోరణిలోనే కొత్త

మధ్యతరగతి ఆవిర్భావాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

పారిశ్రామిక సమాజాలలో ఊర్ధ్వముఖ సామాజిక చలనం జరిగిందని, సామాజికంగా సమానత్వం పెరిగిందని కూడా ఆయన వాదించారు. సమకాలీన పారిశ్రామిక సమాజాలు పెట్టుబడిదారీ అనంతర సమాజాలుగా మారాయని గుర్తించాలని ఆయన అన్నారు. ఈ సమాజాలలో అధికారం, ఆధిపత్యం, ఘర్షణ ఉండవచ్చుగానీ అవి దోపిడీ సంబంధాలు కావని కూడా ఆయన భావించారు.

## 11.4 సమన్వాయ సంబంధాలు

పెట్టుబడిదారీ అనంతర సమాజాలను కలిపి ఉంచే సూత్రం సమన్వయ సంబంధం అని డాహ్రెన్ డార్ఫ్ భావించారు. "రాజ్యం, చర్చి, సంస్థ, రాజకీయపార్టీ, కార్మికసంఘం, చదరంగ క్రీడాకారుల బృందం వంటివన్నీ ఒకే రకమయిన సమన్వయ సంబంధాన్ని సూచించే సంస్థలు" అని డాహ్రెన్ డార్ఫ్ వివరించారు. ఈ సంఘాలలోనే అధికారం ఉన్నవారికీ, లేనివారికి మధ్య ఘర్షణ తలెత్తుతుందని ఆయన భావించారు. కొన్ని సంఘాలలో అధికారంలో ఉన్నవాళ్లు, మరికొన్ని సంఘాలలో అట్టడుగున ఉండవచ్చునని, ఆవిధంగా పాత్రలు మారుతూ ఉంటాయని ఆయన భావించారు. "పరిశ్రమలో అధికారం, రాజ్యంలోనూ, చర్చిలోనూ, ఇతర సంఘాలలోనూ అధికారం కానక్కరలేదు. అందువల్ల ఒక సమాజానికి మొత్తంగా చూసినప్పుడు పోటీపడుతున్న అధికారాల లేదా విధేయతల బహుళత్వ చిత్రం కనబడుతుంది" అని డాహ్రెన్ డార్ఫ్ భావించారు.

వివిధ సంఘాలు, అధికారపు బహుళత్వం అనే భావనలను ప్రవేశపెట్టడం ద్వారా డాహ్రెన్‌డార్ఫ్ పాలకవర్గం అనే భావనను చర్చచేసి బహుళ పాలక బృందాల సంఘాలను ఉనికిలోకి తేగలుగుతారు.

అనివార్య సమన్వయ సంబంధంగా ఏర్పడే సంఘాల గురించి అటువంటి సంఘాలతో కూడిన సమాజం గురించి చర్చించిన డాహ్రెన్‌డార్ఫ్ తన సిద్ధాంతాన్ని నాలుగు ప్రతిపాదికలుగా ముందుకు తెచ్చారు. అవి:

1. ప్రతీ అనివార్య సమన్వయ బృందంలోనూ అనుకూల, ప్రతికూల అధికార పాత్రలు రెండూ పరస్పర భిన్నమైన ప్రయోజనాలు గల బృందాలవంటి సమూహాలను తయారు చేస్తారు.

2. ఈ అనుకూల ప్రతికూల అధికార పాత్రలు నిర్వర్తించే పరస్పర వ్యతిరేక అర్థ బృందాల సభ్యులు తమలోతాము సంఘటితమై తమ ప్రయోజనాలను వ్యక్తీకరిస్తారు.

3. ఈ విధంగా పుట్టుకువచ్చే ప్రయోజన బృందాలు యథా స్థితిని కొనసాగించడానికి గానీ, మార్చడానికి గానీ నిరంతర ఘర్షణలో ఉంటాయి.

4. అధికార సంబంధాలను మార్చడంద్వారా ఈ ప్రయోజన బృందాల మధ్య ఘర్షణ మొత్తంగా సామాజిక సంబంధాల వ్యవస్థను మారుస్తుంది.

డాహ్రెన్‌డార్ఫ్ సామాజిక శాస్త్ర సిద్ధాంతాల గురించి వివరిస్తూ సమకాలీన సామాజిక శాస్త్రంలో రెండు మహాసిద్ధాంత ధోరణులు ఉన్నాయని వ్యాఖ్యానించారు. అవి: 1. సమగ్రతా సిద్ధాంతం, 2. ఘర్షణ సిద్ధాంతం. ఈ రెండు సిద్ధాంతాలకూ గల మౌలిక ప్రాతిపదికలను డాహ్రెన్‌డార్ఫ్ సూత్రీకరించారు. ఆ సూత్రీకరణ ప్రకారం ఆయన తనను తాను పూర్తిగా ఏఒక్క శిబిరంలోనూ చూసుకోలేదు. రెండు సిద్ధాంతాలతోనూ సమస్యలు ఉన్నాయని విశ్లేషించారు.

## 11.5 ఆధిపత్యం

డాహ్రెన్‌డార్ఫ్ సామాజిక శాస్త్ర ఆలోచనలన్నింటికీ మౌలికమైనది ఆయనకు ఆధిపత్యం గురించి ఉన్న అవగాహన. సమాజంలో ఉన్న విభిన్నమయిన స్థానాలకు, విభిన్నమయిన ఆధిపత్య పరిమాణం ఉంటుందని భావించారు.



BRAOU

ఆధిపత్యమనేది వ్యక్తిలో ఉండదని, అవ్యక్తి చేపట్టే స్థానంలో ఉంటుందని అయన భావించారు. సంఘర్షణను విశ్లేషించడంలో మొదటి మెట్టు వివిధ ఆధిపత్య పాత్రలను గుర్తించడమేనని డా(హెన్‌డార్ఫ్ అన్నారు. భారీ స్థాయి వ్యవస్థలలో ఆధిపత్య పాత్రను అధ్యయనం చేసేటప్పుడు వ్యక్తుల స్థాయిలో కేంద్రీకరించడాన్ని అయన వ్యతిరేకించారు. ఉన్నత స్థానాలను అధిరోహించిన వ్యక్తుల గురించి అధ్యయనం చేసేటప్పుడు వారి మానసిక చిత్తవృత్తిని, ప్రవర్తనా సరళిని అధ్యయనం చేసే వారిని ఆయన విమర్శించారు. అలా చేయడం సామాజికశాస్త్ర ధర్మమే కాదని ఆయన భావించారు.

అధిపత్యం అనగానే అందులో అధికారి స్థానము, అధికార స్థానమూ, విధేయతా స్థానము, రెండూ ఉంటాయి. అధిపత్యస్థానాన్ని చేపట్టేవాళ్లు తన కింద విధేయులుగా ఉండే వారిమీద అధికారాన్ని నిర్వహించవలసి ఉంటుంది. అంటే ఆ వ్యక్తి మానసిక చిత్త వృత్తి ఎటువంటి దయినప్పటికీ ఆధిపత్య స్థానమే అతనికి కొన్ని విధులను నిర్ణయిస్తుంది. ఈ ఊహలు, అకాంక్షలు స్థానాల పట్లనే ఉంటాయి తప్ప వ్యక్తుల పట్ల కాదు. అధిపత్యమనేది సాధారణీకరించిన సామాజికాంశం కాదు. ఏ ఆధిపత్య స్థానపు పరిధి ఎంతటిదో కూడా నిర్ధారణ అయి ఉంటుంది. ఇటువంటి ఆధిపత్యం సాధికారకమైనది కనుక దాన్ని ఆమోదించకపోతే శిక్షలు కూడా ఉంటాయి.

ఆధిపత్యం స్థాననియతం కనుక అది అన్ని వేళలా నిశ్చలంగా ఉండదని కూడా డా(హెన్‌డార్ఫ్ వాదించారు. ఒక్క సామాజిక స్థితిలో ఆధిపత్యం వహించే వ్యక్తి, మరొక స్థితిలో ఆధిపత్యం వహించకపోవచ్చు. ఒకచోట అధికారి స్థానంలో ఉన్న వ్యక్తి మరొక చోట సేవక స్థానంలో ఉండవచ్చు.

ఈ అవగాహన నుండి రెండవ మెట్టుగా డా(హెన్‌డార్ఫ్ అనివార్యంగా సమన్వితమయిన సంబంధాల వ్యవస్థలు అనే అంశాన్ని ప్రతిపాదించారు. అధికారం- విధేయత అనే రెండు అంశాలు వేరువేరు సంఘాలలో వేరువేరుగా ఉనికిలో ఉంటాయి. కనుక ఈ ద్వైదీభావం అంతిమంగా ప్రయోజనాల ఘర్షణకు దారితీస్తుందని అందువల్ల రెండు రకాల బృందాలు ఏర్పడుతాయని డా(హెన్‌డార్ఫ్ అన్నారు.

మొత్తంగా ఒకే రకమయిన ప్రయోజనాలు గల స్థానాలలోని వ్యక్తుల సమూహాలు అర్థ బృందాలు, ఈ అర్థ బృందాలలోనుంచి సమీకరించబడిన వ్యక్తులతో నిర్మాణయుతమయిన ప్రయోజన బృందాలు, ఆ ప్రయోజనయుత బృందాలలోనుంచి నిజమయిన ఘర్షణకు దారితీసే ఘర్షణ బృందాలు రూపొందుతాయని డా(హెన్ డార్ఫ్ వివరించారు.

డా(హెన్‌డార్ఫ్ సంఘర్షణ సిద్ధాంతంలో ముఖ్యమైన అంశం ఘర్షణకు, మార్పుకు ఉండే సంబంధం. ఘర్షణ యథాస్థితిని కాపాడటానికి ఉపయోగపడుతుందని ప్రతిపాదించిన లూయిస్ కోసర్ కృషిని డా(హెన్ డార్ఫ్ ఆమోదించారు. అయితే అది ఘర్షణకు ఒక ముఖం మాత్రమేనని ఘర్షణ మార్పునకు, అభివృద్ధికి కూడా దారితీస్తుందని డార్ఫ్ భావిచారు.

BRAOU

## 11.6 సారాంశం

డా(హెన్ డార్ఫ్ సిద్ధాంతంపై తీవ్రమైన విమర్శలు వెలువడ్డాయి. ఆయన తనను తాను మార్క్సిస్టు ఆలోచనలను పరిపుష్టం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పుకున్నప్పటికీ, అయన మార్క్సిజం మీద చేసిన విమర్శలు మార్క్సిజాన్ని సరిగా అర్థం చేసుకుని చేసినవి కావని విమర్శకులు నిరూపించారు. మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని సామాజిక శాస్త్రానికి అన్వయించడానికి ప్రయత్నించిన సందర్భంలో కూడా ఆ ప్రయత్నం అసమగ్రంగా సాగిందని విమర్శకులు భావించారు.

ఘర్షణ సిద్ధాంతానికి మార్క్సిజంతోకన్నా హెచ్చుగా వ్యవస్థ విధినిర్ణాయక వాదంతో సంబంధం ఉన్నదని అందువల్ల డా(హెన్‌డార్ఫ్ విశ్లేషణ సఫలం కాలేదని విమర్శకులు భావించారు. డార్ఫ్ విశ్లేషణ సామాజిక జీవితంలోని ఒక భాగాన్ని మాత్రమే వివరించిందని భావించారు. డార్ఫ్ వైఖరి ప్రకారం ఘర్షణను వివరించడానికి ఘర్షణ సిద్ధాంతం, భద్రతను

వివరించాడనికి విధి నిర్ణాయక వాదం చేపట్టవలసి ఉంటుంది కనుక అది సవ్యమయిన విశ్లేషణ సంవిధానం కాజాలదని విమర్శకులు భావించారు.

## 11.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. వ్యవస్థాపక మార్పుల గురించి డార్ఫ్ విశ్లేషణలో వివరించండి.

2. డార్ఫ్ సమన్వాయ సంబంధాల గురిచి వివరంగా రాయండి.

**II. ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని డార్ఫ్ విమర్శించినతీరు ఏమిటి?

2. ఘర్షణగురించి డార్ఫ్ వైఖరి తెలుపండి?

## 11.8 చదవదగిన పుస్తకాలు


Francis, M. Abraham, : Modern Sociological Theory

Francis, M. Abraham, & John Morgan : Sociological Thought


BRAOU

# భాగం-12: లూయిస్ ఆల్‌ఫ్రెడ్ కోసర్

విషయక్రమం

12..0 ఉద్దేశాలు

12.1 పరిచయం

12.2 జీవిత విశేషాలు

12.3 సామాజిక ఘర్షణ సిద్ధాంతం

12.4 వ్యవస్థాపక పరిభాషలో ఘర్షణ సిద్ధాంతం

12.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

12.6 చదవదగిన పుస్తకాలు

## 12.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివినతర్వాత మీరు

- సామాజిక శాస్త్రంలో ఘర్షణ సిద్ధాంతం స్థానాన్ని అర్థం చేసుకుంటారు.
- సామాజిక ఘర్షణ సిద్ధాంతానికి కోసర్ విశ్లేషణను తెలుసుకుంటారు.
- ఈ సిద్ధాంతాన్ని వ్యవస్థాపక పరిభాషలో వివరించడానికి చేసిన ప్రయత్నాలను అర్థం చేసుకుంటారు.

BRAOU

## 12.1 పరిచయం

సామాజిక శాస్త్ర ఆలోచనాధారలో 'ఘర్షణ సిద్ధాంతం' అనే భావన ఒక అనిర్దిష్టమైన, సువిశాలమైన భావన. నిర్మాణం-వ్యవస్థాపక సిద్ధాంతం మీద సాగిన విమర్శలన్నింటినీ ఘర్షణ సిద్ధాంతంగానే గుర్తించడం ఒక ఆనవాయితీ అయినందువల్ల పరస్పర భిన్నమైన ఆలోచనలు ప్రకటించిన సిద్ధాంత వేత్తలందరినీ ఘర్షణ సిద్ధాంత కర్తలుగానే గుర్తించడం జరుగుతుంది. అన్ని రకాల మానవ సమాజాలలోనూ అంతర్గర్భితంగానే విలువల ప్రయోజనాల ఘర్షణ ఇమిడి ఉన్నదని నిర్మాణ-వ్యవస్థాపక సిద్ధాంత వేత్తలు ఆ ఘర్షణను గుర్తించలేదని ఘర్షణ సిద్ధాంతవేత్తలు అంటారు. ఒకవేళ ఘర్షణను గుర్తించినప్పటికీ, ఘర్షణను ద్వితీయ స్థాయిలోనే పరిగణిస్తారని, సమాజం ఉనికిలో ఉండడమే ఘర్షణ లేదనడానికి, ఏకీభావం ఉన్నదనడానికి సూచన అనుకుంటారని నిర్మాణ-వ్యవస్థాపక వాదులను ఘర్షణవాదులు విమర్శిస్తున్నారు. అవిధంగా సమాజంలో భిన్న ప్రయోజనాల మధ్య ఘర్షణ, ఒక వర్గం మీద మరొక వర్గపు దౌర్జన్యం కొనసాగుతుంటాయని ఘర్షణ సిద్ధాంత కర్తలు భావిస్తారు. ఘర్షణ సిద్ధాంత కర్తలలో మార్క్సిస్టుల నుంచి, బహుళవాద సిద్ధాంతవేత్తల వరకు అన్ని రకాల భావజాలాలకు చెందినవారు ఉన్నారు.

లూయిస్ ఎ.కోసర్ మార్క్సిజాన్ని అంగీకరించకుండానే ఘర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. కోసర్ కృషిలో ప్రధానాంశం అయిన ఘర్షణ సిద్ధాంతాన్ని పూర్తిగా భిన్నమైన వ్యవస్థాపక సిద్ధాంత పరిభావలో వివరించారు.

## 12.2 జీవిత విశేషాలు

సామాజిక శాస్త్రవేత్త లూయిస్ ఆల్‌ఫ్రెడ్ కోసర్ 1913లో జర్మనీలోని బెర్లిన్‌లో జన్మించారు. 1933 వరకు జర్మనీ

నుంచి బయటికి వచ్చారు. ఫ్రాన్స్‌లోని పారిస్‌లోగల సోర్బాన్ విశ్వవిద్యాలయంలో సామాజిక శాస్త్రం అభ్యసించారు. 1954 కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. స్టోనీబ్రూక్‌లోని స్టేట్ యునివర్శిటీ ఆఫ్ న్యూయార్క్‌లో చాలా సంవత్సరాలు సామాజిక శాస్త్రం బోధించారు. సామాజిక శాస్త్రం గురించి అనేక గ్రంథాలు రచించారు. డిసెంట్ అనే ప్రపంచ ప్రఖ్యాత సామాజిక శాస్త్ర పత్రికకు స్థాపక సంపాదకులుగా పనిచేశారు. అమెరికన్ సోషియలాజికల్ అసోసియేషన్‌కు అధ్యక్షుడుగా పనిచేశారు.

## 12.3 సామాజిక ఘర్షణ సిద్ధాంతం

సామాజిక ఘర్షణ సిద్ధాంతం సామాజికశాస్త్రంలో ప్రాచీన కాలంనుంచీ కూడా ఏదోఒక రూపంలో కొనసాగుతూ వస్తోంది. సాంప్రదాయక ప్రామాణిక గ్రంథాలలో ఘర్షణ సిద్ధాంతానికి సంబంధించి రెండు ప్రధానమైన ఆలోచనాధారలు కనబడుతున్నాయి.

మొదటిది-రాజకీయ తత్వశాస్త్రపు సంప్రదాయంలోని అధికార సంబంధాలలో వ్యక్తమైన ఘర్షణ సిద్ధాంతం. మాకియవెల్లి, బోడిన్, హాబ్స్, మెస్కా వంటి మేధావులు రాజకీయ వ్యవస్థలో ఘర్షణలను అధికార సంబంధాల దృష్ట్యా విశ్లేషించారు. అందువల్ల రాజ్యం ప్రధాన విశ్లేషణ వస్తువు అవుతుందని భావించారు.

రెండవది- సాంప్రదాయక అర్థశాస్త్రంలో పోటీ తత్వపు ఘర్షణ సంప్రదాయం. ఆడమ్‌స్మిత్, రాబర్ట్ మాల్థస్, వారిని అనుసరించిన ఎంతోమంది అర్థశాస్త్రవేత్తలు ఆర్థిక పోటీని ప్రధానంగా పరిశీలించి అదే ఘర్షణకు మూలమని భావించారు.

సామాజికశాస్త్రం అన్వేషించిన ఘర్షణ సిద్ధాంతం ఈరెండు మౌలిక ఆలోచనా ధోరణులనుంచి గ్రహిస్తూసాగింది. ఈ ఘర్షణ సిద్ధాంతాన్ని నిర్మించినవారిలో కార్ల్‌మార్క్స్ ప్రధాన మేధావి. కాగా, సిరైల్ మిల్స్, రాల్ఫ్ డాహ్రెన్‌డార్ఫ్, ఇర్వింగ్ లూయిస్ హోరోవిట్జ్, లూయిస్ ఎ. కోసర్, హెర్బర్ట్ మార్క్యూస్, రాండాల్ కాలిన్స్, ఆండ్రెగండర్ ఫ్రాంక్ వంటి సామాజిక శాస్త్రజ్ఞులు ఈ సిద్ధాంతాన్ని విస్తరించారు.

సామాజిక శాస్త్రానికి సంబంధించినంతవరకు రెండు ప్రధానమైన ఘర్షణలను గుర్తించడం జరుగుతున్నది. అవి అంతర్గత ఘర్షణలు, బాహ్య ఘర్షణలు. ఒక సమాజం లోపలినుంచే మార్పులకు దారితీసే ఘర్షణలను అంతర్గత ఘర్షణలుగా, ఒక సమాజానికి బైటినుంచిగానీ, సమాజాల మధ్యనుంచిగానీ సాగే ఘర్షణలను బాహ్య ఘర్షణలుగా విశ్లేషిస్తున్నారు. అంతర్గత ఘర్షణలు సమాజంలోపల మార్పుకోసం సహజంగా ఉండే కోర్కెలలో, సమాజంలో సంపద, అధికారం, హోదాల పంపిణీలో అసమానతకు వ్యతిరేకతలలో, విలువల చట్టాల వైవిధ్యంలో, ఆధిపత్య వ్యవస్థలో, వ్యక్తికీ సమాజానికీ మధ్య సంబంధంలో వ్యక్తం కావచ్చు. బాహ్య ఘర్షణలు యుద్ధాల రూపంలో, సాంస్కృతిక దురాక్రమణల రూపంలో, భావజాలాల ఘర్షణ రూపంలో వ్యక్తం కావచ్చు.

మొత్తం మీద సామాజిక శాస్త్రంలో ఘర్షణ సిద్ధాంతానికి ఆరు విభిన్న రూపాలున్నాయని సామాజిక శాస్త్ర చరిత్రకారులు విశ్లేషిస్తున్నారు. అవి:

1. ఫ్రాంక్‌ఫర్ట్ బృందానికి చెందిన విమర్శనాత్మక సిద్ధాంతం.

2. సిరైట్ మిల్స్, హోరోవిట్జ్‌లు ప్రతిపాదించిన నూతన, మౌలిక సామాజిక శాస్త్రం.

3. డాహ్రెన్ డార్ఫ్ ప్రతిపాదించిన గతితార్కిక సామాజికశాస్త్రం.

4. కోసర్ ప్రతిపాదించిన ఘర్షణ వ్యవస్థాపక వాదం.

5. కాలిన్స్ ప్రతిపాదించిన విశ్లేషణా ఘర్షణ సిద్ధాంతం.



BRAOU

6. కాఫ్లో ప్రతిపాదించిన రూపవాద ఘర్షణ సిద్ధాంతం.

ఈ విభిన్న సిద్ధాంతాలలోని విశిష్టతలు, లోపాలు ఏమైనప్పటికీ, ఘర్షణ సిద్ధాంతం ఒక గణనీయమైన, ప్రధానమైన సామాజిక విశ్లేషణా సిద్ధాంతంగా ఉపయోగపడుతుంది. సామాజికశాస్త్ర అన్వేషణలో ఘర్షణ సిద్ధాంతాన్ని ఒక సమర్థమైన ప్రక్రియగా ఉపయోగించుకునే కృషి ఇంకా జరగవలసినంతగా జరుగలేదు.

## 12.4 వ్యవస్థాపనా పరిభాషలో ఘర్షణ సిద్ధాంతం

ఘర్షణ సిద్ధాంతాన్ని మౌలికంగా అంగీకరిస్తూనే దాన్ని వ్యవస్థాపక వాదపు పరిభాషలో వివరించడానికి ప్రయత్నించిన ఘనత లూయిస్ ఎ. కోసర్‌కు దక్కుతుంది. 'ది ఫంక్షన్ ఆఫ్ సోషల్ కాన్‌ఫ్లిక్ట్' (సామాజిక ఘర్షణ విధులు) అనే ముఖ్యమైన గ్రంథంలో కోసర్ సామాజిక ఘర్షణలు ఎటువంటి ముఖ్యమైన సకారాత్మక విధులను నిర్వర్తిస్తాయో వివరించడానికి ప్రయత్నించారు. తన కృషి 'సామాజిక ఘర్షణ భావనను విశదం చేసే ప్రయత్నం' అని, 'సామాజిక ఘర్షణకు సంబంధించిన సమాచారంలో కీలకమైన భావనాత్మక చట్రాలను క్రోడీకరించే ప్రయత్నం' అని కోసర్ రాశారు.

సామాజిక ఘర్షణ భావనకు కోసర్ తనదైన నిర్వచనం ఇచ్చారు. 'హోదా, అధికారం, వనరులు తక్కువగా ఉండడం వల్ల అవి సాధించాలనే ప్రయత్నంలోను, విలువలలోనూ పోరాటమే ఘర్షణకు దారితీస్తుంది. ఆ ఘర్షణలో ప్రతీ ఒక్కరు ప్రత్యర్థిని తటస్థం చేయడానికి, గాయపరచడానికి, తొలగించడానికి ప్రయత్నిస్తారు'.

సామాజిక ఘర్షణకు కోసర్ ఇచ్చిన నిర్వచనం దాదాపు అంగీకారయోగ్యమే అయినప్పటికీ, ఆ నిర్వచనం వివరణలో కోసర్ వ్యవస్థాపక వాదపు సమస్యాత్మకమైన, అస్పష్టమైన పదజాలాన్ని, భావనలను వాడారు. 'మనం ప్రధానంగా పట్టించుకోవలసినది సామాజిక ఘర్షణలనుంచి తలెత్తే విధులను, అంతేకానీ అపసవ్యతలను కాదు. ప్రత్యేక సామాజిక సంబంధాలు, బృందాలు సర్దుబాటు చేసుకోవడానికి, అనుగుణంగా మారడానికి ఎక్కువ అవకాశాలనిచ్చే సామాజిక ఘర్షణల పరిణామాలను పట్టించుకోవాలే తప్ప ఆ అవకాశాలను తగ్గించే పరిణామాలను కాదు' అని కోసర్ అన్నారు.

సామాజిక ఘర్షణ భావనను సామాజికశాస్త్రవేత్తలు విస్మరించారని, పట్టించుకున్నప్పుడు కూడా దాని 'నకారాత్మక' కోణంపైననే, అంటే సామాజిక ఘర్షణ ఎట్లా భద్రతను, స్థిరత్వాన్ని, ఐక్యతను భగ్నం చేసి సమాజాన్ని విభజిస్తుందో అనే అంశంపైననే కేంద్రీకరించారు తప్ప, దాని 'సకారాత్మక' కోణాన్ని అంటే అది ఎట్లా సామాజిక బృందాలను, సంబంధాలను, వ్యవస్థలను కొనసాగించడానికి అనువుగా మార్చడానికి ఉపయోగపడుతుందో గుర్తించలేదని కోసర్ విమర్శించాడు. సామాజిక ఘర్షణ మౌలికంగా వ్యవస్థాపకమైనదని, అంటే మంచిదని, అవ్యవస్థాపకమైనది కాదని, అంటే చెడ్డది కాదని ఆయన భావించారు.

సామాజిక ఘర్షణను కోసర్ రెండు రకాల ఘర్షణలుగా విభజించి విశ్లేషించారు. "కొన్ని ఘర్షణలను వాస్తవిక ఘర్షణలుగా అభివర్ణించవచ్చు. అవి ఒక విశిష్ట సంబంధంలో ప్రత్యేక ఆకాంక్షలు నెరవేరనందువల్ల, భాగస్వాముల లబ్ధి అంచనాలు నెరవేరనందువల్ల తలెత్తుతాయి. తమ ఆకాంక్షల వైఫల్య కారకులని భావించిన వారిమీదనే అవి ఎక్కుపెట్టబడతాయి. అవి ఒక ప్రత్యేక ఫలితాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి కనుక వాటిని వాస్తవిక ఘర్షణలు అనవచ్చు. ఇందుకు భిన్నంగా అవాస్తవిక ఘర్షణలు, అప్పటికే సంబంధం కొనసాగుతున్న ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తుల మధ్య పరస్పర భిన్నమైన ప్రయోజనాల వల్లకాక, వారిలో ఒకరు ఒత్తిడిని విడుదల చేయదలచుకున్నందువల్ల తలెత్తుతాయి. అంటే ప్రత్యర్థుల ప్రయోజనాలు ఏదో ఒక భిన్నాభిప్రాయం మీదనో, సమస్య మీదనో కాక, ఏ ప్రత్యేక ఫలితమూలేని విధంగా ఈ ఘర్షణలు ఉంటాయి.

జార్జ్‌సిమ్మెల్ ఆలోచనా ధోరణిని అనుసరించిన కోసర్ 'సామాజిక ఘర్షణ నూతన అన్వేషణ కొరకు ఒత్తిడి తేవడం ద్వారా సామాజిక వ్యవస్థ శిలీభూతం కాకుండా అడ్డుకుంటుంది' అని భావించారు. సామాజిక ఘర్షణ వల్ల ఏర్పడే



B R A O U

సకారాత్మక పరిణామాల గురించి ఆయన విస్తృతంగా రాశారు. ఘర్షణ వైమనస్యవ్యక్తీకరణకు, విషమించిన సంబంధాల పునర్నిర్మాణానికి దారితీస్తుందని ఆయన భావించారు. విభిన్న పక్షాల మధ్య ఘర్షణకు హేతువులను కనిపెట్టి వాటిని తొలగించడం, కొత్త నియమాల కల్పన ద్వారా వైమనస్యతను రద్దు చేయడం ఘర్షణ వల్ల సాధ్యమవుతుందని ఆయన భావించారు. ఒక బయటి బృందంతో ఘర్షణ ఏర్పడినప్పుడు, బృందంలో సంఘీభావం, ఐక్యత పెరగవలసిన అవసరం వచ్చినప్పుడు, బయటి బృందంతో ఘర్షణను నొక్కి చెప్పడం జరుగుతుందని ఆయన అన్నారు. సామాజిక ఘర్షణలవల్ల కొత్త నియమాలు, కొత్త వ్యవస్థలు మాత్రమేగాక కొత్త పొత్తులు, కొత్త సమీకరణలు సాధ్యమవుతాయని, వాటి వల్లనే సాంకేతిక వ్యవస్థలో పునరుజ్జీవనం సాధ్యమవుతుందని అన్నారు. ఘర్షణ వల్ల ఒక సమాజంలోని ఒత్తిడి, వైఫల్యభారం విడుదల అయిపోయి, సామాజిక వ్యవస్థ తనతో తాను సర్దుబాటు చేసుకునే అవకాశం కలుగుతుందని కోసర్ విశ్లేషించారు.

సామాజిక ఘర్షణ తీవ్రత గురించి, పర్యవసానం గురించి కూడా కోసర్ కొన్ని ప్రతిపాదనలు చేశారు. ఆ ప్రతిపాదనలలో ముఖ్యమైనవి:

1. మౌలిక సంబంధాల ప్రాతిపదికను సవాలు చేయకుండా లక్ష్యాల గురించి, విలువల గురించి, ప్రయోజనాల గురించి సాగే సామాజిక అంతర్ ఘర్షణలు మొత్తంగా సామాజిక వ్యవస్థకు అనుకూలంగా ఉంటాయి.

2. సామాజిక వ్యవస్థ ఆధారపడి ఉండే మౌలిక సాధికారతను ప్రత్యర్థి వర్గాలు ఒకే రకంగా చూడనప్పుడు తలెత్తే అంతర్ ఘర్షణలు సామాజిక వ్యవస్థ ఉనికినే ప్రమాదంలోకి నెడతాయి.

3. ఒక బృందం ఎంత సన్నిహితంగా ఉంటే, ఘర్షణ అంత తీవ్రంగా ఉంటుంది. సభ్యులు తమ పూర్తి వ్యక్తిత్వంతో భాగస్వామ్యం వహించేటప్పుడు, ఘర్షణలను అణచిపెడితే, అవి ఎప్పుడో ఒకప్పుడు బయటపడినప్పుడు మొత్తం సంబంధపు మూలమే ప్రమాదంలో పడుతుంది.

4. సభ్యులు పాక్షికంగా మాత్రమే భాగస్వామ్యం వహించే బృందాలలో ఘర్షణ తక్కువ విచ్ఛిన్నకరంగా ఉంటుంది. అటువంటి బృ:దాలలో ఎన్నో ఘర్షణలు ఏకకాలంలో అనుభవంలోకి వస్తాయి.

5. వెసులుబాటు కలిగిన సామాజిక వ్యవస్థలలో ఎన్నో ఘర్షణలు ఒక దానితో ఒకటి ముడిపడుతూ, విడిపోతూ ఒకే ఇరుసు మీద మౌలిక విభజన జరిగే అవకాశం ఉండదు. అంటే ఎన్నో ఘర్షణలు ఉండి, పాక్షిక భాగస్వామ్యం ఉండడం అనేది ఒక వ్యవస్థను సమతాస్థితిలో ఉంచుతుంది.

6. అంత దృఢంగాలేని బృందాలలో, బహిరంగ సమాజాలలో ఘర్షణ ప్రత్యర్థుల మధ్య ఒత్తిడిని తగ్గించడానికి మాత్రమే ఉంటోంది. అందువల్ల ఆ సంబంధాలను స్థిరీకరించే, సమగ్రం చేసే విధులను ఘర్షణ నెరవేరుస్తుంది.

7. సామాజిక వ్యవస్థలు ఘర్షణను కొంతమేరకు సహిస్తాయి. వ్యవస్థీకృతం చేస్తాయి. అసంతృప్తిని, వైమనస్యాన్ని ఒక మార్గం పట్టించే నిర్మాణాలను తొలగిస్తూనే, శత్రుత్వం తలెత్తగల సంబంధాలను కొనసాగిస్తాయి. ఇటువంటి ఏర్పాట్లు ఆగ్రహం పెల్లుబుకడానికి వీలు కలిగిస్తూనే, శత్రుపూరిత భావనలు, ప్రతిస్పందనలు ప్రమాదం లేకుండా బయటపడడానికి అవకాశమిస్తాయి.

8. సామాజిక వ్యవస్థ కఠినతరం అవుతున్నకొద్దీ, ఇటువంటి ప్రమాదరహిత ఆగ్రహ ప్రకటనా ఏర్పాట్ల అవసరం పెరుగుతుంది. శత్రుపూరిత ఆకాంక్షలు బహిరంగంగా బయటపడకుండా ఈ ఏర్పాట్లు అడ్డుకుంటాయి.

## 12.5 ముగింపు

సామాజిక ఘర్షణ గురించి కోసర్ నిశితమైన విశ్లేషణలు చేసినప్పటికీ, ఆ విశ్లేషణలను వ్యవస్థాపక వాద పదజాలంతో నింపడం విమర్శలకు కారణమైంది. అధికారం, ఆధిపత్యం, ప్రయోజనాల మధ్య ఘర్షణ వంటి



BRAOU

సాంప్రదాయక సామాజిక శాస్త్ర భావనలు ఈ విషయాలను ఇంకా ఎక్కువ స్పష్టంగాను, సూటిగానూ వివరించాయని, కోసర్ వాడిన పదజాలం అందుకు భిన్నంగా, వాస్తవాన్ని అస్పష్టంగా మార్చిందని విమర్శకులు అటున్నారు. ఆధిపత్యం అనే వాస్తవం నుంచి కోసర్ సర్దుబాటు అనే అవాస్తవికతవైపు ఘర్షణ సిద్ధాంతాన్ని మళ్లించారని విమర్శకుల అభిప్రాయం.

అదేవిధంగా సమాజానికి ఐక్యత, సమగ్రత అన్ని వేళలా మంచివే. ఆదర్శనీయమైనవీ అనడం కూడా సరికాదని, ఐక్యత, విచ్ఛిన్నాలలో ఏది మంచిదనే విషయం ఆయా ప్రత్యేక స్థలకాలాలను బట్టి ఉంటుందని, కోసర్ ఐక్యతకు అనవసర ప్రాధాన్యత ఇచ్చారని కూడా విమర్శకులు భావిస్తున్నారు.

'సిమ్మెల్ నుంచి కోసర్ గ్రహించిన విశ్లేషణలు, వాటికి ఆయన ఇతర ఆధారాల నుంచి చేర్చిన వాదనలు ఆసక్తి కరమైనవే. కానీ, ఈ మౌలిక భావాలను 'వ్యవస్థాపక పదజాలం'లోకి అనువదించినప్పుడల్లా, అవి కొత్తగా ఏమీ సాధించలేకపోగా, వాటి నైశిత్యాన్ని కోల్పోయాయి' అని ఒక విమర్శకుడు వ్యాఖ్యానించారు.

## 12.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. కోసర్ సామాజిక ఘర్షణ సిద్ధాంతాన్ని వివరించండి?
2. సామాజిక ఘర్షణ, పర్యవసానాలపై కోసర్ ప్రతిపాదనలు ఏవి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. వ్యవస్థాపణ పరిభాషలో ఘర్షణ సిద్ధాంతం?
2. కోసర్ సిద్ధాంతంపై విమర్శ?

BRAOU

## 12.7 చదవదగిన పుస్తకాలు

Francis M. Abraham : Modern Sociological Theory- An Introduction

Raymond Organ : Main Currents in Sociological Thought

Fransis Abraham, John Henree Morgan: Sociological Thought

BRAOU

# ఖండం- IV

## సామాజిక వినిమయ సిద్ధాంతం

సామాజిక వినిమయ సిద్ధాంతం సమాజశాస్త్ర విశ్లేషణలో ఒక దృష్టికోణాన్ని విడమరిచి వ్యాఖ్యానించే సిద్ధాంతం. ఈ సిద్ధాంతం సామాజిక జీవితానికి సంబంధించిన ప్రతీకారాత్మక అర్థాన్ని వివరిస్తుంది. నిర్మాణం, సిద్ధాంత ప్రతిపాదనల విషయంలో ఈ సిద్ధాంతంలో బ్రిటిష్ వైయుక్తిక వాదం, ఫ్రెంచ్ సామూహిక వాదం ఛాయలు కనిపిస్తాయి.

వినిమయ సిద్ధాంతం అర్థశాస్త్రంలోని ఉపయోగితావాదం, ప్రకార్య మానవశాస్త్రం, ప్రవర్తన మనోవిజ్ఞానశాస్త్రాంశాల కలగలుపు అని చెప్పవచ్చు. ఈ సిద్ధాంతం తాలూకు మూలం జేమ్స్ ఫ్రేజన్, మలినోవ్‌స్కీ, మార్సెల్, లెవిస్ట్రాస్‌ల రచనలలో కనిపిస్తుంది. ఆధునిక వినిమయ సిద్ధాంత ప్రతిపాదనలైన జార్జ్‌హోమన్స్, పీటర్ బ్లాల రచనల వల్లనే వినిమయ సిద్ధాంతం తాలూకు దృష్టికోణానికి విశేష ప్రాముఖ్యం, సముచిత స్థాయిలు లభించాయని చెప్పవచ్చు. ఈ ఖండంలోని మూడు భాగాల్లో వినిమయవాద దృక్పథ వికాసానికి దోహదం చేసిన ముగ్గురు ప్రముఖ శాస్త్రవేత్తల ప్రతిపాదనలను వివరించడం జరిగింది. వినిమయశాస్త్ర అభివృద్ధికి, ప్రాముఖ్యతకి ఈ భాగాలు అద్దం పడుతాయి. అవి:

- జార్జ్ సి. హోమన్స్
- పీటర్ బ్లా
- రిచర్డ్ ఎమర్సన్

BRAOU

BRAOU

# భాగం-13: జార్జ్ సి. హోమన్స్

విషయక్రమం


13.0 ఉద్దేశాలు

13.1 పరిచయం

13.2 మౌలికభావనలు

13.3 ప్రతిపాదనలు

13.4 వినిమయ ప్రవర్తనావాదం-మూల్యాంకనం

13.5 సారాంశం

13.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

13.7 చదవదగిన పుస్తకాలు


## 13.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- నిగమన సిద్ధాంతం ఆధారంగా జార్జ్ హోమన్స్ సామాజిక క్రమాన్ని వివరించిన తీరును తెలుసుకుంటారు.
- హోమన్స్ సామాజిక క్రమాన్ని వివరించడానికి వినిమయ క్రమాన్ని ఏవిధంగా వాడారో పరిశీలిస్తారు.
- నిగమన సిద్ధాంత ప్రతిపాదనల్లోని ముఖ్యమైన భావనలను పరిశీలిస్తారు.

BRAOU

## 13.1 పరిచయం

ఇరవయ్యో శతాబ్దంలో వెలువడిన సమాజశాస్త్ర సిద్ధాంతాలలో జార్జ్ హోమన్స్ సిద్ధాంతం ముఖ్యమైన వాటిలో ఒకటి. హోమన్స్ వినిమయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి సామాజిక విషయాలకు సంబంధించి ఒక నూతన దృక్పథాన్ని వెలువరించాడు. ఈ దృక్పథం ప్రవర్తించిన మనో విజ్ఞానశాస్త్రం నుంచి కీలకమైన భావనలను, ప్రతిపాదనలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంలో హోమన్స్‌ను ఎక్కువగా ప్రభావితం చేసింది. బి.ఎఫ్. స్కిన్నర్ ప్రతిపాదించిన స్వప్రయోజన సిద్ధాంతం. అయితే స్కిన్నర్ సిద్ధాంతంలో కనిపించే జంతుజాలం తాలూకు స్వప్రయోజన భావనకు భిన్నంగా హోమన్స్ ప్రతిపాదన ఉంటుంది. హోమన్స్ ప్రతిపాదనలో మానవసమాజంలో ఇచ్చిపుచ్చుకోవడం, మంచికి మన్నన, చెడుకు శిక్ష వంటివి నిరంతరం సాగుతూనే ఉంటాయన్న అంశం ప్రముఖంగా కనిపిస్తుంది.

హోమన్స్ సమాజంలో వ్యక్తుల మధ్య జరిగే ఇచ్చిపుచ్చుకోవడం గురించి వివరిస్తూ పారితోషికం, చర్య అనే భావనలను ప్రవేశపెట్టాడు. ఇలాంటి ఇచ్చిపుచ్చుకోవడంలో కూడా లాభాన్ని గరిష్ఠం చేసుకోవడం అనే ఆర్థిక సూత్రాన్ని ఉపయోగించాడు. అంటే సమాజంలో పరస్పర చర్యలలో పాల్గొనే వ్యక్తుల మధ్య లావాదేవీలు మార్కెట్‌లో కనిపించే ప్రవర్తన వంటివన్నమాట. అర్థశాస్త్రంలోని ప్రయోజన గరిష్ఠీకరణను హోమన్స్ నాలుగు విధాలుగా మార్చాడు. ఈ మార్పులు మానవ ప్రవర్తన వివరణకు అనువైనవిగా భావించాడు.అవి:

1. మానవ సమాజంలో సభ్యులు తమ లాభాలను గరిష్టం చేసుకోవడానికే ప్రతీసారీ ప్రయత్నించరు. వినిమయ సంబంధాల ద్వారా కొంత ప్రయోజనాన్ని మాత్రమే సామాజికుడు ఆశిస్తాడు.

2. దీర్ఘకాలిక లేదా హేతుబద్ధమైన అంచనాలను దృష్టిలో ఉంచుకొని సమాజంలో వినిమయం సాగదు.

3. వ్యక్తుల మధ్య సాగే వినిమయంలో కేవలం ద్రవ్యమే కాక, ద్రవ్యేతరమైన అంశాలు-సమ్మతి, గౌరవ మర్యాదలు, అనువర్తనం, ప్రేమాభిమానాలు లాంటి అనేక అభౌతిక అంశాలు కూడా చోటుచేసుకుంటాయి.

4. ఒక ప్రత్యేక క్షేత్రంలో సామాజిక వినిమయం సాగదు. సామాజిక వినిమయంసాగే మార్కెట్ సమాజం మొత్తం వ్యాపించి ఉంటుంది.

## 13.2 మౌలిక భావనలు

హోమన్స్ సిద్ధాంతంలోని కొన్ని ప్రముఖ మౌలిక భావనలను కింది విధంగా పేర్కొనవచ్చు. అవి:

1. చర్య: పారితోషికాన్ని సంపాదించడానికి ఉద్దేశించిన ప్రవర్తన.

2. ఆవేశపూరిత భావం: ఒక మానవ సముదాయంలో భాష, ప్రతీకల మాధ్యమంగా ప్రకటితమయ్యే స్పందనలు. ఈ ఆవేశాత్మక స్పందనలను ఆవేశపూరిత భావాలుగా పేర్కొనవచ్చు.

3. పరస్పర చర్య: వ్యక్తుల మధ్య జరిగే చర్య.

4. పరిమాణం: ఒక కాలపరిమితిలో ఒక ప్రాణి చేపట్టే లేదా రూపొందించే చర్యల సమాహారాన్ని పరిమాణం అనవచ్చు.

5. విలువలు: ఒక నిర్దిష్ట చర్య ఫలితంగా మనిషి ధోరణి బలపడినపుపడు లేదా శిక్ష ద్వారా బలహీనపడినప్పుడు దాన్ని సామాజిక విలువగా పరిగణించడం జరుగుతుంది.

6. పారితోషికం: ఏవస్తువునైనా ఏ చర్యనైనా మనిషి సకారాత్మకమని నిర్ధారించినప్పుడు దానిని పారితోషికమంటారు.

BRAOU

వీటితోపాటు హోమన్స్ అర్థశాస్త్రంలోని కొన్ని భావనలను తీసుకున్నా వాటికి సొంత అర్థాలు కల్పించి ఉపయోగించాడు. అవి:

ఎ) ధర: ఒక ప్రత్యమ్నాయ చర్య వల్ల లభించే పారితోషికాన్ని వదులుకొని, ప్రస్తుత చర్యవల్ల లభించే పారితోషికాన్ని అంచనా వేసుకొని ఒక చర్యకు ఉపక్రమించినప్పుడు అది దాని ధర (కాస్ట్)గా భావించవచ్చు.

బి) లాభం: ఒక చర్యలోని పారితోషిక భాగం నుంచి ధరను తీసివేస్తే వచ్చేది లాభం.

పారితోషికం-ధర= లాభం అన్నమాట

## 13.3 ప్రతిపాదనలు

ఈ మౌలిక భావనల ఆధారంగా హోమన్స్ సామాజిక వినిమయ సిద్ధాంతాన్ని రూపొందించాడు. ఈ సిద్ధాంతంలోని ప్రతిపాదనలను కింద పేర్కొన్నాం.

### 1. విజయ ప్రతిపాదన

ఒక చర్యవల్ల లభించే పారితోషికాన్ని బట్టి అలాంటి చర్యనే మరీమరీ చేయడానికి మనిషి ప్రయత్నిస్తాడు. చర్యవల్ల

లభించే పారితోషికం ఎంత ఎక్కువగా ఉంటే చర్యను పునరావృతం చేయడానికి అంతగా కృషి చేస్తూ పోతాడనేది ఈ ప్రతిపాదన సారాంశం.

కానీ మనిషిలో సంతుష్టి భావన వల్ల మానవ ప్రయత్నం కొంత తగ్గుతుంది. సంతుష్టి లభించగానే మానవుడు కొత్త చర్యల ద్వారా కొత్త పారితోషికాల కోసం ప్రయత్నిస్తాడు. అంతేకాదు పారితోషికాల నమూనాను బట్టి మనిషి చర్యలు కూడా మారుతూ ఉంటాయి. కొన్ని చర్యలవల్ల లభించే ప్రయోజనాలు క్రమపద్ధతిలో లభించకపోవచ్చు. అయినా మనిషి తన ప్రయత్నాలను ఆపకుండా కోరుకున్న ఫలితాన్ని సాధించడం కోసం పదేపదే ప్రయత్నించడం మనకు కనిపిస్తుంది. ఉదాహరణకు చేపలు పట్టేవాళ్ళు, జూదరులు తమ ప్రయత్నాల వల్ల చేకూరే ఫలితం ఖచ్చితంగా లేకపోయినా విజయం సాధించాలనే ఆకాంక్షతో, ఆశతో కృషి చేస్తూనే ఉంటారు. వారి ప్రయత్నాలు విరమించుకోరు.

## 2. ప్రేరక ప్రతిపాదన

ఈ ప్రతిపాదన ద్వారా హోమన్స్ మానవ ప్రవర్తనకు పర్యావరణ ప్రేరణకు సంబంధం ఉందని నిరూపించడానికి ప్రయత్నించాడు.

గతంలో ఒకప్రేరకం కానీ, కొన్ని ప్రేరకాల వల్ల కానీ వ్యక్తి చర్యలకు పారితోషికం లభించి ఉంటే, వర్తమానంలో కూడా అలాంటి ప్రేరకాలకు గతంలో లాగానే పారితోషికం లభిస్తుందని భావిస్తాడు. అందుకే వ్యక్తి పాత చర్యలనే మళ్లీ అనుసరిస్తాడని హోమన్స్ విశ్వాసం. ఉదాహరణకు దొంగతనం చేసేవాడు వేకువజామున దొంగతనం చేయడం వల్ల సత్ఫలితాలు లభిస్తే తరువాత తరువాత కూడా అదే సమయంలో దొంగతనానికి పూనుకుంటాడు.

## 3. విలువ ప్రతిపాదన

ఈ ప్రతిపాదన విలువ, చర్యల మధ్య సంబంధాన్ని వివరిస్తుంది. ఏ చర్య వల్ల ఒక వ్యక్తికి ఎక్కువ లాభం కలుగుతుందో ఆ చర్యనే మరీ మరీ చేయడానికి ప్రయత్నిస్తాడు. పారితోషికాలు మనిషికి సకారాత్మక విలువలను, శిక్షలు నకారాత్మత విలువలను అందిస్తాయి. పారితోషికాలు కేవలం వస్తురూపంలోనే ఉండనక్కరలేదు. అవి సంస్కృతి సంబంధమైనవిగానీ, మనస్సుకు సంబంధించినవిగానీ అయి ఉండవచ్చు.

BRAOU

## 4. లేమి-సంతృప్తి ప్రతిపాదన

ఇంతకు ముందు ఒక వ్యక్తికి ఒకరకమైన పారితోషికం లభించి ఉంటే అదే రకమైన పారితోషికాన్ని మరీమరీ పొందడానికి ప్రయత్నించడు. అంటే ఒకసారి లభించిన ఏ పారితోషికమైనా మళ్లీ మళ్లీ లభిస్తే ఆ వ్యక్తి దృష్టిలో ఆ పారితోషికం విలువ తగ్గిపోతుంది. దీని ఫలితంగా పాత చర్యలు పునరావృతం కావడం తగ్గిపోతుంది. దీన్నిబట్టి చూస్తే అర్థశాస్త్ర సూత్రాలలో ఒకటైన క్షీణ ప్రతిఫల సూత్రం లాంటిదే ఈ లేమి-సంతృప్తి ప్రతిపాదన కూడా అని అర్థమవుతుంది.

## 5. ఆక్రమణ-ఆమోద ప్రతిపాదన

ఈ ప్రతిపాదనను రెండు భాగాలుగా విభజించి వివరించడం జరిగింది. ఆ రెండు భాగాల తాలూకు వివరణలను కింద పొందుపరిచాము.

ఎ) వ్యక్తికి తాను ఆశించిన పారితోషికాలు దక్కకపోతే లేదా ఆశించని శిక్షలు అనుభవించవలసి వస్తే కోపోద్రిక్తుడవుతాడు. దీని ఫలితంగా వ్యక్తి ఆక్రమణ ప్రవర్తనను ప్రదర్శిస్తాడు. ఈ ఆక్రమణ ప్రవర్తన తాలూకు ఫలితాలు వ్యక్తికి ముఖ్యమైనవి, విలువైనవి అవుతాయి.

బి) అవలంబించిన లేదా ఆశించడానికి మించిన పారితోషికం లభించినప్పుడు మనిషి ఎంతో సంతోషిస్తాడు. అట్లాగే ఊహించిన మేరకు శిక్ష పడనప్పుడు కూడా అతను ఆమోద ప్రవర్తనను అధికం చేయడానికి ప్రయత్నిస్తాడు. ఇలాంటి ప్రవర్తన ఫలితాలు కూడా వ్యక్తికి ఎంతో ముఖ్యమైనవిగా ఉంటాయి. గత చరిత్ర, గత అనుభవాల

ప్రాముఖ్యాన్ని గుర్తించినప్పుడే వర్తమాన ప్రవర్తనను సులభంగా అర్థం చేసుకోగలమంటాడు హోమన్స్. దాదాపు అందరు మనోవైజ్ఞానికులు ఇటువంటి అభిప్రాయాన్నే వెలిబుచ్చుతారు. అందుకే బాల్యంలోని అనుభవాల ప్రభావం వ్యక్తి వర్తమాన ప్రవర్తనకు మూలాధారమని వారు అభిప్రాయపడతారు.

### 6. హేతుత్వ ప్రతిపాదన

ప్రత్యమ్నాయ చర్యలలో ఒకటి ఎన్నుకునేటప్పుడు వ్యక్తి హేతుబద్ధంగా ఆలోచిస్తాడు. ఒక చర్య వల్ల లభించే ఫలితం, దానిని రాబట్టడానికున్న సంభావ్యత ఎక్కువగా ఉంటేనే ఆచర్యను ఎంపిక చేస్తాడు. ఈ ప్రతిపాదనలో రెండు ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. అవి: ఎ) వ్యక్తి తన చర్యల ఫలితాల విలువకు ఇచ్చే ప్రాధాన్యం. బి) విజయం పొందే అవకాశాల సంభావ్యత గత అనుభవాలపై ఆధారపడి ఉంటుంది.

## 13.4 వినిమయ సిద్ధాంతం-మూల్యాంకనం

హోమన్స్ దృష్టిలో తాను ప్రతిపాదించిన సాధారణ ప్రతిపాదనలు మానవుడి సామాజిక ప్రవర్తనను వివరించడానికి సరిపోతాయి. అయితే పార్సన్స్, ఐజన్ స్టాట్‌లు ఈ ఆలోచనలను, ఆలంబనను విమర్శిస్తారు. వ్యక్తుల మధ్య సాగే వినిమయాలను వ్యక్తిగత స్థాయిలో విశదీకరించడం సరికాదంటారు. కారణం, వ్యక్తుల వినిమయాలు, ప్రతీకల ద్వారా, ప్రమాణాల ద్వారా నియంత్రితమై, సంక్లిష్ట సామాజిక విధానంలో భాగంగా కొనసాగుతాయని పార్సన్స్ వివరించాడు. సంస్థాపరమైన ప్రవర్తనకు, సంస్థాగతం కాని ప్రవర్తనకు ఉన్న విభేదాన్ని హోమన్స్ గుర్తించలేదని, దాన్ని విస్మరించాడని విమర్శించారు. హోమన్స్ ప్రతిపాదనలు వ్యక్తి తాలూకు ప్రవర్తన తీరును విశ్లేషించి వ్యాఖ్యానించడానికి మాత్రమే అనువైనవిగానీ, సంస్థాగత ప్రవర్తనను విపులీకరించడానికి, అవగాహనను నిర్దిష్టం చేసుకోవడానికి సహాయపడవు.

స్కిడ్ మోర్ ప్రకారం హోమన్స్ మొదటి నాలుగు ప్రతిపాదనలతో చర్య యూనిట్‌లు, చర్యలు పునరావృతం కావడం, చర్యలకు పారితోషికాలు, చర్యల విలువ ఐదవ ప్రతిపాదనకు సంబంధం ఉన్నట్లు కనబడదు. పంపిణీ న్యాయానికి సంబంధించిన ఈ ప్రతిపాదనకు మిగిలిన ప్రతిపాదనలకు మధ్య సంబంధం అస్పష్టంగా ఉంది. అందుకే ఆ ప్రతిపాదనను ఆక్రమణ-ఆమోదం అని రెండు భాగాలుగా విడదీయవలసి వచ్చిందని అంటాడు.

హోమన్స్ ప్రతిపాదనలు అనియత సంస్థాగతం కాని పరస్పర చర్యలను వివరించడానికి ప్రయత్నిస్తాయి. సముదాయాల, సమాజాల, సంస్థల లక్షణాలకు సంబంధించినవిగా కనబడవు. అవి కేవలం సాధారణ సామాజిక ప్రవర్తన కనిపించే యూనిట్‌లను మాత్రమే ప్రస్తావిస్తాయి. వాటికి ప్రమాణాల అర్థంతో కాకుండా ప్రమాణాల రూఢిని నిర్ణయించే అంశాలతోనే సంబంధం ఉన్నట్లు స్కిన్నర్ వ్యాఖ్యానించాడు.

హోమన్స్ ప్రతిపాదనలన్నీ అధ్యయన మనోవిజ్ఞానశాస్త్రంపై పూర్తిగా ఆధారపడినట్లు కనబడతాయి. వివిధ పర్యావరణాలలో జరిగే మార్పుల ఫలితంగా వ్యక్తి నేర్చుకొన్న ప్రవర్తనకు హోమన్స్ అధిక ప్రాధాన్యతనిచ్చాడు. అంటే నిబంధనానికి, అది ఎలా ఏర్పడిందనే అంశానికి ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చారన్నమాట. వ్యక్తి భవిష్యత్తును గురించి ఆలోచించినట్లు, అంచనావేసినట్లు ఎక్కడా వ్యాఖ్యానించలేదు. ఈ సిద్ధాంతం ప్రకారం వ్యక్తి అలవాటు ప్రకారం ప్రవర్తించినట్లు, ప్రవర్తిస్తున్నట్లు కనబడుతుందిగానీ అతడికి భవిష్యత్ ప్రణాళిక, ఆలోచన ఉన్నట్లు కనిపించదు.

హోమన్స్ ప్రతిపాదనను విమర్శనాత్మకంగా పరిశీలించిన వారిలో ఎకేను ప్రధానంగా పేర్కొనవచ్చు. ఇతని దృష్టిలో హోమన్స్ ప్రతిపాదన (వినిమయ సిద్ధాంత చర్చ) ఇద్దరు వ్యక్తుల మధ్య (ద్వంద్వ) సాగే పరస్పర చర్యలపై ఆధారపడి ఉంటుంది. దీన్ని బలపరచడానికి ఉపయోగించిన విషయ సామాగ్రి మాత్రం అనేకుల మధ్య సాగే పరస్పర చర్యలపై ఆధారపడి ఉంటుంది. ఈ అసాంగత్యాన్ని ఎకే ఎత్తి చూపాడు.



అసలు హోమన్స్ ఆలోచనా తీరులోనే లోపమున్నట్లు సమాజశాస్త్రవేత్తలు పేర్కొంటారు. చిన్న చిన్న సమూహాలను,

BRAOU

ప్రవర్తనలను విశ్లేషించి, వివరించడానికి ఉద్దేశించిన ప్రతిపాదనలను పెద్ద ఎద్ద సమూహాలకు, సంస్థలకు, సముదాయాలకు కూడా వర్తిస్తాయని హోమన్స్ విశ్వసించడాన్ని ప్రశ్నించారు. ఈ విషయాన్నే జోనాథన్ టర్నర్ ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు.

"హోమన్స్ భావనలైన చర్యలు, విలువలు, పారితోషికం, ధర, లాభాలు మొదలైన వాటిని సాధారణ స్థాయిలో నిర్వచించడం జరిగింది. వీటిని యథేచ్ఛగా ఏవిధంగానైనా వాడుకోవచ్చు. పూర్వ సంఘటనలను పరిశోధనల ఆధారంగా తీసుకుని తమ భావనలను, ప్రతిపాదనలను ప్రయోగించి సిద్ధాంతాన్ని విశదీకరించాడు హోమన్స్. అయితే ఈ భావనల వ్యాఖ్యలు పరిశోధనా యథార్థాలను బట్టి మారుతూ వచ్చాయి దీనివల్ల భావనల అర్థాలు అనిశ్చితంగా, అనిర్దిష్టంగా తయారయ్యాయని జాన్ టర్నర్ అభిప్రాయపడ్డాడు.

చివరగా, అసలు హోమన్స్ భావనలను, ప్రతిపాదనలను విశ్లేషిస్తే వాటిలో అస్పష్టత, భావవార్థ పునరుక్తి దోషం కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి.

## 13.5 సారాంశం

సామాజిక ప్రవర్తన చాలా మట్టుకు ముందుగా అంచనా వేసిన విధంగా ఉండదని హోమన్స్ అంటాడు. అంతేకాక మానవ సామాజిక ప్రవర్తనను తాను ప్రతిపాదించిన అరు సూత్రాల సహాయంతో సులభంగా విశ్లేషించి వివరించవచ్చునని అతని విశ్వాసం. సామాజిక ప్రవర్తనలో కొన్ని రకాల ప్రవర్తనలు-వ్యాపార సంస్థలు, ప్రభుత్వ సంస్థలు తమ లక్ష్యాలను ముందుగానే నిర్దేశించుకొని వాటి సాధనకు అనుసరించిన ప్రణాళికలను, వ్యూహాన్ని సిద్ధం చేసుకుంటూ ఉంటాయి. ఈ ప్రవర్తన తీరును విశ్లేషించడానికి హోమన్స్ హేతుతత్వ ప్రతిపాదనను ప్రవేశపెట్టాడు.

సామాజిక ప్రవర్తనను నిర్ణయించే పరిస్థితులకు సంబంధించి హోమన్స్ ఆమూర్త భావనలను ప్రతిపాదించాడు. ఇలాంటి పరిస్థితులు మూర్తరూపాలను చూడగలిగినప్పటికీ అవి సర్వత్రా గోచరించే వాస్తవాలుగానే చెప్పాలి.

B R A O U

## 13.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. పరస్పర చర్యలలో మార్కెట్ లావాదేవీలలాంటి ప్రవర్తన చూపడానికి హోమన్స్ చూపిన నాలుగు విధానాలేవి?

2. హోమన్స్ సామాజిక వినిమయ సిద్ధాంత ప్రతిపాదనలు వివరించండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి**

1. ఆక్రమణ, అమోదిత ప్రతిపాదన అనగానేమి?

2. హోమన్స్ సిద్ధాంతంపై విమర్శ?

## 13.7 చదవదగిన పుస్తకాలు

George C.Homans : The Human Group

George C.Homans : Social Behaviour: Its Elementary Formsm, Harcourt Brace& World, New Yourk, 1961, Revised Edition, 1974.

George C.Homans : Social Behaviour as Exchange, American Journal of Sociology, LXII (May 1958), pp 597-607.

Willian Skidmore : Theoritical Thinking in Sociology, Cambridge University Press, London 1979.

Jonathan H. Turner : The Structure fo Sociological Theory; Rawal Publications, Jaipur, 1987.

Burgers R.L.& BOshellD.Jr. : Behaviour Sociology: The experimental Analysis of Social Process, Colombia University Press, New York, 1969.

Berger J, Zelditch M.Jr Anderson,B (Eds) : Sociological Theories in Progress, Houghto, Mifflin, New Yourk, 1972.

BRAOU

# భాగం-14: పీటర్ బ్లా

**విషయక్రమం**


14.0 ఉద్దేశాలు

14.1 పరిచయం

14.2 జీవితవిశేషాలు

14.3 హోమన్స్, బ్లా ల సిద్ధాంతాలు: సామ్యాలు, వ్యత్యాసాలు

14.4 బ్లా ప్రతిపాదించిన సామాజిక వినిమయ సిద్ధాంతం

14.5 సామాజిక వినిమయాన్ని నిర్ధారించే పరిస్థితులు

14.6 సామాజిక, ఆర్థిక వినిమయాల మధ్య విభేదాలు

14.7 అధికారం-విభేదీకరణ

14.8 అధికారాన్ని న్యాయ సమ్మతమైనదిగా చేయడం

14.9 స్థూల సూక్ష్మ స్థాయిల్లో సాగే సామాజిక వినిమయం

14.10 విమర్శ

14.11 సారాంశం

14.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 14.0 ఉద్దేశాలు

ఈ పాఠ్యాంశం చదివినతర్వాత మీరు

- బ్లా ప్రతిపాదించిన వినిమయ సిద్ధాంతాన్ని తెలుసుకుంటారు.
- బ్లా, హోమన్స్ సిద్ధాంతాల మధ్య సామ్యాలు, వ్యత్యాసాలు అవగాహన చేసుకుంటారు.
- బ్లా విశ్లేషణలో అధికార విభేదీకరణ ప్రాముఖ్యతను తెలుసుకుంటారు.
- సూక్ష్మ స్థూల స్థాయిల్లో సాగే వినిమయం గురించి బ్లా ఇచ్చిన వివరణ తెలుసుకుంటారు.

## 14.1 పరిచయం

సామాజిక వినిమయ సిద్ధాంత ప్రతిపాదకులలో హోమన్స్ తరువాత అంత ముఖ్యమైన సమాజ శాస్త్రవేత్త పీటర్ బ్లా. సామాజిక వినిమయం విషయంలో బ్లా అనుసరించిన విశ్లేషణ విధానానికి హోమన్స్ దృక్పథానికి కొన్ని విషయాలలో సామ్యం ఉన్నా మరికొన్ని విషయాలలో వ్యత్యాసాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి. సామాజిక నిర్మితికి సంబంధించిన దృక్పథం జార్జ్‌హోమన్స్ ప్రతిపాదించిన ప్రవర్తనా పరమైన దృక్పథం మధ్య స్పష్టమైన సామ్యం కనిపిస్తుంది. హోమన్స్ లాగే బ్లా కూడా మానవ ప్రవర్తన మనోవిజ్ఞాన సూత్రాల ఆధారంగా వివరించాడు. అయితే బ్లా వినిమయ సిద్ధాంతం హోమన్స్ సిద్ధాంతంతో అనేక విధాలుగా విభేదిస్తుంది. బ్లా వినిమయ నమూనా మానవ ప్రవర్తనలోని సన్నివేశ వైవిధ్యాన్ని చిత్రించినా అది ఎక్కువగా పారితోషిక, సేవా భావనల ఆధారంగా రూపొందించినదేనని స్పష్టమవుతుంది. అంతేకాక బ్లా, హోమన్స్ ప్రతిపాదించిన మానసిక సూక్ష్మీకరణ వాదాన్ని

తిరస్కరించి సామాజిక పరస్పర చర్యను సూక్ష్మ స్థాయిలో విశ్లేషించి, వీటిని తరువాత బృహత్ సమాజ నిర్మితి స్థాయిలో కూడా విశ్లేషించాడు.

సామాజిక వినిమయ సిద్ధాంతానికి సంబంధించిన ఈ ఇద్దరి ధోరణులను తులనాత్మకంగా పరిశీలించి బ్లా ప్రవేశపెట్టిన మార్పులు, చేర్పులను విమర్శనాదృష్టితో పరిశీలించినప్పుడే బ్లా సిద్ధాంతంలోని విశిష్టతను గుర్తించగలం. నూతన దృక్పథాన్ని అనుసరించి సామాజిక వినిమయ ప్రక్రియను విశ్లేషించిన బ్లా జీవిత విశేషాలను స్థూలంగా తెలుసుకోవడం అవసరం.

## 14.2 జీవిత విశేషాలు

పీటర్ బ్లా ఆస్ట్రేలియాలోని వియన్నా నగరంలో 1918 ఫిబ్రవరి 7న జన్మించాడు. ఇతడు 1939లో అమెరికా సంయుక్త రాష్ట్రాలకు నివాసం మార్చి, 1943లో ఆదేశ పౌరుడయ్యాడు. రెండో ప్రపంచయుద్ధం అతని విద్యాభ్యాసానికి ఆటంకం కలిగించింది. అతడు అమెరికన్ సైన్యంలో కొంతకాలం పనిచేసి కాంస్యపతకాన్ని పొందాడు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత విద్యాభ్యాసం కొనసాగించి 1952లో కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్‌డి పట్టా పొందాడు.

నియత వ్యవస్థల అధ్యయనంలో ఇతడి కృషి సమాజశాస్త్ర రంగంలో విశేషమైన గుర్తింపును తెచ్చిపెట్టింది. వ్యవస్థలకు సంబంధించి ఇతడు నిర్వహించిన అనుభవైక అధ్యయనాలు, ఇతడు రచించిన పాఠ్యగ్రంథాలు బహుజన ఆమోదం పొందడమేకాక ప్రామాణిక గ్రంథాలుగా నేటికీ గుర్తింపు పొందుతూనే ఉన్నాయి. ఓటిస్‌డడ్లీ డంకన్‌తో కలిసి రాసిన The American Occupational Structure ఇతడికి 1968లో అమెరికా సోషియలాజికల్ అసోసియేషన్ వారి 'సొరోకిన్' అవార్డును తెచ్చిపెట్టింది. సామాజిక స్థరీకరణకు సంబంధించిన ప్రముఖ అధ్యయనంగా దీనిని అందరూ గుర్తించారు.

బ్లా వివిధ రకాలైన రచనలు అనేకం చేసినా సమాజశాస్త్ర సిద్ధాంతానికి ఇతడు చేసిన కృషే అందరి ప్రశంసలు అందుకోవడమేకాక అతడికి సమాజశాస్త్రవేత్తగా ఖ్యాతిని ఇనుమడింప జేసింది. బ్లా కృషి ప్రధానంగా రెండు విశిష్టమైన సిద్ధాంత ప్రతిపాదనల రూపంలో ఉన్నదనని స్పష్టంగా తెలుస్తుంది. అతడు 1964లో వెలువరించిన Exchange and Power in Social Life సమకాలీన సామాజిక సిద్ధాంతాలలో పేర్కొనదగిన గ్రంథంగా చెప్పవచ్చు. ఈ అం... సంబంధించి హోమన్స్ ప్రతిపాదించిన సూక్ష్మస్థాయి వినిమయ సిద్ధాంతాన్ని సమాజమంతటికీ వర్తించే వినిమయ సిద్ధాంతంగా రూపొందించడమే ఇతడు చేసిన కృషిగా చెప్పుకోవచ్చు. బ్లా ప్రతిపాదించిన సామాజిక వినిమయ సిద్ధాంతంలో ఏవో కొన్ని లోపాలున్నప్పటికీ సూక్ష్మ, స్థూల స్థాయి సామాజిక అంశాలను సమీకృత దృష్టితో పరిశీలించడం వల్ల సమాజశాస్త్రవేత్తలలో ఇతనికి ఒక గుర్తింపు లభించింది. సామాజిక వినిమయ విశ్లేషణకే అతని కృషి పరిమితం కాకుండా సామాజిక నిర్మితికి సంబంధించిన సిద్ధాంత వివరణకు కూడా విస్తరించింది. అమెరికన్ సోషియాలజికల్ అసోసియేషన్‌కు అధ్యక్షుడుగా ఉన్న కాలంలో (1973-74) సమాజ నిర్మితి తాలూకు సిద్ధాంతాలనే చర్చనీయాంశాలుగా చేశాడు. అప్పటి నుంచి సమాజనిర్మితిని పరిశీలనాంశంగా అనేక గ్రంథాలను ప్రచురించాడు. 1994లో ఇతడు ప్రచురించిన Structure of Oportunities అన్న గ్రంథం ప్రామాణికమైందేకాక భావస్ఫోరకమైంది కూడా.

## 14.3 హోమన్స్, బ్లా సిద్ధాంతాలు: సామ్యాలు, వ్యత్యాసాలు

వినిమయ సిద్ధాంతానికి సంబంధించి ఈ ఇద్దరి దృక్పథాలలో కొంత సామ్యం కనిపిస్తుంది. పీటర్ బ్లా అనుసరించిన నిర్మితీయ దృక్పథం, జార్జ్ హోమన్స్ అనుసరంచిన ప్రవర్తనా దృక్పథాన్ని పోలి ఉంటుంది. హోమన్స్ మాదిరిగానే బ్లా కూడా మానవ ప్రవర్తనను మనో విజ్ఞానశాస్త్ర సూత్రాల ఆధారంగా విశదీకరించాడు. ఈ సందర్భంలో అతడి మాటలలోనే ఈ అంశాన్ని చూద్దాం. 'ఎదుటివాళ్లకు సేవలు చేసే వ్యక్తి వారిని కృతజ్ఞతా బద్ధులను చేస్తాడు. ఈ



BRAOU

కృతజ్ఞతా బాధ్యతను నెరవేర్చుకోవడానికి రెండో వ్యక్తి అతనికి కొన్ని లాభాలను, ప్రయోజనాలను అందిస్తాడు. ఇద్దరు వ్యక్తులు పరస్పరం చేసే సేవలు, కలిగే లాభాలు అత్యవసరమని గుర్తించినంత కాలం వారి మధ్య వినిమయం కొనసాగుతూనే ఉంటుంది. కాల క్రమంగాఈ వినిమయ సంబంధాలు పలచబడి క్రమంగా తగ్గిపోతాయి'.

వ్యక్తిగత స్థాయికి సంబంధించి వీరిద్దరూ అనుసరించిన ప్రక్రియ ఒకటే. అయితే లాభదాయకం కాదని భావించినప్పుడు వ్యక్తిగత సంబంధాలలో అంటే ఆదాన, ప్రధానాలలో మార్పులు చోటుచేసుకొంటాయి. ఈ సంబంధాలు క్రమంగా బలహీనపడి అంతరిస్తాయి. నూతన సంబంధాలు ఏర్పడటానికి ప్రయత్నాలు ప్రారంభమవుతాయి. ఈ ప్రక్రియ వరకూ హోమన్స్, బ్లౌల మధ్య చక్కటి సామ్యం కనిపిస్తుంది. కానీ బ్లౌ సామాజిక వినిమయ సిద్ధాంతాన్ని సామాజిక వాస్తవాంశాలకు కూడా విస్తరించాడు. ఇదే వీరిద్దరి దృక్పథాలలో, అనుసరించిన పద్ధతిలో కనిపించే తేడా. సామాజిక పరస్పర చర్య ప్రక్రియను దానిని ఆవరించి ఉన్న సామాజిక నిర్మితితో నిమిత్తం లేకుండా విశ్లేషించడానికి వీలులేదని బ్లౌ భావించాడు. ఇక్కడే బ్లౌను హోమన్స్‌తో పోల్చి చూసినప్పుడు విస్తృత పరిధిలో ఆలోచించాడని సులభంగా అర్థమవుతుంది.సామాజిక పరస్పర చర్యల ఫలితంగానే ఒక సమాజనిర్మితి ఏర్పడుతుంది. ఇలా ఏర్పడ్డాక సామాజిక నిర్మితికి స్వతంత్ర అస్థిత్వంగలదిగా మారి సామాజిక పరస్పర చర్య ప్రక్రియనే ప్రభావితం చేయగలదిగా రూపొందుతుందని బ్లౌ అంటాడు.

బ్లౌ తన వినిమయ సిద్ధాంతంలో సంక్లిష్ట సముదాయాల, సమాజ నిర్మితులను, ప్రక్రియలను, నిత్యజీవితంలోని వ్యక్తుల పరస్పర చర్యల ద్వారా, సరళమైన ప్రక్రియల ద్వారా వివరించడానికి కృషి చేసాడు. అయితే ఈ ప్రయత్నంలో కొన్ని ప్రమాదాలున్నాయని గ్రహించిన బ్లౌ ఆమూర్త భావాలపై ఆధారపడక, సూక్ష్మీకరణ లోపాన్ని నివారించడానికి ప్రయత్నించి తన విశ్లేషణాస్థాయిని మార్చి, ఒక ఉన్నత దశకు చేర్చాడు. దీని ఫలితంగా వినిమయ సిద్ధాంతంలో నిర్మితీయ విశ్లేషణ, నిర్మితి దృక్పథం ఏర్పడ్డాయి.

హోమన్స్ మాదిరిగానే బ్లౌ ఒక నిగమన విధానాన్ని అనుసరించడం, కొన్ని రూప బద్ధమైన ప్రతిపాదనలను తయారు చేయడం వంటివి చేయలేదు. ఒక భావనాకృతి నిర్మించాడేకానీ, ఒక సైద్ధాంతిక విధానాన్ని నిర్మించలేదు. హోమన్స్ వినిమయ విశ్లేషణలో లేని అనేక అంశాలను బ్లౌ విశ్లేషణలో చూడవచ్చు. వినిమయ నమూనాలనుంచి ఉత్పన్నమయ్యే సత్తా, సామాజిక సమైక్యత, సమన్వయ ప్రక్రియలను తన భావనాకృతి ద్వారా చక్కగా విశదీకరించాడు. బ్లౌ దృష్టిలో సామాజిక వినిమయం వెనకాల రెండు మౌలిక మానసిక ప్రక్రియలుంటాయి. అవి: 1. ఒక వ్యక్తికి ఇంకొక వ్యక్తికి మధ్య ఉండే పరస్పర ఆకర్షణ, 2. వివిధ పారితోషికాలపై ఉండే అభిలాష.

ఒకే అంశం ద్వారాసామాజిక వినిమయాన్ని వివరించడానికి హోమన్స్ ప్రయత్నిస్తే, బ్లౌ మూడు ప్రధానమైన సైద్ధాంతిక నమూనాలను, ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం, ప్రకార్యవాదం, సంఘర్షణ సిద్ధాంతాలను ఆధారం చేసుకొని వివిధ వినిమయ నమూనాల ద్వారా లభించే అధికారం, ఏర్పడే సామాజిక సమైక్యతలను వివరించాడు.

హోమన్స్, బ్లౌల మధ్య పరిశీలించిన అంశాల పరిధి విషయంలో కూడా స్పష్టమైన తేడా కనిపిస్తుంది. హోమన్స్ వ్యక్తుల మధ్య సాగే పరస్పర ఆదాన, ప్రధానాలను వివరించడానికే పరిమితమైతే, బ్లౌ వైయక్తిక వినిమయ ప్రక్రియతో ప్రారంభించి తన విశ్లేషణను సమాజానికి అంతటికీ అన్వయించేట్లు వినిమయ సిద్ధాంతాన్ని రూపొందించాడు. అంటే బ్లౌ విషయ పరిధిని సూక్ష్మ స్థాయినుంచి స్థూల స్థాయికి విస్తరింపజేశాడన్నమాట.

## 14.3 సామాజిక వినిమయ సిద్ధాంతం

సామాజిక జీవితం, బ్లౌ అభిప్రాయం ప్రకారం మార్కెట్ స్థలం లాంటిది. వ్యక్తులు ఒకరితో ఒకరు సంబంధాలు పెంచుకొని భౌతిక, మానసిక పారితోషికాలు రాబట్టడానికి కృషి చేస్తారు. పారితోషికం తీసుకున్న వ్యక్తి ఇచ్చిన వారికి ఏదో రూపంలో పారితోషికాన్ని తిరిగి ఇస్తాడు. దీనివల్ల భవిష్యత్తులో పారితోషికాలు లభించే అవకాశాలు పెరుగుతాయి. ఈ ఇచ్చి పుచ్చుకొనే పద్ధతులనే పారస్పరిక ప్రమాణాలని చెప్పవచ్చు. సామాజిక పరస్పర చర్యలను, సామూహిక నిర్మితిని ఈ ప్రమాణాలు అనేక విధాలుగా ప్రభావితం చేస్తాయి.



BRAOU

పైన వివరించిన నేపథ్యంలో బ్లా ప్రతిపాదించిన సామాజిక వినిమయసిద్ధాంతాన్ని కొంత లోతుగా పరిశీలిద్దాం. వినిమయ సిద్ధాంతంలోని ముఖ్య ప్రతిపాదనలను క్రింది విధంగా పేర్కొనవచ్చు. అవి:

1. సామాజిక చర్యలలో పాల్గొనేవారు పారితోషికాలను ఆశిస్తారు.

2. ఏ చర్య ద్వారా వారు లబ్ధిపొందుతారో ఆచర్యనే మరీ మరీ చేస్తారు.

3. తరచూ పారితోషికం లభించే చర్యల వల్ల ఆ పారితోషికాల విలువ తగ్గిపోతుంది. ఆకారణంగా ఆ చర్యలను మరీ మరీ చేయడానికి ఇష్టపడరు.

4. సామాజిక పరస్పర చర్యలో పారితోషికం పొందే వ్యక్తి పారితోషికం ఇచ్చిన వ్యక్తికి ప్రతిగా ప్రయోజనం కల్పించాల్సిన బాధ్యత ఉంటుంది.

5. పారస్పరిక బాధ్యతలు సామాజిక సంబంధాలను బలోపేతం చేసి సామాజిక సమైక్యతను పటిష్ఠం చేస్తాయి.

6. పరస్పర బాధ్యతను ఉల్లంఘించడం వల్ల లబ్ధి కోల్పోయిన వ్యక్తి బాధపడతాడు, ప్రయోజనం పొందిన వ్యక్తి పట్ల వ్యతిరేక భావాలను పెంచుకొని ప్రవర్తిస్తాడు.

## 14.5 సామాజిక వినిమయాన్ని నిర్ధారించే పరిస్థితులు

BRAOU

1. ఇతరులపట్ల నిబద్ధతను కల్పించే పెట్టుబడులు చేయడం.

2. తన నిజాయితీని, విశ్వసనీయతను చాటుకునే విధంగా పారితోషికాలను ఇవ్వడం.

3. బాధ్యతలను దీర్ఘకాలం కొనసాగించే విధంగా ప్రత్యేక యంత్రాంగాలను రూపొందించడం. ఇలా చేయడం ద్వారా విశ్వసనీయతను, రుణగ్రస్తతను మరింత బలోపేతం చేయడం.

4. వ్యయాలకు సరిపడ పారితోషికాలు లభించే విధంగా వినిమయం సాగించడం. ఎ). ఇద్దరు వ్యక్తుల మధ్యనే వినిమయ ప్రక్రియ సాగినప్పుడు ఇందులో పాల్గొంటున్న ఇద్దరి పాత్ర సమితుల ప్రభావం ప్రముఖమైందిగా ఉంటుంది. సామాజిక అంతస్తులే వారిద్దరికీ ప్రత్యమ్నాయ అవకాశాలను సూచిస్తాయి. బి) సమూహంలో జరిగే వినిమయమంతా వినిమయం రేటును నిర్ణయిస్తాయి. ఈ సామూహిక ప్రమాణమే ఏ సభ్యుడైనా అతిక్రమించి వర్తించకుండా ఒత్తిడి తెస్తాయి. ఇది నైతికమైన ఒత్తిడి కాదు. నిర్ధేశాత్మకమైన ఒత్తిడి అంతకంటే కాదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అవకాశాలు తెచ్చే ఒత్తిడులే. సి) బలహీనసభ్యులు సంఘటితం కావడం ద్వారా బలవంతులు ఉన్న పరిస్థితులను స్వప్రయోజనాలకు వాడుకోకుండా ఆపవచ్చు. డి) వినిమయం వల్ల ఏర్పడే అధికారం వినిమయ ప్రక్రియనే మార్చివేసేంత శక్తిమంతమైనది. కానీ, బలహీనుల సంఘటిత శక్తి దీనిని అడ్డుకొంటూ ఉంటుంది. ఇ) వినిమయ ప్రక్రియ సాగే సామాజిక పరిస్థితులు కూడా ఈ ప్రక్రియలను ప్రభావితం చేస్తాయి. ఈ వినిమయ ప్రక్రియ సమాజంలో సాగే ఇతర వినిమయాలలో అంతర్భాగంగా ఉండేటట్లు ప్రభావం చూపుతాయి.

## 14.5 సామాజిక ఆర్థిక వినిమయాల మధ్య విభేదాలు

బ్లా తన రచనలలో సామాజిక వినిమయానికి, ఆర్థిక వినిమయానికి ఉండే వ్యత్యాసాన్ని స్పష్టంగా చూపాడు. సామాజిక వినిమయం ఫలితంగా వ్యక్తులలో బాధ్యత, కృతజ్ఞత, విశ్వాసం వంటి భావాలు ఏర్పడతాయి. ఆర్థిక వినిమయం వల్ల కొంత పరిమాణంలో వస్తువుల మార్పిడి జరుగుతుంది. ఈ మార్పిడి పరస్పర ఒప్పందం ఆధారంగాజరుగుతుంది. సామాజిక వినిమయం వ్యక్తిగతమై కొన్ని సాధారణ విలువల ఆధారంగా సాగుతుంది. ఆర్థిక వినిమయం ఇందుకు భిన్నంగా మార్కెట్ విలువలు, ఒప్పందపు షరతుల ఆధారంగా సాగుతుంది. సామాజిక

వినిమయం కొన్ని పరిస్థితులలోనూ, సందర్భాలలోనూ సాగుతుంది. వినిమయం చేసుకొనే వ్యక్తుల మధ్య ఉండే సంబంధాల సమన్వయం, ఆ సంబంధాలు చేరుకొన్న దశ వినిమయ సంబంధాల దిశను, గతిని బాగా ప్రభావితం చేస్తాయి. అలాగే వినిమయం జరుగుతున్న సామాజిక సందర్భం, వినమయ చర్యల వల్ల కలిగే లాభనష్టాలు వ్యయ ప్రయోజనాలు సామాజిక వినిమయం విశదీకరణలోను, విశ్లేషణలోను విశిష్ట పాత్ర వహిస్తాయి. ఆర్థిక రంగంలో జరిగే వినిమయం అంతా ఇదివరకే పేర్కొన్నట్టు ఒప్పందం ఆధారంగా సాగడమే కాక ఇందులోని వ్యయ ప్రయోజనాలు మార్కెట్ శక్తుల ప్రభావానికి లోబడి ఉంటాయి. అంటే మార్కెట్ ధరలలోని ఆటుపోట్లు, వ్యయ ప్రయోజనాల తీరుతెన్నులను నిర్ధారిస్తాయన్న మాట. సామాజిక వినిమయం వ్యక్తి నిష్టమైంది కాగా, ఆర్థిక వినిమయం ఎక్కువగా మార్కెట్ శక్తుల ప్రభావానికి లోనైనటువంటిది. సామాజిక వినిమయం వ్యక్తిగతమైన బాధ్యతలు, కృతజ్ఞత, విశ్వాసం వంటి వాటిని కలగడానికి దోహదం చేయగా ఆర్థిక వినిమయం ప్రధానంగా పరిమాణాత్మకమైంది. భవిషత్ బాధ్యతలను సామాజిక వినిమయ ప్రక్రియ కలిగించగా, ఆర్థిక వినిమయ ప్రక్రియ ఒప్పందం తాలూకు బాధ్యతలను కల్పిస్తుంది.

## 14.6 అధికారం-విభేదీకరణ

వినిమయం జరిగే పరిస్థితులను చెప్పిన తరువాత బ్లా వినిమయాలలో ఉండే వ్యత్యాసాలను చర్చించాడు. వినిమయ సంబంధాలలోని విభేదీకరణ వల్ల అధికార ఆధీన సంబంధాలు ఏర్పడతాయని బ్లా ప్రతిపాదించాడు. బ్లా మాటల్లోనే చెబితే 'సభ్యులకు కావలసిన సేవలను అందించే వ్యక్తి సేవలు పొందేవారికి రుణపడి ఉన్నంత వరకూ, సేవలు అందించే వ్యక్తిపై ఇతరులు ఆధారపడి ఉన్నంతవరకు వారినుంచి విధేయత, లొంగుబాటులు లభిస్తాయి'. సమాజంలోని సభ్యులు ఏకపక్షంగా ఒక వ్యక్తి సేవలపై ఆధారపడి ఉంటారో ఇంతవరకూ వారి మధ్య నెలకొన్న వినిమయ సంబంధాలు అనుమానంగాను పరాధీనంగానూ ఉంటాయి.

బ్లా అధికారం అనే మాటను ఆ మాటకు వెబర్ ఇచ్చిన నిర్వచనాన్ని అనుసరించేవాడు. సామాజిక సంబంధాలలో ఇతరులు అడ్డుకొన్నా ఒక వ్యక్తి తన నిర్ణయం అమలు అయ్యేటట్లు చూడగలగడమే అధికారం అన్న వెబర్ నిర్వచనాన్ని బ్లా పూర్తిగా సమర్థించాడు. సామాజిక సంబంధాలలోని వ్యక్తులు మరో వ్యక్తినుంచి ప్రయోజనాలు ఆశించడం వల్ల గానీ, ఆ ప్రయోజనాలను ఉపసంహరించుకొంటాడనే భయం వల్లగానీ ఆధీనులు ప్రవర్తిస్తారు. యజమాని, ఉద్యోగి మధ్య ఉన్న సంబంధాన్ని ఈ పరిస్థితి వివరించడానికి చక్కటి ఉదాహరణగా చూడవచ్చు. ఉద్యోగులు తమ ఉపాధి కోల్పోతానేమోననే భయం కారణంగా యాజమాన్యం ఆదేశాలకు తలొగ్గి ప్రవర్తిస్తారు. అంటే ఇలాంటి అధికారం కొన్ని ఆంక్షలు విధించడం ద్వారా వినిమయ ప్రక్రియలో పాల్గొనేవారి ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా విధించడం జరుగుతుంది. అయితే యాజమాన్యానికి ఉగ్యోగులపై ఉన్న అధికారం భౌతికంగా వారిపై ఎలాంటి ఒత్తిడి తెచ్చేదిగా ఉండదు. ఇందులో కొంత భాగం స్వేచ్ఛ కూడా ఉంటుంది. కాబట్టి ఉద్యోగి, యజమాని ఆదేశాలు పాటించకుంటే ఏర్పడే ఫలితాలను గుర్తించి వాటిని ఎదుర్కోవడానికి సిద్ధపడినప్పుడు అధికారం దిక్కారణకైనా పూనుకోవచ్చు.

బ్లా అభిప్రాయం ప్రకారం అధికారంలో అంతర్గత అసౌష్టవం ఉంటుంది. దీనికి మూలం వినిమయంలో పాల్గొనే ఇద్దరు వ్యక్తులలో ఒక్కరికే వినిమయం ఆవశ్యకత అధికంగా ఉండటం. పరస్పర ఆధారత, పరస్పర ప్రభావం బలం అనేవి అధికారం లోపించడాన్ని సూచిస్తాయి. ఈ సందర్భంలో హోమన్స్ ఊహించిన దానికి భిన్నంగా బ్లా ఊహించాడని స్పష్టమవుతుంది. ఎందుకంటే సామాజిక వినిమయ సంబంధాలలో అసంతులనం, అసౌష్టవం, ఒకరే ఆధారపడడం వంటివి ప్రముఖ లక్షణాలని బ్లా పేర్కొంటాడు. ఇలా భావించడం ద్వారా అధికారం అనే భావనను సూక్ష్మ, స్థూల స్థాయి సామాజిక సంబంధాలకు కూడా అన్వయించడానికి అనువుగా బ్లా రూపొందించగలిగాడు. ఉదాహరణలుగా నిబద్ధతలో అసమానత ఉన్న ఇద్దరు ప్రేమికుల మధ్య అధికారాన్ని, యాజమాన్యం ఉద్యోగుల మధ్య ఉన్న అధికార సంబంధాలను బ్లా పేర్కొన్నాడు.

అధికారం అడ్డూ అపూ లేకుండా సాగడం అన్ని పరిస్థితులలోనూ సాధ్యం కాదు. అందుకే ఆధీనతకు ఉన్న 

BRAOU

ప్రత్యామ్నాయాలను గురించి బ్లా ప్రస్తావించాడు. వినిమయంలో పాల్గొనే వ్యక్తులలో ఒకరు ఇచ్చే ఆదేశాలను పాటించ[illegible]ం లేని ప్రత్యమ్నాయ పరిస్థితులను బ్లా కింది విధంగా పేర్కొన్నాడు. ఈ సందర్భంలో బ్లా ఎమర్సన్ సూచించిన మార్గాన్నే అనుసరించి ఆధీనతను ఏవిధంగా తప్పించుకోవచ్చో ఈ క్రింది విధంగా తెలిపాడు.

1. ఒక వ్యక్తి మరో వ్యక్తి అందించే సేవలకు సమాన విలువ గల సేవలను అందించినప్పుడు వారి మధ్య ఏర్పడే సంబంధం సమానతా ప్రాతిపదికపై ఏర్పరడిన పారస్పరిక స్పందన అవుతుంది.

2. ఒక వ్యక్తి తనకు అవసరమైన సేవలను మరొకరినుంచి పొందడం ద్వారా అధికారానికి లోబడనవసరం ఉండదు.

3. తనకు అవసరమైన సేవలను మరొకరు అందించేటట్లు నిర్బంధం చేయగల వ్యక్తి ఎదుటి వ్యక్తిపై ఆధిపత్యం వహించగలుగుతాడు. తాను స్వయంగా అధికారానికి లొంగనవసరం ఉండదు.

4. ఏ సేవ అందించకుండానే తన అవసరాలు తీర్చుకోవచ్చు. లేదా ఆ సేవలకు ప్రత్యన్మాయాలను వెదుక్కోవచ్చు.

పై ప్రత్యమ్నాయాలు లేనప్పుడు వ్యక్తి అధికారానికి తలవంచక తప్పదు. ఎందుకంటే అవసరమైన సేవలను నియంత్రించగల శక్తి ఉన్నవాడికే ఇతరులను తన ఆదేశాలను పాటించే విధంగా ప్రవర్తింపజేసే అధికారం ఉంటుంది.

పై వివరణ ద్వారా అర్థం అయ్యేదేమిటంటే సేవలను నియంత్రించే శక్తిగల గల వ్యక్తి తన అధికారాన్ని నిలుపుకోవడానికి ఇతరులకు పై ప్రత్యామ్నాయాలు అందుబాటులో లేకుండా చేయడానికి ప్రయత్నిస్తాడు. అయితే అధీనతను తప్పించుకో దలచిన వ్యక్తులు ఒకవైపు సేవలు పొందుతూనే, పై ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉండేట్లు చూసుకొంటారు. ఈ విధంగా ఒక రకమైన ప్రయోజనాలకు సంబంధించిన సంఘర్షణ సేవలు అందించేవారికి, అందుకొనే వారికి మధ్య తలెత్తుతుంది అని బ్లా వివరించాడు. ఈ విధంగా ఉత్పన్నమయ్యే ప్రయోజనాల మధ్య సంఘర్షణ సమాజంలో ఆర్థిక, రాజకీయ, చట్టపరమైన సిద్ధాంతపరమైన రూపాలలో కనిపించడం ప్రారంభమవుతుంది.

BRAOU

వినిమయ సంబంధాలలో వచ్చే విభేదీకరణ వల్ల వినిమయ చర్య రూపాలు వ్యవస్థీకృతమై ప్రమాణీకరణం చెందుతాయి. వీటి ఆధారంగా సామాజిక నిర్మితులు ఏర్పడతాయి. పరస్పర విధి నిర్వహణలు, ప్రమాణాత్మక చర్యలు కలిసి సామాజిక శక్తుల మధ్య ఒక సమతౌల్య స్థితిని ఏర్పరచడానికి తోడ్పడతాయి. కానీ ఇందుకు భిన్నంగా సమాజంలో వ్యక్తికి వ్యతిరేక శక్తులు కూడా ఉన్నాయి. అవి ప్రకర్షణ, అసమతౌల్య స్థితిని, మార్పులను కలిగిస్తాయి.

## 14.7 అధికారాన్ని న్యాయసమ్మతమైందిగా చేయడం

ఒక ఉమ్మడి కార్యక్రమాన్ని చేపట్టి నిర్వహించడానికి కొందరు వ్యక్తులు ఒక సమూహంగా ఏర్పడతారు. వారు తలపెట్టిన కార్యం సాధించడానికి వారి ప్రేమనంతటినీ వివిధ భాగాలుగా విభజించడం, వివిధ సభ్యుల ప్రయత్నాలను సమన్వయపరచడం చేస్తారు. అంటే వ్యవస్థను ఏర్పరచవలసిన అవసరం ఉంటుందన్నమాట. 'వివిధ వ్యక్తులు నిర్వహించే కార్యకలాపాలను సరియైన మార్గంలో నడిపించడానికి ఉపయోగపడే వనరే అధికారం' అని బ్లా భావిస్తాడు. అయితే అధికారం అనేది ఒక సాధారణమైన వనరు మాత్రమేకాదు. దానితో ప్రాబల్యం పెనవేసుకొని ఉంటుంది. ఇలాంటి ప్రాబల్యం ఉన్న సందర్భాలన్నింటిలోనూ ఘర్షణ అనివార్య పర్యవసానమై ఉంటుంది. ప్రాబల్యం అనేది నిరోధానికి, వ్యతిరిక్తతకు, కొన్ని సందర్భాలలో విప్లవానికి మూలం కావచ్చు.

వ్యవస్థలను సమర్థవంతంగా సార్థకంగా నిర్వహించినప్పటికీ ఆ వ్యవస్థ నిరోధ భావనను, వ్యతిరిక్తతను సంపూర్ణంగా తొలగించలేదు. అధికారం చేతిలో ఉన్న వ్యక్తి వ్యవస్థలో సంఘర్షణ చోటుచేసుకోకుండా లేదా వీలైనంత తక్కువ సంఘర్షణ ఉండేందుకు ప్రయత్నం చేస్తాడు. అధికార స్థానంలో ఉన్న వ్యక్తులు తమ ఆదేశాలను అధీనులు ఆమోదించి, అనుసరించడానికి అనువైన పరిస్థితులను కల్పించడానికి ప్రయత్నిస్తాడు. అధీనులు అధికారుల

ఆదేశాలను ఆమోదించి అమలు చేస్తారు. ఇలాంటి పరిస్థితులలోనే అధికారం న్యాయసమ్మతమైంది, అంగీకారయోగ్యమైంది అవుతుంది.

వ్యక్తులు పొందిన పారితోషికాన్ని లేదా సేవను పారస్పరికత ప్రమాణాన్ని అందరూ అంగీకరించడం వల్ల వ్యక్తుల మధ్య వినిమయ ప్రక్రియ సుకరమవుతుంది. సమానుల మధ్య స్నేహవిశ్వాస బంధాలను - ఉన్నత అంతస్తు, నిమ్న అంతస్తు వారిమధ్య స్థాయి వ్యత్యాసాలను కల్పిస్తాయి. సామాజిక సంస్థలలో సమవినిమయ విధానం అధికారాల ఆమోద ప్రక్రియలకు మరింత బలం చేకూరుస్తుంది. ఈ సందర్భంలోనే బ్లా ఇలా పేర్కొన్నాడు. 'సామాజిక ప్రవర్తన, సామాజిక సంబంధాలు ఉమ్మడి విలువల ప్రమాణాల ప్రాతిపదికపై జనామోదం పొందుతాయి. దీనివల్ల ఆమోదిత ప్రవర్తన సబలమై సమాజంలో దీర్ఘకాలం అధికారం కొనసాగుతుంది'

అధికార సమ్మతి గురించి బ్లా చేసిన ఈ చర్చ అంతా ప్రకార్యవాద పంథాలోనే నడిచిందని గుర్తుంచుకోవాలి. వినిమయ సిద్ధాంత నమూనాలో ప్రకార్య సిద్ధాంత భావనలేకాక గతి తార్కిక సంఘర్షణ సిద్ధాంత భావనలను కూడా బ్లా వాడాడు. సమాజంలోని కొన్ని విలువలు బహుజన ఆమోదంతో సంస్థ కృతతం అయి వినిమయ సంబంధాలలో ప్రవేశిస్తాయి. మరికొన్ని విలువలు సామాజిక విధానంతో సంపూర్ణంగా సమన్వితం కావు. అంతేకాదు, ఇవి సంస్థలకు వ్యతిరేకంగా పనిచేసి సమాజంలో అసంతునాన్ని ప్రాతికూల్యాన్ని పెంచే శక్తులకు బలం చేకూరుస్తాయి. ఈ సందర్భంలోనే సామాజిక జీవితంలో గతితార్కిక శక్తులు పనిచేస్తాయి. అవి సమాజాన్ని వ్యతిరేక దిశలో లాగడానికి ప్రయత్నిస్తాయని బ్లా పేర్కొన్నాడు. అన్ని వ్యవస్థీకృత విలువలకు ప్రతిగా వ్యతిరేకించే విలువలు కూడా ఉంటాయి. నిర్ధేశించుకొన్న లక్ష్యాలు సాధించలేనప్పుడు సామాజిక వ్యవస్థలో మార్పులకోసం ప్రయత్నించడం జరుగుతుంది.

## సూక్ష్మ స్థూల స్థాయిలలో సామాజిక వినిమయం

బ్లా రచనల్లో సామాజిక వినిమయ విశ్లేషణ బిన్న స్థాయిలలో సాగుతుంది. చిన్న చిన్న సామాజిక యూనిట్ల మధ్య ఉన్న సంబంధం పరస్పర వైయక్తిక ఆకర్షణసూత్రం ఆధారంగా సాగుతుంది. స్థూలస్థాయిలో, అంటే బృహత్ సామాజిక స్థాయిలో ఏర్పడే సంబంధం ఉమ్మడి విలువల సూత్రం ఆధారంగా ఉంటుంది. సామాజిక నిర్మితులతో పోటీ, విభేదీకరణ, సమన్వయం మొదలైన ప్రక్రియలు కూడా ప్రాధాన్యం వహిస్తాయి. సామాజిక వినిమయ సంబంధాలు వ్యక్తులపై కాక సామాజిక నిర్మితులపై ఆధారపడి ఉంటాయి. ఎందుకంటే స్థూలస్థాయి సమాజంలో అందరు వ్యక్తులు ప్రత్యక్షంగా వినిమయ సంబంధాలు ఏర్పరచుకోలేరు. సామాజిక సంబంధాలను సామాజికులందరిలో ఏర్పరచడానికి ఒక మాధ్యమం అవసరం అవుతుంది. ఈ మాధ్యమమే సభ్యులందరి ఆమోదం పొందిన విలువలు, ప్రమాణాల రూపంలో ఉంటుంది. అధికారం సామాజిక స్తరీకరణలపై దృష్టి కేంద్రీకరించడానికి స్థూల స్థాయి సంబంధాలను తగిన విధంగా విశ్లేషించడం అవసరం. ఉమ్మడి విలువలు ప్రస్తుత సామాజిక సంబంధాలకు న్యాయ సమ్మతిని కల్పిస్తాయి. ఇలా చేయడం ద్వారా సామాజిక క్రమాన్ని ఒడిదుడుకులు లేకుండా కొనసాగించడానికి తోడ్పడుతుంది.

సమాజంలో వ్యతిరేక శక్తులు ఉంటాయన్న వాస్తవాన్ని బ్లా గుర్తించాడు. అందుకే సమస్యాత్మకం కాని సంతులనాన్ని, ఉమ్మడి విలువల వ్యవస్థ భావనను గానీ బ్లా ఎంతమాత్రమూ ఆమోదించలేదు. సామాజికుల వ్యక్తిగత ప్రయోజనాల మధ్య సంఘర్షణలు సమాజంలోని వివిధ వర్గాల, స్తరాలకు చెందిన వ్యక్తుల విలువలు, వ్యవస్థలోని కేంద్ర, అధికార వ్యవస్థల మధ్య దాని ఆధీన విభాగాల మధ్య సంఘర్షణ ఉంటూనే ఉంటుందని బ్లా గుర్తించాడు.

ప్రమాణం అనే భావన వినిమయస్థాయిని వ్యక్తి స్థాయినుంచి సమూహస్థాయికి పెంచేట్లు చేసింది. అయితే విలువలనే భావన దీన్ని పెద్ద తరహా సామాజిక స్థాయి నుంచీ సముదాయాల మధ్య సంబంధాల విశ్లేషణకు దారి తీసింది. బ్లా విలువలకు సంబంధించి నాలుగు రకాల మౌలిక విలువలను, అవి నిర్వహించే నాలుగు విభిన్న ప్రకార్యాలను గురించి ప్రస్తావించాడు. అవి:

1. ప్రత్యేక విలువలు: ఈ విలువలు సమైక్యానికి, సంఘీభావానికి మాధ్యమాలుగా పనిచేస్తాయి. దేశభక్తి, పాఠశాల



BRAOU

ప్రయోజనం, లేదా ఒక కంపెనీ ప్రయోజనం వంటి అంశాలకు సంబంధించిన విలువలు సభ్యులను సమైక్య పరుస్తాయి. ఇవే సమాజస్థాయిలేదా సముదాయ స్థాయిలో ముఖాముఖి సంబంధాల నేపథ్యంలో వ్యక్తిగత ఆకర్షణలకు మూలమవుతాయి. ఈ విలువలు అంతస్సమూహం, బాహ్య సమూహాల మధ్య ఉన్న విభేదాన్ని స్పష్టంగా చూపుతాయి.

2. విశ్వజనీనమైన విలువలు: ఇవి వినిమయ యోగ్యమైన భిన్న రకాల వస్తువుల విలువలను తులనాత్మకంగా పరిశీలిచడంలో ఉపయోగపడే ప్రమాణాలని బ్లా భావిస్తాడు. ఇలాంటి ప్రమాణాలుండడం అనేది పరోక్ష వినిమయ సాధ్యమవుతుంది. ఒక వ్యక్తి సముదాయంలోని ఒకానొక భాగానికే తన సేవలందిస్తూ ఉండవచ్చు. పైన తెలిపిన విశ్వజనీనమైన విలువల ఆధారంగా అతడి సేవలకు విలువనుకట్టి తగిన విధంగా ఆ వ్యక్తిని సన్మానించవచ్చు. ఉదాహరణకు ఉన్నత సామాజిక అంతస్తునిచ్చి సన్మానించవచ్చు.

3. అధికారానికి చట్టబద్ధత లేదా న్యాయ సమ్మతి కల్పించే మూడో తరహా విలువలు సమాజంలో కొందరికే గౌరవప్రద స్థానం, ప్రత్యేక అధికారాలు కల్పించడం (ఉదాహరణకు. అధిపతులు, అధ్యక్షులు మొదలైనవారు) ద్వారా బ్లా సామాజిక నియంత్రణ పరిధిని విస్తృతం చేశాడు. ఇది నాలుగో రకం విలువలతో సంబంధం కలిగినటువంటింది.

4. వ్యతిరేకతా విలువలు: ఇవి ఉన్న అధికార యంత్రాంగాన్ని సంపూర్ణంగా ఏకమై ప్రస్తుత వ్యవస్థను, అధికార యంత్రాంగాన్ని సంపూర్ణంగా మార్చడానికి ప్రయత్నించడాన్నే (వ్యతిరేకించడం కాని విప్లవ పంథాను అనుసరించడం ద్వారా కానీ) మార్పును ఆశించడం ఈ కోవకు చెందిన విలువలు, అంటే అధికారానికి చట్టబద్ధత కల్పించిన విలువలను వ్యతిరేకించేవే నాలుగో రకం విలువలు.

## 14.8 విమర్శ

బ్లా సామాజిక వినిమయ సిద్ధాంతం అభివృద్ధికి ఎంతో కృషి చేసినా విమర్శకులను మాత్రం సంపూర్ణంగా సంతృప్తి పరచలేక పోయాడు. బ్లా సిద్ధాంతంపై వచ్చిన విమర్శలను గురించిన చర్చ ఇప్పుడు ప్రారంభిద్దాం. పైన పేర్కొన్న నాలుగు విలువలు హోమన్స్‌కు ఆసక్తి ఉన్న వ్యక్తి - వ్యక్తి తాలూకు ప్రవర్తన అనే అంశాలు వినిమయ సిద్ధాంతంలోని అంశాలు - బ్లా విశ్లేషణలో వ్యక్తులకే పరిమితం కావు. అతడి విశ్లేషణలో వ్యక్తుల స్థానంలో సాఘాజిక వాస్తవాంశాలకు చోటు కల్పించడం జరిగింది. బ్లా తన సిద్ధాంతంలో సమూహాలు, వ్యవస్థలు, సమాజాలు, ప్రమాణాలు, విలువల వంటి అంశాలను చర్చించాడు. పెద్ద తరహా సామాజిక వ్యవస్థల మధ్య సమైక్యత ఎలా ఏర్పడుతుంది, ఈ సమైక్యత ఎలా విచ్ఛిన్నమవుతుంది అనేవి వాస్తవానికి సామాజిక ఫాసిస్ట్ భావాలేనని కొందరు భావిస్తారు.

వినిమయ సిద్ధాంతాన్ని సమాజస్థాయికి అన్వయించడమే తాను చేసిన ప్రయత్నమని బ్లా చెప్పుకున్న పర్యవసానం మాత్రంవేరుగా ఉంది. అసలు వినిమయ సిద్ధాంతం రూపమే గుర్తుపట్టలేకుండా మారిపోయిందని విమర్శకుల వాదన. సమాజస్థాయిలో జరిగే వినిమయ ప్రక్రియలు, వ్యక్తి స్థాయిలోని వాటికి పూర్తిగా భిన్నమైననే వాస్తవాన్ని బ్లా అంగీకరించ తప్పలేదు. వినిమయ సిద్ధాంత పరిధిని విస్తృత పరచడంలో దాన్ని ఒక స్థూల స్థాయి సిద్ధాంతంగా రూపొందించడంలోనే కృతకృత్యుడయ్యాడని విమర్శకుల అభిప్రాయం. వినిమయ సిద్ధాంతం ప్రధానంగా ముఖాముఖి (ప్రత్యక్ష) వ్యక్తుల మధ్య సాగే వినిమయానికి సంబంధించినదేననే వాదనను బ్లా అంగీకరించాడు. కానీ దానిని మరింత పటిష్ట పరచడానికి, విశాల ప్రయోజనం చేకూర్చడానికి ఇతర సిద్ధాంతాలను కూడా ఆశ్రయించాల్సిన అవసరముందనే వాస్తవాన్ని బ్లా ప్రత్యేకంగా పేర్కొన్నాడు. 1994 నాటి రచనలలో బ్లా తన దృష్టిని ప్రధానంగా స్థూల స్థాయి నిర్మితీయ దృగ్విషయాలపైనే కేంద్రీకరించాడని చెప్పవచ్చు.

## 14.9 సారాంశం



సామాజిక జీవితం అనేది ఒక మార్కెట్ స్థలం లాంటిదని బ్లా భావించాడు. వ్యక్తులు ఒకరితో ఒకరు సంబంధాలు

పెంచుకొని భౌతిక, మానసిక పారితోషికాలు రాబట్టడానికి కృషి చేస్తారు. ఇలా పారితోషికం తీసుకొన్న వ్యక్తి అది ఇచ్చిన వ్యక్తికి ఏదో రూపంలో పారితోషికాన్ని తిరిగి ఇస్తాడు. ఇలాంటి వాటి వల్ల భవిష్యత్తులో పారితోషికాలు లభించే అవకాశాలు పెరుగుతాయి. ఈ ఇచ్చిపుచ్చుకోవడాలు కొన్ని ప్రమాణాల ఆధారంగా జరుగుతాయి. ఈ నేపథ్యంలోనే బ్లా తన సామాజిక వినిమయ సిద్ధాంత ప్రతిపాదనలు చేశాడు. పారితోషికాలు ఏప్రమాణాల ఆధారంగా ఇచ్చిపుచ్చుకొంటారో, సామాజిక వినిమయాన్ని నిర్ధారించే పరిస్థితులు ఎలా ఉంటాయో, అవి ఏమిటో ఈ భాగంలో చర్చించుకున్నాం. ఈ సందర్భంలోనే సామాజిక ఆర్థిక వినిమయాల మధ్య విభేదాలు ఏమిటో కూడా బ్లా వివరించాడు.

సామాజిక వినిమయం జరిగే పరిస్థితులను వివరించడంలో బ్లా వినిమయాలలో ఉండే వ్యత్యాసాలను గురించి కూడా చర్చించాడు. వినిమయ సంబంధాలలోని విభేదీకరణవల్ల అధికార అధీన సంబంధాలు ఏర్పడతాయని బ్లా భావించాడు. ఎమర్సన్ మాదిరిగానే అధికార ఆధీన సంబంధాలను గురించి వివరంగా చర్చించాడు. అధికారం ఎలా ఏర్పడుతుందో, అధీనతను తప్పించుకునేందుకు వ్యక్తులు అనుసరించే మార్గాలేమిటో బ్లా వివరించాడు. అలాగే అధికారానికి న్యాయసమ్మతిఎలా లభిస్తుందో కూడా విపులంగా ఈ భాగంలో చర్చించడం జరిగింది. ఈ భాగంలో సక్ష్మ, స్థూల స్థాయిల్లో సామాజిక వినిమయం గురించి కూడా చర్చించాం. హోమన్స్ తన సామాజిక వినిమయ విశ్లేషణ అంతా వ్యక్తికీ-వ్యక్తికీ మధ్య సంబంధాన్ని వివరిస్తే బ్లా తన విశ్లేషణను సమాజానికి అంతటికీ వర్తించేట్లు రూపొందించాడు.

## 14.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. హోమన్స్, బ్లా ల వినిమయ సిద్ధాంతాల మధ్య ఉన్న పోలికలను, భేదాలను గురించి చర్చించండి.

2. అధికారానికి, న్యాయసమ్మతి లభించడం అనేది ఎలా జరుగుతుందో బ్లా సిద్ధాంత చర్చద్వారా వివరించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. బ్లా ప్రతిపాదించిన సామాజిక వినిమయ సిద్ధాంతంను గురించి చర్చించండి.

2. అధికారం, విభేదీకరణకు సంబంధించి బ్లా విశ్లేషణను తెలుపండి.

## 14.11 చదవవదగిన పుస్తకాలు


G. Raghavendra Rao : Samaja Shasthriya Sidhantham, Telugu Academi, Hyderbad, 1988.

Lewis, A. Coser : Masters of Sociological Thought, in Historical and Social Context, Rawat Publications, Jaipur, 1996.


BRAOU

# భాగం-15: రిచర్డ్ ఎమర్సన్

విషయక్రమం

15.0 ఉద్దేశాలు

151 పరిచయం

15.2 జీవితవిశేషాలు

15.3 ఎమర్సన్ సామాజిక వినిమయ సిద్ధాంతం

15.4 అధికార అధీనతా సంబంధం

15.5 విమర్శ

15.6 సారాంశం

15.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

15.8 చదువదగిన పుస్తకాలు

## 15.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ఇతర వినిమయ సిద్ధాంతాలకంటే ఎమర్సన్ సిద్ధాంతం ఏవిధంగా భిన్నంగా ఉంటుందో తెలుసుకుంటారు.
- ఎమర్సన్ సామాజిక వినమయ సిద్ధాంతం ముఖ్యాంశాలను అవగాహన చేసుకుంటారు.
- అధికారత, అధీనత సంబంధాల గురించి తెలుసుకుంటారు.

## 15.1 పరిచయం

సామాజిక వినిమయ దృక్పథానికి సంబంధించి హోమన్స్, బ్లాల తరువాత పేర్కొనదగిన ప్రముఖ శాస్త్రవేత్త రిచర్డ్ ఎమ్. ఎమర్సన్. వినిమయ సిద్ధాంతం పట్ల అతనికున్న ఆసక్తి 1962లో ప్రచురించిన 'అధికార అధీనతా సంబంధాలు' అనే గ్రంథం ద్వారా స్పష్టమయ్యాయి. హోమన్స్, బ్లాల సామాజిక వినిమయ సిద్ధాంతాలలోని సమస్యలను కొంత వరకు తగ్గించే ప్రయత్నం ఇతడు చేశాడు. హోమన్స్ వ్యక్తి ప్రవర్తనను విశ్లేషణ యూనిట్‌గా పరిగణించగా ఎమర్సన్ సామాజికుల మధ్య నెలకొన్న సామాజిక సంబంధాలనే విశ్లేషణ యూనిట్‌గా స్వీకరించాడు. వినిమయసిద్ధాంతాన్ని సవివరంగా ప్రతిపాదించడానికి ఎమర్సన్ అనుభవమే ప్రాతిపదిక అని చెప్పవచ్చు. ఎమర్సన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలను అవగాహన చేసుకోవడానికి అతడి జీవిత విశేషాలు ఎంతగానో తోడ్పడతాయి.

## 15.2 జీవిత విశేషాలు

రిచర్డ్ ఎమ్. ఎమర్సన్ 1925లో ఉటాలోని సాల్ట్‌లేక్ పట్టణంలో జన్మించాడు. ఇతని బాల్యమంతా పర్వతాలు, నదులు హిమనదాల ఒడిలోనే గడిచింది. ఈ పరిసరాలు అతడి జీవితంపై చెరగని ముద్రవేశాయి. 1963లో ఎవరెస్ట్ శిఖరాధిరోహణ బృందంలో పాల్గొనేటట్లు ప్రోత్సహించాయి. శిఖరాధిరోహణలోని అనుభవాలు ఇవంఎట్ ట్రావెల్ రూపంలో వెలువడ్డాయి. దీర్ఘకాలం ఒత్తిడికి గురైన పర్వతారోహకుల మధ్య నెలకొనే సామాజిక సంబంధాలను

అధ్యయనం చేయడానికి నేషనల్ సైన్స్ ఫౌండేషన్నుంచి ఆర్థిక సహాయం కూడా అందింది. ఈ ప్రాజెక్టు అతనికి హబ్బార్డ్ పతకాన్ని సంపాదించి పెట్టింది. దీనిని 1963లో నేషనల్ జియోగ్రాఫికల్ సొసైటీ తరపున అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ కెనెడీ చేతుల మీదుగా అందుకొన్నాడు. పర్వత ప్రాంతాలలో గ్రామీణ ప్రజల జీవితాలు పాకిస్తాన్లోని సామాజిక పరిశోధనకు స్ఫూర్తినిచ్చాయి. ఈ స్ఫూర్తితోనే అతని జీవిత కాలమంతా సామాజిక సంబంధాల విశ్లేషణలోనే గడిచింది. పర్వతారోహకుల బృందాలను తరచు కలుసుకోవడం, కలిసి పనిచేయడం వల్ల అతనిలో వ్యక్తుల పరస్పర ప్రవర్తనను, సామూహిక నిష్పాదనను అధికారము సామాజిక ప్రభావం వంటి అంశాలను లోతుగా పరిశీలించడానికి అవసరమైన ఉద్దీపనను కల్పించాయి. ముఖ్యంగా పర్యావరణ ఒత్తిడులున్న పరిస్థితులలో ఆ బృందాలలోని సభ్యుల మధ్య నెలకొని ఉండే సహకారం, స్పర్ధలు ఎలాంటివో, ఎంత తీవ్రంగా ఉంటాయో అనుభవపూర్వకంగా తెలుసుకోగలిగాడు. ఈ నేపథ్యంలో ఇతడు సామాజిక వినిమయ సిద్ధాంతానికి ఒక స్పష్టమైన రూపాన్నిచ్చాడు. అంతకు పూర్వమున్న సామాజిక వినిమయ సిద్ధాంతాన్ని పరిష్కరించి నూతన సిద్ధాంత ప్రతిపాదన చేశాడు.

రెండో ప్రపంచ యుద్ధం తరువాత, సైన్యంతోపాటు పశ్చిమ ఐరోపా పర్యటించిన కాలంలోనే 1950లో ఉటా విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ పట్టా పుచ్చుకున్నాడు. 1952లో ఎమ్.ఎ పట్టాను, 1955లో పిహెచ్డి డిగ్రీని మిన్నెసోటా విశ్వవిద్యాలయం నుంచి పొందాడు. అధ్యయనానికి ఇతడు స్వీకరించిన ప్రధానాంశం సమాజశాస్త్రం. కాగా, మైనర్ అంశంగా మనో విజ్ఞానశాస్త్రాన్ని ఎన్నుకొన్నాడు. డాక్టరేట్ పట్టాకు అతడు సమర్పించిన బృహత్ వ్యాసం The Determinants of influence in face to face groups.

ఎమర్సన్ అకాడమిక్ జీవితం (1955-64) సిన్‌సినాటి విశ్వవిద్యాలయంలో అధ్యాపక వృత్తితో ప్రారంభమైంది. అధ్యాపక వృత్తి విరమించాక అతడు తన గురించి ఈ విధంగా రాసుకొన్నాడు - A recurring theme in my work in the article on power dependence relations అంటే పర్వతారోహకుల బృందంలో పాల్గొనడంతో విశ్వవిద్యాలయ అధ్యాపక వృత్తి ద్వారా గడించిన అనుభవం, పరిపక్వతల ఆధారంగా తన పరిశోధనా కార్యక్రమాన్ని కొనసాగించి 'అధికార ఆధీనతా సంబంధాల' తాలూకు నిర్దిష్ట సిద్ధాంతాన్నొకదాన్ని ప్రతిపాదించగల స్థాయికి ఎదిగాడు. ఈ సిద్ధాంతం గతకాలపు సిద్ధాంతాల సంక్షిప్త రూపం కాగా, భవిష్యత్ ఆలోచనాధోరణులకు అద్దం పడుతుంది. ఇతని పరిశోధన కేవలం పై అంశానికే పరిమితం కాక సమాజ స్తరీకరణ, సముదాయ అధికార నిర్మితులకు సంబంధించి అనుభవిక సాక్ష్యాధారాలను పోగుచేయగలిగే విధంగా విస్తరించింది. ఈ పరిశోధన కొనసాగుతున్న కాలంలోనే 1982 డిసెంబర్‌లో ఆయన మరణించాడు. ఇతడు చేసిన అధికార ఆధీనతా సంబంధాల విశ్లేషణ భావస్ఫోరకంగాను, ప్రామాణికంగానూ విజ్ఞుల ఆమోదం పొందింది. అంతేకాక అమెరికన్ సమాజశాస్త్రాన్ని ఎంతగానో ప్రభావితం చేసింది.

BRAOU

ఎమర్సన్ రచనల్లో రెండు ముఖ్యమైన అధ్యయనాలు ఇతరుల రచనలపై అత్యధిక ప్రభావాన్ని చూపాయి. సామాజిక వినిమయ సిద్ధాంతం వివరించే ఈ రెండు అధ్యయనాలను 1967లో తయారు చేసి 1972లో ప్రచురించాడు. ఈ రచనా వ్యాసంగం వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న (1965) కాలంలో జరిగింది. ఇక్కడ పనిచేస్తున్నపుడే ఎమర్సన్ భావాలకు ఒక స్పష్టమైన రూపం ఏర్పడిందని చెప్పవచ్చు. సామాజికసంబంధాలు, సామాజిక వినిమయ ప్రక్రియలకు సంబంధించి ఇతడు సాగించిన పరిశోధనలో కారెన్ కూక్ ఎంతో సహకరించారు. వీరిద్దరూ కలిసి కంప్యూటర్ సదుపాయం ఉన్న ప్రయోగశాలలో తమ పరిశోధనలను కొనసాగించారు. ఈ పరిశోధనకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని నేషనల్ సైన్స్ ఫౌండేషన్ సమకూర్చింది.

ఎమర్సన్ సహోద్యోగులు, విద్యార్థులు అయనను గొప్ప భావకుడుగా లేదా తత్వవేత్తగా ప్రశంసించేవారు. ఏ సిద్ధాంత ప్రతిపాదనకైనా అనుభవమే ఆధారంగా ఉండాలి అనేది ఎమర్సన్ ధృఢ విశ్వాసం.

## 15.3 ఎమర్సన్ ప్రతిపాదించిన సామాజిక వినిమయ సిద్ధాంతం

ఎమర్సన్ 1962లోనే అధికార ఆధీనతా సంబంధాల గురించి ఒక పరిశోధనా పత్రం సమర్పించినా 1972లో ఈ అంశానికి సంబంధించి ఇతడు ప్రచురించిన పరిశోధనా వ్యాసాలే సామాజిక వినిమయ సిద్ధాంత రూపకల్పనకు ప్రారంభ దశగా పేర్కొనాల్సి ఉంటుంది. సామాజిక వినిమయ సిద్ధాంత ప్రతిపాదనకు ఎమర్సన్ను ప్రేరేపించిన మౌలిక

అంశాలను గురించి మామ్, కుక్‌లు ప్రస్తావించి మూడు ముఖ్యమైన అంశాలను పేర్కొన్నాడు.అవి:

1. ఎమర్సన్ ఇంతకు ముందు ప్రతిపాదించిన అధికార ఆధీనతా సంబంధాల సిద్ధాంతాన్ని ఒక విశాల ప్రాతిపదికన ఏర్పరచడంలో అతనికున్న ఆసక్తి, ఎమర్సన్ దృష్టిలో వినిమయ సిద్ధాంతానికి కీలకమైన అంశం అధికారమే.

2. ఇలా అనుకోవడం వల్ల ప్రవర్తనావాదాన్ని వినిమయ సిద్ధాంతానికి ప్రాతిపదికగా ఉపయోగించుకోవచ్చునని భావించాడు. ఇలా ఉపయోగించుకొన్న హోమన్స్‌కు ఎదురైన సమస్యలను తప్పించుకొనే ప్రయత్నం చేశాడు. హోమన్స్ ఇతర వినిమయ సిద్ధాంత కర్తలు మానవులందరూ హేతుబద్ధంగా ప్రవర్తిస్తారనే ఊహించారు. అయితే ఎమర్సన్ మాత్రం మానవుల హేతుబద్ధ ప్రవర్తనను ఊహించకుండానే ప్రవర్తనావాదాన్ని ఉపయోగించవచ్చునని భావించాడు. ప్రవర్తనా వాదాన్ని సామాజిక వినిమయ సిద్ధాంతానికి ప్రాతిపదికగా వాడుకోవడంలో హోమన్స్‌కు ఎదురైన పునరుక్తి సమస్యను తొలగించవచ్చునని ఎమర్సన్ భావించాడు. ఒక వ్యక్తి వినిమయ ప్రవర్తన మరో వ్యక్తి సహకారంపై ఆధారపడి ఉంటుందని హోమన్స్ భావించాడు. కానీ, ఎమర్సన్ దృష్టిలో ప్రవర్తనా స్పందనలు, సహకారం అనేవి ప్రవర్తనా వాదంలో స్వతంత్ర అర్థం ఉన్న అంశాలు కావు. అంతేకాక స్థూల స్థాయి దృగ్విషయాలను వివరించగలిగేటట్లు వినిమయ సిద్ధాంతాన్ని రూపొందించడం ద్వారా ఎమర్సన్ సూక్ష్మీకరణ లోపాన్ని తొలగించగలిగాడు.

3. బ్లా ఉపయోగించినట్లు నిర్దేశాత్మక దృగ్విషయాలను వివరించడం కాక ఎమర్సన్ వివిధ స్థాయిలలోని సామాజిక నిర్మితి, సామాజిక మార్పు వంటి అంశాలను తన సిద్ధాంత ప్రతిపాదనకు నిర్మాణ సామాగ్రిగా వాడుకున్నాడని మామ్, కుక్‌లు పేర్కొన్నారు. అంతేకాక ఇతర సిద్ధాంత కర్తల మాదిరిగాకాక ఎమర్సన్ సమాజంలో సాగే వినిమయ ప్రక్రియ కేవలం వ్యక్తులకే పరిమితం కాక కార్పోరేట్ సంస్థలకు కూడా అన్వయించేటట్లు రూపొందించాడు. అంటే ఎమర్సన్ ప్రచాలక మనోవిజ్ఞానశాస్త్ర సూత్రాల ఆధారంగా ఒక సామాజిక నిర్మితి సిద్ధాంతాన్ని ప్రతిపాదించడానికి ప్రయత్నించాడు.

1972లో ఎమర్సన్ ప్రచురించిన రెండు వ్యాసాలలోను తన సమీకృత వినిమయ సిద్ధాంతానికి పునాదివేశాడు. మొదటి వ్యాసంలో ఎమర్సన్ సామాజిక వినిమయానికి ఆధారమైన మానసికాంశాలను గురించి ప్రస్తావించాడు. రెండో వ్యాసంలో సంసక్తిజాలంపై దృష్టికేంద్రీకరించాడు. తరువాత స్థూల, సూక్ష్మస్థాయిల మధ్య సంబంధాన్ని మరింత స్పష్టంగా వివరించడానికి ప్రయత్నించాడు. ఎమర్సన్ ఉపయోగించిన నిర్మితలు సంసక్తి జాలం అనేది వ్యక్తులు, సంస్థల మధ్య ఉన్న సంబంధాల వివరణ తాలూకు భావనాపరమైన లోపాలను సరిదిద్దడానికి ఎంతగానో తోడ్పడింది.

ఎమర్సన్, అతని అనుచరుడైన కుక్‌లు వినిమయం సూక్ష్మస్థాయిలోనే అంటే వ్యక్తులస్థాయిలోనే ప్రారంభమవుతుందని, ఆదాన ప్రధానాల వల్ల వ్యక్తులు లబ్ధి పొందుతారని వినిమయం ద్వారా సామాజిక పరస్పర చర్యకు తోడ్పడతారని ఏకీభవిస్తాడు. ముఖ్యంగా ఎమర్సన్ ప్రవర్తనా సూత్రాలే వినిమయానికి మూలమని భావిస్తాడు. ఎమర్సన్ తన వినిమయ సిద్ధాంతానికి సంబంధించి మూడు ముఖ్యమైన ప్రమేయాలను పేర్కొన్నాడు. అవి:

1. తమకు ప్రయోజనకరమైన సంఘటనలలోనే వ్యక్తులు హేతుబద్ధంగా ప్రవర్తిస్తారు. ఇలా ప్రవర్తించడం వల్లే అటువంటి సంఘటనలు చోటు చేసుకుంటాయి.

2. ప్రవర్తనా సంఘటనల వల్ల కొంత కాలానికి వ్యక్తులు పరితృప్తి చెందుతారు. కాబట్టి వాటి ద్వారా లభించే ప్రయోనజం క్షీణిస్తుంది. దీనినే క్షీణ ప్రయోజనం అంటారు.

3. సామాజిక ప్రక్రియలో వ్యక్తులకు లభించే ప్రయోజనాలు వినిమయం ద్వారా వారు అందించే ప్రయోజనాలపై ఆధారపడి ఉంటాయి.

ఎమర్సన్ రాసిన రెండో అధ్యయసంలో తన దృష్టిని సామాజిక వినిమయ సంబంధాలు, వినిమయ సంసక్తిజాలంపై కేంద్రీకరించాడు. స్థూల స్థాయి వినిమయంలో పాల్గొనేవారు వ్యక్తులు కావచ్చు. సంస్థలు కావచ్చు.



BRAOU

వీరినే వినిమయ ప్రక్రియలో పాల్గొనే వివిధ పాత్ర దారులుగా ఎమర్సన్ పేర్కొంటాడు. ఎమర్సన్ పరిశీలనంతా ఈ ప్రక్రియలో పాల్గొనే పాత్రదారుల మధ్య ఉన్న సంబంధాలపైన ఆధారపడి ఉంది. ఎమర్సన్ పేర్కొన్న వినిమయ నెట్‌వర్క్‌లోని అంశాలను ఈ క్రింది విధ:గా గుర్తించవచ్చు.

1. కొందరు వ్యక్తులుగానీ, సామూహిక సంస్థలుగానీ పాత్రధారులై ఉంటారు.

2. విలువైన వనరుల పంపిణీ వీరి మధ్య జరుగుతుంది.

3. ఈ నెట్‌వర్క్‌లోని అందరు పాత్రధారులకు వివిధ రకాల వినిమయ అవకాశాలు ఉంటాయి.

4. వినిమయ సంబంధాలు, వినిమయ అవకాశాలు ఈ ప్రక్రియలో పాల్గొనే అందరు పాత్రధారులకు అందుబాటులో ఉంటాయి.

5. వినిమయ సంబంధాలన్నీ ఒకే ఒక నెట్‌వర్క్ నిర్మితిలో ముడివడి ఉంటాయి.

వినిమయ నెట్ వర్క్ అంటే ఒక నిర్దిష్టమైన సామాజిక నిర్మితి. అది వివిధ పాత్రధారుల మధ్య నెలకొని ఉన్న వినిమయ సంబంధాలకు సంబంధించినది. ఇద్దరు పాత్రధారుల మధ్య వినిమయం విషయంలో పైన పేర్కొన్న వినిమయ సంబంధాలకు ఎంతో ప్రాముఖ్యం ఉండడమే కాక అది కీలకమైన అంశంగా కూడా ఇద్దరు పాత్రధారుల మధ్య ఉన్న సంబంధాలకు ఆగంతుక సంబంధం లేదా ఏర్పడబోయే సంబంధం అత్యంత కీలకమైనది. ఉదాహరణకు ఎ, బి అనే ఇద్దరు వ్యక్తుల మధ్య సంబంధం కనిష్ఠ సంసక్తి జాలం అవుతుంది. అంటే ఒక వినిమయం జరగాలంటే కనీసం ఇద్దరు వ్యక్తులు అవసరం. సి అనే మరో వ్యక్తి కూడా ఈ నెట్‌వర్క్‌లో సభ్యుడైనంత మాత్రాన సరిపోదు. ఎ,బి,సిలు కలసిన నెట్‌వర్క్‌లో వీరి మధ్య ఆగంతుక సంబంధాలు నెలకొన్నప్పుడే - వినిమయ సంబంధాలు స్పష్టమైన రూపం దాలుస్తాయి. ప్రతి వినిమయ సంబంధం ఒక విస్తృతమైన అంటే రెండు లేక అంతకంటే మించిన సంబంధాలున్న నెట్‌వర్క్‌లో అంతర్భాగమై ఉంటుంది. ఒక వినిమయం మరో వినిమయాన్ని ప్రభావితం చేస్తున్నప్పుడు ఆ రెండింటి మధ్య సంబంధమున్నట్లు గుర్తించవచ్చు. ఆ సంబంధాన్ని ధనాత్మక సంబంధంగా భావించవచ్చు. ఇలాంటి సంబంధాలలో ఒక సంబంధం మరో సంబంధంపై ధనాత్మక లేదా సకారాత్మక ప్రభావాన్ని చూపుతుంది. ఉదాహరణకు ఒక వినిమయ ప్రక్రియ ద్వారా సంపాదించిన ధనాన్ని మరో వినిమయంలో సామాజిక అంతస్తును సంపాదించడానికి ఉపయోగించినప్పుడు ఆ రెండు వినిమయాల మధ్య సంబంధం సకారాత్మక సంబంధం అవుతుంది. దీనికి భిన్నమైనది ఋణాత్మక సంబంధం. అంటే ఒక వినిమయం మరొక వినిమయంలో పాల్గొనడానికి అవరోధం అయితే అది నకారాత్మక లేదా ఋణాత్మక సంబంధమవుతుంది. ఉదాహరణకు ఒక వినిమయం ద్వారా ధనం సంపాదించడంలో వెచ్చించిన కాలం కారణంగా మరో సంబంధంలో స్నేహితులతో గడిపే కాలాన్ని తగ్గించడం అనే దానిని పరిగణించవచ్చు.

ఎమర్సన్‌కు ముందు సామాజిక వినిమయ సంబంధాలను గురించి విశ్లేషించిన వారికంటే ఎమర్సన్ మరింత సమగ్రమైన సామాజిక వినిమయ సంబంధాల సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అంటే ఎమర్సన్ ప్రతిపాదనకు ముందున్న సిద్ధాంతాలు కేవలం సూక్ష్మస్థాయిలో జరిగే వినిమయ ప్రక్రియకు పరిమితమైతే ఎమర్సన్ సిద్ధాంతం సామాజిక నెట్‌వర్క్ అంతటికీ విస్తరించేటంత సమగ్రమైన సిద్ధాంతం. ఇతరులు ఈ ప్రక్రియలో పాల్గొనే ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే వినిమయాన్ని గురించి ప్రస్తావించగా ఎమర్సన్ వ్యక్తులేకాక కార్పోరేట్ సంస్థల మధ్య జరిగే సంబంధాలను కూడా వివరించాడు. ఒక్క మాటలో చెప్పాలంటే సమాజం యావత్తునూ ఒక సమగ్ర దృష్టితో పరిశీలించాడన్నమాట.

## 15.4 అధికారం ఆధీనతా సంబంధాలు

ఎమర్సన్ ప్రతిపాదించిన మరో సిద్ధాంతం అధికార ఆధీనతా సంబంధాల సిద్ధాంతం. సామాజిక వినిమయ సిద్ధాంతంలో అధికారానికి ప్రముఖపాత్ర ఉన్నట్లు ఎమర్సన్ గుర్తించాడు. ఈ సిద్ధాంతం వివరంగా తెలుసుకునే



BRAOU

ముందు అధికారం, అధీనతలకు ఎమర్సన్ ఇచ్చిన నిర్వచనాలను తెలుసుకోవడం ఎంతైనా అవసరం. వినిమయంలో ఒక వ్యక్తి మరో వ్యక్తి అంగీకరించగల సంభావ్య వ్యయమే అధికారం అని, ఇదే ఒక వినిమయ సంబంధంలో ఎదుటి వ్యక్తి అంగీకరించే సంభావ్య వ్యయస్థాయి అని ఎమర్సన్ అంటాడు. ఈ సంభావ్య వ్యయస్థాయి ఒక వ్యక్తి అధీనత అనేదానిపై ఆధారపడి ఉంటుంది. ఈ భావనలకు ఎమర్సన్ ఇచ్చిన నిర్వచనాలను బట్టే సామాజిక వినిమయ సంబంధాలకు వర్తించే అధికార అధీనతా సిద్ధాంతాన్ని యమగిషి, గిల్మోర్, కూక్‌లు కింది విధంగా వివరించారు.

'వినిమయ సంబంధాలలో ఒక పార్టీ (ఒకవ్యక్తి)కి మరో పార్టీపై ఉన్న అధికారం వ్యక్తుల మధ్య ఉన్న ఆధీనతకు విలోమంగా ఉంటుంది. అధికారం, అధీనతలలోని అసమానత సంబంధాలలో అసంతులనానికి దారితీస్తుంది. అయితే కాలం గడిచేకొద్దీ అసంతులనం తొలగిపోయి అధికార అధీనతా సంబంధాలలో సంతులనం ఏర్పడుతుంది'.

ఎమర్సన్ రచనలన్నింటిలో అధీనతా భావన అత్యంత కీలకమైనదని మామ్, కూక్‌ల అభిప్రాయం. ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న పరస్పర చర్య తాలూకు నిర్మితీయ నిర్ధారకాలు ఒకరిపై ఒకరికున్న అధికారం అనేవి ముఖ్యమైన అంశాలు.

ఇంతకు ముందు ఇచ్చిన ఉదాహరణలలో (ఎ,బి,సిల మధ్య సంబంధంలో) ఎ, బి ల మధ్య అధీనతలోని సమానత్వం, బి, ఎల అధీనతకు సమానంగా ఉంటుంది. ఆధీనతలో అసమానత ఉన్నప్పుడు తక్కువ అధీనత ఉన్న పార్టీదే అధికారానికి సంబంధించినంత వరకు పైచేయిగా ఉంటుంది. దీనిని బట్టి చూస్తే ఎ, బిల మధ్య ఉన్న సంబంధంలో అధికార సంభావ్యత అంశాన్ని ప్రవేశపెట్టినట్లు అవుతుంది. సంబంధాలలో సంతులనం ఉన్న పరిస్థితులలో కూడా కొంత అధికారం ఉంటూనే ఉంటుంది. అయితే అది ఒక మోస్తరు సంతులనంలో ఉంటుంది.

అధికార అధీనతా సంబంధాల అధ్యయనాలలో మనకు కనిపించే మరో రెండు అంశాలు ధనాత్మక, ఋణాత్మక ఫలితాలు. అవే పారితోషికాలు, శిక్షలు. అంటే ఇతరులను పారితోషికాలతో సత్కరించడం ద్వారానూ వారిని శిక్షించడం ద్వారానూ అధికారం పొందవచ్చునన్న మాట. అయితే శిక్షించే అధికారం పారితోషికం ఇచ్చే అధికారం కంటే తక్కువైనదని మామ్ విశ్లేషించాడు. పారితోషికం ఇవ్వగల అధికారం ఉన్న వ్యక్తే శిక్షించే అధికారాన్ని కలిగి ఉండడం న్యాయ సమ్మతమని మామ్, క్విస్ట్, వెస్లీలు వ్యాఖ్యానించారు.

ఎమర్సన్ రూపొందించిన వినిమయ సంబంధాలలో అధికార ఆధీనతలకున్న పాత్ర చాలా ప్రముఖమైనది. అనేకమంది పాత్ర ధారులు పాల్గొంటున్న వినిమయ సంబంధాలలో ఎ, బి, సి, డి ప్రాథమిక అధీనత, అధికారం, సంతులనం అనేవి ఆటుపోట్లకు గురి అవుతూ ఉంటాయి. నూతన వ్యక్తులు ప్రవేశించడం, నూతన వనరుల వినిమయంలో ప్రవేశించడం వల్ల సామాజిక వినిమయ సిద్ధాంతాన్ని వివరించడంలో ఎమర్సన్ గణిత పరమైన నమూనాలను ఆధారంగా తీసుకున్నాడు.

ఎమర్సన్ ప్రతిపాదించిన సామాజిక వినిమయ సిద్ధాంతాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ టర్నర్ దానిలోని ముఖ్యమైన విశేషాలను ఇలా పేర్కొన్నాడు.

1. సూక్ష్మీకరణలోపాన్ని ఎమర్సన్ సిద్ధాంతం తప్పించుకొంది.

2. పునరుక్తి దోషాన్ని నివారించగలిగింది.

3. ఈ సిద్ధాంతం నిగమన పద్ధతిని అనుసరిస్తుంది.

## 15.5 విమర్శ

ఎమర్సన్ తనకంటే ముందువారు ప్రతిపాదించిన సిద్ధాంతాలలోని లోపాలను తొలగించి మెరుగైన నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించినా, కొన్ని విమర్శలకు గురికాక తప్పలేదు. ఎమర్సన్ సిద్ధాంతం అత్యంత ఔపచారికమైంది



BRAOU

లేదా లాంఛనబద్ధమైంది అని విమర్శకులు అంటారు. ఎమర్సన్ సిద్ధాంతం గణిత పరమైన నమూనాలపై ఆధారపడటం వల్ల ఆయన సిద్ధాంతం సామాజిక ప్రక్రియల గుణసంబంధమైన అంశాలను విస్మరించిందనే విమర్శ కూడా ఉంది. గతిశీలమైన సామాజిక ప్రక్రియలను సమగ్రంగా వివరించడానికి ఎమర్సన్ సిద్ధాంతం సంపూర్ణంగా సహాయపడదని విమర్శకులంటారు. అందరు వినిమయవాదులూ పరస్పర చర్య ప్రక్రియ ప్రాధాన్యతను ప్రస్తావిస్తారు. అయితే విశ్లేషణ యూనిట్ విషయంలో వారి మధ్య విభేదాలు స్పష్టంగా కనబడుతాయి. వినిమయ సిద్ధాంత కర్తలందరూ ఉపయోగతావాదం అర్థశాస్త్రం, ప్రవర్తనా సంబంధం, మనోవిజ్ఞానం, ప్రకార్యవాదం, గతి తార్కిక సమాజశాస్త్ర సూత్రాలను ఉపయోగించే సిద్ధాంతాలను ప్రతిపాదించారు, వివరించారు. వీరి మాదిరిగానే ఎమర్సన్ కూడా అర్థశాస్త్రం, ప్రవర్తనాసంబంధ మనో విజ్ఞానం ఆధారంగానే తన వినిమయ సిద్ధాంతాన్ని వివరించాడు. అవే అతని సిద్ధాంతానికి మూలాధారాలు.

## 15.6 సారాంశం

ఇప్పటివరకు మీరు ఎమర్సన్ రూపొందించిన సామాజిక వినిమయ సంబంధాల తాలూకు సిద్ధాంతానికి సంబంధించిన చర్చను గురించి తెలుసుకున్నారు. ఇందులో ఎమర్సన్ కంటే ముందు వినిమయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారి విశ్లేషణలోని లోపాలను, ఎమర్సన్ వాటిని ఎలా పరిష్కరించాడో కూడా తెలుసుకొన్నారు. వినిమయ సిద్ధాంతానికి కీలకమైన అధికార ఆధీనతా సంబంధాల విశ్లేషణ ద్వారా సమాజంలో వ్యక్తుల మధ్య సంస్థల మధ్య వినిమయ ప్రక్రియ ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు

పూర్వపు సిద్ధాంతాలకంటే ఎమర్సన్ రూపొందించిన సిద్ధాంతం, విస్తృతమైంది, మెరుగైంది అయినప్పటికీ విమర్శకుల దాడికి గురికాక తప్పలేదు. అన్ని సిద్ధాంతాల మాదిరిగానే ఎమర్సన్ సిద్ధాంతం కూడా కొన్ని ప్రమేయాల ఆధారంగా రూపొందించాడు. ఇతర సిద్ధాంతకర్తల మాదిరిగానే వివిధ శాస్త్ర సూత్రాలపై - అర్థశాస్త్రం, ప్రవర్తనా సంబంధమనే విజ్ఞానంపై ఆధారపడ్డాడు.

ఇక్కడ ఒక విషయం చెప్పక తప్పదు. స్వానుభవం ఆధారంగానే ఎమర్సన్ తన సిద్ధాంత ప్రతిపాదన చేశాడు. అందువల్లనే అతని సిద్ధాంతం వాస్తవసామాజిక పరిస్థితులకు కొంత దగ్గరగా ఉన్నట్టు తోస్తుంది. అంతేకాక ఎమర్సన్ అధికార ఆధీనతా సంబంధాల విశ్లేషణ సమాజశాస్త్రంలో నెట్‌వర్క్ సిద్ధాంత ప్రతిపాదకులకు స్ఫూర్తినిస్తుంది. ఫలితంగా ఒక నూతన ఒరవడికి మూలమైంది.

BRAOU

## 15.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. ఎమర్సన్ వినిమయ సిద్ధాంతం ఇతర సిద్ధాంతాలకంటే మెరుగైంది. చర్చించండి.

2. అధికార ఆధీనత సంబంధాల విశ్లేషణలోని ముఖ్యాంశాలను తెలుపండి.

**II ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. ఎమర్సన్ వినిమయ సిద్ధాంతం గురించి క్లుప్తంగా తెలుపండి.

2. అధికారం, ఆధీనతల ప్రాముఖ్యతను వివరించండి.

BRAOU

# ఖండం- V

## ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం

ఆలోచించడం, సంజ్ఞలను ఉపయోగించడం, భాషను అభివృద్ధి పరచుకోవడం అనే వాటి ద్వారా మానవుడు తన ఆర్థిక, సామాజిక, భౌతిక అవసరాలను తీర్చుకోగలుగుతాడు. ప్రతీకలను ఉపయోగించి పరస్పర చర్యలో పాల్గొనడం అనేదికూడా ఆ అవసరాలు తీర్చుకోవడానికి పనికి వచ్చేదే. ప్రతీకలను ఉపయోగించి పరస్పర చర్య జరపడం వల్ల అది ప్రతీకాత్మక పరస్పర చర్య అయింది. ఇలాంటి ప్రతీకలను మానవుడు ఎలా ఉపయోగించగలుగుతాడో వాటికి అర్థాలు ఆపాదించడం వంటి విషయాలు ఎలా నేర్చుకుంటాడో ప్రతీకాత్మక పరస్పర చర్యా వాదంలోని సిద్ధాంతాలు వివరిస్తాయి. ఈ వాదానికి పునాది మనోవైజ్ఞానికులు వేస్తే, వ్యవహార వాదులు మరిన్ని భావనలు జోడించారు. దీనికి తత్వవేత్తలు సిద్ధాంత నిర్మాణానికి తగిన విశ్లేషణను అందిచడం విశేషం. ఈ ఖండంలో మూడు భాగాలున్నాయి. ఈ భాగాల్లో ప్రతీకాత్మక పరస్పర చర్యావాదాన్ని ప్రతిపాదించిన ముగ్గురు ప్రముఖ శాస్త్రవేత్తల దృక్పథాలు వివరించడం జరిగింది. అవి:

- చార్లెస్ హార్టన్ కూలే
- జార్జ్ హెర్బర్ట్ మీడ్
- హెర్బర్ట్ బ్లూమర్

BRAOU

BRAOU

# భాగం-16: చార్లెస్ హోర్టన్ కూలే

విషయక్రమం


16.0 ఉద్దేశాలు

16.1 పరిచయం

16.2 కూలే జీవిత విశేషాలు

16.3 ప్రతిబింబిత అహం

16.3.1 ప్రాథమిక సమూహాలు

16.3.2 విమర్శ

16.4 సారాంశం

16.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

16.6 చదవదగిన పుస్తకాలు


## 16.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ప్రతీకాత్మక పరస్పర చర్యావాదంలో కూలే స్థానాన్ని అవగాహన చేసుకుంటారు.
- కూలే ప్రతిపాదించిన ప్రతిబింబిత అహం సిద్ధాంతాన్ని తెలుసుకుంటారు.
- ప్రతిబింబిత అహం, ప్రాథమిక సమూహాల మధ్యగల సంబంధాన్ని అవగాహన చేసుకుంటారు.

BRAOU

## 16.1 పరిచయం

అమెరికన్ సమాజశాస్త్ర వేత్తలలో కూలే ప్రముఖుడు. సామాజిక జీవితంలో సామాజిక-మానసిక అంశాలకు ప్రాధాన్యాన్ని ఎత్తి చూపినవారిలో కూలీని ప్రముఖుడిగా పేర్కొనవచ్చు. ఈ అంశానికి సంబంధించి కూలే కూడా మీడ్ ధోరణిలోనే ఆలోచించాడు. అయితే సమాజశాస్త్ర పురోభివృద్ధిపై మీడ్ చెరగని ముద్రవేసినా అతని ఆలోచనల ప్రభావం ఎంతో కాలం కొనసాగినా వీరిద్దరినీ కలసి చదవడం ఎంతైనా అవసరం.

మీడ్, కూలేలు ఇద్దరూ అంత వరకు బహుళ ప్రచారం పొందిన మానవ ప్రవర్తనకు సంబంధించిన ప్రవర్తనా వాదాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. మానవుడు గుడ్డిగా, చైతన్య రహితంగా బాహ్య ఉద్దీపనలకులోనై ప్రవర్తించడని, అతడికి ఒక చైతన్యం, అహం అనే లక్షణాలు ఉంటాయని, సామాజిక వాస్తవానికి సంబంధించిన ఈ ప్రధాన అంశాలను లోతుగా పరిశీలించడమే సమాజశాస్త్రవేత్తల బాధ్యత అని వీరిద్దరి నమ్మకం. సానుభూతితో కూడిన అంతర్దృష్టి పద్ధతిని అనుసరించడానికి సమాజశాస్త్రవేత్త జీవిత నాటకంలో ఒక పాత్రధారుడిగా ప్రవర్తించడం ద్వారానే చైతన్యాన్ని విశ్లేషించగలుగుతాడు. ఈ విధంగా చేయగలిగినప్పుడే మానవుడి సామాజిక ప్రవర్తన అర్థాన్ని, ఉద్దేశాన్ని సరియైన విధంగా అవగాహన చేసుకోగలడు. సమాజశాస్త్రం చైతన్యం, చర్య పరస్పర చర్యలనే సామాజిక-మానసిక దృగ్విషయాలపైనే దృష్టి కేంద్రీకరించాలని కూలే భావించాడు. ఈ విషయంలో మీడ్ అభిప్రాయాలు కూడా ఇలాగే ఉన్నాయి.

కూలే దృష్టిలో సమాజశాస్త్రం ఒక సంపూర్ణశాస్త్రంగా, సమాజాన్నంతటినీ సమగ్ర దృష్టితో పరిశీలించే శాస్త్రం. కూలే ప్రకారం సమాజానికి మానవుడికీ మధ్య విడదీయలేనంతటి బలమైన, గహనమైన సంబంధం ఉంది. సమాజానికి సంబంధం లేని మానవుడుగానీ, మానవులు లేని సమాజం గానీ ఊహించడానికి కూడా వీలు లేదు. సామాజిక ప్రక్రియ అధ్యయనంలో భాగంగా కూలే తన దృష్టిని మానవ సమూహాలపైనే కేంద్రీకరించి, ప్రాథమిక సమూహాలను ప్రత్యేకంగా విశ్లేషించాడు. ప్రాథమిక సమూహాలకు బింబ వ్యక్తిత్వం లేదా ప్రతిబింబిత అహానికి దగ్గర సంబంధం ఉన్నట్టు కూలే భావించాడు.

సామాజిక తత్వానికి సంబంధించి కూలే వెలిబుచ్చిన అభిప్రాయాలు ఎంతో విలువైనవి. మానవ సానుభూతి నిరంతరాయంగా విస్తరించడంవల్లే మానవ పురోగతి సాధ్యమైందని ఇతడు భావించాడు. ఇలా విస్తరించడం అనేది ప్రాథమిక సమూహం తాలూకు ఆదర్శాలు, కుటుంబం నుంచి స్థానిక సముదాయానికి, దాని నుంచి దేశానికి, చివరగా విశ్వసముదాయానికి జరిగిన మానవ కళ్యాణం ప్రాప్తిస్తుందని కూలే నిశ్చితాభిప్రాయం. ఈ భావాన్నే ఫిలిప్ రీఫ్ Small-town Doctrine of Human Nature అని వ్యాఖ్యానించాడు.

అంతర్గతీకరణ సమస్యను కూలే లోతుగా పరిశీలించి దుర్ఖైమ్ అభిప్రాయాలకు భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేశాడు. సిద్ధాంతపరమైన చర్యలకే పరిమితం కాకుండా కూలే సమాజశాస్త్ర పరిశోధనా పద్ధతికి సంబంధించి అతడు చేసిన కృషి ఎంతో ప్రశంసనీయమైనదని అనేకులు పేర్కొన్నారు.

సమాజానికి, మానవుడికీ ఉన్న విడదీయరాని సంబంధాన్ని గురించి సుదీర్ఘంగా చర్చించిన కూలే సామాజిక నిర్మితిని గురించి అంతగా పట్టించుకోలేదు. అతడి దృష్టి అంతా సామాజిక ప్రక్రియపైనే కేంద్రీకృతమై ఉన్నట్లు గుర్తించవచ్చు.

సమాజశాస్త్రంలోని వివిధ విభాగాలను నిశితంగా పరిశీలించి, విశ్లేషించి, తనదైన ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన చార్ల్స్ హోర్టన్ కూలేకి ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం ప్రతిపాదించినవారిలో ప్రముఖ స్థానం లభించిందనే చెప్పవచ్చు. కూలే ఆలోచనలు, భావాలు పై సిద్ధాంత అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయి. అలాగే మూర్తిమత్వం, అహం తాలూకు ఆలోచనలు ప్రతీకాత్మక పరస్పర చర్య సిద్ధాంత పురోగమనానికి విశేషంగా తోడ్పడ్డాయి. ఇంతటి కృషి చేసిన ఈ సమాజశాస్త్ర వేత్త జీవిత విశేషాలు కూడా అంతే ఆసక్తికరంగా ఉన్నాయి.

## 16.2 జీవిత విశేషాలు

చార్లెస్ హోర్టన్ కూలే 1864లో మిషిగన్‌లో జన్మించాడు. ఇతడు జన్మించే నాటికే అతని తండ్రి థామస్ మెకిన్‌టైర్ కూలే న్యాయమూర్తి పదవిలో ఉండడం వల్ల వారి కుటుంబం సమాజంలో స్థిరమైన, ఉన్నతమైన స్థానం సంపాదించగలిగింది. తన తండ్రి స్వభావానికి విరుద్ధంగా కూలీ నెమ్మదస్తుడు, అంతకలుపుగోలు తనం లేని వ్యక్తిగా రూపొందాడు. 15 సంవత్సరాల పాటు అనారోగ్యానికి గురయిన కూలే వాక్ సంబంధమైన సమస్యలతో సతమతమవడం వల్ల తోటివారితో సరైన సంబంధాలు లేక పగటి కలలలోనే కాలం గడిపేవాడు. ఒంటరిగా చదువుకోవడానికి అలవాటు పడ్డాడు. ఏకాకిగా, సహచరులెవ్వరూ లేకుండా, కాలం గడపడం వల్ల తన జీవితాన్నంతటినీ ఊహాలోకంటోనే గడిపేవాడు.

కూలే కాలేజి జీవితం అనారోగ్యం, యూరప్ పర్యటనల కారణంగా కేవలం 7 సంవత్సరాలు మాత్రమే కొనసాగింది. ఇతడు ఇంజనీరింగ్‌లో పట్టా పొందాడు. కానీ ఈ విషయం పట్ల అతనికి ఆసక్తి ఉండేది కాదు. అందువల్ల చరిత్ర, అర్థశాస్త్రం, తత్వశాస్త్రాలలో కూడా ప్రవేశం సంపాదించాడు. కాలేజీ జీవిత కాలంలోనూ, ఆతరువాత కూడా కూలే తన కాలాన్ని ఎక్కువగా గ్రంథపఠనంలోనే గడిపాడు. కాలేజీ చదువువల్ల కాక స్వతంత్ర గ్రంథ పఠనం వల్లనే అపారమైన జ్ఞానాన్ని సంపాదించగలిగాడు. డార్విన్, స్పెన్సర్, జర్మన్ సమాజశాస్త్రవేత్త ఆల్బర్ట్ షేఫెల్ రచనలతో మంచి పరిచయం ఉండడం వల్ల అధ్యాపకవృత్తి పట్ల ఆసక్తి పెరిగి 1890లో మిషిగన్ విశ్వవిద్యాలయంలో ప్రవేశించాడు. ఈ విశ్వవిద్యాలయంలో రాజనీతి, అర్థశాస్త్రం, సమాజశాస్త్ర విభాగాలలో పట్ట భద్రస్థాయి అధ్యయనం

BRAOU

ప్రారంభించాడు. ఇతడు మిషిగన్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధనా వ్యాసం - The Theory of Transportation అతనికి పి.హెచ్‌డి పట్టాను సంపాదించి పెట్టింది.

న్యాయమూర్తిగా పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న తండ్రినీడలో బతకడం వల్ల అంతర్ముఖుడై, ఆలోచనాపరుడిగానే కాలం గడపవలసి వచ్చింది. ఈ పరిస్థితి అతడు మిషిగన్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా చేరేటంత వరకు కొనసాగుతూ వచ్చింది. విశ్వవిద్యాలయ ప్రవేశంతో స్వతంత్ర ప్రతిపత్తి, మూర్తిమత్వాలు ఏర్పడి ఉత్తరోత్తర ఒక ప్రముఖ శాస్త్రవేత్తగా పరిణతి చెందగలిగాడు. అతని విశ్వవిద్యాలయ అధ్యాపక వృత్తి 1892లో ప్రారంభమైంది. ఇతనికి అనేక సామాజిక సమస్యలపట్ల ఆసక్తి ఉండేది. ఆత్మ పరిశీలనకు అధిక ప్రాధాన్యమిచ్చిన చింతనాపరుడితను. తన చుట్టూ ఉన్నవారి ప్రవర్తన, ముఖ్యంగా తన పిల్లల ప్రవర్తనను పరిశీలించడం మొదలు పెట్టాడు. మిషిగన్ విశ్వవిద్యాలయంలోని ఆచార్యుడి కుమార్తె ఎల్సీ జోన్స్‌తో వివాహం 1890లో జరగడంతో అతని జీవితంలో ఒక నూతనాధ్యాయం ప్రారంభమైంది. ఆత్మపరిశీలన, ఆలోచనలకే అధిక కాలం వెచ్చించడానికి ఇతని వైవాహిక జీవితం ఎంతగానో తోడ్పడింది. గృహ నిర్వహణ బాధ్యతంతా భార్య స్వీకరించడంతో పఠన, పాఠనాదులకు కావలసినంత సమయం దొరికింది.

ఏ విధమైన ఈతిబాధలుకానీ, ధన భావం కానీ లేనందువల్ల ఆలోచించడానికి, ప్రతీ విషయాన్ని గమనంగా (లోతుగా) పరిశీలించడానికి కావలసినంత సమయం దొరకడం ఇతనికి దక్కిన మహద్భాగ్యం. అంతేకాక ఆనాటి విద్యావంతులలో రాసినదంతా ప్రచురించాలనే తపన లేకపోవడం వల్ల ప్రచురణపట్ల అంత తొందరపాటు ప్రదర్శించలేదు. అతని రచనలన్నీ -ముఖ్యంగా Human Nature and the Social Order అనే రచన విద్యార్థులకు బోధించే సమయంలో తాను తయారు చేసుకున్న నోట్సు ఆధారంగా రచించిన గ్రంథమే. ఈ గ్రంథాన్ని 1902లో ప్రచురించాడు. ఏడు సంవత్సరాల తర్వాత Social Organization అనే గ్రంథం వెలువడింది. Social Process అనే గ్రంథం మూడవ రచన 9 సంవత్సరాల తర్వాత ప్రచురితమైంది. సామాజిక పర్యావరణంపై ఇతడు తయారు చేసిన వ్యాసాలు ఇతడి మరణానంతరం 1930లో వెలువడిన Sociological Theory and Social Research అనే సంపుటిలో ప్రచురితమయ్యాయి.

BRAOU

సమాజశాస్త్రానికి సంబంధించి కూలే చేసిన రచనలు ఆచార్య గిడ్డింగ్స్‌ను ఎంతగానో ఆకర్షించాయి. అందుకే కూలేని కొలంబియా విశ్వవిద్యాలయంలో చేరమని ఆహ్వానించాడు. కానీ కూలే ఈ ఆహ్వానాన్ని అంతగా పట్టించుకోలేదు. మిషిగన్‌లోనే కొనసాగాడు. 1928 చివరిదశలో కూలే ఆరోగ్యం క్షీణించడం మొదలైంది. అతనికి క్యాన్సర్ సోకడంతో 1929 మే 7న తనువు చాలించాడు.

## 16.3 ప్రతిబింబిత అహం

అహం, సమాజం అనేవి ఒకేసారి జన్మించాయని కూలే అంటాడు. ఈ రెండు అంశాలే కూలే రచనలన్నింటిలో అతి ముఖ్యమైన అంశాలుగా ఉండటమే కాక ఆధునిక సామాజిక మనోవిజ్ఞానానికి, సమాజశాస్త్ర వికాసానికి కూలే చేసిన అపూర్వ సేవగాకూడా సమాజశాస్త్ర వేత్తలు పేర్కొంటుంటారు. అహానికి, సమాజానికి విడదీయరానంత గాఢమైన, దృఢమైన సంబంధం ఉందనేది కూలే చేసిన ప్రధానమైన ప్రతిపాదన. కూలే దృష్టిలో సమాజం అనేది ఒక మానసిక దృగ్విషయం. ఒక మనిషికి, ఇంకొక మనిషికి మధ్య ఉండే పరస్పర సంబంధాలు, ఆలోచనాత్మక సంబంధాలుగా రూపొందుతాయి. "నేను అంటే థామస్, హెన్రీ, సుసాన్, బ్రిడ్జెట్ మొదలైన వ్యక్తులు- వ్యక్తుల మధ్య ఉండే పరస్పర సంబంధాలు, ప్రభావాలు నామెదడులో ఆలోచనాత్మక సంబంధాలుగా రూపొందుతాయి. ఈ ఆలోచనాత్మక సంబంధమే నాలో సమాజ భావనలను రూపొందిస్తుంది". సమాజాన్ని, వ్యక్తిని వేరుచేసి చూడటానికి వీలులేదని చెప్పడానికి కూలే 'స్వతంత్రమైన వ్యక్తి' మన అనుభవంలో ఎక్కడా చూడలేము. అట్లాగే వ్యక్తులతో సంబంధంలేని సమాజాన్ని ఊహించడానికి వీలులేదు. అంటే సమాజం, వ్యక్తి ప్రత్యేక దృగ్విషయాలు కావు. మానవుడి ఊహల ఫలితంగా జనించినదే సమాజం.

ఈ మానసిక పద్ధతినే కూలే మూర్తిమత్వ దృగ్విషయాన్ని వివరించడానికి ఉపయోగించాడు. ఇతడి దృష్టిలో ఒక

వ్యక్తి తాలూకు మూర్తిమత్వం అతని వ్యక్తిత్వాన్ని సూచించే కొన్ని భావాల సమాహారమే. దీన్నే కూలే మాటల్లో చెప్పాలంటే 'మూర్తిమత్వం అనేది కొన్ని ఆలోచనల సమూహం, లేదా విధానం. ఈ ఆలోచనలు మన మెదడులో స్థిరమైన వ్యక్తి తాలూకు మూర్తిమత్వాన్ని సూచించే అనుబంధ సంకేతాలుగా పనిచేస్తాయి'. మూర్తిమత్వం అనేది వ్యక్తిలో ప్రత్యేకంగా ఉన్న తనదైన గుణాన్ని, విశిష్టతను సూచిస్తుంది. అహం, సామాజిక అహం ఈ రెండు భావనలు ఒక వ్యక్తి తాలూకు మూర్తిమత్వంలోని అభిన్న అంశాలని కూలే వివరించాడు. అహం సహజమైన ఆత్మభావనతో, స్పందనతో నిండి ఉంటుంది.

కూలే అహాన్ని రెండు రకాలుగా విభజించాడు. నేను, నాది, లేదా వ్యవహారిక అహం అనే జేమ్స్‌భావనలు సామాజిక అహం, ప్రతిబింబిత అహం అని తెలిపిన కూలే భావనలు ఒకే రకమైన అర్థాన్ని సూచిస్తాయి. సామాజిక పరస్పర చర్యలలో ఇతరుల అభిప్రాయాలకు, ఆలోచనలకు ప్రతిస్పందనగా నిర్మితమయ్యేదే ప్రతిబింబిత అహం. ఈ భావనలో మూడు ప్రధాన అంశాలున్నాయి. అవి: 1. ఒక వ్యక్తి మనం ఇతరులకు ఏవిధంగా కనిపిస్తున్నామో అనే ఊహ, 2. ఆ కనిపించే మానసికత చిత్రంపై ఇతరుల నిర్ణయం తాలూకు ఊహ, 3. వీటి ఫలితంగా ఆత్మాభిమానం లేదా ఆత్మన్యూనత అంకురించడం.

సమాజశాస్త్రంలో కూలే ప్రతిపాదించిన ప్రతిబింబిత అహం అనే భావన బహుళ ప్రచారం పొందింది. సమాజంలో అనేక మందితో ఉన్నత సంబంధాలను బట్టి వారితో జరిగే పరస్పర చర్యను బట్టి, వ్యక్తిలో అనేకమైన సామాజిక ఊహలు జనిస్తాయి. వ్యక్తిని బట్టి, అవసరాన్ని బట్టి, పరిస్థితులను బట్టి మనిషి బహురూపిగా అగుపిస్తాడు. ఇలా కనిపించడంలో అతని సామాజిక సర్దుబాటు, అనుసరణ సులువు అవుతుంది. దీనితో వ్యక్తి, సమాజాల మధ్య చక్కటి సమన్వయం సాధ్యమవుతుంది.

కూలే ప్రతిబింబిత అహం భావనను ప్రతిపాదించడమేకాక దీని ఆధారంగా సమాజానికి సంబంధించి ఒక సాధారణ సిద్ధాంతాన్ని కూడా రూపొందించగలిగాడు. ఈ సిద్ధాంతంలోని భాగాలుగా సామాజిక సమూహాలను ప్రాథమిక, గౌణ సమూహాలుగా వర్గీకరించాడు. ప్రాథమిక సమూహాలకు, ఇతడు ప్రతిపాదించిన ప్రతిబింబిత అహానికి ఉన్న సంబంధాన్ని గురించి ఇప్పుడు చర్చిద్దాం.

BRAOU

### 16.3.1 ప్రాథమిక సమూహాలు

ప్రాథమిక సమూహమైన కుటుంబం దానిలోని సభ్యులను సామాజిక వ్యవస్థతో సంఘటిత పరిచే ఒక శక్తివంతమైన వ్యవస్థ. కుటుంబ వ్యవస్థలో అతి సన్నిహితమైన, ప్రత్యక్షమైన లేదా ముఖా ముఖి సంయోజనం ఏర్పడి వివిధ వ్యక్తుల వ్యక్తిత్వాలు సమ్మిళితమై ఒక ఉమ్మడి వ్యవస్థగా రూపొందుతుంది. కుటుంబంలోని వివిధ వ్యక్తులకు విభిన్నమైన ఆశలు, ఆకాంక్షలు ఉన్నా కుటుంబ ఆదర్శాలను సాకారం చేయటంలోనే వారు నిమగ్నమై ఉంటారు. కుటుంబానికి అంతటికీ ఒక ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించడానికే సభ్యులందరూ కృషి చేస్తారు. ఇలాంటి ప్రాథమిక సమూహాలలో ప్రముఖంగా పేర్కొనదగ్గవి కుటుంబం, సమవయస్కుల సమూహం, ఇరుగుపొరుగు. ఈ సమూహాలే మానవ జాతిలో సహకారం, సాన్నిహిత్యం వంటి లక్షణాలను పెంపొందించడానికి దోహదపడతాయని కూలే భావించాడు. సమాజంలో వివిధ వ్యక్తులమధ్య సానుభూతి, అనురాగం వంటి బృహత్తర గుణాలు ఏర్పడి స్వప్రయోజనం వెనక్కు నెట్టబడుతుంది. కుటుంబంలోని సభ్యుల మధ్య ప్రత్యేక సేవలు, ప్రయోజనాల ఆధారంగానే కాక ఒక సంఘటిత శక్తిగా రూపొందే లక్ష్యం ఆధారంగానే ఈ వ్యవస్థ నడుస్తుంది. కుటుంబంలో తల్లి తన సంతానానికి చేసే సేవలన్నీ ఏవిధమైన స్వప్రయోజనం ఆశించకుండా చేస్తుంది. అదే ఉద్యోగినిగా ఆమె అంతటి బాధ్యతలు నిర్వర్తించడానికి ఇష్టపడకపోగా తన శ్రమను దోచుకొంటున్నారనే భావన కలగడం కూడా కద్దు. కుటుంబానికి చేసే సేవలన్నీ 'మనం', 'మనది' అనే భావనతో చేసేవే కానీ, ఏ స్వప్రయోజనాన్ని ఆశించి చేసేవి కావు. ఉమ్మడి ప్రయోజనాల కోసం తమ స్వంత లాభాన్ని కూడా త్యాగం చేయడానికి తల్లిదండ్రులు, బంధు మిత్రులు, సంతానం ఏవిధంగానూ సంకోచించరు.

కూలే ఆలోచనలనంతటా ప్రతిబింబిత అహం, ప్రాథమిక సమూహం అనే భావనలు రెండు పరస్పరం పెనవేసుకునే ఉంటాయి. ఇతరుల అభిప్రాయాలను గుర్తించడం, మన్నించడం, వారి దృక్పథాలను, విలువలను

గుర్తించి తదనుగుణంగా తన ప్రవర్తనను మలుచుకోవడం అనేవి ఒక్క ప్రాథమికమైన సన్నిహిత సంబంధాలున్న కుటుంబంలోనే సాధ్యమని కూలే నిశ్చితాభిప్రాయం. అందువల్లనే ఇలాంటి వ్యవస్థలోనే మానవ వికాసం సాధ్యమవుతుందని కూలే భావిస్తాడు. కుటుంబ వ్యవస్థలో అపరిపక్వమైన, స్వార్థాభిలాష గల వ్యక్తులు ఇతరుల ఆకాంక్షలను పరిగణలోకి తీసుకొని తన దృక్పథాన్ని తగిన విధంగా మార్చుకొని ప్రవర్తించడమే కాక, ఇచ్చి పుచ్చుకునే పరిపక్వ మనస్తత్వాన్ని పెంపొందించుకొంటారు. తన అహానికి కళ్లెం వేసి ఇతరుల మనోభావాలను ఆకాంక్షలను, ఆశయాలను అర్థం చేసుకొని తగిన విధంగా ప్రవర్తించడానికి ప్రయత్నిస్తాడు. ఇలా ప్రవర్తించనినాడు సమాజంలో ప్రశాంతతకానీ, ఒక క్రమం కానీ ఏర్పడటం దుర్లభం. ఈ సందర్భంలో కూలే అన్న మాటలు గుర్తు చేసుకుందాం. "In their existence, Man does not have it at birth; he cannot aquire it except through fellowship and it decays in isolation". అంటే ఈ ప్రాథమిక సమూహాలలోనే మానవ స్వభావం బయటపడుతుంది. పుట్టినప్పుడే అది ఉండదు. దానిని మానవుడు సాహచర్యం ద్వారాగానీ సంపాదించలేడు. ఏకాకిత్వంలో అది అంతరిస్తుంది. ఇంతటి మహత్తర శక్తి గలది ఈ ప్రాథమిక సమూహం.

కూలే వెలిబుచ్చిన సామాజిక తత్వానికి సంబంధించిన భావాలు ఎంతో ప్రఖ్యాతి గాంచాయి. ప్రపంచ ప్రజలలో తోటివారిపట్ల నానాటికీ పెరుగుతున్న సానుభూతి భావం ప్రారంభమయ్యేది కుటుంబంలోనే. ఇది క్రమంగా స్థానిక సముదాయానికి, అటు తరువాత దేశానికి అంతిమంగా విశ్వమంతటికీ వ్యాపిస్తుందనేది కూలే ప్రగాఢ విశ్వాసం. దీనినే ఫిలిప్ రీఫ్ Small Town Doctrine of Human Nature అన్నాడు. కూలే వ్యక్తంచేసిన ఈ భావాలు అతని అమెరికన్ సముదాయ భావాలకు అద్దం పడుతున్నాయని మీడ్ కూడా అభిప్రాయపడ్డాడు. కూలే వ్యక్త పరిచిన ఆదర్శ ప్రాయమైన ఆశావాదం ఆధునికుల చారిత్రక అనుభవాలకు భిన్నంగా కనిపించవచ్చు. మానవులలో తోటి మానవుల పట్ల సానుభూతి, సహనం లోపించినప్పుడు విశ్వ సమాజం సంక్షోభానికి గురవుతుంది. కానీ ఆశావాది అయిన కూలే సంప్రదాయం, సాహిత్యం, లలితకళలు, జాతీయ వేడుకల వంటివి మానవులలో వసుధైక కుటుంబ భావనను కల్పిస్తాయని భావించాడు. ఈ సందర్భంలోనే సమాజం పట్ల కూలే భావాలకు, దుర్‌ఖైమ్ భావాలకు స్పష్టమైన తేడాను గుర్తించవచ్చు. సమాజం అనేది బాహిరమైన వ్యవస్థగా దుర్‌ఖైమ్ భావిస్తే, అది వ్యక్తి తాలూకు అహంలోని అంతర్భాగమని కూలే అభిప్రాయపడతాడు. అంతేకాక కూలీ దృష్టిలో సమాజం అనేది ఒక మానసిక దృగ్విషయం. అంటే ఒకరి విషయంలో మరొకరికి ఉన్న ఊహల సారమే సమాజం అనేది కూలే అభిప్రాయం. అంతేకాక వైయుక్తిక భావాల మధ్య సంబంధాన్నే సమాజమని ఇతడు పేర్కొన్నాడు.

BRAOU

ఒక సమాజ సభ్యుడిగా వ్యక్తి ప్రవర్తనకు సంబంధించి వెలువడిన ప్రవర్తనావాదాన్ని మీడ్‌తోపాటు కూలీ కూడా తిరస్కరించాడు. ప్రతీవ్యక్తికీ ఒక చైతన్యం, ఒక అహం అనేవి ఉంటాయని, సమాజశాస్త్రవేత్త ఈ సామాజిక వాస్తవాన్ని విశ్లేషించాలని కూలీ సూచించాడు. ఈ విశ్లేషణ సానుభూతితో కూడిన అంతర్ దృష్టితో చేయాలని, వ్యక్తి ప్రవర్తనకు ఆధారమైన ప్రేరణలు, అర్థాలను సమాజశాస్త్రవేత్త అవగాహన చేసుకొని పరిశీలించాల్సి ఉంటుందే తప్ప బాహ్య ఉద్దీపనలకు మాత్రమే స్పందించడం జరగదని గుర్తించాలని కూలే స్పష్టంగా పేర్కొన్నాడు. అయితే సానుభూతితో కూడిన అంతర్ దృష్టి అశాస్త్రీయమని మీడ్ తదితరులు భావించారు. అయితే సామాజిక-మానసిక దృగ్విషయాలైన చైతన్యం, చర్య, పరస్పర చర్యలపై పరిశోధకుడు దృష్టి కేంద్రీకరించాలని కూలీ, మీడ్‌లు గట్టిగా నమ్మారు.

కూలే దృష్టిలో సమాజం ఒక మానసిక దృగ్విషయమని ఇదివరకే తెలుసుకున్నాం. సామాజికుల మధ్య ప్రేమ, ద్వేషం, స్నేహం, శత్రుత్వం వంటి భావాలు ఏర్పడతాయి. ఈ భావాలు ఇద్దరు సామాజికుల మధ్య విశ్వాసాలను, అపార్థాలను కలిగిస్తాయి. అంతర్ దృష్టి లేదా ఆత్మావలోకనం ద్వారా మనిషి తన సామాజిక అనుభవాన్ని నిష్పాక్షికంగా విశ్లేషించి ఇతర మానవుల పట్ల, సమాజం పట్ల తాను ఏర్పరచుకోవలసిన దృక్పథాలను, తీసుకోవలసిన చర్యలను ఊహించుకొని నిర్ధారించుకోగలుగుతాడు. ఆలోచనలు, విశ్వాసాలు సామాజిక యదార్థాలలో ప్రధానమైనవని కూలీ అభిప్రాయం. అయితే ఇవి బాహిరత యధార్థాలు కావు. ఇవన్ని మనిషి మస్తిష్కంలోని అంతర్ యధార్థాలు. మానసిక యధార్థాలు అర్థవంతమైనవి. వీటిని బాహిరమైన శాస్త్రీయ పద్ధతుల ద్వారా విశ్లేషించవచ్చు గానీ ఈ విశ్లేషణ వల్ల లభించే ఫలితాలు సంపూర్ణంగా సంతృప్తికరమైనవి కావు. లోతైన, అర్థయుక్తమైన, పరిపూర్ణమైన అవగాహన ఆత్మావలోకన పద్ధతి ద్వారానే సాధ్యమవుతుందని కూలీ నొక్కి చెప్పాడు. ఈ పద్ధతి ఆధారంగానే ఇతడు వివానాత్మక

ఆత్మకథ అనే పరిశోధనాత్మక పద్ధతిని కూడా సూచించాడు. ఈ పద్ధతిని అనుసరించి పరిశోధన చేయడం ద్వారా సామాజిక వాస్తవాంశాలను క్షుణ్ణంగా, అర్థవంతంగా అధ్యయనం చేయవచ్చునని కూలీ విశ్వాసం.

### 16.3.2 విమర్శ

అహం, ప్రతిబింబిత అహం లేదా సామాజిక అహం వంటి భావనలను సంపూర్ణంగా వివరించిన కూలీ రచనలు విమర్శకుల దాడిని తప్పించుకోలేకపోయాయి. ప్రాథమిక సమూహాల ప్రాముఖ్యాన్ని గతంలో ఎల్.ఎల్ బెర్నార్డ్, ఎల్స్‌వర్త్ ఫారిస్‌ల వంటి కొందరు రచయితలు ప్రస్తావించినా కూలీ చర్చించిన ప్రాథమిక సమూహాలే ఎల్టన్ మేయో లాంటి వారిని స్వచ్ఛందంగా ఏర్పడిన ఈ సమూహాల గురించి యథార్థ విషయాలను సేకరించడానికి ప్రేరేపించింది. పారిశ్రామిక కార్మికుల ప్రవర్తనను, దృక్కోణాలను విశ్లేషించడానికి ఎల్టన్ మేయో, అతని అనుచరులు అనేక అధ్యయనాలను నిర్వహించారు. 1940లో కూలే ప్రతిపాదించిన ప్రాథమిక సమూహాల ప్రాధాన్యాన్ని మరోసారి సమాజశాస్త్రవేత్తలు గుర్తించి అనేక అధ్యయనాలను నిర్వహించారు. అమెరికా దేశస్తులలో ఓటింగ్ ప్రవర్తన, వినియోగదారుల ఎంపిక వంటి అంశాలను పరిశీలించడానికి పాల్ లెజర్స్‌ఫెల్డ్ ప్రయత్నించాడు. వీరి అధ్యయనంలో మతం, వర్గం, ఆవాసం, వయస్సు, మాస్ మీడియాల ప్రభావం కూడా కుటుంబ సభ్యుల సంబంధాల ద్వారానే ఏర్పడుతుందని తేలింది. ఇంతటి ప్రశస్తమైన భావనను ప్రతిపాదించిన కూలేని సమాజశాస్త్రంలో ప్రముఖ స్థానానికి అర్హున్ని చేశాయి. అయితే ఇతన్ని పడకకుర్చీ సామాజికశాస్త్రవేత్త అని విమర్శించినవారు కూడా లేకపోలేదు. కానీ ఆత్మావలోకన విశ్లేషణ ఈనాటి సమాజశాస్త్ర ఆలోచనా విధానంలో అతిముఖ్యమైన అంశంగా కొనసాగుతూనే ఉంటుందనడం నిర్వివాదాంశం. కూలే రచనల ప్రభావం భవిష్యత్‌లో సమాజశాస్త్ర అభివృద్ధిపై ఎంతగానో పడింది. ఈ విషయంలో ఇతర సిద్ధాంతకర్తల కృషి పేలవంగా కనిపిస్తుంది. కూలే రచనలు ఇతర సమాజశాస్త్ర వేత్తలతో పోల్చి చూస్తే ఉత్కృష్టమైనవి, నూతన భావాలు రేకెత్తించేవిగా ఉన్నాయని చెప్పడం అతిశయోక్తకాదు. అయితే కూలే ప్రతిపాదించిన సానుభూతితో కూడిన ఆత్మావలోకనం అనే పద్ధతిని మీడ్‌తోసహా పలువురు సమాజశాస్త్రవేత్తల విమర్శకు గురి అయింది. ఈ పద్ధతి అధికంగా మానసికమైందని, ఆత్మావలోకనకే అధిక ప్రాధాన్యత ఇస్తుందని వారు భావించారు. ఇలా చేయడం వల్ల మామూలు వ్యక్తులు, వ్యక్తుల ప్రవర్తనకు ఆపాదించే అర్థానికి, ఒక శాస్త్రవేత్త ఆ ప్రవర్తనకు అపాదించే నియంత్రిత, సుశిక్షిత అర్థానికి ఉన్న వ్యత్యాసం కనుమరుగువుతుందని వారు భావించారు. అయినా నూతన భావనలు ప్రవేశపెట్టిన కూలే ప్రతీకాత్మక పరస్పర చర్య దృక్పథం ప్రతిపాదనలలో ప్రముఖుడుగానే గుర్తించాలి.

BRAOU

## 16.4 సారాంశం

అహం, సమాజం అనేవి ఒకేసారి జన్మించాయని కూలే అంటాడు. ఈ రెండింటి మధ్య విడదీయరాని గాఢమైన, దృఢమైన సంబంధం ఉన్నదని కూలే గట్టిగా వాదించాడు. అదే అతను చేసిన ప్రధానమైన సైద్ధాంతిక ప్రతిపాదన. సమాజం అనేది ఒక మానసిక దృగ్విషయమని, అది వ్యక్తుల మధ్య నెలకొనే ఆలోచనాత్మక సంబంధాల రూపమేనని అతడంటాడు. వ్యక్తి, సమాజం అనేవి స్వతంత్ర దృగ్విషయాలు కావు. వాటిని విడివిడిగా చూడటానికి వీలు లేదని అతడు భావించాడు. మానవుడి ఊహల ఫలితంగా జనించినదే సమాజం. ఒక వ్యక్తి మూర్తిమత్వంలో రెండు భాగాలుంటాయి. అవి నేను, నాయొక్క లు ఈ రెండింటి కలయిక అహంగా పరిణమిస్తుంది. ఈ అహం అనేది వ్యక్తులలో ఇతరులతో పరస్పర చర్యలలో పాల్గొనడం ద్వారా ఏర్పడుతుంది.

ప్రతిబింబిత అహం అనే భావనలో మూడు అంశాలుంటాయి. అవి: 1. మనం ఇతరులకు ఎలా కనబడుతున్నామో అనే ఊహ, 2. ఇతరుల ముందున్న మానసిక చిత్రానికి వారు ఎలా స్పందిస్తారోననే ఊహ, 3. వారి స్పందనను బట్టి ఆత్మాభిమానం లేదా అత్మన్యూనతాభావం ఏర్పడడం. ఇలా పరిస్థితులను బట్టి, వ్యక్తిని బట్టి అహం అనేకానేక రూపాలు ధరిస్తుంది. ఇలాంటి ఊహలే వ్యక్తిలో సామాజిక సర్దుబాటు, అనుసరణానికి దోహదం చేస్తుంది. ఇలా చేయడం వల్ల వ్యక్తి, సమాజం మధ్య సమన్వయం సాధ్యమౌతుంది.



ఇతరుల అభిప్రాయాలను గుర్తించడం, మన్నించడం, వారి దృక్పథాలను, విలువలను గుర్తించి తదనుగుణంగా

తన ప్రవర్తనను మలచుకోవడం ప్రాథమిక సమూహాలలోనే సాధ్యమని కూలే అంటాడు. ఇలాంటి వ్యవస్థలోనే అపరిపక్వమైన, స్వార్థఅభిలాషగల వ్యక్తులు ఇతరుల అకాంక్షలకు అనుగుణంగా ప్రవర్తించడం నేర్చుకొంటారని ఇచ్చిపుచ్చుకొనే ధోరణిని అలవర్చుకొంటారని కూలే భావించాడు. తోటివారిపట్ల సానుభూతి బీజం ప్రాథమిక సమూహం-కుటుంబ, సమవయస్కుల సమూహం- లోనేపడుతుందని, ఈ సానుభూతి విశ్వమంతటికీ క్రమంగా వ్యాపిస్తుందని కూలే ప్రగాఢ విశ్వాసం.

## 16.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. కూలే ప్రతిపాదించిన అహం భావనను వివరించండి.

2. వ్యక్తి, సమాజాలకు కూలే దృష్టిలో ఎటువంటి సంబంధం ఉంటుందో క్లుప్తంగా తెలుపండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. అహం ఏర్పడడానికి దోహదం చేసే ప్రాథమిక సమూహాలేవి?

2 ప్రతిబింబిత అహం అనగానేమి?

## 16.6 చదవదగిన పుస్తకాలు


George Ritzer : Sociological Theory, The Mc Graw-Hill Company, INC, New York, 1996.

Lewis A. Coser : Masters of Sociological Thought: Ideas in Historical and Social Context, Rawat Publications, Jaipur, 1996.

G. Raghavendra Rao : సమాజశాస్త్ర సిద్ధాంతం, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 1988.


BRAOU

# భాగం-17: జార్జ్ హెర్బర్ట్ మీడ్

విషయక్రమం


17.0 ఉద్దేశాలు

17.1 పరిచయం

17.2 మీడ్ జీవిత విశేషాలు

17.3 మీడ్ ప్రతిపాదించిన ముఖ్యమైన భావనలు

17.3.1 చర్య లేదా ప్రవర్తన

17.3.2 సంజ్ఞలు లేదా అంగవిక్షేపాలు

17.3.3 ప్రముఖ ప్రతీకలు

17.3.4 మానసిక ప్రక్రియలు, మేధస్సు

17.3.5 అహం

17.3.6 నేను, నాది

17.3.7 సమాజం

17.4 సారాంశం

17.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

17.6 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 17.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం అభివృద్ధికి మీడ్ చేసిన కృషిని తెలుసుకుంటారు.
- ప్రవర్తన అంటే ఏమిటి? అది ఏర్పడటానికి తోడ్పడే అంశాలేమిటో అవగాహన చేసుకుంటారు.
- ప్రముఖ ప్రతీకల ప్రాముఖ్యాన్ని గుర్తిస్తారు.
- మానసిక ప్రక్రియలు, మేధస్సుల ప్రాముఖ్యాన్ని అవగాహన చేసుకుంటారు.
- అహంలోని దశలను తెలుసుకుంటారు.
- నేను, నాది అనే భావనలు, వాటి ప్రాముఖ్యతను తెలుసుకోగలుగుతారు.
- సమాజం, మీడ్ విశ్లేషణలో సమాజ పాత్రను అర్థం చేసుకుంటారు.

## 17.1 పరిచయం

ప్రతీకాత్మక పరస్పర చర్యావాద చరిత్రలో జార్జ్ హెర్బర్ట్ మీడ్ ప్రముఖమైన తత్వవేత్త లేదా బావకుడు అని చెప్పవచ్చు. అతని ఆలోచనా ధోరణిలోంచి వెలువడిన Mind, Self and Society అనే గ్రంథం ఎందరో సమాజ

శాస్త్రవేత్తలను, సామాజిక మనో విజ్ఞాన వేత్తలను ఆలోచింపజేసింది. వారి రచనలకు స్ఫూర్తిదాయకమైంది.

ప్రతీకాత్మక చర్యావాదం వివరణతోనే ఆగిపోక మీడ్ సమాజం, సామాజిక సంబంధాలను, చర్య పరస్పర చర్యల విశ్లేషణను కూడా చేపట్టాడు. అమెరికన్ వ్యవహార వాదులలో మీడ్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. మీడ్‌ను ఒక సంస్కరణ వాదిగా కూడా పలువురు గుర్తించారు. దీనికి అతడు రచించిన The Ministers of Reform: Their Progressive Achievement in American Civilization, 1889-1920 ప్రబల తార్కాణం. సంస్కరణల తాలూకు ఇతని భావాలను తాత్విక దృక్పథంతో సమన్వయపరచడం ద్వారా సమాజశాస్త్ర భవిష్యత్ పురోగమనానికి ఎంతగానో తోడ్పడ్డాడు. చరిత్ర విషయంలో అతని భావాలు గుర్తుంచుకోదగ్గంత ప్రముఖమైనవి. చరిత్ర అంటే వివిధ సంఘటనల జాబితా మాత్రమేకాదు. వివిధ కాలాలలో కనిపించే ఆలోచనా ప్రక్రియ. వ్యక్తుల మధ్య సాగే చర్య, పరస్పర చర్యల కథనమే చరిత్ర అని మీడ్ చరిత్రకు సరికొత్త నిర్వచనమిచ్చాడు. మానువుల మధ్య సాగే చర్య, పరస్పర చర్యలు నూతన భావాల సృష్టికి, మానవ చర్యలకు, సామాజిక వ్యవస్థకు మూలాధారం అని మీడ్ వ్యాఖ్యానించాడు. భవిష్యత్‌కు గతం ముఖ్యమేకానీ ఇతడి దృష్టిలో గతానికి భవిష్యత్‌కు గుణాత్మకమైన తేడా ఉంది.

Movements of Thought in the Ninteenth Century అనే గ్రంథం గడిచిన శతాబ్దంలో తత్వశాస్త్రం, సామాజిక ఆలోచన, మనోవిజ్ఞాన, భౌతిక శాస్త్రాలలో చోటు చేసుకొన్న నూతన ధోరణులను మీడ్ చక్కగా అర్థం చేసుకున్నాడని వివరిస్తుంది. మీడ్ తన ఆలోచనలకు ఇతర మేధావుల రచనల పరిశీలనతో పదునుపెట్టడమే కాక సమాజాన్ని సమగ్రంగా అవగాహన చేసుకోవడంలో తనదైన ఒక పంథాను అనుసరించాడు. దీనిలో భాగంగానే ఇతడు Mind, Self and Societyని రచించాడు.

మీడ్ తన రచనావ్యాసంగం ప్రారంభించేనాటికి ప్రచారంలో ఉన్న ప్రవర్తనా వాదాన్ని -ముఖ్యంగా మానసిక ప్రవర్తనా వాదుల అలోచనలను-తిరస్కరించి నూతన సిద్ధాంత ప్రతిపాదనకు పూనుకున్నాడు. ఇతడి దృష్టిలో మానవ ప్రవర్తనావాదాన్ని అంగీకరిస్తే మానవ ప్రవర్తనకు ఆధారమైన లక్ష్యసాధన, ప్రేరణ వంటి వాటిని విస్మరించిట్టేనని మీడ్ వాదించాడు. పర్యావరణానికి అనుకూలంగా ప్రవర్తించడం, పర్యావరణం కల్పించే ఉద్దీపన వల్లనే అయినా ప్రవర్తన బహిర్గతం కాకముందే మానవుడు ఆలోచించి ఇతరులపై తన ప్రవర్తన ప్రభావం ఎలా ఉంటుందో ఊహించి ప్రవర్తిస్తాడు. దీనినే మీడ్ 'సామాజిక ప్రవర్తనా వాదం' అని అన్నాడు. అంటే తన ప్రవర్తనకు సమాజం ఎలా స్పందిస్తుందో ముదుగానే ఊహించి తన ప్రవర్తనను నిర్ధారించుకోవడమన్నమాట.

BRAOU

మీడ్ తన రచనలన్నింటిలోనూ ముఖ్యంగా The Philosophy of the Presentలో సామాజిక, సామాజికత అనే రెండు భావనలు తత్వచింతనా ధోరణిలోనే పునః సర్దుబాటు నిర్వచించాడు. ఇతడి దృష్టిలో సమాజమనేది నూతన పరిస్థితులకు సర్దుబాటు చేసుకొంటూ సాగుతుంది. ఈ భావం మీడ్ రచనలన్నింటిలోనూ ప్రముఖంగా కనిపిస్తుంది. మనిషి భావుకుడు కావడం వల్ల ఇతర ప్రాణులకంటే వివేకంతో మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా తన ప్రవర్తనను మలుచుకోగలడు. ఈ వాస్తవాలనే మీడ్ తన ప్రముఖ రచన అయిన మైండ్, సెల్ఫ్ అండ్ సొసైటీలో విపులీకరించాడు. ఒక్క మాటలో చెప్పాలంటే మీడ్ రచనలన్నింటిలోనూ తలమానికంగా నిలిచేది, ప్రతీకగా నిలిచేది ఈ రచనే.

## 17.2 జీవిత విశేషాలు

మీడ్ 1863లో సౌత్ హాడ్లీ, మాసాచుసెట్‌లో జన్మించాడు. అతని తండ్రి హీరమ్ మీడ్ స్థానికంగా ఉన్న కాంగ్రెషన్ చర్చిలో మినిస్టరుగా ఉండేవాడు. ఇతని తల్లి ఎలిజబెత్ మంచి కుటుంబానికి చెందినది. ఏలోటూ లేని జీవితం గడపడానికి అవసరమైన ఆర్థిక స్థితిగల కుటుంబం వారిది. మీడ్‌కు 9 సంవత్సరాల వయసు ఉన్నప్పుడే మీడ్ కుటుంబం ఓబర్లిన్‌కు మారింది. అక్కడే అతడి విద్యాభ్యాసం మొదలైంది. మీడ్ చదువుతున్న పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు చర్చికి సంబంధించిన కుటుంబాలవారే కావడం, చర్చి తాలూకు ఉద్యోగాలలోనే స్థిరపడాలనే ఉద్దేశం వారికి ఉండడం సహజంగా ఉండేది. ఇలాంటి సహచరుల మధ్య తన బాల్యాన్ని గడపవలసి వచ్చింది. పాఠశాలలోని బోధనంతా మతపరమైనదిగా సాగింది. స్కూలులో నెలకొన్న మతపరమైన వాతావరణం మీడ్‌కు

అంతగా నచ్చలేదు. అక్కడ బోధించిన అంశాలన్నీ కేవలం సంప్రదాయక గ్రంథాలు, సాహిత్యం, నైతికతత్వం, గణిత శాస్త్రం వంటి వాటితో పాటు విజ్ఞాన శాస్త్రానికి సంబంధించి వృక్ష రసాయన శాస్త్ర పాఠ్యాంశాలు కూడా బోధించడం జరిగేది. అధ్యాపకులు పిడివాదంతో కూడిన ఉపన్యాసం ఇవ్వడమే కానీ, విద్యార్థులు ప్రశ్నించడానికి నూతన విషయాలపట్ల కుతూహలాన్ని, జిజ్ఞాసను కనబరచడాన్ని ప్రోత్సహించకపోగా క్రమశిక్షణ పేరుతో పిల్లలను అదుపు చేసే వారు. ఇలాంటి స్వేచ్ఛారహిత వాతావరణంలో బాల్యం గడిపి మీడ్ మత విశ్వాసాలపట్ల విముఖత, దేశభక్తిపట్ల సంకుచిత భావాలను వ్యతిరేకించడం అలవర్చుకొన్నాడు. ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల వలస వచ్చి వారి సంక్షేమం పట్ల మీడ్ ఆసక్తి అధికమైంది.

1883లో మీడ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసే నాటికి వారి కుటుంబం ఆర్థిక పరిస్థితి క్షీణించి డబ్బు కొరత ఏర్పడింది. అంతేకాక 1881లో హీరమ్ మీడ్ అకస్మాత్తుగా మరణించడంతో కుటుంబం ఆర్థిక పరమైన చిక్కులను ఎదుర్కోవలసి వచ్చింది. దీంతో మీడ్ మొదట్లో పాఠశాల ఉపాధ్యాయ వృత్తి చేపట్టవలసి వచ్చింది. విద్యార్థుల క్రమశిక్షణారాహిత్యం వల్ల ఆకతాయి తనం వల్ల అధ్యాపక వృత్తిని మానుకోవలసి వచ్చింది. మీడ్‌కు సన్నిహిత మిత్రుడైన కెసిల్ సలహా మేరకు ఇతడు హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోనే చేరాడు. ఆదశలోనే పార్ట్‌టైమ్ ఉద్యోగం కొనసాగించాడు. విశ్వవిద్యాలయంలో ఉన్నప్పుడే తత్వ, మనో విజ్ఞానశాస్త్రాల పట్ల అభిమానం పెంచుకొన్నాడు. ఆనాటి ప్రముఖ తత్వవేత్త అయిన జోసియ రాయిస్ ప్రభావానికి లోనయ్యాడు. ఈ ప్రభావాంతోనే అతడు హెగేలియన్ తాత్విక ధోరణులను కూడా వంటపట్టించుకొన్నాడు. హార్వర్డ్ విద్యార్థిగానే మీడ్ గ్రీకు, లాటిన్, జర్మన్, ఫ్రెంచ్ భాషలను అధ్యయనం చేశాడు. ఈ సమయంలోనే విలియం జేమ్స్ అతని ప్రతిభాపాటవాలను గుర్తించి తన పిల్లలకు ట్యూటర్‌గా నియమించాడు. దీనితో ఆర్థిక ఇబ్బందులనుంచి కొంతవరకు గట్టెక్కినట్లయింది. ఈ కాలంలోనే కాంట్, హెగెల్, ఆర్థర్ షొపెన్‌హార్ రచనలను, ఉపయోగితా వాదులలో ప్రముఖుడైన హెన్రీ సెడ్జ్‌విక్ రచనలను, థామస్ హిల్ గ్రీక్ రచనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసే అవకాశం లభించింది.

1888లో జర్మనీలో తత్వ, మనో విజ్ఞాన శాస్త్రం అధ్యయనానికి ఇతనికి స్కాలర్‌షిప్ లభించింది. జర్మనీలో తత్వ, మనోవిజ్ఞాన శాస్త్రాల అధ్యయన కాలంలో మీడ్‌కు ఐరోపా దేశాలలో పర్యటించే అవకాశం దొరకడమే కాక జర్మనీలో ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలు అవుతున్న వివిధ సామాజిక సంస్కరణలను ప్రత్యక్షంగా చూసే అవకాశం కూడా లభించింది. మీడ్ జీవితాంతం రిపబ్లికన్ పార్టీ సభ్యుడిగా కొనసాగినా, నగటు మానవుడి సంక్షేమానికి ప్రభుత్వం కృషి ఎంత సార్థకమైందో తెలుసుకోగలిగాడు. ఈ అనుభవాల ప్రభావం వల్ల మీడ్‌లో సామాజిక సంస్కరణల పట్ల అభిమానం ఏర్పడి తన భవిష్యత్ రచనలన్నింటినీ ప్రభావితం చేయగలిగాయి.

1891లో హెలెన్‌కేసిల్‌తో వివాహం అయిన తరువాత అమెరికా తిరిగివచ్చి మిషిగన్ విశ్వవిద్యాలయంలో బోధకుడుగా జీవితం ప్రారంభించాడు. ఈ కాలంలోనే ప్రముఖ తత్వవేత్త జాన్ డ్యూయీతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఈకాలంలోనే మీడ్‌కు ఛార్లెస్. హెచ్ కూలేతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ఫలితంగా పిల్లల సామాజీకీకరణ గురించి అధ్యయనం చేయవలసిన అవసరాన్ని మీడ్ గుర్తించాడు. ఈ ప్రభావ ఛాయలు మీడ్ రచనలన్నింటిలోనూ కనిపిస్తాయి.

1893లో చికాగోలో కొత్తగా స్థాపించిన విశ్వవిద్యాలయ తత్వశాస్త్ర విభాగ అధ్యక్షుడిగా చేరవలసిందిగా అతడు మీడ్‌ను ఆహ్వానించాడు, ఇదే మీడ్ అకాడమిక్ జీవితంలో అంతిమ దశ. అంటే జీవితాంతం వరకూ మీడ్ ఈ విశ్వవిద్యాలయంలోనే అధ్యాపక వృత్తి సాగిస్తూ రచనా వ్యాసంగాన్ని కొనసాగించి సమాజశాస్త్రంలోని వివిధ అంశాలను చర్చించడంతో ప్రతీకాత్మక పరస్పర చర్యావాదాన్ని అభివృద్ధి చేశాడు.

## 17.3 మీడ్ ప్రతిపాదించిన ముఖ్యమైన భావనలు

చార్లెస్ మోరిస్ సంపాదకత్వంలో వెలువడిన 'మైండ్, సెల్ఫ్ అండ్ సొసైటీ' గ్రంథం మీడ్ భావనల ప్రాధాన్యక్రమాన్ని సూచిస్తాయని సమాజశాస్త్రవేత్తలు అభిప్రాయపడతారు. ఈ గ్రంథంలో మీడ్ ఆలోచనా స్వభావం, ఆలోచన, అహం సామాజీకీకరణలకు సంబంధించి అతనికున్న ఆసక్తిని తెలియజేస్తుంది. మీడ్ సమాజస్వభావానికి



BRAOU

సంబంధించి ఎటువంటి నిర్దిష్టమైన సిద్ధాంతాన్ని రూపొందించడానికి ప్రయత్నించలేదు. అతని ఆసక్తి అంతా సామాజికీకరణను, సామాజిక మనస్తత్వంపట్ల ఉన్నట్లు కనిపిస్తుందే కానీ ఒక సాధారణ సమాజశాస్త్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం పట్ల కాదని సమాజశాస్త్రవేత్తలు భావిస్తారు. అయితే మీడ్ మేథస్సు, అహం అనే వాటిని గురించి తన ఉపన్యాసాలలో రచనలలో ప్రముఖంగా పేర్కొన్నప్పుడు కూడా సామాజిక పరిస్థితుల నేపథ్యంలోనే వీటిని గురించి అతని ఆలోచనలు సాగాయని చెప్పక తప్పదు. అతని రచనలన్నీ ఒక సమగ్ర సిద్ధాంత వ్యవస్థకు సంబంధించినవే. ఈ వ్యవస్థలో సమాజమనేది ఒక మౌలికమైన, కీలకమైన అంశంగా ఉంటుంది. ఈ ధోరణిలోనే ఆలోచిస్తూ మీడ్ సమాజస్వభావాన్ని నిర్వచించడానికి, విశ్లేషించడానికి అంటే సమాజ పుట్టుపూర్వోత్తరాలు, దానిలోని ప్రధానాంశాలు, దాని అభివృద్ధి వికాసాల గురించి విశ్లేషించడానికి ప్రయత్నించాడు. సామాజిక నేపథ్యంలో మనిషి ప్రవర్తనకు మూలాధారమైన 'మైండ్' 'సెల్ఫ్'ల గురించి విపులంగా, విశిష్టంగా వివరించడానికి మీడ్ ఎంతో ప్రయత్నించాడు. ఈ సందర్భంలో ఇతడు పూర్వ సిద్ధాంతకర్తలైన బ్లూమర్, కూలేల రచనలను క్షుణ్ణంగా పరిశీలించి తనదైన పంథాలో మేదస్సు, అహం వంటి మౌలిక భావనలను వివరించడానికి ప్రయత్నించాడు. ఈ భావనలను గురించి మీడ్ వివరణను ఇప్పుడు పరిశీలిద్దాం.

### 17.3.1 చర్య లేదా ప్రవర్తన

మీడ్ ప్రతిపాదించిన సిద్ధాంతంలో చర్య లేదా ప్రవర్తన అనేది అత్యంత ప్రాచీనమైన అధ్యయన యూనిట్. చర్యలను విశ్లేషించడంలో ప్రవర్తనావాదుల ఆలోచనకు, మీడ్ ఆలోచనకు కొంత సామ్యం కనిపిస్తుంది. అయితే వీరిద్దరి అభిప్రాయాలలో ప్రధానమైన తేడాలను సులభంగా గుర్తించవచ్చు. ప్రవర్తనావాదులు ఉద్దీపనకు, ప్రతిస్పందనకు ప్రత్యక్ష సంబంధముందని భావిస్తే, మీడ్ ఉద్దీపన కారణంగా స్వయం చాలకంగా చర్య ఏర్పడదని, ఉద్దీపన అనేది చర్యకు ఉపక్రమించడానికి అనువైన అవకాశాన్ని, పరిస్థితిని కల్పిస్తుందే తప్ప స్వయంచాలకంగా చర్యకు పూనుకోడం జరగదని మీడ్ అంటాడు.

ప్రతీ చర్యలోనూ నాలుగు మౌలికమైన, పరస్పర ఆధారిత దశలు ఉంటాయని మీడ్ ప్రతిపాదించాడు. ఈ నాలుగు దశలు గతి తార్కికంగా, పరస్పర సంబంధం ఉన్నటువంటివని మీడ్ స్పష్టం చేశాడు. అవి: 1. సహజాతోద్వేగం లేదా ప్రచోదకం. 2. గ్రహణశక్తి లేదా జ్ఞానం, 3. అభిసంధానం లేదా అనుకూలంగా మలుచుకోవడం, 4. సిద్ధి లేదా పూర్తి చేయడం మధ్య గతి తార్కిక సంబంధం ఉంటుంది.

1. సహజాతోద్వేగం: ఇది మానవులలోను, జంతువులలోనూ కలిగే తక్షణ జ్ఞానేంద్రియాలలో కలిగే ఉద్దీపన. ప్రవర్తకుడిలో ఈ ఉద్దీపనకు కలిగే స్పందన. ఇటువంటి ఉద్దీపన, ప్రతిస్పందనలు ఇటు మానవులలోను, అటు జంతుజాలంలోనూ కనిపించే సామాన్య లక్షణం. ఉదాహరణకు ఆకలి. ఒక సంఘటన జరిగినప్పుడు మానవుడు ఇలాంటి సంఘటనలకు సంబంధించి గతంలోని అనుభవాలను, భవిష్యత్ ఫలితాలను దృష్టిలో ఉంచుకొని తన ప్రవర్తనను నిర్ణయించుకుంటాడు. జంతువులు అలాకాక తక్షణం స్పందించి ప్రవర్తించడం మొదలెడతాయి. ఆకలి వేసినప్పుడుమనిషి తినడానికి తగిన సమయం, తినడానికి అవసరమైన అవకాశాలను గురించి ఆలోచించి తన ప్రవర్తనను నిర్ణయించుకొంటాడు. దీనితో రెండో దశ ప్రారంభమవుతుంది.

2. గ్రహణశక్తి లేదా జ్ఞానం: బాహ్య ఉద్దీపనకు మనిషి వెంటనే స్పందించి చర్యకు పూనుకోడు. తన చర్యలకు సంబంధించి సాధ్యాసాధ్యాలను, అనువైన అవకాశాలను ఆలోచించి తగిన సాధనాన్ని ఎంచుకొంటాడు. జంతుజాలం అలాకాక తక్షణం ప్రతిస్పందించి చర్యలకు పూనుకొంటాయి. పైన ఇచ్చిన ఉదాహరణే తీసుకొంటే జంతువులు ఆకలి వేయగానే కనిపించిన దానిని తిని క్షుద్బాధను తీర్చుకోవడానికి పూనుకొంటాయి. కానీ మనిషి తన జ్ఞానేంద్రియాల ద్వారా రంగు, రుచి వాసన చూసి ఏది తినడానికి అనువైనదో అది లభ్యమయ్యే అవకాశాలు ఎంతవరకు ఉన్నాయో ప్రత్యమ్నాయాలు ఏమిటో పరిశీలించి చర్యకు పూనుకొంటాడు. ఈదశలోనే అభిసంధానం ప్రారభమౌతుంది.

3. అభిసంధానం లేదా అనుకూలంగా మలచుకోవడం: ఈ దశలో ఉన్న పరిస్థితులను అంటే ఆకలి బాధను తీర్చుకోవడానికి ఉన్న అవకాశాలను, వాటి సాధ్యాసాధ్యాలను గురించి ఆలోచించగం మొదలు పెడతాడే కానీ



BRAOU

కనిపించిన ప్రతీ దానిని తినడానికి అర్హమైందిగా భావించి తినడం మొదలు పెట్టడు. ఒక ఉదాహరణ సహాయంతో మీడ్ ఈ విషయాన్ని మరింత స్పష్టంగా వివరించాడు. పుట్టగొడుగులను చూడగానే ఆకలిబాధతో ఉన్న జంతువు దాన్ని వెంటనే తిని బాధా నివారణ చేసుకుంటుంది. అయితే మనిషి పుట్టగొడుగులను పరీక్షించి అవి విషపూరితమైనవి కావని నిర్ధారించుకొన్న తరువాతే అవి ఆహారమని భావిస్తాడు. అట్లాగే ముడి సరుకు రూపంలో లభించే ఆహార పదార్థాలన్నింటినీ తినడానికి అర్హమైన విధంగా మార్చుకొని అంటే రంగు, రుచి అబ్బేటట్లుగా చేసుకొని భుజించడానికి ప్రయత్నించడం. అంటే మానవుడు స్వయం చాలకంగా ప్రవర్తించకుండా ఆలోచనాపూర్వకంగా తన ప్రవర్తనను, పరిస్థితులకు అనుగుణంగా మలుచుకొంటాడన్నమాట. ఇలా చేయలేని పశుపక్ష్యాదులు విషపూరితమైన పుట్టగొడుగులను తిన్నందువల్ల అనారోగ్యానికి గురికావడం లేదా మరణించడం జరుగుతుంది. మనిషి తన వివేచనాజ్ఞానంతో మంచి చెడులను ఆలోచించి నిర్ణయం తీసుకోవడంతో ఫలితం సిద్ధిస్తుంది.

4. సిద్ధి లేదా పూర్తి చేయడం: ఈ దశలో మొదటి దశలో ఏర్పడిన సహజాతోద్వేగాన్ని సంతృప్తి పరచడం జరుగుతుంది. అంటే మొదట్లో ఏర్పడిన ఆకలి బాధను ఆహారం తీసుకోవడం ద్వారా తీర్చుకోవడం జరుగుతుంది. పశు పక్ష్యాదులు ప్రత్న దోశపద్ధతి ద్వారా సరైన ప్రవర్తనను ఎంచుకొని లక్ష్యాన్ని సాధిస్తే మనిషి తన వివేచనాశక్తితో మంచి చెడులను గుర్తించి సత్ఫలితాలను సాధిస్తాడు. ప్రమాదాలనుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాడు.

పైన వివరించినదంతా ఒక వ్యక్తికి సంబంధించిన చర్య. అయితే దీనినే మీడ్ సామాజిక ప్రవర్తనకు కూడా విస్తరించి వివరించాడు. సామాజిక చర్యలో ఒకే వ్యక్తి కాక పలువురు వ్యక్తుల చర్యలు చేరి ఉంటాయి. ఈ సందర్భంలోనే మీడ్ సంజ్ఞలు లేదా అంగవిక్షేపాల గురించి ప్రస్తావించాడు.

### 17.3.2 సంజ్ఞలు లేదా అంగవిక్షేపాలు

సామాజిక చర్యల సాధనంగా లేదా యంత్రంగా ఈ సంజ్ఞలు ఉపకరిస్తాయని మీడ్ అంటాడు. ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పాల్గొనే సామాజిక చర్యలలో ఈ సంజ్ఞలు మౌలికమైన భావ ప్రసార యంత్రాంగంగా ఉపయోగపడతాయి. ఒక వ్యక్తులు చేసే సంజ్ఞలు ఇతరుల చర్యలకు ఉద్దీపనలుగా పనిచేసి, వారిలో తగిన స్పందనను కలిగిస్తాయి. సంజ్ఞలు భావ ప్రకటన మాధ్యమాలుగా మానవులలోను, జంతువులలోను కనిపిస్తాయి. ఒకరు చేసే సంజ్ఞలు ఇతరులలో స్వయంచాలకంగా ప్రతిస్పందనను కలగజేస్తాయి. దీనికి ఉదాహరణగా మీడ్ కుక్కలు పోట్లాడుకోవడాన్ని పేర్కొన్నాడు. ఒక కుక్క మరో కుక్కపై దాడిచేయడానికి కాలుదువ్వడం, అరవడం మొదలు పెట్టినప్పుడు రెండోది కూడా స్పందించి మొదటిదానితో పోట్లాటకు సిద్ధం అవుతుంది. మీడ్ ఈ సందర్భంలో వాటి మధ్య జరిగే ఉద్దీపనను, స్పందనలను సంజ్ఞల సంభాషణగా పేర్కొన్నాడు. అంటే ఒకటి కల్పించిన ఉద్దీపనకు రెండోది స్వయంచాలకంగా ప్రతిస్పందించడమే. ఇందులో ఏవిధమైన ఆలోచనా ప్రక్రియ ఉండదు. మానవులలో కూడా ఇటువంటి ఆలోచనా రహితమైన సంజ్ఞల సంభాషణ జరగవచ్చు. ఉదాహరణకు బాక్సింగ్, ఫెన్సింగ్ పోటీలలో ప్రత్యర్థులు ఒకరి చర్యలను అనుసరించి మరొకరు ప్రతిస్పందిచడం జరుగుతుంది. ఇది సహజాత ప్రవర్తన. ఇలాంటి సహజాత ప్రవర్తన మీడ్ ప్రకారం అంత ముఖ్యమైనది కాదు. జంతువులకు, మానవులకు సంజ్ఞల విషయంలో ఉన్న తేడా ప్రధానంగా అర్థవంతమైన సంజ్ఞలను మానవులు ఉపయోగించగలగడమే.

పైన తెలిపిన ప్రధాన సంజ్ఞల ప్రయోగంలో వాచ్యమైన సంజ్ఞలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. మనుషులు చేసే కొన్ని శబ్దాలు కూడా అర్థరహితంగానే ఉంటాయి. మనిషి గుర్రుమనడం అనేది అర్థరహితమైన సంజ్ఞకు మంచి ఉదాహరణ. భాషారూపంలో ఉన్న సంజ్ఞలను అర్థవంతమైనవిగా పరిగణించడం జరుగుతుంది. ఇలాంటివే మానవజీవిత వికాస విజ్ఞానార్జనలో కీలక పాత్ర వహిస్తాయి అని మీడ్ భావిస్తాడు. మనిషి అంగవిక్షేపాలతో ఇతరులలో స్పందన కల్పించగలడు. కానీ వాటిని అద్దంముందు నిలబడి ఉంటే తప్ప అతడు స్వయంగా చూడలేడు. అదే వాచ్యమైన సంజ్ఞలపై అతనికి పూర్తి అదుపు ఉంటుంది. ఈ సందర్భంలో మీడ్ మాటలను పరిశీలిద్దాం. "It has been the vocal gesture that has preeminently provided the medium of Social Organization in Human Society " వాగ్రూపంలోని సంజ్ఞలు మానవ సమాజంలో సామాజిక వ్యవస్థ మాధ్యమాన్ని కల్పించాయి.



BRAOU

### 17.3.3 ప్రముఖ ప్రతీకలు

మానవులు మాత్రమే చేయగల సంజ్ఞలను ప్రముఖ ప్రతీకలని మీడ్ పేర్కొన్నాడు. ఈ ప్రముఖ ప్రతీకలు అవి ఉపయోగించే వ్యక్తిలోను, ఎదుటి వ్యక్తిలోను సదృశ్యమైనవి కాకపోయినా ఇంచుమించు ఒకే రకమైన స్పందనను కలుగజేస్తాయి. ఇలాంటి ప్రముఖమైన ప్రతీకలను ఉపయోగించినప్పుడే అసలు సిసలైన భావప్రసారం సాధ్యమవుతుందని మీడ్ భావించాడు. ఇటువంటి ప్రతీకలు ఉపయోగించలేని చీమలు, ఇతర క్రిమికీటకాలలో సంపూర్ణమైన భావ ప్రసారం సాధ్యం కాదు. నిజానికి అంగవిక్షేపాలను కూడా ప్రముఖమైన ప్రతీకలుగా ఉపయోగించవచ్చు కానీ, అంగ విక్షేపాలు చేస్తున్న వ్యక్తి తనను తాను చూసుకోలేడు కాబట్టి అవి ప్రముఖ ప్రతీకలుగా చెలామణి కావడానికి ఇబ్బంది ఎదురౌతుంది. అందుకే వాచ్య సంజ్ఞలే ప్రధాన ప్రతీకలవడానికి అవకాశం ఉందన్న మాట. అయితే అన్ని వాచ్య సంజ్ఞలూ ప్రముఖమైన ప్రతీకలు కాలేవు. ఏ వాచ్య సంజ్ఞలు ప్రముఖమైన ప్రతీకలౌతాయో వాటినే మనం భాష అంటున్నాం. ఒక ప్రతీక ఒక వ్యక్తిలో ఒక అర్థాన్ని స్ఫురింపజేసి, అదే అర్థాన్ని మరో వ్యక్తిలోనూ స్ఫురింపజేసినట్లయితే దానిని భాష అనవచ్చు. అలా జరిగినప్పుడు ఆ ప్రతీక ఒక ప్రముఖమైన ప్రతీక అవుతుంది. అంటే భావవాహకమైన సంజ్ఞే భాష అన్నమాట. అందుకు భాషను ప్రముఖ ప్రతీకగా పరిగణించడం జరుగుతుంది.

సంజ్ఞల గురించి సాధారణ చర్చ చేసిన మీడ్ ప్రముఖ ప్రతీకల ప్రకార్యాలను గురించి కూడా ప్రస్తావించాడు. సామాజిక చర్యలో పాల్గొంటున్న వ్యక్తుల మధ్య సర్దుబాటు కల్పించడానికి ప్రముఖ ప్రతీకలు ఉపయోగపడుతాయి. ఇదే ప్రముఖ ప్రతీకల ప్రకార్యం. సమాజంలో వివిధ వ్యక్తుల మధ్య పరస్పర సర్దుబాటుకు ప్రముఖ ప్రతీకలు, అంత ప్రాముఖ్యంలేని సంజ్ఞల సంభాషణ కంటే అధికంగా తోడ్పడతాయి.

మీడ్ రూపొందిందించిన సిద్ధాంతంలో ప్రముఖ ప్రతీకల మరో ముఖ్యమైన ప్రకార్యం ఉంది. ప్రముఖ ప్రతీకలు మేధస్సును మానసిక ప్రక్రియలు కొనసాగించేందుకు తోడ్పడతాయి. ప్రముఖ ప్రతీకలలో ఒకటైన భాషద్వారానే మానువులలో ఆలోచించే గుణం ఏర్పడటానికి సాధ్యమైంది. ఆలోచించడం అనే గుణాన్ని మీడ్ ఈ విధంగా నిర్వచించాడు. "ఒకమనిషిలో అంతర్గతంగా తనతో తానే సంజ్ఞల ద్వారా సంభాషించడమే ఆలోచన". ఆలోచించడం అంటే ఇతరులతో మాట్లాడిన దానితో సమానం. మరో విధంగా చెప్పాలంటే మనతో మనం మాట్లాడుకోవడమే ఆలోచన. సంభాషణలో ప్రవర్తన అనేది స్పష్టంగా కనిపిస్తుంది. ఈ ప్రవర్తన వ్యక్తిలోనే జరుగుతుంది. అంటే ఆలోచన మొదలవుతుందన్న మాట. ఇది కేవలం మేధస్సుకు సంబంధించినది మాత్రమే కాదు అని, ప్రవర్తనకు సంబంధించినదని కొందరు పేర్కొంటారు. అందుకే మీడ్ ప్రవర్తనావాదం దృష్టిలోనే ఆలోచనను నిర్వచించాడని శాస్త్రవేత్తల అభిప్రాయం.

ప్రముఖ ప్రతీకలు ప్రతీకాత్మక పరస్పర చర్య ఏర్పడడానికి దోహదం చేస్తాయి. అంటే వ్యక్తుల పరస్పర చర్య కేవలం సంజ్ఞల ద్వారానే కాక ప్రముఖ ప్రతీకల ద్వారా ఏర్పడుతుందన్నమాట. ఈ సామర్థ్యమే సంక్లిష్టమైన పరస్పర చర్యల తీరును ఎదుర్కోవడానికి అవసరమైన సాధన సంపత్తిని కల్పిస్తుంది. విభిన్న తరహాల సామాజిక వ్యవస్థలు ఏర్పడటానికి తోడ్పడుతుంది. మిల్లర్ అభిప్రాయం ప్రకారం మీడ్ రూపొందించిన సిద్ధాంతంలో ప్రముఖ ప్రతీకలదే కేంద్ర స్థానం. మీడ్ తన రచనలన్నింటిలోనూ ఈ విషయాన్ని గురించే ఆలోచించాడు. లోతుగా పరిశీలించాడు. శాస్త్రీయంగా విశ్లేషించాడు.

### 17.3.4 మానసిక ప్రక్రియలు, మేధస్సు

మానసిక ప్రక్రియలకు సంబంధించి మీడ్ అనేక భావనలను గురించి వివరంగా ప్రస్తావించాడు. ఈ విషయంలో మీడ్ నిర్మితులు లేదా విషయాల కంటే ప్రక్రియలకే ప్రాధాన్యతనిచ్చాడు. అందుకే అతడిని 'ప్రక్రియల తత్వవేత్త' అని క్రాంక్, మిల్లర్‌లు అభివర్ణించారు. మానసిక ప్రక్రియ అంటే మీడ్ దృష్టిలో తెలివితేటలు కాదు. తెలివితేటలనేవి పశుపక్ష్యాదులలో కూడా కనిపిస్తాయి.సంజ్ఞలను మీడ్ స్థూలంగా ఈ విధంగా నిర్వచించాడు. 'జీవుల పరస్పర చర్యలలోని సర్దుబాటు లక్షణమే తెలివితేటలు'. పశుపక్ష్యాదుల మాదిరిగానే మానవులు కూడా ఆ ప్రధానమైన సంజ్ఞల ద్వారా ఇతరులతో సంభాషించి ప్రవర్తిస్తాడు. మనిషి ప్రముఖమైన ప్రతీకల ద్వారా కూడా పరస్పరం సర్దుబాటు

చేసుకోగలడు. నేటకుక్కలకు కూడా తెలివితేటలుంటాయి. కాని నేరపరిశోధకుడి ప్రజ్ఞ ప్రముఖమైన ప్రతీకలు ఉపయోగించగల శక్తిమంతమైనదని మీడ్ అంటాడు. తెలివితేటలకు సంబంధించి మానవుల శక్తి, జంతుజాలం శక్తితో పోలిస్తే విశిష్టమైంది. హేతుబద్ధమైందన్నమాట.

మానవుడికి ఆలోచనాశక్తి ఉన్నందువల్ల ఒక ఉద్దీపనకు వెంటనే ప్రతిస్పందించి చర్యకు పూనుకోకుండా, కొంత ఆలోచించి పర్యవసానాలను బేరీజు వేసుకొని మరీ చర్యను చేపడతాడు. అంటే తనకున్న ప్రత్యేకమైన లక్షణమైన ఆలోచనాశక్తి వల్ల తన స్పందనను కొంత సమయం పాటు వాయిదా వేయగలడు. ఇలాంటి శక్తి అల్పప్రాణులైన జంతుజాలంలో కనిపించదు. వీటిలో ఉద్దీపన, స్పందనలు కాలవిలంబన లేకుండా జరుగుతాయి. ఈ సందర్భంలో మీడ్ అన్న మాటలను గుర్తు చేసుకుందాం. 'విలంబిత ప్రతిస్పందన ప్రజ్ఞా ప్రవర్తనకు ముఖ్యం'

మీడ్ పేర్కొన్న విలంబిత ప్రతిస్పందనలో మూడు ముఖ్యమైన అంశాలను గుర్తించవచ్చు. అవి: 1. చర్యలను వాయిదా వేయగల శక్తి ఉన్న మానవుడు ఒక ఉద్దీపనకు ఉన్న వివిధ రకాల ప్రతిస్పందనలను గురించి ఆలోచించగలడు. ఒక సామాజిక చర్యకు పూనుకొనే ముందు ప్రత్యామ్నాయ చర్యలను గురించి ఊహించుకొని అందులో సరియైన దానిని ఎన్నుకొని ప్రవర్తించగలడు. జంతువులు ఇలా చేయలేవు. ఎందుకంటే వాటికి ఈ వివేచనాశక్తి ఉండదు. కాబట్టి ఇదివరకు ఇచ్చిన ఉదాహరణనే తీసుకుందాం. విషపూరితమైన పుట్టగొడుగులను తినకుండా మానవుడు దాని గుణగణాలను బేరీజు వేసుకున్న తర్వాతే అంటే అది భుజించడానికి యోగ్యమైనది అని నిర్ధారించుకొన్న తరువాతే దానిని తింటాడు. జంతువులు అలా కాక వెంటనే తినడం ప్రారంభిస్తాయి. దానివల్ల ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొనవలసి వస్తుంది. వివేచనా శక్తి కొరవడిన ప్రాణులు ప్రయత్న దోష పద్ధతిని ఉపయోగిస్తాయి. 2. మనిషి ప్రవర్తనకు సంబంధించి ఉన్న వివిధ ప్రత్యమ్నాయాలను మనసులోనే పరిశీలించి అనువైన దానిని ఎన్నుకొంటాడు. ఇలా ఎన్నుకోవడంలో తనతో తాను సంభాషించుకోవడం జరుగుతుంది. ఇలా చేయడంలో ఏ విధమైన సామాజిక సమన్వయం ఉండదు. 3. వివిధ తరహాల ఉద్దీపనలలో నుంచి ఒక దానిని ఎంచుకోగల శక్తి మానవుడికి ఉంది. మొదటి లేదా అతి శక్తిమంతమైన ఉద్దీపనకే స్పందించక ప్రత్యమ్నాయ చర్యల బాగోగులను బేరీజువేసుకున్న తర్వాతే ఏ చర్య చేపట్టాలో నిర్ణయించుకుంటాడు. ఇలాంటి మానసిక ప్రక్రియ జంతుజాలంలో కనిపించదు. అవి తక్షణం ప్రతిస్పందిస్తాయి. ఇలా ఉద్దీపనలను, ప్రత్యమ్నాయ చర్యలను తన వివేచనా శక్తితో పరిశీలించి సరియైన వాటి ఎంపిక చేసుకోగలగడమే మేధాశక్తి ప్రజ్ఞకు నిదర్శనమని మీడ్ అభిప్రాయం.

BRAOU

తెలివితేటలతోబాటు మీడ్ చైతన్యాన్ని గురించి కూడా వివరంగా చర్చించాడు. చేతనత్వానికి రెండు విశిష్టమైన అర్థాలను చెప్పుకోవచ్చు. అవి: 1. ఒక వ్యక్తికే అందుబాటులో ఉండేటటువంటిది. అంటే ఇది కేవలం ఆత్మాశ్రయమైనదన్నమాట. 2. ఆలోచనతో కూడిన ప్రజ్ఞ. ఈరెండు అర్థాలలో మీడ్ రెండో అర్థం పట్లే ఆసక్తి కనబరిచాడు. తక్షణం కలిగే బాధ లేదా ఆనందాన్ని గురించి కాక సామాజిక ప్రపంచాన్ని గురించిన ఆలోచనే ప్రధానమైందని మీడ్ భావిస్తాడు. సామాజిక ప్రక్రియలో భాగంగానే చైతన్యాన్ని అర్థం చేసుకోవాలంటాడు. చైతన్యం అనేది మనిషి మేధస్సులో ఉన్నటువంటిది కాదు. చైతన్యం ప్రకార్య సంబంధమైనదే కాని వస్తుపరమైనది కాదు. భౌతిక ప్రపంచానికి సంబంధించిన అంశమిది. మనిషి ఉన్న పర్యావరణంతో ప్రత్యక్ష సంబంధమున్నది. మనిషి మేధస్సులో ఏం జరుగుతున్నది అనేది ఒక శారీరక ప్రక్రియ. ఈ ప్రక్రియ వల్లనే చైతన్యం కోల్పోవడం కానీ తిరిగి పొందడం కానీ జరుగుతూ ఉంటుందని మీడ్ అంటాడు.

ఒక సంఘటన జరిగినప్పుడు వ్యక్తి మెదడులో ఏర్పడే చిత్రాలకు మీడ్ అంతగా ప్రాధాన్యం ఇవ్వక ఆ సంఘటనను ఒక సామాజిక దృగ్విషయంగా పరిగణిస్తాడు. ప్రవర్తన దృష్ట్యా మీడ్ 'అర్థం' అనేది చైతన్యంలోనే ఉంటుందనే వాదనను నిరాకరించి అది సామాజిక అనుభవంలోనిదేనని ప్రతిపాదించాడు. అట్లాగే అర్థం అనేది మానసిక దృగ్విషయంలేదా భావం అనే వాదాన్ని కూడా తిరస్కరిస్తూ, అర్థం సామాజిక చర్యలోనే ఇమిడి ఉంటుందని, దానిలోనే పుడుతుందని వివరించాడు. వ్యక్తి ప్రవర్తనలోనే అర్థం ఉన్నందువల్ల అది ప్రతీకలతో కలిసి చైతన్యం అవుతుంది. మానవులలో అర్థం చైతన్యం అయినప్పటికీ ఇలా జరగడానికి ముందే అది సామాజిక ప్రవర్తనలో అంతర్భాగంగా ఉంటుంది. అందువల్లనే జంతుజాలం, మానవులు అర్థం తెలియకున్నప్పటికీ అర్థవంతంగా ప్రవర్తిస్తాయని మీడ్ అంటాడు.

చైతన్యాన్ని నిర్వచించిన మాదిరిగానే మీడ్ మేధస్సును కూడా నిర్వచించాడు. మీడ్ దృష్టిలో మేధస్సు ఒక ప్రక్రియే కానీ ఒక వస్తువు కాదు. అది అంతర్గతంగా తనతో తాను మాట్లాడుకోవడమే. మేధస్సు అనేది ఒక వ్యక్తిలో ఉన్న అంశంగా కాక ఒక సామాజిక దృగ్విషయంగా మీడ్ గుర్తించాడు. ఒక సామాజిక ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు ఏర్పడే మేధస్సు. అది ఆ ప్రక్రియలో అంతర్భాగంగా ఉంటుంది. మేధస్సుకంటే ముందు సామాజిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. అందరూ అనుకొన్నట్లు సామాజిక ప్రక్రియ అనేది మానవ మేధస్సులో ఉద్భవించిందికాదు. దీనిని బట్టి చూస్తే మీడ్ మేధస్సునుకూడా ప్రకార్యపరంగా నిర్వచించాడే కానీ వస్తుపరంగా కాదని తెలుస్తుంది. మానవ మేధస్సుకు ఒక విశిష్టమైన లక్షణం, శక్తి ఉన్నాయి. తన చర్యల వల్ల ఇతరులలో స్పందన కలగడాన్ని ప్రేరేపించడానికే పరిమితం కాక మొత్తం సముదాయంలో కూడా స్పందన కలిగించగల శక్తి మానవ మేధస్సుకుంది. ఇదే దాని విశిష్టత.

మేధస్సుకు సంబంధించి మీడ్ ఒక వాస్తవ, వ్యవహార దృక్పథంతో విశ్లేషణ చేశాడు. ఒక సమస్యను పరిష్కరించే దృష్టితో జరిగే ఆలోచనా ప్రక్రియలే మేధస్సు అని మీడ్ అంటాడు. ప్రపంచంలో అనేకానేక సమస్యలు మానవుడికి ఎదురవుతుంటాయి. వాటికి పరిష్కార మార్గాలు వెదకడమే మానవ మేధస్సు నిర్వహించాల్సిన విధి. ఇలా సమస్యల పరిష్కారం జరిగినప్పుడే మనుషులు ప్రపంచంలో అర్థవంతంగా, సార్థకంగా ప్రవర్తించ గలరు.

## 17.3.5 అహం

మేధస్సుకు సంబంధించి మీడ్ చేసిన విశ్లేషణలోని అంశాలలో అత్యంత కీలకమైన భావన అహం(Self). ఇంతవరకు జరిపిన చర్చలో ఈ భావనను గురించి అసలు ప్రస్తావించనేలేదు. మీడ్ ఆలోచనా ధోరణి సరిగా అర్థం చేసుకోవాలంటే అహం విషయంలో మీడ్ అభిప్రాయాలను సంపూర్ణంగా తెలుసుకోవలసిన అవసరం ఉంటుంది. అందుకే ఈ అంశాన్ని గురించి విపులంగా వివరించడానికి ప్రయత్నించడం జరుగుతుంది.

ఆత్మజ్ఞానం, వస్తుపరజ్ఞానం తాలూకు శక్తే అహం అని మీడ్ నిర్వచించాడు. మీడ్ ప్రతిపాదించిన అన్ని ముఖ్యమైన భావనలలో సామాజిక ప్రక్రియ అనేది అంతర్లీనంగా ఉండే ముఖ్యమైన అంశంగా గుర్తించవచ్చు. అంటే సామాజికుల మధ్య సాగే భావప్రసారమన్నమాట. అల్ప ప్రాణులైన జంతుజాలంలో ఈ విధమైన అహం కనిపించదు. అట్లాగే అప్పుడే పుట్టిన శిశువులో కూడా ఇలాంటి శక్తి ఉండదు. అహం అనేది సామాజిక కార్యకలాపాలు, సామాజిక సంబంధాలు పెరగడంతో ఏర్పడేటటువంటిది. సామాజిక అనుభవాల ప్రమేయం లేకుండా అహం ఏర్పడటం అసంభవమని మీడ్ అభిప్రాయం. అయితే ఒకసారి అహం అనేది ఏర్పడ్డాక సామాజిక సంబంధాలు లేకపోయినా అది కొనసాగుతూనే ఉంటుంది. ఈ పరిస్థితిని వివరించడానికి రాబిన్‌సన్ క్రూసోను ఒక చక్కటి ఉదాహరణగా పేర్కొంటాడు. రాబిన్‌సన్ క్రూసో నాగరిక సమాజంలో సభ్యుడుగా ఉన్నప్పుడు ఏర్పడిన అహం ఒక దీవిలో ఏకాకిగా కాలం గడపవలసి వచ్చినప్పుడు కూడా అప్పటి అహమే ఉంది. అంటే అహం ఒకసారి ఏర్పడితే అది సామాజిక సంబంధాలున్నా, లేకున్నా మనిషిలో నిలిచిపోతుందన్నమాట. ఒకసారి ఏర్పడిన అహం వివిధ రూపాలలో ప్రత్యక్షమవుతూనే ఉంటుంది.అయితే అలవాట్లు, ప్రతిక్రియాచర్యలతో అహానికి సంబంధం ఉండదు.

మీడ్ అభిప్రాయం ప్రకారం మేధస్సుకు, అహానికి గతి తార్కిక సంబధం ఉంటుంది. మనిషి శరీరం అహానికి తుల్యమైది కాదు. మేధస్సు పెరిగితేనే శరీరం కూడా అహంలో భాగమవుతుంది. అయితే శారీరకమైన ప్రతిక్రియలు మేధస్సు అభివృద్ధికి అవసరమే. అందువల్లనే మీడ్ మేధస్సు, అహం విడదీయడానికి వీలులేనటువంటి అంశాలని అంటాడు. కారణం అహం అనేది ఒక మేధో ప్రక్రియ అని మీడ్ భావించాడు. అతడు ప్రతిపాదించిన సైద్ధాంతిక వ్యవస్థలో మేధో ప్రక్రియకూడా సామాజిక ప్రక్రియే అన్న విషయాన్ని విస్మరించకూడదు. అహం మానవ చైతన్యంలోని ఒకానొక భాగం కాదని సామాజిక అనుభవం, సామాజిక ప్రక్రియలలోని భాగమని మీడ్ వాదిస్తాడు. ఈవిధంగా వాదించడంలో మీడ్ కూడా ప్రవర్తనావాదం ధోరణిలోనే ఆలోచించాడని స్పష్టమవుతుంది. ఇతని దృష్టిలో సమగ్ర సామాజిక ప్రక్రియలో అహం కూడా ఒకానొక భాగమే. కారణం ఈ సామాజిక ప్రక్రియలో వ్యక్తి కూడా ఒక అంశంగా ఉంటాడు కాబట్టి. అసంకల్పిత చర్యలో పూర్వానుభవం కనిపిస్తుంది. అందుకే తన ప్రవర్తన ప్రభావం ఇతరులపై ఎలా ఉంటుందో తెలుసుకొనే నిర్బంధంలో వ్యక్తి తనను తాను పరీక్షించుకోవడం జరుగుతుంది. ఎదుటి వ్యక్తి స్థానంలో తానుంటే ఏవిధంగా ప్రవర్తించేవాడో ఊహించుకొని, తన చర్యకు లోనైన వ్యక్తి ప్రతిస్పందనను కూడా



BRAOU

ఊహించి తన ప్రవర్తనను నిర్ధారించుకొంటాడు. ఇదంతా కూడా సామాజిక ప్రక్రియలోని భాగమే.

అహం ఆవిర్భావానికి సంబంధించి మీడ్ ప్రత్యేక ఆసక్తి కనబరిచాడు. సంజ్ఞల సంభాషణ నేపథ్యంలోనే అహం పుడుతుందని అతడంటాడు. మనిషి నిత్యజీవితంలో అనేకులను కలవడం, వారి మధ్య భావవినిమయం జరగడం సహజం. అనేక రకాల వ్యక్తులతో విభిన్న రీతులలో నడుచుకోవలసి వస్తుంది. ఇలాంటి నడవడికలోనే పాత్ర నిర్వహణ అనేది ఏర్పడుతుంది. అహం నిర్మాణానికి మూడు దశలను మీడ్ పేర్కొన్నాడు. అవి: 1. ఆటల దశ, 2. క్రీడా దశ, 3. సాధారణ ఇతరులు. ఈ మూడు దశల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

**1. ఆటల దశ:** బాల్యంలో పిల్లలు రకరకాల ఆటలు ఆడుతుంటారు. ఉదాహరణకు పెళ్లిళ్లు, యుద్ధం. పెళ్లిళ్ల ఆటలో పెళ్లికూతురు పాత్రను, యుద్ధంలో శత్రువు పాత్రను లేదా దేశభక్తుడి పాత్రను నిర్వహిస్తారు. తమ సామాజిక పాత్రను - తల్లిగా, పెళ్లికూతురుగా- తమను తాము ఊహించుకొని పాత్రోచితంగా ప్రవర్తిస్తూ ఉంటారు. దీనివల్ల పిల్లలో స్వీయ చైతన్యం పెరిగి అహం నిర్మాణం జరుగుతుంది.

**2. క్రీడా దశ:** ఈ దశలో శిశువు మామూలు పాత్రలు కాకుండా సంక్లిష్టమైన పాత్రలను పోషించడానికి ప్రయత్నిస్తాడు. ఒక క్రీడలో, ఉదాహరణకు క్రికెట్‌లో వ్యక్తి ఇతర ఆటగాళ్లతో అంటే కెప్టెన్, వైస్ కెప్టెన్ మొదలైన పాత్రలతో తన పాత్రను సర్దుకోవలసి వస్తుంది. పాత్రలు ఎక్కువైనకొద్దీ పాత్ర నిర్వహణ సంక్లిష్టంగా తయారవుతుంది. ఆటలో పాల్గొనే అందరు వ్యక్తుల ఆటగాళ్ల అభివ్యక్తులను అర్థం చేసుకోవలసి వస్తుంది. క్రీడలలోని నియమాలకు అనుగుణంగా నడచుకోవలసి వస్తుంది. ఎందుకంటే క్రీడా వ్యవస్థ కొన్ని నియమ నిబంధనల ప్రకారం నడుస్తుంది.

**3. సాధారణ ఇతరులు:** మనిషికి ఆత్మ సమైక్యాన్ని చేకూర్చేది సామాజిక సమూహం, సాముదాయక వ్యవస్థ కావచ్చు. సామాజిక అభివ్యక్తులనే సాధారణ ఇతరులు అని మీడ్ భావించాడు. ఈ భావన ద్వారానే సమాజంలోని సభ్యులపై సముదాయం నియంత్రణ సాగిస్తుంది. అహం నిర్మాణంలో రెండు రకాల అభివృత్తులు నిర్మితమౌతాయి. మొదలు కొంతమంది వ్యక్తుల ప్రత్యేక దృక్పథాలను అంతర్గతం చేసుకొని అహం వ్యవస్థీకృతమౌతుంది. రెండో దశలో సముదాయం సామాజిక అభివృత్తులను అంతర్గతం చేసుకొని తన అహాన్ని వ్యవస్థీకరించుకొని, వాటిని సాధారణీకరించి అహం పరిపూర్ణ అభివృద్ధిని సాధిస్తుంది. దీనివల్ల మనిషి అహం ఇతరులు పాల్గొనే సామూహిక ప్రవర్తన నమూనాకు సంబంధించిన వైయుక్తిక ప్రతిబింబంగా తయారవుతుంది. మీడ్ ఇచ్చిన వివరణకు మద్దతుగా బేస్‌బాల్ ఆటను పేర్కొనవచ్చు. సాధారణ ఇతరుల పాత్రను నిర్వహించడం అనేది అహానికి అత్యంత ముఖ్యం. దీనిని బట్టి చూస్తే ఒక వ్యక్తికి అహం అనేది ఒక సముదాయం ఉండటం, ఆ సముదాయ అభివృత్తుల ప్రకారం నడచుకొనేట్టు నిర్దేశించడం అనేవి కీలకమని అర్థం అవుతుంది. ఆటలో అహం తాలూకు కొన్ని భాగాలుంటే సరిపోతుంది. అదే క్రీడలో సుసంఘటితమైన అహం ఉండటం తప్పనిసరి. అహానికి సాధారణ ఇతరుల పాత్రను స్వీకరించడం అవసరమేకాక వ్యవస్థీకృతమైన సామూహిక కార్యకలాపాలలో పాల్గొనడానికి అంతే ముఖ్యం. ఈ సాధారణ ఇతరుల ద్వారానే సముదాయంలోని సభ్యుల ప్రవర్తన ప్రభావితం, నియంత్రితం అవుతుంది.

అహాన్ని మీడ్ వ్యవహారిక దృష్టితో కూడా పరిశీలించాడు. విశాల సమాజంలో ఆ సమాజం ఆకాంక్షలకు అనుగుణంగా వ్యక్తి ప్రవర్తించడానికి అహం ఎంతగానో తోడ్పడుతుంది. సమాజంలోని ప్రతీవ్యక్తి సామాజిక ఆశయాల మేరకు ప్రవర్తించడానికే ప్రయత్నిస్తాడు. ఇలాంటి ప్రయత్నం వల్లనే మొత్తం సమాజంలో సమన్వయం సాధ్యమవుతుంది. సామాజికులందరూ సమాజం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రవర్తించడం వల్ల మొత్తం సార్థకంగా, సమర్థవంతంగా పనిచేయడానికి వీలవుతుంది.

మీడ్ దృష్టిలో సమాజంలో ఒకే ఒక సాధారణ ఇతరుల సమూహం కాక అనేక సాధారణ ఇతరుల సమూహాలు కూడా ఉంటాయి. అంటే సమాజంలో సాధారణ ఇతరుల సమూహాలు అనేకం ఉండటం వల్ల వ్యక్తికి ఒకే అహం కాక అనేక అహాలు ఉంటాయి. ఇలా ఉండటం వల్ల వ్యక్తి తన ఆలోచనా సామర్థ్యాన్ని బట్టి సమాజంలో మార్పులు తీసుకుని రాగలుగుతాడు. సామాజిక వ్యవస్థకు ఉన్నది ఉన్నట్టుగా ఆమోదించక తన సృజనాత్మక శక్తితో సామాజిక వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు కారణం అవుతాడు. ఇలా వాదించడంతో మీడ్ ప్రవర్తనావాదుల బాటలోనే

BRAOU

నడిచాడనిపిస్తుంది.

### 17.3.6 నేను, నాది

అహంలో రెండు అంశాలు లేదా దశలు ఉన్నట్లు మీడ్ గుర్తించాడు. అవే 'నేను', 'నాది' (I and Me) అనేవి. మీడ్ దృష్టిలో ఈ రెండు దశల ద్వారా సాగే సామాజిక ప్రక్రియే అహం. అహం తాలూకు విశాల ప్రక్రియలో 'నేను', 'నాది' అనేవి ఉపప్రక్రియలని మరిచిపోకూడదు. 'నేను' అనేది ఒక వ్యక్తి విషయంలో కలిగే తక్షణ ప్రతిస్పందన. ఇది అంచనాలకు అందనిది. ముందుగానే ఊహించలేనిది. సృజనాత్మకమైనది. 'నేను' అనేది ఏ చర్యకు పాల్పడుతుందో ఇతరులు ముందుగానే ఊహించలేరు. వ్యక్తికి కూడా అంతు పట్టనిది. 'నేను' అనేది వ్యక్తిని అద్భుతంగా ప్రవర్తించేట్లు చేయవచ్చు. తప్పు చేసేట్లు చేయవచ్చు. ఒక చర్య జరగక ముందు 'నేను' అంటే ఏమిటో మనకు తెలియదు. దానిని చర్యానంతరమే తెలుసుకునే వీలుంటుంది. అంటే నేను అనేది మన స్మృతి పథంలోనిదే కానీ మనకు తెలియని అంశమన్నమాట. మీడ్ నేను అనే భావనకు అత్యధిక ప్రాధాన్యమివ్వడానికి నాలుగు కారణాలున్నాయి. అవి: 1. సామాజిక ప్రక్రియలో నవ్యతకు ఇది ఒక కీలకమైన మూలం. 2. ఈ 'నేను'లోనే మన ముఖ్యమైన విలువలన్నీ నిక్షిప్తమై ఉంటాయి. 3. మనం అందరమూ ఆశించేది, ఆకాంక్షించేది 'నేను' అనే అంశమే. ఒక నిర్దిష్టమూర్తిమత్వాన్ని రూపొందించుకోవడానికి అవకాశం కల్పించేది నేను. 4. మానవజాతి చరిత్రలోని పరిణామ ప్రక్రియను మీడ్ గుర్తించడమేకాక ఒక కారణం పరిణామ ప్రక్రియలో ఆదిమ సమాజాలలో 'నాది'కి ప్రాబల్యం అధికంగా ఉండటం, ఆధునిక సమాజాలలో 'నేను' ప్రాబల్యం పెరగడాన్ని మీడ్ గుర్తించడమే 'నేను'కు మీడ్ ప్రాముఖ్యతనివ్వడానికి కారణం.

మీడ్ ప్రతిపాదించిన సైద్ధాంతిక వ్యవస్థను చైతన్యవంతం, సృజనాత్మకం చేయడంలో ఈ 'నేను' అనే భావన ఎంతో తోడ్పడింది. ఈ భావనే లేకపోతే మీడ్ ఊహించిన పాత్రలన్నీ బాహిరమైన, అంతర్గతమైన మార్పులకే కాక సాధారణ వ్యక్తులు, దైనందిన జీవితంలో తీసుకువచ్చిన మార్పులను కూడా విశ్లేషించడానికి వీలైంది. మానవజాతి చరిత్రలో కనిపించే మార్పులన్నింటికీ ఈ 'నేను' యే కారణం. ప్రతీ వ్యక్తితో నేను, నాది లు పెనవేసుకొని ఉండటం జరుగుతుంది. అయితే ప్రముఖ వ్యక్తులలో 'నేను'పాలు అధికంగా ఉండడం గమనించవచ్చు. అయితే దైనందిన జీవితంలో ఏ వ్యక్తిని 'నేను' అయినా ప్రతిజ్ఞాత్మమైనది అయినప్పుడు సామాజిక పరిస్థితిలో మార్పులు చోటుచేసుకొంటాయి. ఒక వ్యక్తి తాలూకు జీవితానుభవాలు అతనిలోని నేను, నాది ల సమ్మేళన స్వభావాన్ని నిర్ణయిస్తాయి, తెలియజేస్తాయి.

'నాది'కి వ్యతిరేకంగా 'నేను' స్పందిస్తుంది. 'నాది' అనేది సుసంఘటితమైన ఇతరుల అభివృత్తులు. మరో విధంగా చెప్పాలంటే 'నాది' అనేది సాధారణ ఇతరులలోని మరో రూపమే. I కి భిన్నంగా Me అనేది చైతన్యయుతమైన బాధ్యతలోని భాగం. మీడ్ మాటల్లోనే చెబితే Me అనేది సాంప్రదాయక, అలవాట్లతో కూడుకొన్న వ్యక్తి. సమాజం నియమ నిబంధనలకు లోబడే వ్యక్తులలో Me ప్రాబల్యం అధికంగా ఉంటుంది. ఈ 'నాది' ద్వారానే వ్యక్తిపై సమాజం నియంత్రణ సాగిస్తుంది. నిజానికి 'నాది' తాలూకు ప్రాభల్య రూపమే సామాజిక నియంత్రణ అని మీడ్ స్పష్టపరిచాడు.

I, Me లను మీడ్ వ్యావహారిక దృష్టితో కూడా పరిశీలించాడు. 'నాది' అనేది సామాజిక ప్రపంచంలో వ్యక్తి సుఖ ప్రదంగా బతకడానికి అవకాశం కల్పించే అంశమని మీడ్ భావించాడు. 'నేను' అనేది సామాజిక మార్పులకు తోడ్పడేదని వివరించాడు. ఏవిధమైన అడ్డంకులూ లేకుండా సమాజంలో బతకడానికి వీలు కల్పించడంతోపాటు సమాజం స్తబ్ధతకు గురికాకుండా పురోగమించడానికి ఈ 'నేను, నాది'లు తోడ్పడతాయని మీడ్ అభిప్రాయపడ్డాడు. 'నేను, నాది'లు మొత్తం సామాజిక ప్రక్రియలో భాగాలుగా ఉంటూ అటు వ్యక్తులు, ఇటు సమాజం రెండూ కూడా సమర్థంగా పనిచేయడానికి సహాయపడుతాయి.

### 17.3.7 సమాజం

మీడ్ ప్రధాన రచన అయిన 'మైండ్, సెల్ఫ్ అండ్ సొసైటీ'లో మూడో ప్రధాన అంశం సమాజం. సొసైటీకి సంబంధించి మీడ్ అభిప్రాయాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.



BRAOU

అహం, మేధస్సుకంటే ముందు ప్రక్రియగా ఉన్న సామాజిక ప్రక్రియ దృష్ట్యా మీడ్ సమాజాన్ని గురించి ప్రస్తావించాడు. ఈ వివరణ సాధారణ స్థాయిలో జరిగిందేకానీ ప్రత్యేకించి స్థూలస్థాయిలో సమాజాన్ని గురించి జరిగిన విశ్లేషణ కాదని విమర్శకుల అభిప్రాయం. మేధస్సు, అహం లను తీర్చిదిద్దడంలో ప్రముఖ పాత్ర వహించే సమాజం మీడ్ విశ్లేషణలో కీలకమైన స్థానం ఆక్రమిస్తుంది. ఇదివరకు చేసిన చర్చలో సమాజం అంటే సంఘటితమైన ప్రతిస్పందనల సమాహారమేనని మీడ్ పేర్కొన్నట్లు మీరు చదివే వున్నారు. ఈ సంఘటిత ప్రతిస్పందనలనే మీడ్ 'నాది' రూపంలో వ్యక్తులు స్వీకరిస్తారు. ఇలా చేయడం ద్వారా వ్యక్తులు సమాజ దృక్పథాలను, స్పందనలను తమ ప్రవర్తనలో ప్రధానాంశాలుగా స్వీకరిస్తారని అన్నాడు. ఇలా చేయడం వల్ల వ్యక్తికి ఆత్మ విమర్శ చేసుకోగల శక్తి లభిస్తుంది. దీని ద్వారా తనకు తాను అదుపులో ఉంచుకోగలగుతాడు.

మీడ్ తన రచనలో సమాజ క్రమవికాసాన్ని, పరిణామాన్ని గురించి కూడా చర్చించాడు. ఈ సందర్భంలో మీడ్ ఆలోచనా ధోరణిని ప్రభావితం చేసినది డార్విన్ పరిణామ సిద్ధాంతమేనని కొందరు పేర్కొంటారు. మీడ్ రచనలో, ఆలోచనా ధోరణిలో సమాజమనేది కేంద్రస్థానంలో ఉన్నా, దానిని గురించి సవివరంగా చర్చించలేదని మీడ్ ను అమితంగా అభిమానించే బాల్డ్విన్ లాంటి వారు కూడా అంగీకరించక తప్పలేదు. బాల్డ్విన్ మాటల్లోనే చెప్పాలంటే "The macro components of meads Theortical system are not as well developed as micro" అంటే సూక్ష్మ అంశాలైన మేధస్సు, అహాలను గురించి చర్చించినంత వివరంగా, లోతుగా స్థూలాంశమైన సమాజాన్ని గురించి చర్చించలేదు.

స్థూల సమాజాన్ని గురించి మీడ్ ప్రత్యేకంగా, సవివరంగా చర్చించకపోయినా సామాజిక సంస్థలను గురించి మీడ్ చెప్పిన ఎన్నో విషయాలు అతని రచనలో కనిపిస్తాయి. సామాజిక సంస్థ అంటే 'ఉమ్మడి సాముదాయక ప్రతిస్పందనే, లేదా సముదాయం తాలూకు జీవితపు అలవాటే' నని మీడ్ అంటాడు. కొన్ని నిర్దిష్ట పరిస్థితులలో వ్యక్తి ప్రవర్తనకు సముదాయం ఒకే విధంగా స్పందిస్తుంది. అటువంటి పరిస్థితులలో సముదాయంలోని అందరి సభ్యుల ప్రవర్తన కూడా ఏకరూపంగా ఉంటుంది. ఇలాంటి ఏకరూప ప్రవర్తనే (వ్యక్తి, సముదాయాల ప్రవర్తన) సామాజిక సంస్థ అని మీడ్ అంటాడు. ఇలాంటి దృక్పథాన్నే వ్యక్తులు సముదాయాలు కొనసాగిస్తుంటాయి. 'నాది' ద్వారా ఇవి మానవుల చర్యలను, ప్రవర్తనలను నియంత్రిస్తాయి.

BRAOU

విద్యాభ్యాసం ద్వారా ఉమ్మడి అలవాట్లను వ్యక్తులు అంతర్గతీకరించుకొంటారు. మీడ్ దృష్టిలో వ్యక్తులు ఉమ్మడి అలవాట్లను అంతర్గతీకరించుకోకుండా ఉన్నంతకాలం వారికి అహం అనేది ఉండదు. వారు సముదాయంలో అసలు సిసలైన సభ్యులు కాలేరు. ఇలా భావించినప్పటికీ సామాజిక సంస్థలు వ్యక్తుల వ్యక్తిత్వాన్ని లేదా సృజనా శక్తిని నాశనం చేయలేవు. అయితే అతి సంప్రదాయ వాదులు, అభివృద్ధి నిరోధక తత్వం గల వ్యక్తులు, సంస్థలు- ఉదాహరణకు చర్చి (మీడ్ ఇచ్చినదే)-లాంటివి వ్యక్తి వ్యక్తిత్వాన్ని అణిచివేయడానికి పురోగామి దృష్టితో ఆలోచనకు అవరోధం కావచ్చు. సంస్థలు స్థూలమైన మార్గదర్శక సూత్రాలను అందించాలేకానీ, వ్యక్తి వ్యక్తిత్వం నశించేట్లు, అతని సృజనాత్మక శక్తి దెబ్బతినేట్లు ఆదేశించకూడదని మీడ్ వాదిస్తాడు. ఇలా అన్నాడు కాబట్టే గిడ్డెన్స్ మీడ్‌ను ప్రశంసించాడు. 'వ్యక్తుల ప్రవర్తనను అదుపు చేయగల, అతని సృజనాత్మక శక్తిని పెంపొందించగల ఆధునిక సంస్థలను గురించి మీడ్ ప్రస్తావించడం విశేషం'.

మీరింతవరకు మీడ్ 'మైండ్, సెల్ఫ్ అండ్ సొసైటీ'కి సంబంధించి చేసిన విశ్లేషణలోని అనేక అంశాలను గురించి వివరంగా తెలుసుకున్నారు. సూక్ష్మ అంశాలైన అహం, 'నేను', 'నాది' మేధస్సు వంటి అనేక నూతన భావనలను మీడ్ ఎలా వివరించాడో కూడా చూశారు. అతని రచన శీర్షికే విశ్లేషణలో సమాజానికి, సామాజిక ప్రక్రియకు కీలకమైన స్థానం ఉన్నట్లు గుర్తించవచ్చు. కానీ, సమాజానికి సంబంధించి ఎలాంటి సిద్ధాంత ప్రతిపాదనకూ పూనుకొన్నట్లు కనిపించదు. సమాజ క్రమపరిణామాన్ని గురించి ప్రస్తావించినా సామాజిక ప్రక్రియపైనే అతని దృష్టి నిలిచిందని చెప్పవచ్చు. సంస్థలు, భావాలు, అహం, మేధస్సుల నూతన ఆవిర్భావం గురించి కూడా మీడ్ ప్రస్తావించాడు ఇవన్నీ ఆత్మ చైతన్యానికి సంబంధించినవే కానీ విశాల సమాజానికి సంబంధించినవిగా మీడ్ భావించినట్లు కనబడదు. ఇదే అతడు ఎదుర్కొన్న విమర్శగా భావించవచ్చు.

## 17.4 సారాంశం

మీడ్ తన రచనా వ్యాసంగం ప్రారంభించే నాటికి ప్రచారంలో ఉన్న ప్రవర్తనా వాదాన్ని - ముఖ్యంగా మానసిక ప్రవర్తనా వాదుల ఆలోచనలను- తిరస్కరించి నూతన సిద్ధాంత ప్రతిపాదనకు పూనుకొన్నాడు. మీడ్ తన ప్రవర్తనా వాదానికి మూలాధారాలైన మేధస్సు, అహంల గురించి ప్రత్యేకంగా చర్చించాడు.

సామాజిక చర్యల సాధనంగా లేదా యంత్రాంగంగా ఉపయోగపడే సంజ్ఞల గురించి మీడ్ సవిరంగా పేర్కొన్నాడు. సామాజిక చర్యలలో ఈ సంజ్ఞలు మౌలిక భావ ప్రసార యంత్రాంగంగా ఉపయోగపడతాయని అతడు భావించాడు. ఉద్దీపన- స్పందనలను ఈ సంజ్ఞల సంభాషణగా అంటే ఒకటి కల్పించిన ఉద్దీపనకు, రెండోది స్వయం చాలకంగా స్పందించడమే. ఇందులో ఏ విధమైన ఆలోచనా ప్రక్రియ ఉండదు.

మీడ్ సంజ్ఞలలో వాచ్యమైన సంజ్ఞల గురించి ప్రస్తావిస్తాడు. వీటి ప్రాముఖ్యాన్ని సోదాహరణగా వివరిస్తాడు. మానవులు మాత్రమే చేయగల సంజ్ఞలను ప్రముఖ ప్రతీకలని మీడ్ పేర్కొన్నాడు. ఇలాంటి ప్రముఖమైన ప్రతీకలను ఉపయోగించినప్పుడే అసలు సిసలైన భావ ప్రసారం సాధ్యమని మీడ్ విశ్లేషించాడు. ప్రముఖ ప్రతీకలలో ఒకటైన భాష మానవులలో ఆలోచించే గుణం ఏర్పడడానికి తోడ్పడింది. ప్రముఖ ప్రతీకలు ప్రతీకాత్మక పరస్పర చర్య ఏర్పడటానికి దోహదం చేస్తాయి.

మానసిక ప్రక్రియలకు సంబంధించి మీడ్ అనేక భావనలను గురించి వివరంగా ప్రస్తావించాడు. ఈ విషయంలో మీడ్ నిర్మితులు, లేదా విషయాలకంటే ప్రక్రియలకే ప్రాధాన్యత ఇచ్చాడు. అందుకే ఇతడిని ప్రక్రియ తత్వవేత్త అంటారు.

మేధస్సుకు సంబంధించి మీడ్ చేసిన విశ్లేషణలోని అంశాలలో అత్యంత కీలకమైన భావన అహం. ఆత్మజ్ఞానం, వస్తుపరజ్ఞానం తాలూకు శక్తే అహం అని మీడ్ నిర్వచించాడు. మీడ్ అభిప్రాయం ప్రకారం మేధస్సుకు అహానికి గతితార్కిక సంబంధముంటుంది. అహం ఆవిర్భావానికి సంబంధించి మీడ్ ప్రత్యేక అసక్తి కనబరిచాడు. సంజ్ఞల సంభాషణ నేపథ్యంలోనే అహం జనిస్తుందని మీడ్ అభిప్రాయం. శిశువు అభివృద్ధిలో మూడు దశలలో అహం పుడుతుందని మీడ్ ప్రతిపాదించాడు. అహం నిర్మాణంలోని మూడు దశలను పేర్కొన్నాడు.

అహంలో రెండు అంశాలు లేదా దశలుంటాయని మీడ్ పేర్కొన్నాడు. అవే 'నేను', 'నాది'. ఇతడి దృష్టిలో ఈ రెండు అంశాల ద్వారా సాగే సామాజిక ప్రక్రియ అహం. మీడ్ ప్రతిపాదించిన సైద్ధాంతిక వ్యవస్థను చైతన్యవంతం, సృజనాత్మకం చేయడంలో 'నేను' అనేది ఎంతగానో తోడ్పడుతుంది. 'నాది' అనే భావన సామాజిక నియంత్రణకు తోడ్పడుతుంది. 'మైండ్, సెల్ఫ్'ల గురించి సుదీర్ఘంగా చర్చించిన మీడ్ సమాజాన్ని గురించి అంతగా వివరించలేదు. సూక్ష్మ అంశాలకు అతడిచ్చిన ప్రాధాన్యం, స్థూలఅంశమైన సమాజానికి ఇవ్వలేదు. అయినా సమాజం, సామాజిక ప్రక్రియలు అతడి సిద్ధాంత ప్రతిపాదనల్లో కేంద్ర స్థానం ఆక్రమిస్తాయి.

BRAOU

## 17.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. మీడ్ ప్రతిపాదించిన చర్య లేదా ప్రవర్తనలోని మౌలిక దశలను తెలియజేయండి.

2. మీడ్ విశ్లేషణలో మేధస్సు భావనకున్న ప్రాముఖ్యాన్ని చర్చించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.

1. 'నేను', 'నాది' భావనల గురించి చర్చించండి.

2. సమాజాన్ని గురించి మీడ్ ఇచ్చిన విశ్లేషణ.

## 17.6 చదవదగిన పుస్తకాలు


George Ritzer : Sociological Theory, The McGraw -Hill Company, INC, New York, 1996.

Lewis, A. Coser : Masters of Sociological Thought; Ideas in Historical and Social Context, Rawat Publications, Jaipur, 1996.

J.V.Raghavendra Rao : సమాజశాస్త్ర సిద్ధాంతం, తెలుగు అకాడమి, హైదరాబాద్, 1988.


BRAOU

# భాగం-18: హెర్బర్ట్ బ్లూమర్

**విషయక్రమం**


18.0 ఉద్దేశాలు

18.1 పరిచయం

18.2 ప్రతీకాత్మక పరస్పర చర్య భావన

18.3 ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం-మీడ్ ప్రమేయాలు

18.4 హెర్బర్ట్ బ్లూమర్ ప్రతిపాదించిన ప్రతీకాత్మక చర్యావాదం, దృక్పథం, పద్ధతి

18.4.1 ప్రతీకాత్మక పరస్పర చర్యగా సమాజం

18.4.2 ప్రతీకాత్మక పరస్పర చర్య పద్ధతి

18.4.3 బ్లూమర్ ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం-విమర్శనాత్మక మూల్యాంకం

18.5 కుహన్ ప్రతిపాదించిన ప్రతీకాత్మక పరస్పర చర్య సిద్ధాంతం

18.5.1 కుహన్ సిద్ధాంత రూపకల్పన

18.6 ముగింపు

18.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

18.8 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 18.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- బ్లూమర్ ప్రతిపాదించిన ప్రతీకాత్మక పరస్పర సిద్ధాంతాన్ని వివరించగలుగుతారు.
- ప్రతీకాత్మక పరస్పర చర్యగా సమాజాన్ని అధ్యయనం చేసుకోగలుగుతారు.
- కుహన్ దృష్టిలో ప్రతీకాత్మక పరస్పర చర్యావాదాన్ని అవగాహణ చేసుకుంటారు.

## 18.1 పరిచయం

ప్రతీకాత్మక పరస్పర చర్యావాదానికి సంబంధించిన పాక్షికమైన వ్యాఖ్యలు చెదురుమదురుగా పేరొందిన సమాజశాస్త్రజ్ఞులు, తాత్విక వేత్తల రచనలలో కనిపిస్తాయి. చార్లెస్ హార్టన్ కూలే, డబ్ల్యూ.ఐ.జేమ్స్, బర్జెస్, ఫ్లోరియన్ నానెకీ, ఎల్స్‌వర్త్ ఫారిస్, జేమ్స్ మైకెల్ విలియమ్ మొదలైన ప్రఖ్యాత సమాజశాస్త్రజ్ఞులు మానవుని సమూహ జీవితనైజాన్ని వ్యాఖ్యానించారు.

ప్రతీకాత్మక పరస్పర చర్యావాదపు చరిత్రలో జేమ్స్, కూలే డ్యూయీ ముఖ్యులైనా వారి సమకాలికుడు అమెరికన్ సమాజశాస్త్రవేత్త అయిన జార్జ్ హెర్బర్ట్ మీడ్ ఈ దృక్పథానికి ఆద్యుడుగా పరిగణించడం జరుగుతోంది. బ్లూమర్ ప్రకారం మీడ్ ఈ దృక్పథానికి పునాదులు వేశాడు.

ప్రతీకాత్మక పరస్పర చర్యావాదంతో సహా పరస్పర చర్య సిద్ధాంతం, బ్లూమర్, కుహన్‌ల సిద్ధాంత దృక్పథాలు అన్నీ

మీడ్ ప్రతిపాదించిన ప్రమేయాలపై ఆధారపడినవే. అందుకే బ్లూమర్, కుహాన్‌ల సిద్ధాంత దృక్పథాలను పరిశీలించడానికి ముందు మీడ్ ప్రమేయాలను గురించి తెలుసుకోవడం ఎంతైనా అవసరం ●

## 18.2 ప్రతీకాత్మ పరస్పర చర్య

ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం అనేది స్పష్టమైన అమెరికన్ సమాజశాస్త్ర విభాగం. మానవ ప్రవర్తన తాలూకు ఆత్మాశ్రయ, వివరణల సామాజిక విశ్లేషణే ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం. ఈ సిద్ధాంతంలో వ్యక్తులను వస్తునిష్టమైన నిర్మితి, పరిస్థితులు నిర్ణయించే ఫలితాంశాలుగా కాక పాక్షికంగానైనా స్వాతంత్ర్యం కలవారుగా పరిగణించడం జరుగుతుంది. అంటే వ్యక్తులు నిర్మితిపై మాత్రమే ఆధారపడి ఉండరు. ఈ వాదంతో సామాజిక చర్యను ఒక సామాజిక ప్రేరణకు ప్రత్యక్ష ఉద్దీపనగా పరిగణించడం జరగదు. ఇందులో వ్యక్తి ఆత్మనిష్ఠ లేదా ఆత్మాశ్రయమైన వివరణ లేదా వ్యాఖ్య పాత్ర ప్రముఖంగా ఉంటుంది. కనుక ఒక వ్యక్తి చర్య అతనున్న సమాజ నిర్మితిపై ఆధారపడికాక అతను ప్రేరణను ఏవిధంగా నిర్వచిస్తాడో దానిపైనే ఆధారపడి ఉంటుందన్నమాట.

## 18.3 ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం-మీడ్ ప్రమేయాలు

సామాజిక భావాలకు వ్యక్త, అవ్యక్త లేదా వస్తునిష్టత లేదా వ్యక్తి నిష్టతల అవసరాన్ని మీడ్ గుర్తించి అభివృద్ధి చేశాడు. దుర్‌ఖైమ్ 'తీవ్ర వస్తునిష్టత'కు కూలే 'వ్యక్తి నిష్టత'కు మీడ్ ప్రతిపాదనలు మధ్యస్థంగా ఉంటాయి.

మానవ చైతన్య అవిర్భావానికి సామూహిక జీవితం అత్యంత ప్రధానమని మీడ్ అభిప్రాయం. తాత్విక, మనోవైజ్ఞానిక, సామాజిక భావాలకు సంబంధించిన సంప్రదాయక ఆలోచనా సరళిని మీడ్ వ్యతిరేకించాడు. మీడ్ ప్రతిపాదనలకు ఆధారాలైన అయిదు ముఖ్యమైన ప్రమేయాలను గురించి తెలుసుకుందాం. అవి: 1. అహం (Self), 2. చర్య(The act), 3. సామాజిక పరస్పర చర్య(Social Interaction), 4. వస్తువులు, విషయాలు(Objectives), 5. ఉమ్మడి చర్య లేదా సామాజిక చర్య(Social act).

BRAOU

1. అహం: మీడ్ మానవుడిని 'అహం' ఉన్న ప్రాణిగా గుర్తించాడు. మీడ్ దృష్టిలో అహం అనేది నిర్మితికాదు. అది ఒక ప్రక్రియ. ఒక బృహత్ నిర్మితి తాలూకు వస్తునిష్టమైన వాస్తవానికి సంబంధించిన ఆత్మ నిష్టమైన వివరణ లేదా అంతర్గతీకరణను అహంగా పేర్కొన్నాడు. మీడ్, అహం అనేది నిజానికి ఒక వ్యక్తి తాలూకు సాధారణీకరించిన ఇతరుల అంతర్గతీకరణే. అహంలో సముదాయపు సామాజిక అలవాట్లు భాగంగా ఉంటాయి. అహం అనేది 'నన్ను' లేదా ఉద్వేగ పూరితమైన అహం, 'నేను' లేదా సామాజికుడైన మానవుడి మధ్య జరిగే సంఘర్షణ ఫలితాంశమే. అందువల్లనే ప్రతీ వ్యక్తి అహం జైవిక 'నన్ను' సామాజిక 'నేను'ల సమ్మిశ్రమం అయి ఉంటుంది. వ్యక్తి ఇతరుల పాత్ర స్వీకరణను నేర్చుకున్నప్పుడు లేదా బాల్యక్రీడా దశ వదిలి పోటీ ఆటల దశలోకి అడుగిడిన తర్వాత అహం అభివృద్ధి చెందుతుంది. క్రీడా దశలో బాలుడు తన ప్రవర్తన పట్ల మాత్రమే అవగాహన కలిగి ఉంటాడు. కానీ పోటీ ఆటల దశలోకి అడుగిడిన అతను ఇతరుల పాత్రలను కూడా దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది. ఇదే సూత్రం నిజజీవితానికి కూడా వర్తిస్తుంది. అందుకే వ్యక్తి తన చుట్టూ ఉన్న ఇతరుల పాత్రలను గుర్తించి తన పాత్ర తాను పోషిస్తాడు. అందుకే ఇటువంటి పాత్ర స్వీకరణ వల్ల వ్యక్తి ఇతరుల దృక్పథాన్ని అర్థం చేసుకొనే అవకాశం ఉంటుంది. మీడ్ అభిప్రాయంలో 'అహం' ఉండడం వల్లనే మానవుడు సామాజిక చర్యను జరపగలుగుతాడు.

2. సామాజిక చర్య: మానవుడు క్రియాశీలమైన జీవి. అతను సూచించే వాటితో వ్యవహరిస్తాడు. చర్య అనేది తాను కల్పించుకొన్న ప్రవర్తనగానే భావిస్తాడుగానీ, తనలో అంతర్గతంగా వ్యవస్థితమైన వ్యవస్థకు ప్రతిస్పందనగా భావించడు. బ్లూమర్ అభిప్రాయంలో మానవుడు ఒక అత్మ. మీడ్ పథకమంతా ఈ భావనపైనే ఆధారపడి ఉంటుంది.

3. సామాజిక పరస్పర చర్య: మనుషులకు ఇతరుల గురించి తెలియజేయడమేకాక అతన్ని గురించిన అత్మస్పృహ కూడా ఉంటుందని మీడ్ పేర్కొన్నాడు. అంటే ఇతరులతో పరస్పర చర్య జరపడమేకాక ప్రతీకాత్మకంగా తనతో తానే

పరస్పర చర్యకు పాల్పడతాడు. ప్రతీకాత్మ పరస్పర చర్య భాష ద్వారా జరుగుతుంది. భాష అనేది అతి ప్రధానమైన ప్రతీక. భాష మాధ్యమంగానేకాక పరస్పర చర్య సంజ్ఞల ద్వారా కూడా జరుగుతూ ఉంటుంది. ప్రతీకలనేవి సిద్ధించిన వాస్తవాంశాలు కావు. అవి రూపుదాల్చడానికి జరిగే ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఇతరుల పాత్రలను తాము నిర్వహించే సందర్భంలో వాటిని వాడుకోవడం నేర్చుకొంటారు. ఉదాహరణకు ఒక ప్రదర్శకుడు తన ప్రదర్శన కౌశలాన్ని దర్శించినవారు అహా, ఓహో అన్నప్పుడు తన ప్రదర్శన ప్రేక్షకులకు సంతృప్తిని, ఆనందాన్ని కలిగించినట్లు సూచితమవుతుందని భావిస్తాడు. ప్రతీకాత్మక పరస్పర చర్యను గురించి మీడ్ చేసిన విశ్లేషణ గురించి బ్లూమర్ ఇలా అన్నాడు. "ఇతరుల చర్యలను వ్యాఖ్యానించి, నిర్వచించడం వల్ల వారితో మానవ సంబంధాలు ఏర్పరచుకొనే వీలు కలుగుతుంది"

4. వస్తువులు: మీడ్ చేసిన విశ్లేషణా పథకంలో 'వస్తువులు' అనే భావన మరో ప్రధానమైన భావన. అతని దృష్టిలో 'వస్తువులు' అంటే మానవ ఊహానిర్మితాలేకానీ, స్వతస్సిద్ధంగా, విలువ ఉన్న, అస్తిత్వమున్న వస్తువులు కాదు. మనిషి సూచించేవి, నిర్దేశించుకునేవి అన్నీ వస్తువులే.

వస్తువులకు సంబంధించిన విశ్లేషణలో అనేక ముఖ్యమైన అంశాలున్నాయి. అవి: 1. వస్తువుగా భావించే దానికి మనిషి ఇచ్చే అర్థాన్ని బట్టి దాని స్వభావ లక్షణాలు. 2. వస్తువులుగా భావించే దానిలో స్వతస్సిద్ధంగా ఏ అర్థం లేకపోవడం, అయితే దాని విషయం అతను ఏవిధమైన చర్యకు పాల్పడుతున్నాడో అనేది ముఖ్యం. 3. వస్తువులు సమాజ నిర్మితాలే. అంటే సామాజిక పరస్పర చర్య కొనసాగుతున్నప్పుడు నిర్వచనం ప్రక్రియ అనేది వాటిని కల్పిస్తుంది. రూపాంతరీకరిస్తూ ఉంటుంది. 4. వస్తువులకు వారు ఆపాదించే అర్థాన్ని అనుసరించి మనిషి ప్రవర్తిస్తూ ఉండటం. 5. వస్తువులను మానవ మేధస్సు కల్పించినందువల్ల వాటి పట్ల వ్యవహరించడం కానీ, ఎలాంటిచర్యకు పూనుకోకపోవడాన్ని వ్యక్తి నిర్ణయించుకోవడానికి అవకాశముంటుంది. అంటే వస్తువుల విషయంలో వ్యక్తులతో ఏవిధమైన నిర్బంధ స్పందన జరగాల్సిన అవసరం ఉండదు. ఈ దృష్టితో చూస్తే వస్తువు అనేది ప్రేరణకు భిన్నమైనదని గుర్తించవచ్చు.

5. సామాజిక చర్య: సామాజిక చర్య ఉమ్మడి చర్యల బృహత్ రూపం. సమాజంలోని వివిధ సభ్యుల ప్రవర్తనల సమాహారమని చెప్పవచ్చు. సామాజిక చర్య సమాజ విశిష్ట లక్షణమని మీడ్ అభిప్రాయపడ్డాడు. సామాజిక చర్యలో పాలుపంచుకొనేవారు మొదట తమ చర్యలను గుర్తించడం, ఇతరుల చర్యలను నిర్వచించి వ్యాఖ్యానించడం ద్వారా ఒక ఉమ్మడి సామాజిక చర్యను రూపొందిస్తారు. సామాజిక చర్యలను గుర్తించడం ద్వారా ఇతరుల చర్యలను వ్యాఖ్యానించడం జరుగుతుంది. ఇలాంటి ప్రక్రియ తోటివారితో కలిసిమెలిసి ప్రవర్తించడానికి మార్గదర్శకంగా నిలుస్తుంది.

ఆత్మ, చర్య, సామాజిక పరస్పర చర్య, వస్తువులు, సామాజిక చర్యలను పై విధంగా వివరించాక మానవ సమాజ స్వరూప చిత్రాన్ని సులభంగా ఊహించవచ్చు. సమాజం అంటే సామాజికులకు వివిధ రకాల పరిస్థితులు ఎదురవుతుంటాయని, సామాజికుల జీవితాలను నియంత్రిస్తూ ఉంటుందని తెలుసుకోవచ్చు. వ్యాఖ్యానం, నిర్వచనాలు ప్రక్రియ ద్వారానే సామాజిక చర్యలు ఏర్పడతాయి. మీడ్ మానవ సమాజాన్ని ఈవిధంగానే ఊహించాడు. అంటే సామాజిక చర్యలను రూపొందించడానికి సామాజికులకు విభిన్న సామాజిక ప్రక్రియలను కొనసాగిస్తూ వారికి ఎదురయ్యే పరిస్థితులను సులభంగా ఎదుర్కోగలుగుతాడు. ఈ వాదం, సమాజశాస్త్రం, మనోవైజ్ఞానిక శాస్త్రంలో చిత్రీకరించే సమాజ చిత్రానికి ఉన్న జీవులేకానీ వీరు ఇతర జీవులకు ప్రతిస్పందిస్తూ ఉంటారని అందువల్ల మానవులకు ఎదురయ్యే వివిధ పరిస్థితులకు ప్రతిస్పందిస్తూ ఉంటారని ప్రతిపాదిస్తాయి.

## 18.4 హెర్బర్ట్ బ్లూమర్ సిద్ధాంతం

ప్రతీకాత్మక చర్యావాదం అనే శబ్దాన్ని, భావనను, లేదా దృక్పథాన్ని మెట్టమొదట ఒక వ్యాసంలో 1934లో హెర్బర్ట్ బ్లూమర్ ప్రవేశపెట్టాడు. ఇతడు జి.హెచ్.మీడ్ శిష్యులలో అగ్రగణ్యుడు. మీడ్ ఆలోచనలను, అభిప్రాయాలను ఒకచోట క్రోడీకరించి వాటికి ఒక సిద్ధాంతం స్థాయిని కల్పించిన ఘనత బ్లూమర్‌కే దక్కింది. ఈ దృక్పథాన్ని ప్రవేశపెట్టి



BRAOU

దాని స్వభావాన్ని స్పష్టం చేశాడు. సమాజసిద్ధాంతంలో భావనగా, పద్ధతిగా దాని ప్రయోజనాన్ని వివరించాడు. ఇతడి తర్వాతనే ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం దృక్పథంగా బాగా ప్రచారంలోకి వచ్చింది.

ప్రతీకాత్మక పరస్పర చర్యావాద భావనను అనేకమంది రచయితలు విశదీకరించినా దీన్ని స్పష్టంగా వివరించింది బ్లూమర్ మాత్రమే. (తన రచన "Society as symbolic interaction" లో) బ్లూమర్ అభిప్రాయం ఇలా ఉంటుంది. "మనుషుల మధ్య జరిగే పరస్పర చర్యకు ఒక విశిష్టత ఉంది. ఈ విశిష్ట చర్యనే ప్రతీకాత్మక పరస్పర చర్య శబ్దం సూచిస్తుంది. మానవుల మధ్య జరిగే చర్య, ప్రతిచర్యగా సాగదు. ఒక పనిచేసేప్పుడు, ఒక చర్యకు ఉపక్రమించేప్పుడు, మనుషులు పరస్పర చర్యలను నిర్వచించి, దాని అర్థాన్ని వ్యాఖ్యానించి, తమ స్థితికి అన్వయించుకొని చర్యకు ఉపక్రమిస్తారు. మానవచర్య ప్రతీకల ద్వారా, వ్యాఖ్యానం ద్వారా, పరస్పర చర్యల అర్థవివరణ ద్వారా కొనసాగుతుంది. ప్రేరకానికి, ప్రతిస్పందనకు మధ్య ప్రతీకలు ప్రవేశించి ఒక వ్యాఖ్యానాత్మక ప్రక్రియను సృష్టిస్తాయి". మానవ చర్య ప్రతీకాత్మకమైందని, ప్రతీకల ద్వారా జరిగే పరస్పర చర్య, అర్థప్రతిపాదన, వ్యాఖ్యానాత్మక ప్రక్రియకుల్లోనై కొనసాగుతుందని బ్లూమర్ అభిప్రాయం.

### 18.4.1 ప్రతీకాత్మక చర్యగా సమాజం

సమాజ అధ్యయనం ఉమ్మడి చర్య అధ్యయనం అయి ఉండడం ముఖ్యమని బ్లూమర్ నొక్కిచెప్పాడు. వ్యక్తులమధ్య ఏర్పడే ప్రతీకాత్మక పరస్పర చర్యల ఫలితంగానే సమాజంరూపు దిద్దుకొంటుందని బ్లూమర్ అభిప్రాయం. వ్యక్తులు తమ చర్యలకు అర్థాన్ని కల్పించి, నిర్వచించడం చేస్తుంటారని, ఈ ప్రక్రియ ప్రేరణ-ప్రతిస్పందనల రూపంలో జరుగుతూ ఉంటుందని బ్లూమర్ పేర్కొంటాడు. మానవ ప్రతిచర్య ప్రతీకల మాధ్యమంగా జరుతూ ఉంటుందని, ప్రేరణ-ప్రతిస్పందనల ప్రక్రియలో వ్యాఖ్యానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా మానవ ప్రవర్తన నిర్దేశించడం జరుగుతుంది అని బ్లూమర్ ప్రతిపాదించాడు. బ్లూమర్ ప్రతిపాదించిన ప్రతీకాత్మక ప్రతిచర్యకు సంబంధించి బ్లూమర్ మౌలిక భావనలను కింది విధంగా పేర్కొనవచ్చు.

1. పరస్పర ప్రతిచర్య జరుపుకొంటున్న మానవుల సమూహమే సమాజం. ఈ కార్యకలాపాలన్నీ ఉమ్మడి చర్య యొక్క వివిధ సంక్లిష్ట రూపాలలోనూ, ఒక వ్యవస్థను ఏర్పరచడం లేదా సమాజాన్ని ఏర్పరచడం ద్వారా సంఘటిత పరచడం జరుగుతుంది.

2. పరస్పర చర్య అనేది ఇతరుల మానవ కార్యకలాపాలకు ప్రతిస్పందనగా ఏర్పడేవి. ప్రతీకాత్మకం కాని పరస్పర చర్యలు సాధారణ ప్రేరణ-ప్రతిస్పందనల రూపంలో సాగుతుంటాయి. ఉదాహరణకు గొంతులోని గురగురను దగ్గడం ద్వారా ఉపశమింపచేసుకోవడం. దీనికి భిన్నంగా ప్రతీకాత్మక పరస్పర చర్య తాలూకు వ్యాఖ్యానం ఫలితంగా జరుతూ ఉంటుంది. భాష అనేది సర్వసాధారణ ప్రతీకగా పనిచేస్తూ ఉంటుంది.

3. వస్తువులకు స్వతస్సిద్ధమైన అర్థం అనేది ఏదీ ఉండదు. అది ప్రతీకాత్మక పరస్పర చర్య ఫలితంగా ఏర్పడేటటువంటిది మాత్రమే. వస్తువు అనేది ఏదైనా కావచ్చు. అయితే ప్రతీకాత్మక పరస్పర చర్య ద్వారానే వస్తు ప్రపంచం సృష్టించడం, ధృవపరచడం, రూపాంతరీకరించడం, విసర్జించడం జరుగుతూ ఉంటుంది. ఉదాహరణకు "పశువులు" అనే పదం భారతదేశంలోను, అమెరికాలోనూ ఒక్కొక్కరకమైన భావం కలిగిస్తుంది. 'పశువులు' అంటే అమెరికాలో 'మాంసం' అనే భావం కలిగితే, అదే భారతదేశంలో అయితే 'పవిత్రతకు చిహ్నంగా' తోచవచ్చు. దీన్ని బట్టి చూస్తే భౌతిక వస్తువులకున్న అర్థాలు ఆయా సామాజిక సాంస్కృతులను బట్టి మారుతూ ఉంటాయని స్పష్టమవుతుంది.

4. మానవులను వస్తువులుగా గుర్తిస్తారు. తమను కూడా వస్తువులుగా భావిస్తారు. ఒక యువకుడు తన్ను తాను ఒక విద్యార్థిగాను, ఒక స్త్రీకి భర్తగాను, పిల్లలకు తండ్రిగానూ భావించవచ్చు. ఆత్మకు సంబంధించిన ఈ దృష్టికోణం ఇతర వస్తువుల పట్ల కలిగే భావాల మాదిరిగానే ఉంటాయనేది ప్రతీకాత్మక పరస్పర చర్యవల్ల ఏర్పడుతుంది.



5. మానవ చర్య అనేది స్త్రీ, పురుషులు కల్పించిన వ్యాఖ్యానాత్మక చర్య అని బ్లూమర్ పేర్కొంటాడు. మానవుడు

BRAOU

పరిగణలోకి తీసుకునే వస్తువులలో అతని ఆశలు, ఆకాంక్షలు, లక్ష్యాలు వాటిని సాధించడానికి ఉన్న మార్గాలు, సాధనాలు, వారి చర్యలకు సంబంధించి ఏర్పడబోయే ఇతరుల చర్యలు, ఆత్మభావన తన చర్యవల్ల కలగబోయే పర్యవసానాలు ముఖ్యమైనవిగా బ్లూమర్ తెలిపాడు.

6. ఒకరి చర్యలు సమూహంలోని ఇతర సభ్యుల చర్యలతో ముడివడి ఉంటాయి. దీన్నే 'ఉమ్మడి చర్య' అంటాడు బ్లూమర్. ఉమ్మడి చర్యను ఈ విధంగా నిర్వచించవచ్చు. "భిన్న వ్యక్తుల విభిన్న చర్యలకు సంబంధించిన సామాజిక వ్యవస్థ". ఈ ఉమ్మడి చర్యలలో చాలా మట్టుకు పునరావృతమయ్యేటటువంటివి, నిలకడైనటువంటివి. వీటినే సమాజశాస్త్రవేత్తలు 'సంస్కృతి' అని 'సామాజిక క్రమం' అని అంటారు.

## 18.4.2 ప్రతీకాత్మక పరస్పర చర్యావాద పద్ధతి

ప్రతీకాత్మక పరస్పర చర్యావాదానికి గట్టి పునాదులు వేసిన మీడ్ మానవ సమాజానికి వర్తించే ఏ సిద్ధాంతాన్ని ప్రతిపాదించలేదు. బ్లూమర్, మీడ్ ప్రతిపాదనలను తన సిద్ధాంతానికి ప్రాతిపదికలుగా తీసుకున్నా అనుభవిక ప్రపంచమే అనివార్యమైన కేంద్ర బిందువు కావాలి, దానిపైనే దృష్టి కేంద్రీకరించాలి అని భావించాడు. అంతేకాక సమకాలీన సమాజశాస్త్ర వేత్తలు పరిశోధనా పద్ధతి విధిగా గణాంక సాంకేతిక పద్ధతుల ఆధారంగానే జరగాలని చెప్పడాన్ని బ్లూమర్ తీవ్రంగా విమర్శించాడు. బ్లూమర్ దృష్టిలో విశ్లేషణ పరిశోధనా పద్ధతిలో కేవలం ఒక విధానం మాత్రమే. ముందుగా రూపొందించిన సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా తీసుకొని సమాజశాస్త్రవేత్తలు పరీక్షించడాన్ని బ్లూమర్ విమర్శిస్తూ అనుభవిక ప్రపంచాన్ని పరిశీలించడమే సరైన పద్ధతి అని నొక్కి చెప్పాడు. అనుభవం ఆధారంగా వాస్తవాల నిగ్గుతేల్చడం అంటే పరిశోధనా పద్ధతిని అనుసంధానించడం వల్ల కాదు అని బ్లూమర్ స్పష్టంగా తెలిపాడు. పరిశోధన పద్ధతిని అనుసంధానించడం అంటే

1. విపులమైన సిద్ధాంతాలను రూపొందించడం.

2. చతురమైన నమూనాలు కనుక్కోవడం.

3. భౌతిక శాస్త్రాలలోని పద్ధతులను అనుకరించడం.

4. అత్యాధునికమైన గణిత, గణాంక పథకాలను అనుసరించడం.

5. కొత్త భావనలను తెలుసుకోవడం.

6. అనువైన పరిమాణాత్మక పద్ధతులను రూపొందించడం.

7. పరిశోధనా రూపరేఖలను ఖచ్చితంగా అనుసరిండం.

అయితే అనుభవిక ప్రామాణీకరణ అనేది అనుభవిక సామాజిక ప్రపంచాన్ని పరిశీలించడం వల్లనే సాధ్యమవుతుందని బ్లూమర్ గట్టిగా నొక్కి చెప్పాడు.

అనుభవిక ప్రామాణీకరణను సామాజిక దృగ్విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించడం వల్లనే సాధ్యమవుతుంది. ఇలాంటి పరిశీలనలో రెండు అంశాలు ఇమిడి ఉంటాయి. అవి:1. అన్వేషణ, 2. పరిశీలన. అన్వేషణ అనేది సరళమైన పద్ధతి. ఈ పద్ధతి ప్రధాన లక్ష్యం పరిశోధనా క్షేత్రంలో జరుగుతున్న దాని విషయంలో అప్రమత్తంగా ఉండడం, పరిశీలనను తీవ్రతరం చేయడం. ఇలాంటి అన్వేషణలనుంచి బ్లూమర్ అన్నట్టు సులభంగా పరస్పర చర్యను చూపించే భావనలు, వెలువడుతాయి. ఈ రకమైన భావనలు వ్యక్తి పరిశోధించే విషయానికి అతి సమీపంగా తీసుకొనిపోయి అనుభవిక విషయాలను అవగాహన చేసుకోవడానికి మార్గదర్శకాలుగా ఉపకరిస్తాయి.

సెన్సిటైజింగ్ కాన్సెప్ట్ అనేవి పరిశీలనకు కూడా వీలు కల్పిస్తాయి. పరిశీలన అనేది అనుభవిక సాక్ష్యాల ఆధారంగా భావనలను సృజనాత్మకంగా పరీక్షించడానికి దోహదం చేస్తుంది. పరిశీలనను బ్లూమర్ కింది విధంగా వివరించాడు.



BRAOU

ఒక వస్తువు మనకు కనబడినప్పుడు దాన్ని తీసుకొని వివిధ కోణాలనుంచి నిశితంగా పరిశీలించడం, అది ఏదైన ఉంటుందో తర్జన భర్జనలు చేసి, కలిగిన అనుమానాల నేపథ్యంలో దాన్ని మరోమారు పరిశీలించి దాని యథార్థ రూపాన్ని, స్వభావాన్ని పరీక్షించి నిర్ధారించడం జరుగుతుంది.

పై చర్చను బట్టిచూస్తే బ్లూమర్ ప్రతిపాదించిన ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం అనుభవ ఆధారమైందని స్పష్టమవుతుంది. తీవ్ర గుణాత్మక పద్ధతి తప్పుదోవ పట్టిస్తుందే కానీ సమాజశాస్త్రం ఎదగడానికి పరిపక్వత సాధించడానికి ఎంతమాత్రం తోడ్పడదని బ్లూమర్ విశ్వసించాడు.

### 18.4.3 ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం: విమర్శనాత్మక మూల్యాంకనం

ఇంతవరకు వెలువడిన ఏ సిద్ధాంతం కూడా మనుషుల విషయంలో బ్లూమర్ సిద్ధాంతం అనుసరించిన సృజనాత్మక దృక్పథాన్ని అనుసరించలేదనే చెప్పాలి. ప్రకార్యవాదులు అలక్ష్యం చేసిన ప్రతీకాత్మక పరస్పర చర్య సిద్ధాంత సంప్రదాయాన్ని బ్లూమర్ కొనసాగించి పరిపుష్టం చేశాడు. ప్రకార్యవాదుల సిద్ధాంతం, విశ్లేషణలోస్థాయి, పాత్రలనేవి రెండింటిని సమానంగానే భావించే ధోరణి ప్రదర్శించారు. కానీ ప్రతీకాత్మక పరస్పర చర్యావాదులు ఆ రెండింటి మధ్య తారతమ్యముందని స్పష్టం చేశారు. సామాజిక స్థాయిని (తండ్రి, అధ్యక్షుడు, విద్యార్థి వంటివి) ఒక వస్తువుగా భావించాడు. దానికి అర్థాన్ని ఆపాదించడం జరుగుతుందన్నాడు బ్లూమర్. స్థాయికి సంబంధించిన ఇలాంటి వ్యాఖ్యానం ఆవ్యక్తి నిర్వహించే పాత్ర లేదా అతని ప్రవర్తనను ప్రభావితం చేస్తుంది. బ్లూమర్ దృష్టిలో పాత్ర రూపకల్పన, రూపాంతరీకరణలు మానవుల పరస్పర చర్యల ఫలితంగానే ఏర్పడతాయేకానీ, బలవత్తరమైన బాహ్య నిర్మితుల వల్ల నిర్ధారితం కావు.

సమాజాన్ని వ్యవహరిస్తున్న ప్రజలు అనే దృష్టితో చూడాలనేది బ్లూమర్ అభిప్రాయం. అంతేకానీ ప్రజలపై ప్రభావం చూపే శక్తుల నిలయంగా భావించకూడదు. సమాజమనేది ఒక చట్రం. ఇందులో మనుషులు వివిధ చర్యలు చేస్తూ ఉంటారు.

సమాజం, ప్రజల విషయంలో బ్లూమర్‌కున్న భావనలు ప్రతీకాత్మక పరస్పర చర్యా విశ్లేషణకు అనువైన పరిశీలనా పద్ధతులను రూపొందించడానికి ప్రోత్సహిస్తాయి. జీవిత చరిత్రలు, కేస్ స్టడీస్, డైరీలు, ఉత్తరాలు, అనిర్దేశితమైన ఇంటర్వ్యూలు, సహభాగితా పరిశీలన వంటి పద్ధతులే సామాజిక దత్తాంశ సేకరణకు అనువైన పద్ధతులని బ్లూమర్ విశ్వసించాడు. ఈ విధంగా భావించడాన్ని బట్టి చూస్తే బ్లూమర్ సహజత్వ దృక్పథం లక్ష్యంగా సాగే మానవతా దృష్టి, వ్యాఖ్యాన ప్రధానమైన వైఖరినే బ్లూమర్ అవలంబించాడనవచ్చు. బ్లూమర్‌కున్న ఇలాంటి అభిప్రాయాలు మానవులను ఒక విశిష్టమైన వస్తువుగా భావించి అధ్యయనం చేయాలనడం బట్టి స్పష్టమవుతాయి. ఇలాంటి అధ్యయనానికి ప్రకృతి శాస్త్రాలు మార్గదర్శకాలు కాలేవు.

బ్లూమర్ ప్రతీకాత్మక పరస్పర చర్యావిధానాన్ని కొందరు రచయితలు విమర్శించారు. వారిలో ముఖ్యంగా పేర్కొనవలసినవారు టర్నర్, స్ట్రైకర్, జెట్‌లిన్‌లు. వారి విమర్శలను ఈ కింద క్లుప్తంగా తెలుసుకుందాం.

1. వాస్తవికతకు నిర్మితీయ స్వభావం ఉంటున్నటువంటిదనే దానికే బ్లూమర్ ప్రాముఖ్యమివ్వడం వల్ల ఈ రకమైన వాదన అగమ సిద్ధాంత రూపకల్పనకు ప్రాముఖ్యమివ్వడానికి దారితీసిందని టర్నర్ విమర్శించాడు.

2. బ్లూమర్ సిద్ధాంతం 'ఆత్మ' అనే భావనపై ఆధారపడి ఉంటుంది. అయితే దీన్ని సరిగా సంతృప్తికరంగా విపులీకరించలేదని స్ట్రైకర్ విమర్శించాడు. బ్లూమర్ అనుయాయులు ఏకాంశక ఏ భేదం లేనటువంటి ఆత్మను గురించే ఎక్కువగా ప్రస్తావించారేకానీ ఆత్మ అనేది ఒక సంశ్లిష్టమైన ఏకాంశంగా భావించలేదు. ఆత్మను వివిధ భాగాలుగా విభజించడం, ఆభాగాలను ఒక క్రమంలో అమర్చడం అనేది ఆత్మ తాలూకు అనుభవిక అధ్యయనానికి ఎంతో అవసరమని విమర్శకులు భావిస్తారు. కానీ, బ్లూమర్ సిద్ధాంతం ఇలాంటి దానికి అనువుగాలేదు.

3. ఏవిధమైన నిర్మాణాలు లేని పరిస్థితుల్లో పరస్పర చర్యలు జరుపుకొంటున్న అశరీర ఆత్మల బాహుళ్యమే సమాజమన్న అభిప్రాయం బ్లూమర్ ప్రతిపాదనలవల్ల కలుగుతుంది. బ్లూమర్ అనుసరించిన దృష్టికోణం వల్ల



BRAOU

స్తరీకరణ, సమూహాల మధ్య సంఘర్షణలు లేదా ఉద్యోగి బృంద స్వామ్యం వంటి వాటిని గురించి తెలుసుకోవడం అసాధ్యం కాకపోయినా కష్టతరమైనదవుతుందనే విమర్శ ఉంది.

4. ప్రతీకాత్మక పరస్పర చర్యా విధానం అనే బ్లూమర్ ప్రతిపాదన 'సమాజమే ప్రతీకాత్మక పరస్పర చర్య' అనే భావనను కలిగిస్తుంది. కానీ ఎలాంటి వ్యవస్థలను సృష్టిస్తుంది, ఎలాంటి పరస్పర చర్యలు అవి కొనసాగేటట్లు, అవసరమైనప్పుడు మార్పు జరిగేటట్లు చేస్తాయి, ఏ పరిస్థితుల్లో చేస్తాయి అనే వివరాలు ఈ సిద్ధాంతం ఇవ్వలేదు.

మీడ్, బ్లూమర్‌లు ప్రతిపాదించిన ప్రతీకాత్మక పరస్పర చర్యావాదానికి వ్యతిరేకంగా ఏర్పడినదనేది సుస్పష్టమైన అంశం. దీనిప్రాముఖ్యం కేవలం అంతేకాదు. ఈ వాదం శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా వెలువడిన సకారాత్మక వాదానికి ప్రతిగా వెలువడిన మానవతా వాద దృక్పథంగా దీన్ని పేర్కొనవచ్చు. ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం అనుభవిక వాదంతో ముడిపడి ఉన్నా బ్లూమర్ భావనలను యథార్థంగా అనుసరించడం అంత సులభం కాదు.

## 18.5 కుహన్ ప్రతిపాదించిన ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం

కుహన్ మనుషుల 'ప్రాముఖఆత్మ'కు అధిక ప్రాధాన్యమిచ్చాడు. సామాజికీకరణ ద్వారా మనుషులు తమను గురించిన అస్థిరమైన అర్థాలు, దృక్కోణాలను ఏర్పరుచుకొంటారని కుహన్ అభిప్రాయపడ్డాడు. ఒక సామాజిక పరిస్థితులలలో ఎదురయ్యే వ్యక్తుల తాలూకు ఆచూకీల మూలంగా మనిషి తన ప్రముఖ ఆత్మ సహాయంతో పరిస్థితులను నిర్వచించుకోగలుగుతాడు. అంటే మానవ మూర్తిమత్వం కట్టుదిట్టమైన నిర్మితి, తులనాత్మకంగా స్థిరమైనది అయి ఉంటుందని కుహన్ విశ్వాసం. ఇలా ఉండడం వల్ల మానవుడి చర్యలో సాతత్యం ఉండడమేకాక భవిష్యత్‌లో ఎలా ఉంటుందో ముందుగా ఊహించే వీలు కలుగుతుంది. ఒక వ్యక్తి ప్రముఖ ఆత్మ ఏర్పడటానికి దోహదం చేసే ఈ సముదాయాల నిరీక్షణలు తెలుసుకోవడం సాధ్యం కావడం అనేదాని ఆధారంగా దాని ప్రామాణీకరణ సులభమవుతుంది. మానవ ప్రవర్తనను ముందుగానే ఊహించే వీలు కలుగుతుంది అని కుహన్, హీక్‌మన్‌లు వివరించాడు.

ఆత్మసిద్ధాంతం వ్యక్తిని పరిశీలిస్తుంది. అందువల్ల వ్యక్తి తాను నిర్వహిస్తున్న పాత్రలు, సముదాయంలో అతని స్థాయిలు, ఆవ్యక్తి చర్య ప్రణాళికలను రూపొందించుకోవడం జరుగుతుంది. ఈ చర్య ప్రణాళికకు, అతని దృక్కోణాన్ని ఉత్తమ సూచికలగాపరిగణించవచ్చు. ఈ ప్రణాళికలే స్వయం మూల్యాంకనకు ఇతరుల ప్రవర్తనకు వీలు కలిగించేవిగా భావించవవచ్చు.

ఒక సముదాయంలో వ్యక్తి పరస్పర చర్యను అదుపు చేయడంలో ప్రముఖ ఆత్మశక్తిమంతమైందని కుహన్ నొక్కి చెప్పాడు. పరస్పర చర్య చాలా మట్టుకు విడుదలయ్యేదేకానీ నిర్మితమైంది కాదు. కారణం పరస్పర చర్యకు ఉపక్రమించే వ్యక్తులు, వారి సొంత దృక్కోణాలు, వారు నిర్వహించే పాత్రలు నిర్దేశించే నిరీక్షణల ఆదేశాల మేరకే ప్రతిస్పందిస్తూ ఉంటారు. వ్యవస్థితమైన సామాజిక పరిస్థితులపైనే కుహన్ దృష్టి కేంద్రీకరించాడు. ఎందుకంటే సామాజిక పరిస్థితులు తులనాత్మకంగా నిలకడగా ఉండేవి. కావడం వల్ల. ఇవి ఒకసారి ఏర్పడితే వ్యక్తులు వీటినే అనుసరించడం జరుగుతూ ఉంటుంది. సామాజిక ప్రపంచం నియతమైంది అని కుహన్ వాదించాడు. ప్రముఖ ఆత్మకు సంబంధించిన జ్ఞానం ద్వారా ప్రజలు కల్పించే నిర్వచనాలను, పరిస్థితులను అర్థం చేసుకోవడం సాధ్యమవుతుందని కుహన్ అభిప్రాయం. అంతేకాక నిర్దిష్ట పరిస్థితుల్లో ప్రజల అనుభవాల ద్వార అంతర్గతీకరించిన ఆకాంక్షలను అర్థం చేసుకోవడం సులభమవుతుంది. పరిశోధనా విధానాలను మానవ ప్రవర్తనకున్న కారణాలను శోధించడానికి గుర్తించడానికి ఉపయోగించాల్సి ఉంటుందని కుహన్ పేర్కొన్నాడు. కుహన్‌కున్న నియత ప్రపంచ భావమే అన్ని శాస్త్రాలలో ఉపయోగించే పరిశోధనా పద్ధతి ఒకే రకంగా ఉంటుందని పేర్కొనడానికి కారణమైందనే చెప్పవచ్చు. పరిశోధనా పద్ధతి కీలకమైన బాధ్యత వివిధ భావనలకు వ్యవహార సులభమైన (ఆచరణాత్మకమైన) నిర్వచనాలు అందివ్వడమేనని కుహన్ అభిప్రాయం. ఇలాంటి నిర్వచనాల సహాయంతో సామాజిక జీవిత వాస్తవాలనే వాటితో వాటి పర్యవసానాలను పరీక్షించడానికి వీలవుతుంది. మీడ్ ప్రతిపాదించిన సంకేతాత్మక భావనల ఆధారంగా



BRAOU

వాటికి అవసరమైన పద్ధతులను రూపొందించడానికే కుహన్ ప్రయత్నించాడని చెప్పవచ్చు. ఆత్మ, సామాజిక చర్య, సామాజిక వస్తువు, ప్రామాణిక సముదాయంలకు ప్రతిరూపమైన పద్ధతులను కనుక్కోవడానికే అతడు ప్రయత్నించినట్లు కనిపిస్తుంది. ప్రముఖ ఆత్మను కొలవడానికి ప్రసిద్ధమైన Twenty Statements Test (TST) ని రూపొందించాడు. దీన్ని కొలవడం కింద ప్రశ్నలకు జవాబుద్వారా సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డాడు.

నీవు ఎలాంటి వ్యక్తివి? (What kind of person are you?) TST పరీక్షా పత్రం ఇలా ఉంటుంది. కింది ఖాళీ స్థలాలలో ఈ ప్రశ్నకు 20 వేరు వేరు సమాధానాలు త్వర త్వరగా రాయండి. "నేను ఎవరు?" ఈ ప్రశ్నకు మీరు ఇచ్చే జవాబు ఇతరులకు ఇచ్చినట్లు కాక మీకు మీరు ఇస్తున్నట్టు ఉండాలి.

పై ప్రశ్నకు ఇచ్చిన జవాబులను కోడ్ చేసి ఒక స్కేల్‌లో కొలవడం జరుగుతూ ఆత్మకు సంబంధించి ప్రజల విభిన్న అభిప్రాయాలను పూర్వ సామాజిక అనుభవాలను, ప్రవర్తనలతో జతపరచడం జరుగుతుంది. ఈ విధంగా కీలకమైన భావనలకు అనుభవిక సూచికలను కనుక్కోవడానికి కుహన్ ప్రయత్నించాడు. భావనలలోని విభిన్నతను తెలుసుకోవడానికి కొలవడానికి వీలైన భావనలతో అనుసంధానం చేయడానికి ఈ సూచికలు ఉపయోగపడతాయి. ఈ విధంగా మీడ్ నెలకొల్పిన సంప్రదాయాన్ని పరీక్షించడం జరిగింది. దీని సహాయంతో ప్రతీకాత్మక పరస్పర చర్య సిద్ధాంతాన్ని రూపొందించడానికి ఉపయోగించడం జరిగింది.

## 18.5.1 కుహన్ సిద్ధాంత రూపకల్పన

పరస్పర చర్యావాదుల వాదాన్ని కుహన్ విమర్శనాత్మకంగా పరిశీలించాడు. బ్లూమర్‌కు భిన్నంగా కుహన్ నిగమన పద్ధతి ఆధారంగా పరస్పర చర్యా సిద్ధాంతాన్ని రూపొందించాడని రాల్ఫ్ హెచ్ టర్నర్ పేర్కొన్నాడు. ఆత్మ సిద్ధాంతం సిద్ధాంత రూపకల్పనలో ఒక సోపానమని కుహన్ భావించాడు. ఆత్మకు సంబంధించి దృష్టికోణాలు ఏర్పడి సామాజిక చర్యను ఎట్లా రూపొందిస్తాయో అనే అంశానికి సంబంధించిన సాధారణ ప్రతిపాదనల సహాయంతో మానవ ప్రవర్తనను అర్థం చేసుకోవడం, ముందుగా ఊహించడం సాధ్యమవుతాయని కుహన్ భావించాడు.

సబ్ ఓరియంటేషన్స్ వల్ల ప్రతీకాత్మక పరస్పర చర్య సిద్ధాంతం అనేక విభాగాలుగా విభజితమైంది. అయినా ఒక సంఘటితమైన సిద్ధాంతం వెలువడుతుందనే కుహన్ విశ్వసించాడు. ఈ విశ్వాసం అతని పరస్పర చర్య సిద్ధాంత మూల్యాంకనలో అభివ్యక్తమవుతుంది. 'రాబోయే 25 సంవత్సరాలలో ప్రతీకాత్మక పరస్పర చర్య సిద్ధాంతం ఒక పక్కపరిశోధనా పద్ధతుల రూపకల్పనకు దారితీస్తూ మరోవైపు ప్రత్యేక ఉపసిద్ధాంతాలకు సంఘటితమై ఒక సమగ్ర సిద్ధాంతం వెలువడుతుందని" కుహన్ విశ్వాసం వ్యక్తం చేశాడు.

విడివిడిగా ఉన్న, పరీక్షించదగిన నిమ్నక్రమసిద్ధాంతాలు అన్న సుసంఘటితమైన సాధారణమైన ప్రతీకాత్మక పరస్పర చర్య సూత్రాలు రూపొందడానికి దోహదం చేస్తాయని కుహన్ నమ్మకం. దీన్ని బట్టి చూస్తే కుహన్ రూపొందించిన ఆత్మ సిద్ధాంతం సాధారణ పరస్పర చర్య సూత్రాలనుండి వ్యుత్పన్నం చేసిన సిద్ధాంతమేనని అర్థం అవుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే బ్లూమర్ మాదిరిగా కాక సిద్ధాంతం అంతిమ లక్ష్యం ఒక సమగ్ర సిద్ధాంత రూపకల్పనే అయి ఉంటుందని కుహన్ ప్రతిపాదించాడు. ఇలాంటి సుసంఘటితమైన, సమగ్రమైన సిద్ధాంతం ఆధారంగా ప్రతీకాత్మక పరస్పర చర్య తాలూకు వివిధ అంశాలను రాబట్టవచ్చుననే ప్రతిపాదన చేయడం సాధ్యమవుతుంది.

## 18.6 సారాంశం

చికాగో వాదానికి చెందిన బ్లూమర్, అయోవా వాదానికి చెందిన కుహన్‌లు అనేక విషయాలలో విభేదించారు. టర్నర్ అన్నట్లు వీరి మధ్య అభిప్రాయ భేదాలు మానవులు, పరస్పర చర్య, సామాజిక వ్యవస్థ, పద్ధతులు, సిద్ధాంతాలకు సంబంధించిన ప్రత్యేక ధోరణులు మాత్రమే. కాకపోతే వీరి విభేదాలు ప్రత్యేక ప్రతిపాదనలు, పరస్పర చర్య వాదనలకు హద్దులు తెలియజేస్తాయి. వాస్తవానికి బ్లూమర్‌నుగానీ, కుహన్‌నుగానీ, ఏసమాజ శాస్త్రవేత్త



BRAOU

సంపూర్ణంగా అనుసరించలేదనే చెప్పాలి.

సామాజిక సిద్ధాంతంలో అలక్ష్యానికి గురి అయిన అనేక అంశాలను ప్రముఖంగా ప్రస్తావించడమే వీరి వ్యూహం విశిష్టత అని చెప్పవచ్చు. ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం ఎన్నో సంకేతాత్మక భావనలను అందించింది. ఇది స్థూల సామాజిక సిద్ధాంతాలకు, అనుభవిక వాస్తవాలకు వారధిని ఏర్పరచిందనే చెప్పవచ్చు. గతంలో ప్రతిపాదించిన సామాజిక సిద్ధాంతాలలో కొరవడిన అంశాలను ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం పూరించడంలో ఎంతో సహాయకారి అయింది. అయితే ఈ విషయంలో ఈసిద్ధాంతం ఒక స్పష్టమైన, నిర్దిష్టమైన మార్గం సూచించలేదనిపిస్తుంది. స్థూల సంఘటనలనేపథ్యంలో సూక్ష్మ సామాజిక దృగ్విషయాలకు సంబంధించిన విశ్లేషణకు తోడ్పడే పరిశోధనా సాధనాలను ఈ సిద్ధాంతం అందించిందనే ఇంతవరకు నమ్ముతూ ఉన్నారు. పరస్పర చర్య ప్రక్రియకు సామాజిక నిర్మితుల ఫలితాంశాలకు ఉన్న సంబంధాల విషయంలో కొంత అస్పష్టత, కొంత గందరగోళం ఉంటూనే ఉందని టర్నర్ అభిప్రాయం. అంతేగాక పరస్పర చర్య ఎలా, ఎప్పుడు, ఎక్కడ సాగుతుందనే దానికి సంబంధించిన స్పష్టమైన, ఖచ్చితమైన ఆధారాలు చూపడంలో ఈ సిద్ధాంతం విఫలమైందని టర్నర్ పేర్కొన్నాడు. వాస్తవానికి ఈ అంశాలపైనే పరస్పర చర్య సిద్ధాంతం దృష్టి కేంద్రీకరించి ఉండాల్సిదికానీ అలా జరగలేదని టర్నర్ విమర్శించాడు.

## 18.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం అంటే ఏమిటి? జార్జ్ హెర్బర్ట్ మీడ్ ప్రమేయాలను పరీక్షించండి.

2. ప్రతీకాత్మక చర్యావాదంలో బ్లూమర్ అభిప్రాయాలను విమర్శనాత్మకంగా మూల్యాంకనం చేయండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సామాజిక చర్యగురించి తెలుపండి.

2. ప్రతీకాత్మక చర్యావాదంగా సమాజాన్ని చర్చించండి.

## 18.8 చదవదగిన పుస్తకాలు


Blumer, Herbert :"Social Implicationf of the Thought of George Herbert Mead". Americal Journal of Sociology, 1971.

Blumer, Herbert : Symbolic Intractionism: Perspective and Method, Englewood Chiffs, N Prentice Hall Inc.

Blumer, Herbert : "Society as a symbolic Interaction" and Sociological Implications of the Thought of George Herbert Mead" in Chinten Jayce Jessor Illinais, The Dryden Press.

Haralambs, M. : Sociology-Themes and Perspectives, Madras Oxford University Press.

Kuhn, Manford, A : Major Trends in Symbolic Interaction Theory in the Past Twenty-Five Years", Sociological Quartarly, 5 (Winter)


B R A O U

BRAOU

# ఖండం- VI

## ఎథ్నోమెథడాలజీ

సమాజశాస్త్ర విశ్లేషణలో వ్యక్తి ముఖ్యమా, సంస్థలు ముఖ్యమా అన్న చర్చ కొనసాగుతోంది. మనిషికి, ప్రకృతికి, సమాజానికి మధ్య ఎటువంటి సంబంధాలున్నాయి. ఆసంబంధాలను ఏయే అంశాలు ప్రభావితం చేస్తున్నాయి. మనుషులు తమ పరిసరాలకు ఎలా ప్రతిస్పందిస్తున్నారు. ఇలాంటి అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రతీ మనిషి తనచుట్టూ వున్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, అధ్యయనం చేయడానికి కొన్ని వ్యూహాలను, పద్ధతులను, ప్రణాళికలను, తయారుచేసుకుంటాడు. ఇవి జాతికి జాతికీ, సమూహానికి సమూహానికీ మారుతూవుంటాయి. ఈ వ్యూహాల దృష్టికోణంలో జాతుల దృష్టికోణంలో సమాజాన్ని అధ్యయనం చేసే జానపద పద్ధతే ఎథ్నోమెథడాలజీ. గడిచిన యాభై ఏళ్లలో అభివృద్ధి చెందిన ఈ సిద్ధాంత ప్రధాన వాదాలను ఈ ఖండంలో వివరించడం జరిగింది.

ఇందులో ఐదు భాగాలున్నాయి. అవి:

- హెరాల్డ్ గార్ఫెంకెల్
- ఎడ్మండ్ హుజర్ల్
- ఆల్‌ఫ్రెడ్ షుల్జ్
- మతం-సామాజిక పరివర్తన: మార్క్స్ వెబర్
- సంప్రదాయ సిద్ధాంతం-సామాజిక మార్పు

BRAOU

# భాగం-19: హెరాల్డ్ గార్ఫెంకెల్

విషయక్రమం


19.0 ఉద్దేశాలు

19.1 పరిచయం

19.2 ఎథ్నోమెథడాలజీ అంటే ఏమిటి?

19.3 ఎథ్నోమెథడాలజీపై ఆధారపడిన పరిశోధనలు

19.3.1 ఇండెక్సికాలిటీ

19.3.2 పరస్పర చర్య స్థితిని భంగపరచడం

19.3.3 డాక్యుమెంటరీ ఇంటర్‌ప్రిటేషన్

19.3.4 సహభాగి పరిశీలన, క్వాజీక్షేత్ర ప్రయోగాలు

19.4 ఎథ్నోమెథడాలజీ, సమాజశాస్త్ర ప్రధాన పంథా

19.5 ఎథ్నోమెథడాలజీ-విమర్శనాత్మక మూల్యాంకనం

19.6 సారాంశం

19.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

19.8 చదువవదగిన పుస్తకాలు


BRAOU

## 19.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ఎథ్నోమెథడాలజీ అంటే ఏమిటో తెలుసుకుంటారు.
- ఎథ్నోమెథడాలజీ రూపకల్పనలో గార్ఫెంకెల్ చేసిన కృషిని పరిశీలిస్తారు.
- ఎథ్నోమెథడాలజీపై ఆధారపడిన వివిధ పరిశోధనలను అధ్యయనం చేస్తారు.

## 19.1 పరిచయం

సమాజశాస్త్ర సిద్ధాంతం అధ్యయనాంశం సూక్ష్మ చర్యలకు, వ్యక్తుల మధ్య కొనసాగే పరస్పర చర్యలకు సంబంధించిందై ఉండాలా, స్థూల నిర్మితులకు సంబంధించినదై ఉండాలా అనేచర్చ కొనసాగుతూనే ఉంది. వ్యక్తుల గురించి అధ్యయనం చేసి సిద్ధాంతాలను రూపొందించాలా లేదా సమాజంలోని వివిధ సంక్లిష్ట సంస్థలను గురించి లోతుగా పరిశీలించాలా అనేది ఒక సమస్యగా పరిణమించింది. ఒక భావన ఆధారంగానే స్థూల సిద్ధాంత కర్తలు వాస్తవా[illegible] ప్రతిపాదించడానికి ప్రయత్నించారని సూక్ష్మ సిద్ధాంతకర్తలు విమర్శించారు. సామాజిక నిర్మితులనేవి వివిధ వ్యక్తుల మధ్య ఏర్పడే చర్య, పరస్పర చర్యల సూక్ష్మ ప్రక్రియ మాత్రమేనని వాళ్లు భావిస్తారు. పరస్పర చర్యలను అధ్యయనం చేయడంతోనే నిమగ్నులై ఉండటం వల్ల అలాంటి పరస్పర చర్యలను నియంత్రించే సామాజిక

నిర్మితులను పూర్తిగా విస్మరించారని స్థూల సిద్ధాంత కర్తలు వాదిస్తారు. ఎథ్నోమెథడాలజిస్టులు మాత్రం సూక్ష్మ సిద్ధాంతకర్తల దృక్పథాన్ని సమర్థిస్తూ చిన్న చిన్న సముదాయాలను అధ్యయనం చేయడం ద్వారానే సామాజిక నిర్మితులను సులభంగా అవగాహన చేసుకునే వీలు కలుగుతుందని, ముఖాముఖి పరిస్థితుల అధ్యయనం సామాజిక నిర్మితుల అవగాహనకు ఎంతో తోడ్పడుతుందని వాదిస్తారు. దైనందిన జీవితంలో ఏర్పడే ప్రత్యక్ష అంతర్‌వైయుక్తిక చర్యల ద్వారా లౌకికజ్ఞానం కలుగుతుందని, దీనికి సంబంధజంచిన సిద్ధాంత వివరణకే ఎథ్నోమెథడాలజిస్టుల ఆసక్తి పరిమితమై ఉంటుందని అర్థమవుతుంది. ఈ వివరణను బట్టి చూస్తే ఎథ్నోమెథడాలజీ దృగ్విషయవాద సమాజశాస్త్రంలో ఒక విశిష్టమైన శాఖ అని, దృగ్విషయవాదానికి సంబంధించిన అనేక ఇతర అంగాలతోపాటు దీనికి కూడా అమెరికా దేశపు అల్‌ఫ్రెడ్ షుట్జ్ రచనలే స్ఫూర్తినిచ్చాయని తెలుస్తుంది. ఎథ్నోమెథడాలజిస్టుల అనేక భావనలను హజ్లర్ దృగ్విషయ వాదం నుంచి అరువు తెచ్చుకొన్నవేనని స్పష్టమవుతుంది.

Every Day Life (EDL) (దైనందిన జీవితం) దృష్టి కోణం నుంచి చూస్తే దైనందిన జీవితం ఎన్నో సమస్యల మయంగా కనిపిస్తుంది. ఈ సమస్యల వలయంనుంచి విజయవంతంగా బయటపడటానికి మానవ ప్రకృతి, ఇతరులు ఆ ప్రకృతికి ఏవిధంగా ప్రతిస్పందిస్తారు. అనే అంశాలకు సంబంధించిన సిద్ధాంతాల ఆసరా అవసరమవుతుంది. మానవులు తమ ప్రపంచాన్ని అధ్యయనం చేయడానికి, వ్యవస్థీకరించుకోవడానికి అనుసరించే వ్యూహాలనే ఎథ్నోమెథడాలజీ అని నిర్వచించవచ్చు. సగటు వ్యక్తి తనకెదురయ్యే పరిస్థితులను పద్ధతిలోనే అధ్యయనం చేస్తాడు కాబట్టి దీన్ని ఒక జానపద పద్ధతి అనవచ్చు.

సమాజశాస్త్ర సిద్ధాంత విషయంలో ఎథ్నోమెథడాలజీ అనేది ఒక వినూత్న దృక్పథాన్ని సూచిస్తుంది. ఈ వాదనను ప్రవేశపెట్టిన ప్రముఖ సమాజశాస్త్రవేత్త గార్ఫింకెల్. ఇతడు మానవతావాద సంప్రదాయానికి చెందినవాడు. ఇతని దృష్టిలో సమాజశాస్త్ర అధ్యయనాంశం ప్రకృతిశాస్త్రాల అధ్యయనాంశానికి పూర్తి భిన్నమైనది.

ఈ రకమైన వాదం 1950లలో ప్రారంభమైనప్పటికీ 1960 దశాబం చివరకి, 1970 ప్రారంభంలోనే మన్నన లభించింది. దీన్ని ఆదరించి విశేష ప్రచారం చేసినవారు గార్ఫింకెల్, అతని శిష్యులు.తన సిద్ధాంత ప్రతిపాదనపై సంబంధిత సుప్రసిద్ధ సమాజశాస్త్రవేత్తలైన వెబర్, మాన్‌హైమ్, హజ్లర్, పార్సన్‌ల ప్రభావం పడిన మాట వాస్తవమేనని గార్ఫింకెల్ అంగీకరించాడు. అయితే వీరందరికంటే షుట్జ్ ప్రభావం అధికంగా ఉందని దీనివల్లనే గార్ఫింకెల్ ఎథ్నో మెథడాలజీ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడని స్పష్టంగా, సులభంగా తెలుసుకోవచ్చు.

BRAOU

ఎథ్నో (Ethno) అంటే ఒక సమాజంలోని సభ్యులందరికీ అందుబాటులో ఉన్న లోకజ్ఞాన సంపద(Stock of commonsence knowledge). మెథడాలజీ (Methodology) అంటే వివిధ పరిస్థితుల్లో వాటికి తాము కల్పించిన అర్థాలు అమ జ్ఞాన సంపదను ఉపయోగించి ఇతరులకు అర్థమయ్యేలా ఎలా చెబుతారో సూచించే విధానం (పద్ధతి). అయితే సంప్రదాయ పద్ధతిలో గార్ఫింకెల్ ఏరకమైన సమాజశాస్త్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడని చెప్పలేము. షుట్జ్ రచనల నుంచి స్వీకరించి రూపొందించిన తన భావాలు సమాజశాస్త్ర పరిశీలనకు సంబంధించిన ఇతర భావాలకంటే తన భావాలు ఎంతవరకు భిన్నమైనవో నిరూపించడమే అతని ప్రధాన ధ్యేయంగా కనిపిస్తుంది.

సామాజిక చర్యలు సర్వసాధారణంగా సామాజికులందరిని సమైక్యంగా, సమీకృతం చేసేటటువంటివే అయి ఉంటాయి. ఈ అంశాలను పరిశీలించి ధృవీకరించడమే ఎథ్నోమెథడాలజీ పరమోద్దేశమై ఉంటుంది. ఒక కార్యక్రమంలో వెల్లడి అయ్యే క్రమం, సమాజంలో అందరు సభ్యుల సమిష్టి ఫలితమే అయి ఉంటుందేకానీ అనేక మంది సమాజశాస్త్ర వేత్తలు భావించినట్లు ఒక క్రమబద్ధమైన యంత్రాంగం పనిచేయడం వల్ల కాదు. ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించడానికి ఉన్న సాధన సంపత్తిని కేటాయించడలో హేతువాదం ఒక శక్తిమంతమైన పద్ధతే అయినా శాస్త్రీయ పరిశోధన పద్ధతి తాలూకు శాస్త్రీయతను సూచించేదైనా, అది నిత్యజీవితంలోని నడవడిని సంపూర్ణంగా, సుస్పష్టంగా వివరించలేదనే చెప్పాలి. షుట్జ్ దృష్టిలో అనుభవమే అతి ముఖ్యమైనది కాబట్టి సామాజిక శాస్త్రాలకు సంబంధించినది సామాజిక కార్యకలాపాల దృష్ట్యానే సిద్ధాంతాలను రూపొందించాల్సి ఉంటుంది. దీన్నే గార్ఫింకెల్ ఒక నిర్దుష్ట పరిశోధనా పద్ధతిగా స్వీకరించి, సమాజంలో సాగుతున్న అన్ని మానవ కార్యకలాపాలను, సామాజిక చర్యలను వ్యవహర్తలు సాధించిన విజయాలకు ప్రతీకలుగా భావించాడు. ఇదే గార్ఫింకెల్ భావాలకు ప్రతిపాదిక, ఎథ్నో

మెథడాలజీ ఆవిర్భావానికి మూలం. ఒక్క మాటలో చెప్పాలంటే దైనందిన ప్రపంచాన్ని సృష్టించడంలో సామాజికుల కృషిని గురించే గార్ఫెంకెల్ ప్రధానంగా పరిశీలించాడు.

ప్రతి వ్యవహర్తకు సమాజమనేది ఒక బాహ్యాంశంగా ఉంటుంది. అది ఒక పూర్వనిర్ధారితమైన వాస్తవం. ప్రపంచం నిత్య జీవిత ప్రపంచంగా భావించడం జరుగుతుంది. ఈ ప్రపంచంలో ఒక నిత్యక్రమం, సుపరిచితమైన దృశ్యాలు ఉండే ప్రపంచమే నిత్యజీవిత ప్రపంచం. షుట్జ్ వాదాన్ని అంగీకరించిన గార్ఫెంకెల్ మనం అనుభవిస్తున్న ఈ సామాజిక ప్రపంచాన్ని యథాతథంగా అధ్యయనం చేయడానికి ప్రయత్నించాడు. ఈ రకమైన అధ్యయనం ప్రధానోద్దేశం నిత్యజీవితం తన లక్ష్యాన్ని ఎలా నిర్ధారించుకుంటుందో బాగా అర్థం చేసుకోవడమే.

పైన వివరించిన అంశాల దృష్ట్యా చూస్తే చర్యలు ఎలా ప్రారంభమవుతాయి? అవి ఎలా పునరుత్పత్తి అయి పునరావృతమవుతాయి? అన్న సమాజశాస్త్రంలో సర్వత్రా ఎదురయ్యే ప్రశ్నలను అధ్యయనం చేయడమేనని తెలుస్తుంది. పరస్పర చర్య క్రమబద్ధ లక్షణాలను ఎలా ప్రదర్శిస్తుంది? సమాజంలోని క్రమబద్ధత ఏర్పడటానికి దోహదం చేసే పరిస్థితులు బాహ్యమైనవి, సామాజికుల కార్యకలాపాలతో సంబంధంలేనివని ఇందులో సాంస్కృతిక, పర్యావరణ సంబంధమైన నిర్మితీయ మూర్తిమత్వం వివరించే సంప్రదాయ వాదుల వాదనలను గార్ఫెంకెల్ తోసిపుచ్చాడు. చర్య అనేది వాస్తవమైనదని గార్ఫెంకెల్ గట్టిగా వాదిస్తాడు. వ్యవహర్త ఒక చర్యకు ఉపక్రమించి పూర్తి చేశాక తరువాత ఏమిచెయ్యాల్సి ఉంటుందో అతనే నిర్ణయించాల్సి ఉంటుంది. పరిస్థితులు అనుకొన్న విధంగా ఆదర్శవంతమైనవి కాకపోయినా వాటిని ఎదుర్కోవలసి వస్తుంది. అనుకొన్న లక్ష్యాలు సాధిస్తారు. తమ చర్యల పరిపూర్తికి సామాజిక వ్యవస్థను ఉపయోగించుకొంటారు. ఇలా చేస్తున్నప్పుడు సామాజిక నిర్మితులకు సంబంధించిన జ్ఞాన సంపదను ఆధారంగా తీసుకోవడం జరుగుతుంది.ఈ అంశాల దృష్ట్యా చూస్తే వ్యవహర్తలను అనుభవసిద్ధ సమాజశాస్త్రవేత్తలుగానే భావించవచ్చు. సామాజికులకు సమాజంలోని క్రమబద్ధత స్పష్టంగా కనిపిస్తుంటుంది. క్రమబద్ధత స్పష్టంగా కనిపించకుండా ఉంటే నిత్యజీవితంలో కొనసాగించడం కష్టమయ్యేది.

BRAOU

గార్ఫెంకెల్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రణాళికకు, వైయుక్తికత, మేథస్సు ప్రవేశక్లిష్ట అనే సమస్యలకు పరిష్కారాలు సూచిస్తుంది. సామాజిక జీవితంలో అర్థం, వ్యాఖ్యానం, ఇతర వైయుక్తికతలు ఎలాంటి కీలకపాత్ర వహిస్తాయో వెబర్ గుర్తించినా వాటిని గురించి లోతుగా పరిశీలించడంలో అతను విఫలమయ్యాడు. "జీవిత ప్రపంచం"పై తన దృష్టిని కేంద్రీకరించినా (జీవిత ప్రపంచంలో వైయుక్తిక అనే సమస్యను అందరూ వారి నిత్యజీవితంలో పరిష్కరించకోవాల్సిన సమస్య అయినా), సామాజిక ప్రపంచాన్ని అంతర్ వైయుక్తిక దృగ్విషయంగా ప్రతిపాదించాడు. ఇలాంటి అంతర్వైయుక్తిక సామాజిక ప్రపంచంలో లోకజ్ఞానం సహాయంతో మన చర్యలకు ఒక అర్థాన్ని కల్పిస్తూ, ఇతరుల చర్యల అర్థాలను కూడా ఏర్పరుస్తూ వ్యవహరించడం జరుగుతూ ఉంటుందని గార్ఫెంకెల్ పేర్కొన్నాడు. మనజ్ఞానసంపదలో ఉద్దేశాలను ఆపాదించే మార్గాలు, కారణాలను కనుక్కోవడం, మానసికావస్థను అంచనావేయడం ఇతరులు చూసినట్లే మనం కూడా చూడడం, దృక్పథాలను ఆపాదించడం వంటివి కలిసే ఉంటాయి. మరోవిధంగా చెప్పాలంటే మేధస్సు, దానిలోపుట్టే భావాలు, దృగ్విషయాలు అనేవి ఎంతమాత్రం వైయుక్తికమూ, ప్రత్యేకము ఇతరులకు దురూహ్యము అయినవిగా ఉండవు. కాకపోతే సంప్రదాయ సమాజశాస్త్రవేత్తలు ఊహించిన విధంగా అవి ప్రకటితం కాకపోవచ్చు.

దైనందిన ప్రపంచంలో సామాజిక ప్రపంచాన్ని అర్థవంతమైనదిగా చేయడానికి మనమందరమూ ఉద్దేశాలను, విశ్వాసాలను, దృష్టికోణాలను ఇతరులకు ఆపాదిస్తూనే ఉంటాం. దీన్ని ఎట్లా చేయడం జరుగుతుంది, ఏ మార్గాలను అనుసరిస్తాము, మన మాటలు, చేతల ద్వారా వైయుక్తిక భయ సందేహాలను ఎలా ప్రకటిస్తాము అనే అంశాల పట్లనే గార్ఫెంకెల్ ఆసక్తి అధికంగా ఉన్నట్టు కనబడుతుంది. వైయుక్తికతే సామాజిక వ్యవహర్తల నిత్యజీవితంలోని సర్వసాధారణ సమస్య అయి ఉంటుందని గార్ఫెంకెల్ ప్రతిపాదించడం ద్వారా ఇంతవరకు ప్రయివేటు పరిశీలనకు అందని అంశాలను అవగాహన చేసుకోవడానికి మార్గం సుగమం అయిందని బెన్సన్, హ్యూగ్స్ లు పేర్కొన్నారు.

## 19.2 ఎథ్నో మెథడాలజి అంటే ఏమిటి?

అమెరికన్ సమాజశాస్త్రవేత్త 'ఎథ్నో మెథడాలజీ' అనే శాస్త్ర విధానాన్ని రూపొందించాడు. ఈ నూతనశాస్త్ర విధానాన్ని 1967లో ప్రచురించిన Studies in Ethno Methodology అనే గ్రంథంలో వివరించాడు. ఎథ్నో మెథడాలజీ అంటే జనం ఉపయోగించే పద్ధతిని అధ్యయనం చేయడమని స్థూలంగా నిర్వచించవచ్చు. సమాజంలోని సభ్యులు వారి సామాజిక ప్రపంచాన్ని నిర్మించుకోవడం, నిర్వహించడం, వారి సామాజిక ప్రపంచానికి ఒక అర్థం కల్పించడం వంటి అంశాలను పరీక్షించడానికి అనుసరించే పద్ధతులనే ఎథ్నో మెథడాలజీగా పేర్కొనవచ్చు. ఎథ్నోమెథడాలజీ అనేది ప్రవర్తనకు సంబంధించిన అమూర్త సిద్ధాంతం మాత్రమే కాదు. ప్రజలు వారి సామాజిక ప్రపంచంలో నిత్యం ఎదుర్కొనే అనుభవాలకు అర్థాన్ని కల్పించడాన్ని పరిశోధించే అనుభవిక అధ్యయనం. పరస్పర చర్య జరుగుతున్న సందర్భంలో వ్యక్తులు ఏవిధంగా వాస్తవికతను నిర్మించుకొని ఉంటారు అన్న దానికి సంబంధించిన అనుభవిక అధ్యయనమని చెప్పవచ్చు.

ఎథ్నో మెథడాలజీ అంటే ఏమిటో గార్ఫెంకెల్ ఇట్లా వివరించాడు: వాస్తవ పరిస్థితులను, అనుభవిక అధ్యయనాంశాలకు సంబంధించిన వాస్తవిక సామాజిక సహేతుకతను, దైనందిన జీవిత సామాన్య కార్యకలాపాలపై దృష్టి కేంద్రీకరించడాన్ని, వాటిని ఉన్న విధంగా తెలుసుకోవడానికి ప్రయత్నించే విధానం.

నిత్యజీవితంలో సామాన్య కార్యకలాపాల పాలనే దృగ్విషయాలను పరిశీలించడానికే గార్ఫెంకెల్ ముఖ్యంగా కృషి చేశాడు. దృగ్విషవాదుల మాదిరిగానే గార్ఫెంకెల్ కూడా అర్థాన్ని గురించి, దాన్ని అంతర్వైయుక్తికంగా ఎలా ప్రకటించడం గురించే ప్రధానంగా అధ్యయనం చేశాడు. అతను నిర్వహించిన అనేక పరిశోధనలు, ప్రధానంగా క్రింది విషయాలను బహిర్గతం చేస్తాయి. అవి: 1. నిత్యజీవితంలో వ్యవహర్తల మధ్య సాగే సర్వసామాన్యమైన సంభాషణలు, వాటిలో ఉపయోగించే పదాల అర్థాలకన్నా ఎంతో నిగూఢమైన అర్థాలను తెలుపుతాయి. 2. అలాంటి సంభాషణలు ఒక అర్థవంతమైన సంబంధాన్ని ముందుగానే ఊహిస్తాయి. 3. ఈ సంభాషణల ద్వారా ఏర్పడే పరస్పర అవగాహనలో అంతర్వైయుక్తిక వ్యాఖ్యానం ఇమిడి ఉంటుంది. 4. చివరిగా, ఈ రకమైన నిత్యజీవితంలో సాగే సంభాషణలు ఒక క్రమ పద్ధతిలో ప్రణాళికాబద్ధంగా సాగుతాయి. అందువల్లనే వీటికి హేతుబద్ధతా లక్షణం ఉంటుంది. ఇలా హేతుబద్ధమైనవి కావడం వల్లనే వ్యవహర్తలు ఇతరుల అర్థాలను సులభంగా గ్రహించగలుగుతారు.

ఒక ఉదాహరణ తీసుకొని చూద్దాం. పని ముగించుకొని అప్పుడే ఇంటికొచ్చిన భర్తను అతని భార్య 'ఈరోజు టెంపరేచర్ మామూలుగానే ఉందికదూ' అని ప్రశ్నించిందనుకొండి. ఈ మాటలు సర్వసాధారణమైనవే అయినా ఆమె భర్త వాటి పూర్తి అర్థాన్ని సులభంగా గ్రహించడు. ఎందుకంటే గడిచిన రెండు రోజులనుంచి వాళ్ల బాబుకు జ్వర తీవ్రత ఎక్కువగా ఉన్న విషయం అతనికి తెలుసుకాబట్టి. ఇంతటి అర్థాన్ని ఇంత కొద్ది మాటల్లో భర్తకు పూర్తిగా అర్థమయ్యేలా తెలుపగలుగుతుంది. ఆమాటల సందర్భం గురించి భార్య, భర్త ఇద్దరికీ తెలుసు కాబట్టి ఆమె మాటల వెనుకనున్న పూర్తి అర్థాన్ని ఎదుటి వ్యక్తి సులభంగా గ్రహించగలిగాడు. దీన్నే గార్ఫెంకెల్ అంతర్వైయుక్తిక వ్యాఖ్యానం అని పేర్కొంటాడు. నిత్యజీవితంలో ఇద్దరి మధ్య నడిచే ఇచ్చి పుచ్చుకోవడం అనేది ఒక క్రమపద్ధతిలో ఉంటుంది కాబట్టి అది హేతుబద్ధమైంది అవుతుందని గార్ఫెంకెల్ స్పష్టపరుస్తాడు.

జనం సాధారణంగా వస్తుమాటల్లోగాక సూచికా రీతిలో భావ ప్రకటన చేస్తూ ఉంటారు. అంటే ఎథ్నో మెథడాలజీ భావ ప్రసారానికి భాషను ఉపయోగిస్తూ సామాజిక పరస్పర చర్యల అర్థానికి భాషను ఉపయోగిస్తూ ఉంటారు. భాష మాధ్యమంగానే వ్యక్తులు పరస్పర భావాలను, అర్థాలను తెలియజేసుకుంటూ ఉంటారు. భాషే భావ ప్రసారానికి అతి ప్రధానమైన మాధ్యమం.

## 19.3 ఎథ్నోమెథడాలజి పరిశీలనా పద్ధతి

దైనందిన జీవితంలో ప్రజల మధ్య ఏర్పడే ముఖాముఖి పరస్పర చర్యల ద్వారా లౌకిక వాస్తవికత ఎలా ఏర్పడుతుందో పరిశీలించడం పట్లనే ఎథ్నోమెథడాలజిస్టులు అధిక ఆసక్తి కనబరుస్తారు. కొన్ని నిర్దిష్ట అర్థాలను ఎలా

BRAOU

కల్పించడం జరుగుతుందో అనుభవాల ఆధారంగా విశ్లేషించడం పట్లనే వారు ఆసక్తి కనబరుస్తారు. ఈ సందర్భంలో సూక్ష్మ పరిశీలనా పద్ధతులే అనువైనవని వీరు భావిస్తారు. అంటే ఎథ్నోమెథడాలజిస్టులు చిన్న చిన్న సముదాయాలను ముఖాముఖి పరస్పర చర్య పరిస్థితుల అధ్యయనానికే అధిక ప్రాముఖ్యమిస్తారు. వీరు లౌకిక పద్ధతులను ఉపయోగించారు. వాస్తవాన్ని నిర్ధారించడంలో ఈ పద్ధతుల పాత్రను అధ్యయనం చేస్తారు.

### 19.3.1 ఇండెక్సికాలిటి (సూచికారీతి)

ఇదివరకే చూసినట్లు వ్యవహర్తల మాటలను, వాటికి సంబంధించిన సందర్భాలను, పరిస్థితులతో ముడిపెట్టి అర్థం చేసుకోవడానికే గార్ఫింకెల్ అధిక ప్రాధాన్యతనిచ్చాడు. అంటే వ్యవహర్తలు వాడే మాటలు వాటి అర్థాన్ని మించిన వివరాలను, పరిస్థితులను వివరిస్తాయి. ఆయా సందర్భాల దృష్ట్యానే వాటి సంపూర్ణార్థం ప్రస్ఫుటమవుతుంది. ఇదివరకు తెలిపిన భార్యాభర్తల మాటలు, అవితెలియజేసే సంపూర్ణ అర్థం దీనికి మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అల్పమైన మాటలతో అనల్పమైన అర్థాలను స్ఫురింపచేయగలగడం జరుగుతుంది.

### 19.3.2 పరస్పర చర్య స్థితిని భంగపరచడం

నిత్యజీవితం యథార్థమైందనే విషయాన్ని రుజువుచేయడానికి గార్ఫింకెల్ అనేక ప్రయోగాలు చేశాడు. ఇలాంటి ప్రయోగాలలో ఒకటి ఈ బ్రీచింగ్ ప్రయోగం. పరిశోధకుడు పరస్పర చర్య స్థితిని భంగపరచడానికి అన్ని ప్రమాణాలకు విరుద్ధంగా ప్రవర్తించడం జరుగుతుంది. ఇదివరకటి భార్యాభర్తల సంవాదాన్ని తీసుకొండి. అందులో భర్త సబ్జెక్ట్, భార్య పరిశోధకురాలు. భర్త ఇంటికి వచ్చి తాను అలిసిపోయానని అంటాడు. పరిశోధిస్తున్న భార్య ఎలా అలిసిపోయారు - శారీరకంగానా, మానసికంగానా అని రకరకాల ప్రశ్నలు వేస్తుంది. ఇలాంటి ప్రశ్నలు ఆసందర్భంలో అనుచితమైనవే అవుతాయి. ఇలాంటివి పరస్పర చర్యస్థితిని భంగపరిచేటటువంటివి. భర్త తన స్థితికి సంబంధించిన వాస్తవికతను నిర్మిస్తున్నప్పుడు ఇలాంటి ప్రశ్నలు అతన్ని మరింత రెచ్చగొట్టేవిగా ఉంటాయి. ఇలా ఉద్దేశపూర్వకంగా పరస్పర చర్య స్థితిని భంగపరచడం వల్ల దైనందిన జీవితంలో ఇతరాత్రా బయల్పడని విషయాలు బయల్పడే వీలు కలుగుతుంది.

BRAOU

### 19.3.3 డాక్యుమెంటరీ పద్ధతి, ప్రత్యావర్తన భావన

డాక్యుమెంటరీ వ్యాఖ్యానం అనేది మరో పద్ధతి. ఇందులో ప్రవర్తనను బాహ్యమైన ఇతర అంశాలను నిక్షిప్తమైన తీరుకు ప్రతిబింబాలుగా వ్యాఖ్యానించడం జరుగుతుంది. ఈ డాక్యుమెంటరీ పద్ధతిని ప్రత్యావర్తనగా కూడా పరిగణించవచ్చు. ఒక విశ్వవిద్యాలయంలోని సైక్రియాట్రీ శాఖలో జరిపిన ప్రయోగాలద్వారా గార్ఫింకెల్ ఈ డాక్యుమెంటరీ తాలూకు ప్రత్యావర్తన స్వభావాన్ని నిరూపించడానికి ప్రయత్నించాడు. ఒక కొత్త తరహా సైకోథెరపీలో పాల్గొనాల్సిందిగా విద్యార్థులను ఆహ్వానించడం జరిగింది. వారిని పీడిస్తున్న సమస్యను గురించి క్లుప్తంగా వివరించమని సలహాదారును కొన్ని ప్రశ్నలు అడగడం జరుగుతుంది. కౌన్సిలర్ వేరే గదిలో కూర్చుని, ప్రశ్నలు వేసే వారికి కనబడకుండా ఉంటాడు. కౌన్సిలర్ ఇచ్చే జవాబులు 'ఔను', 'కాదు'లకే పరిమితమై ఉంటాయి. ఈ జవాబుల క్రమం ముందుగా నిర్దేశించిన విధంగానే ఉంటుంది. ఇచ్చిన జవాబులు యధేచ్ఛగా ఉన్నప్పటికీ అవి విద్యార్థికి సహాయకారిగాను, సముచితమైనవిగాను, అర్థవంతమైనవిగాను ఉంటాయి. ఇలాంటి అనుభవమే ఇతర అందరు విద్యార్థులకు కలుగుతుంది. ఈ ప్రయోగం ఆధారంగా గార్ఫింకెల్ కింది నిర్ణయాలు చేశాడు. అవి: అర్థరహితమైన జవాబులకు ఒక అర్థం కల్పించి విద్యార్థి వాటిని అర్థవంతమైనవిగా చేశాడు. ఏ క్రమంలేని జవాబులకు ఒక క్రమాన్ని ఆపాదించాడు. అంటే విద్యార్థులు డాక్యుమెంటరీ పద్ధతిని అనుసరించి జవాబులకు ఒక క్రమాన్ని కల్పించారన్నమాట. మొదటి జవాబు ద్వారా కౌన్సిలర్ ఇచ్చిన సలహాలో ఒక క్రమపద్ధతి ఉన్నట్లు విద్యార్థులు కనుక్కొన్నారు. తరువాత ప్రతీ జవాబు అర్థాన్ని మొదటి జవాబులోని క్రమపద్ధతి దృష్ట్యా వ్యాఖ్యానించడం చేశాడు. ప్రతీ జవాబు ఒక క్రమపద్ధతి ఉన్నట్టుగా నిరూపించింది. ఈ విధంగా విద్యార్థులు అనుసరించిన వ్యాఖ్యాన పద్ధతి ప్రత్యావర్తన గుణం కలదని చెప్పవచ్చు. మానవులు చేసే వ్యాఖ్యానాలలో చాలా మట్టుకు ప్రత్యావర్తన గుణం కలవే అయి ఉంటాయని గార్ఫింకెల్ భావించాడు. మానవులు ఆధారాలను, సంజ్ఞలను, మాటలను, ఇతరులనుంచే లభించే ఇతర సమాచారాన్ని వాస్తవికత రూపాన్ని ఏర్పరచగలదిగా వ్యాఖ్యానిస్తారు. పరస్పర విరుద్ధమైన సమాచారాన్ని కూడా ఉన్న విశ్వాసాన్ని, పరిజ్ఞానాన్ని దృవీకరించడానికి వ్యాఖ్యానించడం జరుగుతూ ఉంటుంది. ఈ ప్రత్యావర్తన లక్షణం, పరస్పర

చర్యలు జరుపుకొంటున్న వ్యక్తులు, వారి ఊహలను, వాటికి ఆధారమైన వాస్తవాలను కొన్ని సూచికల రూపంలో తెలియజేస్తూ ఉంటాయి.

### 19.3.4 సహభాగి పరిశీలన, క్వాజీ క్షేత్ర ప్రయోగాలు

సమాజశాస్త్ర అధ్యయనంలో ఎథ్నోమెథడాలజిస్టులు ఉపయోగించే ప్రతీ పరిశోధనా పద్ధతిని (ముఖ్యంగా సర్వేలు, ఇంటర్వ్యూలు) ప్రశ్నిస్తారు. పరిశోధకులు సర్వసాధారణంగా ఉపయోగించే సర్వే, ఇంటర్వ్యూ పద్ధతులు, పరిశీలిస్తున్న వ్యక్తులను ముందుగా నిర్ధారించిన చట్రాలలోనే అమర్చడానికి ప్రయత్నిస్తారు. అవి నిత్యజీవిత వాస్తవాలను తెలియజేస్తాయని, వారి విశ్వాసం. ఎథ్నోమెథడాలజిస్టులకు ఆమోదయోగ్యమైన రెండు పద్ధతులున్నాయి. అవి 1. సహభాగి పరిశీలన, 2. క్వాజీక్షేత్ర ప్రయోగాలు. కానీ, వీటిని సమాజశాస్త్ర పరిశోధనలో చాలా తక్కువగా వినియోగించడం జరుగుతూ ఉంటుంది. పరిశోధనాపద్ధతులు నిత్యజీవితం తాలూకు హేతుబద్ధతపై శాస్త్రీయ హేతుబద్ధతను బలవంతంగా రుద్దకూడదు. గార్ఫెంకెల్ అభిప్రాయంలో దైనందిన ప్రపంచం ఒక వ్యవస్థీకృత పద్ధతిపై ఆధారపడి పనిచేస్తుంది. ఈ పద్ధతిలో ఇండెక్సికల్ ఎక్స్‌ప్రెషన్స్ పుష్కలంగా ఉంటాయి. అయితే సమాజశాస్త్ర వేత్తలు వస్తునిష్ఠమైన రీతిలో వర్ణించడానికి ప్రయత్నిస్తుంటారు. శాస్త్రీయ హేతుబద్ధతలకు దూరమైపోతూ ఉంటారు. సమాజశాస్త్ర వేత్తలు, నిత్యజీవితంలో వ్యక్తులు "స్థితినిర్వచనం" ఉపయోగించేదాన్ని శాస్త్రీయ జ్ఞానంగా భ్రమపడకూడదు. రెండూ హేతుబద్ధమైనవే. కానీ ఆరెండూ భిన్న తరహాలకు చెందిన హేతుబద్ధతలు.

## 19.4 ఎథ్నోమెథడాలజి, సమాజశాస్త్ర ప్రధాన పంథా

సమాజశాస్త్రం పరిశీలించే అంశాలలో ఒకానొక ముఖ్యమైన అంశం సామాజిక క్రమాన్ని వివరించడం. జరిగిన అనేక పరిశోధనలలో బయటపడిన ముఖ్యమైన అంశం సామాజిక జీవితంలో ఒక క్రమ పద్ధతి ఉండటం. దీనికి సంబంధించి వివిధ ఆలోచనా ధోరణులకు చెందిన శాస్త్రతత్వవేత్తలు వివిధ తరహాలలో ఈ క్రమాన్ని గురించి వ్యాఖ్యానించారు, ఊహించారు. సమాజశాస్త్రవేత్తలు సామాజిక క్రమం అనేది ఒక వస్తునిష్ఠమైన వాస్తవంగా గుర్తించి దాని ఉనికి యథార్థమని భావిస్తారు. ఈ విధంగా భావించాక వారు దాని మూలాన్ని గురించి పరిశోధించడం, అది ఉండటానికి కారణభూతమైన అంశాలను వివరించడం చేస్తుంటారు. ఈ అంశాల దృష్టితో చూస్తే ప్రకార్యవాదులు ఒక సామాజిక వ్యవస్థ మనుగడకు ఒక సామాజిక క్రమం తప్పనిసరి అని భావిస్తారు. సామాజిక చర్యకు ఒక సువ్యవస్థితము, క్రమబద్ధమూ అయిన స్వభావం ఆ వ్యవస్థకు ఆధారమైన విలువలు, ప్రమాణాల వల్లనే సాధ్యమవుతుంది. మార్క్స్ ఆలోచనా ధోరణి మరోవిధంగా ఉంటుంది. సామాజిక క్రమం ఉనికి అనిశ్చితమైంది అయి ఉంటుంది. కానీ దాని ఉనికిని మాత్రం గుర్తించడం జరుగుతుంది. పరస్పర చర్యావాదుల దృష్టిలో పరస్పర చర్య సాగుతున్న స్థితిలో వ్యవహర్తలు అనుసరించే వ్యాఖ్యాన సహిత పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. సామాజిక క్రమం విషయంలో వివిధ సమాజశాస్త్రవేత్తలు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేసినా, సామాజిక వ్యవస్థలో ఒకరకమైన క్రమబద్ధత చోటు చేసుకునే ఉంటుందన్న వాస్తవాన్ని అందరూ అంగీకరిస్తారు.

ఎథ్నోమెథడాలజిస్టులు మాత్రం వాస్తవ లేదా, వస్తునిష్ఠమైన సామాజిక క్రమం ఉనికి గురించి ప్రస్తుతానికి పట్టించుకోకపోవడంగానీ, పూర్తిగా విసర్జించడం గానీ, చేస్తారు. సమాజంలో ఒక క్రమపద్ధతి అంటూ ఉంటుందని, ఆ సమాజ సభ్యులందరూ భావిస్తారని వీరు పేర్కొంటారు. ఈ విధమైన విశ్వాసం ఉండటం వల్లనే వారు వారి దైనందిన జీవితంలో కార్యకలాపాలన్నీ క్రమబద్ధంగానే సాగుతూ ఉంటాయని భావిస్తారు. అయితే ఈ రకమైన క్రమబద్ధత సామాజిక ప్రపంచంలో అంతర్గతంగా ఉన్న క్రమబద్ధత వల్ల మాత్రమే ఏర్పడి ఉంటున్నది కానవసరం లేదని భావిస్తారు.

సమాజంలో ఒక క్రమానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ఏవోకొన్ని సామజిక శాస్త్ర ప్రమాణాలను ఎథ్నోమెథడాలజిస్టులు అంగీకరించక విమర్శిస్తారు. సమాజశాస్త్రం మనిషిని "Cultural dope"గా పరిగణిస్తుంది. అంటే సమాజపు సంస్కృతి నిర్ధారించిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రవర్తించే వారుగా చిత్రీకరిస్తారు. అయితే ఎథ్నోమెథడాలజిస్టులు దీనికి భిన్నంగా ఊహిస్తారు. మనుషులు వివిధ రకాల పరిస్థితుల్లో, తమకు ఎదురయ్యే పరిస్థితుల



BRAOU

లక్షణాలను బట్టి వాటికి ఒక అర్థాన్ని ఆపాదించి తదనుగుణంగా ప్రవర్తిస్తుంటారు. అంటే ఎదురయ్యే స్థితులకు ఒక క్రమబద్ధతను ఆపాదిస్తూ ఉంటారన్నమాట. మనిషికి ఎదురయ్యే స్థితులను అర్థవంతమైనదిగా, ఒక క్రమాన్ని ఏర్పరచేవిగా చేయడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ఈ వివరాల దృష్ట్యా చూస్తే సమాజంలోని సభ్యులు వారికంటూ ఒక సామాజిక ప్రపంచాన్ని సృష్టించుకొంటారేకానీ, అది వారిని తీర్చిదిద్దేటటువంటిది కాదు.

సామాజికుల మధ్య నిత్య జీవితంలో జరిగే సామాజిక పరస్పర చర్యలను అధ్యయనం చేయడమనేది ఎథ్నోమెథడాలజిస్టుల దృష్టిలో ప్రధానమైన కర్తవ్యంగా భావించడం జరుగుతుంటుంది. ఈరకమైన పరస్పర చర్య కొన్ని సూచికల రూపంలో సాగుతూ ఉంటుంది. ఈ సందర్భంలో ఎథ్నోమెథడాలజిస్టులు భాషా మాధ్యమాన్ని ప్రముఖంగా చర్చిస్తారు. సూచనప్రాయంగా తెలియజేసేవి అంత ఖచ్చితం, నిష్కర్ష అయినవి అయి వుండవు. ఉదాహరణకు మీ మిత్రుడు నీవు ఒకానొక సినిమా ఎప్పుడు చూశావు అని అడిగినప్పుడు 'పోయిన నెల' అని ఆయన వద్దనుంచి సమాధానం వచ్చినప్పుడు ఖచ్చితమైన తేదీ ఏదీ సూచితం కాదుకదా! భాష ద్వారానే వ్యక్తులు తమ అభిప్రాయాలను సూచించగలరు. వారి నిత్యజీవితంలోని క్రమాన్ని ప్రకటించగలరు.

ఆచరణాత్మక చర్యల కథనం పట్ల సమాజశాస్త్రవేత్తలకు ఏ మాత్రం ఆసక్తి లేదని గార్ఫెంకెల్ పేర్కొన్నాడు. వాస్తవికత ప్రధానలక్షణాలను అర్థం చేసుకోవడానికి ఆచరణాత్మక చర్యలను అధ్యయనం చేయాలని గార్ఫెంకెల్ కోరాడు. ఉదాహరణకు, నిర్ణయ నిర్ధారణకు జూరీకి కొన్ని మార్గదర్శక సూత్రాలు సూచించడం జరుగుతుంది. కానీ జూరర్లు వారి సొంత మార్గదర్శక సూత్రాలను వారే ఏర్పరచుకొంటారు. ఈ రకమైన taken-for-granted మార్గదర్శకాలను ఉపేక్షించడం అంటే వాస్తవికత ముఖ్యలక్షణాన్ని ఉపేక్షించడమే అవుతుంది.

సమాజశాస్త్రవేత్తలు చర్యను విశ్లేషిస్తున్నప్పుడు చర్య అనేది ఒక విస్తృత సందర్భంలో జరుగుతుందని, ప్రతిచర్య చరిత్ర మూలాన్ని ఇతర సందర్భాలలో కూడా గుర్తించవచ్చని సమాజశాస్త్రవేత్తలు మరవకూడదు. పునరావృతమయ్యే అన్ని చర్యలకు ఇది వర్తిస్తుంది. అంతేకాక తన అనుభవంలో లేని వాటి విషయంలో కూడా ఇది వాస్తవమే అవుతుంది. ఉదాహరణకు విదేశాలకు వెళ్లని వ్యక్తి పూర్వానుభవంతో అంటే పుస్తకాల ద్వారా, ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా గడించిన పరిజ్ఞానంతో నిజంగా విదేశాలు సందర్శించినప్పుడు తన ప్రవర్తనను పరిస్థితులకు అనుగుణంగా మలచుకొంటాడు.

B R A O U

## 19.5 ఎథ్నోమెథడాలజి-విమర్శనాత్మ మూల్యాంకనం

ఎథ్నోమెథడాలజీకి గాఫ్‌మన్ నాటక కళకు, బ్లూమర్ ప్రతీకాత్మక పరస్పర చర్యా వాదానికి కొన్ని విషయాలలో పోలిక ఉంటుంది. ఇది ఇతర సమాజశాస్త్ర సిద్ధాంతాలకు భిన్నంగా ఉంటుంది. ఈ సాదృశ్య విభేదాలు సమాజం, వ్యక్తులకు సంబంధించి గార్ఫెంకెల్ అభిప్రాయాలు, సమాజశాస్త్ర సిద్ధాంతాల తాలూకు అతని భావనలు స్పష్టంగా కనిపిస్తాయి.

మనుషులకు సంబంధించిన గార్ఫెంకెల్ ఊహలు, కల్పనలు గాఫ్‌మన్ ఊహలు, కల్పనలను చాలా మట్టుకు పోలి ఉంటాయి. గాఫ్‌మన్ స్త్రీ,పురుషులను వారి నిత్యజీవిత పరిస్థితుల నేపథ్యంలో విశ్లేషించడం, వారి దైనందిన కార్యకలాపాల దృష్ట్యా పరిశీలిస్తాడు.

గార్ఫెంకెల్ కూడా ఇదే రకంగా స్త్రీ, పురుషులను పరిశీలించి విశ్లేషిస్తాడు. వీరిద్దరూ పరిశీలించే వ్యక్తులు ఒక లక్ష్యం కోసమే ప్రవర్తించే హేతుబద్ధ ప్రవర్తనగలగవారుగా ఉందరు. ఇలాంటి వారిని ప్రకార్యవాదులు, వినిమయ సిద్ధాంతవాదుల పరిశీలనలో కనిపిస్తారు. వ్యక్తుల ప్రవర్తన హేతుబద్ధమైందని గార్ఫెంకెల్ గుర్తించినా, ఆ హేతుబద్ధత నిత్యజీవిత విశేషాల దృష్ట్యా ఏర్పడేదే కానీ ఒక శాస్త్రీయమైన హేతుబద్ధత కాదు. శాస్త్రీయ హేతుబద్ధత పట్లనే సమాజశాస్త్రవేత్తలకు ఎక్కువ ఆసక్తి ఉంటుందని గుర్తించాలి. సంప్రదాయ సమాజశాస్త్రవేత్తలు ఎథ్నోమెథడాలజిని "Sociology of Absurd" అని వ్యక్తులు నియంత్రణకు లోబడి ప్రవర్తిస్తారా, లేదా స్వేచ్ఛా జీవులా అనే ప్రశ్నలను దాటవేస్తుందని వీరు విమర్శిస్తారు.

ఎథ్నోమెథడాలజిస్టుల దృష్టిలో 'స్వేచ్ఛ' లేదా నిశ్చయాత్మకత వస్తునిష్ఠమైన అంశాలు కావు. అది వ్యవహర్తయొక్క వ్యక్తిగత చిత్తవృత్తే అని ఎథ్నోమెథడాలజిస్టులు అంటారు. వైయుక్తికతకు ఎథ్నోమెథాడాలజిస్టులు ఇచ్చే ఇంతటి ప్రాముఖ్యం బ్లూమర్ అర్థం అధ్యయనం చేయడం లేదా సమాజశాస్త్రంలోని వ్యాఖ్యానానికి ఆపాదించినంత ప్రాముఖ్యానికి దగ్గరిపోలిక ఉన్నట్లు కనిపిస్తుంది. ఏచర్య విషయంలోనైనా వ్యవహర్తలే ప్రధానమైనవారనే ఎథ్నోమెథడాలజిస్టుల అభిప్రాయాలకు వినిమయ ప్రవర్తన వాదం, డ్రమటర్జీ, ప్రతీకాత్మక పరస్పర చర్యావాదం వ్యక్తం చేసిన అభిప్రాయాలకు సామ్యముంది. హోమన్స్, గాఫ్‌మన్, బ్లూమర్, గార్ఫెంకెల్‌లు వ్యక్తినే విశ్లేషణకు యూనిట్‌గా తీసుకున్నారేగానీ సామాజిక వ్యవస్థను ప్రమాణంగా తీసుకోలేదు.

ఎథ్నోమెథడాలజిస్టుల రచనలను అటు సాంప్రదాయక సమాజశాస్త్రవేత్తలు, ఇటు తీవ్రవాద సమాజశాస్త్రవేత్తలు తీవ్రంగా విమర్శించారు.

ఎథ్నోమెథడాలజిస్టులు ఊహించిన మానవసమాజంలోని సభ్యులకు ఒక నిర్దిష్టమైన ధ్యేయయం అనేది ఏదీ ఉండదని సమాజశాస్త్రవేత్తలు విమర్శించడం కనిపిస్తుంది. మనుషులు ఒక నిర్దిష్ట మార్గంలోనే ఎందుకు ప్రవర్తిస్తారో, అలా ప్రవర్తించాలని ఎందుకు కోరుకుంటారో ఎథ్నోమెథడాలజిస్టుల రచనలు ఏవీ స్పష్టం చేయవు. ఎథ్నోమెథడాలజిస్టులు కింది విమర్శలకు గురి అయ్యారని చెప్పవచ్చు.

ఎ) ప్రస్తుతమున్న సమాజశాస్త్రాన్ని విమర్శించడమే ఎథ్నోమెథడాలజిస్టుల రచనల ఆశయంగా కనిపిస్తుంది. సంప్రదాయ సమాజశాస్త్రవేత్తలు అనుసరించిన పరిశోధనా పద్ధతులను విమర్శించారేకానీ ఎథ్నోమెథడాలజిస్టులు వారిదంటూ ఏరకమైన నిర్దిష్ట పద్ధతిని ప్రతిపాదించలేదు.

బి) Taken for granted నిత్యజీవితం గురించి అధిక ఆసక్తి కనబరిచినా సామాజిక వాస్తవికతకు సంబంధించి ఏ నిర్దిష్ట సిద్ధాంత ప్రతిపాదన చేయలేదు.

సి) పై అంశాల దృష్ట్యా చూస్తే ఎథ్నోమెథడాలజిస్టులు సమాజశాస్త్ర వికాసానికి దోహదం చేసే ఏ నూతన ప్రతిపాదనలు, సిద్ధాంతాలు అందివ్వలేదనే చెప్పాలి. వారు చేసింది కేవలం ఒక వ్యతిరేక ప్రతిపాదనే- ఉన్న సమాజశాస్త్ర సిద్ధాంతాలలో తప్పులు వెతకడానికి ప్రయత్నించడమేకానీ నిర్మాణాత్మక ప్రతిపాదనలు ఏవీ చేయలేదనేది స్పష్టం. సంప్రదాయవాదులు ప్రతిపాదించిన సామాజిక క్రమాన్ని విమర్శించారేకానీ దానికి ప్రత్యమ్నాయ ప్రతిపాదన ఏదీ వారు తెలుపలేదు.

డి) ఎథ్నోమెథడాలజిస్టులు శక్తి, సమాజంలో వనరుల కేటాయింపు సంస్థల చారిత్రక స్వరూపాలపట్ల ఏవిధమైన ఆసక్తిని కనబరచలేదు. ఆచార్య లెవిస్‌కోసర్, అమెరికన్ సోషియాలాజికల్ అసోసియేషన్‌లో అధ్యక్షోపన్యాసమిస్తూ ఎథ్నోమెథడాలజీని Sectarian exclusiveness అని విమర్శించాడు. సామాజిక పరస్పర చర్య విషయంలో సంస్థాగత కారకాలను ఉపేక్షించడం వల్ల వారు Embarrasing trivality ని గురించి ఇచ్చిన వివరణే వారి రచనల్లో ఎక్కువగా కనిపిస్తుందని తీవ్రంగా విమర్శించాడు.

## 19.6 సారాంశం

సమాజశాస్త్ర సిద్ధాంతం అధ్యయనాంశం సూక్ష్మ చర్యలకు, వ్యక్తుల మధ్య కొనసాగే పరస్పర చర్యలకు సంబంధించినదై ఉండాలా లేక స్థూల నిర్మితులకు సంబంధించినదై ఉండాలా అనే చర్చ కొనసాగుతూనే ఉంది. స్థూల, సూక్ష్మ దృక్పథాల మధ్య వివాదం ఫలితంగా ఏర్పడిందే ఎథ్నోమెథడాలజీ. ఎథ్నోమెథడాలజిస్టులు సూక్ష్మ సిద్ధాంతకర్తల దృక్పథాన్ని సమర్థిస్తూ చిన్న చిన్న సముదాయాలను అధ్యయనం చేయడం ద్వారానే సామాజిక నిర్మితులను సులభంగా అవగాహన చేసుకునే వీలు కలుగుతుందని భావించారు.

మీరు ఇంతవరకు ఎథ్నోమెథడాలజిస్టుల వాదనను చూశారు. ఇందులో ప్రధానంగా పేర్కొనదగిన శాస్త్రవేత్త



BRAOU

గార్ఫెంకెల్ ప్రతిపాదనల గురించి వివరంగా చర్చించడం జరిగింది. ఎథ్నోమెథడాలజీలోని రకాల గురించి - అంటే ఇండెక్సికాలజీ, డాక్యుమెంటరీ పద్ధతి, సహభాగి పరిశీలన, క్వాసీక్షేత్ర ప్రయోగాలు గురించి తెలుసుకున్నారు. ఎథ్నోమెథడాలజిస్టుల రచనలు, చేసిన ప్రతిపాదనలపై వచ్చిన విమర్శలను గురించి తెలుసుకున్నారు. ఈ విమర్శల నేపథ్యంలో ఎథ్నోమెథడాలజిస్టుల సిద్ధాంత ప్రతిపాదనలను విమర్శనాత్మకంగా మూల్యాంకనం చేయవచ్చు. అసలు ఎథ్నోమెథడాలజిస్టులు నిర్మాణాత్మక ప్రత్యామ్నాయ సిద్ధాంత ప్రతిపాదనలు ఏమైనా చేశారా లేక అల్ప విషయాల పరిశీలనతోనే వారి ప్రయత్నాలు ముగిశాయా అనే విషయాలు తెలుసుకోగలిగారు.

## 19.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. మానవతా సమాజశాస్త్రాలలోని ప్రధాన ప్రమేయాలు ఏవి?

2. ఎథ్నోమెథడాలజిని దృగ్విషయవాదమనడం ఎంతవరకు సముచితం?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. ఎథ్నోమెథడాలజి అంటే ఏమిటి?

2. ఎథ్నోమెథడాలజీలోని కొన్ని పరిశీలనా పద్ధతులును పేర్కొనండి.

## 19.8 చదవదగిన పుస్తకాలు


Abraham, M.F : Modern Sociological Theory: An Introduction, Oxford University Press, Delhi, 1992.

Benson, D and J.A.Hughes : The Perspective of Ethno Methodology, Longman, London, 1983.

Garfinkel, H : Studies in Ethnomethodology, Prentice-hall, Inc., New Jersey, 1967.

Harlambos, M. : Sociology: Themes and perspectives. Oxford University Press, Delhi, 1980.

Poloma, M.M : Contemporary Sociological Theory. Mac Millan Publishing Co., Inc., New York, 1979.

Ritzer, G. : "Theory News and Community" Sociological Theory, Vol 3, No. 1 pp.88-98, 1985.

Turner, J.H : Ther Structure of Sociological Theory. Rawat Publications, New Delhi, 1987.

Zeitlin, I.M : Rethingking Sociology: Theory, Rawat Publications, New Delhi, 1996.


BRAOU

# భాగం-20: ఎడ్మండ్ హజర్ల్

విషయక్రమం


20.0 ఉద్దేశాలు

20.1 పరిచయం

20.2 దృగ్విషయవాద తత్వం, సమాజశాస్త్రం

20.3 దృగ్విషయవాదం

20.4 షట్జ్, గార్ఫింకెల్‌పై హజ్లర్ ప్రభావం

20.4.1 మౌలిక తాత్విక సందిగ్ధత

20.4.2 చేతనత్వం ధర్మాలు

20.4.3 సహజమైన అనుభవిక వాదం- గుణదోష పరీక్ష

20.4.4 సమాజశాస్త్రానికి తాత్విక ప్రత్యామ్నాయం

20.5 ఎథ్నోమెథడాలజి మూలాలు

20.6 సారాంశం

20.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

20.8 చదువదగిన పుస్తకాలు


BRAOU

## 20.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- దృగ్విషయవాదతత్వం అంటే ఏమిటో తెలుసుకుంటారు.
- దృగ్విషయవాద తత్వాన్ని ప్రతిపాదించడంలో హజర్ల్ చేసిన కృషిని గుర్తిస్తారు.
- దృగ్విషయవాద తత్వంలో ఎథ్నోమెథడాలజీ మూలాలను అధ్యయనం చేస్తారు.

## 20.1 పరిచయం

సమాజశాస్త్రంలోని దృగ్విషయ వాద సిద్ధాంతాలు యథార్థవాదం తాలూకు అనేక ప్రమేయాలను తిరస్కరిస్తాయి. సమాజశాస్త్రం, ప్రకృతి శాస్త్రాల అధ్యయనాంశాలలో మౌలికమైన వ్యత్యాసం ఉందని దృగ్విషయవాదులు వాదిస్తారు. అందువల్ల మానవుని అధ్యయనంలో ప్రకృతి శాస్త్రాలు అనుసరించే పరిశోధనా పద్ధతులు సమాజశాస్త్రాలకు అనువైనవి కావని భావిస్తారు. ప్రకృతి అధ్యయన విషయమైన పదార్థం (matter) అనేది బాహ్య ప్రేరణలకు అచేతనంగానే ప్రతిస్పందిస్తుంది. అందువల్ల పదార్థాన్ని అర్థం చేసుకోవడానికి, దాని ప్రవర్తనను వివరించడానికి బయటనుంచే దాన్ని పరిశీలిస్తే సరిపోతుంది. పదార్థానికి భిన్నంగా మనిషి చేతనుడు. అతనికి ఆలోచనలు, ఉద్వేగాలు, ఉద్దేశాలు, ఆత్మ స్పృహ అనేవి ఉంటాయి. ఇలాంటివి ఉండడం వల్ల అతని చర్యలకొక అర్థం ఉంటుంది. పరిస్థితులను అతను నిర్వచిస్తాడు. అతని చర్యలకు, ఇతరుల చర్యలకు ఒక అర్థాన్ని కల్పిస్తాడు. దీని ఫలితంగా అతడు కేవలం బాహ్య ప్రేరణలకే స్పందించడు. కేవలం ప్రవర్తించకుండా చర్యకు ఉపక్రమిస్తాడు. తాను

కల్పించిన అర్థం ద్వారా అతడు ప్రపంచానుభవాలకు భాష్యం చెబుతూ తనదంటూ ఒక సామాజిక వాస్తవాన్ని సృష్టించుకొంటాడు. అర్థాలకు, స్వతస్సిద్ధమైన అస్తిత్వం అంటూఉండదు. సమాజంలోని ఇతర వ్యవహర్తల చర్యలతో ఎలాంటి సంబంధం లేని ఒక ప్రత్యేక ప్రతిపత్తి ఏదీ ఉండదు. ఈ అర్థాలు బయటనుంచి సమాజంపై రుద్దినటువంటివి. ఒక నిర్దిష్ట మార్గంలో ప్రవర్తించాలని నియంత్రించేవి కావు. పోగా సామాజిక పరస్పర చర్య ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు వ్యవహర్తలు నిర్మించిన, పునర్నిర్మించినవే అయి ఉంటాయి.

నిష్పాక్షికము, విలువరహితము అయిన సమాజశాస్త్రాన్ని వెదకడం అంటే ఎండమావుల వెంటపడి నీళ్లు వెదకడం లాంటిదే అవుతుందని సమాజశాస్త్రవేత్తలలో చాలా మంది భావిస్తారు. సమాజశాస్త్రవేత్త తన ప్రమేయాలను, అభిమాన, దురభిమానాలను, నిబద్ధతలను అంతసులభంగా వదులుకోలేడని వీరి వాదన. గత అనుభవాల నీడలు అతను చూస్తున్న ప్రతీ విషయానికి కొత్తరంగులు పులుముతున్నాయనేది స్పష్టమవుతుంది.

ఎథ్నోమెథడాలజిని సాధారణంగా దృగ్విషయవాద దృక్పథంగా భావిస్తూ ఉంటారు. ఎథ్నోమెథడాలజిని అనుసరించేవారు ఐరోపాదేశ దృగ్విషయవాద సంప్రదాయంపై అధికంగా ఆధారపడి ఉంటారు. ముఖ్యంగా ఎడ్మండ్ హుజర్ల్, ఆల్‌ఫ్రెడ్ షుట్జ్‌ల భావనలపై ఎక్కువగా ఆధారపడి వారి ఆలోచన ధోరణిలో సాగుతూ ఉండడం గమనించవచ్చు. దృగ్విషయవాదం అంటే దృగ్విషయాలను ఒక క్రమపద్ధతిలో అధ్యయనం చేయడమేనని నిర్వచించవచ్చు. ఈ కారణంగానే అది సంప్రదాయిక తత్వ, విజ్ఞానశాస్త్రాలమయంగా ఉంటుంది. దృగ్విషయవాదాన్ని పరిమిత దృష్టితో చూస్తే దృగ్విషయాలను దృగ్విషయాలుగానే అధ్యయనం చేయడమేనని, ప్రధానంగా 20వ శతాబ్దపు జర్మన్ తత్వచింతనోద్యమం తాలూకు అధ్యయనమేనని, ఎడ్మండ్ హుజర్ల్ ఆలోచనల ఆధారంగా సాగిన ఉద్యమమేనని భావించవచ్చు.

## 20.2 దృగ్విషయవాద తత్వం-సమాజశాస్త్రం

హుజర్ల్ దృగ్విషయవాదానికి డెస్‌కార్టెస్ ఆలోచనా ధోరణి స్ఫూర్తినిచ్చిందని హుజర్ల్ గురువు ఫ్రాన్జ్‌బ్రెంటెనో ఆలోచననుంచి, విలియం జేమ్స్ చేసిన మనో విజ్ఞాన విశ్లేషణనుంచి స్ఫూర్తి పొంది తన ప్రతిపాదనలు చేసాడని తెలుస్తుంది. ముఖ్యంగా బ్రెంటెనో ప్రతిపాదించిన అభిమతవాదంపై ఎక్కువగా ఆధారపడినట్లు కనిపిస్తుంది. మొదట్లో హుజర్ల్ అభిరుచి గణితశాస్త్రానికి, తర్కశాస్త్రానికి ఉన్న దృగ్విషయప్రాతిపదిక పరిశీలనకే పరిమితమై ఉండేది. క్రమంగా అతని అభిరుచి జ్ఞానమీమాంస, అధిగామి లేదా అతీతక దృగ్విషయ పరిశీలనవైపు మళ్లింది. దీన్నే అధిభౌతిక అదర్శవాదం అని అంటారు. శాస్త్రాలకు మరీ ముఖ్యంగా మానవీయ శాస్త్రాలకు ఒక తాత్విక ప్రాతిపదిక కల్పించాలనేదే హుజర్ల్ ఆలోచనా ధోరణి పరమోద్దేశం. వివిధ విజ్ఞానశాస్త్రాలు ఉద్భవం అనడానికి ఆధారమైన ప్రధాన సూత్రాలు వెలువరించడానికే అతడు ముఖ్యంగా ప్రయత్నించాడు.

దృగ్విషయవాద పితామహుడైన హుజర్ల్ ఆలోచనాధోరణి సమకాలిక సమాజశాస్త్రాలను ఎంతో ప్రభావితం చేసిందనే అనాలి. అతని ఆలోచనలను, భావాలను కొన్నింటిని ప్రత్యేకంగా ఎంపిక చేసుకొని ఆల్‌ఫ్రెడ్ షుట్జ్ వాటికి కొత్త రూపమిచ్చి కొన్ని నూతన ప్రతిపాదనలు చేశాడు. గార్ఫెంకెల్‌పై హుజర్ల్, షుట్జ్‌ల ప్రభావం గణనీయంగానే ఉన్నట్లు చెప్పవచ్చు.

ఎడ్మండ్ హుజర్ల్ తన ప్రముఖ గ్రంథం "Ideas: Introduction to pure phenomenology"లో దృగ్విషయ వాదాన్ని ఒక తాత్విక, శాస్త్రీయ విధాన సూత్రంగా ప్రతిపాదించాడు. ప్రకృతిని ప్రశ్నించి దాని నుంచి తెలియని విషయాలకు జవాబులు తెలుసుకోవడమే ప్రకృతిశాస్త్ర పద్ధతి ప్రధానోద్దేశం. దృగ్విషయవాద పద్ధతిలో పరికల్పనలను పక్కనబెట్టి, ముందున్న భావనలను తొలగించి నిశితమైన ఆత్మపరీక్షద్వారా పరిశీలన, వర్ణన, వర్గీకరణ పద్ధతులను రూపొందించడం జరుగుతుంది. వీటిని ఉపయోగించి ప్రయోగపద్ధతికి లొంగని సహజ ప్రపంచంలోని దృగ్విషయాలను, వాటి నిర్మితులను అధ్యయనం చేస్తారు.

"Ideas: Introduction to pure phenomenology" అన్న గ్రంథాన్ని హుజర్ల్ దృగ్విషయవాద మనోవిజ్ఞానానికి,



BRAOU

దృగ్విషయతత్వ శాస్త్రానికి ఉన్న వ్యత్యాసాన్ని విశదీకరించడానికే రాశాడు. దృగ్విషయవాద మనోవిజ్ఞానశాస్త్రం రెండో రకమైన (ద్వితీయశ్రేణి) శాస్త్రం. దీనికి భిన్నంగా దృగ్విషయతత్వశాస్త్రం అనిన శాస్త్రాలకు పునాదిలాంటిది. దృగ్విషయ పద్ధతిని సమాజశాస్త్రజ్ఞుడు, మనోవిజ్ఞాశాస్త్రవేత్త వాడినప్పుడు అధ్యయన విషయం తాలూకు పూర్వసిద్ధాంతాలను, భావనలను, పక్కనబెట్టి పరిశోధన కొనసాగిస్తాడు. దృగ్విషయశాస్త్రం శుద్ధచైతన్యం (pure consciousness) ఆధారంగా తన జిజ్ఞాసను, పరిశోధనను ముందుకు సాగిస్తుంది. హుజర్ల్ అభిప్రాయంలో దృగ్విషయవాదం ఇలాంటి విధి నిర్వహిస్తుంది.

## 20.3 దృగ్విషయవాదం

దృగ్విషయవాదం తాత్విక పునాదులు 19వ శతాబ్దం రెండో భాగంలో మనకు కనిపిస్తాయి. కానీ ఈ దృక్పథం భావనిర్మాణంగా, పరిశోధనా పద్ధతిగా ఈ మధ్యనే వెలువడింది. 1950 తరువాత అమెరికాలో దృగ్విషయవాదం ప్రాచుర్యం పెరిగి అనేకమంది సమాజశాస్త్రజ్ఞులు దీనిని అధ్యయన దృక్పథంగా, పరిశోధనాపద్ధతిగా వాడడం మొదలుపెట్టారు.

దృగ్విషయవాదం హుజర్ల్ రచనలలో యధార్థవాదం, అనుభవవాదం విమర్శనాత్మ వ్యాఖ్యగా అవతరించిందనే అనిపిస్తుంది. శాస్త్రజ్ఞులు తమ పంచేంద్రియాలను వాడి ప్రపంచాన్ని పరిశోధించిన ఖచ్చితమైన విజ్ఞానాన్ని తయారు చేయడం జరుగుతందని భావించాడు. ఇలాంటి సరళ అనునభవాన్ని దృగ్విషయవాదులు తీవ్రంగా గర్హిస్తారు. కారణం ఇలాంటి అనుభవవాదంలో భాసించే జగత్తుగా, వాస్తవికతగా బోధపడుతుంది. అందుకే సమాజశాస్త్రం తాలూకు పునాదులను సమూలంగా ప్రశ్నించే దృక్పథంగా దృగ్విషయవాదం అవతరించింది. అంతేకాదు "పరిశోధకుని వైయుక్తిక చైతన్యంతో ప్రభావితం కాకుండా యధార్థ శాస్త్రీయ విజ్ఞానం సంపాదించే అవకాశాలున్నాయనే భూమికను కూడా దృగ్విషయవాదం సవాలు చేస్తుంది"అని మారిస్ నటాన్‌సన్ పేర్కొన్నాడు.

దృగ్విషయవాద దృక్పథంలో రెండు ముఖ్యమైన అంశాలున్నాయి. అవి: 1. శుద్ధ చైతన్యం, 2. అనుప్రయుక్త చైతన్యం. శుద్ధ చైతన్యం ఆధారంగా హుజర్ల్ శుద్ధ దృగ్విషయవాదం ఏర్పడింది. అనుప్రయుక్త చైతన్యం ఆధారంగా దృగ్విషయ సమాజశాస్త్రం ఏర్పడింది.

హుజర్ల్ దృగ్విషయవాదంలో సామాజిక జీవితంలోని దైనందిన సమస్యల చర్చలేదు. అలాగే సామాజిక, ప్రవర్తనా శాస్త్రాల తాలూకు భావనల, సిద్ధాంతాల చర్చలేదు. అందుకే అనేక మంది సమాజశాస్త్రజ్ఞులు కొంతకాలం వరకు దృగ్విషయ సమాజశాస్త్రం అసంభవమని భావించారు. కానీ, అమెరికన్ భూభాగంలో ఆల్‌ఫ్రెడ్ షుట్జ్ అడుగుపెట్టడంతో సమాజశాస్త్రం వికాసదిశ పూర్తిగా మారిపోయింది.

BRAOU

## 20.4 షుట్జ్, గార్ఫెంకెల్‌లపై హుజర్ల్ ప్రభావం

హుజర్ల్ రచనల ప్రభావం షుట్జ్, గార్ఫెంకెల్‌లపై పడింది. అలా ప్రభావం చూపిన అంశాలు: 1. మౌలిక తాత్విక సందిగ్ధత(basic philosophical dilema), 2. చైతన్య ధర్మాలు(properties of consciousness), 3. ప్రాకృతిక-అనుభవిక వాదం తాలూకు గుణదోష పరీక్ష (critique of naturalistic empiricism), 4. సామాజిక శాస్త్రాలకు తాత్విక ప్రత్యమ్నాయం(philosophical alternative).

### 20.4.1 మౌలిక తాత్విక సందిగ్ధత

పరిశోధనలో ఎదురయ్యే ప్రశ్నలు: ఏది వాస్తవం? ఈ ప్రపంచంలో వాస్తవంగా ఉన్నదేది? ప్రపంచంలో ఉన్నదాన్ని తెలుసుకోవడం ఎలా? ఇలా ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానాలు వెతకడంపైనే హుజర్ల్ తన దృష్టిని కేంద్రీకరించాడు. అనుభవం ద్వారానే మానవుడు ఈ ప్రపంచం తాలూకు భావాలను బౌద్ధిక చైతన్యం ద్వారానే తెలుసుకోవడం సాధ్యమవుతుంది. ఇతరుల ఉనికి, విలువలు, ప్రమాణాలు, భౌతిక వస్తువులను అనుభవం ద్వారానే తెలుసుకోవడం,

వాటి ముద్రలు ప్రజల చైతన్య పూరక అభిగ్నతపై పడడం జరుగుతుంది. ఒక వ్యక్తికి వాస్తవికతతో ప్రత్యక్ష సంబంధం ఉండదు. ఈ సంబంధం పరోక్షంగా మానవ మేథస్సులో జరిగే ఆలోచనా ప్రక్రియ ద్వారా ఏర్పడేది మాత్రమే.

జ్ఞానానికే చైతన్య ప్రక్రియ కీలకమైనది. ప్రముఖమైనది కావడం వల్ల తాత్విక పరిశోధన ఈ ప్రక్రియ ఎలా కొనసాగుతుందో, అది మానవుల వ్యవహారాలను ఎలా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవడానికి ముందు ప్రయత్నించాలి. ఈ రకమైన చైతన్యం తాలూకు సంబంధాన్ని గురించిన ఆలోచనే దృగ్విషయ ఆలోచనా విధానానికి మూలమైంది.

హుజర్ల్ తన "జీవితం- ప్రపంచసత్తా శాస్త్రం" (Ontology of the life world) లో మనిషి నివసించే మానవ ఆవరణలో సామాజిక జీవితం పూర్వాధార భూమికల ప్రాతిపదికగా కొనసాగుతుందని చెప్పాడు. ఈ తాత్విక ప్రతిపాదనను షుట్జ్ సమాజశాస్త్రానికి వర్తింపజేసి జీవిత ప్రపంచ నిర్మితులను విశ్లేషించాడు. ఈ నిర్మితులు సామాజిక దృగ్విషయాలలో అంతర్భాగంగా ఉంటాయి. వీటి ఆధారంగా సమాజంలోని వేరే నిర్మితులను అంటే మతం, వ్యాపారం, రాజ్యనిర్మితులను అర్థం చేసుకోవచ్చని షుట్జ్ భావించాడు. షుట్జ్ దృగ్విషయ సమాజశాస్త్రంలో కొన్ని భావనలు చాలా ప్రధానమైనవి. అవి: 1. సహజదృక్పథం, 2. అంతర్వైయుక్తికత, 3. జీవిత ప్రపంచం. ఈ మూడు భావనలను మూడు మూల స్తంభాలుగా భావించవచ్చు. సహజదృక్పథాన్ని షుట్జ్ ఈవిధంగా నిర్వచించాడు. "తాను చూస్తున్నట్లుగా, నమ్మినట్లుగా, అక్కడెక్కడో ప్రపంచం ఉన్నదనే సరళ విశ్వాసమే ప్రజల సహజ దృక్పథం".

## 20.4.2 చైతన్య ధర్మాలు

"సహజదృక్పథాల ప్రపంచం" గురించి హుజర్ల్ మొదట ప్రస్తావించాడు. తరువాత ఈ మాటకు బదులు 'జీవిత ప్రపంచం' మాటను ఉపయోగించాడు. ఈ రెండు మాటలు మానవుడి ఆలోచనలన్ని యథార్థ ప్రపంచంతోనే ముడివడి ఉంటాయని, ఈ ప్రపంచం వస్తువులు, మనుషులు, స్థలాలు, భావాలు అనే వాటితో నిండి ఉంటుందని ఉంటాయని ఇదే మానవ మనుగడకు, వివిధ కార్యకలాపాలకు, అన్వేషణలకు, వృత్తి వ్యాపారాలకు పరిమితులు సూచిస్తుందని పేర్కొన్నాడు.

BRAOU

'జీవిత ప్రపంచం' లేదా 'సహజ దృక్పథాల ప్రపంచం'లు మానవుని దృష్టిలో వాస్తవాలు. హుజర్ల్ పేర్కొన్న సహజ దృక్పథం తాలూకు రెండు అంశాలు ఆధునిక మానవీయ సమాజశాస్త్రాన్ని ప్రత్యేకించి ఎథ్నోమెథడాలజిని ప్రభావితం చేశాయి. 1. జీవిత ప్రపంచం అస్తిత్వాన్ని శంకించడం జరుగదు. ఇది కేవలం పర్యాలోచన భావం మాత్రమే. అయితే ఇది ప్రజల చర్యలను ఆలోచనా తీరును నిర్మిస్తుంది. రూపుదిద్దుతుంది. 2. ప్రజలు ఒకేరకమైన ప్రపంచంలోనే జీవిస్తూ అనుభవిస్తూ ఉంటారనే ప్రమేయంపై ఆధారపడి ప్రవర్తిస్తూ ఉంటారు. ప్రజలు వారి వారి చేతనత్వమే ఈ ప్రపంచం కావడం వల్ల ఇలా జరుగుతూ ఉంటుంది. ఈ ఊహ వాస్తవమైతే ప్రత్యక్షంగా నిర్దేశించే శక్తి వారికి ఉండదనేది స్పష్టం. అయినా ఒక సర్వ సాధారణ ప్రపంచాన్ని అనుభవిస్తున్నట్టే ప్రజలు ప్రవర్తిస్తారు. ఇలాంటి ప్రతిపాదన మనుషులు వారి జీవిత ప్రపంచం నుంచి బయటపడి ఏది వాస్తవికత అనే ప్రశ్న మరోమారు వారికి ఎదురవుతుంది. ప్రజల జీవిత ప్రపంచమే వారి చైతన్యాన్ని ఏర్పరుస్తుందని వారి చర్యలను నిర్దేశిస్తుందని చెప్పినప్పుడు మానవ ప్రవర్తన, వ్యవస్థీకరణ సుసాధ్యం చేయడానికి సంబంధించిన నిష్పక్షపాతమైన విజ్ఞానశాస్త్రం అనేది ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

## 20.4.3 ప్రాకృతిక అనుభవిక వాదం-గుణదోషపరీక్ష

విజ్ఞానశాస్త్రం సమాజప్రపంచం అక్కడెక్కడో ఉందని భావిస్తుంది. అది మానవజ్ఞానేంద్రియాలకు, చేతనత్వానికి అందకుండా ఉంటుందని, శాస్త్రీయ పద్ధతిని అనుసరించడం ద్వారానే సాధ్యమవుతుందని విజ్ఞానశాస్త్రం చెబుతుంది. అయితే హుజర్ల్ ఈ వాదాన్ని సవాలు చేశాడు. చేతనత్వం ద్వారానే సహజ ప్రపంచాన్ని తెలుసుకోవడం వీలయ్యే పక్షంలో, అచేతనత్వ నిర్మాణం జీవిత ప్రపంచం వల్లే జరిగేట్లయితే బాహ్య ప్రపంచాన్ని అంచనావేయడం, వాస్తవ జగత్తును తెలుసుకోవడం ఎలా సాధ్యమవుతుందని అతడు ప్రశ్నిస్తాడు. మనుషులు వారి వ్యక్తిగత అనుభవాల ద్వారా తెలుసుకోగలిగేది వారి జీవిత ప్రపంచాన్నే అయినప్పుడు బాహ్య జగత్తును విజ్ఞాన శాస్త్రం ఎలా

అంచనా వేయగలుగుతుంది? దృగ్విషయ వాదం, ఎథ్నోమెథడాలజీలు యథార్థ వాదం తాలూకు అనేక ప్రమేయాలను తిరస్కరిస్తాయి. మానవ ప్రవర్తనకు ప్రేరణ హస్త్రతువులకు సంబంధించిన నిర్మితులను పరిగణించకపోవడం వల్ల సామాజిక శాస్త్రాలు వాటికున్న అనేక అమూల్యమైన పరిశీలనా సాధనాలను తోసిపుచ్చినట్టే అవుతుందని వాదించాడు. పదార్థం మాదిరిగా కాక మనిషికి చేతనత్వం అనేది ఒకటి ఉంటుంది. అంటే మనిషికి ఆలోచనలు, భావోద్వేగాలు, అర్థాలు, ఉద్దేశాలు, ఆత్మజ్ఞానం అనేవి ఉంటాయన్నమాట. వీటివల్లనే మనిషి చర్యలు అర్థవంతమైనవిగా ఉంటాయి. అతడు పరిస్థితులను నిర్వచిస్తాడు. అతని చర్యలకు, ఇతరుల చర్యలకు అర్థం కల్పిస్తాడు. అంటే వాటిని అర్థవంతమైనవిగా చేస్తాడు.

### 20.4.4 సమాజశాస్త్రానికి తాత్విక ప్రత్యామ్నాయం

చేతనత్వ సారాన్ని అన్వేషించాలని హజర్ల్ వాదించాడు. సామాజిక ఘటనలను అర్థం చేసుకోవడానికి, ఆ ఘటనలు ఏర్పడే మార్గాలకు సంబంధించిన మౌలిక ప్రక్రియలను అర్థం చేసుకోవడం అంటే చేతనత్వాన్ని అర్థం చేసుకోవడం అత్యంత ప్రధానం. చేతనత్వపు అసలు సిసలైన సారాంశం లేదా జీవిత ప్రపంచం అనేది ముఖ్యమైంది కాదు. చేతనత్వపు తాలూకు అమూర్త ప్రక్రియ ముఖ్యమైంది అని చెప్పవచ్చు. ఇది అతాత్విక పరిశోధనకు ప్రధాన అంశమై ఉండాలి. అంతర్ వైయుక్తిక అనుభవాలకు అతీతమైన వ్యక్తి అమూర్తీకరణ ముఖ్యమని హజర్ల్ వాదిస్తాడు. పరిశోధకులు తమ అనుభవిక సహజ దృక్పథాన్ని వదిలి చేతనత్వం తాలూకు మౌలిక ప్రక్రియను అవగాహన చేసుకోవడానికే ప్రాముఖ్యం ఇవ్వాల్సి ఉంటుందని అంటాడు. హజర్ల్ మాటల్లో చెప్పాలంటే పరిశోధకులు 'శుద్ధ మేధస్సు (pure mind)'ను తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇది చేయడానికి అతడు epoche చేయాల్సి ఉంటుంది. అంటే వేరే వ్యక్తులు ఉన్నారనే భావనలను మనం పక్కకు నెట్టేయాలన్నమాట. అలా చేసినప్పుడే మన దురభిమానాలు అడ్డుపడకుండా విషయాలను ఆవేశరహితంగా, ఆలోచనాత్మకంగా విశ్లేషించవచ్చు. గ్రీకు వేదాంతం epoche అనే శబ్దాన్ని నిర్ణయ అనిశ్చిత్వానికి సూచికగా (Indicator of suspension of judgement) వాడింది. ఈ భావాన్నే హజర్ల్ తన దృగ్విషయ వాద పద్ధతిలో ఒక బలమైన భావనగా వాడుకొన్నాడు.

హజర్ల్ ప్రభావానికి గురైన అమెరికా సమాజశాస్త్రవేత్త షుట్జ్. అమెరికన్ సమాజశాస్త్రంలో దృగ్విషయ వాదాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఇతనికే దక్కుతుంది. హజర్ల్ యొక్క తత్వశాస్త్రాన్ని ముఖ్యంగా జీవిత ప్రపంచ భావనను గ్రహించి దాన్ని చాలా వరకు సంస్కరించిన షుట్జ్ తన దృగ్విషయవాద సమాజశాస్త్రాన్ని పెంపొందించాడు. వెబర్ యొక్క వర్స్టెహెన్ (Verstehen or Interpretative understanding) వ్యాఖ్యానాత్మక అవగాహనను తన వైయుక్తిక చైతన్య విశ్లేషనకు బాగా వాడుకున్నాడు.

చేతనత్వానికి సంబంధించిన అమూర్త సిద్ధాంతాన్ని రూపొందించడంలో హజర్ల్ సఫలీకృతుడు కాలేకపోయాడు. అయితే ఆధునిక దృగ్విషయవాదనకు ప్రాతిపదికలుగా అతని భావనలు ఎంతో తోడ్పడ్డాయి. తరువాత కాలంలో అదే ఎథ్నోమెథడాలజీగా, ఇతర సిద్ధాంతాలుగా విస్తృతమై శాస్త్రవేత్తల ఆదరణకు పాత్రమైంది.

## 20.5 ఎథ్నోమెథడాలజీకి మూలాలు

గార్ఫెంకెల్ తన ఎథ్నోమెథడాలజీ సిద్ధాంతాన్ని రూపొందించడంలో దృగ్విషయ వాద సిద్ధాంతంలోని అనేక భావాలను స్వీకరించాడు. హజర్ల్ ప్రతిపాదించిన దృగ్విషయవాద సిద్ధాంతం నుంచి గార్ఫెంకెల్ తీసుకున్న భావాలను కింది విధంగా పేర్కొనవచ్చు.

1. అనుభవం ద్వారానే మానవులు ప్రపంచాన్ని గురించి తెలుసుకుంటారని హజర్ల్ వాదించాడు. అక్కడెక్కడో ఉన్న బాహ్య ప్రపంచాన్ని జ్ఞానేంద్రియాలద్వారానే మనిషి తెలుసుకొంటాడని పేర్కొన్నాడు. చేతనత్వానికి సంబంధించిన ఒక అమూర్త సిద్ధాంత రూపకల్పనే అతని ధ్యేయం. అమలచేతన్వాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు బాహ్య జగత్తును గురించి ఆలోచించకుండా దాన్ని పక్కనపెట్టి ఉంచాలనే విషయాన్ని హజర్ల్ రచనలు స్పష్టంగా తెలియజేస్తాయి. అయితే పరస్పర చర్య సాగుతున్న పరిస్థితులలో అతర్వైయుక్తిక చేతనత్వం పక్కకు నెట్టివేయాల్సింది సామాజిక

BRAOU

క్రమాన్ని అని ఎథ్నోమెథడాలజీ పేర్కొంటుంది.

2. సమ్మతించిన ప్రపంచంలోనే మానవులు వ్యవహరిస్తూ జీవితం గడపడాన్ని గురించి నొక్కి చెప్పడానికి సహజదృక్పథం, జీవిత ప్రపంచం వంటి మాటలు వాడాడు. ఈ మాటలనే షుట్జ్, గార్ఫెంకెల్‌లు తమ సిద్ధాంత వివరణలలో వాడుకున్నారు. ఎథ్నోమెథడాలజీ అనేది రెండు రకాల వాస్తవాల మధ్య విభేదాన్ని నొక్కిచెబుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. అవి: ఎ) దైనంది నవ్యవహారాలలో సాధారణ జ్ఞానంతో తెలుసుకొనే వాస్తవికత, బి) శాస్త్రీయ వాస్తవికత.

3. మానవులు తమ జీవిత ప్రపంచం నుంచి ఎట్లా బయటపడతారు, ఏది వాస్తవమో ఎలా తెలుసుకొంటారు అనే ప్రశ్నలు వేస్తాడు. మనుషుల జీవిత ప్రపంచం వారి చేతనత్వాన్ని నిర్మించగలిగితే, వారి చర్యలను నిర్దేశించగలిగితే మానవ ప్రవర్తనను, వ్యవస్థను నిష్పాక్షికమైన శాస్త్రం నిర్వచించడం ఎలా సాధ్యమవుతుందని హుజర్ల్ ప్రశ్నించాడు. ఇలాంటి ప్రశ్నలే ప్రాకృతిక శాస్త్రాలను విమర్శించేటట్లు చేశాయి అనవచ్చు. వాస్తవ ప్రపంచం అక్కడెక్కడో ఉంటుందని శాస్త్రం విశ్వసిస్తుంది. అయితే హుజర్ల్ ఇలాంటి శాస్త్ర దృష్టిని సవాలు చేశాడు. సహజ ప్రపంచాన్ని చేతనత్వం ద్వారానే తెలుసుకోవడానికి వీలయ్యే పక్షంలో, అచేతనత్వ నిర్మాణం జీవిత ప్రపంచం వల్లనే జరిగేటట్టయితే బాహ్య ప్రపంచాన్ని అంచనా వేయడం, వాస్తవ జగత్తును తెలుసుకోవడం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నిస్తాడు.

4. అక్కడెక్కడో ఉన్న ప్రపంచానికి సంబంధించిన భావనను వివరించే సందర్భంలో హుజర్ల్ epoche అన్న మాటను ఉపయోగించాడు. ఈ భావనే గార్ఫెంకెల్ కొద్దిపాటి మార్పులతో తన సిద్ధాంతంలో వాడుకొన్నాడు. సామాజిక వాస్తవికతను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే శాస్త్రవేత్తకు ఎదురయ్యే సవాలు వ్యవహర్తల చర్యలను అర్థం చేసుకోవడంలోనే ఉంటుంది. పరిశీలకుడు తన సొంత వర్గీయులు లేదా సిద్ధాంతాలనే వ్యక్తి చర్యల అర్థాన్ని తెలుసుకోవడానికి ఉపయోగిస్తే ఈ చర్యలకు బాధ్యులైన వ్యవహర్తల చర్యల అర్థాన్ని తెలుసుకోవడం ఎన్నటికీ సాధ్యం కాదు. ఇంతేకాక సామాజిక వాస్తవికత ఎలా ఏర్పడింది, తరువాత కాలంలో మానవుల ప్రవర్తన వారి అవగాహననుబట్టి ఎలా జరుగుతుందనే విషయాలను కూడా తెలుసుకోవడం సాధ్యం కాదు. దృగ్విషయానికి సంబంధించి పరిశోధకుడు తన పూర్వ భావనలను పక్కనబెట్టి నిర్దిష్ట పరిస్థితులలో వ్యక్తులు ఎలా ప్రవర్తిస్తారో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. దృగ్విషయ పంథాను అనుసరించడం ద్వారా దాని సారాంశం, మౌలిక ప్రక్రియను అవిష్కరించడం వల్ల సర్వసామాన్యమైన ఒక సంస్కృతికే పరిమితం కాని, తాత్కాలికమైన తులనాత్మక నిర్ణయాల వాస్తవాలను అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది.

BRAOU

5. జీవిత ప్రపంచం అనే భావన హుజర్ల్ ఆలోచనలతో అంతర్వైయుక్తిక ప్రపంచంగా కనిపిస్తుంది. ఇలాంటి అంతర్వైయుక్తిక అనేది షుట్జ్ రచనలలో కూడా ఎంతో ప్రాముఖ్యం పొందింది. సిద్ధాంతాల పారస్పరికత అనేది అంతర్వైయుక్తికత మౌలిక రూపాన్ని వివరిస్తుంది. ఈ భావాన్ని ఎథ్నోమెథడాలజిసుటలు స్వీకరించి విరివిగా వాడుకొన్నారు.

6. దృగ్విషయ విశ్లేషణ సహజదృక్పథం అంతర్వైయుక్తికతలను ప్రతిపాదిస్తుంది. ఇవే సమాజంలో జీవిస్తున్న మనుషులందరి ప్రముఖ లక్షణాలుగా ఉంటాయని పేర్కొంటుంది. ఇలాంటి విశ్వాసం ప్రతిపాదికయే ఎథ్నోమెథడాలజిస్టులు దైనందిన జీవిత పరిస్థితులలో అర్థం అన్న సమస్యను గురించి ఆలోచించేట్లు చేసింది. అంతేకాక దైనందిన జీవితంలో సాగే పరస్పర చర్యలకు అర్థాలు ఎలా ఆపాదించడం జరుగుతుంది, సామాజిక వాస్తవికత ఎలా సృజింపబడుతుంది అనే ప్రశ్నలే వారి చర్చల్లో ప్రముఖమైనవిగా కనిపిస్తాయి.

7. సమాజంలోని వ్యక్తుల దైనందిన జీవితంలో సాగే చర్యలను గురించే ఎథ్నోమెథడాలజీ ప్రముఖంగా చర్చిస్తుంది. ఆ వ్యవహారాలను కల్పించడంలో, నిర్వర్తించడంలో అనుసరించే పద్ధతులను గురించి ఎథ్నోమెథడాలజి విశ్లేషిస్తుంది. దైనందిన జీవితం, సాధారణ కార్యకలాపాల విషయంలో ఎథ్నోమెథడాలజిస్టులు కనబరిచే ఆసక్తి

దృగ్విషయవాదవిషయంలో కనిపించే ఆసక్తిని పోలి ఉంటుందని స్పష్టం అవుతుంది.

## 20.6 సారాంశం

ఎథ్నోమెథడాలజిని సాధారణంగా దృగ్విషయవాద దృక్పథంగా భావిస్తూ ఉంటారు. ఎథ్నోమెథడాలజీని అనుసరించే వారు ఐరోపాదేశాల దృగ్విషయవాద సంప్రదాయంపై అధికంగా ఆధారపడి ఉంటారు. అంటే ముఖ్యంగా ఎడ్మండ్ హుజర్ల్, అల్‌ఫ్రెడ్ షుట్జ్‌ల భావాలపై ఆధారపడి ఉంటారు. దృగ్విషయవాద పితామహుడైన హుజర్ల్ ఆలోచనా ధోరణి సమకాలిన సమాజశాస్త్రాలను ఎంతగానో ప్రభావితం చేసింది. హుజర్ల్ ఆలోచనలనుంచి కొన్ని భావాలను ఎంపిక చేసుకొని వాటికి ఒక కొత్తరూపం ఇచ్చి షుట్జ్ కొన్ని నూతన ప్రతిపాదనలు చేశాడు. గార్ఫెంకెల్‌పై హుజర్ల్, షుట్జ్‌ల ప్రభావం గణనీయంగానే ఉన్నట్లు చెప్పవచ్చు.

దృగ్విషయ వాద తాత్విక పునాదులు 19వ శతాబ్దం రెండో భాగంలో మనకు కనిపిస్తాయి. కానీ ఈ దృక్పథం ఒక సిద్ధాంత నిర్మాణంగా, పరిశోధనా పద్ధతిగా ఈ మధ్యనే వెలువడింది. 1950 తరువాత అమెరికాలో దృగ్విషయ వాదం ప్రాచుర్యం పెరిగింది. అనేక మంది సమాజశాస్త్రవేత్తలు దీన్ని అధ్యయనాంశంగా పరిశీలనా పద్ధతిగా వాడటం మొదలుపెట్టారు. దృగ్విషయవాదం హుజర్ల్ రచనల్లో యధార్థవాదం, అనుభవవాదం యొక్క విమర్శనాత్మక వ్యాఖ్యానంగా అవతరించిందనే అనిపిస్తుంది.

హుజర్ల్ రచనల ప్రభావం గార్ఫెంకెల్‌పై పడింది. అలా ప్రభావం చూపిన అంశాలు: 1. మౌలిక తాత్విక సందిగ్ధత, 2. చైతన్య ధార్మలు, 3. ప్రాకృతిక అనుభవ వాదం, 4. సామాజిక శాస్త్రాలకు తాత్విక ప్రత్యామ్నాయం.

షుట్జ్ దృగ్విషయ సమాజ శాస్త్రంలో కొన్ని భావనలు చాలా ప్రధానమైనవి. అవి: 1. సహజదృక్పథం, 2. అంతర్ వైయక్తిక, 3. జీవిత ప్రపంచం. ఈ మూడు భావనలు మూడు మూల స్థంబాలు. గార్ఫెంకెల్ తన ఎథ్నోమెథడాలజీ సిద్ధాంతాన్ని రూపొందించడంలో దృగ్విషయవాద సిద్ధాంతంలోని భావనలను స్వీకరించి విపులీకరించాడు.

సమాజశాస్త్రంలోని దైనందిన జీవితంలో సాగే చర్యల గురించే ఎథ్నోమెథడాలజీ ప్రముఖంగా చర్చిస్తుంది. సాధారణ మానవ కార్యకలాపాల విషయంలో ఎథ్నోమెథడాలజీస్టులు కనబరిచే ఆసక్తి దృగ్విషయవాదంలో కనిపించే ఆసక్తిని పోలి ఉంటుందని స్పష్టమవుతుంది.

BRAOU

## 20.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సకారాత్మక దృగ్విషయవాదాల మధ్య నున్న తారతమ్యాలు ఏవి?

2. గార్ఫెంకెల్, షుట్జ్‌లపై హుజర్ల్ ప్రభావాన్ని వివరించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. మౌలిక తాత్విక సందిగ్ధత.

2. చైతన్యవాద ధర్మాలు.

## 20.8 చదువదగిన పుస్తకాలు



Abraham, F.M : Modern Sociological Theory, Oxford University Press, Delhi, 1982.

Filmer Paul et al : New Directions in Sociological Theory. The MiT Press, Cambridge, Missachusetts, 1972.

Harlmbos, M. : Sociology: Themes and Perspectives, Oxford University Press, Delhi, 1980.

Nathanson, Mourice : "Alfred Schutz on Social Reality and Social Science". Social Research, Vol. 35, pp. 217-294, 1968.

Psathas, George : "Ethnomethods and Phenomenology". Social Reaserch, Vol. 35, pp 500-520, 1968.

Turner, J.H. : The Structure of Sociological Theory, Rawat Publications, Jaipur, 1987.

BRAOU

# భాగం-21: ఆల్‌ఫ్రెడ్ షుడ్జ్

విషయ క్రమం


21.0 ఉద్దేశాలు

21.1 పరిచయం

21.2 దైనందిన జీవితంలో అంతర్‌వైయక్తికత

21.3 సామాజిక వాస్తవికత, సామాజిక శాస్త్రం

21.4 దృగ్విషయవాదం, ఎథ్నోమెథడాలజీ, సమాజశాస్త్రం

21.5 దృగ్విషయవాద సారాంశం, ఎథ్నోమెథడాలజీపై దాని ప్రభావం

21.6 సారాంశం

21.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

21.8 చదువదగిన పుస్తకాలు


## 21.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- నిత్యజీవితంలో అంతర్ వైయుక్తికత యొక్క ప్రాముఖ్యత తెలుసుకుంటారు.
- సామాజికవాస్తవికత, సమాజిక శాస్త్రాలమధ్య సంబంధాన్ని అధ్యయనం చేస్తారు.
- దృగ్విషయవాదంపై ఎథ్నోమెథడాలజీ ప్రబావాన్ని పరిశీలిస్తారు.

BRAOU

## 21.1 పరిచయం

సమాజశాస్త్రంలో ప్రాబల్యం సంపాదించడానికి సూక్ష్మస్థాయి సిద్ధాంతాలైన దృగ్విషయవాదం, ఎథ్నోమెథడాలజీలు తీవ్రంగా పోరాడుతూ వస్తున్నాయి. సమాజశాస్త్రంలో ఒకప్పుడు అత్యంత ప్రముఖమైన, ప్రాబల్యం సంపాదించిన స్థూల స్థాయి సిద్ధాంతాలు- నిర్మితీయ ప్రకార్యవాదం, సంఘర్షణ సిద్ధాంతాలు- క్రమంగా ప్రాబల్యం కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. అమెరికా దేశంలో సమాజశాస్త్రంలో 1960 దశకం వరకు స్థూల సిద్ధాంతాలకు తిరుగులేని ప్రాముఖ్యం ఉండేది. 1960 దశాబ్దం చివరినాటికి, 1970 దశకం ప్రారంభం నాటికి దృగ్విషయవాద సమాజశాస్త్రం, ఎథ్నోమెథడాలజీ ఆవిర్భావం ఫలితంగా విశ్లేషణ స్థాయి మారడమేకాక సమాజశాస్త్ర ఆలోచనా స్రవంతి తాలూకు శాస్త్రీయ సూత్రాలపై దాడి ప్రారంభం అయినట్లు కనిపిస్తుంది. ఈ సూక్ష్మ సిద్ధాంతాలు సాధారణంగా EDL (దైనందిన జీవితం తాలూకు సమాజశాస్త్రం- Sociology of Everyday Life) కు సరిగా సప్పుతాయి. ఈ సిద్ధాంతాలు సాంప్రదాయిక సమాజశాస్త్ర వేత్తలనుంచి వ్యతిరేకతను ఎదుర్కొనవలసి వచ్చింది. వారు ఈ సిద్ధాంతాలను అశాస్త్రీయ సూక్ష్మ సిద్ధాంతాలనే ముద్రవేసి ఎద్దేవా చేశారు. 'అల్పమైన' సూక్ష్మస్థాయి సామాజిక సమస్యలపైన దృష్టి కేంద్రీకరించడాన్ని, సామాజిక నిర్మితులు, సంస్థలను అలక్ష్యం చేయడాన్ని సంప్రదాయవాదులు తీవ్రంగా విమర్శించారు. ఎథ్నోమెథడాలజీ వికాసంలో హుజర్ల్, షుడ్జ్‌ల రచనలు ప్రముఖ పాత్ర వహించాయని చెప్పవచ్చు. ఎథ్నోమెథడాలజీ అంటే ఒక రకంగా దృగ్విషయవాదం అనే చెప్పాలి. ఎందుకంటే హుజర్ల్, షుట్జ్‌ల రచనలే ఎథ్నోమెథడాలజీకి స్ఫూర్తినిచ్చాయి కావున. ఎథ్నో మెథడాలజికి వీరి రచనలనుంచి స్ఫూర్తి లభించినా తరువాత కాలంలో ఎన్నో ముఖ్యమైన మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా ఎథ్నోమెథడాలజీ

కేవలం దృగ్విషయ వాదం ప్రతిపాదించిన పద్ధతులనే అనుసరించిందని, పరిశీలనా సాధనాలను యథాతథంగా వినియోగించిందని చెప్పడం వాస్తవ విరుద్ధమే అవుతుంది. కాకపోతే ఈ రెండు వాదాలక ఒకే రకమైన బౌద్ధిక వారసత్వం ఉన్నా పరిశీలన విషయంలో తేడాలున్నట్టు గుర్తించవచ్చు. గార్ఫెంకెల్ కూడా హజర్ల రచనలతో పరిచయం ఉన్నా ఎథ్నోమెథడాలజిస్టులు ఎక్కువగా షుట్జ్ రచనలనే ఉటంకిస్తారు.

ఆల్‌ఫ్రెడ్ షుట్జ్ (1899-1959) నాజీ హింసాకాండనుంచి తప్పించుకోవడానికి అమెరికాకు వలసవెళ్లాడు. అమెరికన్ సమాజశాస్త్రంలో దృగ్విషయ వాదాన్ని ప్రవేశపెట్టిన కీర్తి అయనకే దక్కింది. హజర్ల్ యొక్క తత్వ శాస్త్రాన్ని- ముఖ్యంగా, జీవిత ప్రపంచం అనే భావనను గ్రహించి దాన్ని చాలా వరకు సంస్కరించి దృగ్విషయవాదన ప్రపెంపొందించాడు. వెబర్ యొక్క వర్‌స్టెహెన్ లేదా వ్యాఖ్యానాత్మక అవగాహనను తన వైయక్తిక చైతన్య విశ్లేషణకు బాగా వాడుకున్నాడు. తరువాత 'ఉమ్మడి అర్థాల ఆధార భూమికలు అనుభవాలు సామాజిక జీవితాన్ని సంభవం చేస్తాయని' ప్రతిపాదించాడు. దైనందిన జీవితంలోని పరిస్థితులకు మానవులు ఆపాదించే అర్థాలకే షుట్జ్ అధిక ప్రాముఖ్యత నిచ్చాడు. సహభాగ అర్థాలు, అనుభవాలు సామాజిక జీవితానికి పునాదులు వేస్తాయని షుట్జ్ విశ్వసించాడు. అతని దృష్టిలో దైనందిన జీవితం అంతర్‌వైయక్తికతా భరితమైంది. ఇతరులతో అనుభవం పంచుకొనేటువంటిది. పరస్పర చర్య సాగేటటువంటిది. ప్రతీకాత్మక పరస్పర చర్యావాదులైన జార్జ్ హెర్బర్ట్ మీడ్ ప్రతిపాదనలన పోలిన ప్రతిపాదనగా షుట్జ్ ప్రతిపాదనలు కనిపిస్తాయి. అయితే ఈ అంతర్‌వైయక్తిక ప్రపంచం బహుళ వాస్తవికతల నిలయమని, వాటన్నింటిలో దైనందిన అనుభవాలే సర్వోచ్ఛమైనవై ఉంటాయని షుట్జ్ భావించాడు. ఈ రకమైన వాస్తవ ప్రపంచంపైనే షుట్జ్ తన దృష్టి కేంద్రీకరించాడు.

మన సర్వాంగీకారమైన, దైనందిన జీవితాన్నే మనకు ఆసక్తిని కలిగించే సామాజిక ప్రపంచంగా భావించవచ్చు. ఇది శాస్త్ర దృష్టితో ఒక క్రమ పద్ధతిలో పరీక్షించే శాస్త్రవేత్తలు అనుసరించే పద్ధతికి భిన్నంగా ఉంటుంది. మనుషులు శాస్త్ర సిద్ధాంతాలను అనుసరించి ప్రవర్తించరని, వాస్తవ పరిస్థితుల ఆధారంగానే వారి ప్రవర్తన ఉంటుందని షుట్జ్ వాదిస్తాడు. ఇలాంటి పరిస్థితులలో సమాజంలోని ఇతర సభ్యులతో పరస్పర చర్య సాగిస్తూ ఉంటారని, అలాంటప్పుడు అంతర్‌వైయక్తిక ప్రపంచం ఏర్పడుతుందని షుట్జ్ పేర్కొంటాడు. షుట్జ్ ప్రతిపాదించిన వాస్తవికత విషయంలో సర్వసామాన్యదృష్టి ఎథ్నోమెథడాలజీని రూపొందించడంలో గార్ఫెంకెల్‌కు ఎంతో స్ఫూర్తినిచ్చింది. షుట్జ్ పేర్కొన్న తాత్విక పరిశీలనలను ఎథ్నోమెథడాలజీ అనుభవ ఆధారంగా ధృవీకరించడానికి ప్రయత్నిస్తుంది.

## 21.2 దైనందిన జీవితంలో అంతర్‌వైయక్తికత

సామాజిక ప్రపంచ లక్షణాల ఆధారంగా షుట్జ్ ప్రతిపాదించిన దృగ్విషయవాదాన్ని చక్కగా అర్థం చేసుకోవచ్చు. సామాన్య పరిజ్ఞానమున్న మనుషులు తాము ఎదుర్కొంటున్న పరిస్థితులు, తాము ఉంటున్న పరిసరాలను అనుసరించి వారి దైనందిన జీవన వ్యాపారం సాగిస్తూ ఉండేదే సామాజిక ప్రపంచమని షుట్జ్ వివరిస్తాడు. "సామాన్య జ్ఞానమున్న వ్యక్తులు" అంటే అనాసక్త శాస్త్రవేత్త మాదిరిగా కాక ఆసక్తితో ఈ ప్రపంచాన్ని చూస్తున్న మనలాంటి వారందరూ అని అర్థం చేసుకోవాలంటాడు షుట్జ్. జీవితంపట్ల ఉండే "సహజ దృక్పథం"లో జ్ఞానమీమాంసకు ఆధిభౌతిక వాదానికి ఎలాంటి స్థానం లేదు.

ఇలాంటి సహజదృక్పథం ఉన్న మనుషులు తాముంటున్న ప్రపంచం వాస్తవమైందని, తనకంటూ ఒక ప్రపంచముందని, తన మాదిరిగానే ఇతర మనుషులు కూడా ఇందులో జీవిస్తున్నారని, వారితో పరస్పర భావ ప్రసరణ జరుగుతూ ఉంటుందని భావిస్తుంటారు. ఈ ప్రపంచాన్ని 'మనది' అంటే నేను, ఇతరులూ అని అర్థం. తోటివారిని తనలాంటి వారుగా గుర్తించడం జరుగుతూ ఉంటుంది. ఇతరులతో ఏర్పడే ముఖాముఖి సంబంధాల ద్వారా ఇతరులు కూడా తనలాంటి వారిగానే కేవలం మానవాకారం, అంగాంగాలు ఉన్న జీవులు కారని తెలుసుకొంటారు. దీన్నే షుట్జ్ "Thou-orientation" అన్నాడు.

షుట్జ్ పేర్కొన్న సామాజిక ప్రపంచాన్ని ఎన్నో కారణాల వల్ల అంతర్ వైయక్తిక ప్రపంచంగా చెప్పవచ్చు. ఎ). నీతో (Thou) కలిగే అనుకోని సమావేశానికి ఇది ఒక బిందుపథం(Locus). బి) నాతోటివారిపట్ల నా ప్రవర్తన తాలూకు ఒక



BRAOU

సన్నివేశం, సి) ఇది నేనుగాని, నీవుగానీ జన్మించడం వల్ల ఏర్పడే ఒకానొక అద్భుతం కాదు. ఇలాంటి చర్య చారిత్రాత్మకంగా మన పూర్వీకులనుంచి సంక్రమించిన స్పందన. ఇలాంటి స్పందన ప్రధానంగా భాషా మాధ్యమంగా జరుగుతుంటుంది. డి) అంతర్ వైయక్తిక ప్రపంచం దిగంతం విస్తృతమైంది. ఇది "మన" అనే భవిష్యత్ వైపు కదులుతూ ఉంటుంది. ఇదిచాలావరకు "వాళ్ల" అనే భావన ప్రపంచంవైపు పయనిస్తూ ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అంతర్వైయక్తిక ప్రపంచం మానవ చర్యలకు ఒక క్షేత్రం, ఒక సందర్భం, దీని దృష్ట్యానే సంఘటనలను, వస్తుజాలాన్ని అర్థం చేసుకోవడం జరుగుతుంటుంది.

దైనందిన జీవితపు అంతర్వైయక్తిక ప్రపంచం, మన సామాజిక ప్రపంచం అనేవి మానవ చర్యలకు ప్రధానక్షేత్రం. షుట్జ్ ప్రతిపాదించిన దృగ్విషయవాదం పరిశీలించే ముఖ్యమైన విషయం ఈ మానవ చర్యలను విశ్లేషించడమే. వెబర్ మానవ చర్యల విషయంలో ప్రతిపాదించిన వ్యక్తినిష్ఠ వ్యాఖ్యానాన్ని షుట్జ్ స్వీకరించినా దానికి కొన్ని మార్పులు, చేర్పులు చేశాడు. వెబర్ తన సిద్ధాంతాలకున్న తాత్విక ప్రాతిపదికల గురించే ప్రస్తావించాడని షుట్జ్ పేర్కొన్నాడు. అయితే సామాజిక ప్రపంచం విషయంలో వెబర్ దృక్పథాన్ని షుట్జ్ మెచ్చుకున్నాడు.

## 21.3 సామాజిక వాస్తవికత, సామాజిక శాస్త్రం

వెబర్ ప్రతిపాదనల విషయంలో షుట్జ్ సంతృప్తిని ప్రకటించినా, అవి సమాజశాస్త్రాల మూలతత్వాన్ని అర్థం చేసుకోవడానికి ప్రథమ సోపానాలుగా భావించినా మానవీయ శాస్త్రాలు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారాలకు సరైన పటిష్ఠమైన ప్రాతిపదికలు కాలేవని షుట్జ్ భావించాడు. వెబర్ ప్రతిపాదనలలో ముఖ్యమైన వైయక్తిక అర్థం, భావనను మరింత గహనంగా విశ్లేషించాల్సిన అవసరం ఉందని షుట్జ్ భావించాడు. వెబర్ భావనలు సమాజం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలకు శీర్షికలుగా మాత్రమే పనికి వస్తాయని ఆ సమస్యలను వెబర్ క్షుణ్ణంగా పరిశోధించి విశ్లేషించలేదని షుట్జ్ పేర్కొంటాడు. ఆ సమస్యలన్నీ "lived experience of time తో సంబంధమున్నటు వంటివేనని, తీవ్ర తాత్విక విచారం వల్లనే అంటే తాత్వికమైన పునాదులపై నిర్మితమైన విధాన సిద్ధాంతాల వల్లనే కృత్రిమ సమస్యలను పరిష్కరించడం సాధ్యమవుతుందని షుట్జ్ నొక్కి చెప్పాడు. ఇలాంటి సమస్యలే సామాజిక శాస్త్రాలలో ముఖ్యంగా సమాజశాస్త్రంలో జరుగుతున్న పరిశోధనలకు అవరోధాలుగా పరిణమిస్తున్నాయని షుట్జ్ తెలిపాడు.

షుట్జ్ హుజర్ల్ ప్రభావానికి లోనైనవాడు. అతని మాదిరిగానే షుట్జ్‌కూడా వ్యక్తినిష్ఠమైన అర్థాలను వస్తునిష్ఠంగా అధ్యయనం చేయడానికే ప్రయత్నించాడు. అంటే ఒక నిర్దిష్ట, విశిష్ట, ఆకస్మిక (ఆగంతుక) అంశాల మూలంగా కలుషితం కాని మానవ వాస్తవికత తలూకు జ్ఞానానిన తెలుసుకోవడమన్నమాట. అయితే హుజర్ల్ మాదిరిగా సహజ ప్రపంచాన్ని పక్కకు నెట్టకుండా దాన్ని అవగాహనకు బిందు ప్రథమంగా భావించాడు షుట్జ్. ఈ సందర్భంలో షుట్జ్ వెబర్ యొక్క సామాజిక చర్య సిద్ధాంతాన్ని మరింత విస్తరించాడనే చెప్పాలి. అర్థం అనే భావనను అంతర్వైయక్తిక దృగ్విషయంగా భావించడం ద్వారా షుట్జ్ వెబర్ సిద్ధాంతాన్ని విస్తరించి చెప్పాడని స్పష్టమవుతుంది.

లోకజ్ఞానం (సామాన్యజ్ఞానం) ఉన్న మనుషులు నివసిస్తున్నటువంటి ప్రపంచమే సామాజిక ప్రపంచమని షుట్జ్ భావించాడు. అతిసామాన్య జ్ఞానమున్న మనం మనముంటున్న ప్రపంచ నిర్మాణం తాలూకు సిద్ధాంతాలను తెలుసుకోవాలనే ఆసక్తితోకాక, సహజ దృక్పథాలను తెలుసుకోవడం పట్ల ఆసక్తి కనబరుస్తుంటాం. మనుషులు ఇతరుల అస్తిత్వం మాదిరిగానే ఈ ప్రపంచాన్ని కూడా ఒక దత్త విషయంగా భావిస్తూ జీవిస్తూ ఉంటారు.

ఈ ప్రపంచం ఒక నిత్యక్రమం అనేది ఒకటుండేటటువంటిది. ఈ నిత్య క్రమంలో దైనందిన జీవిత వ్యవహారాలను ఎక్కువభాగం అచేతనావస్థలోనే సాధించడం జరుగుతూ ఉంటుంది. ఈ ప్రపంచం ఒక ఆలోచనాయుతమైన వ్యాఖ్యానం కాదు. ఇది సాంస్కృతిక వస్తువుల సామాజిక సంస్థలున్నటువంటిది. ఇలాంటి ప్రపంచంలోనే మనం పుట్టాం. ఇలాంటి ప్రపంచంలోనే మన స్వభావం, వేషభాషలను పొందడం, వాటితో సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. మొదటినుంచీ కూడా వ్యవహర్తలుగా మనం మనముంటున్న ప్రపంచ స్వభావం, సంస్కృతులను ఆకళింపు చేసుకొని అనుభవించాల్సి ఉంటుంది. ఈ ప్రపంచం ఒక వైయక్తికమైందికాక, అందరికీ చెందినదేనని

BRAOU

ఇందులో వ్యక్తుల మధ్య పరస్పర భావప్రసరణ సాగుతూ ఉంటుందని, ఒక భాష ఉంటుందని షుట్జ్ పేర్కొన్నాడు. దీన్నిబట్టి చూస్తే అంతర్‌వైయక్తికత, పరస్పరచర్య, భావ ప్రసరణ, భాష, సామాజిక ప్రపంచంలోని అన్ని సాధ్యవిషయాలు. దృగ్విషయవాద సామాజికశాస్త్రం అధ్యయనాంశాలుగా ఉంటాయని చెప్పవచ్చు.

వ్యక్తినిష్ఠ దృగ్విషయంగా సామాజిక వాస్తవికత ఎలా ఏర్పడుతుందో యధార్థవాదం లేదా ప్రాకృతిక వాదం తెలియజేయవు. అంతేకాక అది ఏవిధంగా అంతర్‌వైయక్తికమైందో లేదా వ్యవహర్తలు వారి చర్యలను, ఇతరుల చర్యలను వారికున్న లోకజ్ఞానంతో ఎలా వ్యాఖ్యానిస్తారో వివరించవు. సామాజిక శాస్త్రాలకు గట్టి పునాదులు వేయాలంటే జీవిత ప్రపంచం తాలూకు మౌలిక నిర్మితులను గురించి మరింత స్పష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రతీ వ్యక్తి విశ్వాసాలు ఆకాంక్షలు, నియమాలు ప్రమాణాలు మొదలైన జ్ఞానసంపద సహాయంతో ఈ ప్రపంచాన్ని వ్యాఖ్యానించి అర్థం చేసుకొంటూ ఉంటారు. ఈ రకమైన జ్ఞానసంపదే లేకుంటే చర్య అనేది అనూహ్యమైనదవుతుంది. ఈ జ్ఞాన సంపద అనుభవం ద్వారా సమకూరుతుంది. దీని జీవిత యాత్రలో మెరుగులు దిద్దుకోవడం, పరీక్షించి నిగ్గుతేల్చడం, అవసరమైన మార్పులు, చేర్పులు చేయడం జరుగుతూ ఉంటుంది. ఈ జ్ఞాన సంపద నిరంతరం మార్పులకు గురి అవుతున్న మనకున్న లోకజ్ఞానం ప్రతీక్షణం మనకు లభించే లోకానుభవం ద్వారా సువ్యవస్థితము, పటిష్టమూ అవుతూ ఉంటుంది. ఈ రకమైన అనేక "నమూనీకరణల"ను మౌనంగా, ఏవిధంగానూ ప్రశ్నించకుండా పాటిస్తూ ఉంటాము. అంటే 'సహజదృక్పథం'లో ఏయే అంశాలు ఇమిడి ఉన్నాయోనన్న వాటికి సంబంధించి మనకు ఎలాంటి స్పష్టమైన స్పృహ ఉండదు. అది ఏవిధంగా మనకు అవసరమో, ఇతరులతో అవి ఎలాంటి సంబంధం ఏర్పరుస్తాయో స్పష్టంగా తెలియవు. అయితే ఈ జ్ఞానసంపద నిస్సందేహంగా మన చర్యలకు ప్రాతిపదికగా పనిచేస్తుంది.

మనలాంటివారే ఇతరులు కూడా ఈ ప్రపంచంలో జీవిస్తున్నారని, వారి చర్యలన స్వభావం కూడా మన చర్యల స్వభావంలాంటిదేనని సమాచారం అందజేయడం ఈ జ్ఞాన సంపద మరో ముఖ్య లక్షణం. ఈ లోకజ్ఞానమే వారితో పరస్పర భావ ప్రసరణ జరుపుకునే వీలు కల్పిస్తుంది.

దైనందిన జీవితంలో వ్యవహర్తల అనుభవానికి వచ్చే సామాజిక వాస్తవికతను అర్థం చేసుకోవడమే సామాజిక శాస్త్రాల లక్ష్యమైతే, ఆజీవిత లక్షణం అంతర్‌వైయక్తికమైంది అయితే జీవిత ప్రపంచాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవడానికి వర్గీకరణలు, నిర్మితులు అవసరమవుతాయి. ఈ సందర్భంలోనే షుట్జ్ వ్యక్తి నిష్ఠ వ్యాఖ్యాపద్ధతిని ప్రతిపాదించాడు. దీనికి సామాజిక శాస్త్ర నిర్మితులలో ప్రథమస్థాయి నిర్దేశకాలు అవసరమవుతాయి. వీటినే షుట్జ్ ద్వితీయ నిర్మితులు అంటాడు. ఈ రకమైన ద్వితీయ స్థాయి నిర్మితులు వెబర్ తెలిపిన 'ఆదర్శ నమూనాలు' లాంటివే. వీటిని బట్టి చూస్తే షుట్జ్ వెబర్ పరిశోధనా పద్ధతిలోని భావలనను పరిగణనలోకి తీసుకొని తన ప్రతిపాదనలు చేశాడని తెలుస్తుంది.

ఎథ్నోమెథడాలజీకి షుట్జ్ ఎన్నో మెరుగులు దిద్దాడనడంలో ఎలాంటి సందేహంలేదు. అంతేకాక సామాజిక శాస్త్రాల పునాదులు మనుషుల దైనందిన జీవితాలలోనే ఉన్నాయని చెప్పి ఎథ్నోమెథడాలజీ వాస్తవికతకు ఎంత సన్నిహితంగా ఉంటుందో స్పష్టం చేశాడు.

## 21.4 దృగ్విషయవాదం-ఎథ్నోమెథడాలజీ-సమాజశాస్త్రం

మనుషులు వారి దైనందిన జీవితాలలో వారుంటున్న ప్రపంచాన్ని గురించి ఎలా వ్యాఖ్యానించుకొటారో అన్న దాన్ని పునర్నిర్మించడమే సామాజిక శాస్త్రవేత్తల ప్రాథమిక కర్తవ్యం అన్న ఈ విషయంలో షుట్జ్, దృగ్విషయవాదుల దృక్పథంలో సారూప్యత కనిపిస్తుంది.

ప్రకృతి శాస్త్రాల, సామాజిక శాస్త్రాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గురించి చెబుతూ షుట్జ్ ఇలా అన్నాడు. 'మనుషులు, తత్వవేత్తలు పరిశీలించే సహజ ప్రపంచంలోని కేవలం వస్తువులేకాక ఈ ప్రపంచాన్ని సాంస్కృతిక ప్రపంచ



BRAOU

సృష్టికర్తలకు, ఈ ప్రపంచాన్ని సృష్టించడం ద్వారా వారి కార్యకలాపాలకు ఒక అర్థాన్ని కల్పిస్తారు. వారి బాహ్య ప్రవర్తన వారి మొత్తం ప్రవర్తనలో ఒకానొక భాగం మాత్రమే. పరిశీలించడానికి వీలైన మనిషి బాహ్య ప్రవర్తనను చూసే వారి ప్రవర్తన సంతటినీ గురించి తెలుసుకోవడం జరిగిందని భావించడం కపటరాహిత్యమే అవుతుంది. వ్యవహర్తల చర్యలు వారికి ఎంతవరకు అర్థవంతమైనవో తెలుసుకోవడం అనేది సామాజిక శాస్త్రవేత్తలకు ఎదురయ్యే సవాలు. పరిశీలనకు తన సొంత వర్గీకరణలు లేదా సిద్ధాంతాల ఆధారంగానే వ్యవహర్తల చర్యలు అర్థాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే అవ్యవహర్తలు భావించే అర్థాలను తెలుసుకోవడం ఎన్నటికీ వీలుకాదు. అంతేకాక సామాజిక వాస్తవికత ఎలా కల్పించబడుతుంది. మనుషుల భవిష్యత్ చర్యలు వారి అవగాహన దృష్ట్యా తమ చర్యలను ఎల సాగించగలరు అన్న విషయాలకు అంతుచిక్కదు. ఈ విషయంలో ఎథ్నోమెథడాలజీ ప్రతిపాదకుడైన గార్ఫెంకెల్‌ను షుట్జ్ ఎంతో ప్రభావితం చేశాడని చెప్పవచ్చు దృగ్విషయవాదం తాలూకు ఆలోచనా ధోరణిని అనుసరించిన వారు లోకజ్ఞాన పద్ధతిని ఉపయోగించక వాస్తవికత నిర్మాణంలో లోకజ్ఞానం పాత్రను గురించి అధ్యయనం చేస్తారు.

పరస్పర చర్య 'పరమవాస్తవికత'ను ఎలా కల్పిస్తుందో, నిర్వహిస్తుందో అనే అంశాన్ని అధ్యయనం చేయడం చాలా ముఖ్యమని షుట్జ్ నొక్కి చెప్పాడు. వ్యవహర్తలు తమ దృష్టికోణాలకు సంబంధించిన పారస్పరికతను ఎలా సాధిస్తారు, వారు 'taken for granted' ప్రపంచాన్ని ఎలా నిర్మిస్తారు అనే దానితో కూడా షుట్జ్‌కు సంబంధం ఉంది. 'taken for granted' స్వభావమున్న ప్రపంచాన్ని గురించి నొక్కి చెప్పడం, వ్యవహర్తల వాస్తవికతా జ్ఞానాన్ని పెంపొందించడం ప్రాముఖ్యం అనేవి ఎథ్నోమెథడాలజిస్టులకు ప్రధాన పరిశీలనాంశాలయ్యాయి. ఎథ్నోమెథడాలజిస్టులలో అనేకులు హుజర్ల్, షుట్జ్‌ల దృగ్విషయవాదం నుంచి ఎన్నో విషయాలను స్వీకరించినట్లు మనమిదివరకే చూశాము. అందువల్ల ఈ ఇద్దరి దృష్టికోణాలను తులనాత్మకంగా పరీక్షించడం, ఈ రెండు వాదాలకు చెందని ఇతర సమాజశాస్త్ర వేత్తల అభిప్రాయాలను తెలుసుకొంటే దృగ్విషయవాదుల, ఎథ్నోమెథడాలజిస్టుల దృక్పథాలలోని మౌలిక లక్షణాలు సుబోధకమవుతాయి. సంప్రదాయక సమాజశాస్త్రవేత్తల, సామాన్యజనుల దృష్టిలో నిత్యజీవితంలో వస్తువులు, ఘటనలు, వ్యక్తులు వాటి పరిశీలనా పద్ధతుల విషయంలో స్వతంత్రంగా ఉంటారు. కానీ, దృగ్విషయవాదులు, ఎథ్నోమెథడాలజిస్టుల దృష్టిలో వాస్తవ ప్రపంచంలో అట్లా ఉంటాయని భావించాల్సిన అవసరం గానీ, అభిప్రాయాన్ని బలపరచాల్సిన అవసరంగానీ ఉండదు. విశ్లేషణకు ఏది వాస్తవంగా ఉంది అనేది అసంగతమైన అంశం. కానీ అక్కడ ఏముంది అనే సామాజిక సమూహం భావం కీలకమైంది. దృగ్విషయవాదులు, ఎథ్నోమెథడాలజిస్టులు ఇద్దరూ వాస్తవ ప్రపంచంలో పైన తెలిపిన పరస్పర స్వతంత్రమైనవే విశ్వాసాన్ని తోసిపుచ్చుతాయని అంటారు.

BRAOU

## 21.5 దృగ్విషయవాద సారాంశం-ఎథ్నోమెథడాలజీపై దాని ప్రభావం

సమాజశాస్త్రాభివృద్ధిలో ఆల్‌ఫ్రెడ్ షుట్జ్ నిర్వహించిన ప్రముఖపాత్ర హుజర్ల్ తీవ్ర దృగ్విషయవాదాన్ని మాక్స్‌వెబర్ ప్రతిపాదించిన చర్యాసిద్ధాంతాన్ని అమెరికన్ పరస్పర చర్యావాదాన్ని మేళవించడంలో స్పష్టమవుతుంది. ఈరకమైన మేళవింపు దృగ్విషయవాదాభివృద్ధికి ఎంతో దోహదపడింది. ఎథ్నోమెథడాలజీ ఆవిర్భావానికి, సిద్ధాంతాల సంస్కారానికి తోడ్పడింది.

మాక్స్‌వెబర్ సామాజిక చర్య భావనను ప్రతిపాదన గుణదోష పరీక్షతో షుట్జ్ రచన ప్రారంభమైంది. వ్యవహర్తలలో ఇతర వ్యవహర్తలకు సంబంధించిన స్పృహ ఉన్నప్పుడు, సర్వసాధారణ పరిస్థితికి సంబంధించినవారు ఆపాదించే అర్థం తాలూకు దృష్టికోణాల వల్లనే సామాజిక చర్య ఏర్పడడానికి అవకాశం కలుగుతుంది. అందువల్ల సమాజానికి సంబంధించిన శాస్త్రం 'అర్థస్థాయిలో' సామాజిక వాస్తవికతను అవగాహన చేసుకోవడానికే ప్రయత్నించాల్సి ఉంటుంది అని వెబర్ అభిప్రాయం. సామాజిక పరిశీలన ప్రజలలో చైతన్యం లోతుల్లోకి చొచ్చుకొనిపోయి వ్యవహర్తల దృష్టి ఏమిటి? వారు ప్రపంచాన్ని ఎలా నిర్వచిస్తారు, చూస్తారు అన్న విషయాలను ఆవిష్కరించాల్సి ఉంటుంది. ఈ సందర్భంలోనే వెబర్ Verstehen పద్ధతిని ప్రవేశపెట్టాడు. పరిశీలకుడు తాను పరిశీలిస్తున్న పరిస్థితులతో మమేకమై అంటే, సహభాగి అయినప్పుడే వ్యవహర్తల వ్యక్తినిష్ఠమైన ప్రపంచాన్ని తెలుసుకోగలడు. సంక్లిష్టమైన సామాజిక నిర్మితులను అర్థం చేసుకోవడానికి Verstehen పద్ధతివంటిది లేనిదే కేవలం కార్యకారణ పద్ధతికాని, గణాంక విశ్లేషణ పద్ధతికానీ సరిపోదు.

వెబర్ భావాలను స్వీకరించినప్పటికీ షుట్జ్‌ను వెబర్ విమర్శించాడు. ముఖ్యంగా Verstehn పద్ధతిని వ్యవహర్తలు సర్వాంగీకారం పొందిన అర్థాలను ఇతర వ్యవహర్తలతో పంచుకోరన్న విషయాన్ని విశ్లేషించడానికి ఈ పద్ధతిని ఉపయోగించకపోవడాన్ని షుట్జ్ విమర్శించాడు. వ్యవహర్తలు వ్యక్తినిష్ఠమైన అర్థాలను మాత్రమే పంచుకొంటారని వెబర్ పేర్కొన్నాడు. ఒకానొక పరిస్థితులలో వ్యవహర్తలు వ్యక్తినిష్ఠ స్థితిని ఎలా పొందుతారు? అనే ప్రశ్న లేవనెత్తాడు షుట్జ్. వ్యవహర్తలు ప్రపంచానికి సంబంధించి ఒక సర్వసాధారణమైన దృక్పథాన్ని ఎలా ఏర్పరచుకొంటారు అని ప్రశ్నించాడు. ఈ సమస్య అంతర్వైయక్తికతకు సంబంధించినదేనని, షుట్జ్ ఆలోచనాసరళిలో ఒక భాగమని మనం గుర్తించవచ్చు.

షుట్జ్ తన తొలిరోజుల్లో హుజర్ల్ దృగ్విషయవాద ప్రభావానికి గురి అయ్యాడు. అయితే మనిషి విషయంలో అతని భావాలు, ప్రభావానికి గురి అయ్యాడు. అయితే మనిషి విషయంలో అతని భావవాలు, puremindను అన్వేషించడంవంటి పంథాలనుండి షుట్జ్ వైదొలగి తన ప్రత్యేక ఆలోచనా ధోరణినే కొనసాగించాడు. అయితే హుజర్ల్ మానవుల సహజ దృక్పథ భావనను, జీవిత ప్రపంచ భావనను షుట్జ్ అంగీకరిస్తాడు. అయితే మానవులందరూ ఒకేరకమైన జీవిత ప్రపంచంలో ఉంటూ ఒకేరకమైన అనుభవాలన్ను చవిచూస్తూ ఉంటారనే హుజర్ల్ భావాలతో షుట్జ్ ఏకీభవిస్తాడు. మానవుల జీవిత ప్రపంచాన్ని తెలుసుకోకుండా అక్కడకెక్కడో ఉన్న బాహ్య ప్రపంచాన్ని సామాజిక శాస్త్రవేత్తలు తెలుసుకోవడం అసంభవమనే హుజర్ల్ వాదనను షుట్జ్ ఆమోదించి సమర్థించాడు.

షుట్జ్ అమెరికా దేశానికి వలసపోవడంతో దృగ్విషయవాదం, ప్రతీకాత్మక పరస్పర చర్యావాదాలను ముఖ్యంగా జి హెచ్.మీడ్, డబ్ల్యూ.ఐ.థామస్‌ల ప్రభావానికి లోనైంది. ప్రతీకాత్మక వాదుల ఆలోచనా ధోరణికి, షుట్జ్ దృగ్విషయవాదుల ఆలోచనా ధోరణికి దగ్గరి సంబంధం ఉన్నా షుట్జ్ తన ప్రత్యేక ప్రతిపాదనలు ప్రవేశపెట్టి మీడ్ ప్రతిపాదించిన పరస్పర చర్యావాదాన్ని సవాలు చేయడం జరిగిందనే చెప్పవచ్చు.

వెబర్, హుజర్ల్‌లు పరస్పర చర్యావాదుల ప్రతిపాదనలకు సంబంధించి షుట్జ్ చేసిన విశ్లేషణ కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు లేవనెత్తింది. వ్యవహర్తలు సర్వసామాన్యమైన వ్యక్తినిష్ట ప్రపంచాన్ని ఎలా సృష్టిస్తారు? సామాజిక క్రమాన్ని కాపాడటంలో ఈ రకమైన సృష్టి పాత్ర ఏమిటి?

BRAOU

మానవులందరి మనస్సుల్లో సామాజిక ప్రపంచంలో వ్యవహరించడానికి అవసరమైన అన్ని నియమాలు, సామాజిక పద్ధతులు, అనువైన ప్రవర్తనాభావనలు ఉంటాయని షుట్జ్ గట్టిగా నొక్కి చెప్పాడు. హుజర్ల్ ప్రతిపాదించిన "జీవిత ప్రపంచం" భావనను విపులీకరిస్తూ పైన తెలిపిన నియమాలు, సామాజిక పద్ధతులు, భావనలనే "జ్ఞానసంపద"గా పేర్కొంటాడు. ఇలాంటి భావసంపద సహాయంతోనే వాస్తవ ప్రపంచంలో నివసిస్తున్న వ్యవహర్తలు సంఘటనలను వ్యాఖ్యానిస్తూ ఉంటారని షుట్జ్ వివరించాడు. జోనథాన్ టర్నర్ ఈ జ్ఞాన సంపద ముఖ్యమైన లక్షణాలను క్రింది విధంగా వివరించాడు.

1. జ్ఞానసంపద అనేది పరమ వాస్తవికత అయి ఉంటుంది.

2. ఈ జ్ఞాన సంపదే సంఘటలనకు వాస్తవికతను కల్పిస్తూ సామాజిక ప్రపంచానికి taken-for-granted లక్షణాలను కల్పిస్తుంది.

3. జ్ఞానసంపదను అభ్యసనం ద్వారా పొందవచ్చు. దీన్ని సామాజికీకరణం ద్వారా పొందడం జరుగుతుంది. ఈ ప్రపంచంలో వ్యవహర్తలకు ఒక వాస్తవికతగా కనబడుతుంది.

4. దృక్పథాల పారస్పరికతను కల్పించే సందర్భంలో మనుషులు అనేక ప్రమేయాలను ప్రతిపాదికగా తీసుకోవడం జరుగుతంది.

5. జ్ఞానసంపద ఉండడం, సామాజికీకరణ ద్వారా దీన్ని పొందడం, దీనికి దృక్పథాల పారస్పరికతకు దోహదం చేయగల శక్తి సామర్థ్యాలు ఉండటం అన్నీ కలిసి ఈ ప్రపంచం అందరికీ ఒకటేననే భావన వ్యవహర్తలలో

కల్పించగలుగుతాయి.

6. గార్ఫెంకెల్, వీడ్నర్, బిట్నర్‌ల అభిప్రాయాలలో సంఘంలోని ప్రతీవ్యక్తి సామాజిక పద్ధతులను ఉపయోగిస్తుంటాడు. వీరి అభిప్రాయం ప్రకారం మనమందరం సమాజంలోని క్రమబద్ధ రూపాల వెనక ఉన్న ఆధార భూమికలను, ఉపక్రమించబోయే చర్యల వెనుక ఉన్న వాంఛిత భూమికలను తెలుసుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటాం. అందుకే ఈ కొత్త విచారణాకార్యక్రమాన్ని సమాజశాస్త్రజ్ఞులు చేపట్టాలని, సమాజశాస్త్రాన్ని సామాన్య ప్రజల నిత్యజీవిత అనుభవాల, దృక్పథాల పద్ధతుల ఆధారంగా నిర్మించాలని బిట్నర్ నొక్కి చెప్పాడు.

## 21.6 సారాంశం

అమెరికాదేశపు సామాజిక శాస్త్రంలో 1960 దశకం వరకు స్థూల సిద్ధాంతాలకు తిరుగులేని ప్రాముఖ్యం ఉండేది. 1970 దశకం ప్రారంభంనాటికి అవతరించిన దృగ్విషయవాదం, ఎథ్నోమెథడాలజీల ఫలితంగా విశ్లేషణ స్థాయి మారడమేకాక సమాజశాస్త్ర ఆలోచనా స్రవంతి తాలూకు శాస్త్రీయ సూత్రాలపై దాడి ప్రారంభమైంది. కానీ ఈ సిద్ధాంతాలు సంప్రదాయ సమాజశాస్త్ర వేత్తల నుంచి వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. సంప్రదాయ వాదులు ఈ సిద్ధాంతాలను అశాస్త్రీయ సూక్ష్మ సిద్ధాంతాలనే ముద్రవేసి ఎద్దేవా చేశారు. అల్పమైన సూక్ష్మస్థాయి సామాజిక సమస్యలపైనే దృష్టి కేంద్రీకరించడాన్ని, సామాజిక నిర్మితులు, సంస్థలను అలక్ష్యం చేయడాన్ని సంప్రదాయవాదులు తీవ్రంగా విమర్శించారు. ఎథ్నోమెథడాలజీ వికాసం హజర్ల్, షుట్జ్‌ల రచనలలో ప్రముఖ పాత్ర వహించాయి.

మనుషులు వారి దైనందిన జీవితాలలో వారుంటున్న ప్రపంచాన్ని గురించి ఎలా వ్యాఖ్యానించుకుంటారో అనే దాన్ని పునర్నిర్మించడమే సామాజిక శాస్త్రవేత్తల ప్రాథమిక కర్తవ్యమ అన్న విషయంలో షుట్జ్, దృగ్విషయవాదుల దృక్పథంలో సారూప్యత కనిపిస్తుంది.

సమాజశాస్త్రాభివృద్ధిలో ఆల్‌ఫ్రెడ్ షుట్జ్ నిర్వహించిన పాత్ర ప్రాముఖ్య హజర్ల్ తీవ్ర దృగ్విషయవాదాన్ని మాక్స్‌వెబర్ ప్రతిపాదించిన చర్యా సిద్ధాంతాన్ని, అమెరికన్ పరస్పర చర్యావాదాన్ని మేళవించడంలో స్పష్టమవుతుంది. మాక్స్‌వెబర్ సామాజిక చర్యా భావన ప్రతిపాదన గుణదోష పరీక్షతో షుట్జ్ రచన ప్రారంభమైంది. వెబర్ భావనలను స్వీకరించినా షుట్జ్ వెబర్‌ను విమర్శించాడు. ముఖ్యంగా verstehen పద్ధతిని వ్యవహర్తలు సర్వాంగీకారం పొందిన అర్థాలను ఇతర వ్యవహర్తలతో పంచుకొరనే విషయాన్ని విశ్లేషించడానికి వెబర్ ఉపయోగించక పోవడాన్ని షుట్జ్ విమర్శించాడు. అయితే హజర్ల్ మానవుల సహజ దృక్పథ భావనను, జీవిత ప్రపంచ భావనను షుట్జ్ అంగీకరిస్తాడు. అంతేకాక మానవులందరూ ఒకేరకమైన జీవిత ప్రపంచంలో ఉంటూ ఒకేరకమైన అనుభవాలు పొందుతూ ఉంటారనే హజర్ల్ భావాలతో షుట్జ్ ఏకీభవిస్తాడు. మానవుల జీవిత ప్రపంచాన్ని తెలుసుకోకుండా అక్కడెక్కడో ఉన్న బాహ్య ప్రపంచాన్ని సామాజిక శాస్త్రవేత్తలు తెలుసుకోవడం అసంభవమనే హజర్ల్ వాదనను షుట్జ ఆమోదించి సమర్థించాడు. హజర్ల్ "జీవిత ప్రపంచం" భావనను విపులీకరిస్తూ నియమాలను, సామాజిక పద్ధతుల భావననే "జ్ఞానసంపద"గా పేర్కొంటాడు. ఇలాంటి భావ సంపద సహాయంతోనే వాస్తవ ప్రపంచంలో నివశిస్తున్న వ్యక్తులు సంఘటనలను వ్యాఖ్యానిస్తూ ఉంటారని షుట్జ్ వివరించాడు. జోనాథన్ టర్నర్ ఈ జ్ఞాన సంపద ముఖ్య లక్షణాలను వివరించాడు.

## 21.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సామాజిక జీవితానికి సంబంధించిన అతర్వైయుక్తిక ప్రపంచం లక్షణాలను షుట్జ్ ఎలా వివరించాడు.

2. సమాజశాస్త్రం సామాజిక వాస్తవికతను వివరించడంలో ఎందుకు విఫలమయ్యాయు చర్చించండి.

BRAOU

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి

1. షుట్జ్, ఎథ్నొమెథడాలజిస్టుల దృక్కోణంలోని సారూప్యతను వివరించండి.

2. ప్రజలు తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని వ్యాఖ్యానించడంలో షుట్జ్ జ్ఞానసంపదను చర్చించండి.

## 21.9 చదవదగిన పుస్తకాలు


Ritzer, George : The Rise of Micro-Sociological Theory. Sociological Theory, Vol.3. No.1, pp. 88-98, 1985.

Benson, D. and John, A Hughes : The Perspectives of Ethnomethodology, Longman, London, 1983.

Abraham, F.M : Modern Sociological Theory, Oxford University Press, Delhi, 1982.

Turner, Jonathan : The Structure of Sociological Theory, Rawat Publications, Jaipur, 1987.

Psathas, George : "Ethnomethods and Phenomenology". Social Research , Vol 35, pp 500-520. 1968.

Nathanson, Mourice : Alfred Schutz on Social Reality and Socila Science". Social Research, Vol 35, pp. 217-244., 1968.


BRAOU

# భాగం-22: మతం, సామాజిక పరివర్తన-మాక్స్ వెబర్

విషయక్రమం

22.0 ఉద్దేశాలు

22.1 పరిచయం

22.2 మతం, సామాజిక పరివర్తన

22.2.1 వెబర్ ప్రతిపాదించిన సామాజిక చర్య సిద్ధాంతం

22.2.2 ప్రొటెస్టాంటిజమ్, పాశ్చాత్య పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి

22.3 మతం, పెట్టుబడిదారీ వ్యవస్థ-వెబర్ చేసిన గుణదోష పరిశీలన

22.4 వెబర్ సిద్ధాంతం పరిమితులు

22.5 సారాంశం

22.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

22.7 చదవవలసిన పుస్తకాలు

## 22.0 ఉద్దేశాలు

BRAOU

ఈ భాగం చదివిన తరువాత మీరు

- నైతిక, ఆర్థిక, రాజకీయ కార్యకలాపాలపై మానవుని మతపరమైన ప్రవర్తనా ప్రభావాన్ని తెలుసుకుంటారు.
- ప్రవర్తనా ప్రభావం సామాజిక ప్రవర్తనకు ఎలా దారితీస్తుందో పరిశీలిస్తారు.

## 22.1 పరిచయం

మాక్స్ వెబర్ (1864-1920) జర్మన్ సమాజశాస్త్ర వేత్తలలో ప్రముఖుడు. వెబర్ 1874లో ఫ్రీబర్గ్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అధ్యయనం చేశాడు. అతను తన సిద్ధాంత వ్యాసం "Trading Companies of the Middle Ages"ను హైడల్‌బర్గ్ విశ్వవిద్యాలయానికి సమర్పించాడు. ఇతను 1894లో ఫ్రీబర్గ్ విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర ఆచార్యుడిగా పనిచేశాడు. 1900,1903 మధ్య కాలంలో మానసికంగా దెబ్బతినేవరకూ ఇతని రచనా వ్యాసంగం చురుకుగా సాగింది. సమకాలీకులపై విమర్శలు గుప్పించేవాడు. వెబర్ ఆనాటి ధోరణులతో రాజీ పడేవాడుకాదు.

వెబర్ అర్థశాస్త్రాన్ని గురించి కూడా తీవ్రంగా ఆలోచించాడు. అయితే "Sociology of Religion" అన్న రచనే అతని కలంనుంచి వెలువడిన మణిపూసగా గుర్తించడం జరిగింది. వెబర్ ముఖ్యంగా అధ్యయనం చేసింది నీతి, అర్థశాస్త్రాలపై మతం ప్రభావం ఎలా ఉంటుందోననే అంశం. వెబర్ రచనల్లో ప్రముఖమైన "Sociology of Religion" అనే అతని Protestant Ethic and Spirit of Capitalism ప్రస్ఫుటమవుతాయి.

## 22.2 మతం సామాజిక పరివర్తన

 మతం తాలూకు ముఖ్యమైన అంశాలను, సారాంశాన్ని అధ్యయనం చేయడం సమాజశాస్త్రం పనికాదు. అయితే

మత విశ్వాసం గల వ్యక్తుల ప్రవర్తన సామాజిక వేత్తలకు ఆసక్తి కలిగించే అధ్యయనాంశమై ఉంటుంది. వెబర్ అభిప్రాయంలో సమాజశాస్త్రవేత్త నైతిక, ఆర్థిక, రాజకీయ లేదా కళాత్మక రంగాలలోని మానవుని కార్యకలాపాలపై మత ప్రభావాన్ని విశ్లేషించి, అవగాహన ఏర్పరుచుకోవాల్సి ఉంటుంది. వివిధ మతాలు ప్రభోదించే విశ్వాసాలు, విలువల మధ్య నెలకొన్న సంఘర్షణలను, వైరుధ్యాలను విశ్లేషించి, వివరించడం సమాజశాస్త్ర వేత్తల బాధ్యత.

మతం, మానవుని ఇతర కార్యకలాపాల మధ్య తలెత్తేఅత అనేక ఉద్రిక్తతలపైనే వెబర్ ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించాడు. ఈ అంశాన్ని గురించి వెబర్ తన "Religions Rejections of the World" వ్యాసంలో ప్రముఖంగా చర్చించాడు. మతం, మానవ కార్యకలాపాల మధ్య ఉద్రిక్తతలు మార్పులకు అనువుగా ఉండే మతాలలో అరుదుగా కనిపిస్తాయని వెబర్ పేర్కొన్నాడు. అయితే ఇలాంటి ఉద్రిక్తతలు మోక్షం ప్రాప్తిస్తుందని విశ్వసించే మతాలలో తీవ్రరూపంలో దర్శనమిస్తాయని వెబర్ తెలిపాడు. ఈ రకమైన ఉద్రిక్తతలు సముదాయంలో నెలకొని ఉన్న సంఘర్షణలకు సంబంధించినవై వుంటాయి. మోక్షప్రాప్తిని బోధించే మతం సర్వసాధారణంగా సామాజిక విప్లవ లక్షణాలున్నదై ఉంటుంది. ఇటువంటి మతం నూతన ప్రమాణాల ఆధారంగా ఒక నూతన సముదాయాన్ని ఏర్పరచాలని ఆకాంక్షిస్తుంది. తనను అనుసరించడానికి తల్లి దండ్రులను, కుటుంబాన్ని త్యజించలేనివారు తన శిష్యులు కావడానికి అనర్హులని జీసస్ ప్రకటించడాన్ని దీన్ని వివరించడానికి దృష్టాంతంగా పేర్కొనవచ్చు.

వెబర్ పేర్కొన్న ఉద్రిక్తత మరో లక్షణం మతానికి, ఆర్థికాంశాలకు మధ్య చెలరేగే సంఘర్షణ. ఈ సంఘర్షణ అనేక రూపాల్లో కనిపిస్తుంది. వడ్డీ, అధికవడ్డీ వసూలు చేయడం, ముష్టి వెయ్యడం, కనీస అవసరాలతోనే సాగే జీవన విధానం, దైవానికి అయిష్టమైన వ్యాపార వాణిజ్యాల పట్ల వైముఖ్యం వంటివి ఆ ప్రాపంచిక సూత్రాలపైన ప్రేమ, అభిమానాలకు వ్యాపార, వాణిజ్యాలపై ఆధారపడిన ఆధునిక జీవన సరళికి మధ్య ప్రత్యక్ష వైరుధ్యమే వెబర్ ప్రస్తావించిన ఉద్రిక్తత రెండో లక్షణం. ఆధునిక ఆర్థిక జీవితం అనేది ఆశలు, ఆశయాల సంఘర్షణలతో నిండి ఉంటుంది. మార్కెట్‌కు సంబంధించిన హేతుబద్ధమైన అంచనాల మధ్య విభేదాల మూలంగానే సంఘర్షణ ఏర్పడుతుంది. అసలు పెట్టుబడిదారీ విధాన భావన, మోక్షప్రాప్తి కోసమే మానవ ప్రయత్నం సాగాలని విశ్వసించే మతాలు, తీవ్రంగా విభేదిస్తాయి. దీనికి కారణం పెట్టుబడిదారి వ్యవస్థ ప్రధానోద్దేశం అధిక లాభాలు అర్జించడం కావడమే. అన్ని మతాలు ఆర్థిక విషయాలలో ఎంతో కొంత సర్దుబాటు చేసుకున్నాయనే చెప్పాలి. కానీ సువ్యవస్థితమైన చర్చి ప్యూరిటన్ కాథలిక్‌లు సార్వజనీనమైన ప్రేమ తత్వాన్ని వదిలి మానవసేవే మాధవసే అనే తత్వాన్ని ప్రభోదించారు. దీనివల్ల మతం, ఆర్థికాంశాల మధ్య వైరుధ్యాన్ని తొలగించడంలో వారు కృతకృత్యులయ్యారని వెబర్ అంటాడు. మతం, రాజకీయాలు, కళలు, విజ్ఞాన సముపార్జన మధ్య పొడసూపే సంఘర్షణలను గురించి కూడా వెబర్ తీవ్రంగా ఆలోచించాడు.

BRAOU

ప్రస్తుతమున్న సముదాయాలు, ఆర్థికాంశాలు, మతం మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు సంబంధించిన వెబర్ విశ్లేషణ సామాజిక పరివర్తనపై మతం ప్రభావాన్ని స్పష్టం చేస్తుంది. మతం విషయంలో వెబర్ దృక్పథం మార్క్స్ దృక్పథానికి పూర్తి విరుద్ధం. మతమనేది సమాజపు ఉపరితల నిర్మాణమని దీన్ని సమాజపు అంతర్గత వ్యవస్థ నిర్ణయిస్తుందని మార్క్స్ భావిస్తాడు. అందుకే ఉత్పత్తి శక్తులలో మార్పులు మత విశ్వాసాలు, ఆచరణలలో ప్రతిబింబిస్తాయని అభిప్రాయ పడ్డాడు. కానీ ఆర్థికశక్తులే ఎప్పుడూ మతాన్ని ప్రభావితం చేస్తూ ఉంటాయనే వాదనను వెబర్ తోసిపుచ్చాడు. కొన్ని కొన్ని సమయాలలో కొన్నికొన్ని ప్రదేశాలలో ఆర్థిక శక్తులు మత విశ్వాసాలను ప్రభావితం చేసి కొత్త రూపు కల్పించవచ్చుననే అంశాన్ని వెబర్ కాదనలేదు. కానీ కొన్ని పరిస్థితులలో దీనికి భిన్నంగా కూడా జరగవచ్చునంటాడు. అంటే మత విశ్వాసాలు ఆర్థిక ప్రవర్తనపై ప్రభావం చూపవచ్చునన్నమాట.

## 22.2.1 వెబర్-సామాజిక చర్య

వెబర్ ప్రతిపాదించిన సామాజిక చర్య సిద్ధాంతం మానవ చర్యలన్నింటిని అర్థాలే నడిపిస్తాయన్న అంశంపై ఆధారపడి ఉంది. అందువల్ల మానవచర్యలను అర్థం చేసుకోవడానికి, వివరించడానికి వాటివెనుకనున్న అర్థాలను, ఉద్దేశాలను పరిశీలించాల్సి ఉంటుంది. వివిధ చర్యల మధ్య తారతమ్యాలను వాటికి ఆధారమైన అర్థాలు, ఉద్దేశాలను బట్టి గుర్తించవచ్చునని వెబర్ అభిప్రాయం. ఈ అర్థాలు: ప్రభావికతా చర్యలు (affective actions),

ఆవేశాత్మక చర్యలు(emotional actions), సాంప్రదాయక చర్యలు(traditional actions), హేతుబద్ధ చర్యలు(rational actions). ప్రభావికతా చర్యలనేవి ఒక నిర్దిష్ట సమయంలో మానవుడు లోనయ్యే ఆవేశం ఫలితంగా ఏర్పడతాయి. నిగ్రహం కోల్పోయినప్పుడు మనిషి ఎదుటివాడిని దుర్భాషలాడటంగానీ, శారీరకంగా హింసించడంగానీ చేయడాన్ని ప్రభావికతా చర్యలకు ఉదాహరణగా చెప్పవచ్చు. సాంప్రదాయక చర్యలు సువ్యవస్థితమైన ఆచార వ్యవహారాలపై ఆధారపడి ఉంటాయి. మనిషి కొన్ని సమయాలలో ఒక తీరులో ప్రవర్తించడమనేది అలవాటు వల్ల ఉండవచ్చు. ఇలాంటి సందర్భంలో తాను ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నాడో వ్యక్తికి తెలియకుండానే ప్రవర్తిస్తుంటాడు. అదే హేతుబద్ధ చర్యల విషయంలో తన లక్షణమేమిటో తెలుసుకొని ప్రవర్తిస్తాడు. ఒక ఆఫీసు మేనేజర్ ఉత్పాదకతను పెంచడానికి, ఒక భవన నిర్మాత ఫ్లాట్స్ సముధాయాన్ని నిర్మించడానికి తీసుకొనే నిర్ణయాలు హేతుబద్ధతపై ఆధారపడి ఉంటాయి. ఈ రెండు ఉదాహరణలలో తమ లక్ష్యమేమిటో నిర్దిష్టంగా తెలిసి ఉంటుంది.

హేతుబద్ధమైన చర్యల విషయంలో లక్ష్యసాధనకు ఉన్న భిన్న మార్గాలేవో ముందే తెలిసి ఉంటాయి. కనుక సరిఅయిన పద్ధతిని ఎంచుకోవడమే మనిషి చేయవలసిన పని. అంటే భవన నిర్మాణం చేపట్టే వ్యక్తి నిర్మాణానికి తగిన స్థలాలలో సరిఅయినదాన్ని ఎంచుకోవడం, ముడి సరుకు, నిర్మాణంలో అనుసరించాల్సిన సాంకేతిక పద్ధతుల వివరాలను, అందుకు అవసరమైన శ్రామికుల సంఖ్యను, వ్యవసాయాన్ని ముందే అంచనా వేసుకొని లక్ష్యాన్ని సాధించడానికి పూనుకుంటాడు. ఇలాంటి వాటి విషయంలో అయ్యే ఖర్చులో లాభనష్టాలను బేరీజువేసుకోవడం అవసరం. అట్లాంటి సందర్భాలలో వ్యక్తి చర్యలు హేతుబద్ధమైనవని చెప్పాలి. ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించడానికి అందుబాటులో ఉన్న అన్ని సాధనాలను పరీక్షించి అత్యంత అనువైన దాన్ని ఎన్నుకొని లక్ష్యసాధనకు పూనుకోవడమే హేతుబద్ధ చర్య అవుతుందని వెబర్ వివరించాడు.

ఆధునిక పారిశ్రామిక సమాజంలో హేతుబద్ధమైన చర్య అత్యంత ప్రముఖమైన ప్రవర్తన విధానమైందని వెబర్ విశ్వసించాడు. ఈ వాస్తవం అనేక రంగాలలో కనిపిస్తుంది. రాజ్యపాలన, వ్యాపారరంగం, విద్య, శాస్త్రరంగాలలోనేకాక పాశ్చాత్య సాంప్రదాయిక సంగీతంలో కూడా కనిపిస్తుంది. వెబర్ పెరుగుతున్న సహజచర్యల ఆధిక్యతనే హేతుబద్ధీకరణ ప్రక్రియ(process of rationalization)గా గుర్తించాడు. ఈ సిద్ధాంతం దృష్ట్యా ప్రపంచ దృక్పథాన్ని సహృదయంతో అర్థం చేసుకోగలిగితేనే సహజ చర్యను సరిగా అర్థం చేసుకోవచ్చు. వ్యక్తులకున్న ప్రాపంచిక దృష్టి ద్వారానే వాళ్ల చర్యలకు మూలమై నడిపించే అర్థాలు, లక్ష్యాలు, ప్రేరణలను గురించి తెలుసుకుంటారు. ప్రాపంచిక దృష్టిలో మతమనేది ఒక ముఖ్యమైన భాగం(అంశం)గా ఉంటుంది. కొన్ని దేశకాల పరిస్థితులలో మతపరమైన అర్థాలు, ప్రయోజనాలే అనేకమైన, బహువిస్తృతమైన మేరలో వ్యక్తుల చర్యలకు మూలాధారమవుతాయి. కొన్ని సందర్భాలలో మత విశ్వాసాలు ఆర్థిక చర్యలకు మార్గదర్శకాలవుతాయికూడా.

## 22.2.2 ప్రొటెస్టాంటిజమ్, పాశ్చాత్య పారిశ్రామిక పెట్టుబడిదారి వ్యవస్థ అభివృద్ధి

వెబర్ రచించిన "The Protestant Ethic and The Spirit of Capitalism" అనే ప్రసిద్ధ గ్రంథం మతం సామాజిక పరివర్తనకు ప్రామాణికమైన ఉదాహరణ. ఈ గ్రంథం రెండు వ్యాసాలుగా 1904, 1905లలో ప్రచురితమైంది. వెబర్ తన గ్రంథంలో అతిసాధారణము, (సహజం), ప్రాథమికమైన అంశాన్ని వివరించడానికి ప్రయత్నించాడు. పెట్టుబడిదారీ నాగరికత వికాసానికి దోహదం చేసిన మానసిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని పరిశీలించడాన్ని దీనితో గుర్తించవచ్చు. పెట్టుబడిదారి వ్యవస్థకున్న లక్షణాలు: భారీ పరిశ్రమలు నెలకొల్పడం, ద్రవ్య వనరులపై గుత్తాధిపత్యం, స్పెక్యులేషన్ ద్వారా భారీ లాభాలను ఆర్జించడం, ఋణాలివ్వడం, వాణిజ్య సంస్థలు నెలకొల్పడం, ఈ వ్యవస్థ మానవుని చరిత్ర అంత పురాతనమైనది. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక ఆర్థిక వ్యవస్థగా చట్టబద్ధంగా వేతనాలు ఆర్జించే వారితో కూడిన వ్యవస్థ ఆధారంగా ఏర్పడింది. ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యం లాభాలు ఆర్జించడం, సమాజం తాలూకు ప్రతీ రంగంలో తన ఆధిపత్యం, అధికార ముద్ర వేయడం. పెట్టుబడిదారీ వ్యవస్థ స్థాపన శతాబ్దాల తరబడి సాగిన పోరాటాల అనంతరమే సాధ్యమైంది. ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థకు ఆర్థిక ప్రవర్తనా నియమాలు అత్యంత ముఖ్యమైనవి. ఈ నియమాలు సమాజం అంగీకరించినా, ఐరోపా ఖండం ఆమోదముద్ర లభించిన నీతిమంతమైన సత్సంప్రదాయాలకు కేవలం విరుద్ధం. మార్గదర్శకులు, పథనిర్దేశకులు



BRAOU

సంప్రదాయాన్ని ఎదిరించడానికి ఏ శక్తులు, ప్రభావాలు కారణమయ్యాయి? సంప్రదాయాన్ని విడనాడి దాని స్థానంలో ఆత్మవిశ్వాసం, సూత్రాలను ఏర్పరచుకునేటట్లు చేసిన శక్తులేవి?

లాభార్జన, లాభాలు నిరంతరంగా పెంచుకుంటూ పోయే దూరదృష్టే పెట్టుబడిదారి వ్యవస్థ లక్షణాలని వెబర్ పేర్కొన్నాడు. పెట్టుబడిదారు నెలకొల్పే పారిశ్రామిక సంస్థలు హేతుబద్ధమైన ఉద్యోగి బృంద సామ్యంపై ఆధారపడి నడుస్తాయి. వ్యయం అంచనాలు, లాభావకాశాల మదింపు ఆధారంగానే వ్యాపార లావాదేవీలు నిర్వహించడం జరుగుతుంది. పెట్టుబడిదారీ విధానంలో అంతర్భాగమే "పెట్టుబడిదారీ స్ఫూర్తి". భావజాలం, నీతి, విలువలు అని అర్థం. పెట్టుబడిదారీ స్ఫూర్తి అంటే కేవలం డబ్బు సంపాదించడమే కాదు. అది ఒక జీవన విధానం. దానికి నైతిక విలువలు, బాధ్యతలు ఉంటాయి. సామాజిక ప్రగతి అనేది సమాజపు అట్టడుగుస్థాయినుండి ప్రారంభం అవుతుందనీ, ఆర్థికాభివృద్ధి వివిధ దశలలో శక్తి, సంపదల సృష్టేకాక నూతన వర్గాల ఆవిర్భావం అన్న ఆచార్య హెన్రీ పిరన్నీ అభిప్రాయాలు వెబర్ అభిప్రాయాల మధ్య సాదృశ్యత కనబడుతుంది. భూ యజమాన్యం, వాణిజ్య వ్యాపారాలు సాగుతున్న కులీన పాలనా సమయంలోనే ఆధునిక సామాజిక వ్యవస్థ స్థాపన జరిగిందని వెబర్ అభిప్రాయం. సమాజంలో ఏర్పడిన ఘర్షణలకు మతం ఒక శక్తి ప్రదాయకమైన ఔషధంగా పనిచేస్తుంది. సంపద సమకూర్చుకోవడం అనేది ఒక ప్రయోజనకారే కాకుండా ఒక విధి అని కూడా స్పష్టం చేశాడు. స్వ ప్రయోజనాకాంక్ష తీవ్రత అంత ప్రముఖమైనది కాదు. ఇలాంటి కాంక్ష మానవ చరిత్ర అన్ని కాలాలలోనూ ఉంటూనే ఉంది. ఈ కాంక్షను తొలి రోజుల్లో దుర్గుణంగా పరిగణిస్తే సామాజిక పరిణామం వల్ల వీటినే ఆర్థిక సద్గుణాలుగా గుర్తించారు.

వెబర్ ప్రధాన ఆసక్తి ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి ఆలోచనా విధానం రూపొందించడంతో మతం నిర్వచించిన పాత్రేమిటో తెలుసుకోవడం. ఈ అన్వేషణలో వెబర్ అస్సెటిక్ ప్రొటెస్టాంటిజమ్ (assetic protestantism)ను పరిశీలించాడు. ఈ అస్సెటిక్ ప్రొటెస్టాంటిజమ్ పాశ్చాత్య పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావానికి పూర్వమే ప్రారంభమైనట్లు వెబర్ పేర్కొంటాడు. వెబర్ అనేక మతాలను ముఖ్యంగా, 17వ శతాబ్దంలో పశ్చిమ ఐరోపాలో ఆవిర్భవించిన కాల్వినిజమ్‌ను అధ్యయనం చేశాడు. వెబర్ అభిప్రాయంలో పెట్టుబడిదారీ వ్యవస్థ కాల్వినిస్ట్ ధర్మశాస్త్రం ప్రతిరూపం.

BRAOU

వెబర్ ప్రతిపాదించిన సిద్ధాంతంలో అతి ముఖ్యమైన అంశం "a calling" అన్నమాట ద్వారా వ్యక్తమవుతుంది. లూథర్ దృష్టిలో "స్వర్గమే వ్యక్తి జీవిత స్థితిని నిర్ధారిస్తుంది. దీన్ని వ్యతిరేకించడం అపవిత్ర చర్య అవుతుంది". (The State of life of an individual has been set by heaven. It was impuise to rebel against it). కాలింగ్ అనేది మనిషి జన్మించే పరిస్థితి కాదు. అది మనిషి ఎన్నుకోవలసిన ఒక జీవన సరళి. దాన్ని మత పరమైన బాధ్యతగా అనుసరించాలి. ఈ సూత్రాలే కాల్వినిస్ట్ తత్వంలో ప్రముఖమైనవని వెబర్ వాదించాడు. కాల్వినిస్ట్ ధర్మ శాస్త్రం అంతకు ముందు ఆత్మకు హాని కలిగిస్తాయని భావించిన వాణిజ్య వ్యాపారాలకు మాన్యతనిస్తుంది. శ్రమించడం అనేది కేవలం ఆర్థిక సాధనం మాత్రమే కాదు. అది ఒక తాత్విక ధ్యేయం కూడా అని కాల్వినిస్ట్ ధర్మశాస్త్రం స్పష్టం చేస్తుంది.

కాలాన్ని వృథా చేయడం, సోమరితనం, ఉబుసుపోక కబుర్లు చెప్పడం, అవసరానికి మించిన నిద్రపోవడం (మనిషికి 6-8 గంటలకంటే ఎక్కువ నిద్రపోవడం) వీటిని కాల్వినిస్ట్‌లు ఖండించారు. వివాహేతర లైంగికానందాన్ని కాల్వినిస్ట్‌లు నిరసించారు. ఆటపాటలు, వినోదాలు అనేవి చక్కటి ఆరోగ్యానికి, శారీరక దృఢతకు దోహదం చేస్తాయని వారు భావించారు. అంత ఎందుకు ఒక వ్యక్తి ఎన్నుకొన్న జీవిత మార్గం నుంచి తప్పుదోవ పట్టించేవి, అతని ప్రయత్నాలకు విఘాతం కలిగించేవాటన్నింటిని వారు నిరసించారు. పైన పేర్కొన్న మార్గ దర్శక సూత్రాలను అనుసరించి జీవన వ్యాపారం సాగిస్తే వ్యక్తి భగవత్ కృపాకటాక్షాలకు దూరం కాకపోగా దైవానుగ్రహానికి పాత్రుడవుతాడు. అందుకే ధనార్జన, సంపదను పోగుచేయడం అనేవి ఒకనాడు మత ప్రబోధాలకు విరుద్ధమైనవిఅని భావించినా కాల్వినిజమ్ ప్రచారంతో వాటికి మన్నన లభించింది. వాటిని దైవకృప సంపాదించడంలో సహాయకారులుగా పరిగణించడం జరిగింది. అస్సెటిక్ ప్రొటెస్టాంటిజమ్ పెట్టుబడిదారీ వ్యవస్థ వికాసానికి ఎంతో తోడ్పడిందని వెబర్ అభిప్రాయపడ్డాడు. ఒక క్రమాన్ననుసరించి, నియమబద్ధంగా కొనసాగే ఏ వృత్తి, వ్యాపారాలైనా హేతుబద్ధమైన పెట్టుబడిదారీ వ్యవస్థను ప్రోత్సహిస్తాయంటాడు. అవిశ్రాంతంగా, నిరంతరాయంగా, క్రమబద్ధంగా నిర్వహించే పని పెట్టుబడి దారీ తత్వాన్ని ప్రోదిచేస్తుందని వెబర్ నమ్మకం.

జీవితంలో అనుసరించే పొటెస్టాంట్ యూనిఫార్మిటీ అనేది పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి ప్రమాణీకరణకు ఎంతో తోడ్పడుతుంది. స్థిరమైన వృత్తి, జీవన వ్యాపారం అనేది ఆధునిక కాలపు శ్రమ ప్రత్యేకీకరణ, శ్రమ విభజనలను సమర్థిస్తుంది. చివరిగా సంపద సృష్టి, దాని వినియోగం విషయంలో చేసే ఆలోచనలు పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహిస్తాయి.

అసెటిక్ ప్రొటెస్టాంటిజమ్ పాశ్చాత్య పెట్టుబడిదారీ వ్యవస్థకంటే ముందే మొదలైందని వెబర్ పేర్కొన్నాడు. ప్రొటెస్టాంట్ ఎథిక్ అంటే ప్రవచనం పట్ల అలవరచుకొనే ఒక నైతిక దృక్పథం. పెట్టుబడిదారీ తత్వం వికాసానికి ఎంతో తోడ్పడింది. పశ్చిమ ఐరోపాలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావ వికాసాలలో పొటెస్టాంటిజమ్ ప్రముఖపాత్ర వహించిందని వెబర్ అభిప్రాయం.

వెబర్ మతపరమైన అతివాదం, ఆర్థిక పురోభివృద్ధుల మధ్య సంబంధాన్ని నొక్కి చెప్పాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణానికి మత ఉద్యమాలు అనుకూల పరిస్థితులు కల్పించాయని వెబర్ తన వ్యాసంలో పేర్కొన్నాడు.

## 22.3 మతం పెట్టుబడిదారీ వ్యవస్థలకు సంబంధించి వెబర్ వాదం-గుణదోష పరీక్ష

మతం, పెట్టుబడిదారీ వ్యవస్థలకు సంబంధించి వెబర్ చేసిన సిద్ధాంత ప్రతిపాదనలు తీవ్ర పరిశోధనలకు స్ఫూర్తినిచ్చాయి. చరిత్రకారులైన టౌనీ, ట్రావెర్‌లు వెబర్ సిద్ధాంతానికి సవరణలు, ప్రత్యమ్నాయాలు సూచించడానికి ప్రయత్నించారు.

ప్రొటెస్టాంటిజమే పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావానికి ఏకైక కారణమని వెబర్ ఎన్నడూ చెప్పలేదు. ఇతని సిద్ధాంత ప్రతిపాదనలు మానవ చరిత్రలోని అనేక సంఘటనలకు ఆర్థికాంశాలే ప్రధానకారణాలు అనే మార్క్స్ సిద్ధాంతానికి భిన్నమైన, ప్రత్యమ్నాయమైన ప్రతిపాదనలు మాత్రమే. అంటే మార్క్స్ దృక్పథానికి ప్రతిస్పందించి తద్భిన్నమైన ప్రత్యామ్నాయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించడమే అతని ప్రయత్నంలోని అంతరార్థమని గుర్తుంచుకోవాలి. మార్క్సిస్టు ఏకపక్షవాదం అనేది శాస్త్రసమ్మతము, సర్వజనఅంగీకారయోగ్యము అయినది కాదని లోకానికి తెలియజేయడమే ప్రధాన ధ్యేయంగా కనిపిస్తుంది. ప్రొటెస్టాంటిజమ్, పెట్టుబడిదారీ వ్యవస్థల మధ్య ఉన్న కార్యాకరణ సంబంధాన్ని కేవలం ఒక యాంత్రిక సంబంధంగా పరిగణించకూడదని వెబర్ అంటాడు. సామాజిక సమన్విత సంస్కృతి అనేది మానవ జీవితాలను హస్తగతుబద్ధం చేయడానికి ఉపకరించే ఒకానొక సాధనమని, అది పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టికి తోడ్పడిందని వెబర్ అభిప్రాయం. అంతేకానీ పొటెస్టాంటిజమ్ ఒక్కటే పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావ వికాసాలకు కారణభూతమైన అంశమని వెబర్ అభిప్రాయం కాదు. అరోన్ అనే శాస్త్రవేత్త ఈ విషయంలో వెబర్ అభిప్రాయాలు స్పష్టం చేస్తూ ఇలా అన్నాడు. "పొటెస్టాంటిజమ్ పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడటానికి ఏకైక కారణం కాదు. అది అనేక కారణాలలో ఒకటి మాత్రమే. పెట్టుబడిదారీ వ్యవస్థ విభిన్న లక్షణాలలో ఇదికూడా ఒకటి... పాశ్చాత్య పెట్టుబడిదారీ వ్యవస్థకు మాత్రమే పరిమితమైన కొన్ని లక్షణాలనుతీసుకొని వెబర్ విశ్లేషించాడు. అంటే అలాంటి వ్యవస్థ మనం పరిగణనలోకి తీసుకునే పెట్టుబడిదారీ వ్యవస్థ భావనను బట్టి మారుతుంది.

పారిశ్రామిక సమాజంలో సాగే చర్యల విషయంలో వెబర్ చేసిన వ్యాఖ్యానాన్ని అనేక మంది సమాజ శాస్త్రవేత్తలు ఆమోదించారు. "Religion in secular Society"అనే రచనలో బ్రేయాన్ ఇలా పేర్కొన్నాడు. 'మతపరమైన ఆలోచనలలో జరిగే మార్పులే కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. మతోద్దేశంతో మనుషుల ప్రవర్తన అతనిపై స్వల్పంగానే ఉంటుంది. అనుభవం ఆధారంగానే ప్రపంచాన్ని అవలోకించడం, శోధించడం జరుగుతుంది. విల్సన్ ప్రకారం హేతుబద్ధమైన ఆలోచనా విధానానికి ఆధార భూతమైన అంశాలు నాలుగు. అవి: 1. అస్సెటిక్ ప్రొటెస్టాంటిజమ్ : ఇది ఆచరణీయము, హేతుబద్ధము, నియంత్రితము, ఆవేశాతిశయ వ్యతిరేకం అయిన నైతిక వ్యవస్థను సూచిస్తుంది. 2. హేతుబద్ధతపై నిర్మితమైన సమాజం: ఈ సమాజ సభ్యులు జాతీయ సంస్థలలో అంటే సినిమాలు, ప్రజాసేవ సంస్థలు, ప్రభుత్వం, రాజ్యపాలన వంటివి పాల్గొనడాన్ని ప్రోత్సహిస్తుంది. సామాజికులు అందరూ హేతుబద్ధంగా ప్రవర్తించాలని నిర్దేశిస్తుంది, నియంత్రిస్తుంది. 3. భౌతిక, జైవిక, సమాజశాస్త్రాలన్నీ హేతువుమీద ఆధారపడ్డవే కానీ కేవలం విశ్వాసం వల్లనే వాటి వికాసం జరుగలేదు. ఇలాంటి పరిణామాలు శాస్త్రీయ దృక్పథం సహాయంతో భౌతిక ప్రపంచాన్ని సరిగ్గా



BRAOU

అవగాహన చేసుకోవడం సాధ్యమైంది. 4. హేతుబద్ధమైన సిద్ధాంతాలు, వ్యవస్థలు సామాజిక సమస్యలను పరిష్కరించడానికి వెలువడ్డాయి. ఉదాహరణకు కమ్యూనిజం, కార్మిక సంఘాలు సమాజానికి ఎదురయ్యే సమస్యలకు రాజకీయ పరిష్కారాలు సూచిస్తాయి.దీనితో పోలిస్తే వర్తమానంలో మన ప్రవర్తనను బట్టి జీవిత అంతం తరువాత పారితోషికం, శిక్షలు అందుతాయని బోధించే మతాలు జీవితకాలంలో ఎదురయ్యే అనేక సామాజిక, రాజకీయ సమస్యలకు తగిన పరిష్కార మార్గాలు చూపలేవు.

పీటర్ బర్జర్ అన్న సమాజశాస్త్రవేత్త వెబర్, విల్సన్‌ల ప్రతిపాదనలను "జ్ఞానం తాలూకు సమాజశాస్త్రం దృష్ట్యా కొంత వివరించాడు. పాశ్చాత్య సమాజాలలోని వ్యక్తులు ప్రపంచాన్ని తమ జీవితాలను అర్థం చేసుకోవడానికి మతపరమైన వ్యాఖ్యానాలపై ఆధారపడరు. ఇలాంటి దృక్పథం అనుసరించడం వల్ల జరిగిన పరిణామమే "సెక్యులరైజేషన్ ఆఫ్ కాన్షియస్‌నెస్ లేదా చైతన్య లౌకికీకరణ". ఆధునిక సమాజం, లౌకికీకరణకు హేతుబద్ధ ప్రక్రియ కీలకమైంది. హేతుబద్ధ ప్రపంచం, విశ్వాసాన్నితోసిపుచ్చుతుంది. విశ్వాసమే మతానికి ప్రదానమైన ఆధారం. హేతుబద్ధత అనేది మార్మికతను, ఇంద్రజాలాన్ని, మతాధికారాన్ని తొలగిస్తుంది.

సమాజంలో మతానికి, ఆర్థిక కార్యకలాపాలకు సంబంధం ఉంటుందన్న వెబర్ ప్రతిపాదనను స్టేనిస్లావ్ ఎంద్రెస్కీ వెబర్ ప్రతిపాదనలలో అతి ముఖ్యమైనదిగా పేర్కొన్నాడు. వివిధ కాలాలలోని మానవ సముదాయాల పనితీరును, ఆలోచనా సరళిని నిశితంగా పరిశీలించి నిర్మితీయ చరితను ప్రారంభించి సమాజశాస్త్ర వికాసానికి ఎంతో తోడ్పడ్డాడు. ఈ విషయంలో వెబర్ కాకలు తీరిన చరిత్రకారుల పాండిత్య ప్రతిభను మించిన ప్రతిభ కనబరిచాడు.

కాల్వినిజమ్ సుగుణాలే పెట్టుబడిదారీ వ్యవస్థ వికాసానికి తోడ్పడ్డాయనే వాదనకు పుష్టినిస్తూ స్టానిస్లావ్ రెండు అంశాలను పేర్కొన్నాడు. అవి: 1. సామరస్యం(harmony), 2. సహపరివర్తన(co-variation). కొన్ని ప్రత్యేక లక్షణాలున్న వ్యక్తుల వల్లనే పెట్టుబడిదారీ వ్యవస్థ వికాసం సాధ్యమవుతుందని, ఒక నిర్దిష్టమైన తెగవారిలోనే ఈ లక్షణాలుంటాయని సామసరస్య భావన స్పష్టం చేస్తుంది. సంపదనను పోగుచేసే గుణమున్నవారున్నప్పుడే పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడుతుంది. కాల్వినిస్టుల తరహా (ప్రచారం చేసిన) పొటెస్టాంటిజమ్ పొదుపరితనాన్ని ప్రభోదిస్తుంది.

కాల్వినిజమ్ 'పనే పరమాత్మ' అని ప్రభోదిస్తుంది. దీన్నే వెబర్ ప్రాపంచిక సన్యాసంగా పేర్కొన్నాడు. సంస్కరణోధ్యమం వడ్డీకి డబ్బు ఇవ్వడానిఇక చట్టబద్ధత కల్పించడం ద్వారా ఉత్పాదకత రంగాలలో పెట్టుబడికి అవకాశాలు కల్పించింది.

సహపరివర్తన వాదం వెబర్ సిద్ధాంతాన్ని బలపరుస్తుంది. ఒక రాజ్యంలోని విభిన్న సముదాయాలను కాక విభిన్న రాజ్యాలనే తులనాత్మకంగా పరిశీలించాలి అనే వెబర్ ప్రతిపాదనను సహపరివర్తన వాదం బలపరుస్తుంది.

చివరిగా, పెట్టుబడిదారీ వ్యవస్థ వికాసానికి ప్రొటెస్టాంటిజమ్ ఏకైక కారణం కాదు. అనేక కారణాలలో ఒకటి అన్న వెబర్ వాదనను స్టానిస్లావ్ బలపరిచాడు.

మతవిశ్వాసాలు సామాజిక సంస్థలు సామాన్య మనోవైజ్ఞానిక దృక్పథ రూపం అన్న వెబర్ అభిప్రాయంతో టౌనీ అంగీకరించాడు. ఇలాంటి భావన వినూత్నమైందిగా ఆయన పేర్కొన్నాడు.

మత తీవ్రవాదం ఆర్థిక పురోగతులకున్న సంబంధాన్ని నొక్కి చెప్పడం ఎందరో రచయితలకు భావస్ఫోరకమైంది. ఈవిషయాన్నే వెబర్ ఒక తాత్విక అంతర్ దృష్టితో అవలోకించాడని చెప్పాలి.

## 22.4 వెబర్ సిద్ధాంతం-పరిమితులు

మతం విషయంలో వెబర్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రసిద్ధులైన సమాజ శాస్త్రవేత్తల ఆమోదం, మన్ననలు పొదినా ఆ సిద్ధాంతంలో కొన్ని లోపాలున్నట్లు విమర్శకులు భావించారు. ఒక నూతన భావాన్నో, సిద్ధాంతాన్నో ప్రతిపాదించడం

BRAOU

ద్వారా అన్ని విషయాల అవగాహన సుసాధ్యమవుతుందని భావించడం జరుగుతూ ఉంటుంది. ఈ రకమైన లోపమే వెబర్‌లో కూడా కనిపిస్తుందని టావెనీ పేర్కొన్నాడు. అంతేకాక అసలే అస్పష్టంగా ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థ భావనను ఎక్కువగా సరళీకరించిన వెబర్ దానికి పరిమిత అర్థం ఆపాదించాడనేది మరో విమర్శ. పెట్టుబడిదారీ పరిశ్రమలు, మతపరమైన మార్పులు పెట్టుబడిదారీ వ్యవస్థను సృష్టించేదాకా ఆగాల్సి వచ్చిందనే వెబర్ వాదం కొంత కృత్రిమంగా ఉందనే విమర్శకూడా వచ్చింది. కానీ ఆర్థిక రంగంలో జరిగిన మార్పులు, సాగిన ఉద్యమాల వల్ల మతంలో కూడా మార్పులు రావడానికి అవకాశముంటుందని కూడా భావించాడు.

ఆర్థిక నీతికి సంబంధించి కాల్వినిస్టుల అభిప్రాయాలలోని మార్పులను గురించి వెబర్ ప్రస్తావించాడు. ఆమార్పులు కేవలం కాల్వినిస్ట్ మేధావులకే పరిమితం కాలేదనేది యధార్థం. ప్రొటెస్టాంట్ మేధావుల ఆలోచనా ధోరణిలో కూడా మార్పులు కనిపిస్తాయి. అంతేకాక వెబర్ భావించినట్లు కాల్వినిస్టుల ప్రభోధాలలో ఏకరూపత కనిపించదు. ఈ ప్రభోధాలు ఆయా దేశకాల పరిస్థితులలోని సంప్రదాయం, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ వాతావరణం వంటి వాటిని బట్టి మారుతూ, వివిధ తరహాలుగా ఉంటూ వచ్చాయి.

తొలి దశలోని పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రొటెస్టాంటిజమ్ కంటే ముందే ఏర్పడిందని, ఆ వ్యవస్థ ప్రొటెస్టాంటిజమ్ ప్రభావానికి గురి అయి నిర్ణయమైందని కాట్స్కీ భావించాడు. కాల్వినిజమ్ పెద్ద పెద్ద నగరాలలో మొదట ప్రారంభమైందని, పారి శ్రామికీకరణ తొలిదశల్లోనే ఉన్న సమయంలో మొదలైందని అతను భావించాడు. ప్రొటెస్టాంటిజమ్ అనేది పెట్టుబడిదారులు తమ స్థానానికి చట్టబద్ధత, న్యాయసమ్మతి కల్పించడానికి ఎన్నుకొన్న సిద్ధాంతమని కాట్స్కీ పేర్కొన్నాడు.

## 22.5 సారాంశం

అస్సెటిక్ ప్రొటెస్టాంటిజమ్ పాశ్చాత్య పెట్టుబడిదారీ వ్యవస్థకంటే ముందుగానే ప్రారంభమైందని వెబర్ అభిప్రాయం. ప్రొటెస్టాంట్ ఎథిక్, మత సూత్రాల ఆధారంగా ఏర్పడిన లౌకిక దృష్టి పెట్టుబడిదారీ తత్త్వం వికాసానికి ప్రముఖ కారణమని అతడు భావించాడు. అనేక ఇతర కారణాలున్నా పశ్చిమ యిరోపాలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావానికి, వికాసానికి ప్రముఖమైన కారణం అస్సెటిక్ ప్రొటెస్టాంటిజమేనని వెబర్ ధృఢమైన అభిప్రాయం.

మతం, పెట్టుబడిదారీ వ్యవస్థల మధ్య సంబంధం ఉందన్న వెబర్ వాదం ఎందరో శాస్త్రవేత్తలను, చరిత్రకారులను పరిశోధనలకు పురికొల్పింది. ఆర్థికాభివృద్ధిపై మత ప్రభావాన్ని గురించి వెబర్ వెలిబుచ్చిన అభిప్రాయాలు ఎందరో మేధావులను ఆలోచింపజేసింది.

దురదృష్టమేమిటంటే తన రచనలు పూర్తికావడానికి ముందే వెబర్ చనిపోయాడు. అవి అసంపూర్తిగానే మిగిలిపోయాయి. అయినా సమాజశాస్త్ర చరిత్రలో అతనికి ఒక ప్రముఖ స్థానం ఉంటూనే ఉంది. ఆండ్రెస్కీ అన్నట్లు "అతను మరో 20 సంవత్సరాలు జీవించి ఉంటే ఏమి సాధించేవాడో చెప్పలేం".

## 22.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. వెబర్ ప్రతిపాదించిన మతం, సామాజిక పరిమితులను విమర్శనాత్మకంగా పరీక్షించండి.

2. యూరప్‌లోని పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావానికి ప్రొటెస్టాంటిజమ్ ఎట్లా ఏర్పడింది.

BRAOU

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.

1. వెబర్ ప్రతిపాదించిన సామాజిక చర్య సిద్ధాంతం గురించి తెలుపండి.

2. మతం, పెట్టుబడిదారీ వ్యవస్థ మధ్య గుణదోషాలను తెలుపండి.

## 22.7 చదువదగిన పుస్తకాలు


Freund Julien : The Sociology of Max Weber, London, Allen Lane, The Penguine Press, 1968.

Gersh, H.H.& Mills, C. Wright: From Max Weber: Essays in Sociology, London, Routledge & Keganpaul Ltd, 1957

Haralambos, M : Sociology- Themes and Perspectives, Oxford University Press, Bombay, 1980.

Jesser Clintom Joyce : Social Theory Revisited, Illiriois, The Dryden Press, 1975.

Parsons, T : Max Weber, The Protestant Ethic and the spirit of Capitalism, London, George Allen &Unwin Ltd., 1968.

Stanislave Andreski : "Method and substantive Theory in Max Weber, in Jessser Clintor Joyce. Social Theory revised, Illusions, The Dryden Press, 1975.


BRAOU

# భాగం-23: సంప్రదాయ సిద్ధాంతం: సామాజిక మార్పు

విషయక్రమం


23.0 ఉద్దేశాలు

23.1 పరిచయం

23.2 డి.పి.ముఖర్జీ

23.2.1 భారతీయ సంప్రదాయం, సామాజిక మార్పు

23.2.2 సంప్రదాయం, సమాజమార్పునకు ఉన్న గతితార్కిక సంబంధం

23.3 డి.పి. ముఖర్జీ సంప్రదాయభావం: గుణదోష పరీక్ష

23.4 రాధా కమల్ ముఖర్జీ

23.4.1 విలువల తాలూకు ప్రాంతీయ ప్రాతిపదిక

23.4.2 విలువలు, ప్రతీకలు

23.4.3 ధ్యేయాలు, ఆదర్శాలు, నిర్దేశక ఆదర్శాలు, విలువలు

23.4.4 మూర్తిమత్వం, విలువలు

24.4.5 సమాజానికి సంబంధించిన సాధారణ సిద్ధాంతం

23.5 గుణదోష పరీక్ష

23.6 సారాంశం

23.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

23.8 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 23.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- డి.పి ముఖర్జీ ప్రతిపాదించిన సంప్రదాయక సిద్ధాంతాన్ని గురించి వివరంగా తెలుసుకుంటారు.
- సంప్రదాయక సిద్ధాంతం సామాజిక మార్పుపై ఏవిధంగా ప్రభావం చూపిందో పరిశీలిస్తారు.
- అర్.కె.ముఖర్జీ మానవ విలువల ప్రాముఖ్యాన్ని ప్రస్తావించిన తీరును అర్థం చేసుకుంటారు.

## 23.1 పరిచయం

భారతీయ సంస్కృతి తాలూకు సమాజశాస్త్ర అధ్యయనం ముఖ్యంగా, 50, 60 దశకాలలో చాలా పరిమితంగా జరిగిందనే చెప్పాలి. భారత సమాజాన్ని, దాని సంస్కృతి లక్షణాలను, దాని స్వరూప స్వభావాలను గురించి చక్కని అవగాహన ఉన్న వారిలో డి.పి. ముఖర్జీ, రాధాకమల్ ముఖర్జీలు అగ్రగణ్యులు.

మధ్యతరగతి, సంస్కృతి, సమాజమనే ఈ స్రవంతుల పరస్పర సంబంధాల గురించి చేసిన అధ్యయ నంలో

డి.పి.ముఖర్జీ సామాజిక నిర్మితి, బుద్ధి జీవుల వృత్తిపరమైన సంస్కృతుల మధ్య సంబంధాన్ని విశ్లేషించడాని ప్రయత్నించాడు. అతడు రాసిన అనేక వ్యాసాలలో విద్య, సాంకేతిక విజ్ఞానం, వర్గనిర్మితి, భారతీయ సంస్కృతిలోని మార్పులు, సామాజిక నిర్మితుల మధ్య సంబంధాన్ని గురించి ప్రస్తావించాడు. అనేక భావనలను, దృక్కోణాలను తెలిపాడు. రాధాకమల్ ముఖర్జీ తులనాత్మక విలువలు, నైతిక విలువలు, సంస్కృతి రూపాలను సంప్రదాయాయక భారతీయ విలువలు, సంస్కృతుల మాత్రుక పరిధులలో సమన్వయం చేయడానికి అనేక ప్రయత్నాలు చేవాడు. ఈ సిద్ధాంతాల ప్రాతిపదికతోనే పరిశీలించాడు.

భారతీయ సంస్కృతికి సంబంధించి డి.పి. ముఖర్జీ, ఆర్.కె.ముఖర్జీల పరిశోధనా వివరాలను విడివిడిగా పరిశీలించడమైంది. మొదట డి.పి ముఖర్జీ అభిప్రాయాలను తెలుసుకుందాం.

ఇండిన్ సోషలాజికల్ కాన్ఫరెన్స్‌లో "ఇండియన్ ట్రెడిషనల్ అండ్ సోషల్ చేంజ్%% అన్న అంశంపై అతని ఉపన్యాసంతో ప్రారంబిద్ధాం. ఆతరువాత సమాజానికి సంబంధించి ఆర్.కె.ముఖర్జీ అభిప్రాయాలను తెలుసుకుందాం.

## 23.2 ధూర్జటి ప్రసాద్ ముఖర్జీ

ధూర్జటి ప్రసాద్ ముఖర్జీ (డి.పి.ముఖర్జీ) 1894లో జన్మించాడు. కలకత్తాలో విద్యాభ్యాసం పూర్తిచేసుకున్నాడు. కలకత్తా విశ్వవిద్యాం నుంచి చరిత్ర, అర్థశాస్త్రంలలో మాస్టర్స్ డిగ్రీ పొందాక 1922లో లక్నోలో అర్థశాస్త్రం, సమాజశాస్త్రం అధ్యాపకుడిగా జీవితం ప్రారంభించాడు. అతని తొలి రచన Personality and Social Sciences సమగ్రమైన, నిండైన మూర్తిమత్వానికి సామాజిక శాస్త్రాల అధ్యయనం ఎంత ముఖ్యమో ఈ గ్రంథం స్పష్టపరుస్తుంది. అతని రెండో రచన Basic Concepts in Sociology. ఇది 1932లో అచ్చయింది. అతని మలి రచన"Diversities"లో హిందూ సమాజం తాలూకు సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం జరిగింది. ఎ.కె.సేన్ అభిప్రాయంలో డి.పి. ముఖర్జీ తన రచనల్లో మూడు విభిన్న ఆలోచనా ధోరణులను అంటే సాంప్రదాయక హిందూ సంస్కృతి, పాశ్చాత్య మానవతా హేతువాద దృక్పథం, మార్క్సు తత్వ చింతనలను సమన్వయం చేయడానికి ప్రయత్నించాడు.

BRAOU

### 23.2.1 భారతీయ సంప్రదాయం, సమాజిక మార్పు

1955లో జరిగిన అఖిల భారత సమాజశాస్త్రవేత్తల సమావేశంలో డి.సి.ముఖర్జీ చేసిన అధ్యక్షపన్యాసంలో భారతీయ సంప్రదాయం సామాజిక మార్పులకు సంబంధించి అతని అభిప్రాయం ఏమిటో తేటతెల్లమైంది. ఈ ఉపన్యాసంలో సామాజిక మార్పులను అధ్యయనం చేసేటప్పుడు భారతీయ సంప్రదాయాన్ని దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరాన్ని డి.పి.ముఖర్జీ నొక్కి చెప్పాడు. ఉపన్యాసం సారాంశాన్ని క్రింద చూడవచ్చు.

"కొన్ని సంవత్సరాల ముందే ఈ ఉపన్యాసం ఇచ్చి ఉంటే భారతీయ సంప్రదాయాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని గురించి మరికొంత నొక్కి చెప్పేవాణ్ణి. ఈ మధ్య కాలంలో నా దృష్టికి వచ్చిన వాస్తవాలు ఇలా ఉన్నాయి: మన బుద్ధి జీవులు ప్రతిభ, జ్ఞాన రంగాలలో వెనుకబడిపోయారు. అందువల్ల అర్థశాస్త్రం, రాజకీయ రంగాలలో వారు వెనుకబడిపోతున్నారు. ఈ విధంగా జరగడానికి భారతదేశ సామాజిక వాస్తవాలు తెలియకపోవడం, అసలు భారతీయ సమాజం స్వరూప స్వభావాల గురించి పరిజ్ఞానం కొరవడడమే అని చెప్పవచ్చు".

"ప్రణాళికలను రూపొందించడంలో సాధించిన ప్రగతి, ప్రదర్శించినంత పాటవం అనేవి ఈనాటికీ జవాబులేని ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. దీనికి కారణం సంప్రదాయం పేర్కొనే ధర్మ సూత్రాలకు, గత వంద ఏండ్లుగా నగరాలలోని మధ్యతరగతి సృష్టించి, పాటిస్తున్న నూనత సంప్రదాయాల మధ్య ఘర్షణ అపరిష్కృతంగానే మిగిలిపోయింది. ఈ విషయంలో ఉద్యోగిబృందాన్ని దోషిగా పేర్కొనలేదు".

సమాజశాస్త్రాలలో ఇంతవరకు జరిగిన పరిశోధనలు, ముఖ్యంగా మానవశాస్త్రం, మనోవిజ్ఞానశాస్త్రాలలోని

పరిశోధనలు, నిరర్థకమనే చెప్పవచ్చు. దీనికి కారణం ఆ పరిశోధనల ఫలితాలను వెల్లడిచేయకపోవడమే. అనుభవిక అంశాలపై ఆధారపడి సామాన్యీకరణాలు చేయడాన్ని డి.పి.ముఖర్జీ ఇలా అన్నాడు. "భారతీయ సమాజశాస్త్రవేత్త కేవలం ఒక సమాజశాస్త్రవేత్త అయితేనే సరిపోదు. అతడు మొదట భారతీయుడు కావడం అత్యంత ప్రదానం-అంటే అతడు భారతీయ జానపద రీతులు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయ విలువలు వంటి వాటిలో పాలుపంచుకొన్నప్పుడే భారతీయ సామాజిక వ్యవస్థను, దానిలో నిగూఢంగా ఉన్న వాస్తవాలను, దానికి అతీతంగా ఉన్న రహస్యాలను అవగాహన చేసుకోగలడు. ఒక్కమాటలో చెప్పాలంటే అన్ని స్థాయిలవారి విద్యా, విజ్ఞానాల గురించి క్షుణ్ణంగా తెలిసిఉండాలి.

భారతీయ సమాజ శాస్త్రవేత్తలనుద్దేశించి చెబుతూ ఈనాటి వరకు జరిగిన భారతీయ సామాజిక వ్యవస్థ అధ్యయనానికి, ముఖ్యంగా భారతీయ సంప్రదాయాలు, విశిష్టమైన ప్రతీకలు, సంస్కృతి ప్రతిరూపాలు, సామాజిక చర్యల విషయంలో సమాజశాస్త్రవేత్తల దృక్పథంలో మార్పులు అవసరం. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతి, ప్రతీకలు వంటి వాటిపై శాస్త్ర, సాంకేతిక మార్పుల ప్రభావాన్ని గుర్తించాలి. నాదృష్టిలో మార్పుకు లోనైన అంశాలు మార్పుకంటే ముఖ్యం.

డి.పి.ముఖర్జీ గౌరవార్థం రాధాకమల్ ముఖర్జీ వెలువరించిన వ్యాసాలలో భారతీయ సంప్రదాయం, సామాజిక మార్పుల గురించి వ్యాఖ్యానించాడు. భారతీయ సంప్రదాయాన్ని అర్థం చేసుకోవడం, లోతుగా పరిశీలించడం విషయాలలో సమాజశాస్త్ర వేత్తలకు డి.పి.ముఖర్జీ చేసిన సూచనలను గురించి రాధాకమల్ ప్రస్తావించడం జరిగింది. భారతీయ సంప్రదాయాలను అధ్యయనం చేయడంపై శాస్త్రవేత్తల దృష్టి మళ్ళింపుకు రెండు రకాల ఒత్తిడులు ఉన్నాయి. ఒకటి అంతర్గతమైన ఒత్తిడి, రెండోది బాహిరమైన ఒత్తిడులు. బయటి ఒత్తిళ్లు ముఖ్యంగా ఆర్థికపరమైనవి. ఇవి యాంత్రికంగా పనిచేయవు. భారతీయ సంప్రదాయంలోనే మార్పును ప్రేరేపించే శక్తులు ఉన్నాయి. భారతీయ సంప్రదాయానికి మార్పును అకళింపుచేసుకునే శక్తి ఉంది. సర్దుబాటు చేసుకునే శక్తి అంటే మార్పును ఇముడ్చుకోగలగడం అని అర్థం. సర్దుబాటు చేసుకునే శక్తి అనేది సంప్రదాయం సచేతనశక్తికి నిదర్శనం. వర్తమాన అనుభవాలను బట్టి సంప్రదాయం తాలూకు సచేతన శక్తిని అర్థం చేసుకోవచ్చు. మారుతున్న సంప్రదాయాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు కూడా సంప్రదాయాన్ని అర్థంచేసుకోవడానికే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఆర్థిక శక్తులు సమాజంలో మార్పులు కలిగేట్లు చేయడాన్ని గురించి పరిశోధించే ముందు భారతీయ సంప్రదాయాన్ని తెలుసుకోవడం భారతీయ సమాజశాస్త్రవేత్తలు చేయాల్సిన పని.

సామాజిక మార్పు ప్రక్రియను విశ్లేషించడంలో మార్పుకంటే సంప్రదాయానికే ప్రాధాన్యమిచ్చాడు డి.పి.ముఖర్జీ. సామాజిక వ్యవస్థ అధ్యయనం చేస్తున్న సమాజశాస్త్రవేత్తలకు డి.పి.ముఖర్జీ ఒక స్పష్టమైన మార్గాన్ని చూపాడని పై వివరణ వల్ల తెలుస్తుంది.

అతని చుట్టూ ఆవరించి ఉన్న పరిస్థితుల ప్రభావం డి.పి.ముఖర్జీపై అధికంగా ఉన్నట్టు కనిపిస్తుంది. సంప్రదాయక సంస్కృతి, ఆధునిక విద్యకు మధ్య అనుబంధం ఏర్పరిచాలని డి.పి.ముఖర్జీ నొక్కి చెప్పాడు. భారతీయ సంస్కృతి, ఆధునిక విద్య పరస్పర సంబంధం లేకుండా ఉండలేవనేది డి.పి.ముఖర్జీ వాదం. అందువల్ల సామాన్య ప్రజలు-మధ్యతరగతి ప్రజలు బుద్ధిజీవుల జీవితాలతో సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని భావించాడు. ఈ విషయంలో డి.పి.ముఖర్జీ సమకాలీన పరిస్థితుల ప్రభావానికి లోను అయినట్లు కనిపిస్తుంది. ఆధునిక విద్యావిధానం ప్రవాహం వల్ల భవిష్యత్తులో సమాజ స్వరూప స్వభావాలతీరు ఎలా ఉంటుందో అనే అంశంపట్ల డి.పి.ముఖర్జీ ఉత్సుకత వ్యక్తం చేశాడు. ఇలాంటి ఉత్సుకతతోబాటు భారతీయ సంప్రదాయంతో విడదీయరాని సంబంధం ఉన్నట్టు కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కారణం వల్లనే భారతీయ సంప్రదాయాన్ని ఆధునిక విద్యావిధానాన్ని సంధానం చేయాలని అభిలషించాడు. ఇలాంటి అభిలాష అతని మలిరచనలలో సుస్పష్టంగా కనిపిస్తుంది.

ఆధునిక భారతీయ సంస్కృతిని గురించి Modern Indian Culture: A Sociological Studyలో డి.పి.ముఖర్జీ సంగ్రహంగా ఇలా పేర్కొన్నాడు.



BRAOU

"సామాజిక, చారిత్రక ప్రక్రియగా భారతీయ సంస్కృతి సామాన్య దృక్పథాలను కల్పించిన కొన్ని సమష్టి సంప్రదాయాలను ఏర్పరచింది. ఇలాంటి వాటి కల్పనకు కారణాంశాలు బౌద్ధం, ఇస్లాం మతం, పాశ్చాత్య వాణిజ్య సంస్కృతులు. ఇలాంటి శక్తులను జీర్ణించుకొని, సంఘర్షణ పడిన ఫలితంగా ఏర్పడిందే ఆధునిక భారతీయ సంస్కృతి స్వరూపం. ఈనాటి భారతీయ సంస్కృతి హిందూ సంస్కృతిగా కానీ, ఇస్లాంసంస్కృతిగా కానీ, పాశ్చాత్య జీవన విధానానికి నకలు రూపంగా కానీ కనిపించడంలేదు. దానిలో ఆసియా ఖండపు సంస్కృతి లక్షణాలు ఎక్కడా కనిపించడంలేదు.

మధ్యతరగతి గురించి ప్రస్తావిస్తూ సువ్యవస్థితమైన మధ్యతరగతి అందరించి ఒక కృత్రిమ మధ్యతరగతి ఏర్పడింది. అందువల్లనే అది సంప్రదాయం, సంస్కృతుల అభివృద్ధిలో సరైన పాత్ర నిర్వహించలేక పోయిందని పేర్కొంటాడు. దేశ ప్రజానీకానికి ఈ నూతన మధ్యతరగతి దూరంగా ఉండిపోతుంది. ఈ తరగతి ప్రజలకు భారతీయ సంస్కృతి పూర్వరంగం ఏమిటో, దాని స్వరూప స్వభావాలు ఏమిటో కొంచెం కూడా తెలియదు. ఈ మధ్యతరగతే భారతదేశంలో బ్రిటిష్ అధికారం బలపడటంలో కీలకపాత్ర మహించింది. అంతేకాక ఈ మధ్యతరగతే దేశ విభజనకు కారణమైంది. ఈ వర్గానికి భారతీయ సంస్కృతి గురించి అవగాహన అసలే లేదు. అందువల్లనే ఇదొక కృత్రిమ వర్గంగా తయారైంది. ఒక దేశ రాజకీయాలను ఆదేశ సంస్కృతి నుంచి వేరుచేయడం సాధ్యం కాదు. దేశంలోని శిష్టులు దేశాన్ని పునర్నిర్మించడం ఆధునికీకరించడానికి ముందు ఈ కృత్రిమ వర్గాన్ని మరమ్మతు చేయాల్సిన అవసరం ఉందని డి.పి.ముఖర్జీ పేర్కొన్నాడు.

దేశ సంప్రదాయం దృష్టి అలవర్చుకోవడం అనేది దేవం ముందడుగు వేయానికి విచ్ఛిన్నమైన సామాజిక - సాంస్కృతి ప్రక్రియను పునరుద్ధరించడానికి ఎంతో అవసరం. ఫ్రాంక్లిన్ గిడ్డింగ్స్ చేసిన సంప్రదాయాల వర్గీకరణను-ప్రాథమిక, గౌణ, తృతీయ- అనుసరించాడు. బ్రిటీషువారు భారతదేశంలో అడుగుపెట్టడానికి పూర్వం దేశంలోని హిందువుల, మహ్మదీయుల మధ్య అన్ని స్థాయిల్లో పూర్తి సమన్వయం ఉండేదికాదు. సహజవనరుల వినియోగానికి సంబంధించి సమన్వయం ఎక్కువ మోతాదులోనే ఉన్నా సౌందర్య శాస్త్రం, సంప్రదాయాల విషయంలో మాత్రం స్వల్పంగా ఉండేది. తృతీయ రంగంలో సంప్రదాయానికి సంబంధించిన భావనల విషయంలో తారతమ్యాలు ప్రముఖంగా కనిపించేవి.

BRAOU

## 23.2.2 సంప్రదాయం, సామాజికమార్పుల మధ్య గతి తార్కిక సంబంధం

వలసవాదులు ప్రచారం చేసే స్తబ్ధమైన తూర్పుఖండం, గతిశీలము, పురోగామి అయిన పశ్చిమ ఖండాలు అనే విభజనను ముందుగా విసర్జించాలి. భారతదేశానికి బ్రిటిష్‌వారు వచ్చింది నాగరికత నేర్పడానికి. దాని ద్వారా భారతదేవంలో సాంస్కృతిక పునరుజ్జీవనం ప్రారంభించడానికి అన్న భావనలను సమూలంగా తొలగించాలి. ప్రాక్ పశ్చి దేశాల సంస్కృతుల సమ్మేళనాన్ని బ్రిటిష్ వలసవాదం ఎలా అడ్డుకొంది, భారతదేవాన్ని బ్రిటిష్ సామ్రాజ్యానికి అవసరమైన వ్యవసాయోత్పత్తులు అందించే దేశంగా ఎలా మార్చిందో డి.పి.ముఖర్జీ వివరించాడు.

భారతీయ సంస్కృతిని వివరించే చరిత్రకారులెవ్వరూ తెలుపని విశేషాలను గురించి డి.పి.ముఖర్జీ ప్రస్తావించారు. 19వ శతాబ్దంతో ప్రారంభమైన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికంటే ముందే భారతదేశంలో ఎన్నో సంస్కృతికోద్యమాలు నడిచాయి. వీటిలో ముఖ్యంగా పేర్కొనాల్సినవి, వైదిక ఆర్యకాలం, బుద్ధిస్ట్, గుప్తులు, హర్ష విక్రమాదిత్యుడు, ముస్లింల కాలాలలోని ఉద్యమాలు. అంతేకాక మధ్యయుగంలోని సన్యాసులు, భక్తి తత్వ ప్రవక్తలు కూడా సాంస్కృతిక పునరుజ్జీవనానికి తోడ్పడ్డారు. బ్రిటిష్ పాలన ప్రారంభానికి పూర్వమే భారతదేశంలో సాగిన ఈ ఉద్యమాలకు, పారిశ్రామిక విప్లవానికి పూర్వం పశ్చిమదేశాలలోని ఉద్యమాలకు సామ్య కనిపిస్తుంది ఈ వాస్తవాలను భారతదేవ చరిత్ర స్పష్టంగా పేర్కొన్నది.

సమాజం ఉన్నత స్థాయికి ఎదగడంలో సంప్రదాయానికున్న పాత్రను డి.పి.ముఖర్జీ స్పష్టంగా పేర్కొన్నాడు. ఇందుకు రెండు సంస్కృతులలోని ప్రత్యేక లక్షణాలను పరిశీలించాలి. అవి: 1. పశ్చిమ దేశాల ప్రయోగవాదం, హేతుబద్ధతపై ఆధారపడిన విలువలు, సోషియల్ అకౌంటింగ్ (సామాజిక జవాబుదారీ తనం), ఉద్యోగిస్వామ్యీకరణ, సాంకేతిక పద్ధతులు, అధికమవుతున్న నగరీకరణ. 2. సంప్రదయాన్ని పరిరక్షించుకొనే భారతీయ తత్వం.

నిర్దేశించుకొన్న లక్ష్యాలను ఉన్నత సామాజిక స్థాయిని వ్యక్తిత్వం, ప్రణాళికా రూపకల్పనలను సమన్వయం చేయడం ద్వారా సాధించుకోవచ్చునని డి.పి.ముఖర్జీ విశ్వాసం.

## 23.3 డి.పి ముఖర్జీ సంప్రదాయభావం: గుణదోష పరీక్ష

డి.పి. ముఖర్జీ రచనలు విమర్శకుల దృష్టిని పెద్దగా ఆకర్షించలేదు. అందుకే అతని రచనలకు సంబంధించిన చర్చ, విమర్శ అంతగా కనిపించదు. అయితే అతని పూర్వ విద్యార్థులైన ఎ.కె.రన్, టి.ఎన్.మదన్, పి.సి.జోషిలు వారి గురువు రచనలను విమర్శనాత్మక దృష్టితో పరిశీలించి వ్యాఖ్యానించారు.

ఈ మధ్యకాలంలో, లక్నో స్కూల్ గురించి రాసిన వ్యాసంలో జోషి డి.పి.ముఖర్జీ ఆలోచనా ధోరణి గురించి ఈవిధంగా ప్రస్తావించాడు. 'సంప్రదాయాలు యథాతథ స్థితిలో కొనసాగాలనే వాదన, ఆధునికతను ప్రవేశపెట్టాలనే వాదనల మధ్య సామరస్యం కుదర్చడంలో డి.పి.ముఖర్జీ కొంత ప్రత్యేకతను ప్రదర్శించాడు. అంతేకాక భారతీయ సంప్రదాయం, సామాజిక మార్పులకు సంబంధించి డి.పి.ముఖర్జీ ఒక సమన్వయ దృక్పథాన్ని ప్రదర్శించాడు. భారతీయ సంప్రదాయం, భారతీయ సామ్యవాదం మధ్య సంబంధాన్ని గురించి ప్రస్తావించినప్పుడు అతని తాత్విక చింతన దోచరిస్తుంది.

సంప్రదాయం, ఆధునికతలకు సంబంధించి టి.ఎన్.మదన్ చేసిన గతితార్కిక వాదంలో ఆధునికతను అర్థం చేసుకోవడంలో సంప్రదాయం ఆవశ్యకతను, సంగతత్వాన్ని గురించి డి.పి.ముఖర్జీ నొక్కి చెప్పినట్టు పేర్కొన్నాడు. డి.పి.ముఖర్జీ అతడు పరిశీలించిన గ్రంథాలను సాధారణ పరిజ్ఞానం ఉద్దేశాలతోనే చేసాడని వీటి గూఢార్థాన్ని తెలుసుకొన్నట్లు లేదని మదన్ అభిప్రాయపడ్డాడు.

BRAOU

## 23.4 రాధా కమల్ ముఖర్జీ

రాధాకమల్ ముఖర్జీ పశ్చిమ బెంగాల్‌లోని మర్షిదాబాద్ జిల్లాలోని బహరామ్‌పూర్‌లో 1889లో జన్మించాడు. ఆయన కలకత్తాలోని ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుకొని లక్నో విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్రం, సమాజశాస్త్ర ఆచార్యునిగా 1955-57ల మధ్య పనిచేశాడు. ఆయన కేంబ్రిడ్జ్, ఆక్స్‌ఫర్డ్, కొలోన్, వియన్నా, హార్వార్డ్, కొలంబియా, చికాగో, మిషిగన్, విస్కాన్సిన్ విశ్వవిద్యాలయాలను సందర్శించి 1937, 1946, 1948లలో ఉపన్యాసాలు ఇచ్చాడు.

రాధాకమల్‌కు భారతీయ తత్వచింతనపై మంచి పట్టు ఉంది. చరిత్రపై మక్కువ ఉన్నా కలకత్తా నగరంలో ఆయన దృష్టికి వచ్చిన మురికివాడల దుస్థితి, పేదరికం, దైన్యం ఆయనను అర్థ, సమాజ శాస్త్రాలవైపు మళ్లించింది. పేదల పట్ల ఆయనకున్న ఆసక్తి, ఆయనను పలు సంఘసంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రోత్సహించింది. 1906 నుంచే ఆయన సంక్షేమ కార్యకర్తలతో సంబంధాలు పెట్టుకొన్నాడు. ఆయన భారతీయ తత్వ చింతనాపరిజ్ఞానంతో సామాజిక తత్వ చింతనలో ఒక కొత్త కోణాన్ని చేర్చారు. డబ్ల్యూ.ఇ.హాకింగ్ వ్యాఖ్యానిస్తూ రాధాకమల్‌లో మూడు గుణాలు ప్రస్ఫుటంగా కనబడతాయంటాడు. అవి: శాస్త్రీయ శిక్షణ పొందిన విద్వత్తు, తన శాస్త్రానికి సంబంధించిన పాశ్చాత్య సాహిత్యంతో పరిచయం, మానవ సంస్థల ఆరోగ్యంపై మతం చూపే ప్రభావాన్ని గురించిన స్పృహ.రాధాకమల్‌పై వార్డ్, గిడ్డింగ్స్, కోమ్ట్, స్పెన్సర్, బేగ్‌హాట్, రికార్డో, మిల్, హాబ్‌హౌస్, మార్షల్‌ల రచనల ప్రభావం ఎంతో ఉంది. రాధాకమల్‌లో తూర్పు, పశ్చిమ దేశాల తత్వ చింతనల కలయిక కనబడుతుంది. ఆ రెండు చింతనల మేలు కలయికే ఆయన మానవ విలువల విశ్లేషణ రూపంలో పరిణమించిందని చెప్పవచ్చు. మానవ విలువల గురించి వ్యాఖ్యానించడంలో రాధాకమల్‌కు ఉన్న విశాల దృష్టి మరే ఇతర సమాజశాస్త్రవేత్తలకు లేదని బొగార్డస్ అభిప్రాయం.

### 23.4.1 విలువల ప్రాంతీయ ఆధారం



ముఖర్జీ సామాజిక విలువ సిద్ధాంతం ఆయన ప్రాంతీయతత్వం, పర్యావరణం అనే భావనలపై ఆధారపడి

ఉంటుంది. ప్రాంతం అంటే 'ఒక పర్యావరణంలోని వ్యక్తుల సమష్టి' అంటాడు. 'ఒక ఆర్థిక చట్రం, ఒక సంస్కృతి క్రమం'. ఇంకా 'ఒకే రకమైన స్పందనలను, అలవాట్లను, బావాలను రేకెత్తించే విభిన్న ఉద్దీపనల సంఘటిత స్వరూపమే ప్రాంతం. ఈ రకమైన పర్యావరణం వ్యక్తుల తత్వాలకు ఒక రూపం కల్పించి ఒకే రకమైన తటస్థజీవన విధానం ఏర్పడడానికి తోడ్పడుతుంది. 'అందుకే సమాజశాస్త్రంలో మౌలిక యూనిట్ ప్రాంతం'.

ప్రాంతాలపై చేసిన అధ్యయనంలో ఆర్.కె.ముఖర్జీ వివిధ శక్తులు ప్రాంతీయ సంతులనానికి తోడ్పడుతుందని కనుక్కున్నాడు. అతని దృష్టిలో ప్రాంతీయ సంతులనాన్ని అధ్యయనం చేయడం అంటే ప్రాంతీయ పర్యావరణాన్ని అధ్యయనం చేయడమే. ప్రాంతీయ పర్యావరణమంటే 'వృక్షసంపద, జంతుజాలం, మానవ సమూహాల సంక్షిప్త అధ్యయనం'. ఇవన్నీ ఒక ప్రాంతీయ వ్యవస్థలో సంఘటితమైన అంశాలు. సామాజిక పర్యావరణమంటే వృక్ష, జంతు, మానవ సముదాయాల సంఘటిత వ్యవస్థే ప్రాంతం. భిన్న రూపాలలో ఉన్న వాతావరణంలో మానవుడు జీవిస్తుంటాడు. అంటే పర్యావరణ ప్రాంతం, సంస్థలు, వర్గం, రాజ్యం అని అర్థం. ఇలాంటి పర్యావరణంలో జీవిస్తున్న మానవుడు వీటి తత్వాన్ని జీర్ణించుకొని జీవనయాత్ర సాగిస్తాడు. వివిధ రూపాలలోని పర్యావరణంలో ఏర్పడే పరస్పర చర్యల ఆధారంగానే సామాజిక విలువల సిద్ధాంతం ప్రతిపాదించడం జరిగింది.

## 23.4.2 విలువలు, ప్రతీకలు

మనిషిచుట్టూ ఆవరించి ఉన్న పరిసరాలనుంచే విలువలు, ప్రతీకలు వెలువడ్డాయి. ఇవి మానవ మేధస్సు సృష్టించిన కృత్రిమ రూపాలు. ఇవి సామాజిక సంబంధాలను, ప్రక్రియలను పరిపుష్టం, ఉదాత్తం చేస్తాయి. ఇవి నిరంతరం విస్తరిస్తున్న, గహనమవుతున్న భాగస్వామ్యం, బావ ప్రసరణలతో మనుషులను సంఘటితం చేస్తాయి.

BRAOU

"విలువలనేవి సామాజిక ఆమోదం పొందిన ఆశలు, లక్ష్యాలు. ఇవి నిబంధనం, అభ్యాసం, సామాజికీకరణ ప్రక్రియల ద్వారా ఏర్పడతాయి. ఇవే వ్యక్తిగత అభిరుచులు, ప్రమాణాలు, ఆశయాలుగా రూపొందుతాయని ఆర్.కె.ముఖర్జీ పేర్కొన్నాడు. విలువలలో ఒక క్రమానుగతి, శ్రేణీకరణలుంటాయి. ఇవి తక్షణ, నిర్దిష్ట ఆదర్శాలకు సాధనాలుగా సార్వజనీనమైన, స్వాభావికమైన, స్వతస్సిద్ధమైన విలువలుగా ప్రకటితమౌతాయి".

విలువలు నిరపేక్ష స్వభావం కలవి. మనిషి తన కాలాన్ని, ఆదాయాన్ని, శక్తి సామర్థ్యాలను ఎలా వినియోగిస్తాడు అనే దాన్ని బట్టి విలువలను తెలుసుకోవచ్చు. మానవుల అన్ని సంబంధాలు, ప్రవర్తనలు సహజంగానే విలువలుగా పరిగణించడం జరుగుతుంది. అవి మానవుని మౌలిక సహజాతోద్వేగాల పరిపూర్తికి, కోరికలు తీరడానికి అతని సామాజిక జీవితానికి తగినట్లుగా ఉండటానికి ఎంతగానో తోడ్పడతాయి. ఇవి సమాజాల నిర్మాణానికి తోడ్పడడమే కాకుండా సామాజిక సంబంధాలను సంఘటిత పరచడం, మూర్తిమత్వ లక్షణాలను తీర్చిదిద్దడానికి, సంస్కృతి మరింత గహనం అయ్యేటట్లు చేయడానికి ఎంతో తోడ్పడతాయి.

ప్రతీకలనేవి వ్యక్తులను అనుభవాలకు సన్నిహితులను చేస్తాయి. భావప్రసరణ మాధ్యమాలుగా స్తరీకరణ, నియంత్రణలకు వీలు కల్పించే ప్రతీకలు శాస్త్రీయమైన, నిష్పక్షపాతమైన విశ్లేషణకు అనుకూలంగా ఉంటాయి. అవి విలువలను అర్థం చేసుకొని, ఆచరణలో పెట్టడానికి తోడ్పడతాయి.

విలువల శ్రేణీకరణ: విలువల శ్రేణీకరణ సామాజిక సమన్వయం తాలూకు నాలుగు నమూనాలలో చూడవచ్చు (కనిపిస్తుంది). అవి:

1. తప్పు అని భావించి ఒకానొక చర్యను సరిదిద్దాలని గుంపులోనివారు గట్టిగా కోరవచ్చు.

2. ఆర్థిక ప్రయోజనాన్ని ఆశించే సమూహాలు: విలువలు, పరస్పరత్వం, చిత్తశుద్ధి, పరిశీలన, న్యాయంల ద్వారా ప్రకటితమవుతుంది.

3. సమాజం లేదా సముదాయంలో న్యాయం, సమానత్వం అనేవి వ్యక్తమవుతాయి.

4. 'సాధారణత'లో ఐచ్ఛిక లేదా స్వాభావిక ప్రేమ ముఖ్యమైన విలువలు-సామాజిక బాధ్యతాయుతం, సంఘటన, సహకారాలు.

ప్రవర్తన అన్ని రూపాలలో సకారాత్మక విలువలు, విలువలుకూడా కనిపిస్తాయి. మానవుని తృప్తిస్థాయుల్లో జైవిక, సామాజిక ఆదర్శాల మధ్యపొందిక లేదా అనుబంధం లేకపోవడంలోనే సకారాత్మక విలువల మూలం ఉంటుంది. ఇవి చట్టాలను అతిక్రమించడం, సామాజిక నియమాలను ఉల్లంఘించడం వంటి రూపాలలో కనిపిస్తుంటాయి.

## 23.4.3 ధ్యేయాలు, ఆదర్శాలు, నిర్దేశక ఆదర్శాలు, విలువలు

మానవుల ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి, ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికి లక్ష్యాలనేవి ఏర్పడతాయి. వాటిలో సరైన లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవడం జరుగుతూ ఉంటుంది. లక్ష్యాలు పరస్పరం పోటీ పడుతుంటాయి. అందువల్ల అత్యుత్తమము, ఆదర్శప్రాయము అయిన దాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఆదర్శాలు సర్వ సంపూర్ణమైనవి కావు. అవి: స్థిరత్వం, సామరస్యం, పొందిక అనే వాటిని సామాజిక ప్రమాణాలద్వారా పొందవచ్చు. ప్రమాణాలనేవి మానవ ప్రయత్నాల ఆకాంక్షల వాస్తవ రూపం. ప్రమాణాలు అంతఃకరణ, విశ్వాసం, అంతర్గతీకరణం చెంది యథార్థ సామాజిక సంబంధాలుగాను, సంస్థలుగాను, స్వేచ్ఛాస్వాతంత్రాలుగానూ, చట్టాలు, హక్కులు, విధులుగానూ రూపుదాలుస్తాయి.

## 23.4.4 మూర్తిమత్వం, విలువలు

విలువలు, విలువ వ్యవస్థలు మూర్తిమత్వ నిర్మాణాన్ని నిర్వచించి అదుపులో ఉంచుతాయి. మనిషి ఒక స్థాయి ప్రవర్తననుంచి మరోస్థాయి ప్రవర్తనకు మారుతుంటాడు. మానవ ప్రవర్తనకు మూడు లక్షణాలుంటాయి. సామాజిక సంబంధాలు మెరుగుపడడం, విలువలు, మూర్తిమత్వం పరిపుష్టం కావడం, నైతిక జీవితం రూపంలో అవి మనిషి ప్రవర్తన ద్వారా బహిర్గతమవుతాయి.

BRAOU

1. మెదటి పరిమాణం జీవ-సామాజిక నిర్బంధ నియమ నిబంధనలు బయటి పరిసరాల ఒత్తిడి, తగినంతగా లేని శక్తి సామర్థ్యాల ఒత్తిడుల వల్ల కలిగే భయభ్రాంతులను ఎదుర్కొనడానికి నిర్బంధ నియమ నిబంధనలు తెలుసుకోవడం ద్వారా మనిషి తననుతాను సమాయత్తపరచుకుంటాడు.

2. సమాజంలో కనిపించే మానసికమైన సంఘటన అంతర్గత శక్తి, సంతృప్తి కోసం మనిషి తోటివారితో సామరస్యంగా మెలగడం, సన్నిహితంగా జీవించడం అవసరమవుతుంది.

3. తాత్విక చింతన, విశ్వవ్యవస్థ, పరమేశ్వరునితో సన్నిహితమైన అనుబంధం ఏర్పరచుకోవడం ద్వారా మానవుడు ఆత్మ సంతులనం సాధించగలుగుతాడు. జీవ-సామాజిక వాతావరణంలో వ్యక్తి ప్రాజ్ఞత పెంపొందించుకుంటాడు. మానసిక-మనోవైజ్ఞానిక వాతావరణం పట్ల విధేయతను, తాత్విక వాతావరణం పట్ల గౌరవభావం అలవర్చుకుంటాడు.

ఒక సమాజం కొనసాగాలంటే మూర్తిమత్వ విలువలను క్రమం తప్పకుండా పాటించవలసిందే. సౌందర్యం, సద్గుణం, ప్రేమ తాలూకు ఉన్నతమైన తాత్విక విలులను ప్రతీ వ్యక్తీ అన్వేషిస్తాడు. అంతేగాక సామాజిక సంబంధాల కల్పనలు బాధ్యత, సద్గుణం, ప్రేమలపై ఆధారపడిన సంస్థల స్థాపనే మనిషి అన్వేషిస్తాడు.

## 23.4.5 సాధారణ సమాజ సిద్ధాంతం

వ్యక్తులు సృష్టించి, పెంచి మార్పులు చేర్పులు చేస్తున్న విలువల ప్రాతిపదికపైనే ముఖర్జీ రూపొందించిన సమాజ సిద్ధాంతం ఆధారపడింది. ఈ సిద్ధాంత రూపకల్పనకు సమాజశాస్త్రాలన్నింటినీ సంఘటితం చేయడం అవసరమని ముఖర్జీ భావించాడు. సమాజం విభాజ్యం కాదు. దీన్ని అర్థం చేసుకోవడం కోసం మొత్తం సమాజం అనుసరిస్తున్న అలవాట్లు, విలువలు, ప్రతీకలను అధ్యయనం చేయడం తప్పనిసరి.



సమాజం అంటే నిర్మితులు, ప్రకార్యాల సమాహారం. వాటి ద్వారానే వ్యక్తి తన పరిసరం తాలూకు మూడు

స్థాయిలలో అవగాహన చేసుకొని తనను తాను సరిదిద్దుకుంటూ ఉంటాడు. ఆస్థాయులు పర్యావరణ స్థాయి, మానసిక స్థాయి, టెలిక్-మోరల్ స్థాయి. వీటిని అనుసరించి ప్రవర్తించడం ద్వారా తన పోషణను, స్థాయిని, విలువల సాధనను సుసాధ్యం చేసుకొంటాడు. (మూడు మార్గాలు-ప్రాజ్ఞత, విధేయత, గౌరవభావం). పర్యావరణ ప్రపంచంలో అందరి జీవితాలలో ఒక రకమైన సంతులనం, క్రమం ఉంటాయి. మానసిక ప్రపంచంలో అన్ని సంస్థలు సంతులనం పొందుతాయి. వాటిలో సంస్కృతి కనిపిస్తుంది. టెలిక్-మోరల్, తాత్విక ప్రపంచంలో పనిచేసే అన్ని విలువలలో కూడా సంతులనం ఏర్పడుతుంది.

ఆర్.కె.ముఖర్జీ దృష్టిలో సమాజం అంటే ఒక నిర్నిరోధమైన వ్యవస్థ. అది స్వయం నిర్దేశితమైన వ్యవస్థ. సచేతనమైన వ్యవస్థ. భిన్న లక్షణాలున్నటువంటిది. సంపూర్ణమైంది. స్థూలంగా క్రమపద్ధతిని అనుసరించేటటువంటివది. ఈ వ్యవస్థ పరస్పర భావలు, ఉద్వేగాలు, నేర్చుకొనే తీరు ఇందులో కనిపించే ముఖ్యమైన లక్షణాలు. ఇదే దాని విశిష్ట లక్షణం. ఈ విశిష్ట లక్షణం, మూర్తిమత్వ లక్షణమే సంస్కృతి. ఇది నిరంతరాయంగా కొనసాగడానికి, మార్పు చెందడానికి మూలమవుతుంది. సమాజ నిర్మితి, ప్రకార్యాలలో విస్తృతమౌతున్న ప్రతీకలు, సమన్వయ సంస్కృతి, సంస్కృతి అనేవి ఉంటాయి. సామాజిక క్రమ పరిణామం తక్షణ, నిర్దిష్ట సాధకరూపం నుంచి ఆదర్శ ప్రాయమైన, సార్వజనీన స్వాభావిక రూపంగా మారుతూ ఉంటుంది.

సమాజం తన ప్రత్యేకతను, స్వయం సమృద్ధతను కాపాడుకోవడానికి నియంత్రణలు చాలా అవసరం. అందువల్లనే సమాజంలోని సమూహాలు, వ్యక్తుల మధ్య ఏర్పడే సంఘర్షణలను నివారించడం, క్రమబద్ధీకరించడం చేస్తూ ఉంటుంది. విలువలను పరిరక్షించేందుకు చట్టాన్ని ఉపయోగిస్తుంది. వాటి ప్రాధాన్యక్రమాన్ని ఏర్పరుస్తుంది. విలువలను అంతర్గతీకరించుకోవడం అనేది నియంత్రణల ముఖ్యసాధనంగా పనిచేస్తాయి.

విలువలను కాపాడుకొంటూ వ్యక్తి తన్నుతాను సంస్కరించుకుంటూ పురోగమిస్తున్న సామాజిక వాతావరణంలో మనుగడ సాగించడం అనేది ఆర్.కె.ముఖర్జీ సిద్ధాంతంలోని ముఖ్యమైన అంశం. ముఖర్జీ సమాజ అధ్యయనానికి ఒక బృహత్ శాస్త్రాన్ని దర్శిస్తాడు. ఆశాస్త్రంలో 'మానవ పర్యావరణ సిద్ధాంతం, సామాజిక సిద్ధాంతం, విలువల, ప్రతీకల తాలూకు సిద్ధాంతాలతో కూడి ఉంటుంది. అవన్నీ కలిసి ఒక సూక్ష్మ సమాజ సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తాయి. ఆ సిద్ధాంతం వివిద సాంఘిక శాస్త్రాలను ఏకం చేయడమే కాక విజ్ఞాన రాశిలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తుంది. సమాజశాస్త్రం కంటే ఆశాస్త్రం విస్తృతమైనదిగా, విశాలమైనదిగా ఉంటుంది.

సమాజశాస్త్రం అంటే వ్యవస్థల చట్రంలో ఉన్న అంతస్తు, భావ ప్రసారాల మధ్య ఉన్న సంబంధాన్ని తెలిపే సమాజ సిద్ధాంతంలో ఒక అంశం.

BRAOU

## 23.5 గుణదోష పరీక్ష

ఆర్.కె.ముఖర్జీ సామాజిక చింతనలో విశ్వజనీనత ఉందంటాడు బాగార్డస్. అతని సిద్ధాంతం మానవీయమైనది. విశ్వవ్యాపితమైనది. ముఖర్జీ సిద్ధాంతం వివిధ సాంఘిక శాస్త్రాల అధ్యయనంలో, పరిశోధనలో, అనువర్తనంలో ఒక యూనిట్‌గా పనిచేసేలా చేస్తుంది. ఈ సిద్ధాంతం శాస్త్ర తత్వాన్ని, సమాజ శాస్త్రాన్ని మేళవించింది. దీని ప్రకారం అన్ని మానవజాతులు ఒక్కటే సమాజం, వ్యక్తి ఒకటే అనడమేకాక ప్రపంచ సముదాయాన్ని ఊహిస్తుంది. మానవ సమాజంలో విలువలను అత్యంత మాన్యమైనవిగా పేర్కొంటుంది. సాంఘిక శాస్త్రాలను, తత్వశాస్త్రాన్ని మతాన్ని మెరుగు పరిచే ఒక బృహత్ నిర్మించాలని పిలుపునిస్తుంది.

లక్నో స్కూల్‌కు చెందిన పి.సి.జోషి వ్యాఖ్యానిస్తూ మానవునికి, ప్రకృతికి మధ్య ఉన్న సంబంధాన్ని వివరించే సందర్భంలో సామాజిక పర్యావరణాన్ని, ప్రాంతీయ తత్వాన్ని వివరించిన మొట్టమొదటి భారతీయుడిగా ఆర్.కె.ముఖర్జీని అభివర్ణించాడు. ఆధునిక సమాజం అభివృద్ధి చెందాలంటే పాశ్చాత్యీకరణ వల్లే సాధ్యమవుతుందన్న ప్రతిపాదనలను ప్రశ్నించడమే ఆర్.కె. సిద్ధాంతంలోని విశిష్టత అని పేర్కొన్నాడు. పాశ్చాత్య సంస్థల స్థానంలో ప్రాక్ దేశాల సంస్థలను ప్రత్యామ్నాయంగా భావించాలనడం ఆర్.కె.ముఖర్జీ సిద్ధాంతం ప్రత్యేకత.

## 23.6 సారంశం

డి.పి.ముఖర్జీ, ఆర్.కె.ముఖర్జీలు ఇరువురూ భారతీయ సమాజశాస్త్రవేత్తల ఆద్యులు. వీరిద్దరికి భారతీయ సమాజం, దాని సంస్కృతి పట్ల చక్కని అవగాహన ఉంది.

డి.పి.ముఖర్జీ సమాజనిర్మితికి, బుద్ధిజీవుల సంస్కృతికి మధ్య సంబంధాన్ని విశ్లేషించ ప్రయత్నించాడు. అంతేకాక మధ్యతరగతి, అది సమాజంలో నిర్వహించే పాత్రను వివరించి, సామాజిక, సంస్కృతిక వాహినుల కలయిక ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో వివరించాడు. విద్యావిధానం, విజ్ఞానం, వర్గ నిర్మితి భారతీయ సంస్కృతిలో సమాజ నిర్మితిలో మార్పులను తీసుకువస్తాయని తెలియజేశాడు. అతను ఉపయోగించిన భావనలన్నింటికి ఆధారం భారతీయ సంప్రదాయమే. నిండైన మూర్తిమత్వ వికాసానికి సాంఘిక శాస్త్రాల అధ్యయనం చాలా అవసరమని ఉల్లేఖించాడు. మార్క్సు సిద్ధాంతం, పాశ్చాత్య ఉదారవాదానికి భిన్నంగా ఉండే హిందూ మానవ, సమాజాన్ని ప్రతిపాదించాడు. డి.పి.ముఖర్జీ భారతీయ సమాజంలో మార్పును అధ్యయనం చేయాలంటే భారతీయ సంప్రదాయం తాలూకు జ్ఞానం తప్పనిసరి అంటాడు.

రాధాకమల్ ముఖర్జీ విలువలు, సంస్కృతి తాలూకు సిద్ధాంతంలో భారతీయ సంప్రదాయ నమూనాలో విలువలు, నీతి, సంస్కృతి రూపాలను సమన్వయం చేయడానికి ప్రయత్నించాడు. అతని సామాజిక చింతన ప్రాక్, పశ్చిమ చింతనల సమ్మేళనం. అతని సామాజిక విలువల సిద్ధాంతానికి ఆధారం ప్రాంతీయతత్వం, పర్యావరణం. అతని ప్రాంతాల అధ్యయనంలో వివిధ శక్తుల ప్రాంతీయ సంతులనం కనుక్కొన్నాడు. మానవుడు, ప్రకృతి మధ్య ఉన్న సంబంధాన్ని వివరించడంలో సామాజిక పర్యావరణాన్ని, ప్రాంతీయ తత్వాన్ని ఉపయోగించి వివరించిన మొదటి భారతీయుడు ఆర్.కె.ముఖర్జీ.

BRAOU

## 23.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సంప్రదాయం, సామాజిక మార్పులపై డి.పి.ముఖర్జీ అభిప్రాయాలు వివరించండి.

2. ఆర్.కె.ముఖర్జీ ప్రతిపాదించిన విలువలు భావనను విశదీకరించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తుల్లో సమాధానం రాయండి.**

1. సాంప్రదాయం, సమాజానికి మధ్యనున్న గతితార్కిక సంబంధాన్ని చర్చించండి.

2. గుణదోషపరీక్ష గురించి తెలుపండి.

## 23.8 చదువదగిన పుస్తకాలు

Bogardus, E.S. : The Development of Social Thought, Bombay, Allied Pacific Private Ltd., Chapter XL 1964.

Joshi, P.C. : "Founders of the Lucknow School and their Legacy: Radha Kamal Mukerjee and D.P.Mukharjee: Some Reflections", Economic & Political Weekly, Vol.21 (33), pp 1465-1469, 1986.

Madan, T.N. : Dialectic of Tradition and Modernity in the Sociology of D.P.Mukherjee, Lucknow, Manohar Publications, 1977.

# ఖండం- VII

## ఇటీవలి ధోరణులు

సమాజం నిరంతరం మారుతూ వుంటుందన్నది నిజం. సమాజంలాగే ఈ మార్పుల అధ్యయన దృక్పథాలూ మారుతున్నాయి. చరిత్రలో ఇంతవరకు ఒక దృక్పథం, కొన్ని దృక్పథాలే సిద్ధాంతాలుగా నిలబడుతూ వచ్చాయి. కానీ మార్పు క్రమంలో కొత్త శక్తులు, కొత్త సామాజిక వర్గాలు, ఇంతకాలం నిశ్శబ్దంగా, మౌనంగా వున్న సమూహాలు, మేధోశ్రేణులు తమ గొంతులు సవరించుకుంటున్నాయి. సామాజిక వికాసానికి కొత్త భాష్యం చెప్పుతున్నాయి. ఇప్పటిదాకా తమ ప్రమేయం లేకుండా సాగిన సిద్ధాంత చర్చను 'భూమార్గం' పట్టిస్తున్నాయి.

ఈ ఖండం గత మూడు, నాలుగు దశాబ్ధాలుగా సమాజంలో, సామాజిక ఆలోచనా ధోరణిలో, సమాజశాస్త్ర సిద్ధాంత విశ్లేషణలో వచ్చిన మార్పులకు అర్థం పడుతుంది. ఈ మార్పులన్నింటినీ సంక్షిప్తంగానే అయినా సవివరంగా ఒకే ఒక్క భాగంలో వివరించడం జరిగింది. అది:

- సమాజశాస్త్ర సిద్ధాంతంలో ఇటీవలి ధోరణులు

BRAOU

BRAOU

# భాగం-24: సమాజశాస్త్ర సిద్ధాంతంలో ఇటీవలి ధోరణులు

విషయక్రమం


24.0 ఉద్దేశాలు

24.1 పరిచయం

24.2 కొత్త ధోరణులు-నేపథ్యం

24.3 విమర్శనాత్మక సిద్ధాంతం (క్రిటికల్ థియెరీ)

24.4 స్త్రీవాద దృక్పథం

24.5 ఆధునికతానంతర వాదాలు

24.6 నిమ్నశ్రేణి సిద్ధాంతం (సబాల్టర్న్ థియెరీ)

24.7 కొత్త వాదాల బాగోగులు

24.8 సారాంశం

24.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

24.10 చదవదగిన పుస్తకాలు


## 24.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సమాజశాస్త్ర అధ్యయనంలో ముందుకు వచ్చిన నవీన ఆలోచనా విధానాలను అవగాహన చేసుకుంటారు.
- రెండో ప్రపంచ యుద్ధానంతరం సమాజశాస్త్రంలో వచ్చిన కొత్త సిద్ధాంతాల గురించి తెలుసుకుంటారు.
- క్రిటికల్ థియెరీ స్వభావాన్ని తెలుసుకుంటారు.
- స్త్రీవాద దృక్పథంలో వచ్చిన మార్పులను అవగాహన చేసుకుంటారు.

## 24.1 పరిచయం

మారుతున్న సమాజాన్ని అందుకు అనువైన, సరికొత్త, భిన్నమైన పద్ధతులతో చదవగలిగినప్పుడే యావత్ సమాజంలో స్థూల-సూక్ష్మస్థాయిలలో వచ్చిన, వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకోవడం సాధ్యపడుతుంది. ఫ్రెంచి విప్లవానంతర కాలంనుంచి, అంటే సుమారు క్రీ.శ 1800 ఆదిగా మానవ సమాజం-ముఖ్యంగా యూరోపియన్ సమాజం ఆధునికతా యుగంలోకి ప్రవేశించినదని చెప్పవచ్చు. మొత్తం సమాజాన్ని, దాని గమనాన్ని అఖండంగా, టోకున అవగాహన చేసుకోవచ్చుననే భావన అధునికతా యుగాన్ని శాసించింది. కానీ రెండు ప్రపంచ యుద్ధాల తాకిడికి ఈ భావన తన ప్రాభల్యాన్ని కోల్పోక తప్పని పరిస్థితి తలెత్తింది. ప్రపంచ గమనాన్ని, సమాజగతిని సాకల్యంగా అర్థం చేసుకోవడానికి అప్పటి దాకా సాధనంగా వున్న హేతువు (రీజన్)కు గల శక్తి మీద తాత్వికుల్లో సందేహాలు రేగిన ఫలితంగా సిద్ధాంత రంగంలో పెద్ద సంక్షోభం చోటు చేసుకున్నది. సమాజ, సమాజశాస్త్ర అధ్యయన రీతులను అదుపు చేస్తూవచ్చిన పాజిటివిజం, మార్క్సిజాల పరిమితులు, లోపాలు వేరుగా చూడడంతో సమాజతత్వ చింతనా రంగంలో సరికొత్త సిద్ధాంతాల రూపకల్పనకు పూర్వ రంగం సిద్ధమైంది. 'శాస్త్రరంగాలకు అన్వయించిన పాజిటివిజం వంటి



BRAOU

అధ్యయన విధానలను సమాజశాస్త్ర రంగానికి అన్వయించడం తగదనే భావన బలపడిన ఫలితంగా సంకుచితమైన అనుభవ వాదం, ఆర్థిక వాదాలకు అతీతంగా ఆలోచించే సామాజిక తత్వవేత్తల బృందం ఉద్భవించింది. శాస్త్ర, నైతిక, సౌందర్య రంగాలలో హేతువు, వివేచన ప్రాతిపదికగా కొన్ని సార్వత్రిక విలువలను ప్రామాణికంగా సాధించవచ్చునని విశ్వసించిన ఆధునికతావాదం మారిన కాలమాన పరిస్థితులలో ఎన్నో విమర్శలను ఎదుర్కొన్నది. వెల్లువెత్తిన విమర్శలకు సమాధానం చెప్పలేక చతికిలపడింది. ఆధునికతావాదం అలా వెనుకడుగు వేసింది. ఈ పరిణామం తాత్విక రంగంలో ఒక స్పష్టత ఏర్పడడానికి తోడ్పడింది. సిద్ధాంతం కాలం చెల్లినదైనప్పుడు దానిలోని వాస్తవికత కొరవడి, ఆ సిద్ధాంతం బుట్టదాఖలా కాక తప్పని పరిస్థితి ఏర్పడి తీరుతుందనేదే ఆ స్పష్టత. వాస్తవికతను కబలించే పాజిటివిజం అంశగల అన్ని సిద్ధాంతాలు, చిరకాలంగా పలు రూపాలలో ఆధిపత్యస్థానంలో వుంటూ భావజాల రంగాన్ని హరించివేసిన సిద్ధాంతాలు, సిద్ధాంతం హోదా కోల్పోయి కేవలం రాజకీయ భావజాలం (ఐడియాలజీ)గా శుష్కించిపోయిన వాదాలు ఈ దెబ్బకు కొంతవరకైనా తెరవెనక్కి పోయాయని చెప్పవచ్చు. నైశిత్యంలేని సూత్రీకరణలు, కూడికలు, తీసివేతల స్థాయి కుండలీకరణలతో, వాస్తవికతను పరిగణలోకి తీసుకొని మూస పద్ధతులతో 'శాస్త్రీయత' పేరిట సమాజ అధ్యయనానికి దొడ్డిదారులు తొక్కిన ఈ తప్పుడు ఆలోచనా విధానాలు చివరికి తోకముడవక తప్పలేదు. మార్క్సిజం, పాజిటివిజాలు వదిలిపెట్టిన, నిర్లక్ష్యం చేసిన, చూడ నిరాకరించిన అంశాలు, కోణాలను కొత్త కాలపు తత్వ ధోరణులను ప్రతిఫలించాయి. ఉదాహరణకు మహిళల హక్కులు, నల్లజాతివారి అణచివేత, పీడనకు గురవుతున్న భిన్న విభిన్న సమూహాల ఆకాంక్షలు, వారి నిరసనలను, ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి నిర్దిష్టమైన మరెన్నో ఉద్యమాలను ఆయా సమూహాల అస్తిత్వ సమస్యలను ఉనికి పోరాటాలను, ఈ నూతన సమాజశాస్త్ర సిద్ధాంత ధోరణులు పట్టించుకున్నాయి. సిద్ధాంత రంగంలో హేతువు ఆధిపత్యాన్ని నిలదీయడం ద్వారా చరిత్రలో దాని నిర్హేతుక పాత్రను బహిర్గతం చేయడం ద్వారా, అది పరిరక్షిస్తూ వచ్చిన అనేక విలువల కొలమానాలను ఈ కొత్త వాదాలు తలకిందులు చేశాయి. సత్యం సంపూర్ణం కాదు సాపేక్షమని, సార్వత్రికత స్థానంలో నిర్దిష్టత కావాలని, మానవతావాదం, హేతువాదం, సార్వత్రిక న్యాయం, అభివృద్ధి, ఏకత్వం, వంటివి పిడివాదం రూపాలే తప్ప నిజాలు కావని, నిష్కర్షగా, సాధికారికంగా ప్రకటించి సిద్ధాంత, భావ విప్లవ రంగాలను ప్రక్షాళన చేసిన ఖ్యాతి ఈ కొత్త భావధారకు దక్కుతుంది. సమాజ అధ్యయనానికి పదునైన కొత్త పనిముట్లు కనిపెట్టిన స్త్రీవాద, ఆధునికానంతర వాదాల వంటి కొంగ్రొత్త వాదాల పుట్టుకకు గల చారిత్రక నేపథ్యాన్ని ఇప్పుడు పరిశీలిద్దాం.

BRAOU

## 24.2 కొత్త ధోరణుల నేపథ్యం

సమాజశాస్త్రం తొలినాళ్లనుంచి పాజిటివిజం (పిడివాదం) కనుసన్నలలో దాని ప్రస్థానం సాగించింది. సమాజశాస్త్రాన్ని స్వతంత్ర ప్రతిపత్తిగల ఒక శాస్త్రంగా తీర్చిదిద్దిన ఆద్యులు అగస్ట్ కోమ్ట్, ఎమిలి దుర్ఖైమ్, హెర్బర్ట్ స్పెన్సర్స్ వంటి వారంతా పాజిటివిస్టులు కావడం ఇందుకు దోహదం చేసింది. ప్రకృతిశాస్త్రాలను అధ్యయనం చేయడానికి ఉపయోగించే శాస్త్రీయ పద్ధతులనే సమాజ పరిణామాల అధ్యయనానికి అన్వయించాలని చెప్పే సిద్ధాంతమే పాజిటివిజంగా చలామణీలోకి వచ్చింది. 'శాస్త్రవాదం'గా పైకి కనిపించే దీనిని ఒక విధమైన పిడివాదమని చెప్పక తప్పదు. పిడివాదం కాబట్టే ప్రకృతిని, మానవ సమాజాన్ని ఒకే గాటనకట్టి-ఒకే విధమైన శాస్త్రీయ పద్ధతులతో ఆ రెంటినీ అధ్యయనం చేయాలని పాజిటివిజం చెప్పగలిగింది. సత్ఫలితాలను ఇవ్వని, ఇవ్వజాలని సైద్ధాంతిక ఉపకరణాలతో చేసే ఏ అధ్యయనమైనా ఆనాటినుంచి పాజిటివిజంగా గుర్తింపు పొందుతున్నది ఇందుకే.

ఫ్రెంచి విప్లవం (1789) తరువాత కాలంలో భావజాలరంగంలో స్థిరరూపంతీసుకున్న రాజకీయతాత్విక చింతననే ఆంగ్లంలో 'ఎన్‌లైటెన్‌మెంట్' (భావవికాసం) అంటారు. స్వేచ్ఛ-సమానత్వం-సౌభ్రాతృత్వం ప్రాతిపదికగా శాస్త్ర అధ్యయనం పట్ల మొగ్గుతో, ఉదారవాదం ఆచరణలోకి వచ్చిన ఈ కాలాన్ని 'ఎన్‌లైటెన్‌మెంట్ యుగం'గా గుర్తించారు. తెలుగులో దీనిని మనం వికాసయుగం అనవచ్చు. జ్ఞానం ప్రకాశించి వికాసం కలిగినకాలం అన్నమాట. ఏకశిలా సదృశమైన సూత్రాలు, నిర్మాణాలు అమిత గౌరవం పొందిన కాలమది. మానవులందరూ సమానులేనని, న్యాయం పొందడానికి అందరూ సమానంగా అర్హులేనని, నైతిక, సౌందర్య విలువలలో ఏకసూత్రత ఇమిడి వుందని,

హేతు ప్రజ్వలనంతో చీకటి తొలగి వెలుతురు ప్రసరిస్తుందని, వాస్తవం కేవలం వస్తువును ఆశ్రయించివుంటుందని, ఆత్మాశ్రయమైనది అబద్ధమని, సత్యం అంతిమం, పరిపూర్ణమని, చరిత్రగతిలో పురోగతి నిక్షిప్తమై వుంటుందని, కాలం పురోగామి అని, శాస్త్ర ప్రగతి బాసటగా సమాజం యావత్తు అభివృద్ధి దిశగా పయనిస్తున్నదని-ఇటువంటి నిర్ధారణకు నిలవని అంశాలు వికాసయుగంలో మానవ మస్తిష్కాన్ని ఊగించి శాసించాయి. కాలగమనంలో ఈ విశ్వాసాలకు వాస్తవిక పునాదిలేదని, అవి భ్రాంతిజనితాలని దాదాపుగా రుజువైంది. మానవజాతి తన గురించి వేసుకున్న గొప్ప అంచనాలు స్వీయమానసిక వైఖరిని దాటిపోలేదని ఈ పరిణామాలు స్పష్టం చేశాయి. ఉదారవాదం వాస్తవంలో ప్రపంచ ప్రజల అనుభవంలో, దేశ దేశాలలో ఏవిధంగా పరిణమించిందో ఎటువంటి ఫలితాలనిచ్చిందో చరిత్ర చదివి తెలుసుకోవచ్చు. ఉదారవాదం పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదానికి, ఫాసిజానికి 'మేలిముసుగు'గా పనిచేసిందని మహాత్మాగాంధీ ఒక సందర్భంలో చేసిన వ్యాఖ్యానం ఇక్కడ మననం చేసుకోవాలి. ఉదారవాదం ఆయా దేశాలలోని స్థానిక జాతుల అణచివేతకు, బడుగు దేశాల వనరుల దోపిడీకి (వలసీకరణకు) దారులు వేసిన మాట అబద్ధ కాజాలదుకదా!

అదేవిధంగా 'శాస్త్రీయత' పేరిట 'హేతువు'కు అగ్రాసనం వేసి శాస్త్ర ప్రగతితో ప్రపంచ గతిని మార్చివేస్తామని ప్రగల్భాలుపలికిన ఉదారవాద దేశాధినేతలు వాస్తవానికి చేసింది ఏమిటో చరిత్ర మనముందు ఏనాడో వుంచింది. "మనుషులను పశువుల మందగా మార్చే ప్రక్రియకు ముద్దుపేరే ఉదారవాదం" అని జర్మన్ తాత్వికుడు నీట్షే చెప్పినమాట ఈ పరిణామాన్నే సూచిస్తున్నది. వికాసయుగం ప్రతిపాదించిన అంశాలకు, విలువలకు, సూత్రీకరణలకు మార్క్సిజం సిద్ధాంతం-ఆచరణ లోబడి వున్నాయేతప్ప వాటిని అతిక్రమించలేదు. అందువలన వికాసయుగానికి సంబంధించిన అన్ని జాడ్యాలు మార్క్సీయ భావజాలానికి సంక్రమించాయి. శాస్త్ర, రాజకీయ, తత్వ రంగాలలో వికాసయుగం-దాని ఉదారవాదం, పాజివిజాలు మార్క్సిజానికి పరిమితి విధించాయి. మార్క్సిజం సిద్ధాంతకర్త మార్క్స్ వాస్తవానికి పాజిటివిజానికి బద్ధవిరోధి. వికాసయుగం ముందుకు తెచ్చిన ఉదారవాదాన్ని రాజకీయార్థిక తత్వశాస్త్రవేత్తగా అధిగమించి ఇంకా ముందుకు చూసినవాడు మార్క్స్. కానీ స్ఫటిక సదృశ్యమైన మార్క్స్ ఆలోచనలు ఆచరణ రూపం దాల్చలేదు. అందుకే ఆచరణలో మార్క్సిజం 'పిడివాదం'గా రూపుతీసుకున్నది. మార్క్సిస్టులు (అందరూకాదు, ఎక్కువ మంది) చెప్పే చారిత్రకవాదం (హిస్టారిసిజం), శాస్త్రవాదం(సైంటిజం), రాజ్యవాదం (స్టేటిజం), చట్టవాదం (లీగలిజం), అర్థికవాదం (ఎకనామిజం)-సారాంశంలో పాజిటివిజం భిన్న రూపాలేకావడం గమనార్హం. చరిత్ర, రాజ్యం, శాస్త్రం, చట్టం, అర్థికం-ఇలా దేనికదే ఒక అంతిమ సత్యంగా, పరిష్కారమార్గంగా భావించడం మూలానే ఆచరణ వికటించింది. 'హేతువు'కు పెద్ద పీటవేస్తే అది పాలితులను అణిచివేయడానికే పనికొచ్చింది. సోషల్ ఇంజనీరింగ్ (సమాజపునర్నిర్మాణం!) ద్వారా మనుషులను మరలుగా, యంత్రాల విడిభాగాలుగా, అస్తిత్వం లేని నిర్జీవులుగా భావించి. అవమానించిన చరిత్ర హస్త్రతువుది" హేతుబద్ధీకరణ ద్వారా మనుషుల్ని 'బందీ'లుగా మార్చిన ఘనచరిత్ర దానిది. 'ప్రధాన స్రవంతి' సమాజానికి సమాంతరంగా అజ్ఞాత సమాజాలను నిర్మించిన 'ఖ్యాతికూడా దానికే దక్కుతుంది. నేరస్తులు, వేశ్యలు, పిచ్చివాళ్లు, స్వలింగ సంపర్కులను సృష్టించిన జగద్విఖ్యాతి హేతుబద్ధీకరణది. ఎయిడ్స్‌భూతం ఈరోజున వర్ధమాన ప్రపంచదేశాలను పట్టిపీడిస్తున్నదంటే అందుకు కారణం వికాసయుగపు 'హేతుబద్ధతే'నంటే అతిశయోక్తికాదు. సమాజాన్ని రెండుగా నిలువునా చీల్చి నామమాత్రపు ప్రధాన స్రవంతి సమాజంలో మైనారిటీ (సంఖ్యాపరంగా కొద్దిమందికి/ సమూహాలకు)కి అన్ని హంగులు, వసతులు కల్పించి, మెజారిటీ జనాన్ని సభ్య సమాజపు అంచులకు నెట్టేయగల శక్తి, పనితనం 'హేతువు'కు మాత్రమే వున్నది. వలసవాదపు అవశేషమే ఈ హేతువు-హేతుబద్ధీకరణ. బ్రిటీషు ప్రభువులు తమ వలస దేశాలలో అవలంభించడానికి రూపొందించుకున్న ఆధునిక వాదానికి, దాని అణచివేత సాధనాలకు వలస అనంతర కాలం (post-colonial era) లో కూడా ప్రాచుర్యం తగ్గకపోవడం ఏమి సూచిస్తున్నది? ప్రజాస్వామ్యం (ఎన్నికల ప్రక్రియ ద్వారా ప్రాప్తించే శుష్కప్రజాస్వామిక ప్రభుత్వం/ప్రతిపక్షం-అవ్యవస్థ) మనుగడలో వున్న అన్ని దేశాలలో రా:: యంత్రాంగం ఆధునికతావాదాన్ని, ఉదారవాదం ముసుగులో అమలు చేస్తూ, ప్రజలకు వివక్షతో కూడిన పాలనను అందిస్తున్నదని సమీప భవిష్యత్తులో కూడా ఈ ఉదారవాద ప్రజాస్వామ్యానికి (లిబరల్ డెమొక్రసీ) ప్రత్యామ్నాయంలేదని తెలిసిపోవడం లేదా?

'ఆధునికత'ను 'జగన్నాథరథం'గా అభివర్ణించిన సామాజికశాస్త్రవేత్త బ్రిటన్‌కు చెందిన ఆంథోని గెడ్డెన్స్

(జగన్నాథరథం ఇంగ్లీషులో 'జాగర్‌నాట్'గా రూపాంతరం చెందింది.

ఆధునికవాదానికి / ఉదారవాదానికి ప్రధానంగా నాలుగు వ్యవస్థలు ప్రాణవాయువు అందిస్తాయని గిడ్డెన్స్ సూత్రీకరించారు. అవి వరుసగా 1. పెట్టుబడిదారీ వ్యవస్థ, 2. పారిశ్రామికీకరణ, 3. జనాభమీద నిరంతర నిఘా వ్యవస్థ, 4. సైనికశక్తి (హింసా సాధనాలమీద పూర్తి అదుపు). ఈనాలుగు వ్యవస్థల అండదండలతో ఆధునికత జగన్నాథ రథంలా ముందుకు కదులుతుందని ఆయన తేల్చిచెప్పాడు. ప్రపంచవ్యాప్తంగా ఏదేశాన్ని చూసినా గిడ్డెన్స్ మహాశయుడు చెప్పింది నూటికి నూరుపాళ్లు నిజమని తెలుస్తుంది.

ఈ స్థితిలో వున్న సమాజాలకు ఆయా సమాజాలను అధ్యయనం చేసు&తన్న కసిద్ధాంతాలకు నూతన జవసత్వాలు ఇవ్వడానికి 1945-50 మధ్యకాలం నుంచి ముందుకొచ్చిన సిద్ధాంతాలు, వాదాలనే సామాజిక శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు మార్క్స్ అనంతర, వలసీకరణ అనంతర వినిర్మాణవాదాలుగా గుర్తిస్తున్నారు. స్త్రీవాదం ఈ వాదాలలో ప్రముఖమైనది. హెగెల్, నీట్షే, ఫ్రాయిడ్‌ల తత్వాలను జోడించి ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ సిద్ధాంతవేత్తలు రూపొందించిన 'క్రిటికల్ థియెరీ' (విమర్శనాత్మకసిద్ధాంతం) -నయా మార్క్సిజంగా గుర్తింపుపొందింది.

ఆధునికతావాదం / రష్యన్ సామ్రాజ్యవాదం/ ఉదారవాదాల పరిమితులను వెలుగులోకి తేవడంలో ఈ సిద్ధాంతం కీలక భూమిక పోషించింది. ఆధునికానంతర ధోరణి ఈ అన్ని వాదాలలో కొంచెం హెచ్చుతగ్గులుగా కనిపిస్తుంది. సాపేక్షత, సంక్లిష్టత, భిన్నత్వం, అనిశ్చితి, నిర్దిష్టత, అనేకత్వం, వైవిధ్యం, తక్షణత వంటి వాస్తవికత తాలూకు అన్ని కోణాలను అణచివేయకుండా, అలక్ష్యం చేయకుండా అతినిశితంగా పట్టించుకునే ధోరణి ఈ అన్ని వాదాలలోనూ మనకు గోచరిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రస్తుత బహుళజాతి దశకు అనుగుణంగానే ఆధునికానంతర ధోరణులు తలెత్తాయనే విమర్శ వుంది. వినిమయదారుల సమాజానికి, ప్రచారసాధనాల ప్రాబల్యంలో వున్న సమాజానికి సరిపోయే సిద్ధాంతం ఆధునికానంతర వాదమన్నవారు కూడా వున్నారు. ఆధునికానంతర తాత్విక ధోణి ఒక వాదంగాకన్నా జీవన వాస్తవంగా ఎక్కువ విశ్వసనీయతను సంతరించుకోవడం వలన అది దినదినం ఆకర్షణీయంగా మారుతూ బలపడుతున్నది. దేశదేశాలలో సమాజం అంచున ఉనికిని కోల్పోయి బతుకుతున్నవారి వర్తమాన సంకటస్థితిని, సిద్ధాంత విముఖతను సార్వకాలిక, సార్వజనీన, శాశ్వత సత్యాలను తిరస్కరించే విశ్వాసరాహిత్యాన్ని బహుముఖీనతను జవాబులు దొరకని సంక్షోభాన్ని భ్రమలు పోయి ఏర్పడిన భీతావహాన్ని, ఇజాలకు కాకుండా జీవన వాస్తవికతకు అగ్రాసనం వేయాలనే ఆకాంక్షను, బంధనాలను తెంచుకుంటున్న సృజనశీలతను- ఒక్కమాటలో చెప్పాలంటే వారందరి యధార్థ స్థితిని సరైన దృక్కోణంలో గ్రాహ్యం చేసుకోవడానికి ఆధునికానంతర ధోరణులు ఎంతో ఉపకరిస్తాయి. ఈ ధోరణులలో ముఖ్యమైన వాటిని, సమాజ అధ్యయనాన్ని ప్రభావితం చేసిన వాటిని ఇప్పుడు కొంచెం వివరంగా పరిశీలిద్దాం.

## 24.3 విమర్శనాత్మక సిద్ధాంతం (క్రిటికల్ థియెరీ)

హెగెల్‌నుంచి స్ఫూర్తి పొందిన మార్క్సిజం (జార్జ్ లూకాక్స్, గ్రామ్సీల హెగెలియన్ మార్క్సిజం కాదు) 1920-60 మధ్యకాలంలో జర్మన్-అమెరికా దేశాలలో ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ మార్క్సీయతత్వ విచార కేంద్రం ఆధారశిలగా వృద్ధి చెందింది. సంప్రదాయ మార్క్సిజం, సోవియన్ మార్క్సిజం ఎదుర్కొన్న సంక్షోభాలకు, సిద్ధాంతపరంగా వాటిలోవున్న లోటుపాట్లకు సమాధానాలు వెదకడానికి ఫెలిక్స్ జె.వెయిల్ నెలకొల్పిన సంస్థే Institure of Social Research. 1923 ఫిబ్రవరి మొదటివారంలో జర్మనీ దేశం ఫ్రాంక్‌ఫర్ట్ నగరంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో మాక్స్ హోర్క్ హైమర్, థియెడర్ అడార్నో, హెర్బర్ట్ మార్క్యూస్, ఎరిక్ ఫ్రామ్, జుర్గెన్ హెబర్ మస్ వంటి ప్రసిద్ధ మేధావులు, తాత్వికులు తమ అధ్యయనాలతో మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సుసంపన్నం చేశారు. హిట్లర్ రాజ్యం తాకిడికి తట్టుకోలేక 1934లో ఈ కేంద్రం ఫ్రాంక్‌ఫర్ట్‌నుంచి న్యూయార్క్ నగరంలోని కొలంబియా విశ్వవిద్యాలయానికి తరలిపోఇయింది. తిరిగి 1949లో యుద్ధం ముగిసిన కొంతకాలానికి కేంద్రం జర్మనీకి మరలివచ్చింది. ఈ కేంద్రం నుంచి సిద్ధాంతరగంలో పనిచేసినవారి భావధారనే 'క్రిటికల్ థియెరీ' అన్నారు. తొలిదశలో మార్క్స్ సిద్ధాంతాలను, మాక్స్‌వెబర్ సిద్ధాంతాలతో జతచేసి వారు చేసిన అధ్యయనాల మూలంగా సమాజశాస్త్ర రంగంలో మార్క్సిస్టు సిద్ధాంతానికి సానుకూలత

BRAOU

ఏర్పడిందని చెప్పాలి. అమెరికన్ సమాజశాస్త్ర వేత్తలు రూపొందించిన 'సమాజశాస్త్ర' పద్ధతుల సాయంతో మార్క్సిస్టులకు పనికివచ్చే అంశాలమీద వారు చేసిన పరిశోధనలకు ప్రధాన స్రవంతి సమాజశాస్త్రవేత్తల ఆమోదం లభించడం, వారి అధ్యయనాలు ప్రాచుర్యం పొందడానికి తోడ్పడింది. ఇది మలిదశ. మూడో దశలో సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రతిపాదించిన మనోవిశ్లేషణ సిద్ధాంతాన్ని మార్క్స్-వెబర్‌ల సైద్ధాంతిక అంశాలతో సమన్వయపరిచి ఫలప్రదమైన ఒత్త చర్చలకు దారులు వేశారు. కొత్త ప్రశ్నలకు కొత్త జవాబులు రాబట్టారు. అయితే 1970నాటికిగానీ వారి 'విమర్శనాత్మక సిద్ధాంతా'నికి అమెరికాలో గుర్తింపురాలేదు. ప్రధానంగా సాంస్కృతిక రంగం మీద వారు తమ దృష్టిని కేంద్రీకరించారని చెప్పాలి. లోతుకు వెళ్లిచూస్తే మార్క్సిస్టు సిద్ధాంతంలోని ఆర్థిక నియతివాదాన్ని నయామార్క్సిస్టుల యాంత్రిక భౌతిక వాదాన్ని, సిద్ధాంతాలను యాంత్రికంగా అన్వయించే తీరును వారు విమర్శించారు. పాశ్చాత్య సంప్రదాయ సంగీతం, నాటక రంగాలమీద, సాహిత్య, సౌందర్యశాస్త్రాలమీద థియొడర్ అడార్నో చేసిన కృషి గణనీయమైనది. పాజిటివిజం మీద క్రిటికల్ థియెరీ వాదులు పెట్టిన విమర్శ విస్తృతంగా ప్రచారం పొందింది. తరువాతి తరాలమీద ఎనలేని ప్రభావం కనబరిచింది. మానవకార్యాచరణను, మనిషి సంకల్పాన్ని కించరచడందార్వరా పాజిటివిజం అంతిమంగా మనిషి ఉదాసీనునిగా,ప్రేక్షక మాత్రునిగా మార్చివేస్తుందని వెబర్‌మస్ విమర్శించాడు. మార్క్స్‌లో సైతం పాజిటివిజం ఛాయలు వున్నట్లు వెబర్‌మస్ రావాడు. సిద్ధాంతం, ఆచరణలకు మధ్య గూరం పెంచే పాజిటివిజాన్ని ఫ్రాంక్‌ఫర్ట్‌స్కూల్‌వారి విమర్శల తరువాత కూడా నిర్మాణవాద మార్క్సిస్టులు విడనాడకపోవడం గమనార్హం.సమాజశాస్త్ర అధ్యయనాన్ని పట్టి పీడిస్తున్న శాస్త్రవాదాన్ని (సైంటిజం) కూడా వారు ఎండగట్టారు.

ఆధునిక సమాజంపై వారు అతినిశితమైన విమర్శలను ఎక్కుపెట్టారు. సంప్రదాయ మార్క్సిస్టు సిద్ధాంతం ఆర్థిక కోణానికి అత్యధిక ప్రాధాన్యమిస్తే, క్రిటికల్ థియరిస్టులు సాంస్కృతిక కోణానికి (మార్క్సిస్టు పరిభాషలో ఉపరితలం) ప్రాధాన్యతనిచ్చారు. ఆధునిక (పెట్టుబడిదారీ) సమాజాన్ని 'హేతువు' (రేషనాలిటీ) అణచివేస్తున్న తీరుతెన్నులను వారు చాలా లోతుగా అధ్యయనం చేశారు. హేతుబద్ధంగావున్నట్టు కనబడే ఆధునిక సమాజం వాస్తవానికి అత్యంత నిర్హేతుకమైన పునాదులమీద ఏర్పడిందని హెర్బర్ట్ మార్క్యూస్ తన రచన 'వన్ డైమెన్షనల్ మాన్' గ్రంథంలో ప్రకటించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నియంతృత్వానికి ఎలా దారితీస్తుందో ఆయన తేటతెల్లం చేశారు. మనుషుల అంతర్లోకాన్ని ఆక్రమించి, వారిని స్వేచ్ఛకోరుకోని పెంపుడు బానిసలుగా తీర్చిదిద్దుతున్న క్రమాన్నికూడా ఆయన వివరించాడు.

భారీపరిశ్రమగా మారిన సాంస్కృతిక రంగం, టి.వి వంటి ప్రచార సాధనాలు వాస్తవిక ప్రపంచానికి, మనుషులకు మధ్య సంబంధం లేకుండా చేసి వారిని రాజ్యం కనుసన్నలలో బుద్ధిగా మెలిగే పరాధీనులుగా మార్చుతున్న క్రమాన్ని వారు వెల్లడించారు. ఆత్మాశ్రయత్వానికి మార్క్సిస్టు సిద్ధాంతంలో తగు స్థానాన్ని కల్పించడంలో, గతితర్కానికి పదును పెట్టడంలో కూడా వారి కృషి ఎన్నదగినది. అడార్నో రాసిన 'నెగెటివ్ డయాలెక్టిక్స్' ప్రతీ మార్క్సిస్టూ చదవాల్సిన గ్రంథం. హెబర్‌మస్, డగ్లస్ కెల్నర్‌లు మార్క్సిస్టు సిద్ధాంతం అంతర్గతంగా ఎదుర్కొంటున్న సమస్యలను, కాలగమనంలో అది నిత్యం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో ఈనాటికీ నిమగ్నమైవున్నారు.

## 24.4 స్త్రీవాద దృక్పథం

స్త్రీ కేంద్ర బిందువుగా సమాజ జీవనం, మానవ చరిత్ర ముడిసరుకుగా విస్తృ ప్రాతిపదికపై రూపుదిద్దుకొన్న సిద్ధాంతం స్త్రీవాదం. సమాజంలో స్త్రీల స్థానాన్ని, వారి అనుభవాల ఆధారంగా అధ్యయనం చేయడం, స్త్రీల సమస్యలను వారి దృక్కోణం నుంచి చూడడం, స్త్రీలకు ఇంతకన్నా మెరుగైన ప్రపంచాన్ని సృష్టించడానికి ప్రయత్నించడం స్త్రీవాదం తన లక్ష్యాలుగా నిర్ధారించుకున్నది. స్త్రీవాదానికి వున్న విశిష్టత ఏమిటంటే, అది అనేక శాస్త్రాలకు కూడలి. స్త్రీజాతి స్థితిగతులను అధ్యయనం చేయడానికి ఒక్క సమాజశాస్త్రం సరిపోదు. మానవ, జీవశాస్త్రాలు, అర్థికశాస్త్రం, చరిత్ర, న్యాయ, తత్వశాస్త్రాలు, రాజకీయ, మానసిక శాస్త్రాలు, సాహిత్యం వంటి భిన్న శాస్త్రాలు స్త్రీజాతి స్థితిగతులను అవగతం చేసుకొనేందుకు తోడ్పడతాయి

'మరి స్త్రీల సంగతి ఏమిటి?' అనే సాదాసీదా ప్రశ్న సామాజిక రంగంలో అల్లకల్లోలం సృష్టించిందంటే నమ్ముతారా?

BRAOU

మేధావులు, పండితులు శోధించిన రంగాలలో స్త్రీలు ఎదురుపడ్డారా? పడితే వారి పరిస్థితి ఏమిటి? ఎదురుపడకపోతే ఎందుకు పడలేదు? తాము వున్న స్థితిగురించి వాళ్లు ఏమనుకొంటున్నారు? ఏమిచేయాలనుకొంటున్నారు? స్త్రీవాదం గురించిన ఈ అతి మామూలు ప్రశ్న, మామూలుగా కనబడే ప్రశ్న పెద్ద గాలిదుమారమే సృష్టించింది. ఈ ప్రశ్న తలెత్తే వరకు పరుష ప్రపంచానికి కనీసం స్ఫురించలేదు. తమది ఏకలింగ ప్రపంచంగా వుందని, స్త్రీలు తామున్న చోట ఎంత వెదికినా కనబడే అవకాశం లేదని, 'ఆకాశంలో సగం' అని గొప్పలగా చాటుకునే మాట కల్లబొల్లి కబురేతప్ప అందులో వీసమెత్తుకూడా నిజం లేదని.

28ఏళ్లుగా పదేపదే అడుగుతున్న ఈ ప్రశ్నకు జవాబులు, కొంత ఆలస్యమైనా అసంతృప్తిగా వున్నా దొరికాయనే చెప్పవచ్చు. అంతర్జాతీయ మహిళాదినాన్ని మార్చి 8వ తేదీన 1975 సంవత్సరం నుంచి ప్రపంచదేశాలు జరుపుకొంటున్నాయి. ఈ 28 ఏళ్ల కాలంలో స్త్రీల గురించి పురుష ప్రపంచానికి కొన్ని విషయాలు కొత్తగా తెలిసివచ్చాయి. దానితోపాత భ్రమలు ఒకమేరకైనా తొలగాయి. స్త్రీలను తొక్కిపెట్టి, దాచిపెట్టి ఎదగకుండా చేసి, వారిని అదృశ్యం చేసి పురుష ప్రపంచం స్త్రీల శక్తియుక్తులను కళ్లారా చూసి నివ్వెరపోయింది. ఎత్తినతల దించుకొంది. తమలో అంతర్గతంగా వున్న భేదాలు, హెచ్చుతగ్గుల గురించికూడా స్త్రీలనుంచి ఈరోజున ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పురుషులతో పోల్చి చూసుకుంటే స్త్రీలందరు అసమానంగా వునట్టే. స్త్రీలలో స్త్రీలు ఎందరో అసమానులుగా వున్నారు. వారు మిగిలిన వారితో సమానంగాలేకపోవడానికి జాతి, మతం, కులం, వర్గం, పుట్టిన ప్రాంతం వంటి అంశాలు కారణమవుతున్నాయి.

పురుషులు యజమానులుగా, స్త్రీలు సేవకులుగా వున్నందున ఆధిపత్యస్థానంలో వున్న పురుష యజమానుల అనుభవసారమే జ్ఞానంగా ఇంతకాలం చలామణీలో వుంది. సేవకులుగా, బానిసలుగా వుంటూ (అదృశ్యశక్తిగా) యజమానుల బహిర్లోకాన్ని నడిపించిన స్త్రీల అనుభవాలు-జ్ఞాపకాలు జ్ఞానంగా ఇప్పుడు మార్పు చెంది ఉన్నతీకరించబడటంతో సమాజ జ్ఞాన శాస్త్రం ఒక్కసారి తలకిందులైంది. స్త్రీ పురుషుల మధ్య పాతుకుపోయిన తారతమ్యాలు లోకం వెలుగు చూసే సరికి యజమాని లోకం తారుమారయ్యే పరిస్థితి ఉత్పన్నమైంది. పైగా ఇన్నేళ్లు ఆమెకు రావనిచెప్పిన (తననుతాను మభ్యపుచ్చుకోవడానికి, లోకాన్ని మభ్యపెట్టడానికి) విద్యలన్నీంటా ఆమె తనకు సమానంగా వుండటం, కొన్నింట తనకన్నా ముందుండటంతో ఇప్పుడు మొదటికే మోసం వచ్చింది. స్త్రీవాదం మూలాన రంగ ప్రవేశం చేసిన ఈ సరికొత్త జ్ఞాన సంపదతో సమాజశాస్త్రం ఇప్పుడు సుసంపన్నమవుతున్నది. యూరప్‌లో క్రీ.శ. 1630లో తొలి స్త్రీవాద నిరసన సాహిత్యం ప్రచురితమైంది. 1780 నుంచి స్త్రీ సాహిత్యం క్రమంగా పెరుగుతూ వచ్చింది. అమెరికన్, ఫ్రెంచి విప్లవాల నేపథ్యంలో ఇంగ్లండ్‌లో స్త్రీవాద భావ స్రవంతి ఉద్యమరూపం తీసుకొన్నది. 1970లో స్త్రీవాదం మహోద్యమంగా ముందుకొచ్చింది. సిమన్‌దిబువా, జర్మయన్‌గ్రీర్, కేట్ మిల్లెట్ వంటి స్త్రీవాదుల రచనలు సాహిత్య, సాంస్కృతిక, తాత్విక రాజకీయ రంగాలలో పెనుసంచలనాలు సృష్టించాయి.

సమాజశాస్త్రం 1830-1960 మధ్య కాలంలో అంటే 130 ఏళ్లలో పూర్తిస్థాయి శాస్త్రంగా ఎందిగిందని చెప్పవచ్చు. ఒక దృక్కోణంగా అవతరించి క్రమంగా చివరకు ఒక శాస్త్రంగా రూపుతీసుకున్న సమాజశాస్త్రానికి ప్రాణ ప్రతిష్ట చేసింది పురుషులు కాదు స్త్రీలంటే ఎవరూ బహుశా నమ్మరు. కానీ ఇది నిజం. ఆగస్ట్ కోమ్టే, స్పెన్సర్‌లకు ముందే హరియత్ మూర్తినూ (1802-1874) సమాజశాస్త్రానికి సంబంధించిన గ్రంథాన్ని ప్రచురించాడు. తరువాతికాలంలో కూడా మహిళలే శాస్త్రాభివృద్ధికి ఇతోధికంగా పాటుపడ్డారు. కానీ వారి పేర్లు మరుగునపడిపోయాయి. లైంగిక రాజకీయాలు రంగంమీదకు వచ్చిన నేపథ్యంలో సమాజశాస్త్రం పురుడుపోసుకోవడం జరిగింది కాబట్టే ఆనాడు విద్యాధిక మహిళలు సమాజ చరిత్ర అధ్యయనం పట్ల ఆసక్తి కనబరిచారు. క్రమంగా పురుష పెత్తనం పెరిగి స్త్రీల భావాలను తోసిపుచ్చడం, వారిని వెలుపలికి గెంటివేయడం, లేదంటే అంచులకు నెట్టేయడం చేశారు. సమాజశాస్త్ర రంగంలో కీలక పాత్ర పోషించిన స్పెన్సర్, వెబర్, దుర్ఖైమ్, టాల్‌కోట్ పార్సన్స్- అందరికందరూ స్త్రీల వాదాలను చెవిన పెట్టడానికి ఇష్టపడనివారే కావడం, ఒకవేళ చెవిన పెట్టినా తిరోగమనవాదులుగా సంప్రదాయ దృష్టితో చూసినవారే కావడం మూలంగా లైంగిక అసమానతలకు సంబంధించిన అంశాలకు శాస్త్ర ప్రతిపత్తి లభించలేదు. యూరోపియన్ స్త్రీల స్థితిగతులకు సంబంధించి సమాజశాస్త్ర వేత్తలు సంగ్రహించిన జ్ఞానమంతా బ్రిటిష్ స్త్రీలకు సంబంధించినదే వుంది. దీనికి కారణం ఇతర భాషా ప్రాంతాలకు చెందిన స్త్రీ రచయితల పుస్తకాలు విరివిగా అనువాదం కాకపోవడమేనని చెప్పాలి.



BRAOU

మనం ఇప్పటికే చెప్పుకొన్న - తొలి మహిళా సమాజశాస్త్ర గ్రంథకర్త పుస్తకం 'ఇల్లస్ట్రేషన్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' 1832-34 మధ్య కాలంలో వెలుగులోకి వచ్చింది. పురుష సమాజశాస్త్రవేత్తల జీవన సహచర్యల హోదాలో హరియట్ టేలర్ మిల్, గెర్ట్రూడ్ సిమ్మెల్, మరియానె వెబర్ విడిగా, తమ భర్తలతో జంటగా విశేషంగా గ్రంథరచన చేసి శాస్త్ర అభివృద్ధికి తమవంతు కృషి చేశారు. మాక్స్ వెబర్ సహచారిణి మరియానెవెబర్ సొంతంగా పదకొండు పుస్తకాలు వెలువరించినా అవేవీ ఆంగ్లంలోకి అనువాదం కాలేదు. లైంగిక రాజకీయాలకు అద్దం పట్టేవిధంగా ఆమె రాసిన తన భర్త జీవిత చరిత్ర మాత్రం అనువాదమైంది. సామాజిక ఉద్యమకారులుగా, క్రియాశీల కార్యకర్తలుగా సంఘజీవనంలో పాలుపంచుకుంటూ సమాజ అధ్యయనం చేసిన రచయిత్రులు కూడా వున్నారు. ఫ్లోరా ట్రిస్టన్, క్లారా జర్కిన్, రోసా లక్సంబర్గ్ వంటి సోషలిస్టులు, హెలెన్ స్టోకర్, ఆలివ్ ష్రైనర్ వర్జీనియా వూల్ఫ్ వంటి ఫెమినిస్టులను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అమెరికాలో మాదిరి ఆర్థికంగా భద్రతగల తరగతికి చెంది, ఉన్నత విద్యలు చదువుకొని , సంఘసంస్కర్తలుగా పేదల మధ్య పనిచేస్తూ సమాజశాస్త్ర గ్రంథాలు రాసినవారు కూడా లేకపోలేదు. బియాట్రిస్ పాటర్వెబ్ ఇందుకు దృష్టాంతంగా నిలుస్తారు. అయినా వీరి జాడ ఏ చరిత్ర పుస్తకంలోనూ కనబడదు. ఉన్నత విద్యా కేంద్రాలలో లింగవివక్ష మేర మీరి వుండడం వల్లనే వీరి ఉనికి లేకుండా పోయింది. సమాజశాస్త్ర రంగానికి జన్మనిచ్చిన తండ్రుల జాబితా ఇతర పురుష ప్రముఖుల జాబితా 1840 నుంచి 1965 దాకా చాంతాడంత వుంది. కానీ ఆ జాబితాలో మీకు ఎక్కడా ఒక్కరంటే ఒక్కరైనా మహిళ జన్మనిచ్చిన తల్లి హోదాలో కనిపించదు. సాధారణ హోదాలో కూడా కనిపించదు.

1960 దాకా సమాజశాస్త్రంలోకి ఫెమినిస్టు భావాలను అసలు ప్రవేశించనివ్వలేదు. సమాజనిర్మాణం, శ్రమవిభజనకు సంబంధించి ఏర్పాట్లు లింగం ప్రాతిపదికగా జరుగుతున్న వైనాన్ని 'ప్రధానస్రవంతి' సమాజశాస్త్ర వేత్తలు గుర్తించ నిరాకరించారు. దుర్ఖైమ్ 'ఆత్మహత్య' గ్రంథంలో స్త్రీల అనిశ్చిత జీవితాలను గురించి చేసిన చర్చలో సమస్యను సంప్రదాయ దృష్టితోనే చూశాడు. మరణం అంచుల్లో బతికే మహిళల మీద ఆయనకున్న శ్రద్ధ ఎంతటిదో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. సమాజం అస్థిరత్వం పాలుకాకూడదంటే వివాహ బంధం బలంగా వుండాలి. అందుకుగానూ లైంగిక శ్రమ విభజన ప్రకారం గృహిణి/తల్లి పాత్ర పోషించే స్త్రీ, ఇంటిపట్టునే వుంటూ అనురాగంగా కుటుంబ సభ్యుల ఆలనపాలన చూసుకోవాలని, లోకం మీద పనులను మగవాడు దక్షతగా చక్క బెట్టుకోవలని టాల్కాట్ పార్సన్స్ ఉద్భోదించాడు. 1960 దాకా సమాజశాస్త్రం స్త్రీలకు విరోధిగా వుందని చెప్పడానికి పార్సన్స్ ఈ అవగాహన మచ్చుతునకగా నిలుస్తుంది.

స్త్రీవాద సిద్ధాంతం బహుముఖీనమైనది. లింగబేధం, లైంగిక అసమానత, లైంగిత అణచివేతల ఆధారంగా ఎనిమిది పాయలుగా స్త్రీవాదం ముందడుగు వేస్తున్నది. అవి వరుసగా 1. సాంస్కృతిక స్త్రీవాదం, 2. జైవిక స్త్రీవాదం, 3. ఉదారవాద స్త్రీవాదం, 4. మార్క్సియన్ స్త్రీవాదం, 5. మనోవిశ్లేషణాత్మక స్త్రీవాదం, 6. రాడికల్ స్త్రీవాదం, 7. సోషలిస్ట్ స్త్రీవాదం, 8. మూడోదశ (థర్డ్వేవ్) స్త్రీ వాదం.

సాంస్కృతిక, జైవిక స్త్రీవాదాలు స్త్రీల యథాపూర్వ స్థితిని సమర్థిస్తాయి. సంస్కృతి పరమైన శిక్షణ వలన, జైవికమైన స్వాభావిక లక్షణాల వలన స్త్రీలు పురుషులకు భిన్నంగా రూపుదిద్దుకున్నారనీ, ఈ భేదం స్త్రీ పురుషులు వున్నంతకాలం యథాతథంగా వుంటుందని, అయితే ఈ లింగభేదం ప్రాతిపదికగా స్త్రీకి సవన్యాయం జరగాలనివీ వాదాలు ఆశిస్తాయి. సాంస్కృతిక స్త్రీవాదానికి మార్గరెట్ ఫుల్లర్, జైవిక స్త్రీవాదానికి ఏలిస్ రోసీ ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

లైంగిక అసమానతలు ప్రాతిపదికగా తలెత్తిన స్త్రీవాదాలలో ఉదారవాద, మార్క్సియ స్త్రీవాదాలు ముఖ్యమైనవి. ఉదారవాదులు మగమదవాదాన్ని (సెక్సిజం) అన్ని తప్పులకు మూలకారణంగా చెబుతారు. మగమదం పెట్రేగిపోవడం మూలానే బాల్యం నుంచి స్త్రీలు అవమానాలపాలవుతూ కుంచించుకుని పోయి బతుకుతున్నారని, స్త్రీలకు పురుషులతో సమానంగా అవకాశాలు అమెరికావంటి ప్రజాస్వామిక దేశంలో కూడా అందుబాటులో లేవవని వాపోయే ఉదారవాద స్త్రీవాదం సారాశంలో సంస్కరణ వాదం. అమెరికా విలువల చట్రానికి, అక్కడి వ్యవస్థాగత జీవనవిధానానికి పూర్తి ఆమోద ముద్రవేసే ఉదారవాదం వ్యక్తి వాదానికి స్వేచ్ఛా భావనకు, సమానావకాశాల కల్పనకు అధిక ప్రాధ్యాతనిస్తుంది.



BRAOU

మార్క్సియన్ స్త్రీవాదం వర్గవిశ్లేషణకు స్త్రీవాద సాంఘిక నిరసనను జోడిస్తుంది. సోషలిస్ట్ స్త్రీవాదం మీద దీని ప్రభావం చాలా ఎక్కువ కావడం వల్లనే, ఇది ఇటీవలి కాలంలో అమితమైన ప్రాధాన్యం సంతరించుకుంది. స్త్రీల అణచివేతకు కారణాలు సామాజికమైనవి, కుటుంబ వ్యవస్థ స్త్రీల దుస్థితికి ముఖ్యహేతువని, సమాజవ్యవస్థ మౌలిక రూపంగా కుటుంబ వ్యవస్థను చిత్రించి, దాని పరిరక్షణకు యథాతథవాదులు నిరంతరం పాటుపడుతుంటారని, చరిత్రలో స్త్రీని ఓటమిపాలు చేసిన శక్తులు ఆర్థికపరమైనవని, శ్రమశక్తి దోపిడీ రద్దయితే, సొంత ఆస్తి వ్యవస్థకు కాలం చెల్లితే స్త్రీజాతి విముక్తి చెందుతుందని మార్క్సియన్ స్త్రీవాదం బోధిస్తుంది. మార్క్స్, ఎంగెల్స్‌ల సిద్ధాంతాలతోపాటు రోసాలక్సంబర్గ్ వంటి మార్క్సిస్ట్ వాదుల ఆలోచనలు- ఆచరణ మార్క్సియ స్త్రీవాదాన్ని ప్రభావితం చేశాయి.

లైంగిక అణచివేత ప్రాతిపదికగాగల స్త్రీవాద సిద్ధాంతాలలో మనోవిశ్లేషణాత్మక, రాడికల్, సోషలిస్ట్ వాదులువున్నారు. స్త్రీల మీద పెత్తనం చేయడం ద్వారా, వారిని నిరంతరాయంగా పీడనకు గురిచేయడం ద్వారా, పురుషులు ప్రత్యేకమైన ప్రయోజనాలు పొందుతారని, పురుషాధికారానికి, అధిక్యానికి ఉనికిలోవున్న స్త్రీ పురుష సంబంధ చట్రం అనువుగా వున్నందున, ప్రస్తుత పురుషస్వామ్య వ్యవస్థ మనుగడలో ఎల్లకాలం వుండాలని పురుషజాతి కోరుకుంటున్నదని ఈ వాదాలు చెబుతాయి. స్త్రీలను అణచకుండా అదుపుచేయకుండా వుండలేని పురుషస్వభావం మూలంగానే స్త్రీ పురుషసమానత్వం సిద్ధించడంలేదని మనో విశ్లేషణాత్మక స్త్రీవాదులు చెబుతున్నారు. వున్న స్థితి మారడంగురించి కాకుండా అది అలాగే ఎందుకున్నదో విశదం చేయడానికి ఈ ఫ్రాయిడియన్ స్త్రీవాదం తోడ్పడుతుంది.

రాడికల్ స్త్రీవాదం పురుషుల చేతుల్లో స్త్రీల అణచివేతను తెల్లవారి చేతుల్లో నల్లవారి అణచివేతను చూసిన విధంగా చూస్తుంది. స్త్రీలను అత్యంత విలువైనవారిగా, మంచి గుణాలు మూర్తీభవించిన దేవతా సమానులుగా చిత్రించే రాడికల్ స్త్రీవాదానికి ఆచరణలో రాజీలేనిపోరాట శీలాన్ని కలిగివుండే మిలిటెంట్ గ్రూప్‌లతో సామ్యం కనిపిస్తుంది. పితృస్వామ్యం స్వభావసిద్ధంగా స్త్రీలను అణచివేస్తుందని, అదిదానినైజమని, వర్గం, కులం, జాతి, తెగ, లింగం, పరలింగతత్వం వంటి అంశాలన్నీ అణచివేత సాధనాలేనని, ఈ అంశాలలో 'లింగం' అతి ముఖ్యమైన అణచివేత సాధనమని రాడికల్ స్త్రీవాదులు నమ్ముతారు. స్త్రీలపై ప్రయోగించే హింస పితృస్వామ్యాన్ని కాపాడుతున్నదని చెప్పే రాడికల్ వాదులు అటు మార్క్సియన్, ఇటు ఫ్రాయిడియన్ స్త్రీవాదుల భావాలను స్వీకరించి ఆలోచనల్లో, ఆచరణలో ఆరెండు వాదాలను దాటిపోయారని చెప్పవచ్చు. సోషలిస్ట్ స్త్రీవాదం ఏకకాలంలో అటు మార్క్సియన్, ఇటు రాడికల్ స్త్రీవాద దృక్పథాలను తనలో ఐక్యం చేసుకొనేందుకు ప్రయత్నిస్తుంది. వర్గవిశ్లేషణకు, లింగ వివక్షకు అది సమానమైన ప్రాధాన్యం ఇస్తుంది. సంప్రదాయ మార్క్సిస్టులు వర్గపీడనను తప్ప లైంగిక పీడనను ఎంతమాత్రం పట్టించుకోనందువల్లే కమ్యూనిస్టుపార్టీల మహిళా కార్యకర్తలు, నాయకులు స్వావలంభవం నుంచి జ్ఞానవంతులైన స్త్రీవాదులుగా ఎదిగారు. సోషలిస్ట్ ఫెమినిజం ఈ విధంగా మార్క్సిస్టు సిద్ధాంతం-ఆచరణలతో పరిమిత స్థాయిలోనే కావచ్చు. మమేకమైన వారిని పార్టీలోపల, వెలుపల స్త్రీవాద ఉద్యమకారులుగా తీర్చిదిద్దింది.

మూడో దశ (థర్డ్‌వేవ్) స్త్రీవాదం స్త్రీలలో అంతర్గతంగా వున్న తరతమ భేదాలను హెచ్చుతగ్గులను పట్టించుకొని వాటిని తొలగించడానికి కృషి చేస్తున్నది. స్త్రీవాద శిబిరంలో అత్యంత క్రియాశీలకంగా వున్న గ్రూప్ ఇదేనని చెప్పవచ్చు. 1980 దశకం తరువాత ముందుకొచ్చిన ఈ స్త్రీవాదం స్త్రీలంతా లింగపరంగా ఒక్కటేననే సాధారణ, సార్వత్రిక స్థాయి నుంచి క్రిందికిపోయి నిర్దిష్టత ప్రాతిపదికపై జాతి, తెగ, భాష, కులం, ప్రాంతం, సామాజికహోదా వంటి లైంగికేతర అంశాలను నిశితంగా పరిశీలిస్తుంది. స్త్రీలమధ్య నెలకొనివున్న తేడాలను అవగాహన చేసుకోవడానికి ఇది ప్రాధాన్యమిస్తుంది. మొదటి, రెండో దశల్లో రూపుదిద్దుకున్న స్త్రీవాదాల పరిమితులను అధిగమించడమే లక్ష్యంగా గల ఈ మూడో దశ స్త్రీవాదం కడగొట్టున వున్న నిమ్నజాతుల స్త్రీల స్థితిగతులను అధ్యయనం చేయడానికి వారి హక్కులకోసం పోరాడటానికి సంసిద్ధమవుతున్నది. జ్ఞానానికి సంబంధించి స్త్రీవాద సమాజశాస్త్రం సిద్ధాంతంగా ఎట్టకేలకు నిర్దిష్టమైన ఆకృతి తీసుకొన్నది కనుక సమాజశాస్త్ర చరిత్రలో స్త్రీలకు చిరకాలం జరిగిన అన్యాయం ఇక తొలగినట్లే.

## 24.5 ఆధునికతానంతర వాదాలు

వర్తమానసమాజం ఆధునిక ప్రపంచంగానే వుందా లేక సమాజంలో వచ్చిన గణనీయమైన మార్పుల వలన



BRAOU

ఆధునికతానంతర సమాజంగా మారిపోయిందా? అనే ప్రశ్న ఈరోజు సమాజశాస్త్రాన్ని కుదిపేస్తున్నది. ఈరెండు ధోరణుల మధ్య చర్చ నిరంతరాయంగా సాగుతున్నది.

ఆధునికతను నిర్వచించిన తొలితరం సమాజశాస్త్రవేత్తలలో మార్క్స్, మాక్స్‌వెబర్, దుర్‌ఖైమ్, జార్జ్‌సిమ్మెల్ ముఖ్యులు. ఆధునికతను సమాజ పరివర్తనలో కీలకమైన దశగా గుర్తించిన ఈ నలుగురు ఆధునికత తాలూకు పురోగామి తత్వాన్ని విమర్శనాత్మకంగా అధ్యయనం చేసినా దాని సమస్యాత్మకతను, సంక్లిష్టతను చాలినంత లోతుగా పరిశీలించలేదు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ప్రతిఫలంగా ఆధునికతను మార్క్స్ నిర్వచించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ తెచ్చిన గుణాత్మక సామాజిక పరిణామాలను మార్క్స్ ఎంతటి తీవ్రస్థాయిలో ఇష్టపూర్తిగా స్వాగతించాడో, ఆ వ్యవస్థ లక్షణాలను (దోపిడీ, పరాయీకరణ) కూడా అంతే తీవ్రంగా నిరసించాడు. ఆర్థిక కోణానికి మాత్రమే అయిన ఆలోచనలు ఎక్కువ సందర్భాలలో పరిమితం కావడం మూలంగా 'ఉపరితలం'కు సంబంధించిన ఇతర అనేక అంశాలు, వాటి నీలినీడలు ఆయన దృష్టినుంచి తప్పించుకోగలిగాయి.

ఆధునికత ముందుకు తెచ్చిన హేతువీకరణ (సాధరణీకరణ)ను అది అన్ని రంగాలకు విస్తరించడాన్ని మార్క్స్ వెబర్ లోతుగా పట్టించుకున్నాడు. రూపపరమైన , సారహీనమైన, హేతువీకరణ, ఇతర మానవీయ హేతువీకరణతో క్రమాలను అణచివేయడం, మానవ జీవితాన్ని అది శాసించడం, తత్ఫలితంగా వ్యవస్థ ఒక 'ఇనుపబోను'గా మారిపోవడం వెబర్‌ను కలచివేసింది. హేతువీకరణ క్రమం నిర్మాణ పరంగా వ్యవస్థ పనితీరును సులభసాధ్యం చేయడాన్ని సమర్థించిన వెబర్ అది తెచ్చిపెట్టిన కఠిన సమస్యలపరిష్కారానికి సమాధానాలు వెదికే ప్రయత్నం చేశాడు.

ఆధునికత సమాజవ్యవస్థను ఒక అఖండమైన బృహత్ నిర్మాణంగా మలచడం మూలాన సమిష్టి అంతస్తు బలహీనపడి, మనుషులు ఎవరికి వారుగా విడిపోయి అనామకత్వానికి గురయ్యారని కొత్త వ్యవస్థ ఉత్పత్తి పెంచి, కొత్త స్వేచ్ఛను ఇచ్చిన వారిని ఒంటరి తనానికి తద్వారా సంక్రమించే మానసిక అస్వస్థతకు లోనుచేసిందని దుర్‌ఖైమ్ భావించాడు.

జార్జి సిమ్మెల్‌ను ఆధునికతకు సంబంధించిన మొదటి సమాజశాస్త్రవేత్తగా పరిగణిస్తారు. నగరం, ద్రవ్య ఆర్థిక వ్యవస్థలు కేంద్రంగా సిమ్మెల్ ఆధునికత వ్యాప్తిని అధ్యయనం చేశాడు. అంతకాలం అణచివేయబడి అవ్యక్తంగా వున్న మానవుడి అంతర్గత శక్తులు ఆధునికతాయుగంలో బహిర్గతమవుతాయని చెప్పిన సిమ్మెల్ మనిషి పరాయీకరణకు గురికావడం ఈ యుగంలోకూడా పరాకష్టకు చేరుకుంటుందని కూడా చెప్పాడు. సాంస్కృతికంగా మనిషి తీరని విషాదానికి లోనవుతాడని వ్యక్తిగత సంస్కారం, సంస్కృతులను వస్తుగత సంస్కృతి నశింపచేస్తుందని పరాధీనత వ్యక్తిని దుఃఖితుడిగా మారుస్తుందని చెప్పిన ఆధునికతావాది. సిమ్మెల్‌లో ఆధునికతానంతరవాదికూడా కనిపిస్తాడు.

ఆధునికతను అతిముఖ్యమైన సమర్థకుడిగా హెబర్‌మస్ నిలుస్తాడు. ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ సభ్యునిగా తొలుత లోకానికి పరిచయమైన హెబర్‌మస్ 'ఆధునికత'ను 'ఇంకా పూర్తికాని కార్యక్రమం'గా చూస్తాడు. వికాసయుగం వైఫల్యం చెందిందనే నెపంతో ఆధునికతను విడిచిపెట్టడం తగదని, దానిని లోపరహితం చేసి మునుముందుకు తీసుకుపోవాలని హెబర్‌మస్ సూచిస్తాడు. ఆధునికతను పట్టిపీడిస్తున్న జాడ్యాలకు ఎన్నో పరిష్కారమార్గాలను సూచించడంద్వారా హెబర్‌మస్ ఆధునికతానంతర వాదుల విమర్శలకు జవాబులు చెప్పే ప్రయత్నంచేశాడు. మానవ జీవన క్షేత్రానికి ఆధునికతాయుగంలో ఏర్పడిన 'వ్యవస్థ'లకు మధ్య అంతరం పెరిగిపోవడం వల్లనే సమస్యలు ఏర్పడ్డాయని, ఈ అంతరం తగ్గిననాడు ఆధునికత తన గమ్యం చేరుకుంటుందని హెబర్‌మస్ వ్యాఖ్యానించాడు. ఆధునికత ప్రాజెక్టు విఫలమైతే మానవజాతికి భవిష్యత్ కనుమరుగవుతుంది కనుక 'ఆధునికత'ను ఎన్ని కష్టనష్టాలకైనా ఓర్చి తీరం చేర్చాలనే తపన లక్ష్యశుద్ధి హెబర్‌మస్‌లో మనకు కనిపిస్తాయి.

ఆధునికతను ఇటీవలికాలంలో లోతుగా అధ్యయనం చేసిన సమాజశాస్త్రవేత్తలలో అంథోనీ గిడ్డెన్స్, ఉల్రిక్‌బెక్ జార్జి రిట్జర్, బౌమన్‌లు ముఖ్యులు.

ఆధునికత సృష్టించిన బృహత్తర వ్యవస్థల లోటుపాట్లను ఆ వ్యవస్థల సృష్టికి కారణమైన మహావాదాలను, కథనాలను, అవి సృష్టించిన సంక్షోభాలను, వైపరీత్యాలను సవివరంగా, అతి నిశితంగా అధ్యయనం చేసి పరిస్థితి



BRAOU

తీవ్రతను లోకం ముందుంచిన ఫ్రెంచి అధునికతానంతర వాదులలో మైకెల్ పూకో, డెరిడా బోద్రిలా, ల్యోటా ముందువరుసలో వుంటారు. ఫ్రెడరిక్ జేమ్సన్ వంటివారు తమదైన మార్గంలో 'అధునికత' రోగనిర్ధారనం చేసి చికిత్సాపద్ధతులను కనిపెట్టే యత్నం చేశాడు. అధునికతానంతరస్థితి ఒకరు కనిపెట్టింది, సృష్టించింది కాదు. అది జీవనవాస్తవికత అని ల్యోటా చేసిన ప్రసిద్ధ వ్యాఖ్యానం అధునికతానంతర వాదాలను అర్థం చేసుకునేందుకు దోహదం చేస్తుంది. అధునికతానంతర వాదాన్ని సమాజశాస్త్రంలో అంతర్భాగంగా కాకుండా సామాజిక సిద్ధాంతంగా చూడవలసిన అవసరం వుంది. సామాజిక సిద్ధాంతాలను అన్ని శాస్త్రాలు ప్రభావితం చేస్తాయి కనుక వాటిని కేవలం సమాజశాస్త్ర దృష్టితో చూడడం కుదరదు.

మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసే ప్రయత్నంలో భాగంగా హెగెల్ సాయంతో సార్త్ ప్రతిపాదించిన అస్తిత్వవాద సిద్ధాంతం ముందుకు తెచ్చిన నయామానవతావాదం మీద తిరుగుబాటుగా ఈ అధునికతానంతర ధోరణులను చూడవచ్చు. నిర్మాణవాదం (లెవిస్ట్రాస్, లూకా, అత్తూజ, సౌసూ వంటివారు ఇందులో ప్రముఖులు. వీరు వరుసగా మానవ మనోవిశ్లేషణ, మార్క్సిస్టు భాషాశాస్త్రాలలో కృషి చేశారు.) ప్రతిపాదించిన నిర్మాణాలు, పాత ప్లేటో, కాంట్, హెగెల్, హుస్సెర్ల్ తత్వాలకు కొత్త రూపంగా నిర్మాణవాద అనంతర వాదులలో ముఖ్యుడైన మైఖెల్ పూకో భావించాడు. వినిర్మాణవాదానికి (డి కన్స్ట్రక్షన్) దారులు వేసిన డెరిడా కూడా నిర్మాణవాదం మీద గట్టి విమర్శ పెట్టాడు. పూకో, డెరిడాలు వేసినబాటలో నడిచి అధునికతానంతర వాదాన్ని మరింత ముందుకు తీసుకుపోయిన వారు ల్యోటా, బోద్రిలా. సెమియాటిక్స్ అనే సంకేత అధిభాషా శాస్త్రాన్ని నిర్మాణ భాషా వేత్త సౌసూ స్ఫూర్తితో వృద్ధి చేసిన రోలా బార్తే, సిచ్చుయేషనిస్ట్ గుయెదెబోల ప్రభావం వీరిమీద అధికం.

స్థూలంగా చూస్తే అధునికతానంతర వాదాల పరిధి లోకివచ్చే నిర్మాణవాద అనంతర వాదం (పోస్ట్ స్ట్రక్చరలిజం) మార్క్సిస్టు సిద్ధాంతం ఆగిపోయినచోటినుంచి బయలుదేరి అధికారం అసలు రూపాన్ని అతి సూక్ష్మస్థాయిలో అధ్యయనం చేసింది. పూకో సునిశితంగా, సమర్థంగా చేసిన ఈ పని సమాజంలోని అనేక రంగాలను (వైద్య, మానసిక, నేర లైంగిక శాస్త్రాలు/వ్యవస్థలు) అతలాకుతలం చేసింది. తత్వశాస్త్ర, సాహిత్య విమర్శరంగాలమీద పూకో ప్రభావం అత్యధికం. జర్మన్ తత్వవేత్త నీషే ప్రారంభించిన 'గుట్టురట్టు' కార్యక్రమాన్ని పూకో పరిపూర్తి చేశారని చెప్పవచ్చు. హేతువు (రీజన్) -వికాస యుగానికి ఆయువుపట్టుగా వుండి పశ్చిమనాగరికత నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన హేతువు- అణచివేతకు, అబద్ధం పునాదిగా వ్యాప్తిలోకి వచ్చి స్థిరపడిన భావజాలాలకు, మనిషిని కార్యరంగానికి, వాస్తవికతకు దూరం చేసి 'భ్రాంతి'కి పరిమితం చేస్తున్న నానావిధాల ఇజాలకు కారణమైన హేతువు-పూకో చేతిలో కోలుకోలేనివిధంగా చావుదెబ్బతిన్నది.

భాష సాధనం (కేంద్రబింధువు)గా, అణచివేత లక్ష్యంగా సార్వత్రిక ఆలోచనావిధానాల కోసం సాగిన అన్వేషణ (ప్లేటోనుంచి సార్త్ దాకా: నీషే, విట్గెన్ స్టయిన్ వంటి ఒకరిద్దరు ఇందుకు మినహాయింపు) ఎంత బూటకమో చెప్పిన ఖ్యాతి డెరిడాకు దక్కుతుంది. భాషను అధిపత్యస్థానం నుంచి తోసివేసి, భాషకు మనిషి భావదాస్యం చేయనవసరంలేని స్థితి కల్పించి, మనిషిని అదుపాజ్ఞల్లో పెట్టే 'దైవత్వ' హోదా నుంచి భాషను కేవలం 'రాత' స్థాయికి తగ్గించి మనిషిని, ఇతర సామాజిక వ్యవస్థలను వినిర్మాణం (డి కన్స్ట్రక్షన్) చేసి డెరిడా అధునికతానంతర చేతనను బలోపేతం చేశాడు.

## అధునికతానంతరవాదం

అధునికతానంతరవాదం ఉనికిలోకి రావడానికి దారితీసిన వివిధ దశలను, పరిణామాలను, ఆలోచనా సరళులలను మనం ఇప్పటిదాకా సంక్షిప్తంగా పరిశీలించాం. ఈ వాదం ముఖ్యలక్షణాలను ఇప్పుడు పరిశీలిద్దాం. ఇప్పటికే ఈ వాదం గురించిన చర్చ కొంత చదివారు ఇప్పుడు మరిన్ని వివరాలు చదవండి. 'ఎన్లైటెన్మెంట్' (వికాసయుగం) యుగం తరువాతి కాలాన్ని సూచించడానికి అమెరికన్ మార్క్సిస్టు రచయిత సి.రైట్ మిల్స్ తొట్ట తొలుత 'పోస్ట్ మోడర్న్' అనే మాట వాడాడు. 'అధునియ యుగం చరమదశలో మనం ఇప్పుడు వున్నాం. దీనితరువాత వచ్చేదే అధునికతానంతర యుగం' అన్నాడు. 1959లో మిల్స్ తొలుత కళలు, ప్రజా సంస్కృతి, వాస్తు, సాహిత్యరంగాలలో తీవ్ర సంచలనాలు సృష్టించిన అధునికతానంతరవాదం తరువాత తరువాత తత్వ, సమాజశాస్త్ర



BRAOU

రంగాలలో వేడిపుట్టించింది. దాదాపు నలభై ఏళ్లుగా ఉనికిలోవున్నా, గత 20 ఏళ్లలోనే ఈవాదం బాగా ప్రాచుర్యం పొందింది. ఫ్రాన్స్‌లో పుట్టిపెరిగిన ఈ వాదం అమెరికాకుపోయి అక్కడి విశ్వవిద్యాలయాలలో పాదుకొన్న ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా కొన్ని కొన్ని విశ్వవిద్యాలయాలు దీనికి సంబంధించిన పాఠ్యాంశాలకు, అధ్యయనాలకు, పరిమితస్థాయిలో ప్రాధాన్యం ఇవ్వనారంభించాయి. మన దేశంలో విశ్వవిద్యాలయాలలోని వివిధ విభాగాలు అధునికతానంతరవాదాలకు ఈనాటికీ ప్రాముఖ్యం ఇవ్వలేదు.

యావత్ సమాజాన్ని ఒకటిగా అఖండంగా చూసి, మనిషిని దిగ్బంధనం చేసే పటిష్టమైన వ్యవస్థలను, కట్టుదిట్టంగా నిర్మించి, సమాజాన్ని నియంత్రించే అధునికతా విధానాలను పోస్ట్ -మెడర్నిస్టులు గట్టిగా వ్యతిరేకించారు. అవి మానవజాతి మనుగడకు ఎంత ప్రమాదకరమో, మానవ ప్రస్థానాన్ని అవి ఎలా కట్టడి చేస్తాయో ఆధిపత్య స్థానంలో వున్న భావజాలానికి, దానికి అనుగుణంగా ఏర్పడి అమలులోవున్న సామాజిక-రాజకీయ వ్యవస్థకు మనుషులతో అవి ఎలా ఊడిగం చేయిస్తాయో వారు సోదాహరణంగా నిరూపించారు. చెప్పక, బయటకురాక, అవ్యక్తంగా వుండిపోయిన దానిమీద, .అణచివేసినదానిమీద అధునికతానంతరవాది దృష్టి నిలుపుతాడు. ప్రముఖంగా కనబడని స్వల్పవిషయాలలో, నిరర్థకంగాతోచే సూక్ష్మవివరాలలో వాటి జాడ కనిపెడతాడు. 'జీవితపు సన్నని సందులే ఆకర్షణమాకు' అని మహాకవి శ్రీశ్రీ అన్నట్లు ('వ్యత్యాసం' కవిత-1937- మహాప్రస్థానం) పోస్ట్ మోడ్రనిస్టులు కూడా జీవితపు సన్నని సందులను శోధిస్తారు. 'ఇతరులలోని మిణుగురులను, వెలుగులోని చీకట్లను, వ్యత్యాసాలు, వ్యాఘాతాలను పరికించి చూస్తాడు.

'హేతువు' మితిమీరిన పెత్తనం మూలాన జీవితపు అన్ని రంగాలలో కరుడుగట్టుకుని పోయిన 'నిశ్చల నిశ్చితాల'ను బద్దలుగొట్టడమే తమ ఏకైక కార్యక్రమంగా వారు విగ్రహ విధ్వంసం చేసి 'ముందుదారి' మాది అని ప్రకటించారు. 'ఆధునికత' కట్టిన గోడలను పగులగొట్టారు. ప్రపంచ చరిత్రతో సమంగా పయనించే కవులవలె, తాత్వికులవలె 'సంధ్యాజీవులు, సందేహభావులు' కాగలిగారు. కనుకనే వారు ముందుకు పోయి చరిత్ర సృష్టించారు. ప్రపంచాన్ని తమ వెంటతీసుకొని పోయారు. 'ప్రధాన స్రవంతి' తత్వం, రాజకీయం, సమాజం తిరస్కరించినవాటిని, వదిలిపెట్టినవాటిని, బేఖాతరు చేసినవాటినిన వాళ్లు పట్టంచుకున్నారు. స్థూల దృష్టికి కనబడని ఎన్నెన్నో అబద్ధాలను, అన్యాయాలను, తప్పుడు విషయాలను, తలకిందుల విలువలను పీడనను వారు వెలుగులోకి తెచ్చారు. దీనికి ముందు వాళ్లు అధునికతావాదులు అవలంభించిన విధానాలలోని లోపాలను దోషాలను వెలికితెచ్చారు. ఇందుకుగానూ అధునికులవలె సమాజాన్ని నిలువుగా చూడకుండా అడ్డంగా చూడడం నేర్చుకున్నారు. అడ్డంగా చూస్తే అన్ని సంగతులు అవగతమవుతాయని అనుభవం ద్వారా గ్రహించి మన ముందు వుంచారు. ఫొటోగ్రాఫర్ డార్క్‌రూమ్‌లో 'నెగెటివ్'ను డెవలప్ చేసినట్లుగానే, పోస్ట్ మోడర్నిస్టు కూడా చరిత్ర (శాస్త్రం / తత్వం / భవజాలం వగైరా) చీకటికొట్టు (డార్క్‌రూం)లో కూర్చొని తొక్కిపెట్టిన దానిని (రహస్యాన్ని) తదేకదీక్షతో శోధించి, అసలు సిసలైన వాస్తవిక కోణాన్ని ఆవిష్కరిస్తాడు. ఉదారవాదం, సామ్యవాదంలకు కాలం చెల్లిన సంగతి గ్రహించడం వల్ల వాటి స్థానంలో వర్తమానకాలానికి అవసరమైన సరికొత్త రాడికలిజానికి మేధోగతమైన పునాదులు వేయాలనే కోరికే అధునికతానంతర వాదులను ఈ పనికి పురికొల్పింది.

సమాజనిర్మాణాన్ని భాషా నిర్మాణాన్ని కూలదోయడం ద్వారా కొత్త ప్రపంచ నిర్మాణానికి పునాదులు వేయాలని తలంచిన ఆధునితానంతర వాదులు ముందు వికాసయుగం అవశేషాలను నిర్మూలించే కార్యక్రమం చేపట్టారు. అందుకే 'జ్ఞానం/హేతువు'లకు 'సమాజం/అధికారా'లకు మనుషులను కట్టిపడవేసే క్రమశిక్షణను వారు నిరాకరించారు. హేతువు, సత్యం, న్యాయం, నీతివర్తనం, వాస్తవం వంటి 'కేవల'సత్యాలను, అంతిమ, సార్వకాలీన సూత్రాలను, అమూర్త భావనలను పుక్కిటపట్టిన వికాస యుగ స్రష్టలు, ద్రష్టలను కాలానుగుణంగా ఆయుగాన్ని కొనసాగించాలని చెప్పినవారి అంతేవాసులను, వారు టోకున తిరస్కరించారు. 'మనజీవితాలలోని విచ్ఛిత్తిని, అ-క్రమాన్ని, విధ్వంసాన్ని, వైచిత్రిని అవగాహన చేసుకొనేందుకు తోడ్పడేదే అందుకు అనువుగా వుండే చరిత్ర మనకిప్పుడు కావాలి' అని హేడెన్ వైట్ 'ట్రాఫిక్స్ ఆఫ్ డిస్‌కోర్స్' (1990) అనే తన గ్రంథంలో చెప్పడం ఈ విషయాన్నే సుబోధకం చేస్తుంది. చరిత్ర ద్వారా అనుకోకుండా వచ్చిపడే ఆపదలను, ప్రమాదాలను, అనిశ్చితులను, అస్థిరతలను, ఎదుర్కోగల శక్తి, వాటిని నిరాకరించక పరిశీలనకు స్వీకరించగలశక్తి పోస్టు మోడర్నిజాన్ని ఆకర్షణీయం చేస్తున్నదనే వాళ్లన్నారు.



BRAOU

మార్క్సిస్టుగా అధునికతానంతర వాదాన్ని లోతుగా పరిశీలించిన ఫ్రెడరిక్ జేమ్సన్ పోస్ట్ మెడర్నిజాన్ని నయా ఉదార, నయా వలస స్వభావాన్ని సంతరించుకొన్న పెట్టుబడిదారీ యుగపు తార్కిక పరిణామంగా ప్రతిఫలనంగా నిర్వచిస్తారు. 1. కళలు సాంత్రకోల్పోయి పైపై మెరుగులుకు పరిమితం కావడం, 2. సంస్కృతి ప్రచారముద్రకు పరిమితం కావడం, 3. భావావేశం కనుమరుగై పోవడం, 4. 'సత్యం'అనే భావనను విసర్జించడం, 5. స్వంతంత్రుడైన వ్యక్తి అదృశ్యం కావడం, 6. అత్మాశ్రయుడైన మనిషి/కార్యశీలి తెరమరుగైపోవడం, 7. చారిత్రకతను, గతాన్ని కోల్పోవడం, 8. కళాస్పృహ నషించడం, 9. సంగీతం, చిత్రకళలు అతుకుల బొంతలైపోవడం, గత కాలపు శైలీవిన్యాసాలు ఎల్లెడలా రాజ్యం చేయడం- ఈ తొమ్మిది లక్షణాలే అటు అధునికతానంతర చేతనను, ఇటు పెట్టుబడిదారీ సంస్కృతిని(లేట్ క్యాపిటల్) పట్టిస్తాయన్నది జేమ్సన్‌వాదం.

మారిన కాలానికి అనుగుణంగా భావజాలరంగంలో వచ్చిన మార్పుల సంపుటీకరణే పోస్ట్‌మోడర్నిజం అన్నది ఆయన విమర్శ. అయితే జేమ్సన్ విమర్శను అలెక్స్ కాలినికోస్, టెర్రీ ఈగిల్టన్, డేవిడ్ హార్వే, మార్క్ పోస్టర్ వంటి ఇతర నయామార్క్సిస్టులు, గతితార్కికవాదులు చేసిన విమర్శలను బోద్రిలా తిప్పికొట్టాడు. జేమ్సన్‌కు పూర్తి విరుద్ధమైన అధునికతానంతరవాది అయిన బోద్రిలా సమాజశాస్త్రవేత్తగానే తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. ఆయన తొలి రచన మార్క్సిస్టు దృక్పథంనుంచి వినిమయ సమాజంపై విమర్శ సంధించింది. అయితే అనతికాలంలోనే బోద్రిలా మార్క్సిజాన్ని (నిర్మాణవాదాన్నికూడా) వదిలిపెట్టాడు. బూర్జువా తత్వం వైరస్‌వలె మార్క్స్ ఆలోచనలను పట్టిపీటించిందని 1973లో రాసిన ఒక పుస్తకంలో ఆయన ఆరోపణ చేశాడు. 1980 తరువాత, తన సమకాలీన సమాజాన్ని అర్థం చేసుకునే క్రమంలో బోద్రిలా చేసిన రచనలు ఆయన అధునికతానంతర తత్వాన్ని వెలుగులోకి తెచ్చాయి. ప్రచార సాధనాలు, వినోద పరిశ్రమ, జ్ఞానాన్ని ఉత్పత్తి చేసే పరిశ్రమలు సమాజగమనాన్ని శాసిస్తున్నాయేతప్ప మార్క్సిస్టు సంప్రదాయార్థంలో 'ఉత్పత్తి' శాసించడంలేదని బోద్రిలా అంటాడు. అనుకరణ యాంత్రిక పునరుత్పత్తి సమాజగతిని నిర్దేశిస్తున్నాయన్నది ఆయన చేసిన మరొక ముఖ్య పరిశీలన. 'టీవీ- జీవితం'- ఒకదానికొకటి వేరుచేయలేనంతగా కలిసిపోయాయి. సృష్టించిన 'అభూతవాస్తవం' మానవ జీవితాన్ని 'అవాస్తవం'గా మార్చిందంటాడు బోద్రిలా. వాస్తవమనేది అదృశ్యమై పోవడం వల్ల భ్రాంతికూడా లేకుండాపోయి మనుషులు ఒక చీకటి గుయ్యారం (బ్లాక్‌హోల్)లో పడిమేడుకుతున్నారని బోద్రిలా అంటాడు. మృత్యువును ఆరాధించే సంస్కృతికి ఎర అయి వర్తమాన సమాజం కొట్టుమిట్టాడుతున్నదని, అమెరికా దీనికంతటికీ కారణమని ఆయన అభిప్రాయపడతాడు. తన పుస్తకం 'అమెరికా'(1986)లో ఆదేశం మీద వున్న అసహ్యాన్ని, అసహనాన్ని ఆయన బాహాటంగానే వెళ్లగక్కాడు. వినాశనం తుదిరూపాన్ని వీక్షించాలనుకునేవారికి అమెరికాకు వెళ్లవలసిందిగా అయన సలహా ఇస్తారు. ఈవిధంగా బోద్రిలా ఆలోచనలు పరిష్కామార్గానికి తావునివ్వవు. ఆశకు, విశ్వాసానికి అస్కారం ఇవ్వవు. సమాజగమనాన్ని గుణాత్మకంగా మార్చుకునే సామవకాశం బోద్రిలా తత్వవిచారంలో లేదు. జరిగిన 'చెడు'కు విరుగుడు లేదని భావించే బోద్రిలా రాజకీయ ఎజెండాలను, లక్ష్యసాధన దిశగా చేసే సమష్టి ప్రయత్నాలను నిరర్థక కార్యకలాపంగా భావిస్తారు.

సమాజశాస్త్ర సిద్ధాంతానికి అధునికతానంతరవాదం అవసరం లేదనే వారున్నారు. వారి మాట నిజం కాదు. బోద్రిలావంటి 'తీవ్రవాది' చెప్పే సిద్ధాంతం అసలుకే అవసరం లేదనేవారున్నారు. కానీ వారి అభిప్రాయం తప్పు. పెద్ద పెద్ద భావాలుండి, అంతకన్నా పెద్ద సామాజిక సమస్యల గురించి పట్టించుకున్న సిద్ధాంతానికే సమాజశాస్త్ర సిద్ధాంతం హోదా దక్కుతుందనుకున్నా బోద్రిలా సిద్ధాంతానికి ఆ అర్హతలున్నాయి. అనుకరణ, అధివాస్తవం వంటి భావాలు, ప్రచార సాధనాల సమాజ నియంత్రణ వంటి సామాజిక సమస్యలు ఆయన సిద్ధాంతంలో వున్నాయి. కనుక ఆయన ప్రతిపాదించిన వాదానికి సమాజశాస్త్ర సిద్ధాంత చరిత్రలో స్థానం వుందని జార్జ్ రిట్జర్ అంటాడు. కల్లోకాల సూచికలుగా ముందుకు వచ్చిన అధునికతానంతర ధోరణులు నూతన రాజకీయ, సామాజిక ఉద్యమాలకు ప్రేరణగా కూడా నిలుస్తుండం వల్ల కేవలం వాదాలుగా మాత్రమేకాక అచరణ శాస్త్రంగా కూడా వాటికి సమాజశాస్త్ర అధ్యయనంలో సముచిత స్థానం వుంటుంది. ప్లేటోనుంచి సార్త్ర్ దాకా సాగిన పాశ్చాత్య తత్వ శాస్త్ర ప్రస్థానం కాలగతిలో భావజాల రూపంలో ఏర్చికూర్చి పేర్చిన అబద్ధాల చిట్టాను బుట్టదాఖలా చేసినందుకు 'ప్రధాన స్రవంతి' సమాజం నడిపే 'సార్వత్రిక' రాజకీయ ఉద్యమాల దృష్టి పడనంత దూరంగా సమాజం అంచులలో మగ్గుతున్న వారి కోసం 'నిర్దిష్ట' రాజకీయ ఉద్యమాలను నడిపే అల్పసంఖ్యాక శక్తులకు కొండంత అండగా వుంటున్నందుకు

ఆధునికతానంతరవాదాలు, ధోరణులకు సమాజతత్వశాస్త్ర చరిత్రలో సగౌరవమైన స్థానం వుంటుంది.

## 24.6 నిమ్నశ్రేణి సిద్ధాంతం (సబాల్టర్న్ థియెరీ)

భారత జాతీయవాద చరిత్ర రచన, మార్క్సిస్టు చరిత్ర రచనలో భారత దేశపు అట్టడుగు ప్రజల చరిత్రకు స్థానం దొరకలేదని, చరిత్ర లోగిలినుంచి వారిని తోసివేశారని, ఆదివాసులు, రైతులు, కార్మికుల వంటి సాధారణ ప్రజల జీవన చరిత్రను లిఖితరూపంలో పెట్టకపోవడం వెనుక మతలబువున్నదని మొట్టమొదటిసారి విమర్శపెట్టి విధాన ప్రకటన చేసిన ఖ్యాతి నిమ్నశ్రేణి సిద్ధాంతకర్తల బృందానికి దక్కుతుంది. 1980లో కలకత్తా కేంద్రంగా సబాల్టర్న్ స్టడీస్ గ్రూప్ (నిమ్నశ్రేణి అధ్యయన బృందం) ప్రొఫెసర్ రణజిత్‌గుహ, పార్థ చటర్జీల నాయకత్వంలో ఏర్పడింది. ఈ బృందం తొలుత 'దక్షిణాసియా చరిత్ర-సమాజాల మీద రచనలు" వెలువరించింది. ఈ గ్రంథం1980లోనే వెలువడింది. ఈ గ్రూప్ ఇప్పటికీ మొత్తం పదకొండు సంకలనాలను విడుదల చేసింది. పదవ సంకలనం స్త్రీవాలు రచనలతో ప్రత్యేక సంచికగా వెలువడింది. దీనికి ప్రొఫెసర్ సుసీతారు సంపాదకత్వం నెరిపారు. ఇటలీ దేశానికి చెందిన సుప్రసిద్ధ మార్క్సిస్టు తత్వవేత్త, ఉద్యమనేత అంతోనియో గ్రామ్సీ ప్రతిపాదించిన సిద్ధాంతాలు ఇచ్చిన స్ఫూర్తితో సబాల్టర్న్ స్టడీస్ గ్రూప్ రంగం మీదకు వచ్చింది. పార్థచటర్జీ, షాహిద్ అమీన్, దపేశ్ చక్రవర్తి తదితరులు ఈ గ్రూప్‌ను బాధ్యత వహిస్తారు. జాతీయవాద చరిత్ర రచన ఆసాంతం మూడు హిందూ అగ్రకులాలకు చెందిన పౌరుల, నాయకులు వీరోచిత గాథలను గానం చేయడానికి వారి జీవన స్థితిగతులను అధ్యయనం చేయడానికి పరిమితమైంది. బ్రిటీష్ వలస ప్రాంతాలలో, సంస్థానాలలో జాతీయవాద చరిత్రకారులు ఇదే వైఖరి అవలంభించారని నిమ్నశ్రేణి సిద్ధాంత వేత్తలు ఆరోపించారు. జాతీయ పోరాటంలో పాల్గొన్నవారు అగ్రకులాలకు చెందివున్నప్పుడే వారికి జాతీయవాద చరిత్రలో స్థానం లభించింది. పోరాటంలో పాల్గొన్న రచనలు చేసిన విదేశీయులకు కూడా ఈ చరిత్ర రచనలో ప్రాధాన్యత లభించింది. రానడే, గోఖలే, తిలక్ వంటి వారి రచనలు ఈ చరిత్ర రచనకు నిదర్శనంగా నిలుస్తాయి.

మార్క్సిస్టు చరిత్రకారులు భారత జాతీయ పోరాట చరిత్ర రచనలో కార్మికులు, ఇతర శ్రమజీవులకు ప్రాధాన్యం ఇచ్చినా అగ్రకుల బ్రాహ్మణీయ పరిమితులకు లోబడే వారు చరిత్ర రచన చేశారు. డిడి.కోశాంబి, బిపిన్ చంద్ర, రోమిలాథాపర్ వంటి ఈ చరిత్రకారులు 'ప్రధానస్రవంతి' సమాజానికి దూరంగా వున్న ఆదివాసులు, పేదరైతుకూలీల చరిత్రను, వారి పోరాటాలలను పరిగణనలోకి తీసుకోలేదు. ప్రజల జీవితాలు, సంస్కృతులు, ఉద్యమాల ప్రాతిపదికపై చరిత్ర రచన చేసినప్పుడే జాతీయ పోరాటాల చరిత్ర పరిపూర్ణమవుతుందని భావించిన నిమ్నశ్రేణి సిద్ధాంతకర్తలు ప్రధానంగా ఆదివాసుల చరిత్రలను నమోదు చేసే ప్రయత్నం చేశారు. రైతులు చరిత్రలో నిర్వహించిన పోరాటాలమీద ఎ.ఆర్.దేశాయి రచనను ఈ నేపథ్యంలోనే చూడాల్సివుంటుంది. అయితే నెహ్రూ-కొమురంభీమ్‌లను, గాంధీ-బిర్సా ముండాలను ఒకే గాటనకట్టే విపరీతానికి సబాల్టర్న్ సమాజచరిత్రకారులు కూడా పాల్పడ్డారు. దీనికి కారణం వీరంతా హిందూ, బ్రాహ్మణీయ ఆధిపత్య భావజాలానికి చెందినవారు కావడమేననే విమర్శవుంది. దళితులు, బహుజనులు, ముస్లింలు, క్రైస్తవులవంటి మైనారిటీ మతస్థుల జీవితాలకు, సంఘర్షణలకు, పోరాటలాలకు సబాల్టర్న్ చరిత్రకారులు తమ రచనలలో, అధ్యయనాలలో ఈనాటికీ స్థానం కల్పించలేదని వీరి బ్రాహ్మణీయ భావజాలమే ఇందుకు గల కారణమని ప్రొఫెసర్ కంచ ఐలయ్య అభిప్రాయపడుతారు. హిందు-బ్రాహ్మణీయ, జాతీయవాద ప్రధాన స్రవంతి చరిత్ర రచన సంప్రదాయానికి లోబడి వుండటం మూలంగానే సబాల్టర్న్ గ్రూప్ సమాజశాస్త్రవేత్తలు, సమాజచరిత్రకారులు, తమ క్షేత్ర అధ్యయనాలలో ఊరిలోకి ప్రవేశించి, గుడిసెదాకా వెళ్లగలిగారేతప్ప గుడిసెలోపలికి వెళ్లలేకపోయారని, అందుకే దళిత-బహుజనుల ఊసువారి రచనలలో వుండదని ఐలయ్య అంటారు. జాతీయవాద చరిత్రను దళిత-భహుజన దృక్కోణంనుండి రాయడానికి ఎవరైనా పూనుకున్ననాడు గానీ, చరిత్ర రచనలో వున్న ఈ ఖాళీ పూరించబడదు. అప్పుడుగానీ నిమ్నశ్రేణి చరిత్ర రచన పరిపూర్ణం కాదు. అయితే చరిత్ర రచనలో బ్రాహ్మణీయశక్తుల ప్రాబల్యం చెక్కుచెదరకుండా వున్నంతకాలం ఇది సాధ్యపడదు.

## 24.7 కొత్తవాదాల పరామర్శ

'ఆధునికత' అంతస్సారంగా రెండు శతాబ్దాలపాటు (19, 20వ శతాబ్దాలు) ప్రపంచాన్ని శాసించిన వికాసయుగం



BRAOU

తన లక్ష్య సాధన దిశగా చేసిన చారిత్రక ప్రస్థానంలో తోవతప్పిన ఫలితంగా ఏర్పడిన స్తబ్దతను, నెలకొన్న సంక్షోభాన్ని సిద్ధాంతరంగంలో తలెత్తిన గందరగోళాన్ని, వస్త్వాశ్రయత ముసుగులో ఊరేగిన స్వీయ మానసిక అవాస్తవిక సిద్ధాంత రుగ్మతలను పటాపంచలు చేసేందుకు రెండో ప్రపంచ యుద్ధానంతర కాలంలో తత్వ, సమాజతత్వ రంగాలలో ముందుకొచ్చిన కొత్త వాదాలను మనం ఆధునికతానంతర ధోరణులుగా గుర్తిస్తున్నాం. ఆత్మాశ్రయత్వం మీద 'హేతువు' అండతో నిరంతరాయంగా జరిగిన అన్యాయపు దాడులను తిప్పికొట్టి 'వ్యక్తి'కితాను కోల్పోయిన స్థానాన్ని తిరిగి కట్టబెట్టిన ప్రజాస్వామిక సందర్భం ఇది. 'వ్యక్తిగతమంతా రాజకీయమే'ననే గ్రహింపును స్పర్శజ్ఞానం కోల్పోయిన కేవలం రాజకీయవాదులకు కల్పించి, రాజకీయ సిద్ధాంత ఆచరణలను సరైన దారిలో నడిపించిన ఖ్యాతి ఈ వాదాలకు, ముఖ్యంగా స్త్రీవాదానికి దక్కుతుంది. ప్రగతి, అభివృద్ధి, శాస్త్ర విజ్ఞానం వంటి విలువలు అమానవీయ తత్వాన్ని, సమర్థత, గెలుపు (సక్సెస్) వంటి ప్రమాణాల కుటిలనీతిని లోకానికి వెల్లడించిన ఈ వాదాలు ప్రపంచ వ్యాప్తంగా మహత్తరమైనవిగా చలామణీలో వున్న ఇతర అనేక అంశాల అసలు రూపాన్ని కూడా బట్టబయలు చేశాయి.

సాధరణీకరణకు తోడ్పడే నెపంతో మనిషిని అస్వతంత్రుడిగా వ్యవస్థలను అమానుషంగా మార్చివేసిన హేతువీకరణ క్రమం ఏ శక్తులకు ప్రయోజనకారో నిర్ద్వంద్వంగా తేల్చి చెప్పిన ఘనత కూడా ఈ వాదాలకే దక్కుతుంది. కాలగతిలో గడ్డకట్టుకొనిపోయి, వాస్తవితకకు దూరమై జఢప్రాయంగా మారిపోయిన సిద్ధాంతాలకు కాయకల్ప చికిత్స చేయడంతోపాటు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఆసరాతో శరవేగంగా మారుతున్న సమాజవాస్తవాన్ని నిశితపరిశీలన చేసి పరిస్థితి ఎంత విపత్కరంగా వున్నదో తెలియజేసిన విఖ్యాతికూడా ఈ వాదాలకే చెందుతుంది. మార్పుచెందడాన్ని వ్యతిరేకించి, అశక్తగా మారి, కాలం చెల్లిన సిద్ధాంతంగా ముద్రపడిన వాటిని తను సంపర్కంతో సజీవం, నిత్యనూతనం చేసిన చరిత్ర ఈ వాదాలకు వున్నది.

పాజిటివిజం మూసవాదంగా అన్ని రంగాలమీద కనబరిచిన చెడు ప్రభావాన్ని చెదరగొట్టడంలో కూడా ఈ వాదలు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించాయి. సాహిత్య, తత్వ, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక రంగాలను పెట్టుబడిదారీ వ్యవస్థ నయా ఉదారవాదం/నయా వలసవాదం వంటి తాజా రూపాలలో కబళిస్తున్న వైనాన్ని సునిశితంగా విశదం చేసిందికూడా ఈ వాదాలేనన్నది మనం మరవరాదు. బహుళజాతి స్వభావాన్ని సంతరించుకున్న పెట్టుబడిదారీ యుగం 'ప్రపంచీకరణ' పేరిట వర్ధమాన దేశాలను కొల్లగొడుతున్న తీరును సాల్యంగా వివరిస్తునదీ, యావత్ ప్రపంచానికి పెద్దన్నగామారి అమెరికా సృష్టిస్తున్న విధ్వంసాన్ని, వినాశనాన్ని సంప్రదాయ మార్క్సిస్టులకన్నా మెరుగ్గా- మొదటినుంచీ లోకం ముందుంచుతున్నదీ ఈ వాదాల ప్రతినిధులేనన్నది గమనార్హం.

జ్ఞానం తమ ఒక్కరిసొత్తేనని భావించేవారి సైద్ధాంతిక అహంభావానికి దూరంగా, చరిత్రకు అనివార్యతను, నియతిని ఆపాదించి మానవకార్యాచరణను అపహాస్యంపాలు చేస్తూ పెంపుడు బానిసల పరివ్యాప్తికి తోడ్పడుతున్న వామపక్షాల అంతిమత్వానికి అతి దూరంగా -సమాజం అంచులకు ఆధిపత్యవాదులచే నెట్టివేయబడిన నిమ్నశ్రేణి అధోజగత్ సహోదరులు, స్త్రీలు, సాదాసీదా మనుషులు, వుండీలేని సమానంగా, ఉనికిలేకుండా, మానవహక్కులు లేకుండా మనుగడ సాగిస్తున్న అశేషజనుల కోసం-భ్రమలకోసం బహుదూరంగా నిర్దిష్టత ప్రాతిపదికగా పనిచేసేవారికి గుండె దిటవును ఇచ్చి తోడుగానిలిచే ఈ వాదాలదే భవిషత్ అంతా.

## 24.8 సారాంశం

స్థూలస్థాయిలో సాగే ఉద్యమాలు, విప్లవపోరాటాలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో వచ్చిన అనుభవంనుంచి రూపొందిన జ్ఞానమే ఆధునికతానంతరవాదంగా మన ముందుకొచ్చింది. హేతువు ద్వారా విశ్వాన్ని / ప్రకృతిని/ సమాజాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకొని వాటిని అదుపుచేయవచ్చుననే వికాసయుగపు తాత్వికుల అవగాహన మహా కథనాలని ఇటువంటి ఆలోచనారీతులనే అంటారు. ప్రతికూల ఫలితాలను ఇవ్వడంతో వచ్చిన జ్ఞానం ఈ వాదాలకు జవజీవాలనిచ్చింది. సూక్ష్మస్థాయిలో సాగే ప్రతిఘటన / నిరసన ఉద్యమాలు నిర్దిష్టత మీద దృష్టి నిలుపుతాయి. కనుక వైఫల్యం చెందే అవకాశాలు తక్కువ. హేతువు మీద విశ్వాసం సన్నగిల్లి, మహాకథనాలమీద మోజుపోయి అచరణ సాధ్యమైన, ఆచరణ యోగ్యమైన కార్యకలాపాలకు మనిషి కార్యరంగం పరిమితం కావాలనే

ఆలోచన ఈ కొత్త సామాజిక ఉద్యమాలకు ఊపిరి ఇచ్చింది. ఈ ఉద్యమాల శీలాన్ని శంకించే సంప్రదాయ మార్క్సిస్టులు పరిస్థితులు గుర్తించేనంతగా మారినా ప్రపంచస్థాయి, జాతీయస్థాయి మహోద్యమాల గురించి మాట్లాడడం మానరు. పెట్టుకున్న గమ్యం ఎన్నటికీ చేరలేనిదిగా వుంటేనే జీవితకాలం (తరతరాలపాటు) ఉద్యమకారునిగా కాలక్షేపం చేసే సదవకాశం వుంటుందనే సంగతి తెలిసే ఆధునికతావాదులు ఎల్లెడెలా 'వ్యూహరచన'లో నిమగ్నమై వుంటారు. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని భావజాలం (మార్క్సియన్ పరిభాషలో)గా ఏమార్చి, పరిమార్చే శక్తులు సిద్ధాంత స్పర్శ వుండే ఉద్యమ సందర్భాలను, ఆచరణను అణచివేయడంలో ముందుంటాయి. తప్పుడు చైతన్యానికి ప్రతిఫలంగా నిలిచే భావజాలం (ఐడియాలజీ) సిద్ధాంతంగా చలామణీ అయ్యే దుర్భర కసన్నివేశంలో అందరికందరూ వున్నందునే ఆధునికానంతర సిద్ధాంతాల వ్యాప్తికి ఇప్పుడు సానుకూల వాతావరణం ఏర్పడిందని చెప్పవచ్చు. కేవల సత్యంగా చలామణీలో వున్న అసత్యాలు అంతరించిపోయి ఏకత్వానికి పట్టంకట్టే నిర్మాణాలు కూలిపోయి, చరిత్రకు పరిపూర్ణతను ఆపాదించే భావజాలాల తెరలు తొలగిపోయి, సార్వజనీన పోరాట ఉద్యమాల (స్థల, కాలలకు అతీతంగా) అసంబద్ధత తెలిసిపోయిననాడు ఆధునికతానంతర చేతన తన మార్గాన ఫలితాలు సాధించినందని చెప్పవచ్చు. జీవనం పునరుజ్జీవితం కావాలన్నా, అణగారిన వాస్తవికతలు తిరిగి ప్రాణం పోసుకోవాలన్నా, మరచినపోయినది విస్మృతిలో పడి అచేనలతో కూరుకుపోయినది జ్ఞప్తికి రావాలన్నా మూలాలలోకి మనిషి ప్రయాణం చేయాలి. ఆత్మ సందర్శనానికి పిల్లబాట, దగ్గరిదారి అదే ఆధునికతానంతర భావనలో అందుకు ఎనలేని తోడ్పాటును అందిస్తాయి.

## 24.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. ఆధునికానంతరవాదం గురించి క్లుప్తంగా వివరించండి.

2. క్రిటికల్ థియెరీ ప్రాముఖ్యతను చర్చించండి.

**II ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. స్త్రీవాద దృక్పథం.

2. కొత్తవాదాల పరామర్శ

BRAOU

## 24.10 చదవదగిన పుస్తకాలు

| | |
|---|---|
| Heden White | : Traffics of Discurse |
| Aderno | : Nagitive dialectics |
| Herbert Markoos | : One Dimentional Man |

BRAOU

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజికశాస్త్రాల విభాగం

### సమాజశాస్త్రంలో పోస్టుగ్రాడ్యుయేట్ కార్యక్రమం

### కోర్సు- II : సమాజశాస్త్ర సిద్ధాంతాలు, దృక్పథాలు

## మాదిరి పరీక్షా పత్రం

సమయం : 3 గంటలు　　　　గరిష్ట మార్కులు: 70

**భాగం-ఎ**　　　　**10×4=60**

**సూచన: ఈ క్రిందివాటిలో ఏవేని నాలుగు ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1 సిద్ధాంతం అంటే ఏమిటి? సమాజశాస్త్ర సిద్ధాంత వికాసాన్ని వివరించండి.

2 సమాజశాస్త్రంలో వస్తునిష్ట, వ్యక్తినిష్ట దృక్పథాల మధ్య ఉన్న విభేదమేమిటి?

3 సమాజంలో శ్రమవిభజన, సామాజిక సంఘీభావానికి మధ్యగల సంబంధాన్ని చర్చించండి.

4 రాడ్‌క్లిఫ్ బ్రౌన్ సమాజ నిర్మాణ భావనను చర్చించండి.

5 మలినోవ్‌స్కీ ప్రతిపాదించిన సాంస్కృతిక ప్రకార్యవాద సిద్ధాంతాన్ని వివరించండి.

6 పార్సన్స్ ప్రతిపాదించిన నమూనా చరాంశాలను వివరించండి.

7 వర్గపోరాటం, విప్లవం, సామాజిక పరివర్తనల గురించి రాయండి.

8 కూలే ప్రతిపాదించిన అహం భావనను వివరించండి.

BRAOU

**భాగం-బి**　　　　**8×5=40**

**సూచన: ఈ క్రింది ఏవేని ఐదు ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి.**

9 సమాజశాస్త్ర సిద్ధాంతంలో ఆధునిక యుగాన్ని గురించి చర్చించండి.

10 సకారాత్మకవాద సంప్రదాయ పద్ధతి.

11 పవిత్రత, అపవిత్రతల మధ్య బేధాలు.

12 టోటెమిజం అంటే ఏమిటి?

13 వ్యవస్థ-పర్యావరణం మధ్య సంబంధం.

14 దోపిడీ భావన గురించి తెలుపండి

15 డార్ఫ్ సమన్వాయ సంబంధాల గురిచి వివరంగా రాయండి.

16 బ్లౌ ప్రతిపాదించిన సామాజిక వినిమయ సిద్ధాంతంను గురించి చర్చించండి.

17 మీడ్ ప్రతిపాదించిన చర్య లేదా ప్రవర్తనలోని మౌలిక దశలను తెలియజేయండి.

18 ప్రతీకాత్మక చర్యావాదంగా సమాజాన్ని చర్చించండి.

# రచయితల వివరాలు

| | |
|---|---|
| ప్రొ. కె. రంగారావు | : ప్రొ. కె. రంగారావు దేశంలోని ప్రముఖ సమాజశాస్త్ర బోధకుల్లో ఒకరు. ఉస్మానియా, ఆంధ్ర విశ్వవిద్యాలయాల్లో 30 సంవత్సరాల పాటు సమాజశాస్త్ర బోధకుడిగా పనిచేశారు. రాష్ట్రంలో సమాజశస్త్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఆచార్య రంగారావు ఈ పాఠ్యాంశం రూపొందుతున్న దశలో మరణించారు. |
| ప్రొ. ఉమామోహన్<br>(భాగం: 13) | : సమాజశాస్త్ర శాఖ<br>శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం |
| ప్రొ. సూసన్‌వర్గీస్<br>(భాగాలు: 2,19,20,21) | : ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నంలో అనేక సంవత్సరాలపాటు సమాజశాస్త్రం బోధించి పదవీవిరమణ చేశారు. |
| ప్రొ. ఇందిరాదేవి<br>(భాగాలు: 18, 22, 23) | : ప్రొఫెసర్,<br>సమాజశాస్త్ర శాఖ,<br>ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం |
| ఎస్. వేణుగోపాల్‌రావు<br>(భాగాలు: 9,10,11,12) | : సీనియర్ జర్నలిస్టు, రచయిత, విశ్లేషకులు, విమర్శకులు.<br>ప్రస్తుతం హైదరాబాద్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్నారు. |
| డా. ఎ. సురేంద్రరాజు<br>(భాగం: 24) | : సీనియర్ జర్నలిస్టు, రచయిత, తత్వశాస్త్ర పరిశోధకులు, విమర్శకులు.<br>హైదరాబాద్‌లో హోమియోవైద్యులుగా ఉన్నారు. |
| ఎ. ఉష<br>(భాగాలు: 3,14,15,16,17) | : సమాజశాస్త్ర పరిశోధకులు, అకాడమిక్ కౌన్సిలర్,<br>డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్. |
| వి.వేణు<br>(భాగాలు:4,6) | : సమాజశాస్త్ర పరిశోధకులు, సెంట్రల్ యూనివర్శిటీ, హైదరాబాద్. |
| డా. ఘంటా చక్రపాణి<br>(భాగాలు:1,5,7,8) | : అసోసియేట్ ప్రొఫెసర్,<br>అధ్యక్షులు సమాజశాస్త్ర శాఖ,<br>డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం,<br>హైదరాబాద్. |

BRAOU

BRAOU

BRAOU